
అంతర్జాతీయ సంబంధాలు



DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
CM0139

డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు
1996

రచయితల బృందం

సంపాదకుడు

ఆచార్య ఎ. ప్రసన్నకుమార్

సహసంపాదకుడు

ఆచార్య ఎం. సత్యనారాయణరావు

రచయితలు

ఆచార్య టి. సురేందర్

శ్రీ బి.యస్.ఆర్. ఆంజనేయులు

శ్రీ ఐ.దోసగిరి రావు

డా|| ఎం. రాంచందర్

శ్రీ జె.ఎల్. నర్సింహా రావు

డా|| ఎస్. బుచ్చయ్య

తెలుగుభాషాపరిశీలన

డా|| బూదరాజురాధాకృష్ణ

CM-0139
31-3-97

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No.. C.M.-0139
Date.....31.03.97.....
Call No .....320.....

డా|| బి.ఆర్. ఆంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ప్రథమప్రచురణ 1994

© డా|| బి.ఆర్.ఆంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

పునర్ముద్రణ : 1996-97

BRAOU

ఆన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగమైనా ఉపయోగించ దలచు కొంటే విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి.

ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో ఒకభాగం.

పాఠ్యప్రణాళిక మొత్తం వివరాలు పుస్తకం చివరలో ఉన్నాయి.

ఇతర వివరాలకు : ఎకడమిక్ డైరక్టర్ డా || బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం హైదరాబాద్.

ముద్రణ : ఎకోమాక్స్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్. ✆ : 7602528

డా|| బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కొరకు

పరిచయం

విజ్ఞాన శాస్త్రాల ప్రగతి ప్రపంచ రాజ్యాల మధ్యగల దూరాన్ని కుంచింప చేయటం వల్ల ప్రపంచంలోని వివిధ రాజ్యాల ప్రజల మధ్య అవగాహన వృద్ధి చెందటం మొదలయింది. ఏరాజ్యము ఏకాంతవాసము చేయగిల స్థితిలో లేదు. రాజ్యాల మధ్య సంబంధాలు వృద్ధి చెందాయి. సంబంధాల వృద్ధి వివిధ సమస్యలను రేకెత్తించింది. రాజ్యాల మధ్య సంబంధాలను అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత నానాటికి వృద్ధి చెందుతూవచ్చింది. ఈ శతాబ్దపు ఉత్తరార్ధ భాగంలో అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం అత్యంత ప్రముఖ స్థానాన్ని పొందింది. చాలామంది రచయితలు రాజనీతిజ్ఞులు వివిధ రాజ్యాల మధ్య పెరుగుతూ వస్తున్న సంబంధాలను భిన్న దృక్కోణాల నుండి అధ్యయనం చేయసాగారు. అంతర్జాతీయ సంబంధాల విషయం ఒక ప్రత్యేక అధ్యయనాంశంగా సర్వత్రా గుర్తింపును పొందింది. రాజనీతి శాస్త్ర స్నాత కోస్తర అధ్యయన కార్యక్రమంలో ఒక పాఠ్యాంశంగా అంతర్జాతీయ సంబంధాలను చేర్చాం.

ఈ అధ్యయనాంశంలో ఆరు ఖండాలున్నాయి. మొదటి ఖండంలో అంతర్జాతీయ సంబంధాల అధ్యయన పరిధి, స్వభావం, వివిధ సిద్ధాంతాలు రాజ్య వ్యవస్థల స్వభావాలను చర్చించాం. రెండవ ఖండంలో అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో ఉన్న వివిధ భావాలను విపులీకరించాం. మూడవ ఖండంలో అంతర్జాతీయ సంబంధాల వాస్తవ పరిస్థితులను విశ్లేషించటం జరిగింది. నాలుగవ ఖండంలో వివిధ సమస్యలను చర్చించే ప్రయత్నం చేసాం. అయిదవ ఖండంలో వివిధ అంతర్జాతీయ వ్యవస్థలను చర్చించటం జరిగింది. చివరి ఖండంలో ప్రపంచ శాంతి సమస్యలను చర్చించాం.

BRAOU

ఈ పాఠ్యాంశంలో అంతర్జాతీయ సంబంధాల విషయంలో విద్యార్థులకు అవగాహన ఏర్పరుచు కొనుటకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వటం జరిగింది. ఈ అధ్యయనం వల్ల ప్రపంచంలోని వివిధ రాజ్యాల మధ్య వృద్ధి చెందుతున్న సంబంధాలను తెలుసుకోవచ్చు. అంతర్జాతీయ సంబంధాల విషయం స్థిరమైన విషయం కాదు, మారుతున్న ప్రపంచ పరిస్థితులకనుగుణంగా అంతర్జాతీయ సంబంధాలు రూపం దాల్చుతున్నాయి. ఈ పాఠ్యాంశంలో చేర్చిన విషయాల వల్ల అధ్యయనం పరిపూర్ణంకాదు. మారుతున్న ప్రపంచ పరిస్థితులను గూడా తెలుసుకొని అధ్యయం చేసుకోవాల్సి ఉంటుంది.

BRAOU

డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయనం

రెండవ సంవత్సరం

విషయసూచిక

భాగం	పేరు	పేజీ
1	అంతర్జాతీయ సంబంధాల స్వభావం, పరిధి, పరిణామం	3
2	అధ్యయన దృక్పథాలు	21
3	అంతర్జాతీయ రాజకీయ సిద్ధాంతాలు	40
4	సార్వభౌమత్వ భావన, రాజ్యవ్యవస్థల స్వభావం	63
5	శక్తిభావన	81
6	సామ్రాజ్యవాద సిద్ధాంతాలు	91
7	శత్రు సమతౌల్యం - భద్రతా ఒప్పందాలు	103
8	సమిష్టి భద్రత	113
9	ప్రచ్ఛన్న యుద్ధం	122
10	నయోధ్య	138
11	అలీన విధానం	145

BRAOU

BRAOU

ఖండం - 1 దృక్పథాలు

ఈ ఇరవైవ శతాబ్దపు ఉత్తరార్ధ భాగంలో అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం అత్యంత ప్రాధాన్య స్థానాన్ని పొందింది. చాలా మంది రచయితలు అంతర్జాతీయ సంబంధాలను భిన్న దృక్కోణాలనుండి అధ్యయనం చేసి రచనలు చేశారు. ఇప్పుడు అది ఒక ప్రత్యేక అధ్యయనాంశంగా సర్వత్రా గుర్తింపును పొందింది. అంతర్జాతీయ సంబంధాల అర్థం ఏమిటి? దాని పరిధి ఏమిటి. ఏ ఏ దృక్పథాలలో దానిని అధ్యయనం చేయవచ్చు అన్న విషయాలను ఈ ఖండంలో మీరు చదువుతారు.

BRAOU

BRAOU

భాగం 1. అంతర్జాతీయ సంబంధాల స్వభావం, పరిధి, పరిణామం

విషయసూచిక

1.1 లక్ష్యాలు

1.2 పరిచయం

1.3.0 అంతర్జాతీయ సంబంధాలు

1.3.1 రెండో చరిత్ర వివరణ

1.3.2 సమకాలీన పరిణామాలకు ఉదాహరణలు

1.3.3 అంతర్జాతీయ వ్యాపారం, అంతర్జాతీయ వ్యవహారాలు నిర్ణయ రూపాల్చి ఉన్నాయి

1.3.4 మానవ పిల్లాతీతకరణ

1.3.5 శాంతి పరిశోధనా దృక్పథం

1.3.6 ప్రధానమైన ప్రమాణాలకు దృష్టాంతాలు

1.4 అంతర్జాతీయ సంబంధాల అర్థం

1.5 అంతర్జాతీయ సంబంధాల ఉద్యమనం – పరిధి

1.6 అంతర్జాతీయ సంబంధాలు – నిజిగ చర్యాదు సూచి

1.7.0 అంతర్జాతీయ సంబంధాల అధ్యయన పరిధి

1.7.1 మానవ రాజ్యాల ఆవిర్భావం

1.7.2 అంతర్జాతీయ వ్యవహారాలలో ప్రజలప్రాతినిధ్యం పెరుగుదల

1.7.3 విదేశాంగ విధాన సామాజీకరణ

1.7.4 సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి

1.7.5 ప్రపంచ శాంతి : శాంతి కాముకత్వం

1.7.6 అంతర్జాతీయ వ్యవస్థల ఆదరణ

1.7.7 నూతన సమాజ ఆవిర్భావం

BRAOU

1.8 అంతర్జాతీయ సంబంధాల అధ్యయన ప్రాధాన్యత

1.9 సారాంశం

1.10 చదువదగిన పుస్తకాలు

1.11 నమూనా పరీక్షాప్రశ్నలు

1.1 లక్ష్యాలు

ఈభాగాన్ని అధ్యయనం చేశాక మీరు అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం అర్థం పరిధి ప్రపంచ శాంతికముకత్వం అంతర్జాతీయ వ్యవస్థల ఆవతరణ గురించి వివరించగలరు.

1.2 పరిచయం

ఉన్నత విద్యాసంస్థలలో ప్రత్యేక బోధనాంశంగా గుర్తింపు పొందటానికి "అంతర్జాతీయ సంబంధాలు" విషయానికి చాలాకాలం పట్టింది. చరిత్ర, భూగోళశాస్త్రం, రాజనీతి శాస్త్రం, న్యాయశాస్త్రం లాంటివి సుమారు రెండువేల సంవత్సరాలనుండి అధ్యయనాంశాలుగా గుర్తింపును సంతరించుకొన్నాయి. "అంతర్జాతీయ సంబంధాలు" కూడా చాలా సంవత్సరాలుగా చర్చనీయాంశమైనప్పటికీ, అది రాజనీతి శాస్త్రంలోనో, చరిత్రలోనో అంతర్గత పాఠ్యాంశంగా మాత్రమే పరిగణనను పొందింది. అది ఒక ప్రత్యేక అధ్యయనాంశంగా గుర్తింపు పొందటానికి చాలా కాలం పట్టింది. ప్రత్యేక అధ్యయనాంశస్థాయి పొందడానికి జరిగిన కృషి క్రమాన్ని పరిశీలిద్దాం.

BRADU

1.3.0 అంతర్జాతీయ సంబంధాలు

1900 సంవత్సరంలో అమెరికాలోని విస్కాన్‌సిన్ (WISCANSIN) విశ్వవిద్యాలయంలో పాల్ ఎస్. రీన్ష్ (PAUL S. REINSH) అంతర్జాతీయ సంబంధాలు పాఠ్యాంశంగా, ప్రపంచ రాజకీయాలపై ఉపన్యాసాలు ఇచ్చారు. అదే సంవత్సరం "ప్రపంచ రాజకీయాలు" (WORLD POLITICS) పేరుతో ఒక గ్రంథాన్ని ప్రచురించారు. ఇరవయవ శతాబ్దారంభంలో విశ్వవిద్యాలయాలలో "అంతర్జాతీయ సంబంధాలు" విషయానికి ఏదో ఒక రూపంలో అధ్యయనాంశపు స్థానం లభించింది. కాని తొలిప్రయత్నాలు ఒక క్రమ పద్ధతిలో జరగలేదు. సమకాలీన అంతర్జాతీయ సమస్యలను సమగ్రంగాను, లోతుగాను పరిశీలించలేదు. అత్యంత జటిలమైన అంతర్జాతీయ సమస్యలను చాలా ముక్తసరిగా మాత్రమే అధ్యయనం చేయటం జరిగిందని ఛార్లెస్ పి. స్లేషర్ పేర్కొన్నారు. "అంతర్జాతీయ సంబంధాలు" అధ్యయనాంశానికి మొట్టమొదటిపాఠిగా 1919 సంవత్సరంలో వేల్స్ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక స్థానం లభించింది. ఆ సంవత్సరం వేల్స్ విశ్వవిద్యాలయంలో ఉడ్రోవిల్సన్ పేర అంతర్జాతీయ సంబంధాల అధ్యయానికి ఒక పీఠం ఏర్పరచి, దానికి అధిపతిగా ఆల్ఫ్రెడ్ జిమ్మెర్న్ అనే ప్రసిద్ధ చరిత్రాకారుని నియమించారు. తరువాత కాలంలో ఆపీఠానికి సి.కె. వెబ్‌స్టర్, ఇ.హెచ్. కార్, పి.ఏ. రీనాల్డ్స్, లారెన్సు డబ్ల్యు. మార్టిన్, టి.ఇ. ఇవాన్సు వంటి ప్రసిద్ధులు అధిపత్యం వహించారు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పడిన ఈ పీఠానికి చరిత్రకారులు అధిపతులు కావటంలో ఆశ్చర్యం లేదు. ఆరోజుల్లో "అంతర్జాతీయ సంబంధాలు" అధ్యయనాన్ని "దౌత్య నీతి చరిత్ర" (DIPLOMATIC HISTORY) "అంతర్జాతీయ న్యాయం" (INTERNATIONAL LAW) గా భావించే వారు. అలాంటి పరిస్థితి నుండి "అంతర్జాతీయ సంబంధాలు" సమగ్రమైన స్వతంత్ర ప్రతిపత్తిగల అధ్యయన విషయంగా వృద్ధి చెందటంలో చాలా మార్పుచేర్పులకు గురైంది. ఈ అభివృద్ధిని కెన్నెత్ డబ్ల్యు. థాంప్సన్ నాలుగు దశలుగా వివరించారు.

1.3.1 దౌత్య చరిత్ర వివరణ :

కెన్నెత్ డబ్ల్యూ. థాంప్సన్ ఉద్దేశంలో మొదటి ప్రపంచ యుద్ధం పరిసమాప్తి వరకు విస్తరించి ఉన్న కాలాన్ని "అంతర్జాతీయ సంబంధాలు" అధ్యయనపు తొలిదశగా పేర్కొనవచ్చు. ఈదశలో అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం దౌత్య చరిత్రకారుల అధ్వర్యంలో జరిగింది. అంతర్జాతీయ సంబంధాలను దౌత్య చరిత్రగాను, జరిగిన సంఘటనలను వర్ణనాత్మకంగాను, కాలక్రమ వివరణగాను వివరించారు. ఈ దశలో అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం వర్తమాన కాలాన్ని, భవిష్యత్తును పూర్తిగా విస్మరించింది. సమగ్రమైన సిద్ధాంతాల రూపకల్పనకు ఈదశలో ప్రయత్నాలు జరగలేదు.

1.3.2 సమకాలీన సంఘటనల అధ్యయనం :

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ప్రారంభమైన రెండవ దశలో సమకాలీన అంతర్జాతీయ సంఘటనల వివరణకు అత్యధిక ప్రాధాన్యతను కల్పించారు. తొలిదశలో జరిగిన పొరబాటును సరిదిద్దే ప్రయత్నాలు జరిగాయి. కానీ అదే సమయంలో చారిత్రక విషయాల అధ్యయనాన్ని పూర్తిగా విస్మరించి మరొక తప్పిదాన్ని చేశారు. గత చరిత్రను తెలుసుకోకుండా వర్తమానాన్ని అర్థం చేసుకోవటంకాని, భవిష్యత్తును శాస్త్రీయ దృక్పథంతో ఊహించటం కాని చేయలేం. ఈదశలో కూడా అంతర్జాతీయ సంబంధాలు ఒక సంపూర్ణమైన అధ్యయన శాస్త్రంగా రూపొందలేదు.

1.3.3 అంతర్జాతీయ న్యాయం, అంతర్జాతీయ వ్యవస్థలకు నిర్దిష్ట రూపాన్ని ఇవ్వటం :

BRAOU

రెండవ దశతో పాటుగానే మొదటి ప్రపంచ యుద్ధం పరిసమాప్తి తరువాత మూడవదశ ప్రారంభమైంది. ఈ దశలో అంతర్జాతీయ న్యాయం, అంతర్జాతీయ వ్యవస్థలకు నిర్దిష్ట రూపాన్ని కల్పిస్తూ అంతర్జాతీయ సంబంధాలను అధ్యయనం చేయసంకల్పించారు. అంతర్జాతీయ న్యాయసూత్రాలను ఒక నిర్దిష్ట రూపంలో క్రోడీకరించడం ద్వారా, అంతర్జాతీయ సంస్థలను నెలకొల్పవచ్చు అన్న భావనకు ఈ దశలోనే బలం చేకూరింది. అంతర్జాతీయ సంబంధాలను అధ్యయనం చేస్తున్నవారు ఒకవిధమైన ఆదర్శాత్మక ధోరణిని చేపట్టి అంతర్జాతీయ న్యాయం, అంతర్జాతీయ సంస్థలను ఆదర్శ వ్యవస్థలుగా భావించారు. హాన్స్ మార్గంథో అభిప్రాయంలో ఈదశలో అంతర్జాతీయ సంబంధాల నాస్తనాలతో నిమిత్తం లేకుండా అంతర్జాతీయ రాజకీయాలను, అంతర్జాతీయ న్యాయం, అంతర్జాతీయ సంస్థలద్వారా మార్పు చేర్పులు చేయాలని ప్రయత్నించారు. ఆనాటి విద్యావేత్తలు అంతర్జాతీయ సంబంధాలను కూడా వ్యక్తిగత సంబంధాలలో లాగే నైతిక విలువల ద్వారా మార్పు చేయగలమని భావించారు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పాటైన నానాజాతి సమితి (LEAGUE OF NATIONS) నీరి అభిప్రాయాలను బలపరచటమేగాక ఆలాంటి ఆలోచనలకు ప్రోత్సాహంకూడా ఇచ్చింది. నానాజాతి సమితి దాని అనుషంగిక (AUXILIARY) సంస్థల ద్వారా ప్రపంచశాంతిని పరిరక్షించగలమని రాజనీతిజ్ఞులు, విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. రాజనీతి శాస్త్రజ్ఞులు ప్రధానంగా అంతర్జాతీయ సంబంధాల విద్యార్థులు కూడా ఈ సంస్థల అధ్యయనం పైననే తమ దృష్టిని కేంద్రీకరించారు.

1.3.4 మౌలిక సిద్ధాంతీకరణ :

రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో అంతర్జాతీయ సమాజంలో వచ్చిన మార్పులు - నాజిజమ్, ఫాసిజంల ఆవిర్భావం, రెండవ ప్రపంచ యుద్ధానికి దారితీసిన పరిస్థితులు, నానాజాతి సమితి పతనం - అంతర్జాతీయ సంస్థల ద్వారా అంతర్జాతీయ సంబంధాలను మెరుగు పరచగలమన్న ఆశను ఆడియాస చేశాయి. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ద్వారా ఈ సంఘటనలను ఊహించలేకపోయారు. పర్యవసానంలో రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో కొత్తధోరణి ప్రారంభమైంది. ఇది అంతర్జాతీయ

సంబంధాల అధ్యయన దశలలో నాల్గవ దశకు దోహదం చేసిందని చెప్పవచ్చు. ఈదశలో అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి మూడు అంశాలను ప్రధానమైనవిగా గుర్తించారు. అవి (1) రాజ్యాల విదేశాంగ విధానాలను ప్రభావితం చేసే కారకాలను గుర్తించటం; (2)విదేశాంగ విధానాల నిర్వహణా పద్ధతులు; (3) అంతర్జాతీయ సమస్యల సంఘర్షణల మూల కారణాలను గుర్తించి వాటి నివారణోపాయాలను పరిశోధించటం. అంతర్జాతీయ, జాతీయ సంస్థల రాజ్యాంగ ప్రక్రియల పరిశోధనకు బదులు, ఆయారంగాలలో రాజకీయ ప్రక్రియల పరిశోధనకు విద్యావేత్తలు ప్రయత్నించారు. వివిధ దేశాల ఆవశ్యకాలు, ఆశయాలు, అభిరుచులు; వాటి విషయంలో గల వైరుధ్యాల కారణాలు, నివారణోపాయాలను కనుగొనడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈకాలంలో అంతర్జాతీయ సంబంధాల విషయంలో కొత్త సిద్ధాంతీకరణలకు విద్యావేత్తలు అధిక ప్రాధాన్యత నిచ్చారు. గతంలో కూడా చాలామంది విద్యావేత్తలు ఇలాంటి ప్రయత్నాలు చేసారు. కాని వీరంతా తమ తమ తాత్త్విక, నైతిక ప్రాతిపదికలను మనస్సులో ఉంచుకొని, తమ అభిప్రాయాలకు అనుగుణంగా అంతర్జాతీయ రాజకీయ సిద్ధాంతాలను ప్రతిపాదించారని క్విన్సీరైట్ వ్యాఖ్యానించారు. డాంటే, మాకియవెల్లీ, గ్రోషియస్, హాబ్స్, రూసో, కాంట్, మార్క్స్, హెగెల్, లెనిన్ మొదలైన వారందరూ ఈకోవకు చెందినవారు. మానవప్రకృతి గురించి కాని, రాజకీయాలలో అనుసరించాల్సిన ప్రవర్తనావళితో కాని ప్రమేయం లేకుండా, ఏదో ఒకరూపమైన విస్పష్ట అభిప్రాయం ఆధారంగా మాత్రమే తత్త్వ వేత్తలందరూ అంతర్జాతీయ సంబంధాల ప్రవర్తనావళిని నిర్దేశించారు. కాని 1945 తరువాత విద్యావేత్తలు జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలలో సిద్ధాంతీకరణకు నూతన పంథాలను కనుగొనే ప్రయత్నాలు చేశారు. కొన్ని ప్రత్యేకమైన మౌలిక విలువల దృక్కోణంలో కాకుండా, వాస్తవ పరిస్థితిని కూలంకషంగా పరిశీలించి, విభిన్న దేశాల అవసరాలను జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని; అంతర్జాతీయ రాజకీయరంగంలోని వాస్తవాల కనుగుణంగా శాస్త్రీయ సిద్ధాంత రూపకల్పనకు కృషి చేశారు. వీరందరి కృషి ఫలితంగా అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో రెండు రకాలైన దృక్పథాలు స్థానం పొందాయి. అవి (1) శాంతి పరిశోధనా దృక్పథం (PEACE RESEARCH APPROACH) (2) ప్రపంచ క్రమానుగత దృక్పథం (WORLD ORDER APPROACH).

BRAOU

1.3.5 శాంతి పరిశోధనా దృక్పథం :

పైన చెప్పిన రెండు దృక్పథాల లక్ష్యం అంతర్జాతీయ శాంతి స్థాపనయే. కాని అనుసరణీయ పద్ధతులలో కొంత వైరుధ్యం కనపడుతోంది. శాంతి పరిశోధనాదృక్పథంలో మనం మొదట యుద్ధాలు జరగటానికి గల కారణాంశాలను, శాంతిని నెలకొల్పటానికి అవసరమైన పరిస్థితులను గుర్తించాలి. అలాంటి వాటిని విధాన నిర్ణేతలకు తెలియబరచి, వాటి అమలుకు వారిని ఒప్పించటం ద్వారా ప్రపంచ శాంతి నెలకొల్పటానికి అవసరమైన అంతర్జాతీయ వాతావరణాన్ని సాధించటానికి అవకాశం ఉంటుందనేది ఈ దృక్పథపు సారాంశం.

1.3.6 ప్రపంచ క్రమానుగత దృక్పథం :

శాంతి పరిశోధనా దృక్పథానికి అనుసంధానంగా ఉన్నదే ప్రపంచ క్రమానుగత దృక్పథం. ఈ దృక్పథంలో భావావేశ పూరితమైన కొన్ని విలువలకు కట్టుబడి ఉన్నంత మాత్రాన ప్రపంచ శాంతిని సాధించలేం. కొన్ని నిర్దిష్టమైన పద్ధతుల ద్వారానే శాంతిని సాధించే అవకాశముంటుంది. ప్రపంచ రాజ్యాన్ని స్థాపించటమా? లేక, ప్రపంచ ప్రభుత్వాన్ని ఏర్పరచటమా? లేక, ప్రస్తుతమున్న ఐక్యరాజ్య సమితిని ఇంకా సమర్థవంతమైన అంతర్జాతీయ సంస్థగా రూపొందించటమా? లేక, దాని స్థానంలో ఇంకొక అంతర్జాతీయ వ్యవస్థను నెలకొల్పడమా? ఇలాంటి ప్రత్యామ్నాయ మార్గాలను పద్ధతులను గుర్తించటానికి పరిశోధన చేయాలనేదే ప్రపంచ క్రమానుగత దృక్పథం.

ఈ విధంగా మొదటి ప్రపంచ యుద్ధానికి ముందున్న దౌత్యనీతి చరిత్రను అవగాహన చేసుకోవటమే అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంకాగా; రెండవ ప్రపంచ యుద్ధం తరువాత సమకాలీన అంతర్జాతీయ సమాజంలో వచ్చిన

మార్పులకు అనుగుణంగా అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో ఎన్నో మార్పు చేర్పులు స్థానం పొందాయి. ఈ రోజు దౌత్య నీతి చరిత్రయేగాక; సమకాలీన అంతర్జాతీయ రంగంలో వస్తున్న మార్పులను, అంతర్జాతీయ న్యాయాన్ని, అంతర్జాతీయ వ్యవస్థల ఆవిర్భావాన్ని, వివిధ దేశాల విదేశాంగ విధానాలను, జాతీయ ప్రయోజనాలను, నిరాయుధీకరణ ప్రయత్నాలను, ప్రపంచశాంతి పరిరక్షణను అధ్యయనం చేసే సమగ్ర విజ్ఞానశాస్త్రంగా "అంతర్జాతీయ సంబంధాలు" అభివృద్ధి చెందింది. దీనితో పాటుగా రెండవ ప్రపంచ యుద్ధం తరువాత తదితర సమాజ శాస్త్రాలలోవలె "అంతర్జాతీయ సంబంధాలు"లో కూడా ప్రవర్తనా వాద విస్తరణ తన ప్రభావాన్ని కలుగజేసింది. గతంలో అవలంభించిన ఆదర్శాత్మక దోరణులకు స్వస్తి పలికి, అంతర్జాతీయ రంగంలో శక్తి, ప్రభావం, సమస్యల గుర్తింపు, విషయసేకరణ, వాస్తవ పరిస్థితులను ఆచరణాత్మకంగా పరిశీలించటం; నిష్పక్షపాత వైఖరితో సాక్ష్యాధారాలను సేకరించి శాస్త్రీయ సిద్ధాంతాలను రూపొందించటం, పరిశోధనలు నిర్వహించటం, లాంటి ప్రక్రియలకు అధ్యయన ప్రాధాన్యం లభించింది. ఈ ప్రక్రియలన్నీ మనస్తత్వశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, మానవశాస్త్రాలలో ముందుగా స్థానం పొంది 1940 ప్రాంతాలకు ఆయారంగాలలో సిద్ధాంతీకరణ స్థాయికి చేరుకొన్నాయి. ఆలస్యంగానైనా ప్రవర్తనా వాద అధ్యయన ధోరణి రాజనీతి శాస్త్రం, తరువాత అంతర్జాతీయ సంబంధాల అధ్యయనాలను కూడా ప్రభావపరచింది.

1.4 అంతర్జాతీయ సంబంధాలు : అర్థం

"అంతర్జాతీయ సంబంధాలు" పదం చాలా విస్తృతార్థాన్ని సూచిస్తుంది. వివిధ దేశాల ప్రభుత్వాలు ప్రజల మధ్య ఉన్న అన్నిరకాలైన సంబంధాలు ఈశీర్షిక కిందికి వస్తాయి. రాజకీయ, రాజకీయేతరమైన, శాంతియుత, సంఘర్షణాత్మక, న్యాయ, సంస్కృతీపరమైన, ఆర్థిక, భౌగోళిక, అధికార, అనధికారయుత సంబంధాలన్నీ ఈ అధ్యయనం కిందకే వస్తాయి. వాస్తవానికి "సంబంధాలు" అన్న పదానికి అర్థం - పరిచయం (CONTACT) కలయిక (CONNECTION) సంశ్లిభావం (ASSOCIATION) చర్య (ACTION) ప్రతిచర్య (REACTION)ల సముదాయంగా పేర్కొనవచ్చు. అంతర్జాతీయరంగంలో ఒకదేశం ఇంకొక దేశానికి తన ప్రతినిధి వర్గాన్ని పంపించినంత మాత్రాన అది "సంబంధం"గా పరిగణన పొందదు. రెండవ దేశం కూడా ప్రతి చర్యగా తన ప్రతినిధి వర్గాన్ని పంపించి, సంప్రదింపులను నిర్వహించినపుడే అది అంతర్జాతీయ సంబంధాల్లో ఒక భాగంగా పరిగణింపబడుతుంది. ఈ రకమైన సంబంధాల నిర్వహణ ద్వారా ప్రతి దేశమూ తన జాతీయ ప్రయోజనాలను పరిరక్షించుకోవటానికి, పెంపొందించుకోవటానికి ప్రయత్నిస్తుంది. ఒక దేశ జాతీయ ప్రయోజనం, యింకొక దేశ జాతీయ ప్రయోజనంతో విభేదించినపుడు సంఘర్షణ ఏర్పడుతుంది. ఆ విధంగా అంతర్జాతీయ సంబంధాల్లో మూడు ముఖ్యాంశాలు ఉంటాయి. అవి. 1.జాతీయ ప్రయోజనం (NATIONAL INTEREST) 2.సంఘర్షణ (CONFLICT) 3. జాతీయ శక్తి (POWER) జాతీయ ప్రయోజనం ఒక దేశం యొక్క లక్ష్యాన్ని, సంఘర్షణ అంతర్జాతీయ పరిస్థితిని, జాతీయశక్తి లక్ష్యాన్ని సాధించటానికి అవసరమైన మార్గాన్ని సూచిస్తుంది. మూడింటిలో సంఘర్షణ చాలా ముఖ్యమైంది. ఎందుకనగా రాజ్యాల మధ్య 'సంఘర్షణ' అనేది లేకపోతే జాతీయ ప్రయోజనాన్ని పరిరక్షించవలసిన అవసరం కాని, జాతీయ శక్తిని ఉపయోగించవలసిన పరిస్థితిగాని రాదు. రాజ్యాల మధ్య సంఘర్షణ ఉన్నపుడే, రాజ్యానకు మిగిలిన రెండింటి అవసరముంటుంది. అంటే దాని అర్థం ఎల్లప్పుడు రాజ్యాల మధ్య సంఘర్షణ అనేది ఉంటుందని కాదు. రాజ్యాల మధ్య అంతర్జాతీయ రంగంలో సంఘర్షణతో బాటు, సహకారం అనేదికూడా ఉంటుంది. ఒకే రకమైన జాతీయ ప్రయోజనాలను కలిగి ఉన్న రాజ్యాలు తమలో తాము సహకరించుకుంటూ ఉంటాయి.

అయినప్పటికీ అంతర్జాతీయ రంగంలో సంఘర్షణ, సహకారాల మధ్య సంఘర్షణకే ఎక్కువ ప్రాధాన్యత ఉంది. ఒక రకంగా చెప్పాలంటే సహకారం అనేది సంఘర్షణ ఫలితమే. అది ఏవిధం అనగా 1) ఒకేరకమైన జాతీయ ప్రయోజనం కలిగి ఉన్న దేశాలు వాటికి భిన్నమైన జాతీయ ప్రయోజనం కలిగి ఉన్న దేశాలనుండి తమ జాతీయ ప్రయోజనాన్ని పరిరక్షించుకోవటానికి పరస్పర సహకారం పెంపొందించుకుంటాయి. ఉదాహరణకు భౌగోళిక

BRAOU

సాన్నిహిత్యంతోబాటు రష్యా - చైనాల మధ్య, ఇండియా చైనాల మధ్య ఉన్న సరిహద్దు తగాదా రష్యా, ఇండియాలు పరస్పర సహకారంతో అంతర్జాతీయ రంగంలో వ్యవహరించటానికి తోడ్పడుతోందని చెప్పవచ్చు. అదే విధంగా పాకిస్తాన్ - ఇండియాల మధ్య, ఇండియా - చైనాల మధ్య ఉన్న తగాదాలు పాకిస్తాన్, చైనాల సాన్నిహిత్యాన్ని పెంపొందించటానికి దోహద పడుతున్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. 2) అంతర్జాతీయ సంబంధాలు అనేవి స్వాభావికంగా సంఘర్షణాయుతమైనవి. ప్రస్తుతం సంఘర్షణ అనేది లేకపోయినప్పటికి, అది ఎప్పుడు, ఏవిధంగా ఆవిర్భవిస్తుందో చెప్పజాలము. అందువలన శాంతియుత పరిస్థితుల్లోనే భవిష్యత్ సంఘర్షణను దృష్టిలో ఉంచుకొని కొన్ని దేశాలతో సంప్రదాయక మైత్రిత్వాన్ని నెరపుతూ ఉండవలసిన ఆవశ్యకత ఉంది. ఉదాహరణకు ఇండియా, రష్యాల మధ్య ఉన్న మైత్రిత్వము, శాంతియుత పరిస్థితుల్లో కూడా రెండు దేశాల మధ్యనున్న మైత్రిత్వం కారణాంగానే పాకిస్తాన్‌తో ఇండియాకు ఎప్పుడు సంఘర్షణ వచ్చినప్పటికీ రష్యా ఇండియాకు అండగా ఉండడమే కాకుండా, అంతర్జాతీయ సమావేశాల్లో ఇండియాను సమర్థిస్తూ ఉంది. ఈ రెండు సందర్భాల్లో కూడ సహకారం అనేది సంఘర్షణ వలన ఏర్పడినదే.

దేశాల యొక్క విభిన్న జాతీయ ప్రయోజనాల ఫలితంగా సంఘర్షణ ఏర్పడుతుంది. ఆ విధంగా సంఘర్షణ ఏర్పడినపుడు ప్రతిదేశం తన విదేశాంగ విధానం ద్వారా ఎదుటి దేశం యొక్క ప్రవర్తనను తన జాతీయ ప్రయోజనానికి అనుకూలంగా మార్చటానికి ప్రయత్నిస్తుంది. ఆ విధంగా అంతర్జాతీయ సంబంధాలు అనేవి వివిధ దేశాల విదేశాంగ విధానాల సమ్మిళితమే. అందులననే ఫెలిక్స్ గ్రాస్ (FELIKS GROSS) అంతర్జాతీయ సంబంధాలు అంటే విదేశాంగ విధానాల అధ్యయనంగా పేర్కొన్నాడు. ఈ అభిప్రాయంలో కొంత వాస్తవం ఉన్నప్పటికి ఫ్రెడ్ సాండర్‌మేన్ (FRED SONDERMANN) వంటి వారు ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. వారి అభిప్రాయం ప్రకారం విదేశాంగ విధానాన్ని అర్థం చేసుకోవటం, అదే విధంగా విదేశాంగ విధానానికి - అంతర్జాతీయ సంబంధాలకు మధ్యనున్న సంబంధాన్ని నెలకొల్పడం చాల క్లిష్టమైన విషయం. ఒక రాజ్యం యొక్క విదేశాంగ విధానాన్ని అర్థం చేసుకోవాలంటే, ఆరాజ్యం యొక్క చారిత్రక, బౌగోళిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, నైతిక విషయాల నెన్నింటినో అధ్యయనం చేయవలె. ఆ విధంగా ఒక రాజ్యం యొక్క విదేశాంగ విధానాన్ని అధ్యయనం చేయటమే చాలా కష్టతరమైన అంశం. అటుపంటప్పుడు విదేశాంగ విధానానికి, అంతర్జాతీయ సంబంధాలకు మధ్య నున్న సంబంధాన్ని వివరించటానికి ప్రయత్నించడం మరింత క్లిష్టతరమైన విషయం. అయితే అంతర్జాతీయ సంబంధాలను అవగాహన చేసుకోడానికి విదేశాంగ విధానం చాలా ముఖ్యమైన అంశంగా వీరు అంగీకరించినారు. కాని అంతర్జాతీయ సంబంధాలను, విదేశాంగ విధానాల అధ్యయనాన్ని ఒకటిగా గుర్తించటానికి వీరు సుముఖులుకారు. అంతర్జాతీయ సంబంధాలు అనేవి విదేశాంగ విధానాల అధ్యయనం కంటె విస్తృతమైనవని వీరి భావన. దీనికి అనుగుణంగానే హెరాల్డ్ స్ప్రౌట్ (HAROLD SPROUT), మార్గరెట్ స్ప్రౌట్ (MARGARET SPROUT) విదేశాంగ విధానాన్ని అంతర్జాతీయ సంబంధాల్లో ఒక ముఖ్యమైన ఉపవిభాగం (SUB CATEGORY) గా పేర్కొన్నారు.

1.5 అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం - పరిధి

అంతర్జాతీయ సంబంధాలు శీర్షిక క్రింద ఏవిధమైన పాఠ్యాంశాలు చేర్చదగును? అన్న విషయంలో కూడా విభిన్న రాజకీయ శాస్త్రజ్ఞులు విభిన్న అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ అభిప్రాయాల ప్రకారం అంతర్జాతీయ సంబంధాల చరిత్ర, అంతర్జాతీయ సంబంధాల పరిశీలనకు ఆవశ్యకమైన విధానాల వర్ణన, సమకాలీన అంతర్జాతీయ సంబంధాలు, గడచిపోయిన, గడుస్తున్న అంతర్జాతీయ సంఘటనల పరిశీలనల ఆధారంగా అంతర్జాతీయ రంగానికి సంబంధించి చేయదగిన సిద్ధాంతీకరణ అన్నీకూడా ఈ శీర్షిక కింద చోటు చేసుకున్నట్లు అవగతమౌతుంది. కానీ ఏ ఒక్క రాజనీతి శాస్త్రవేత్త కూడా అన్ని తరహాలకు చెందిన విషయాలను తన గ్రంథంలో విస్తృతంగా చర్చించలేదు. అంతర్జాతీయ సంబంధాలను పరిశీలించారు.

BRAOU

ఇపుడు మనం 'అంతర్జాతీయ సంబంధాలు' శీర్షిక కింద చేర్చదగిన అంశాలను గురించి కొందరు శాస్త్రవేత్తల అభిప్రాయాలను పరిశీలిద్దాం.

చార్లెస్ శ్లేషర్ (CHARLES P. SCHLEICUER) అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో రాజ్యాలను ప్రముఖ విభాగాలుగా పేర్కొన్నాడు. ఈతని అభిప్రాయంలో అంతర్జాతీయ సంబంధాలు ఒక అధ్యయన శాస్త్రాన్ని సూచించడమేగాక ఒక బోధనాంశాన్ని కూడా సూచిస్తుంది. (IT IS BOTH A SUBJECT AND A SUBJECT MATTER) అంతర్జాతీయ సంబంధాల చర్చ, ఈతని అభిప్రాయం ప్రకారం, చర్చిస్తున్న వ్యక్తుల ధృక్పథంపై ఆధారపడి ఉంటుంది. ఆర్థిక శాస్త్రవేత్తలు అంతర్జాతీయ వర్తక వ్యాపారాలకు సంబంధించిన ఆర్థిక సంబంధాలపై తమ దృష్టిని కేంద్రీకరించగా, చరిత్రకారులు అంతర్జాతీయ వేత్తలు అంతర్జాతీయ న్యాయం, వ్యవస్థీకృత రాజకీయాలపై దృష్టిని కేంద్రీకరిస్తే, మనస్తత్వ వేత్తలు, సామాజిక శాస్త్రజ్ఞులు, తత్త్వవేత్తలు తమతమ ప్రత్యేక ధృక్పథంతో అంతర్జాతీయ సంబంధాలను పరిశీలించడం వలన, వాటి మధ్య సమన్వయం లేక అంతర్జాతీయ సంబంధాల విషయంలో అందిరకీ ఆమోద యోగ్యమైన సామాన్య సిద్ధాంతం లోపించడం జరిగింది. శ్లేషర్ దృష్టిలో అంతర్జాతీయ సంబంధాల వాస్తవ చిత్రీకరణ అంతర్జాతీయ సంబంధాల విద్యార్థుల ప్రథమ కర్తవ్యం అయ్యుండాలి. అయితే అంతర్జాతీయ రంగంలో ప్రముఖ కారకాలు ఏమిటి? రాజ్యాలా, వ్యక్తులా? వాటి మధ్యగల సంబంధాలు ఏమిటి? అంతర్జాతీయ ప్రవర్తనావళిని, అంతశ్చర్యలను ఎలా క్రోడీకరించవచ్చు? అన్న ప్రశ్నలు ఈ సందర్భంలో ఉత్పన్న మౌతాయి. శ్లేషర్ అభిప్రాయంలో అంతర్జాతీయ రంగంలో రాజ్యాలు ప్రముఖ సంస్థలు గనుక రాజ్యాల మధ్యగల సంబంధాలకే ప్రాముఖ్యం యివ్వడం జరిగింది.

నార్మన్ డి.పామర్ (NORMAN D. PALMER) హవార్డ్ సి. పెర్కిన్స్ (HOWARD C. PERKENIS) అనే రచయితలు "అంతర్జాతీయ సంబంధాలు" మారుతున్న, సంక్లిష్టతమైన సమకాలీన ప్రపంచంలో జాతి రాజ్యాల మధ్య, అంతర్జాతీయవ్యవస్థ – సమూహాల మధ్యనున్న సంబంధాలకే పరిమితం కాకుండా అంతకన్న విస్తృతమైన సంబంధాలను గురించి కూడ చర్చిస్తుందని అభిప్రాయపడినారు. వీరి అభిప్రాయంలో జాతి రాజ్యాల మధ్య విభిన్న స్థాయిల్లో మారిన, మారుతున్న సంబంధాలు కూడా ఈ అధ్యయనం కిందికే వస్తాయి. అంతేగాక ఈనాడు, మిగిలిన విజ్ఞాన శాస్త్రాల్లో చోటు చేసుకుంటున్న నూతన ధృక్పథాలను, సిద్ధాంతాలను, ప్రక్రియలను కూడ 'అంతర్జాతీయ సంబంధాల' అధ్యయనంలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నందున శాస్త్ర పరిధి కూడా విస్తారంగా పెరుగుతోంది. ఇటువంటి ప్రక్రియల ద్వారా అంతర్జాతీయ రంగానికి సంబంధించి సిద్ధాంతానికీ, వాస్తవానికి మధ్యనున్న దూరాన్ని తగ్గించి, వాస్తవాలను శాస్త్రీయంగా వివరించే సిద్ధాంతాల రూపకల్పనకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

గ్రేసన్ కిర్క్ (GRAYSON KIRK) అభిప్రాయంలో అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ముఖ్యంగా అయిదు అంశాలను వివరిస్తుంది. అవి : 1) రాజ్య వ్యవస్థ, స్వభావం, అది వ్యవహరించే తీరు 2) రాజ్య శక్తిని ప్రభావితం చేసే కారకాలు 3) అంతర్జాతీయ రంగంలో అగ్రరాజ్యాల పరిస్థితి, వాటి విదేశాంగ విధానాలు. 4) సమకాలీన అంతర్జాతీయ సంబంధాల చరిత్ర 5) సుస్థిరమైన ప్రపంచ వ్యవస్థను స్థాపించటానికి వివిధ ప్రతిపాదనలు.

అదే విధంగా 1954లో కార్నెజీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్‌నేషనల్ పీస్ (Carnegie Endowment for International Peace) ఆధ్వర్యంలో చేసిన ఒక సర్వే ఆధారంగా విన్సెంట్ బేకర్ (VINCENT BAKER) అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో ఈకింది విషయాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నట్లు పేర్కొన్నాడు. అవి : 1) అంతర్జాతీయ రాజకీయాల స్వభావం, వాటిని ప్రభావితం చేసే ప్రధాన శక్తులు. 2) అంతర్జాతీయ రంగంలో రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితుల వ్యవస్థీకరణ. 3) జాతీయ శక్తికి దోహదం చేసే అంశాలు. 4) జాతీయ ప్రయోజనాన్ని పెంపొందింపజేసే పరికరాలు (Instruments). 5) జాతీయ శక్తికి పరిమితులు, నియంత్రణ. 6)

BRAOU

అగ్రరాజ్యాల, అప్పుడప్పుడు చిన్న రాజ్యాల విదేశాంగ విధానం. 7) సమకాలీన అంతర్జాతీయ సంఘటనల చరిత్ర. వీటితోబాటు బేకర్ అంతర్జాతీయ సంబంధాల సిద్ధాంతీకరణ, విధాన రూపకల్పన ప్రక్రియల విశ్లేషణ, మిగిలిన శాస్త్రాలనుండి అవసరమైన పరిజ్ఞానాన్ని 'అంతర్జాతీయ సంబంధాల'తో చొప్పించడం, అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో కేస్ స్టడీస్ (Case Studies) ను విరివిగా వాడటం తదితర విషయాలన్నీ అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో ప్రాధాన్యత వహిస్తున్నాయని అభిప్రాయపడినాడు.

ఇదే విధంగా 'అంతర్జాతీయ సంబంధాలు' స్వతంత్ర రాజ్యాలు, వాటి వలస రాజ్యాల మధ్యగల సంబంధాలను కూడ సూచించవచ్చు. అంతర్జాతీయ న్యాయశాస్త్రం దృష్ట్యా ఈ సంబంధాలు వలస రాజ్యాధినేతలైన రాజ్యాల పరిధిలోకే వస్తాయి. కాని వలస రాజ్యాల ప్రజలు, పాలించే రాజ్యాల మధ్య జాతి, తెగ తదితర విషయాల్లో ఉన్నభేదాలను పురస్కరించుకొని వారి మధ్యగల సంబంధాలను అంతర్జాతీయ సంబంధాల్లో పేర్కొనడంలో అసందర్భం ఏమీలేదు. అదే విధంగా అంతర్జాతీయ రంగంలో రాజకీయాలతో పాటు, ఆర్థిక, వాణిజ్య రంగాల్లోను, మత, సాంస్కృతిక, విద్యారంగాల్లోను, శాస్త్రీయ, శ్రామిక, ఆరోగ్యరంగాల్లోను, చివరకు తంతి, తపాల, రవాణా సౌకర్యాల రంగాల్లోను, కూడా ఆయాసంబంధాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన మేరకు మనం పరిశీలించవలసి ఉంటుంది.

1.6 అంతర్జాతీయ సంబంధాలు - వివిధ పర్యాయ పదాలు

'అంతర్జాతీయ సంబంధాలు' పదం వాడుక భాషలో, వ్యావహారికంగా 'ప్రపంచ రాజకీయాలు' అనే పదాలతో ఒకే అర్థంలో వాడుకలో ఉంది. కానీ శాస్త్రీయంగా ఆలోచించినపుడు ఈ పదాల అర్థం ఒకటి కాదు. ఏ పదానికి ఆపదమే ఒక ప్రత్యకమైన అర్థాన్ని సూచిస్తుంది. 'ప్రపంచ రాజకీయాలు' అనగా ప్రపంచ రాజ్యానికి సంబంధించిన రాజకీయాలుగా అర్థం చెప్పకోవచ్చు. అందుపల్ల ప్రపంచ రాజ్యం ఏర్పడినంతవరకు ఆపదాన్ని వాడలేము. 'ప్రపంచ వ్యవహారాలు' 'అంతర్జాతీయ వ్యవహారలను' సాధారణంగా ఒకే అర్థంలో వాడగచ్చు. ఇవి అంతర్జాతీయ సమాజానికి సంబంధించి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలకు చెందిన సంఖ్యాపరమైన సమాచారాన్ని తెలియచేస్తాయి. ఉదాహరణకు అమెరికా 100 అణ్వాయుధాలను కలిగి ఉంది. లేదా సోవియట్ రష్యా 50 ఖండాంతర క్షిపణుల్ని కలిగిఉంది. 'ప్రపంచ వ్యవహారాలు" లేదా అంతర్జాతీయ వ్యవహారాలు ఈ సంఖ్యాపరమైన సమాచారాన్ని యిస్తుందే తప్ప, అతర్జాతీయ సంబంధాల స్వరూప, స్వభావాలపై ఈ అణ్వాయుధాలు లేదా ఖండాంతర క్షిపణుల ప్రభావాన్ని గురించి చర్చించదు.

ఇక 'అంతర్జాతీయ సంబంధాలు' 'అంతర్జాతీయ రాజకీయాలు' దైనందిన వ్యవహారంలో పర్యాయ పదాలుగా ఎక్కువగా వాడుకలో ఉన్నప్పటికీ వాస్తవానికి రెండింటికి అర్థం ఒకటేనని అందరూ అంగీకరించడంలేదు. గార్నెట్ అభిప్రాయంలో అంతర్జాతీయ రాజకీయాలు విభిన్న ప్రభుత్వాల మధ్యనున్న వివాదాస్పదమైన ప్రయోజనాలకు చెందిన సంబంధాలను గురించి చర్చిస్తుంది. గార్నెట్ నిర్వచనంలో రెండు ముఖ్యాంశాలున్నాయి. అవి : 1) అంతర్జాతీయ రాజకీయాలు రాజ్యాల మధ్య నున్న సంబంధాలను గురించి చర్చిస్తుంది. అయితే రాజ్యాల మధ్య నున్న అన్ని రకాలైన సంబంధాలు ఈ పరిధిలోనికి వస్తాయా? గార్నెట్ అభిప్రాయంలో ఏ కార్యక్రమాలైతే దేశాల విదేశాంగ విధానాలను ప్రభావితం చేస్తాయో అవన్నీ అంతర్జాతీయ రాజకీయాల పరిధిలోనికి వస్తాయి. 2) గార్నెట్ అభిప్రాయంలో రాజ్యాల మధ్య సంబంధాలు కూడ ఏకాభిప్రాయంతో కాక, భిన్నాభిప్రాయాలతో కూడి ఉండవచ్చు. ఈ సంబంధాలు ఏకాభి ప్రాయంతో ఉన్నపుడు రాజకీయాలకు అవకాశం లేదు. భిన్నాభి ప్రాయాలతో కూడి ఉన్నపుడే సంఘర్షణకు, సంఘర్షణ ఉన్నపుడే రాజ్యం తన జాతీయ ప్రయోజనాన్ని పరిరక్షించుకోవలసిన అవసరం ఏర్పడుతుంది. ఈ అవసరాన్ని ఆరాజ్యం తన విదేశాంగ విధాన నిర్వహణ ద్వారా నెరవేరుస్తుంది. భిన్నాభిప్రాయం, సంఘర్షణ అనేది శత్రురాజ్యాల మధ్య మాత్రమే గాక, కొన్ని సమయాల్లో మిత్ర రాజ్యాల మధ్య కూడ రావచ్చు. ఆ విధంగా

BRAOU

అంతర్జాతీయ రాజకీయాలు అనేవి విదేశాంగ విధాన నిర్వహణ ద్వారా నిర్వహించబడుతూ ఉంటాయి. ఇంకొక విధంగా చెప్పాలంటే రాజ్యాలమధ్య, ప్రభుత్వాల ద్వారా, ప్రభుత్వ అనుమతితో నిర్వహించబడేవి అంతర్జాతీయ రాజకీయాలు. కాని, అంతర్జాతీయ సంబంధాలు ఈరకమైన రాజకీయ (ప్రభుత్వ) సంబంధాలకే కాక, రాజ్యాల మధ్యనున్న రాజకీయేతరమైన సంబంధాలను గురించి కూడ చర్చిస్తుంది. వివిధ దేశాల మధ్య నున్న రాజకీయ సంబంధాలు, దౌత్య సంబంధాలు, ఆర్థిక సంబంధాలు, సామాజిక, విద్యా సాంస్కృతిక సంబంధాలు, వర్తక వ్యాపారాది సంబంధాలు మొదలైనవన్నీ అంతర్జాతీయ సంబంధాల పరిధిలోనికే వస్తాయని చెప్పవచ్చు. ఆవిధంగా 'అంతర్జాతీయ సంబంధాలు' అన్న పదం అంతర్జాతీయ రాజకీయాలు అన్న పదం కంటే విస్తృత అర్థాన్ని సూచిస్తుంది. అందువలననే మార్గంథో, కెన్నెత్, డబ్ల్యూ. థాంప్సన్ వంటివారు అంతర్జాతీయ రాజకీయాలు, అంతర్జాతీయ సంబంధాలలో ముఖ్యమైన అంతర్భాగంగా పేర్కొన్నారు.

1.7.0 అంతర్జాతీయ సంబంధాల అధ్యయన ప్రాధాన్యత

ఇరవయ్యో శతాబ్దాంలో అంతర్జాతీయ రంగంలో వచ్చిన అనేక నూతన సంఘటనల కారణంగా ఈ రోజున అంతర్జాతీయ రంగ స్వరూప, స్వభావాలలో గుణాత్మకం పరిణామాత్మకమైన మార్పులెన్నో చోటు చేసుకున్నాయి. వీటి కారణంగా అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి ఒక ప్రత్యేక గుర్తింపు, ప్రాధాన్యత లభించాయి. వాటిని సవివరంగా చర్చిద్దాం

1.7.1 నూతన రాజ్యాల ఆవిర్భావం :

ఇరవయ్యో శతాబ్దం ప్రారంభం వరకు ప్రపంచ చరిత్ర అంటే ఐరోపా చరిత్రగానే భావించేవారు. దానికి కారణం ఐరోపాలోని అయిదు లేక ఆరు రాజ్యాలు - బ్రిటన్, ఫ్రాన్సు, టర్కీ, ఆస్ట్రో - హంగీరియన్ సామ్రాజ్యం, రష్యా మొదలైనవి - మొత్తం ప్రపంచాన్ని వలస రాజ్యాల పేరుతో తమ ఆధిపత్యంలో ఉంచుకొని, తమ అభీష్టానికి అనుగుణంగా వాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, విదేశాంగ విధానాలను నిర్దేశిస్తూ ఉండేవి. కానీ ఇరవయ్యో శతాబ్దంలో ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, జాతీయోద్యమాల ద్వారా, రాజకీయ స్వాతంత్ర్యోద్యమాల ద్వారా వలస వాదం బలహీనపడి ఎన్నో నూతన రాజ్యాలు ఆవిర్భవించినాయి. ఈ రాజ్యాలు ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలకు చెందినవి. సంఖ్యాపరంగా చూస్తే 1945లో ఐక్యరాజ్యసమితిలో 51 దేశాలు సభ్యత్వం కలిగి ఉండగా వీటి సంఖ్య 1973 నాటికి 135, 1982 నాటికి 157, 1985 నాటికి 159కి పెరిగింది. అంటే నలభై సంవత్సరాల్లో ఐక్యరాజ్యసమితిలో సభ్య రాజ్యాల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. వీటిలో సుమారు 100కు మించిన రాజ్యాలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా రాజ్యాలే. ఈ రాజ్యాలన్నీ రెండవ ప్రపంచ యుద్ధానికి ముందులాగా సామ్రాజ్య వాద ఐరోపాదేశాల అధీనంలో కాక సర్వ స్వతంత్రమైన రాజ్యాలు. వీటి ఆంతరంగిక వైదేశిక విధానాలను అగ్రరాజ్యాల లభీష్టాలకు, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా కాక ఆయా రాజ్యాల ప్రజల అవసరాలకు, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్నట్టివి. ఆ విధంగా రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం అంతర్జాతీయ సంబంధాలు అనేవి అగ్రరాజ్యం అభీష్టానికి అనుగుణంగా నిర్దేశింపబడగా, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత నూతన రాజ్యాల ఆవిర్భావంతో అంతర్జాతీయ సంబంధాలు వాస్తవంగా కూడ అంతర్జాతీయమయ్యాయి. నూతన రాజ్యాల ఆవిర్భావంతో అంతర్జాతీయ రంగంలో వచ్చిన కొన్ని మార్పులను ఈ విధంగా పేర్కొనవచ్చు : అవి :

(1) సామ్రాజ్య వాదం, వలస వాదం, జాతి విచక్షణ విధానాలపట్ల వ్యతిరేకత. ఈనాడు కొత్తగా ఆవిర్భవించిన రాజ్యాలు సామ్రాజ్య వాదం, వలస వాదం, జాతి విచక్షణ విధానాల దుష్పలితాలను స్వయంగా అనుభవించి ఉన్నందున

BRAOU

వాటిని ప్రపంచంలోని ఏ మారుమూల ఉన్నప్పటికీ వ్యతిరేకించడం సర్వసాధారణమైంది. అందువల్లే ప్రపంచంలోని ఏప్రాంతంలో అయినప్పటికీ సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా జాతీయోద్యమాలు తలెత్తినపుడు, వాటికి ఈ రాజ్యాలు రాజకీయ, ఆర్థిక, సామాజిక, నైతిక పరమైన తోడ్పాటు అందిస్తున్నాయి.

(2) నూతన రాజ్యాల ఆవిర్భావంతో ప్రపంచశాంతికి ప్రాముఖ్యం పెరిగింది. కొత్తగా ఆవిర్భవించిన రాజ్యాలు పలు సమస్యలను - రాజకీయ, ఆర్థికపరమైన - ఎదుర్కొంటూ ఉండటంతో, వాటిని పరిష్కరించుకోవటం ఈ రాజ్యాల ప్రథమ కర్తవ్యమైంది. అందువల్లనే ఈ రాజ్యాలు యుద్ధాలకు కాలుదువ్వక, ప్రపంచశాంతికి కృషి చేయటం ద్వారా తమ ప్రజల ఆర్థికాభివృద్ధిని సాధించడంపై తమ దృష్టిని కేంద్రీకరించడానికి ప్రయత్నం చేస్తున్నాయి.

(3) ఐక్యరాజ్య సమితిలో ఈ రాజ్యాలు చురుకైన పాత్రను నిర్వహించడం ద్వారా అగ్రరాజ్యాల ఆధిపత్యాన్ని తగ్గించాయి. సంఖ్యాపరంగా ఎంతో ఆధిక్యతను కలిగి ఉన్నందువల్ల అగ్రరాజ్యాలు కూడ నూతన రాజ్యాల అభిప్రాయాలను విస్మరించలేక పోతున్నాయి.

(4) నూతన రాజ్యాల తోడ్పాటువల్ల అంతర్జాతీయ వ్యవహారాల్లో ఐక్యరాజ్య సమితి ప్రాధాన్యత పెరగటానికి అవకాశం కలిగింది. ఐక్యరాజ్య సమితి లక్ష్యాల్లో, నూతన రాజ్యాల ఆకాంక్షలు ప్రతిబింబించడంతో ఈ రాజ్యాలు తమ తోడ్పాటునూ, సహకారాన్ని, ఐక్యరాజ్య సమితికి ఇతోధికంగా అందిస్తున్నాయి. దీని వలన ఐక్యరాజ్య సమితికి అంతర్జాతీయంగా అవసరమైన నైతిక బలం ఈ రాజ్యాలనుండి లభిస్తోంది.

(5) ఈ నూతన రాజ్యాల ఆవిర్భావంతో అంతర్జాతీయ రంగంలో దోపిడీకి, ఆర్థిక అసమానతలకు అవకాశంలేని అంతర్జాతీయ సమసమాజాన్ని స్థాపించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి.

BRAOU

అంతర్జాతీయ రంగంపై కొత్తరాజ్యాల ప్రభావాన్ని చార్లెస్ జి. లెర్చ్ (CHARLES G. LERCHE), అబ్దుల్ ఎ. సయ్యిద్ (ABDUL A. SAID), అనే రచయితలు ఈకింది విధంగా వివరించారు. అవి :

(1) కొత్తరాజ్యాల చేరికతో అంతర్జాతీయ సమాజంలో ఏకాభిప్రాయం అనేది కష్టసాధ్యమైంది. ఇంతకు పూర్వం అంతర్జాతీయ సమాజాన్ని సుమారుగా ఒకే (సామ్రాజ్యవాద) అభిప్రాయాలు కలిగిన నాలుగైదు రాజ్యాలు నిర్దేశించగల పరిస్థితిలో ఉండటంతో వాటి మధ్య ఏకాభిప్రాయ సాధనకు అవకాశం కలిగేది. కాని ఈరోజున ప్రాక్ పశ్చిమ దేశాల మధ్యనున్న చారిత్రక, సిద్ధాంత పరమైన విభేదాల కారణంగా వాటి మధ్య ఒకరకమైన అనుమానం, అపార్థాలకు అవకాశం కలిగి అంతర్జాతీయంగా ఏకాభిప్రాయ సాధన అనేది చాలా కష్టతరమౌతోంది.

(2) ఈనాడు అంతర్జాతీయ సమాజంలో వలస వాదానికి వ్యతిరేకంగా ఒక కొత్త జాతీయ భావం (NON - WESTERN NATIONALISM) ఆవిర్భవించింది. ఈ భావన కారణంగా కొత్త రాజ్యాలు పూర్వపు సామ్రాజ్య వాద రాజ్యాలను తమ సహజ శత్రువులుగా పరిగణిస్తున్నాయి. అందువల్లే సామ్రాజ్య వాద రాజ్యాలకు వ్యతిరేకంగా, రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొందటానికి తలెత్తే ఏ ఉద్యమానికైనా ఈ కొత్త రాజ్యాలు తమ సహకారాన్ని తోడ్పాటును అందిస్తున్నాయి. సామ్రాజ్యవాద రాజ్యాలకు వ్యతిరేకతను సిద్ధాంత పరంగాను ఆచరణలోను తట్టుకోవటం కష్టమౌతోంది.

(3) ఒకానొకప్పుడు నిద్రావస్థలో (Once - Somenolent) ఉన్న ఆసియా - ఆఫ్రికా దేశాల ప్రజలు ఈరోజు జాతీయతా భావంతో రాజకీయంగా చైతన్య వంతులయ్యారు. దీనితో వీరు అభివృద్ధి చెందిన దేశాల ప్రజల స్థితిగతులలో తమ పరిస్థితిని పోల్చుకుని, తాము కూడా ఆస్థాయికి చేరుకోవాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వాలపై

ఒత్తిడి తేవటం మొదలు పెట్టారు. దీని వలన తమకున్న పరిమిత వనరులతో తమ ప్రజల ఆశలను, అవసరాలను ఏవిధంగా తీర్చాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో నేటి అభివృద్ధి చెందుతున్న రాజ్యాల ప్రభుత్వాలు కొట్టుమిట్టాడుతున్నాయి. దీని ఫలితమే అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈనాడు కన్పిస్తున్న 'పెరుగుతున్న ఆశల విప్లవం' (Revolution of rising expectations), రాజకీయ పరమైన అస్థిరత. ఈ కారణంగానే కొత్తగా ఆవిర్భవించిన రాజ్యాలు అభివృద్ధి చెందిన - చెందుతున్న దేశాల మధ్యనున్న అంతరాన్ని తగ్గించటానికి అంతర్జాతీయంగా ఒత్తిడి తేవటం జరుగుతోంది.

(4) ఈ పైన చెప్పిన కారణంగానే యింతకు పూర్వం సామ్రాజ్య వాద దేశాలుగా ఉన్న అభివృద్ధి చెందిన దేశాలు తమ దృక్పథాన్ని మార్చుకొని, మానవతావాదంతో వ్యవహరించడం జరుగుతోంది. బడుగు దేశాల ఆర్థికాభివృద్ధి, మానవహక్కుల పరిరక్షణ, స్త్రీ, శిశు, కార్మిక సంక్షేమం, అంతర్జాతీయ సమసమాజ స్థాపన వంటి పవిత్ర ఆశయాలను ఈరోజు అభివృద్ధి చెందిన దేశాలు వల్లె వేయటానికి కారణమిదే.

ఈ విధంగా నూతన రాజ్యాల ఆవిర్భావం అంతర్జాతీయంగా విప్లవాత్మకమైన మార్పులకు దోహదం చేసింది. దాని వలననే మార్పులను అధ్యయనం చేయటానికి వాటి ప్రభావాన్ని సమీక్షించడానికి అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి ప్రాధాన్యత ఏర్పడింది.

1.7.2 అంతర్జాతీయ వ్యవహారాలలో ప్రజల ప్రాతినిధ్యం పెరుగుదల :

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అంతర్జాతీయ రంగంలోని రాజకీయ ప్రక్రియలో పాల్గొనే రాజ్యాల సంఖ్య పెరగడమే కాకుండా, రాజ్య వ్యవహారాల్లో పాల్గొనే ప్రజల సంఖ్య కూడ పెరిగింది. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాల రాజకీయ నిర్వహణ కులీనులకే పరిమితమైయుండేది. కాని రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అంతర్జాతీయ రాజకీయ రంగంలో, రాజకీయ ప్రక్రియలో పాల్గొనే రాజ్యాల సంఖ్య పెరుగుటతో పాటు, వివిధ రాజ్యాలలో ప్రజాస్వామిక ప్రభుత్వాల ఏర్పాటుతో, రాజ్య వ్యవహారాల్లో పాల్గొనే ప్రజల సంఖ్య కూడా బాగా పెరిగింది. అంతేగాక రాజకీయ స్వాతంత్ర్యోద్యమాల ఫలితంగా ప్రజలలో రాజకీయ పరిజ్ఞానం, చైతన్యం పెరగడంతో అంతర్జాతీయ సంఘటనల మీద, విదేశ వ్యవహారాల మీద ప్రజలు తమ అభిప్రాయాలను బహిర్గతం చేయటం మొదలు పెట్టారు. ఈఅభిప్రాయాలను ఏ ప్రజాస్వామిక ప్రభుత్వం నిర్లక్ష్యం చేయజాలదు. ఆవిధంగా ప్రజాస్వామ్యీకరణ (Democratization) అనేది ఒక్క రాజ్య నిర్వహణలోనే కాక, విదేశాంగ విధాన నిర్వహణలో కూడా చోటుచేసుకుని, ఇంకాముందుకు కొనసాగుతున్నదని చెప్పవచ్చు. ప్రజాస్వామ్యీకరణకు నూతన రాజ్యాల ఆవిర్భావంతోబాటు 20వ శతాబ్దం ఆరంభంలో సంభవించిన అంతర్జాతీయ సంఘటనలు, విల్సన్ ఆదర్శవాదం, శాంతికాముకత్వం పెరుగుదల, అంతర్జాతీయ సంస్థల అవసరాన్ని గుర్తించడం, అక్షరాస్యత పెరుగుదల వంటి విషయాలను దోహదకారులుగా పేర్కొనవచ్చు.

విదేశీ వ్యవహారాల్లో ఈ ప్రజాస్వామ్యీకరణ ఫలితంగానే 1963లో ఇండియా ప్రభుత్వం వాయిస్ ఆఫ్ అమెరికా (Voice of America) ట్రాన్స్ మీటర్‌ను ఇండియాలో నెలకొల్పటానికి, అనుమతి యివ్వటానికి సిద్ధపడినప్పటికీ, ప్రజాభిప్రాయం వ్యతిరేకం కావటంతో తన నిర్ణయాన్ని మార్చుకుంది. అదే విధంగా 1962లో ఇండియాపై చైనా దురాక్రమణ తరువాత అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, వి.కె. కృష్ణమానన్‌ను రక్షణ మంత్రిగా కొనసాగించటానికి ప్రయత్నించినప్పటికీ, ప్రజాభిప్రాయం కారణంగా ఆయనను తొలగించక తప్పలేదు. ఈవిధంగా ప్రజాభిప్రాయం అనేది ఒక్క ఇండియాలోనే గాక, అంతర్జాతీయంగా కూడ ఒక ప్రధానమైన శక్తిగా రూపుదిద్దుకున్నది. అంటే దానర్థం ప్రతి విషయాన్ని ప్రజాభిప్రాయమే నిర్ణయిస్తుందని కాదు. వివిధ విషయాలపై ప్రజలు సంఘటితంగా తమ అభిప్రాయాలను వెలిబుచ్చినపుడు ఏ ప్రజాస్వామిక ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని నిర్లక్ష్యం చేయజాలదు.

BRAOU

అనగా 1815 వియన్నా కాంగ్రెసు, లేదా 1919 వెర్సైల్స్ శాంతి సమావేశాలలో లాగా ఈనాడు ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా ప్రభుత్వాధినేతలు అంతర్జాతీయ వ్యవహారాల మీద, విదేశాంగ విధానాల మీద నిర్ణయాలు తీసుకొనజాలరు. ఆవిధంగా ఈరోజు అంతర్జాతీయ సంబంధాలు అనేవి వాస్తవ రూపం పొందటమే గాక, ప్రజాస్వామ్య బద్ధం కూడ కావటం జరిగింది. ఈ కారణంగానే అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి కూడా ఒక ప్రత్యేక గుర్తింపు, ప్రాధాన్యం సమకూరినాయి.

1.7.3 విదేశాంగ విధాన సామాజీకరణం (SOCIALISATION OF FOREIGN POLICY) :

నార్తెడ్జ్ (F.S. NORTHEDGE), గ్రీవ్ (M.J. GRIEVE) రచయితల అభిప్రాయంలో విదేశీ వ్యవహారాలలో ప్రజాస్వామ్యీకరణకు సంబంధించిన అంశమే విదేశాంగ విధాన సామాజీకరణ. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు విదేశాంగ విధానం అనేది పాలకుల అవసరాలను తీర్చేదిగా మాత్రమే ఉండేది. ప్రజావసరాలకు ప్రాధాన్యత ఉండేది కాదు. కానీ రెండవ ప్రపంచ యుద్ధం తరువాత వివిధ రాజ్యాల్లో ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఏర్పాటు కావటంతో ప్రభుత్వ నిర్వహణ అనేది ప్రజాభిప్రాయానికి అనుగుణంగా, ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకుని చేయవలసి వస్తోంది. అందువల్లే ఈరోజు విదేశాంగ విధానంకూడ పాలకుల అవసరాలను తీర్చేదిగా కాక, సమాజ అవసరాలను, సమాజ సంక్షేమాన్ని, ప్రజల ఆకాంక్షలను తీర్చే విధంగా నిర్వహించవలసి వస్తోంది. ఆవిధంగా ఈరోజున విదేశాంగ విధానం సమాజపరంగా కొన్ని, లక్ష్యాలు - ఆర్థికాభివృద్ధి, ప్రజల జీవన స్థితిగతుల మెరుగుదల, సాంకేతికాభివృద్ధి మొదలైనవి సాధించటానికి ఒక సాధనంగా పరిగణింపబడుతున్నది. కావుననే విదేశాంగ విధాన నిర్వహణ ఒక్క విదేశ వ్యవహారాల శాఖ అవసరాలకే పరిమితం కాక ప్రభుత్వంలోని మిగిలిన శాఖల అవసరాలను కూడ తీర్చే సాధనంగా ఉపయోగపడుతున్నది. ఈ కారణంగా కూడ అంతర్జాతీయ వ్యవహారాల అధ్యయనానికి ఒక ప్రత్యేక ప్రాధాన్యత రావటం జరిగిందని చెప్పవచ్చు.

BRAOU

1.7.4 సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి (TECHNOLOGICAL DEVELOPMENT) :

యూగిని రాబినోవిచ్ (EUGENE RABINOWITCH) చెప్పినట్లుగా ఈనాడు అంతర్జాతీయ రంగంలో మనం మూడురకాలైన విప్లవాలను ఏకకాలంలో చవిచూస్తున్నాం. అవి : 1) సామాజిక విప్లవం 2) జాతీయ విప్లవం 3) సాంకేతిక విప్లవం. ఇరవయ్యో శతాబ్దం తొలిదశలో సంభవించిన కార్మిక చైతన్యం, విప్లవాభివృద్ధి, అక్షరాస్యతా వ్యాప్తి, స్త్రీ పురుష సమానత్వం, కార్మిక సంక్షేమం, సమాజంలోని బలహీన వర్గాల రాజకీయ, సామాజిక, సాంస్కృతికాభివృద్ధికి తగు చర్యలు తీసుకోవటంద్వారా సమాజంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. అట్లే వలస వాదం తిరోగమనంతో సామ్రాజ్య వాదానికి కాలం చెల్లి అనేక వలస రాజ్యాలు రాజకీయ స్వేచ్ఛను పొంది స్వతంత్ర రాజ్యాలుగా ఆవిర్భావించాయి. ఈ నూతన రాజ్యాల ఆవిర్భావంతో అంతర్జాతీయ రంగంలో వచ్చిన మార్పులను ఇంతకు పూర్వమే విపులంగా చర్చించాం.

మార్పులన్నిటి కంటే ముఖ్యమైనది సాంకేతిక పరంగా వచ్చిన మార్పులు, ఈ శతాబ్దంలో సాంకేతిక పరంగా వచ్చిన మార్పులు ఎంతటి ప్రాధాన్యతను పొందినాయంటే, 20వ శతాబ్దాన్ని ముఖ్యంగా దాని ఉత్తరార్ధాన్ని, సాంకేతిక యుగంగా పేర్కొనడం జరుగుతోంది. సాంకేతికంగా ఈనాడు రవాణా రంగంలోను, సమాచార, ప్రసార సాధనాలలోను వచ్చిన మార్పులు అంతర్జాతీయ రంగాన్ని అనూహ్యంగా ప్రభావితం చేసాయి. రవాణా రంగంలో సాంకేతికంగా వచ్చిన మార్పుల కారణంగా రాజ్యాధినేతకాని, ప్రభుత్వాధినేతకాని, ప్రభుత్వ ప్రతినిధికాని ప్రపంచంలోని ఏమారుమూల ప్రాంతానికైనా కొన్ని గంటల్లో వెళ్ళి రాగలుగుతున్నాడు. అదే విధంగా సమాచార ప్రసార సాధనాలలో వచ్చిన మార్పుల కారణంగా ఏమారుమూల ప్రాంతంతోనైనా కొన్ని సెకనులలో సంబంధాన్ని ఏర్పరచుకొని సంభాషించగలుగుతున్నాడు. అందువలన పూర్వంతో పోలిస్తే ఇరవయ్యో శతాబ్దంలో అంతర్జాతీయ

అవగాహనను పెంపొందించుకోవటానికి, అంతర్జాతీయరంగానికి సంబంధించిన వివిధ అంశాలపై వివిధ రాజ్యాధినేతలు ప్రత్యక్షంగా పరస్పరం సంభాషించుకొని, ఒక నిర్ణయానికి రావటానికి అవకాశాలు ఎక్కువైనాయి.

రవాణా, సమాచార, ప్రసార రంగాలలో వచ్చిన మార్పులకన్న, యుద్ధ సాధనాలలో వచ్చిన సాంకేతిక అభివృద్ధి కారణంగా అంతర్జాతీయ రంగంలో ఊహించలేని గుణాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులు, సుదూరగమ్యాలను ఛేదించగల శక్తివంతమైన జలాంతర్గాములు, సూపర్ సానిక్ స్పీడ్ (Supersonic Speed)తో నడవగల యుద్ధ విమానాల వంటి ఆధునిక యుద్ధ సాధనాలను కనుగొనడంతో ఈనాడు యుద్ధం అనేది ఒక రాజ్యం ఇంకొక రాజ్యాన్ని, ఓడించి, లొంగదీసుకొనడం ద్వారా తన ఆధిపత్యాన్ని పరాజిత రాజ్యం మీద నెలకొల్పడానికి ఒక సాధనంగా ఉపయోగపడేది కానిది అయింది. కాని అణ్వాయుధాల వంటి అధునాతన విధ్వంసక ఆయుధాల ఉత్పత్తిలో యుద్ధం అర్థమే మారిపోయింది. ఈరోజున యుద్ధం అనగా శక్తివంతమైన అణ్వాయుధాలను ఉపయోగించటానికి అవకాశం ఇవ్వటం. అణ్వాయుధాలను ఉపయోగించగలమేకాని, వాటి దుష్పలితాలనుండి తప్పించుకొనగల మార్గాలను మానవాళి ఇంకా పరిశోధించవలసి ఉంది. అంటే అణ్వాయుధాల దుష్పలితాలనుండి మానవాళి తప్పించుకోవటానికి 'రక్షణ' అనేది కాదు (Defencelessness), దీనినే యింకొక విధంగా చెప్పాలంటే అణ్వాయుధాలను ప్రయోగించడమంటే విజేత, పరాజిత రాజ్యాల రెంటి వినాశనమే. ప్రపంచంలోని మానవాళి సర్వనాశనమే. అందువల్లే బెర్ట్రాండ్ బ్రాడీ (Betrand Brodie) అనే రచయిత అణ్వాయుధాలను కనుక్కోవటంతో వచ్చిన ముఖ్యమైన మార్పు యుద్ధాన్ని మరింత హింసాయుతం చేయటమేకాదు కాలం రీత్యా హింసను కేంద్రకరింప జేయుటకు (Concentrate the Violence in time of time) అని అభిప్రాయ పడినాడు. ఈకారణంగానే అణ్వాయుధాలున్నప్పటికి ఏరాజ్యమూ వాటిని ప్రయోగించలేని పరిస్థితి ఈనాడు నెలకొంది.

అణ్వాయుధాలకున్న ఈ అపరిమితమైన శక్తికారణంగా అంతర్జాతీయ రాజకీయాలలో 'శక్తి రాజకీయాల (Power Politics)'కు అణ్వాయుధాల ఉత్పత్తికి స్వస్తి పలుకవలసి ఉన్నది. కాని ఈనాడు అణుపరిజ్ఞానం కలిగి ఉన్న ప్రతి రాజ్యం మరిన్ని అణ్వాయుధాలను ఉత్పత్తి చేయటానికి ప్రయత్నిస్తుంటే, అణు పరిజ్ఞానం లేని రాజ్యం దానిని పెంపొందించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నది. దానికి సమాధానం జాన్.ఎఫ్.కెనడీ నుడివినట్లు అణ్వాయుధాలతో ముడిపడి ఉండటమే. అణ్వాయుధాలను కలిగిన రాజ్యాన్ని అంతర్జాతీయ రంగంలో ఒక శక్తి వంతమైన రాజ్యంగా గుర్తించడమే. కాబట్టి 1964 లో చైనా అణుపరిజ్ఞానాన్ని సంపాదించుకొనగానే, ఇండియా కూడా అణురంగానికి ప్రత్యేక కేటాయింపు చేయడం ద్వారా 1974 నాటికి రాజస్థాన్‌లోని పోఖరాం వద్ద అణు విస్ఫోటాన్ని (Atomic Explosion) జరపగలిగింది. ఈ విధంగా ప్రతి రాజ్యం అంతర్జాతీయ రంగంలో అణ్వాయుధాలను - వాటిని ప్రయోగించడానికి అవకాశం లేదనే విషయం తెలిసినప్పటికి, పెంపొందించుకోవటానికి ప్రయత్నిస్తోంది. అందువల్లే అంతర్జాతీయంగా నానాటికి అణ్వాయుధాల ఉత్పత్తి అపరిమితంగా పెరుగుతోంది. ఈ కారణంగానే మాక్స్ లెర్నర్ (Max Lerner) సమకాలీన యుగాన్ని "Age of over all" గా వ్యాఖ్యానించాడు. అనగా అమెరికా, రష్యా వంటి అగ్రరాజ్యాలు ఈ ప్రపంచాన్ని ఒకసారికాక, ఎన్నోసార్లు భస్మీపటలం చేయటానికి సరిపడా అణ్వాయుధాలను కలిగి ఉన్నాయని అర్థం [మాక్స్ లెర్నర్ "Over all" అనే పదాన్ని జాన్ మెడారిస్ (Johan Medaris) అనే రచయిత నుండి గ్రహించాడు. మెడారిస్ అభిప్రాయంలో "Over all" అంటే అమెరికా, రష్యాల వద్దనున్న అణ్వాయుధాలు ప్రపంచలో ఉన్న ప్రతి మనిషిని ఒకసారి కాక, ఎన్నోసార్లు చంపడానికి సరిపడతాయి. ఈ పదాన్ని తీసుకొని మాక్స్ లెర్నర్ - అంతర్జాతీయ రంగానికి వర్తించినాడు] మాక్స్ లెర్నర్ అభిప్రాయంలో సమకాలీన అంతర్జాతీయ సమాజం శక్తిలేమి (Power Scaricity) లోగాక శక్తి మిగులు (Power Surplus) తో కూడుకుని ఉంది. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు అంతర్జాతీయ సమాజం శక్తిలేమితో ఉన్నందువల్ల ప్రతిరాజ్యం మరింత శక్తిని సమకూర్చుకొనడానికి, శక్తిని ఉపయోగించడం ద్వారా తన జాతీయ ప్రయోజనాన్ని పరిరక్షించుకోవటానికి ప్రయత్నించేది. ఎందుకంటే ఆరోజుల్లో అణుపరిజ్ఞానం కనుగొనబడలేదు అణ్వాయుధాలకు అవకాశం లేదు.

BRAOU

Dr. BRAOU LIBRARY Acc. No: CM-0139 Class No: 320

అందువల్ల అవసరమైతే యుద్ధం ద్వారా తన జాతీయ ప్రయోజనాన్ని పరిరక్షించుకోవటానికి ఏరాజ్యం వెనుకాడేది కాదు. కానీ ఈరోజున అణ్వాయుధాల ఉత్పత్తితో, యుద్ధాన్ని గురించి అణ్వాయుధాలు అంతర్జాతీయ రాజకీయాల స్వభావ, స్వరూపాలను మార్చివేశాయి.

ఈ అణ్వాయుధాల కారణంగా రాబర్ట్ ఓపెన్‌హేమర్ (ROBERT OPPENHEIMER), మార్గెంథో (MORGEN THAU!) అభిప్రాయంలో ఈ రోజున విదేశాంగ విధానం ఒక ప్రత్యేకమైన సందిగ్ధావస్థ (DILEMMA) కులోనైంది. అణ్వాయుధాల కారణంగా విధాన నిర్ణేతలు తమ జాతీయ ప్రయోజనాన్ని కాపాడు కోవటానికి విదేశాంగ విధానంలో యుద్ధాన్ని ఒక సాధనంగా పరిగణించాలా? లేదా? అనే సందిగ్ధంలో పడ్డారు. 1945కు పూర్వం ఏదైనా సమస్య ఉత్పన్నమైనపుడు అవసరమైతే యుద్ధాన్ని అంతిమ సాధనంగా భావించటానికి అవకాశం ఉండేది. కానీ ఈరోజున యుద్ధం అంటే అణ్వాయుధాల ప్రయోగానికి అవకాశం ఇవ్వడమే. అణ్వాయుధాల ప్రయోగం అంటే సర్వమానవాళి వినాశమే. అట్లాగని యుద్ధానికి దూరంగా ఉందామంటే దానిని బలహీనతగా పరిగణించడానికి, జాతీయ ప్రయోజనాన్ని పరిరక్షించుకోలేని పరిస్థితికి దారితీయడానికి అవకాశం ఇచ్చినట్లవుతుంది. యుద్ధాన్ని దూరంగా ఉంచాలన్నా అంతర్జాతీయ సమస్యల పరిష్కారానికి, యుద్ధానికి ప్రత్యామ్నాయం కన్పడని పరిస్థితి ఈరోజు తలెత్తింది.

ఆవిధంగా సాంకేతిక పరిజ్ఞానం పెరుగుదల అంతర్జాతీయ సంబంధాల స్వరూప, స్వభావాలను మార్చడమే కాకుండా అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి సవాళ్ళ (CHALLENGES)ను కూడ విసరింది. ఈ సవాళ్ళ కారణాంగానే అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి ఒక ప్రత్యేక అవసరం ప్రాధాన్యత కల్గింది.

1.7.5 ప్రపంచశాంతి - శాంతికాముకత్వం :

BRAOU

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అణ్వాయుధాల ఉత్పత్తిలో ప్రపంచశాంతి అంతకు ముందెన్నప్పుడూ లేనంతగా ప్రాధాన్యత సంతరించుకుంది. 19వ శతాబ్దంలో కూడా శాంతిని గురించి చర్చలు జరిగినప్పటికి, ప్రపంచశాంతిని ఏరాజ్యం తన లక్ష్యంగా పరిగణించలేదు. జాతీయ ప్రయోజనాన్ని పరిరక్షించుకోవటమే రాజ్య లక్ష్యంగా పరిగణించబడింది. కాని, అణ్వాయుధాల ఉత్పత్తితో ఇరవయ్యో శతాబ్దంలో 'అంతర్జాతీయ శాంతి'ని, పరిరక్షించడం ప్రతి రాజ్యానికి ప్రథమ లక్ష్యంగా ఉంటుంది. రాజ్యం, రాజ్యంగా మనగలిగినపుడే జాతీయ ప్రయోజనాన్ని పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత ఏర్పడుతుంది. అంటే జాతీయ ప్రయోజనం కంటే కూడా ఈ రోజున ప్రపంచశాంతికి ప్రాధాన్యం పెరిగిపోయింది. ఈ విధంగా అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి ఒక లక్ష్యం ఏర్పడింది. ఆలక్ష్యమే అంతర్జాతీయంగా యుద్ధాలను నివారించడం ద్వారా ప్రపంచశాంతిని నెలకొల్పడం అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ద్వారా మనం ప్రపంచశాంతిని, అంతర్జాతీయ భద్రతను పరిరక్షించటానికి అనువైన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించ వలసి ఉంది.

1.7.6 అంతర్జాతీయ వ్యవస్థల ఆదరణ :

అంతర్జాతీయ శాంతి స్థాపనకు, అంతర్జాతీయ వ్యవస్థకు దగ్గర సంబంధముంది. అంతర్జాతీయ శాంతి స్థాపన అంతర్జాతీయ రాజకీయాల లక్ష్యమైతే, ఆలక్ష్యాన్ని సాధించటానికి అవసరమైన ఒక వ్యవస్థారూపమే అంతర్జాతీయ సంస్థ. ఆ విధంగా శాంతి అనేది అంతర్జాతీయ రాజకీయాలను, అంతర్జాతీయ సంస్థలను అనుసంధానం చేసే ఒక ముఖ్యాంశం. ఈ సంబంధం కారణంగానే అంతర్జాతీయ రాజకీయాల స్వభావం అంతర్జాతీయ వ్యవస్థ స్వభావాన్ని, అంతర్జాతీయ వ్యవస్థ స్వరూపం అంతర్జాతీయ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయి. అందువలననే అంతర్జాతీయ సంస్థ నిర్వహణలో అంతర్జాతీయ రాజకీయాలలో కన్పించే శక్తిని గురించిన సంఘర్షణ (Power Struggle) కన్పడితే,

అంతర్జాతీయ రాజకీయాలలో అంతర్జాతీయ సంస్థ లక్ష్యమైన శాంతిని గురించి ఆరాటం కన్పడుతుంది. ఆ విధంగా ఈ రెండు పరస్పర ప్రభావానికి లోనవుతూ ఉంటాయి.

అంతర్జాతీయ సంస్థతోబాటు, శాంతిని సాధించటానికి ఉన్న ఇంకొక వ్యవస్థాపరమైన మార్గం అంతర్జాతీయ సమైక్యత. అంటే ప్రపంచ రాజ్యం లేదా ప్రపంచ ప్రభుత్వం ఏర్పాటు కావటానికి ఉన్న మార్గాలను అన్వేషించడం. ఈనాడు అంతర్జాతీయ రంగంలో ఒక వైపు సంకుచితమైన జాతీయతా భావం, మరొక వైపు విశాల ప్రాతిపదికపై అంతర్జాతీయ అవగాహన పెరుగుతూ ఉండటం ఒక విశేషం. పరస్పర వ్యతిరేకమైన ఈ రెండు భావాలను సంధానం చేస్తూ ప్రపంచ శాంతిని నెలకొల్పటానికి ఉన్న వివిధ మార్గాలను పరిశోధించి, వివరించటం అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ముఖ్య లక్ష్యం. ఈ కారణంగానే అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి రోజు రోజుకు ప్రాధాన్యత, ప్రాచుర్యం పెరుగుతున్నాయని చెప్పవచ్చు.

1.7.7 నూతన సమాజ ఆవిర్భావం :

అంతర్జాతీయ రంగంలో శాంతి స్థాపనకు, ఆర్థిక అసమానతలకు ఉన్న సంబంధాన్ని కూడ విద్వాంసులు గుర్తించారు. ప్రపంచ జనాభాలో 3/4వ వంతు నూతనంగా ఆవిర్భవించిన, అభివృద్ధి చెందుతున్న (పేద) దేశాలలో ఉండగా, వాటి సంపద ప్రపంచ సంపదలో 1/4వ వంతు మాత్రమే ఉంది. అనగా ప్రపంచ జనాభాలో 1/4వ వంతును మాత్రమే ఉన్న అభివృద్ధి చెందిన (సంపన్న) దేశాలు ప్రపంచ సంపదలోని 3/4వ వంతు భాగాన్ని అనుభవిస్తున్నాయి. దీనికి కారణం అభివృద్ధి చెందిన దేశాలు సాంకేతికాభివృద్ధి, పారిశ్రామికీకరణ, ఎంతో కాలంగా కలిగి ఉన్న రాజకీయ స్వాతంత్ర్యం, ప్రభుత్వ సుస్థిరత, సామాజిక పురోభివృద్ధి, ఆక్షరాస్యతాభివృద్ధులను పేర్కొనవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థికాభివృద్ధికి అవసరమైన సహజ వనరులు ఉన్నప్పటికీ మిగిలిన విషయాలలో వెనుకబడి ఉండటంతో ఆర్థిక రంగంలో, సంపన్న దేశాలతో సమానంగా అభివృద్ధిని సాధించలేక పోతున్నాయి. దీని కారణంగా అభివృద్ధి చెందిన (సంపన్న) అభివృద్ధి చెందుతున్న (పేద) దేశాల మధ్య ఆర్థిక అసమానతలు ఆధారంగా సంపన్న దేశాలు బడుగు రాజ్యాలను దోపిడి చేయటానికి అవకాశం కలుగుతోంది.

BRAOU

అభివృద్ధి చెందుతున్న దేశాలు సాంకేతిక పరిజ్ఞానానికి, పెట్టుబడులకు, విదేశీ ద్రవ్య మార్పిడికి అభివృద్ధి చెందిన దేశాలపై ఆధారపడుతున్నాయి. ఈ బలహీనతను అభివృద్ధి చెందిన దేశాలు తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నాయి. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రపంచ బ్యాంకు (World Bank), అంతర్జాతీయ ద్రవ్యనిధి (International Monetary Fund) వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఉన్నప్పటికి అవి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు వంటి సంపన్న దేశాల ఆధిపత్యంలోనే కొనసాగుతున్నాయి. ఈ కారణంగా పేద దేశాలకు ఈసంస్థలనుండి లభిస్తున్న ఆర్థిక సహాయం నామమాత్రంగానే ఉంటుంది. అందువల్లే ఈనాడు చాలా బడుగు దేశాలు సంపన్న దేశాలకు చెందిన పెద్ద పారిశ్రామిక సంస్థలను బహుళ జాతి సంస్థలను (Multi-National Corporations) పెట్టుబడులు పెట్టటానికి ఆహ్వానిస్తున్నాయి. దానిని అవకాశంగా తీసుకొని బహుళజాతి సంస్థలు, సంపన్న దేశాలు, పేదదేశాలనుండి అనేక రాయితీలను రాబట్టడం ద్వారా పేద దేశాలు ఆర్థిక వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకొని, పేదదేశాలు తమకు అనుకూలంగా వ్యవహరించేటట్లు ఒత్తిడి చేస్తున్నాయి. ఈ విధానాన్నే విద్వాంసులు 'నూతన వలసవాదం'గా పేర్కొంటున్నారు.

ఈ నూతన వలస వాదంలో ఉన్న దుష్పలితాలను గుర్తించిన పేద దేశాలు ఈ ఆర్థిక అసమానతలకు దోపిడీకి వ్యతిరేకంగా సంఘటితం కావటానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. తమ ఆర్థిక వ్యవస్థలను మెరుగు పరచుకోవటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవటానికి, తమతమ రాజ్యాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచటానికి సంపన్న రాజ్యాలపై ఒత్తిడి తీసుకొని వస్తున్నాయి. దాని ఫలితంగా సంపన్న, పేద దేశాల మధ్య

(ఉత్తర - దక్షిణ దేశాల మధ్య) పేద దేశాల మధ్య (దక్షిణ దేశాల మధ్య) అనేక సమావేశాలు, సంప్రదింపులు చోటు చేసుకున్నాయి. ఈ సమావేశాల ద్వారా దోపిడి, ఆర్థిక అసమానతలకు అవకాశం లేని అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను తెంకొల్పటానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రయత్నాలతో బాటు అంతర్జాతీయ వ్యవహారాలను వివిధ కోణాల నుండి అధ్యయనం చేయడం ద్వారా సంపన్న - పేద దేశాల మధ్య నున్న ఆర్థిక అంతరాలను తగ్గించటానికి, దోపిడీకి అవకాశం లేని అంతర్జాతీయ సమసమాజాన్ని నెలకొల్పటానికి వివిధ ప్రణాళికలను, నమూనాలను రూపొందించడానికి అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ద్వారా కూడ కృషి చేస్తున్నారు. ఈకారణంగా కూడ అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి ప్రత్యేక ప్రాధాన్యత చేకూరింది.

1.8 అంతర్జాతీయ సంబంధాల అధ్యయన ప్రాధాన్యత

సమకాలీన అంతర్జాతీయ సమాజంలో అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. సమాజంలో మానవుడు ఏవిధంగా ఒంటరిగా జీవించలేడో, అదేవిధంగా అంతర్జాతీయ రంగంలో కూడ రాజ్యాలు ఒంటరిగా కొనసాగలేవు. అవి పరస్పరం సహకరించుకుంటూ, పరస్పర ఆధారభూతమై రోజురోజుకు అభివృద్ధి చెందుతూ కొనసాగుతూ ఉంటాయి. అంతర్జాతీయ రంగంలో రాజ్యాల మధ్య పరస్పర సహకారం నెలకొనాలంటే రాజ్యాల మధ్య పరస్పర విశ్వాసం సుహృద్భావం ఉండాలి. అందువల్ల అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ద్వారా రాజ్యాల మధ్య పరస్పర విశ్వాసాన్ని, సుహృద్భావ వాతావరణాన్ని నెలకొల్పటానికి అవసరమైన పరిస్థితులను, అటువంటి వాతావరణాన్ని సాధించటానికి ఆటంకంగా ఉన్న అవరోధనాలను గుర్తించటానికి అవకాశం ఉంటుంది.

అంతేగాక అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో మనం ముఖ్యంగా గుర్తుంచుకోవలసింది అంతర్జాతీయ రంగం చాలా సంక్లిష్టమైందనే విషయం. అంతర్జాతీయ వ్యవహారాలను ఎన్నోకారకాలు ప్రభావితం చేస్తూ ఉంటాయి. సంకుచితమైన జాతీయ ప్రయోజనాలు, వివిధ రాజ్యాల నాయకుల విభిన్నమైన మనస్తత్వాలు, ఆదర్శాలు, ఆవేశ కావేశాలు, శక్తి రాజకీయాలు, విలువల ప్రాతిపదికపై విభిన్న రాజ్యాల మధ్య ఉన్న వైరుధ్యాలు, సిద్ధాంత విభేదాలు మొదలైన కారకాలు అంతర్జాతీయ రంగంలో మన ఊహలకు అతీతంగా ఎన్నో సమస్యలను సృష్టిస్తూ ఉన్నాయి. అందువలన అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ద్వారా మనం ఈ సమస్యల స్వభావాన్ని అర్థం చేసుకొని, వాటి పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించవలసి ఉంటుంది. అంతమాత్రాన అంతర్జాతీయ రంగంలో అన్ని సమస్యలను మనం పరిష్కరించగలమని కాదు. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ద్వారా అంతర్జాతీయ రంగంలోని అన్ని సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కార మార్గాలను సూచించలేకపోవచ్చు. ఉదాహరణకు అంతర్జాతీయ రంగంనుండి యుద్ధాన్ని తొలగించడం లేదా సామ్యవాద, పెట్టుబడి దారీ దేశాల మధ్య ఉన్న అపనమ్మకాలను తొలగించి సత్సంబంధాలను నెలకొల్పడం మొదలైనవి. ఈ సమస్యలకు శాస్త్రీయమైన, సంతృప్తి కరమైన, శాశ్వత పరిష్కార మార్గాలను సూచించ లేకపోవచ్చు. కాని ఈ సమస్యల తీవ్రతను తగ్గించటానికి, అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ద్వారా, వివిధ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించటానికి అవకాశముంటుంది. జాన్ బర్టన్ అభిప్రాయంలో ప్రపంచశాంతిని, అంతర్జాతీయ భద్రతను నెలకొల్పడానికి అవసరమైన విధానాలను సూచించగల సాధారణమైన సిద్ధాంతాలను రూపొందించటమే అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ప్రధాన లక్ష్యం. భౌతిక, ప్రకృతి శాస్త్రాలలో ఉన్న శాస్త్రీయతను అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో సాధించలేక పోయినప్పటికీ అంతర్జాతీయ రంగం స్వభావాన్ని బట్టి కొన్ని పరిమితులలో అంతర్జాతీయ రంగం భవిష్యత్ పురోగమనానికి అవసరమైన కొన్ని ప్రణాళికలను రూపొందించటానికి వీలుంటుంది. గార్నెట్ అభిప్రాయంలో అంతర్జాతీయ రాజకీయాల అధ్యయనం ముఖ్యంగా రెండు విధులను నిర్వహిస్తుంది. అవి : 1) అంతర్జాతీయ విషయాలను అర్థం చేసుకోవటానికి అవసరమైన శిక్షణను యివ్వటం. 2) ప్రపంచ రాజకీయాలను శాస్త్రీయంగా అవగాహన (Sophisticated Understanding) చేసుకొనగల పరిజ్ఞానాన్ని పెంపొందించటం అనగా ప్రపంచ సంఘటనలను,

BRAOU

అవి కన్పించే విధంగా గాక లోతుగా విశ్లేషించి చారిత్రకంగా పరిశీలించి, సమగ్రము, పరిపూర్ణము అయిన అవగాహనను ఏర్పరచుకోవడం. అంతర్జాతీయ సంఘటనలను సామాన్య ప్రజానీకంలాగ మామూలు సంఘటనలుగా తీసుకోవటం గాక వాటిని విశ్లేషించి, అర్థం చేసుకొని, వివరించగల పరిజ్ఞానాన్ని పెంపొందించడం అంతర్జాతీయ రాజకీయల అధ్యయనం లక్ష్యంగా ఉండాలని గార్నెట్ అభిప్రాయపడినాడు. ఈ విధమైన పరిజ్ఞానం పెంపొందాలంటే అంతర్జాతీయ రంగానికి సంబంధించిన వివిధ సిద్ధాంతాలను, భాషా పరిజ్ఞానాన్ని (Concepts), అంతర్జాతీయ ప్రక్రియలను, నమూనాలను శాస్త్రీయంగా అవగాహన చేసుకోవటానికి అవకాశముంటుంది. అదే విధంగా రవాణా, ప్రసార సాధనాలలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పుల కారణంగా వివిధ రాజ్యాల ప్రజలలో అంకురించిన లంతర్జాతీయతా భావనను ఆచరణలో పెంపొందించటానికి, వివిధ రాజ్యాల ప్రజల మధ్య రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించడం ద్వారా దోపిడి, అసమానతలకు అవకాశం లేని అంతర్జాతీయ సమసమాజాన్ని స్థాపించటానికి ఉన్న వివిధ మార్గాలను అన్వేషించటానికి అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ద్వారా వీలుంటుంది. ఆ లక్ష్యాన్ని సాధించగలిగినపుడు 'అంతర్జాతీయ సంబంధాలు' అనేవి ఒక ప్రత్యేక బోధనాంశంగా ఆవిర్భవించడంలోని సార్థకత చేకూరినట్లే.

1 - 9 సారాంశం

'అంతర్జాతీయ సంబంధాలు' అనేది ఒక ప్రత్యేక బోధనాంశంగా ఆవిర్భవించడానికి చాలా సమయం పట్టింది. 1919వ సంవత్సరంలో వేల్స్ విశ్వవిద్యాలయంలో ఉండ్రో విల్సన్ పేరిట 'అంతర్జాతీయ రాజకీయాలు' పేరుతో ఒక పీఠాన్ని నెలకొల్పడంతో 'అంతర్జాతీయ సంబంధాలను' ఒక ప్రత్యేక బోధనాంశంగా రూపొందించడానికి నిర్దిష్టమైన ప్రయత్నాలు మొదలైనాయని చెప్పవచ్చు. అప్పటినుండి అది నాలుగు దశలలో అభివృద్ధి చెందడం జరిగింది. మొదటి దశలో చారిత్రకాంశాలకు, రెండవ దశలో సమకాలీన విషయాలకు, మూడవ దశలో అంతర్జాతీయ సంస్థలు, అంతర్జాతీయ న్యాయం అధ్యయనానికి ప్రాధాన్యత ఇచ్చారు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత మొదలైన నాల్గవ దశలో విద్యావేత్తలు సిద్ధాంతీకరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సిద్ధాంతీకరణ ఫలితమే శాంతి పరిశోధనా ధృక్పథం, ప్రపంచ క్రమానుగత ధృక్పథాల రూపకల్పన. "అంతర్జాతీయ సంబంధాలు" అర్థానికి సంబంధించి, ఇది చాలా విస్తృతమైన అర్థాన్ని సూచిస్తుంది. అంతర్జాతీయ సమాజంలోని వివిధ రాజ్యాలు ప్రజల మధ్య ఉన్న అన్ని రకాలైన సంబంధాలను ఇది చర్చిస్తుందని చెప్పవచ్చు.

ఇరవయ్యో శతాబ్దంలో అంతర్జాతీయ రంగంలో వచ్చిన అనేక నూతన సంఘటనలు కారణంగా అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి ప్రత్యేక గుర్తింపు, ప్రాధాన్యత వచ్చింది. దీనికి దోహదం చేసిన కారకాలు : 1) నూతన రాజ్యాల ఆవిర్భావం 2) అంతర్జాతీయ వ్యవహారాలలో ప్రజల ప్రాతినిధ్యం పెరుగుట. 3) విదేశాంగ విధాన సామాజీకరణ. 4) సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుట. 5) ప్రపంచ శాంతిని గురించిన ఆరాటం. 6) అంతర్జాతీయ వ్యవస్థ సమైక్యతల పట్ల పెరుగుతున్న ఆదరణ. 7) దోపిడి, ఆర్థిక అసమానతలకు అవకాశం లేని నూతన అంతర్జాతీయ సమసమాజాన్ని స్థాపించాలనే ఆకాంక్ష. ఈ కారకాలు కారణంగా అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి ప్రత్యేక గుర్తింపు, అవసరం, ప్రాధాన్యత కల్గిందని చెప్పవచ్చు.

– ఐ.దోసగిరిరావు

1.10 చదవదిగిన పుస్తకాలు :

1. Mahendra Kumar : Theoretical Aspects of International Politics. Siralal Agarwala & Co., Agra, 1988.
2. John C. Garnett : Commonsense and the Theory of International Politics. The MGC Millan Press Ltd, London, 1984.

3. Norman D. Palmen & Harward C. Perknis: International Relations, The World Community in translation, Scientific Book Agency, Culcutta 1970.

4. J.A. Naik : A Test Book of International Relations, The Macmillam Company of India Ltd, Delhi, 1978.

5. Prakash Chandra : International Politics, Vikas Publishing, House Prt Ltd, New Delhi, 1979.

1.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

I ఈకింది ప్రశ్నలకు 30/40 పంక్తులలో జవాబు లివ్వండి.

i) 'అంతర్జాతీయ సంబంధాలు' ఒక ప్రత్యేక అధ్యయన శాస్త్రంగా రూపొందటానికి దోహదం చేసిన వివిధ దశలను విమర్శనాత్మకంగా వివరించండి.

ii) అంతర్జాతీయ సంబంధాలు అంటే ఏమిటి? దాని స్వరూప, స్వభావాలను విమర్శనాత్మకంగా చర్చించండి.

iii) అంతర్జాతీయ సంబంధాలు అధ్యయనంలో చేర్చదగిన అంశాలకు సంబంధించి వివిధ రచయితల అభిప్రాయాలను తెలియ జేయండి.

iv) అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ప్రాధాన్యతకు దోహదం చేసిన వివిధ కారకాలను వివరించండి.

v) అంతర్జాతీయ సంబంధాల స్వరూపాన్ని ప్రభావితం చేసిన వివిధ కారకాలను వివరించండి.

vi) కొత్త రాజ్యాల ఆవిర్భావంతో అంతర్జాతీయ సంబంధాల స్వభావంతో వచ్చిన మార్పులను వివరించండి.

vii) అణ్వాయుధాల ఉత్పత్తి అంతర్జాతీయ సంబంధాల స్వరూప, స్వభావాలను ఏవిధంగా ప్రభావితం చేసింది?

II. ఈకింది వానికి 20/10 పంక్తులలో జవాబు లివ్వండి.

i) అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో శాంతి పరిశోధనా ధృక్పథం పాత్రను విశదీకరించండి.

ii) రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కొత్త రాజ్యాల ఆవిర్భావంతో అంతర్జాతీయ సంబంధాలు వాస్తవంగా కూడ అంతర్జాతీయం అయ్యాయి. చర్చించండి.

iii) అంతర్జాతీయ సంబంధాలలో ప్రజాస్వామ్యీకరణ పాత్రను చర్చించండి.

iv) రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అంతర్జాతీయ సంబంధాలలో 'ప్రపంచ శాంతి' ప్రాధాన్యత పెరుగుటకు కారణాలను వివరించండి.

v) అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ప్రాధాన్యతను వివరించండి.

BRAOU

భాగం - 2 అధ్యయన దృక్పథాలు

విషయక్రమం

2.1 లక్ష్యాలు

2.2 పరిచయం

2.3 దృక్పథం - నిర్వచనం

2.4 అంతర్జాతీయ సంబంధాలు - వివిధ దృక్పథాలు

2.5 వాస్తవికవాద దృక్పథం - ఆదర్శవాద దృక్పథం

2.6 సాంప్రదాయక, శాస్త్రీయ దృక్పథాలు

2.7.0 సాంప్రదాయకవాద దృక్పథాలు

- 2.7.1 చారిత్రక దృక్పథం
- 2.7.2 తాత్త్విక లేదా దార్శనిక దృక్పథం
- 2.7.3 న్యాయ దృక్పథం
- 2.7.4 సంస్థాగత దృక్పథం

2.8.0 శాస్త్రీయవాద దృక్పథాలు

- 2.8.1 వ్యవస్థా దృక్పథం
- 2.8.2 నిర్ణయకల్పన దృక్పథం
- 2.8.3 ప్రసార దృక్పథం
- 2.8.4 క్రీడా దృక్పథం
- 2.8.5 మార్క్సిస్టు దృక్పథం

2.9 అంతర్జాతీయ సంబంధాలు - స్వతంత్ర ప్రతిపత్తి

2.10 సారాంశం

2.11 చదువదగిన పుస్తకాలు

2.12 నమూనా పరీక్షా ప్రశ్నలు

2-1 లక్ష్యాలు

ఈ భాగాన్ని అధ్యయనం చేశాక అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలోని వివిధ దృక్పథాలను మీరు వివరించగలుగుతారు.

BRAOU

2.2 పరిచయం

'అంతర్జాతీయ సంబంధాల'ను ఒక ప్రత్యేకమైన అధ్యయన శాస్త్రంగా పరిగణించాలంటే దానిని మనం ఒక సమగ్రమైన శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించవలసి ఉంది. ఆ విధంగా సమగ్ర పరిశీలన చేయనిదే ఏ శాస్త్రం కూడా పరిపూర్ణంగా అభివృద్ధి చెందజాలదు. సమగ్ర పరిశీలనకు, ఆ పరిశీలనపై ఆధారపడిన సిద్ధాంతాలకు సర్వాంగీకారం లభించాలంటే ఆ శాస్త్రం అధ్యయనంచేసే విధానంలో తొలుత సాధారణ అభిప్రాయం ఉండాలి. కానీ, ఆచరణలో ఏ సిద్ధాంతాన్ని అందరు రచయితలు ఒకేవిధంగా ఆమోదించజాలరు. దానికి కారణం ఆ విషయంపట్ల వివిధ రచయితల దృక్పథాలలో ఉన్న భేదాలే. ఇందువలన మనం సిద్ధాంతీకరణకంటె కూడా ముందు పరిశీలనా విధానానికి సంబంధించిన దృక్పథాలను గురించి తెలిసికోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పవచ్చును.

అంతర్జాతీయ సంబంధాల విషయంలో ఇంతవరకు సర్వాంగీకృతమైన సిద్ధాంతం కాని, సూత్రాలు కాని, రూపొందలేదు. లోగడ పేర్కొన్నట్లు అంతర్జాతీయ సంబంధాలు చాలాకాలం చారిత్రక దృక్పథంతోను, సంస్థాగత దృక్పథంతోను మాత్రమే పరిశీలించడం జరిగింది. కాని, గత రెండు, మూడు దశాబ్దాలుగా చరిత్రకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వకుండా, ఆ చరిత్రద్వారా మనం తెలిసికోగలిగిన, అన్వయించుకోదగిన సిద్ధాంతాలను రూపొందించడంలో రచయితలు ఎక్కువగా కృషిచేస్తూ ఉన్నారు. ఆ విధంగా కాలానుగుణంగా, మారిన, మారుతున్న పరిస్థితులను బట్టి, ఆ పరిస్థితులపట్ల విభిన్న రచయితల స్పందన ఆధారంగా విభిన్న దృక్పథాలు రూపొందుతూ వచ్చాయి. ఇంతవరకు ప్రపంచంలోని వివిధ రాజ్యాల మధ్యగల సంబంధాల విషయంలో అనేక సూత్రాలు, సిద్ధాంతాలు రూపొందాయి. కాని రచయితల అందరికి ఆమోదయోగ్యమైన ఒకే ఒక సిద్ధాంతం రూపొందలేదు. వివిధ రాజ్యాల మధ్యగల సంబంధాలు వివిధ దృక్కోణాలనుంచి పరిశీలించి, వివిధ రచయితల దృక్పథాలను బట్టి ఆయా సందర్భాలకు అనువైన వివిధ సూత్రాలను, సిద్ధాంతాలను రూపొందించడం జరుగుతోంది. కాబట్టి సిద్ధాంతాల రూపకల్పనలో రచయితల దృక్పథానికి ఎక్కువ ప్రాధాన్యత ఉందని తెలుస్తోంది. రచయితల మధ్య ఉన్న దృక్పథాల వైవిధ్యం వలననే అందరికీ ఆమోదయోగ్యమైన సిద్ధాంతాన్ని తయారుచేయడం ఆచరణసాధ్యం కాదు.

BRAOU

2.3 దృక్పథం - నిర్వచనం

సంక్షిప్తంగా దృక్పథాన్ని, దృగ్విషయాలను అధ్యయనం చేయడానికి అనుసరించే ప్రామాణిక విలువలుగా నిర్వచించవచ్చును. విద్యావిషయకంగా ఒక దృగ్విషయాన్ని అధ్యయనం చేయవలసినపుడు ఏ విషయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి? వేటికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? దృగ్విషయానికి సంబంధించిన సమాచారాన్ని ఏ విధంగా సేకరించాలి? ఏ అంశాలకు సంబంధించిన సమాచారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? లేక తక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? లేక ఏ రకమైన సమాచారాన్ని సేకరించాలి? లేదా ఏ రకమైన సమాచారాన్ని విస్మరించవచ్చు? మొదలైన విషయాలు దీనిలో ప్రాధాన్యత వహిస్తాయి. వివిధ రకాలైన స్వీయ దృక్పథాలను బట్టి వివిధ రచయితలు విభిన్న అంశాలకు ఎక్కువ లేక తక్కువ ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతున్నది.

2.4 అంతర్జాతీయ సంబంధాలు - వివిధ దృక్పథాలు

పై నిర్వచనం ఆధారంగా అంతర్జాతీయ సంబంధాలను పరిశీలించినప్పుడు "అంతర్జాతీయ సంబంధాల" అధ్యయనంలో ముఖ్యంగా మూడురకాలైన విభిన్న దృక్పథాలు మనకు గోచరిస్తాయి. వీటిలో మొదటిది అంతర్జాతీయ సంబంధాలను పరిశీలించినప్పుడు ఆ సంబంధాలు నైతికంగాను, న్యాయబద్ధంగాను ఉన్నాయా? లేదా? అనీ, ఎటువంటి చర్యలు నైతికపరమైనవి? న్యాయపరమైనవి? అని చెప్పదగునో తెలిసికొనవలెనని కొందరు రచయితలు

అభిప్రాయపడ్డారు. వీరిని మనం ఆదర్శవాదులుగా, వారి ధృక్పథాన్ని ఆదర్శవాద ధృక్పథంగా పేర్కొనవచ్చును. దీనికి విరుద్ధంగా మరికొందరు రచయితలు వివిధ దేశాల యథార్థ పరిస్థితులను, అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆ రాజ్యాలకు, ఇతర రాజ్యాలకు మధ్యగల సంబంధాలు సమయోచితంగా, సంధర్భోచితంగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించాలని భావించారు. వీరి దృష్టిలో కాలానుగుణంగా, దేశ అవసరాల ఆధారంగా అంతర్జాతీయ సంబంధాలు ఉండాలే కాని వాటిని శాశ్వతంగా నైతిక విలువలకు ముడిపెట్టరాదు. వీరిని మనం యదార్థవాదులు లేక వాస్తవికవాదులుగా, వారి ధృక్పథాన్ని వాస్తవికవాద ధృక్పథంగా పేర్కొనవచ్చు.

రెండవది, అంతర్జాతీయ రంగానికి సంబంధించిన దృగ్విషయాలను అధ్యయనం చేయటానికి ఉపయోగించే పద్ధతులకు సంబంధించి వివిధ రచయితలు భిన్నాభిప్రాయాలను వ్యక్తీకరించటం జరిగింది. కొందరు రచయితలు అంతర్జాతీయ రంగానికి సంబంధించిన దృగ్విషయాలను దార్శనిక (Philosophical), తార్కిక, చారిత్రక విధానాలవంటి సాంప్రదాయక పద్ధతులద్వారా పరిశీలించవచ్చునని అభిప్రాయపడగా, మరికొందరు అంతర్జాతీయ సంబంధాలను కూడా ఇతర ప్రాకృతిక శాస్త్రాలవలె శాస్త్రీయ ధృక్పథంతోనే పరిశీలించాలని అభిప్రాయపడినారు. ఎంతటి మేధావి అయినప్పటికి అతని భావన ఆధారంగా రూపొందించిన సూత్రము లేదా సిద్ధాంతము యదార్థమైనది కాకపోవచ్చునని, అనుభవాత్మకమైన ప్రక్రియద్వారా మాత్రమే మన భావనలు, సిద్ధాంతాలు రూపొందింపబడవలెనని వీరి అభిప్రాయము. ఈ దృష్టితో పరిశీలించినపుడు అంతర్జాతీయ సంబంధాలను కొందరు రచయితలు సాంప్రదాయక, దార్శనిక ధృక్పథాలతో వివరించగా, మరికొందరు ఆధునిక శాస్త్రీయ ధృక్పథాలతో పరిశీలించాలని అభిప్రాయ పడుతున్నట్లు అర్థమవుతుంది.

మూడవది, కొంతమంది రచయితలు అంతర్జాతీయ సంబంధాలను ఆర్థికశాస్త్రము, వాణిజ్యశాస్త్రం, రాజనీతిశాస్త్రము వలె స్వతంత్ర ప్రతిపత్తికలిగిన ప్రత్యేకమైన అధ్యయనశాస్త్రంగా పరిగణించగా, మరికొందరు రచయితల అభిప్రాయంలో అంతర్జాతీయ సంబంధాలు ఏ విధంగాను కూడ ప్రత్యేకమైన స్వతంత్ర ప్రతిపత్తిని ఇంతవరకు సమకూర్చుకొనలేదని అభిప్రాయపడినారు. వారి అభిప్రాయంలో అంతర్జాతీయ సంబంధాలను రాజనీతిశాస్త్రంలో గాని, లేక ఆర్థికశాస్త్రంలో కాని అంతర్భాగంగా పరిగణించవచ్చు.

ఈ విధంగా అంతర్జాతీయ సంబంధాలకు చెందిన వివిధ రచయితలు పైన వివరించిన మూడురకాలైన ధృక్పథాలలో ఏదో ఒక దానికి చెందిఉండి తమ రచనలను కొనసాగించారని చెప్పవచ్చు. అంతేగాక కొన్ని సమయాలలో ఒకే రచయిత మూడు తరగతులకు చెందిన మూడురకాలైన ధృక్పథాలను తనలో సమన్వయం చేసికొనే అవకాశం కూడా ఉంది. ఉదా॥ ఒకే రచయిత నైతిక సూత్రాల ఆధారంగా ఆదర్శవాదిగాను, అధ్యయన పద్ధతులు ఆధారంగా సాంప్రదాయకవాదిగాను, అంతర్జాతీయ సంబంధాల అధ్యయన ప్రతిపత్తికి సంబంధించి దానిని ఒక ప్రత్యేక శాస్త్రంగా పరిగణించే రచయితగాను కూడా మనకు గోచరించవచ్చు. ఇక ధృక్పథాలను విపులంగా పరిశీలిద్దాం.

2.5 వాస్తవికవాద ధృక్పథం - ఆదర్శవాద ధృక్పథం

తమ వ్యక్తిగత ధృక్పథాలు ఆధారంగా మాకియావెల్లి, థామస్‌హాబ్స్, హేన్స్‌జె మార్గెంథో, ఇ.హెచ్. కార్, రీన్‌హోల్డ్ నేబర్ మొదలైన మేధావులు వాస్తవికవాద ధృక్పథాన్ని అనుసరించగా, హ్యూగో గ్రోషియస్, బెంథామ్, ఉడ్రోవిల్సన్, బెర్ట్రాండ్ రస్సెల్ ప్రభృతులను ఆదర్శవాద ధృక్పథానికి చెందినవారుగా పరిగణించవచ్చును. వాస్తవికవాదులు మానవ స్వభావంపట్ల తమకున్న అపనమ్మకం కారణంగా అంతర్జాతీయ సంబంధాలలో జాతీయ ప్రయోజనం, భద్రత మరియు శక్తి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతనీయగా, ఆదర్శవాదులు మానవ స్వభావం పట్ల తమకున్న ఆశావాదం కారణముగా

BRAOU

నైతిక విషయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. వాస్తవికవాదులు రాజ్య అవసరాలను తీర్చటానికి, రాజ్యపు జాతీయ ప్రయోజనాలను పరిరక్షించటానికి ఎక్కువ ప్రాముఖ్యము యివ్వగా, ఆదర్శవాదులు ఎంతసేపు యుద్ధాలకు అసమానతలకు అవకాశంలేని ఆదర్శవంతమైన అంతర్జాతీయ సమసమాజాన్ని ఎలా స్థాపించాలి? అన్ని విషయము మీదనే తమ దృష్టిని కేంద్రీకరించటం జరిగింది. వాస్తవికవాదం శక్తి రాజకీయాలు, నైతిక సూత్రాలపట్ల ఉదాసీన వైఖరిని అవలంబించగా, ఆదర్శవాదము ప్రపంచ రాజకీయాలను నైతిక సూత్రాలకు అనుగుణముగా మార్చటానికి ప్రయత్నంచేసిందని చెప్పవచ్చు. ఆదర్శవాదం నైతిక విలువలపై ఆధారపడి సహజీవనం, పరస్పర అవగాహనలను ప్రోత్సహించగా, వాస్తవికవాదం కేవలం శక్తిని పెంపొందించుకోవటమే లక్ష్యంగా పెట్టుకొని అసహనానికి, రాజ్యాలమధ్య పోటీకి, యుద్ధోన్మాద చర్యలకు అవకాశం కల్పించింది. ఆదర్శవాద ధృక్పథం అంతర్జాతీయ రాజకీయాలలో తాత్త్విక విలువల ప్రాధాన్యతను గుర్తించగా, వాస్తవికవాద ధృక్పథం అంతర్జాతీయ రాజకీయాలలో శక్తి రాజకీయాలను సమర్థించటం జరిగింది. ఆదర్శవాదం అంతర్జాతీయ ప్రయోజనాలను పరిరక్షించటానికి ప్రయత్నించగా, వాస్తవికవాదం జాతీయతను, జాతీయ అవసరాలను తీర్చటానికి, ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చింది.

వాస్తవానికి ఆచరణలో అంతర్జాతీయ సంబంధాలు పూర్తిగా ఏ ఒక్క ధృక్పథానికి కట్టుబడి ఉండవు. అందువలన అంతర్జాతీయ సమాజాన్ని సరిగా అర్థం చేసుకోవాలన్న వాస్తవికవాదం, ఆదర్శవాదాలలో ఉన్న మంచిని గ్రహించి, రెంటిని సమన్వయం చేయగలిగినపుడే అంతర్జాతీయ సంబంధాలను శాస్త్రీయంగా అవగాహన చేసుకోవటానికి అవకాశముంటుందని చెప్పవచ్చు. వాస్తవికవాద ధృక్పథం, ఆదర్శవాద ధృక్పథాలకు సంబంధించి విపులంగా తరువాత అధ్యాయంలో 'వాస్తవికవాదం - ఆదర్శవాదం' అన్న శీర్షికక్రింద వివరించటం జరిగింది.

2.6 సాంప్రదాయక, శాస్త్రీయ ధృక్పథాలు

BRAOU

ఇప్పుడు అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి సంబంధించి సాంప్రదాయవాదులు లేక సనాతనవాదులకు, ఆధునిక శాస్త్రీయకారులు లేక ప్రవర్తనావాదులకు మధ్యగల విభేదాలను పరిశీలిద్దాం. ఇతర సాంఘిక శాస్త్రాలలాగే రాజనీతిశాస్త్రం అంతర్జాతీయ సంబంధాలు కూడా నేడు శాస్త్రీయ వాద ప్రభావానికి లోనయ్యాయని చెప్పవచ్చు. వాస్తవిక సామాజిక శాస్త్రాలలో శాస్త్రీయవాదం ప్రవర్తనావాద విప్లవం పేరుతో ఇరవయ్యో శతాబ్దం తొలిదశలోనే అనువర్తింపబడి నూతన పోకడలకు దారితీసింది. కానీ అంతర్జాతీయ సంబంధాలలో ఈ ప్రక్రియ చాల ఆలస్యంగా ఈశతాబ్దపు ఏడవదశాబ్దంలో మాత్రమే చోటుచేసుకోవటం జరిగింది. 1960 నుండి ఏర్పడిన ఈ నూతన ప్రక్రియ వలన వివిధ రచయితలు ఒకరితో ఒకరు పోటీపడి అంతర్జాతీయ సంబంధాలను కూడా శాస్త్రీయ ధృక్పథంతో అభివృద్ధి చేయటానికి ప్రయత్నించారు. హెరాల్డ్ లాస్వెల్, మోర్టాన్ కాప్లాన్, డేవిడ్ సింగర్, కెన్నెత్ బౌల్డింగ్, డేవిడ్ మెక్లిలాండ్ (David Mc clelland) జేమ్స్ రోసెనౌ (James Rosenau) ప్రభృతులు శాస్త్రీయ ప్రక్రియలను ముఖ్యంగా ప్రవర్తనావాదాన్ని పాటిస్తూ అంతర్జాతీయ సంబంధాలలో నూతన సిద్ధాంతాలను రూపొందించారు.

ప్రక్రియ పరిణామాలను పరిశీలించిన కొంతమంది సాంప్రదాయవాదులు వీరి ఆలోచనా ధోరణిని, తద్వారా రూపొందించిన సిద్ధాంతాలను నిశితంగా విమర్శించారు. సాంప్రదాయవాదాన్ని సమర్థించినవారిలో ప్రముఖునిగా హేడ్లీ బుల్ (Hedley Bull)ను పేర్కొనవచ్చు. ఈయనతోబాటు ప్రసిద్ధ అంతర్జాతీయ చరిత్రకారుడు ఇ.హెచ్. కార్, హేన్స్‌మార్గెంతౌ, ఆల్ఫ్రెడ్ జిమ్మెర్న్ (Alfred Zimmern), జార్జ్ స్కువర్జల్ జెర్గర్ (George Scuwarzell Gerger), మార్టిన్ వైట్, రేమాండ్ ఆరనీ మొదలైన రచయితలు సాంప్రదాయవాదాన్ని సమర్థించారు. 1960 దశకం ఉత్తరార్థంలో సాంప్రదాయవాదులకు, శాస్త్రీయవాదులకు మధ్య వివాదం తీవ్రస్థాయికి చేరుకొంది. సాంప్రదాయవాదానికి, శాస్త్రీయవాదానికి మధ్యగల సంఘర్షణను మోర్టాన్ కప్లాన్ "నూతన వక్తృత్వపు పోటీ" ("The new great debate") గా పేర్కొనగా, డేవిడ్ సింగర్ ఈ రెండు వాదాలను "రెండు విభిన్న ఆలోచనా ప్రవంతులు లేక సంస్కృతులు" ("The two distinct intellectual Styles or Cultures")గా పేర్కొన్నారు.

అంతర్జాతీయ సంబంధాలలో శాస్త్రీయ పద్ధతికి, సాంప్రదాయవాదానికి మధ్య వివాదం 1966లో హేడ్లీ బుల్ ప్రకటించిన "అంతర్జాతీయ సిద్ధాంతం; సాంప్రదాయ ధృక్పథానికి అనుగుణంగా ఒక వాదన" ("International Theory; The Case for a Classical Approach") అన్న వ్యాసంతో మొదలైందని చెప్పవచ్చు. ఈ వ్యాసంలో హేడ్లీ బుల్ సాంప్రదాయక వాదాన్ని సమర్థిస్తూ, శాస్త్రీయవాదాన్ని విమర్శించాడు. అంతేగాక ఈ వ్యాసంలో అతడు సాంప్రదాయకవాదం, శాస్త్రీయవాదనలలో గల సుగుణాలను, లోపాలను తులనాత్మకంగా వివరించాడు. హేడ్లీ బుల్ తన అభిప్రాయానికి అనుకూలంగా ఏడు ముఖ్యవాదనలను ప్రతిపాదించాడు. అవి-

1. అంతర్జాతీయ రాజకీయాలకు సంబంధించిన విషయ పరిజ్ఞానం యొక్క స్వభావం ఆధునిక శాస్త్రీయ పద్ధతులద్వారా పరిశీలించడానికి అనువైనది కాదు. బుల్ అభిప్రాయంలో అంతర్జాతీయ సంబంధాలు ప్రధానంగా నైతిక విలువలతో కూడుకొని ఉంటాయి. అంతర్జాతీయ రాజకీయాలకు సంబంధించిన విద్యార్థి సర్వసత్తాక రాజ్యాల స్వరూప స్వభావాలను, అంతర్జాతీయ రంగంలో యుద్ధం, బలప్రయోగాల స్థానాన్ని, న్యాయబద్ధతను, అంతర్జాతీయ సమాజంలో వ్యక్తియొక్క స్థానం మొదలైన నైతిక సంబంధమైన విషయాలను పరిశీలించవలసి ఉంటుంది. కానీ శాస్త్రీయ ధృక్పథం ఆధునిక పద్ధతులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందేతప్ప ఇటువంటి నైతిక విషయాలను పరిశీలించలేదు.

2. హేడ్లీ బుల్ అభిప్రాయంలో అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి శాస్త్రీయ పద్ధతులను సమర్థించే రచయితలు అల్ప విషయాలకు (trivialities) ఎక్కువ ప్రాధాన్యత యిచ్చి ముఖ్య సమస్యలను విస్మరిస్తూ ఉంటారు. అదే విధంగా అంతర్జాతీయ సంబంధాలకు సంబంధించి సిద్ధాంతీకరణ అభివృద్ధికి వీరు ఏమీ దోహదం చేయలేకపోయారు. వారు ఏమైనా సిద్ధాంతాలను రూపొందించడం జరిగితే అవి సాంప్రదాయక పద్ధతుల ఆధారంగా అభివృద్ధి చేసినవే తప్ప శాస్త్రీయ పద్ధతులద్వారా చేసినవి కావు.

3. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో శాస్త్రీయ పద్ధతులు ఇంకా తొలిదశలోనే ఉన్నందున పరిపూర్ణమైన శాస్త్రీయ సిద్ధాంతాలను రూపొందించటానికి ఇంకా కొంత సమయం పడుతుందన్న శాస్త్రీయవాదుల వాదనను బుల్ త్రోసిపుచ్చాడు. శాస్త్రీయవాదులు సమాచార సేకరణకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి, అలవికాని సమాచారాన్ని ఎక్కువ సేకరించడం వలన, ఆ సమాచారం ఆధారంగా సార్వజనీనమైన సిద్ధాంతాలను రూపొందించలేని క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటారని ఈయన అభిప్రాయపడ్డారు.

4. శాస్త్రీయతావాదులు అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి కొన్ని నమూనాలను రూపొందించటం జరిగింది. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో నమూనాలను ప్రవేశపెట్టడంద్వారా శాస్త్రీయవాదులు అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి అపకారంచేయడం జరిగిందని బుల్ అభిప్రాయపడ్డారు. ఈ నమూనాల రూపకల్పన అంతర్జాతీయ రంగానికి సంబంధించిన యథార్థ పరిస్థితిని ప్రతిబింబించటానికి బదులు శాస్త్రకారుల ధృక్పథాన్ని మాత్రమే ప్రతిబింబిస్తాయని, అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో ఇది అతి ప్రమాదకరమైన ధోరణి అని ఈతని వాదన.

5. బుల్, శాస్త్రీయవాదులు విషయాధ్యయనం కోసం అన్వయించే శాస్త్రీయ పరికరాల (Scientific tools) మీద అనుచితమైన ఆసక్తిని ప్రదర్శించారని అభిప్రాయపడ్డారు. శాస్త్రీయ పద్ధతుల లక్ష్యం ఎంతసేపు సిద్ధాంతీకరణలో ఖచ్చితత్వాన్ని (Precision), పరిమాణాత్మీకరణ (Quantification)ను సాధించటం మీదనే ఉంటుంది. ఇటువంటి ధోరణివలన శాస్త్రీయవాదులున్న విభిన్న సమాజాల మధ్యగల ముఖ్య భేదాలను వీరు విస్మరించటం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

BRAOU

6. బుల్ అభిప్రాయంలో అంతర్జాతీయ సంబంధాల సిద్ధాంతీకరణలో ఖచ్చితత్వాన్ని పాటించవలసిన అవసరం చాలా ఉంది. కానీ శాస్త్రీయతావాదులు సమాచార సేకరణలో మాత్రమే తమ సునిశిత నైపుణ్యాన్ని, ఖచ్చితత్వాన్ని ప్రదర్శించగలుగుతున్నారు. అంతర్జాతీయ సంబంధాల విశ్లేషణలో సరైన నైపుణ్యం, ఖచ్చితత్వం సాంప్రదాయ పద్ధతులద్వారానే రాగలవని అతని అభిప్రాయం.

7. చివరగా హేడ్లీ బుల్ చరిత్ర, తత్వశాస్త్రాలను పరిగణనలోనికి తీసుకొని శాస్త్రీయవాదం నేటి అంతర్జాతీయ సంబంధాలను అవగతం చేసికోవటానికి ఉపకరించదని అభిప్రాయపడ్డారు. ఈతని భావనలో చరిత్ర, తత్వశాస్త్రాలు ఆత్మవిమర్శకు అవకాశం కల్పిస్తాయి. కాని, శాస్త్రీయతావాదులు వీటిని విస్మరించడం వలన సమకాలీన అంతర్జాతీయ విషయాలను విమర్శనాత్మకంగా అధ్యయనం చేయటానికి అవకాశం ఉండదు.

బుల్ రచనకు ప్రతిక్రియగా, శాస్త్రీయవాదానికి అనుకూలంగా, మోర్టాన్ కప్లాన్ "అంతర్జాతీయ సంబంధాల"లో సాంప్రదాయక, శాస్త్రీయవాదనలు ప్రతిష్ఠాత్మకమైన మాతన గర్భ "(The new great debate, Traditions Vs. Science in International Relations)" అన్న వ్యాసంలో బుల్ వాదనలను త్రోసిపుచ్చుతూ, అంతర్జాతీయ సంబంధాలలో శాస్త్రీయ ధృక్పథం ప్రయోజనాన్ని సవివరంగా విశదీకరించారు. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో శాస్త్రీయ పద్ధతుల ఉపయోగానికి సంబంధించి సంప్రదాయవాదులు వెలిబుచ్చిన ఆనేక సందేహాలను ఈయన నివృత్తి చేయటానికి ప్రయత్నించారు.

శాస్త్రీయ ధృక్పథం తత్వశాస్త్రానికి దూరంగా ఉంటుందన్న సాంప్రదాయక వాదుల వాదనను త్రిప్పికొడుతూ, కప్లాన్ సాంప్రదాయక వాదులే తత్వశాస్త్ర సారాంశాన్ని సరిగా అవగాహన చేసుకోకుండా, వారు వెలిబుచ్చే క్రమశిక్షణా రహితమైన ఊహాగానాలను తత్వశాస్త్రమని భావిస్తున్నారని వివరించారు. రేమాండ్ ఆరనీ తప్ప సాంప్రదాయక వాదులలో ఎవరూ తత్వశాస్త్రాన్ని సరిగా అర్థం చేసుకోలేదని కప్లాన్ ఆరోపణ. మానవుడు, మానవజీవితం, మానవ సమాజం గురించి సరిగ్గా అర్థంచేసుకోవాలంటే మానవ ప్రవర్తనను, అప్రవర్తనకు దోహదపడే మూలకారణాలను అర్థంచేసుకోవాలనీ, అట్లా చేయాలంటే ఊహాగానం, ఆత్మ పరిశోధన చాలవని, ప్రజల ప్రవర్తనా ధోరణులను గూర్చి సునిశిత పరిశీలన, విశ్లేషణ చేయనిదే మానవ నైజం గురించి సిద్ధాంతీకరణ చేయటానికి వీలుకాదని కప్లాన్ తెలిపారు. అదే విధంగా శాస్త్రీయ పద్ధతిద్వారా అంతర్జాతీయ సంబంధాలలో ఖచ్చితత్వాన్ని పరిమాణాత్మీకరణను సాధించటానికి అవకాశం ఉండదన్న సనాతనవాదుల విమర్శకు, ప్రతిగా కప్లాన్ ఖచ్చితత్వం అనేది ఆ భోదనాంశంయొక్క స్వభావం, దానియొక్క నైజంపై ఆధారపడి ఉంటుందని, అంతర్జాతీయ సంబంధాల విషయంలో శాస్త్రీయ పరిశీలనకు ఎంతైనా అవకాశం ఉందని గట్టిగా వాదించారు. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో నమూనాల రూపకల్పనను సమర్థిస్తూ కప్లాన్ నేడు సామాజిక శాస్త్రజ్ఞులు అందరూ కూడ వారి వారి విషయాల అధ్యయనం నిమిత్తం నమూనాల రూపకల్పన (Model Building) చేస్తూ ఉన్నారని, నమూనాల రూపకల్పన శాస్త్రీయ పరిశీలనకు చాలా అవసరమని పేర్కొన్నాడు. అంతేగాక కప్లాన్ స్వయంగా వ్యవస్థల సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ అంతర్జాతీయ రాజకీయ వ్యవస్థలకు సంబంధించిన కొన్ని నిర్మాణాత్మక నమూనాలను రూపొందించాడు. వాస్తవానికి సాంప్రదాయక వాదులే వారి నమూనాలను యధార్థాలుగా చిత్రీకరించారని అంతర్జాతీయ దౌత్య, చరిత్ర అంతర్జాతీయ సంబంధాలలో ఆధారరహితమైన నమ్మకాలకు తావిచ్చారని కప్లాన్ పేర్కొన్నారు. అదే విధంగా అనుకోని సంఘటనలు ఆకస్మికంగా జరిగే ఈ రాజకీయ ప్రపంచంలో శాస్త్రీయ పద్ధతులు ఉపకరించవన్న సాంప్రదాయక వాదుల భావనకు వ్యతిరేకంగా, కప్లాన్ ఈ వాదన 17వ శతాబ్దంలోనున్న శాస్త్రీయ పద్ధతుల స్వభావానికి చెందుతుందని పేర్కొన్నారు.

సాంప్రదాయక వాదులందరిలోను ఏకాభిప్రాయం లేనట్లే శాస్త్రీయ వాదులలో కూడా ఏకాభిప్రాయం లేదు. అయినప్పటికీ కొన్ని సామాన్య అభిప్రాయాలను ఆధారంగా చేసుకొని సాంప్రదాయక వాదులనుండి శాస్త్రీయకారులను, శాస్త్రీయవాదులనుండి సాంప్రదాయక వాదులను వేరుచేయవచ్చు. సాంప్రదాయక వాదులు జాతిరాజ్యాలకు,

BRAOU

సార్వభౌమత్వ సిద్ధాంతానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వగా, శాస్త్రీయవాదులు ప్రవర్తనా వాదానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. ఇతర సామాజిక శాస్త్రాలలాగే అంతర్జాతీయరంగంలో వ్యక్తుల ప్రవర్తనను పరిశీలించవలసి వుందని శాస్త్రీయవాదుల విశ్వాసం. నేడు కాకపోయినప్పటికీ దేనైనా యావత్ అంతర్జాతీయ సమాజం గురించి సార్వజనీన సిద్ధాంతాన్ని రూపొందించగలమన్న విశ్వాసం వారికుంది. అటువంటి సిద్ధాంతం కేవలం ఒకే ఒక రంగానికి చెందినది కాకుండా సామాజిక శాస్త్రాలన్నింటికీ వర్తించగలదని, అందువలన అంతర్జాతీయ సంబంధాలను కూడ అన్ని దృక్పథాలనుండి సమగ్రంగా పరిశీలించవలసి ఉందనీ, అందుకోసం చరిత్ర, న్యాయశాస్త్రం, అర్థశాస్త్రం, సమాజశాస్త్రం, రాజనీతిశాస్త్రం, మనోవైజ్ఞానిక శాస్త్రం మొదలైన సామాజిక శాస్త్రాలన్నీ దోహదపడగలవని వీరి అభిప్రాయం. సార్వజనీన సిద్ధాంతాన్ని రూపకల్పన చేయడానికి ముందు వివిధ రంగాలకు, వివిధ పరిసరాలకు అనువర్తింపగల పౌషిక సిద్ధాంతాలను రూపకల్పన చేయవలసి వుందని వీరి నమ్మకం. సమాచార సేకరణకంటె సమాచార విశ్లేషణ ముఖ్యమనీ, సమాచార సేకరణలో కూడ ఎంత లేదన్నప్పటికీ, శాస్త్రకారుని వ్యక్తిగత విలువలు చోటుచేసుకొంటూనే వుంటాయని సాంప్రదాయవాదులు పేర్కొంటూ ఉంటారు. దానికి సమాధానంగా శాస్త్రీయవాదులు తమ పరిశోధనలను గణాంక పద్ధతులు, విషయ విశ్లేషణ మున్నగు పద్ధతులద్వారా కృతకృత్యులైన పిమ్మట వాటిని పదే పదే పరిశీలించడానికి ప్రయత్నిస్తామని, ఆ పిమ్మట సంధిగ్ధావస్థకు తావులేకుండా విస్తృతమైన సిద్ధాంతీకరణ చేయగలమని సమాధానం ఇచ్చారు.

సాంప్రదాయ వాదుల, శాస్త్రీయకారుల వాదనలను పరిశీలించి, వీరిలో ఎవరు ఎక్కువగా అంతర్జాతీయ సంబంధాల అభివృద్ధికి కృషిచేశారో బేరీజు వేయటం చాలా కష్టం. అటు సాంప్రదాయవాదులు, ఇటు శాస్త్రీయవాదులు తమ శక్తికొలదీ అంతర్జాతీయ సంబంధాల సమగ్రపరిశీలనకు ఇతోధిక కృషి జరిపారన్న విషయంలో భిన్నాభిప్రాయానికి తావులేదని చెప్పవచ్చు. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో సాంప్రదాయక వాదులు తాత్విక ఆలోచనకు, విశ్లేషణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వగా; శాస్త్రీయవాదులు అధ్యయన పద్ధతులకు శాస్త్రీయ సిద్ధాంతాల రూపకల్పనకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. శాస్త్రీయవాదుల రాకతో అంతర్జాతీయ సంబంధాల పరిధి విస్తృతం కావటం జరిగింది. అంతవరకు సాంప్రదాయక వాదుల ఆధ్వర్యంలో సర్వసత్తాక రాజ్యాల అధ్యయనానికే పరిమితమైన అంతర్జాతీయ సంబంధాలు, శాస్త్రీయవాదుల ఆగమనంతో సర్వసత్తాక రాజ్యాల అధ్యయనంతోపాటు భూమండలానికి సంబంధించిన సమస్యలను, ప్రపంచ వ్యవస్థలను, రాజ్యంలోపల, రాజ్యాలమధ్య సంబంధాలకు సంబంధించిన వ్యక్తుల, సమూహాల ప్రవర్తనను అధ్యయనంచేసే ఉన్నతస్థాయికి చేరుకోవడం జరిగింది. రాల్ఫ్ పేట్‌మాన్ (Ralph Pettman) పేర్కొన్నట్లుగా, శాస్త్రీయవాదుల రాకతో అంతర్జాతీయ సంబంధాలు ఊర్ధ్వముఖం (Upwards)గా భూమండలం, భూమండల రాజకీయాలను, అధోముఖం (downwards)గా వ్యక్తి లేక సమూహాల ప్రవర్తనను అధ్యయనం చేయగలిగే విస్తృత స్థాయికి చేరుకోవడం జరిగింది. అదే విధంగా అంతవరకు అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో ప్రాధాన్యత పొందిన తత్వశాస్త్రం, చరిత్ర, న్యాయశాస్త్రాల స్థానంలో సామాజిక శాస్త్రం, మనో విజ్ఞానశాస్త్రం, జీవశాస్త్రం, భౌతికశాస్త్రం, ఇంజనీరింగ్, గణితశాస్త్రం మొదలైన ఆధునిక విజ్ఞానశాస్త్రాలు అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి అవసరమైన సమూనాలను, భావాలను అందజేయడం జరుగుతోంది.

శాస్త్రీయవాదులలో ప్రవర్తనా వాదులు మరింత ముందుకుపోయే ప్రయత్నం చేసి కొన్ని కొన్ని రంగాలలో గణనీయమైన కృషిచేశారు. అంతర్జాతీయ రాజకీయవ్యవస్థ ఎన్నిరకాలుగా రూపాంతరం చెందగలదో మోర్టాన్ కప్లాన్, డేవిడ్ ఈస్టన్ ప్రభృతులు వివరించారు. గణితశాస్త్రం, ఆర్థికశాస్త్రాలలో రూపొందిన క్రీడా సిద్ధాంతం (Games Theory) ఆధారంగా ప్రపంచంలోని వివిధ వైషమ్యాలను, యుద్ధ పరిస్థితులను పరిశీలించే ప్రయత్నాలు జరిగాయి. కారల్ డూయిష్ (Karl Deutscu) అభివృద్ధి చేసిన ప్రసార సిద్ధాంతం ప్రభుత్వ నిర్వహణలో సమాచార ప్రసరణ ఆధారంగా అంతర్జాతీయ సంబంధాలను వివరించే ప్రయత్నం చేసింది. జారిజరిస్కా, మరియు జార్జి కాట్లిన్ ప్రభృతులు "సమతా సిద్ధాంతం" (Equilibrium Theory) ఆధారంగాను, రిచర్డ్ స్నైడర్, జేమ్స్ రోసెనా (James

BRAOU

Rosenau), హెచ్.డబ్ల్యు. బ్రూక్ (H.W. Bruck), బర్టన్ సపిన్ (Burton Sapin)లు నిర్ణయకల్పనా సిద్ధాంతం ఆధారంగాను, అంతర్జాతీయ సంబంధాలను నిశితంగా పరిశీలించారు. ఇదే విధంగా అనేకమంది శాస్త్రీయతావాదులు తమ కుశాగ్రబుద్ధితో అంతర్జాతీయ సంబంధాలకు సంబంధించిన వివిధరంగాలను పరిశీలించి పౌషిక సిద్ధాంతాలను రూపొందించగలిగారు. కాని వీరెవరూ కూడా అంతర్జాతీయ రంగానికి సంబంధించి పరిపూర్ణమైన సిద్ధాంతాన్ని నేటివరకు రూపొందించలేకపోయారు. వారికి కూడా ఈ సంగతి తెలుసు. అందువల్లే అంతర్జాతీయ సంబంధాలకు సంబంధించిన అన్నిరంగాలలోను పౌషిక సిద్ధాంతాలను పరిపక్వదశకు తీసుకొనివచ్చిన పిమ్మట వాటిని సమగ్రపరచి సమీప భవిష్యత్తులో పరిపూర్ణ సిద్ధాంతాన్ని రూపొందించగలమని వారి విశ్వాసం. సాంప్రదాయక వాదుల వలె కేవలం, ఊహాగానాలపై ఆధారపడకుండా; కార్యరంగంలో ప్రవేశించి, రాజకీయ పరిస్థితులనన్నింటిని, స్వయంగా పరిశీలించి, ఆకళింపు చేసుకొని, ఏ చిన్న విషయాన్ని విస్మరించకుండా, అనుభవపూర్వకంగా కొన్నిచోట్ల పరిశోధనలు జరుపుతూ, లభించిన ఫలితాల ఆధారంగా తిరిగి కార్యరంగంలో పదే పదే ప్రయోగపూర్వకంగా పరిశీలనలు జరిపి ఆ పిమ్మట సిద్ధాంతీకరణ చేయాలన్నది శాస్త్రీయవాదుల అభిప్రాయం. డేవిడ్ సింగర్ (David Singer) చెప్పినట్లు తెలివితేటలకు, సునిశిత మేధాశక్తికి, శాస్త్రీయ పద్ధతి ప్రత్యామ్నాయం కాదు. కాని శాస్త్రీయ ధృక్పథాన్ని, సనాతన పద్ధతులతో మేళవించినట్లైతే విజ్ఞాన పురోభివృద్ధికి దోహదం చేసినట్లౌతుంది.

జాన్ బర్టన్ (John Burton) అభిప్రాయంలో సాంప్రదాయకవాదులు ప్రపంచ సమాజం అనేది శక్తి రాజకీయాలవల్ల ప్రభావితం అవుతూ ఉంటుందని భావిస్తారు. వీరి అభిప్రాయంలో అంతర్జాతీయ సంఘర్షణ అనేది స్వాభావికమైనది. ఈ సంఘర్షణను సమతుల్య ప్రాబల్యతా స్థితిద్వారా పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని వీరు అభిప్రాయపడ్డారు. ఈ శక్తి రాజకీయాల వలననే సమతుల్య ప్రాబల్యం, తటస్థవిధానం, సంధులు (Alliances) వంటి సిద్ధాంతాలు రూపొందాయని సాంప్రదాయక వాదులు భావిస్తారు. ఇందుకు ప్రతిగా సార్వభౌమత్వం, జాతీయత, దురహంకారం, సిద్ధాంత విభేదాలు మాత్రమే అశాంతికి, సంఘర్షణకు మూలకారణాలు కావని, మారుతున్న అంతర్గత రాజకీయ పరిస్థితులతో వివిధ రాజ్యాలు సమాధాన పడలేకపోవటమే ప్రపంచంలో అస్థిరతకు, అశాంతికి మూలకారణమని ప్రవర్తనావాదుల భావన. వివిధ నిర్ణయ నిర్ణేతల మధ్య సుహృద్భావం పెంచగల ప్రసార ప్రక్రియలను పెంపొందించడం ద్వారా శత్రుత్వానికి బదులు మిత్రత్వం పెంచవచ్చని, బలప్రయోగంద్వారా కాకుండా క్రియాత్మక, సృజనాత్మక పద్ధతులద్వారా అధికారాన్ని నిలుపుకోవచ్చని ప్రవర్తనావాదుల నమ్మకం.

సాంప్రదాయక ధృక్పథానికి చెందిన వాస్తవిక వాదులు కానీ, ఆదర్శవాదులుకానీ అంతర్జాతీయ సంబంధాలను సరిగా అర్థంచేసుకొనలేక పోయారని, వాటిని సమన్వయపరుస్తూ కేవలం మానవ ప్రవర్తన ఆధారంగా అంతర్జాతీయ సంబంధాలను సమగ్రంగా అర్థంచేసుకొన వీలుందని శాస్త్రీయవాదులు భావించారు. ఈ రకమైన శాస్త్రీయవాదుల ఆగమనంతో, అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో అంతవఱకు నెలకొన్న వాస్తవికవాదం, ఆదర్శవాదాల మధ్యనున్న విభేదాల అంతరం చాలావరకు తగ్గి, అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహించాలా? లేక శాస్త్రీయ పద్ధతుల ప్రభావంనుండి అంతర్జాతీయ సంబంధాల అధ్యయనాన్ని పరిరక్షించాలా? అన్న వాదనకు ఎక్కువ ప్రాధాన్యం వచ్చింది. •ఆదర్శవాదులు, వాస్తవిక వాదులు తమ మధ్యనున్న విభేదాలను తాత్కాలికంగా పక్కకునెట్టి శాస్త్రీయవాదుల దాడిని ఎదుర్కోటానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అంతేకాకుండా ఈ మధ్య అంతర్జాతీయ రంగంలో అనూహ్యమైన మారణహోమాన్ని సృష్టించగల అణ్వాయుధాల ఉత్పత్తితో ప్రాముఖ్యత పెరిగిన 'అంతర్జాతీయ శాంతి' కారణంగా, శాస్త్రీయ వాదుల మధ్య మరో క్రొత్త వివాదం మొదలైంది. అది ఏమిటంటే, 1. విలువరహితమైన (Value - free) శాస్త్రీయ పరిశోధన, వివరణ లక్ష్యంగా అంతర్జాతీయ సంబంధాల అధ్యయనం ఉండాలని కొందరు శాస్త్రీయవాదులు వాదించగా, మరికొందరు, 2. పరిశోధన అనేది శాస్త్రీయమైందిగాను, దృగ్విషయాల వివరణకు ప్రాధాన్యతనిచ్చేదిగాను ఉండటమే కాకుండా అది విలువలతో కూడి ఉండి సమాజానికి ఎంతవఱకు ఉపయుక్తంగా ఉండగలదు? అన్న విషయానికి కూడ తగిన గుర్తింపునివ్వాలని వాదించటం జరుగుతోంది.

BRAOU

2.7.0 సాంప్రదాయకవాద ధృక్పథాలు

సాంప్రదాయకవాద ధృక్పథాలలో కొన్ని ముఖ్యమైనవాటిని సంక్షిప్తంగా పరిశీలిద్దాం అవి :

2.7.1 చారిత్రక ధృక్పథం (Historical Approach)

సాంప్రదాయక ధృక్పథాలలో ముఖ్యమైనవి చారిత్రక ధృక్పథం. వాస్తవానికి 'అంతర్జాతీయ సంబంధాల' అభివృద్ధి తొలిదశలో చారిత్రక ధృక్పథం ద్వారానే అంతర్జాతీయ రంగంలోని దృగ్విషయాలను వివరించటం లేదా అర్థం చేసుకోవటం జరిగేది. గతం లేనిదే వర్తమానం లేదు. గతాన్ని కాలక్రమంలో (Chronological Order) వివరించేది చరిత్ర కాబట్టి గత విషయాలను, అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వర్తమాన సంఘటనలను అర్థంచేసుకోవటం, భవిష్యత్తుకు సంబంధించి ప్రణాళికలు రూపొందించటం ధృక్పథం ముఖ్యలక్షణం. రాజ్యాల పుట్టుపూర్వోత్తరాలను, వివిధ రాజనీతి సిద్ధాంతాల, భావనల పుట్టుకను, అభివృద్ధిని చరిత్రకారుల మరియు రాజనీత సిద్ధాంతకారుల రచనలద్వారాను, రాజనీతిజ్ఞుల జ్ఞాపకాల సంపుటుల (memoirs) ద్వారాను, స్వీయచరిత్రలద్వారాను తెలిసికోవటం జరుగుతుంది. ఈ రకమైన గత అనుభవాలను తెలుసుకోవటంద్వారాను సమకాలీన అంతర్జాతీయ రంగంలోని దృగ్విషయాలను అర్థంచేసుకోవటానికి, వివిధ అంతర్జాతీయ వ్యవస్థలలోని పాట్లను అవగతం చేసుకోవటానికి, తద్వారా వాటిని సరిదిద్దటానికి ధృక్పథం సహాయకారిగా ఉంటుంది.

2.7.2 తాత్విక లేదా దార్శనిక ధృక్పథం (Philosophical Approach)

దీనినే నైతిక ధృక్పథం (Ethical Approach) అని కూడ పేర్కొంటారు. అంతర్జాతీయ రాజకీయాలలో ఏది మంచి? ఏది చెడు? అంతర్జాతీయ సమాజంలో ఏయే లక్ష్యాలను సాధించటానికి ఏ మార్గాలను లేక ఏ సాధనాలను ఉపయోగించాలి? మొదలైన నైతికపరమైన అంశాలను గురించి చర్చించేదే దార్శనిక ధృక్పథం. ఈ ధృక్పథం ముఖ్యంగా ఊహాజనితమైందని చెప్పవచ్చు. అంతర్జాతీయ రంగంలోని వాస్తవ సంఘటనలపట్ల దార్శనికుల స్పందన ఆధారంగా తమ మేధా సంపత్తితో అత్యున్నతమైన లక్ష్యాలను నిర్దేశించటానికి, సమకాలీన అంతర్జాతీయ వ్యవస్థ కంటె ఉన్నతమైన అంతర్జాతీయ వ్యవస్థను ఊహించి, నిర్మాణాత్మకంగా రూపొందించటానికి ఉన్న వివిధ మార్గాలను అన్వేషించటానికి ఈ ధృక్పథం దోహదపడుతుంది. అంతేకాకుండా అంతర్జాతీయ రంగంలోని వివిధ సంఘటనలను వివరించటానికి వాడే భావనలు, పదాల అర్థాలను సందిగ్ధత లేకుండా విశదీకరించడానికి కూడా ఈ ధృక్పథం ప్రాధాన్యతనిస్తుంది.

ఈ ధృక్పథాన్ని అర్థంచేసుకొనే ప్రఖ్యాత జర్మనీ తత్వవేత్త ఇమ్మాన్యువల్ కాంట్ శాశ్వతమైన అంతర్జాతీయ శాంతిని సాధించటానికి 'ప్రపంచ సమాఖ్యను' ఊహించగా ఫ్రెంచి తత్వవేత్త రూసో, బ్రిటిష్ తత్వవేత్త టి.హెచ్. గ్రీన్‌లు యుద్ధోన్మాదాన్ని నిరసించి అంతర్జాతీయ రంగంలో 'స్వేచ్ఛ' విజయంపట్ల తమ ఆకాంక్షను వ్యక్తీకరించినారు. వారి అభిప్రాయంలో రాజ్యం అంతర్జాతీయ రంగంలో నైతిక విలువలను పెంపొందించే ఒక సాధనం. ఈ ధృక్పథం ఊహాజనితం కావటంవలన 'అమూర్తమంతం' (abstruct) గాను, వాస్తవాలకు దూరంగాను ఉంటుందన్న విమర్శ ఉన్నప్పటికీ రాజకీయాలలో ఉన్నతమైన విలువలను ప్రోత్సహించేదిగా దీనికి 'అంతర్జాతీయ సంబంధాల'లో ఎక్కువ ప్రాముఖ్యతనివ్వటం జరిగింది.

2.7.3 న్యాయ ధృక్పథం

ఈ ధృక్పథం ప్రకారం అంతర్జాతీయ రంగంలో ఉన్న వివిధ రాజ్యాల ప్రవర్తనను కొన్ని నియమాలు లేదా సూత్రాలద్వారా నియంత్రించగలిగినపుడు అంతర్జాతీయ శాంతి భద్రతలను సాధించటానికి అవకాశం ఉంటుంది.

BRAOU

అంతర్జాతీయ రంగాన్ని నియంత్రించే ఈ నియమాలను లేదా సూత్రాలనే మనం అంతర్జాతీయ న్యాయంగా పేర్కొనవచ్చు. ఆయా పరిస్థితులలో రాజ్యాలు ఏ విధంగా ప్రవర్తించాలి? రాజ్యాల మధ్య వివాదాలు వచ్చినపుడు వాటిని ఏ మార్గాలద్వారా పరిష్కరించాలి? మొదలైన విషయాలకు సంబంధించి వివిధ అంశాలు 'అంతర్జాతీయ న్యాయము' లో పొందుపరచబడి ఉంటాయి. అంతేకాకుండా కాలక్రమేణా అంతర్జాతీయ సమాజములోని వివిధ రాజ్యాలు తమ మధ్య కుదుర్చుకున్న వివిధ ఒప్పందాలు - నానాజాతి సమితి ఒడంబడిక, జెనీవా ప్రోటోకోల్ 1925, ఐక్యరాజ్యసమితి చార్టరు చట్టం మొ॥వి అంతర్జాతీయ న్యాయంలో అంతర్భాగంగా పరిగణింపబడి, ఆ తరువాతికాలంలో ఆయా రాజ్యాల ప్రవర్తనను నిర్దేశిస్తూ ఉంటాయి. హ్యూగ్రోషియస్, జెర్మీ బెంథాం, ప్వీన్స్‌వైట్, మార్టిన్‌వైట్ (Martin Wright) వంటి రచయితలు అంతర్జాతీయ సమాజంలో ప్రతి రాజ్యం తన జాతీయ ప్రయోజనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నంలో వివాదాలకు, సంఘర్షణలకు అవకాశము ఇవ్వవచ్చునని, కాబట్టి వాటిని శాంతియుతంగా పరిష్కరించటానికి ఒక ఉపయుక్తమైన న్యాయవ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. రాజ్యాల మధ్య వివాదాలు తలెత్తినపుడు అంతర్జాతీయ న్యాయసూత్రాలు ఆధారంగా ఆ వివాదాలను పరిష్కరించగలిగినపుడు యుద్ధాలకు అవకాశం లేని అంతర్జాతీయ సమాజాన్ని స్థాపించవచ్చని వీరు భావించారు.

2.7.4 సంస్థాగత ధృక్పథం (Institutional Approach)

పైన పేర్కొన్న న్యాయ ధృక్పథాన్ని ఆచరణలోనికి తీసుకొని రావటంద్వారా రూపొందించినదే సంస్థాగత ధృక్పథం. ఇది లాంఛనప్రాయమైన సంస్థల ఏర్పాటుకు, వ్యవస్థల రూపకల్పనకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. అంతర్జాతీయ నియమాలను, న్యాయ సూత్రాలను రూపొందించుటమే కాకుండా వాటిని ఆచరణలోనికి తీసుకొని రావటానికి అవసరమైన సంస్థాగత ఏర్పట్లను చేసినపుడే అంతర్జాతీయంగా శాంతి భద్రతలను నెలకొల్పటానికి అవకాశముంటుందని ఈ ధృక్పథం వివరిస్తుంది. ఈ ధృక్పథం ఆధారంగానే మొదటి ప్రపంచయుద్ధం తరువాత నానాజాతి సమితి, రెండవ ప్రపంచయుద్ధం తరువాత ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలను అంతర్జాతీయ సమాజంనుండి యుద్ధోన్మాదంనుండి తొలగించి, అంతర్జాతీయ శాంతి భద్రతలను నెలకొల్పటానికి ఏర్పాటుచేయటం జరిగింది. ఈ రకమైన అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుద్వారా అంతర్జాతీయ సంఘర్షణలను నివారించవచ్చునని, ఏవైనా వివాదాలు తలెత్తినప్పటికీ వాటిని శాంతియుత పద్ధతులద్వారా పరిష్కరించుకొనవచ్చుననీ భావించటం జరిగింది. అంతేగాక రాజ్యాలమధ్య సత్సంబంధాలను, స్నేహసహకారాలను నెలకొల్పటానికి, అంతర్జాతీయంగా సుహృద్భావ వాతావరణాన్ని, న్యాయబద్ధమైన ఆర్థికాభివృద్ధిని సాధించటానికి ఇటువంటి అంతర్జాతీయ సంస్థలు దోహదపడగలవని అభిప్రాయపడ్డారు.

2.8.0 శాస్త్రీయవాద ధృక్పథాలు

ఇపుడు శాస్త్రీయవాద ధృక్పథాలలో ప్రధానమైనవాటిని కొన్నింటిని మనం సంక్షిప్తంగా పరిశీలిద్దాం..అవి:

2.8.1 వ్యవస్థా ధృక్పథం (Systems Approach)

ఇరవైయ్యో శతాబ్దం తొలిదశలో సామాజిక శాస్త్రాలలో వచ్చిన ప్రవర్తనావాద విప్లవ ఫలితంగా అభివృద్ధి చెందిన ధృక్పథాలలో వ్యవస్థా ధృక్పథం ఒకటి. ఇది మొదటగా 1920 దశకంలో జీవశాస్త్రంలో లుడ్విగ్‌వాన్ బార్తలాన్ఫీ అనే శాస్త్రజ్ఞుని రచనలలో గోచరించినప్పటికి, రెండవ ప్రపంచయుద్ధం తరువాత రాజనీతి శాస్త్రంలోను, 'అంతర్జాతీయ సంబంధాల'లోను ఒక ముఖ్యమైన ధృక్పథంగా, సిద్ధాంతంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 'అంతర్జాతీయ సంబంధాలలో' ఈ ధృక్పథాన్ని అన్వయించి, దానిని ప్రాచుర్యంలోనికి తీసుకొనివచ్చిన వ్యక్తి మోర్టాన్ కప్లాన్. 1950 దశకంలో ఈ ధృక్పథాన్ని అంతర్జాతీయ సమాజానికి అన్వయించడంద్వారా కప్లాన్, 6 రకాలైన అంతర్జాతీయ వ్యవస్థలను

BRAOU

వివరించారు. అవి 1. ప్రాబల్య సమతుల్య వ్యవస్థ 2. సరళ ద్విధ్రువ వ్యవస్థ 3. ధృడ ద్విధ్రువ వ్యవస్థ 4. సార్వత్రిక అంతర్జాతీయ వ్యవస్థ. 5. క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థ 6. ఏక నిష్ఠిద్ధ వ్యవస్థ. కానీ ఆ తరువాత 1960 దశకంలో అంతర్జాతీయ రంగంలో వచ్చిన నూతన పరిమాణాలు ఆధారంగా కప్లాన్ మరో నాలుగు క్రొత్త అంతర్జాతీయ వ్యవస్థలను రూపొందించారు. అవి 1. అత్యంత సరళీకృత ద్విధ్రువ వ్యవస్థ (The Very lose Bi-Polar System) 2.అంతర్జాతీయ సామనస్య వ్యవస్థ (The Detente System) 3. అస్థిరత్వవర్గ వ్యవస్థ (Unstable Bloc System) 4.అసంపూర్ణ అణ్వాస్త్ర విస్తరణ వ్యవస్థ (Incomplete Nuclear Diffusion System).

వ్యవస్థా ధృక్పథం అంతర్జాతీయ రంగంలోని దృగ్విషయాలను అధ్యయనం చేయటానికి, విశ్లేషణకు ఒక సమగ్ర ధృక్పథాన్ని అభివృద్ధి చేయటానికి దోహదం చేసింది. అంతర్జాతీయ సంఘటనలను ఏదో ఒక ప్రత్యేక శాస్త్రానికి సంబంధించిన దృష్టితోకాక, వివిధ శాస్త్రాల అంతర్వర్గీయ అధ్యయనాన్ని (Inter Disciplinary Study) ఇది ప్రోత్సహించింది. వ్యవస్థా ధృక్పథాన్ని గురించి తరువాత అధ్యాయంలో 'వ్యవస్థా సిద్ధాంతం' అన్న శీర్షిక క్రింద సమగ్రంగా చర్చించడం జరిగింది.

2.8.2 నిర్ణయ కల్పనా ధృక్పథం (Decision - Making Approach)

ఇది అంతర్జాతీయ రంగంలోని దృగ్విషయాలను నిర్ణయకల్పన ప్రక్రియలద్వారా వివరించడానికి ప్రయత్నం చేస్తుంది. 'అంతర్జాతీయ సంబంధాల'లో దీనిని రిచర్డ్ సి. స్నైడర్, మరియు అనుయాయులు హెచ్.డబ్ల్యు. బ్రూక్, బర్టన్ సపిన్, హెరాల్డ్ లాస్వెల్, బెర్నార్డ్ కొహెన్ మొదలైన రచయితలు వివరించి, ప్రాచుర్యంలోనికి తీసుకొనివచ్చారు.

BRAOU

రిచర్డ్ సి. స్నైడర్ నిర్ణయ కల్పనా ధృక్పథాన్ని 'అంతర్జాతీయ సంబంధాల'లో విదేశాంగ విధాన రూపకల్పనకు అధ్యయనం చేయటానికి అన్వయించారు. ఈయన అభిప్రాయంలో విదేశ వ్యవహారాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవటంలో నిర్ణయ నిర్ణేతలు మూడురకాలైన పరిసరాల వలన ప్రభావితులౌతారు. అవి 1. ఆంతరంగిక పరిస్థితి: ప్రజాభిప్రాయం, ప్రజల విలువలు, సామాజిక వ్యవస్థ లక్షణాలు మొ॥వి. 2. బాహ్య పరిస్థితి : ఇతర రాజ్యాల నిర్ణయ నిర్ణేతల స్పందన, ప్రతిచర్యలు, భౌతిక ప్రపంచం మొ॥వి.3. నిర్ణయ కల్పనా ప్రక్రియ : పాత్రలు (Roles), నియమాలు, సమాచార ప్రసార సాధనాలు, వ్యవస్థల లక్ష్యాలు మొ॥వి. విదేశాంగ విధాన రూపకల్పన అనేది ఈ మూడురకాలైన కారణాలవలన ప్రభావితం కావటంద్వారా నిర్ణయ నిర్ణేతలు రూపొందించటం జరుగుతుందని స్నైడర్ మరియు అతని అనుయాయులు భావించారు.

ఇక నిర్ణయకల్పనా ప్రక్రియలకు సంబంధించి హెరాల్డ్ లాస్వెల్ ఏడురకాలైన విధాయక దశలను గుర్తించాడు. అవి 1. విషయ సేకరణ (Information) 2. సిఫారసు చేయటం (Recommendation) 3. నిర్ణయించడం (Prescription) 4. ఆవాహన చేయడం (Invocation) 5. అమలుచేయడం (Application) 6. సమీక్ష (Appraisal) 7. ఉపసంహారం (Termination). నిర్ణయ కల్పన చేయడంలో ఏడురకాలైన దశలు ఉంటాయని లాస్వెల్ భావించారు.

అంతర్జాతీయ సంబంధాలలో ఇది ఒక సమగ్రమైన ధృక్పథంగా పరిగణింపబడక పోయినప్పటికీ, వివిధ దేశాల విదేశాంగ విధానాలను తులనాత్మకంగా పరిశీలించటానికి నిర్ణయ కల్పనా ధృక్పథం సహాయకారిగా ఉపయోగపడుతుంది.

2.8.3 ప్రసార ధృక్పథం (Communications Approach)

అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో ఇంకొక ప్రధానమైన శాస్త్రీయ ధృక్పథం, ప్రసార ధృక్పథం. ప్రకృతి శాస్త్రాల విజ్ఞానాన్ని, మెకానికల్ ఇంజనీరింగులోని ప్రగతిని రాజకీయ దృగ్విషయాల అధ్యయనానికి అన్వయించడంద్వారా రూపొందించబడినదే ప్రసార ధృక్పథం. ఈ ధృక్పథం ప్రకారం సామాజిక రాజకీయ ప్రక్రియలను సమాచార ప్రసరణ ఆధారంగా వివరించవచ్చు. ఏ రాజకీయ వ్యవస్థ అయినప్పటికీ దాని సక్రమ నిర్వహణకు సరియైన సమాచారం అనేది వ్యవస్థ బయటినుండి, అంతర్గతంగాను కూడ చేరవలసిన ఆవశ్యకత ఉంది. అంతేగాక వ్యవస్థలోని వివిధ విభాగాల మధ్య విభిన్నస్థాయిల (Channels) మధ్య సరియైన సమాచార ప్రసరణ జరగవలసిన అవసరం ఉంది. అపుడే వ్యవస్థ ప్రజావసరాలకు, అభిమతాలకు అనుగుణంగా తగిన నిర్ణయాలను తీసుకోవటానికి, బయటి పరిసరాల ప్రభావానికి తగిన విధంగా స్పందించటానికి అవకాశం ఉంటుంది. ఆ విధంగా వ్యవస్థ సమర్థత అనేది ఆ వ్యవస్థకు చేరే సమాచార ప్రసరణ మీద కూడ చాలావఱకు ఆధారపడి యుంటుంది.

ప్రసార ధృక్పథాన్ని అభివృద్ధిచేసిన వారిలో డబ్ల్యు. రాస్ ఆష్బి (W. Ross Ashby), నార్బర్ట్ వీనర్ (Norbert Weiner), జార్జిమిల్లర్ (George Miller), కారల్ డాయిష్ (Karl Deutscu)లను ప్రముఖులుగా పేర్కొనవచ్చు. కారల్ డాయిష్ అభిప్రాయంలో ప్రసారసాధనాల సమ్మేళనమే రాజకీయ వ్యవస్థ. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలకు, ప్రజల స్పందనను ప్రభుత్వానికి తెలియజేసే ప్రసార సాధనాలవలననే రాజకీయ వ్యవస్థ సక్రమంగా పనిచేయగలుగుతుంది. ఇంజనీరింగు యంత్రం ఏ విధంగా ఇంధనం మీద ఆధారపడి పనిచేస్తుందో అదేవిధంగా రాజకీయ వ్యవస్థ కూడ సమాచార ప్రసార ప్రాతిపదిక మీద ఆధారపడి చర్యోన్ముఖమవుతుంది. సమాచార ప్రసారంలో వచ్చే మార్పులు రాజకీయ వ్యవస్థ వ్యవహార సరళిపై కూడ తమ ప్రభావాన్ని చూపిస్తాయి. కాబట్టి రాజకీయ వ్యవస్థ నిర్ణయ కల్పన ప్రక్రియ పై ఆధారపడి ఉంటుంది. సరైన సమాచారం సరైన సమయంలో రాజకీయ వ్యవస్థను చేరినపుడే చోటుచేసుకొనే పొరబాట్లు రాజకీయ వ్యవస్థ నిర్ణయ కల్పనను ప్రభావితం చేస్తాయి.

ప్రసార పద్ధతిని అవగాహన చేసుకోవటానికి వివిధ భావనల (Concepts)ను రూపొందించటం జరిగింది. వివిధ ప్రక్రియలు, మాధ్యమాలద్వారా సమాచారాన్ని రాజకీయ వ్యవస్థకు చేరవేసే వాటిని 'సాధనాల' (Channels) ని, ఏదైనా ఒక నిర్ణీత సమయంలో వ్యవస్థ స్వీకరించే సమాచారాన్ని 'భారం' (Load) అని, సమాచారం పట్ల వ్యవస్థ స్పందనను, వివిధ ప్రక్రియలద్వారా సరియైన సమాచారాన్ని సేకరించే సామర్థ్యాన్ని 'భార సామర్థ్యత' (Load Capacity) అని పిలుస్తారు. అదే విధంగా సమాచారం చేరిన తరువాత, నిర్ణయాలు, చర్యలు తీసుకోవటానికి పట్టే సమయాన్ని విరామం (Lag) అని, అందిన సమాచారం ఆధారంగా భవిష్యత్ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని వ్యవస్థ స్పందించే సమర్థతను చొరవ (Lead) అని, సమాచారం పట్ల వ్యవస్థ స్పందన ఆధారంగా రాజకీయ వ్యవస్థ పొందే ప్రయోజనాన్ని 'లాభం' (Gain) అని పేర్కొంటున్నారు. అందిన సమాచారం ఆధారంగా తీసుకొన్న నిర్ణయాలను ఉత్పాదితాలు (Out Puts) అని, నిర్ణయాలపట్ల ప్రజల, పరిసరాల ప్రతిస్పందన (Response) ను తెలియజేసే సమాచారాన్ని స్పందిత సమాచారం (Feed back) అని పిలవటం జరుగుతున్నది.

అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో ఈ ప్రసార ధృక్పథం చాలా ముఖ్యమైందిగా పరిగణింపబడింది. రక్షణకు సంబంధించిన విశ్లేషణ, అధ్యయనాలలోను, ప్రపంచ సంస్కృతి ఆవిర్భావంలోను, ఆధునీకరణ, ప్రగతి విషయాలలోను ప్రసార ధృక్పథం పాత్ర చాల ప్రాధాన్యతను సంతరించుకుంది. అంతర్జాతీయ రంగంలోని మిగిలిన రాజ్యాలకు సంబంధించి తనకు చేరిన సమాచారం ఆధారంగానే ఒక రాజ్యం తన విదేశాంగ విధానాన్ని, అంతర్జాతీయ రంగంపట్ల తన వైఖరిని నిర్ణయించుకొంటుంది. అదేవిధంగా రెండు శత్రురాజ్యాలమధ్య ఆయుధీకరణకు సంబంధించి వెలువడే సమాచారం ఆధారంగానే ప్రతి రాజ్యం తన శత్రురాజ్యం కంటె ఎక్కువగా ఆయుధాలను సమకూర్చుకోవటానికి, తద్వారా ఆయుధపోటీకి దోహదం చేయటానికి అవకాశం ఉంటుంది.

BRAOU

2.8.4 క్రీడా సిద్ధాంతం (Games Theory)

రాజకీయ దృగ్విషయాల అధ్యయనానికి గణితశాస్త్ర సమీకరణాలను అన్వయించటంద్వారా రూపుదిద్దుకొన్న ధృక్పథం క్రీడా సిద్ధాంతం. దీనిని ఇరవైయ్యో శతాబ్దం తొలిదశలో న్యూమాన్ (New Man), ఆస్కార్ మార్గెన్ స్టెర్న్ (Oskar Morgen Stern) లు ఆర్థికశాస్త్రంలో అభివృద్ధి చేసినప్పటికీ రెండవ ప్రపంచయుద్ధంలో, తరువాతి రాజనీతి శాస్త్రంలో ఈ సిద్ధాంతాన్ని అభివృద్ధిచేసిన ఘనత డంకన్ లేస్ (Duncan Lace), హెరాల్డ్ రైఫర్ (Harold Raiffer), మార్టిన్ షుబిక్ (Martin Shubbik), అనటోల్ రాపోపోర్ట్ (Antol Rapoport)లకు చెందుతుంది. అంతర్జాతీయ రాజకీయాలలో ఈ సిద్ధాంతాన్ని చర్చించిన వారుగా మోర్టాన్ ఎ. కప్లాన్, విలియం హెచ్. రికర్ (William H. Riker), థామస్ సి. షెల్లింగ్ (Thomas C. Shelling)లను పేర్కొనవచ్చు.

క్రీడా సిద్ధాంతం రాజకీయ ప్రక్రియను చదరంగం వంటి పోటీ ఆటగా పరిగణిస్తుంది. క్రీడలలో పాల్గొనే ప్రతి ఆటగాడు తక్కువ ప్రయాసతో, ఎక్కువ లాభదాయకమైన స్థితిలో ఉండాలని భావిస్తాడు. కాని సాధారణంగా క్రీడలలోని జయాపజయాలు, ఒక ఆటగాని సమర్థతమీదనే కాకుండా, ఎదుటి ఆటగాండ్ర సామర్థ్యంమీద కూడా ఆధారపడి ఉంటాయి. ఎదుటి ఆటగాళ్ళు తమకంటె బలహీనమైన నైపుణ్యాన్ని కలిగి ఉన్నప్పుడు ఇవతలి ఆటగాళ్ళకు తాము కోరుకున్న ఫలితం సాధించడం సులభమవుతుంది. అలాకాకుండా ఎదుటి ఆటగాళ్ళు కూడా తమతో సమానంగా నైపుణ్యాన్ని కలిగి ఉన్నప్పుడు తమకనుకూలమైన ఫలితాన్ని పొందాలంటే వివిధ వ్యూహాలను అనుసరించవలసి యుంటుంది. రాజకీయ ప్రక్రియకూడ ఇదే భావనపై ఆధారపడి ఉంటుందని క్రీడాసిద్ధాంతం పేర్కొంటుంది.

అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో క్రీడాసిద్ధాంతం చాలా సందర్భాలలో, ముఖ్యంగా విదేశాంగ విధాన రూపకల్పనలో అన్వయించబడింది. అంతర్జాతీయ రాజకీయాలలో పాలుపంచుకొనే వివిధరాజ్యాలు (ఆటగాళ్ళు) తమ తమ జాతీయ ప్రయోజనాల పరిరక్షణలోను, తమ లక్ష్యాల సాధన విషయంలోను హేతుబద్ధంగా వ్యవహరిస్తాయన్న భావన ఆధారంగా క్రీడా సిద్ధాంతం వివరించబడింది. స్నైడర్ అభిప్రాయంలో క్రీడాసిద్ధాంతంలో 5 అంశాలుంటాయి. అది 1. క్రీడా సిద్ధాంతంలో అత్యంత ప్రధానమైన విషయం వ్యూహం. ఎదుటి ఆటగాళ్ళ వ్యూహాలను ముందుగా ఊహించి, వాటికి ప్రతిగా తగిన వ్యూహాలను రచించి విజయం సాధించటానికి ఎల్లప్పుడూ ప్రయత్నాలు చేస్తూ ఉండాలి. 2. ప్రతి క్రీడలోనూ ప్రత్యర్థులుంటారు. ప్రత్యర్థులున్నప్పుడే వ్యూహాలను రచించవలసిన అవసరం ఉంటుంది. 3. క్రీడల్లో పాల్గొనే ప్రతి ఆటగాడు దాని పర్యవసానాన్ని పొందవలసి ఉంటుంది. దానినే 'ఇష్టాలు' (Pay-off) అని అంటారు. 4. ప్రతి క్రీడకు కొన్ని నియమాలు ఉంటాయి. ఆవి భౌగోళిక, ఆర్థిక, సామాజిక, జీవ శేక మానసిక పరమైనవి కావచ్చు. 5. ప్రతి క్రీడలోను ఒక ఆటగాడు ప్రత్యర్థి ఆటగాణ్ణి గురించిన సమాచారాన్ని సేకరిస్తాడు. ఈ విధంగా క్రీడాసిద్ధాంతం 'సంఘర్షణ'ను వ్యూహాత్మకంగా విశ్లేషిస్తుంది. క్రీడలకు సంబంధించిన ఈ నియమాలన్నీ అంతర్జాతీయ సంబంధాలకు కూడ అన్వయించవచ్చునని క్రీడా సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన రచయితలు భావిస్తారు. వారి దృష్టిలో అంతర్జాతీయ సమాజంలోని రాజ్యాలను క్రీడలలోని ఆటగాళ్ళుగా భావించవచ్చు. క్రీడలలో ప్రత్యర్థి ఆటగాళ్ళు ఏ విధంగా విభిన్న వ్యూహాలను రచించడంద్వారా లాభదాయకమైన పర్యవసానాలను (Out Comes) పొందటానికి ప్రయత్నిస్తారో అదే విధంగా అంతర్జాతీయ సమాజంలో కూడ రాజ్యాలు ప్రత్యర్థి రాజ్యాలపై వివిధ వ్యూహాలను రచించి, తమ జాతీయ ప్రయోజనాలను పెంపొందించుకోవటానికి ప్రయత్నిస్తాయని క్రీడా సిద్ధాంతం వివరిస్తుంది.

2.8.5 మార్క్సిస్టు ధృక్పథం (Marxist Approacu)

సామాజిక పరిణామాన్ని గత తార్కిక, చారిత్రక పద్ధతులద్వారా వివరించి, శాస్త్రీయ సామ్యవాదానికి పితామహునిగా పేరెన్నికగన్న కారల్ మార్క్స్ అత్యంత వివాదాస్పదమైన తత్త్వవేత్త. సమాజంలోని మార్పుల గతిశీలతకు వర్గపోరాటమే కారణమని, పెట్టుబడిదారులు, కార్మికుల మధ్యగల ఆర్థికపరమైన వర్గపోరాటం కారణంగా

సామ్యవాద సమసమాజం ఆవిర్భవిస్తుందని చారిత్రక ఆధారాలతో, శాస్త్రీయ విశ్లేషణను ఆయన రూపొందించాడు. ఈ వర్గ పోరాటాన్ని అంతర్జాతీయ సంబంధాలకు కూడ అన్వయించటంద్వారా అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో మార్క్సిస్టు దృక్పథాన్ని అభివృద్ధి చేయటం జరిగిందని చెప్పవచ్చు.

మార్క్సిస్టుల అభిప్రాయంలో అంతర్జాతీయ సమాజంలోని పెట్టుబడిదారీ రాజ్యాలు బడుగు (పేద) దేశాలను ఆర్థికంగా దోపిడీచేస్తూ, రాజకీయంగా తమ ఆధీనంలో ఉంచుకోవడం జరుగుతోంది. ఆ విధంగా పెట్టుబడిదారీ (అభివృద్ధి చెందిన) రాజ్యాలకు, బడుగు (అభివృద్ధి చెందుతున్న) దేశాలకు మధ్య ఆర్థికపరమైన వర్గపోరాటం అనేది నెలకొననున్నది. 1917 కమ్యూనిష్టు విప్లవంద్వారా రష్యాలో సామ్యవాద ప్రభుత్వం ఏర్పడటంతో సామ్యవాద రష్యా బడుగు దేశాల ప్రతినిధిగా అంతర్జాతీయ రంగంలో ఈ వర్గపోరాటంలో పాలుపంచుకొంటున్నది. పెట్టుబడిదారీ రాజ్యాలు అంతర్జాతీయంగా తమ గుత్తాధిపత్యాన్ని నెలకొల్పటానికి వీలుగా తమలో తాము కలహించుకొంటూ, మొత్తం ప్రపంచ వ్యవస్థను తమ తమ నియంత్రణలో ఉంచుకొనటానికి ప్రయత్నిస్తాయి. పెట్టుబడిదారీ రాజ్యాల ప్రయత్నాలు ప్రపంచయుద్ధాలకు దారితీస్తాయని, మొదటి, రెండవ, ప్రపంచయుద్ధాలు ఇటువంటి ప్రయత్నాల ఫలితాలేనని మార్క్సిస్టుల భావన. మార్క్సిస్టుల దృష్టిలో అంతర్జాతీయ రాజకీయాలు ముఖ్యంగా మూడు లక్షణాలను కలిగి ఉంటాయి. అవి 1. సమకాలీన అంతర్జాతీయ సమాజం సామ్రాజ్యవాద - బూర్జువా రాజ్యాలు మరియు సామ్యవాద రాజ్యాలు అనే రెండు ఉప వ్యవస్థలుగా విడిపోయి ఉంటుంది. ఈ రెండు ఉప వ్యవస్థల మధ్య సంబంధాలు బయటికి పరస్పర విరుద్ధంగా ఉన్నట్లు కన్పడుతూ, తార్కికంగా (dialectically) సహజీవనానికి దోహదపడే శక్తులతో అనుసంధానం చేయబడి ఉంటాయి.

2. గతంలో అంతర్జాతీయ సమాజాన్ని సామ్రాజ్యవాద - బూర్జువా రాజ్యాలు నిర్దేశించిన పంథాలోనే నేడు సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య సంబంధాలను సోషలిస్టు ఇంటర్నేషనల్ నిర్దేషిస్తూ ఉంటుంది. ఆ విధంగా ఒక కొత్తరకమైన అంతర్జాతీయ సంబంధాలు సమకాలీన అంతర్జాతీయ సమాజంలో చోటుచేసుకోవటం జరిగింది.

3.కమ్యూనిష్టుల దృష్టిలో అంతర్జాతీయ సమాజంలో సామ్రాజ్యవాద రాజ్యాలకు, సామ్యవాద రాజ్యాలకు మధ్య ఇంకొక తృతీయశక్తి నెలకొని ఉంది. అది సామ్యవాద రాజ్య వ్యవస్థకు బయట, సామ్రాజ్యవాద - బూర్జువా రాజ్య వ్యవస్థకు అంతర్గతంగాను ఉన్న సామ్రాజ్యవాద వ్యతిరేక సామ్యవాద శక్తులేనని మార్క్సిస్టుల అభిప్రాయం.

ఈ విధంగా మార్క్సిస్టు దృక్పథం వర్గపోరాటం ఆధారంగా అంతర్జాతీయ సంబంధాలను వివరించటానికి ప్రయత్నం చేసింది. సామ్యవాద వ్యవస్థ అనేది ప్రపంచవ్యాప్తంగా కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని మార్క్సిస్టుల భావన. పరస్పర వ్యతిరేకమైన వర్గ వైషమ్యాలు ఎప్పుడు అంతరించడం జరుగుతుందో అప్పుడు రాజ్యాల మధ్య తగాదాలు సమసిపోయి శాశ్వతమైన శాంతిని నెలకొల్పటానికి, అంతర్జాతీయ సమాజంలోని రాజ్యాలు ప్రజల అభిప్రాయాలకు, ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించటానికి అవకాశం ఉంటుందని మార్క్సిస్టులు భావించారు.

2.9 'అంతర్జాతీయ సంబంధాలు' - స్వతంత్ర ప్రతిపత్తి

'అంతర్జాతీయ సంబంధాలు' ప్రత్యేకమైన స్వతంత్ర ప్రతిపత్తిగల అధ్యయన శాస్త్రమా? కాదా? అన్న విషయంలో కూడ విద్యావేత్తలు విభిన్న దృక్పథాలను అనుసరించడం జరిగింది. కొందరు దీనిని ప్రత్యేకమైన అధ్యయన శాస్త్రంగా గుర్తించాలని వాదిస్తే, మరికొందరు దీంట్లో మిగిలిన సామాజిక శాస్త్రాల లాగా ప్రత్యేకంగా అధ్యయనం చేయపలసిన విషయాలు ఏమీ లేవని, అందువల్ల ఇది మిగిలిన అధ్యయన శాస్త్రాలలో అంతర్భాగమైన పాఠ్యాంశం మాత్రమేనని అభిప్రాయపడ్డారు. మరికొందరు, ఇది ఇంతవరకు పాఠ్యాంశమేకాని, అధ్యయనశాస్త్రం కాదని, కానీ ఈ మధ్యనే

BRAOU

ప్రత్యేక ప్రతిపత్తిగల అధ్యయన శాస్త్రపు స్థానం సముపార్జించుకొనే దశకు చేరుతోందని భావిస్తున్నారు. ఈ విషయంలోని వాదోపవాదాలను సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

1954లో యునెస్కో (UNESCO) వారి ఆధ్వర్యంలో, సి.ఎ. డబ్ల్యు. మౌనింగ్ (C.A.W. Mouning) - 'విశ్వ విద్యాలయ స్థాయిలో అంతర్జాతీయ సంబంధాల బోధన' అన్ని విషయంపై ఒక పుస్తకాన్ని ప్రచురించారు. ఆయన ఈ సందర్భంలో ఎనిమిది భిన్నరాజ్యాల - ఈజిప్టు, ఫ్రాన్సు, ఇండియా, మెక్సికో, స్వీడన్, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా, యుగోస్లోవియాలకు చెందిన ఉన్నత విద్యాసంస్థలలో అంతర్జాతీయ సంబంధాల బోధనను సమీక్షించి, తద్వారా ఇది విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రత్యేకమైన స్వతంత్ర ప్రతిపత్తిగల అధ్యయన శాస్త్రం స్థాయిని చేరుకుందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ రచయిత క్విన్సీరైట్ కూడ, మౌనింగ్ వలె అంతర్జాతీయ సంబంధాలు నేడు ఒక ప్రత్యేక దశకు చేరుకున్నదని, అంతర్జాతీయ న్యాయశాస్త్రం, దౌత్య వ్యవహారాల చరిత్ర, యుద్ధశాస్త్రం, అంతర్జాతీయ రాజకీయాలు, అంతర్జాతీయ వ్యవస్థ, అంతర్జాతీయ వ్యాపారం, వలస ప్రభుత్వాలు, విదేశ వ్యవహారాల నిర్వహణ అనే ఎనిమిది అంశాలను అధ్యయన శాస్త్రం క్రిందకు చేర్చవలసి ఉంటుందని భావించాడు. అంతేగాక ప్రపంచ చరిత్ర, ప్రపంచ భూగోళం, శాంతివాదం, అంతర్జాతీయ సంబంధాలకు చెందిన సామాజిక, మనోవైజ్ఞానిక అంశాలు, మానవతావాదం, సామాజిక, జీవశాస్త్రాలు, ప్రాంతీయ అధ్యయనాలలోని నూతన పరిణామాలు, ఆచరణాత్మక పరిశోధన, సామూహిక ప్రవర్తనావళికి సంబంధించిన విషయాలన్నీ కూడ అంతర్జాతీయ సంబంధాలతో ముడివడి ఉన్నాయని ఈయన వాదన. ఈ విధంగా మౌనింగ్ మరియు క్విన్సీ రైట్ లిరువురు కలిసి అంతర్జాతీయ సమాజానికి చెందిన వివిధ విషయాలను సమ్మిళితపరచి 'అంతర్జాతీయ సంబంధాల'కు ఒక స్వతంత్ర ప్రతిపత్తిని కల్గించడానికి ప్రయత్నించినారు.

కాని రాబర్ట్ లోరింగ్ అలెన్ (Robert Loring Allen) 'అంతర్జాతీయ సంబంధాల'కు స్వతంత్ర ప్రతిపత్తి లేదని, దీనిని ఒక స్వతంత్ర ప్రతిపత్తిగల అధ్యయన శాస్త్రంగా భావించాలంటే ప్రత్యేకమైన అధ్యయన విషయం, ప్రత్యేకమైన పరిశోధనా పద్ధతి, స్థిరపడిన సైద్ధాంతిక ప్రవృత్తి (Theorotical Postulates) ఉండాలనీ, కానీ అంతర్జాతీయ సంబంధాలకు ఇవేవీ లేవు కాబట్టి దీనిని ఒక ప్రత్యేకమైన అధ్యయన శాస్త్రంగా పరిగణించటానికి వీలులేదనీ వాదించారు. కాని పీటర్ తోమా (Peter Toma) ఈ వాదనను వ్యతిరేకిస్తూ సామాజిక శాస్త్రాలన్నింటికి ఇదే సమస్య ఉందని, ఈ లక్షణాలను ఆధారంగా చేసుకొని చరిత్ర, రాజనీతిశాస్త్రం, సమాజశాస్త్రం, ఆర్థికశాస్త్రం మొదలైన సామాజిక శాస్త్రాలను పరిశీలిస్తే ఇవేవీ కూడా ప్రత్యేక శాస్త్రాలు కాలేవని వాదించారు.

మోర్టాన్ కప్లాన్ 'అంతర్జాతీయ సంబంధాలు' రాజనీతి శాస్త్రంలో భాగమేకాని, ప్రత్యేక ప్రతిపత్తిగల అధ్యయన శాస్త్రం కాజాలదని అభిప్రాయపడ్డారు. రాజనీతి శాస్త్రంలోలాగా అంతర్జాతీయ సంబంధాలలో ఒక ప్రత్యేక ప్రతిపత్తిగల అధ్యయనాంశం (Subject matter) ఏమీలేదని ఈయన భావన. ఏదైనా విషయం ప్రత్యేక అధ్యయన శాస్త్రంగా పరిగణింపబడాలంటే, దానికి పరిమితమైన 1.దృగ్విషయాలను పరిశీలించటానికి అవసరమైన ప్రత్యేక నైపుణ్యం, సాంకేతిక కౌశలము 2.సమగ్రమైన సిద్ధాంతము, ప్రాక్కల్పనలు లేక ఉపకల్పనలు (Hypotheses) 3. ప్రత్యేకమైన అధ్యయనాంశం ఉండాలనీ, కానీ, ఈ మూడింటిలోను చివరిది మాత్రమే అంతర్జాతీయ సంబంధాలకు ఉందని కప్లాన్ పేర్కొన్నారు. ఈ అధ్యయనాంశంలో కూడ సమగ్రత లేదని, అది అంతర్జాతీయ సంబంధాలకే పరిమితం కాకుండా మిగిలిన సామాజిక శాస్త్రాలకు కూడ పర్తింపబడుతుందని భావించారు. ఉదా॥కు అంతర్జాతీయ వ్యాపారం ఆర్థికశాస్త్రం పరిధిలోకి, అంతర్జాతీయ ఉద్రిక్తతలు మనోవైజ్ఞానిక శాస్త్రం పరిధిలోకి వస్తాయి. ఈ విధంగా 'అంతర్జాతీయ సంబంధాల' పరిధిలోకి వచ్చే అధ్యయనాంశం మిగిలిన సామాజిక శాస్త్రాల పరిధిలోకి రావటంద్వారా, దీనికి ఒక ప్రత్యేక ప్రతిపత్తిగల అధ్యయనాంశం లేదని, అందువలన అంతర్జాతీయ సంబంధాలను ఒక స్వతంత్ర ప్రతిపత్తిగల అధ్యయన శాస్త్రంగా పరిగణించ వీలుకలుగదని కప్లాన్ వాదన. ఆయన అభిప్రాయంలో 'అంతర్జాతీయ సంబంధాలను రాజనీతి శాస్త్రంలో ఒక ఉప అధ్యయన శాస్త్రం (Sub-Discipline)గా పరిగణించవచ్చు.'

BRAOU

కప్లాన్‌లాగే ఆర్.ఎస్. రోస్‌క్రేన్ కూడ అంతర్జాతీయ సంబంధాలకు ప్రత్యేకమైన ప్రతిపత్తిని ఇవ్వటానికి సందేహించారు. ఈతని ఉద్దేశంలో సమకాలీన యుగంలో **రాజనీతి శాస్త్ర** పరిజ్ఞానం, అంతర్జాతీయ సంబంధాల పరిజ్ఞానం చాల విస్తృతంగా పెరిగిపోయాయి. అంతర్జాతీయ సంబంధాలను రాజనీతి శాస్త్రంలో భాగంగా పరిగణించటమే ఉపయుక్తమని ఈయన అభిప్రాయం. ఇదే పంథాలో జార్జి. ఎఫ్. కెన్నెన్ (George F. Kennen) కూడ అంతర్జాతీయ సంబంధాలు ప్రభుత్వాల ప్రవర్తనకు సంబంధించే విషయాలని, వాటిని ఒక ప్రత్యేకమైన అధ్యయన శాస్త్రంగా పరిగణించవలసిన అవసరం లేదని భావించారు. ప్రభుత్వాల ప్రవర్తన అనేది, ఆ ప్రభుత్వాలను ఏర్పరచే వ్యక్తుల ప్రవర్తనపై ఆధారపడి ఉంటుందనీ, కాబట్టి అంతర్జాతీయ సంబంధాలు చివరకు వ్యక్తుల ప్రవర్తన వలన ప్రభావితం అవుతాయని ఆయన అభిప్రాయపడినారు.

ప్రఖ్యాత రాజనీతి శాస్త్రజ్ఞుడు హెరాల్డ్ లాస్వెల్ అధ్యయనరంగంలో అంతర్జాతీయ సంబంధాలకు సముచితమైన స్థానం లభించటం లేదని తీవ్రంగా వాదిస్తూ, గతంలోలాగా కాకుండా పరిధిని మరింత విస్తృతం చేయాలనీ అభిప్రాయపడ్డారు. అదే విధంగా ఫ్రెడరిక్ యస్. డన్ (Frederick S. Dunn) కూడ అంతర్జాతీయ సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని వాంఛించారు. ఈ శాస్త్రానికి సంబంధించిన అధ్యయనాంశాలు ఏ ఇతర సామాజిక శాస్త్రాలనుండి గ్రహింపబడినప్పటికీ, అవి సమకాలీన అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించటానికి, గత సమస్యలను అర్థం చేసికోవటానికి ఉపయోగపడినట్లైతే వాటిని 'అంతర్జాతీయ సంబంధాల'కు చెందిన అధ్యయనాంశాలుగా పరిగణించవచ్చని ఈయన వాదించారు. 'అంతర్జాతీయ సంబంధాలను' ప్రత్యేక ప్రతిపత్తిగల అధ్యయన శాస్త్రంగా గుర్తించాలా? లేదా? అన్న విషయంకంటె అంతర్జాతీయ సంబంధాలలో గుర్తింపబడిన వ్యక్తుల, సమూహాల ప్రవర్తన అంతర్జాతీయరంగాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుందో దానిని అధ్యయనం చేయటం ప్రధానమని డన్ భావించారు.

ఈ విధంగా వివిధ రాజనీతి శాస్త్రజ్ఞులు అంతర్జాతీయ సంబంధాల ప్రత్యేక ప్రతిపత్తిపై విభిన్న అభిప్రాయాలను వెలిబుచ్చారు. వీటినన్నింటినీ క్రోడీకరించినపుడు అంతర్జాతీయ సంబంధాల ప్రత్యేక ప్రతిపత్తికి సంబంధించి మనకు ప్రధానంగా మూడు ధోరణులు కన్పడతాయి. అవి 1. కొంతమంది అభిప్రాయంలో అంతర్జాతీయ వ్యవస్థలాంటి ఇతర సామాజిక శాస్త్రాలనుండి గ్రహించినప్పటికినీ, ప్రపంచవిషయాలు విషయాలు ప్రాతిపదికగా అంతర్జాతీయ సంబంధాల అధ్యయనాంశాలను మనం ప్రత్యేకంగా గుర్తించవచ్చు. దాని ప్రత్యేక ప్రతిపత్తిపై ఇంకా ఏమైనా సందేహాలుంటే కనీసం దీనిని అంతర్విభాగీయ అధ్యయన శాస్త్రం (Inter - disciplinary discipline) గా పరిగణించటానికి ఎటువంటి అభ్యంతరాలుండకూడదని ప్రత్యేకవాదుల (Specialists) అభిప్రాయము. 2. మరికొందరి అభిప్రాయంలో అంతర్జాతీయ సంబంధాలను స్వతంత్ర ప్రతిపత్తిగల అధ్యయన శాస్త్రంగా గుర్తింపు ఇవ్వటానికి అవసరమైన యోగ్యతలేవీ దీనికి లేవు. అందువలన దీనిని ఇతర సామాజిక శాస్త్రాలలో అంతర్భాగంగా పరిగణించాలే గాని, ప్రత్యేక అధ్యయన శాస్త్రంగా గుర్తింపు ఇవ్వనవసరంలేదు. 3. పై రెండు అభిప్రాయాలకు మధ్యస్థంగా కొందరు వాదనను ఒక అప్రయోజనమైన చర్చ (Fruitless endeavour) అని భావించారు.

అభిప్రాయాలిట్లున్నప్పటికీ, అంతర్జాతీయ సంబంధాలు ఒక పరిపూర్ణమైన స్వతంత్ర అధ్యయన శాస్త్రంగా ఇంకా అభివృద్ధి చెందవలసి ఉందని మనం అంగీకరించక తప్పదు. కానీ ఇది ఆ విధముగా అభివృద్ధి చెందటానికి అవసరమైన అన్ని హంగులను కలిగి ఉందన్న విషయం ఒక నగ్నసత్యం. అంతర్జాతీయ సంబంధాలను రాజనీతి శాస్త్రము, చరిత్ర లేదా ఆర్థికశాస్త్రాలలో ఒక అంతర్భాగంగా కానీ, వాటితో సమానస్థాయిలో కానీ పరిగణించటం సరికాదు. అంతర్జాతీయ సంబంధాలు శాస్త్రాలన్నిటికన్న విస్తృతమైన అంశాలను, పరిధిని కలిగి ఉన్న శాస్త్రం. అందువల్లనే స్టాన్లీ హాఫ్‌మాన్ (Stanley Haffmann) ప్రపంచ వ్యవస్థకు ప్రాతిపదికలైన రాజ్యాలశక్తిని, బాహ్యవిధానాలను ప్రభావితంచేసే కారకాలను, కార్యక్రమాలను అంతర్జాతీయ సంబంధాలు చర్చిస్తుందని, ఆ విధముగా ప్రపంచ రాజకీయాల దృష్ట్యా రాజ్యాంతర్గత రాజకీయాలను కూడా అర్థంచేసికోవటానికి అవకాశముంటుందని పేర్కొన్నాడు. అతని దృష్టిలో రాజనీతి శాస్త్రాన్ని 'అంతర్జాతీయ సంబంధాల' యొక్క ఉప అధ్యయన శాస్త్రంగా పరిగణించవచ్చు.

BRAOU

'అంతర్జాతీయ సంబంధాలు' ఒక సర్వస్వతంత్రమైన **అధ్యయన శాస్త్రంగా** అభివృద్ధి చెందకపోవటానికి కారణము సమగ్రమైన సిద్ధాంతీకరణ జరగకపోవటమే. ఇంతవరకు అంతర్జాతీయ సంబంధాలను రాజనీతి సిద్ధాంతంలో అంతర్భాగంగా భావించటంవలన, రాజ్యాలమధ్య సంబంధాలకు సంబంధించి ఊహాత్మక సిద్ధాంతాలు మాత్రమే అభివృద్ధిచెందాయి. అంతేగాక ఈ మధ్యవరకు రాజనీతి శాస్త్రజ్ఞుల దృష్టి సంకుచితంగా ఉండి, జాతిరాజ్యాల పరిధిని దాటి ప్రపంచ రాజ్యాన్ని గురించి ఊహించేస్థాయికి చేరుకోలేకపోయింది. ఇంతవరకు వారి అభిప్రాయంలో సర్వసత్తాక రాజ్యాలు సహజమైనవీ, ఆవశ్యకమైనవీ, అంతర్జాతీయ సమాజం మార్పులకు లోనుకాని వ్యవస్థ. కానీ రెండవ ప్రపంచయుద్ధము తరువాత అంతర్జాతీయంగా వచ్చిన అనూహ్యమైన మార్పులు - అణు విధ్వంసక మారణాయుధాల తయారీ, వేగవంతమైన సాంకేతిక, పారిశ్రామికాభివృద్ధి, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికన్ ఖండాలలో లెక్కకు మించిన నూతన రాజ్యాల ఆవిర్భావం, ఈ నూతన (అభివృద్ధి చెందుతున్న) రాజ్యాల, ప్రజల విపరీతమైన కోరికలు, సమాచార, ప్రసార, రవాణాసాకర్యాలలో చోటుచేసుకొన్న సాంకేతిక పురోగతి మొ॥వి ఈ అభిప్రాయాలను తారుమారు చేసి, రాజ్యాల సరిహద్దులకు అర్థం లేకుండా చేశాయి. అంతేకాకుండా రాజ్యాల మధ్య సహకారం ప్రాధాన్యతను ఎత్తిచూపాయి. వివిధ రాజ్యాల ప్రజలమధ్య అంతర్జాతీయ ధృక్పథాన్ని, విశ్వజనీన దృష్టిని పెంపొందించటానికి దోహదంచేశాయి. రాజ్యాలు తమ ఆస్థిత్వాన్ని నిలబెట్టుకుంటూనే, నాటో (NATO), ఒపెక్ (OPEC), సార్క్ (SAARC) వంటి అధిక్య జాతీయసటుల (Supranational actors) అవిర్భావానికి, ఐక్యరాజ్యసమితివంటి అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పాటుకు తమ తోడ్పాటునందిస్తున్నాయి. ఈ విధంగా సమకాలీన అంతర్జాతీయ సమాజంలో పరస్పర వ్యతిరేకమైన రెండు విభిన్న ధోరణులను మనం ఒకేసారి పరిశీలించవచ్చు. అదే విధంగా విభిన్న రాజకీయ సిద్ధాంతాలను అనుసరించే రాజ్యాలమధ్య తగాయిదాలు ఒకవైపు, ఉత్తర - దక్షిణ (అభివృద్ధి చెందిన - అభివృద్ధి చెందుతున్న) దేశాల మధ్య ఆర్థిక అసమానతలకు చెందిన సమస్యలు మరొక ప్రక్క అశాంతి పరిస్థితులను ప్రేరేపిస్తూన్నాయి. యుద్ధం - శాంతి, అభివృద్ధి - నెనుకబడిన తనం, నవనాగరికత - ప్రాచీన సంప్రదాయాలమధ్య సామరస్యం నెలకొల్పే విషయంలో ఎంతో ప్రయత్నం చేయవలసి ఉంది. సమస్యలను పరిష్కరించటానికి ఏదో ఒక సామాజిక శాస్త్ర ధృక్పథంనుండి కాక, అన్ని సామాజిక రంగాలనుండి సహకారాన్ని పొందవలసి ఉన్నది. సమస్యల సాధనకు చరిత్ర, రాజనీతి శాస్త్రం, అంతర్జాతీయ న్యాయం, ఆర్థికశాస్త్రం, మనోవైజ్ఞానిక శాస్త్రం, అంతర్జాతీయ వాణిజ్యం మొ॥వి. సామాజిక శాస్త్రాలను తగిన మోతాదులో అధ్యయనంచేసి, అవసరమైన భావాలను, సమూనాలను గ్రహించవలసి ఉటుంది. 'అంతర్జాతీయ సంబంధాలు' ఒక ప్రత్యేకమైన స్వతంత్ర అధ్యయనశాస్త్రంగా ఆవిర్భవించినపుడు మరింత సాధ్యమై, అంతర్జాతీయ సమస్యల పరిష్కార మార్గాల అన్వేషణ, సిద్ధాంతీకరణ సులభమవుతుంది.

ఈ విధముగా పరిశీలించినపుడు మనకు 'అంతర్జాతీయ సంబంధాలు' నేడు ఒక ప్రత్యేక అధ్యయన శాస్త్రంగా అభివృద్ధి చెందినప్పటికి, అలాకాగల అవకాశాలు, అవసరాలు ప్రత్యక్షంగా కన్పిస్తూ ఉన్నాయి. అంటే 'అంతర్జాతీయ సంబంధాలు' ఇతర సామాజిక శాస్త్రాలలాగే ప్రత్యేక ప్రతిపత్తిని కలిగిన స్వతంత్ర అధ్యయన శాస్త్రంగా అభివృద్ధి చెందే అర్హతగల అన్నింటిని కలిగి ఉందని, సమీప భవిష్యత్తులో ఇది విశ్వ విద్యాలయస్థాయిలో ఒక స్వతంత్ర అధ్యయన శాస్త్రంగా రూపుదిద్దుకుంటుందని ఆశించవచ్చు.

2.10 సారాంశం

ఈ పైన వివరించిన వివిధ ధృక్పథాలు అంతర్జాతీయ రంగంలో మనకు గోచరించే వివిధ దృగ్విషయాల స్వరూప స్వభావాలను అర్థంచేసుకోవటానికి ఉపకరిస్తాయి. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి ధృక్పథాలు మాత్రమేగాక మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులను బట్టి, దినదినాభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని బట్టి కొత్త కొత్త శాస్త్రీయ ధృక్పథాలు అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో చోటుచేసుకుంటున్నాయి. వీటినన్నిటి

BRAOU

ఫలితముగా 'అంతర్జాతీయ సంబంధాల' పరిధి నానాటికి విస్తృతమైన సమీప భవిష్యత్తులో ఒక సమగ్రమైన శాస్త్రంగా రూపొందించగలదని రూఢిగా చెప్పవచ్చు.

ఏ సామాజిక శాస్త్రమైనప్పటికీ దృగ్విషయాల పరిశీలన, సిద్ధాంతీకరణ ఆ శాస్త్రానికి చెందిన రచయితల దృక్పథంపై ఆధారపడి ఉంటుంది. దృగ్విషయాల అధ్యయనానికి అనుసరించే ప్రామాణిక విలువలనే 'దృక్పథం'గా నిర్వచించవచ్చు. నిర్వచనం ఆధారంగా 'అంతర్జాతీయ సంబంధాల'లో ముఖ్యంగా మూడురకాలైన విభిన్న దృక్పథాలు మనకు కన్పడతాయి. అవి 1. వాస్తవికవాద దృక్పథం, ఆదర్శవాద దృక్పథం : ఆదర్శవాద దృక్పథానికి చెందిన వారు దృగ్విషయాల అధ్యయనంలో నైతిక విలువలకు, అంతర్జాతీయ వాదానికి ఎక్కువ ప్రాధాన్యతనీయగా, వాస్తవిక వాద దృక్పథానికి చెందిన వారు జాతీయ ప్రయోజనం, భద్రత, శక్తి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. 2 సాంప్రదాయకవాద దృక్పథం, శాస్త్రీయ వాద దృక్పథం : సాంప్రదాయక వాదులు ప్రకృతి శాస్త్రాల అధ్యయనానికి అన్వయించే శాస్త్రీయ పద్ధతులద్వారా కాక, చరిత్ర, తత్త్వశాస్త్రం, అంతర్జాతీయ న్యాయం, అంతర్జాతీయ సంస్థల వంటి సనాతన పద్ధతులద్వారా అంతర్జాతీయ విషయాలను అధ్యయనం చేయటానికి అవకాశముంటుందని భావిస్తే మోర్టాన్ ఎ. కప్లానీ వంటి, శాస్త్రీయకారులు ఇతర ప్రకృతి శాస్త్రంలో అభివృద్ధి చెందిన శాస్త్రీయ పద్ధతులను అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి అన్వయించవచ్చని భావించారు. ఈ భావన ఆధారంగా వారు వ్యవస్థా దృక్పథం, నిర్ణయ కల్పనా దృక్పథం, ప్రసార దృక్పథంవంటి శాస్త్రీయ దృక్పథాలను అంతర్జాతీయ సంబంధాల దృగ్విషయాలను అధ్యయనం చేయటానికి అభివృద్ధిచేశారు. 3. ఇక అంతర్జాతీయ సంబంధాల స్వతంత్ర ప్రతిపత్తికి సంబంధించి కూడ రచయితలు భిన్న దృక్పథాలను అనుసరించారు. పి.ఏ. డబ్ల్యు మోనింగ్, క్విన్సీ రైట్ వంటి వారు 'అంతర్జాతీయ సంబంధాలను' స్వతంత్ర ప్రతిపత్తిగల అధ్యయన శాస్త్రంగా పరిగణించగా, రాబర్ట్ లోరింగ్ అలెన్, మోర్టాన్ ఎ. కప్లాన్ వంటివారు 'అంతర్జాతీయ సంబంధాల'ను రాజనీతిశాస్త్రం లేదా ఆర్థిక శాస్త్రంలో ఒక పాఠ్యాంశంగా భావించాలే కానీ, దానికి స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వరాదని వాదించారు. వీరి భాదవలెట్లున్నను 'అంతర్జాతీయ సంబంధాలు' ఒక స్వతంత్ర ప్రతిపత్తిగల అధ్యయన శాస్త్రంగా సమీప భవిష్యత్తులో అభివృద్ధిచెందే అవకాశాలున్నాయని మనం పేర్కొనవచ్చు.

పైన పేర్కొన్న దృక్పథాలు మాత్రమేగాక, మారుతున్న పరిస్థితులను బట్టి, పెరుగుతున్న శాస్త్రీయ విజ్ఞానాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని నూతన దృక్పథాలు రూపొందవచ్చని, వాటిద్వారా 'అంతర్జాతీయ సంబంధాల'ను మరింత సమగ్రంగా అధ్యయనం చేయటానికి అవకాశముంటుందని భావిద్దాం.

– ఐ. దోసగిరిరావు

2.11 చదువదగిన పుస్తకాలు

1. Mahendra Kumar : Theoretical Aspects of International Politics, Shiralal Agarwala & Company, Agra, 1988.

2. Johne Garnett : Commonsense and the theory of International Politics. The Macmillan Press Ltd., London 1984.

3. K.P. Misra & R.S. Beal (Eds) : International Relations theory : Western and Non - Western Perspective, Vikas Publishing House Pvt.,Ltd., 1980.

BRAOU

4. Davids Mclellan, William C. Glson & Fred & Sandermann : The Theory and Practice of International Relations, Prentice - Hall of India Pvt.,Ltd., New Delhi, 1977.

5. Kenneth N. Waltz : Theory of International Politics, Addison - Wesley Publishing Company, London 1979.

6. P. Chandra : International Politics, Vikas Publishing House Pvt., Ltd. New Delhi, 1979.

7. J.C. Johari : International Relations and Politics, Theoritical Perspective, Sterling Publisses Pvt.,Ltd. New Delhi, 1985.

8. Theodore A. Couloumbis & James H. Wolte : Introduction to International Relations: Power and Justice, Prentice - Hall of India Pvt.,Ltd. New Delhi, 1986.

9. Norman D. Palmer & Howard C Perkins : International Relations, The World Community in Transition, Scientific Book Agency, Calcutta, 1970.

2.12 సమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది వాటికి ఒక్కొక్క దానికి 30 పంక్తులలో జవాబు రాయండి.

1. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి దోహదపడే వివిధ ధృక్పథాలను తులనాత్మకంగా వివరించండి.

2. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో సాంప్రదాయకవాదానికి అనుకూలంగా హెడ్లీ బుక్ వెలిబుచ్చిన అభిప్రాయాలను వివరించండి.

3. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి దోహదపడే వివిధ సాంప్రదాయక ధృక్పథాలను విశదీకరించండి.

4. అంతర్జాతీయ సంబంధాల స్వతంత్ర ప్రతిపత్తి పై వివిధ రచయితల అభిప్రాయాలను సమీక్షించండి.

II. ఈ కింది వాటికి ఒక్కొక్క దానికి 10 పంక్తులలో జవాబు రాయండి.

1. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో వాస్తవిక వాద ధృక్పథం, ఆదర్శవాద ధృక్పథాల ముఖ్య లక్షణాలను విశదీకరించండి.

2. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో ప్రసార ధృక్పథం పాత్రను వివరించండి.

3. క్రీడా సిద్ధాంతం దృష్టిలో అంతర్జాతీయ సంబంధాల స్వరూప స్వభావాలను సంక్షిప్తంగా వివరించండి.

4. మార్క్సిస్టు ధృక్పథంలో అంతర్జాతీయ సంబంధాల ముఖ్యాంశములను వివరించండి.

BRAOU

భాగం - 3 అంతర్జాతీయ రాజకీయ సిద్ధాంతాలు

విషయక్రమం

3.1 లక్ష్యాలు

3.2 పరిచయం

3.3 ఆదర్శవాదం

3.4 వాస్తవికవాదం

3.5 హాన్స్ జె. మార్గంథో - రాజకీయ వాస్తవిక వాదం

3.6 వాస్తవికవాదం - ఆదర్శవాదం : వివాదం

3.7.0 వ్యవస్థా సిద్ధాంతం

3.7.1 వ్యవస్థ - అర్థ వివరణ

3.7.2 అంతర్జాతీయ సంబంధాలలో వ్యవస్థా పద్ధతి - ఆవిర్భావం

3.7.3 మోర్టాన్ ఎ. కప్లాన్ - వ్యవస్థా సిద్ధాంతం

3.7.4 వ్యవస్థా సిద్ధాంతం - సమీక్ష

3.8.0 నిర్ణయకల్పన సిద్ధాంతం

3.8.1 నిర్ణయకల్పన - విధాన రూపకల్పన

3.8.2 నిర్ణయకల్పన సిద్ధాంతం - ఆవిర్భావం

3.8.3 అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో నిర్ణయయకల్పన సిద్ధాంతం

3.8.4 రిచర్డ్ సి. స్నైడర్ - నిర్ణయకల్పన సిద్ధాంతం

3.8.5 నిర్ణయకల్పన సిద్ధాంతం - వివిధ రచయితల అభిప్రాయాలు

3.8.6 నిర్ణయకల్పన ప్రక్రియ - హెరాల్డ్ లాస్వెల్

3.8.7 నిర్ణయకల్పన సిద్ధాంతం - లోపాలు

3.8.8 నిర్ణయకల్పన సిద్ధాంతం - ప్రాముఖ్యత

BRAOU

3.9 సారాంశం

3.10 చదువదగిన పుస్తకాలు

3.11 నమూనా పరీక్షాప్రశ్నలు

3.1 లక్ష్యాలు

ఈ భాగం అధ్యయనం చేశాక మీరు అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలోని ఆదర్శవాదం, వాస్తవిక వాదం, వ్యవస్థా సిద్ధాంతం, నిర్ణయకల్పన సిద్ధాంతాలను బాగా వివరించగలుగుతారు.

3.2 పరిచయం

అంతర్జాతీయ సంబంధాలకు సంబంధించిన సాంప్రదాయక సిద్ధాంతాలలో వాస్తవిక వాద సిద్ధాంతం, ఆదర్శవాద సిద్ధాంతం అతి ప్రధానమైనవి. అంతర్జాతీయ సమాజంలో సంభవిస్తున్న వివిధ సంఘటనలను, వివిధ రచయితలు ఏ ధృక్పథంతో అవగాహన చేసుకుంటున్నారనే భావన ఆధారంగా సిద్ధాంతాలు ఆవిర్భవించాయి. ప్రపంచంలోని భావుకులందరూ ఆదర్శవాదాన్ని బలపరుస్తుంటే, వాస్తవిక వాదులు చేదైన జీవిత సత్యాలను గుర్తుకు తెస్తూ వాటితో మానవుడు ఏ విధముగా సహజీవనం గడపాలి అన్న విషయం వివరిస్తూ ఉంటారు. కొన్ని సందర్భాలలో వ్యత్యాసం భావనా పూరితమైనదే కానీ లోతైంది, కాదని అనిపిస్తుంది.

ప్రఖ్యాత రాజనీతి తత్త్వవేత్తలు మాకియవెల్లి, థామస్ హాబ్స్, హేన్స్‌జె మార్గాంథో, కెన్నెతీ డబ్ల్యూ. థాంప్సన్, జార్జి యఫ్. కెన్నని నికోలాస్ స్పైన్ మాన్, ఇ.హెచ్. కార్, కీనీ హోల్డెనీ బరీ స్టాన్లీ హాఫ్‌మాన్ (Stanley HalfMann), చర్చిల్, ఇందిరాగాంధీ ప్రభృతులు వాస్తవిక వాదాన్ని సమర్థించగా, హ్యూగో గ్రోషియస్, బెంథామ్, అమెరికా ప్రెసిడెంట్ ఉడ్రోవిల్సన్, బెర్ట్రిండ్ రస్సెల్, ఫ్రాంక్ టెన్నీన్ బామ్ (Frank Tannenbaum), యఫ్. యస్.సి. నార్తీరోప్, మహాత్మాగాంధీ వంటి వారు ఆదర్శవాదాన్ని సమర్థించారు. వివిధ రాజనీతజ్ఞులు తమ తమ వ్యక్తిగత ధృక్పథాలు ఆధారంగా వాస్తవిక వాదాన్ని కాని, ఆదర్శ వాదాన్ని కాని అనుసరిస్తూ తమ తమ దేశాల విదేశాంగ నీతిని రూపొందిస్తుంటే, రాజనీతి శాస్త్రజ్ఞులు తమ ధృక్పథాల ప్రభావం మూలంగా విదేశాంగ నీతి ఆదర్శం వాదం పైనగాని, వాస్తవిక వాదం పైనగాని ఆధారపడి ఉండవలెనని నిర్దేశిస్తూంటారు. అయితే మధ్యే మార్గానికి చెందిన కొందరు రాజనీతిజ్ఞులు, రాజనీతి శాస్త్రవేత్తలు ఇందులో ఏ ఒక్క వాదానికి ప్రత్యేక ప్రాధాన్యం యివ్వకుండా రెండింటిలో గల గుణగణాలను నిశితంగా పరిశీలించి వాటిలో గల మంచి భావనలను అవలంబించాలనీ, లేదా రెంటినీ సమన్వయ పరచాలనీ ప్రయత్నిస్తున్నారు. మనం ఇప్పుడు ఈవాదనలలోగల భావానా పటిమను పరిశీలిద్దాం.

3.3. ఆదర్శవాదం

ఆదర్శవాదుల భావన ఆదర్శవంతమైన అంతర్జాతీయ సమసమాజాన్ని స్థాపించటం వైపే మొగ్గుతూ ఉంటుంది. 18వ శతాబ్దంలోని అమెరికా, ఫ్రెంచి విప్లవాలు ఆదర్శ వాద ప్రచారం వలన ప్రేరేపించబడినాయని పలువురి భావన. క్రీస్తు శ. 1798లో మానవ మేధస్సు అభివృద్ధి (Sketch for Historical Picture of the Progress of the Human Mind) పై కండోర్సెట్ వ్రాసిన గ్రంథంలో ప్రపంచంలోని మానవుని పురోగతి ఆదర్శవాద ధృక్పథం పై ఆధారపడి ఉందని పేర్కొన్నాడు. అతడు తన గ్రంథంలో యుద్ధాలకు, అసమానతలకు, నియంతృత్వానికి

BRAOU

అవకాశం లేని, మానవ సంక్షేమానికి దోహదం చేసే ఆదర్శవంతమైన అంతర్జాతీయ సమాజాన్ని ఊహించాడు. హేతువాదం, విద్య, శాస్త్రీయ విజ్ఞానాలను వ్యాప్తి చేయడం ద్వారా అటువంటి సమాజాన్ని సాధించవచ్చని అతని భావన. ఆదర్శవాద సిద్ధాంత రూపం ఇటువంటి ఉదార (liberal) భావాలనుండే అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు. ఈ భావాలకు అనుగుణంగా కొందరు తత్వవేత్తలు మానవసమాజంలోని సంస్కృతి, నడవడి, నాగరికత అన్నీ కూడా ఆదర్శవాద ప్రభావితాలేనని చెబుతారు.

రాజకీయాలకు అతీతమైన, అహింసాత్మక, నైతిక విలువల ఆధారంగా ఆదర్శవంతమైన అంతర్జాతీయ వ్యవస్థను నెలకొల్పాలంటే, ఆదర్శాత్మక ఉదార వాదమే మార్గమని వీరి భావన. ఉత్తమ విద్య, అంతర్జాతీయ సంస్థల ప్రేరేపణ ద్వారానే ఆదర్శ అంతర్జాతీయ వ్యవస్థను నెలకొల్పవచ్చని వీరి అభిప్రాయం. అధికారవాంఛ, ప్రభావం కోసం మాత్రమే లోగడ వివిధ దేశాల మధ్య తగాదాలు రాలేదని, ఆ తగాదాలకు మూలకారణం పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలు వాటిని ఆచరణలో పెట్టడానికి వివిధ దేశాల వ్యక్తుల మధ్య తలెత్తిన భేదాభిప్రాయాలు మాత్రమేనని ఆదర్శవాదుల నమ్మకము. అంతర్జాతీయ సంబంధాలలో కూడ దేశాలు నైతిక విలువలను పాటించడం ద్వారా, నిష్పక్షపాత వైఖరిని అవలంబించటం ద్వారా, నియంతృత్వ అధికార తత్వాన్ని ఎదిరించటం ద్వారా, ప్రజాస్వామ్య వాద శక్తులను బలపరచడం ద్వారా, చివరకు ప్రపంచ రాజ్యాన్ని ఏర్పాటు చేయడం ద్వారా, ఆదర్శవాదులు ప్రపంచ రాజకీయాలను ఆదర్శాత్మక రాజకీయాలుగా మార్చవచ్చునని దృఢంగా విశ్వసించారు. 19వ శతాబ్దంలో బెంథామ్ వంటి తత్వ వేత్తలు హేతుబద్ధమైన పద్ధతుల ద్వారా పరస్పర అవసరాలను సమన్వయ పరచవీలౌతుందని అభిప్రాయ పడ్డారు.

శక్తి సమన్వితమైన పురాతన రాజకీయాలనుండి అంతర్జాతీయ సమాజాన్ని సాధించటానికి ఆదర్శవాదులు మూడు ముఖ్య మార్గాలను సూచించారు. అవి. 1.వివిధ రాజ్యాలు శక్తి ప్రేరితమైన కుటిల రాజకీయాలను వదలి, నిష్పక్షపాత వైఖరిని అవలంబించి, నైతిక సూత్రాల ఆధారంగా తమ అంతర్జాతీయ ప్రవర్తనను మలచుకోవాలి. ఆవిధంగా చేసిన రోజున శక్తి రాజకీయాల కుటిల ప్రభావం తగ్గటానికి అవకాశముంటుంది.2.అంతర్జాతీయ సమాజంలోని నియంతృత్వ శక్తుల మనుగడను తగ్గించటానికి ప్రయత్నం చేయాలి. ఆదర్శవాదుల అభిప్రాయంలో అంతర్జాతీయ సమాజంలో ఇంతవరకు జరిగిన సంఘర్షణలకు మూలకారణం ప్రజాస్వామిక - నియంతృత్వ శక్తులు అంతర్ధానమైనప్పుడు, సంఘర్షణలకు అవకాశం ఉండదని వీరి భావన. 3.ప్రపంచ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా శక్తి రాజకీయాలను అంతర్జాతీయ సమాజంలో నిరోధించాలి. ఈ మార్గాల ద్వారా ఆదర్శ వాదులు ఆదర్శవంతమైన సమసమాజాన్ని సాధించటానికి అవకాశముంటుందని భావించారు.

3.4 వాస్తవిక వాదం

ఆదర్శవాదులకు భిన్నంగా వాస్తవిక వాదులు సమకాలీన పరిస్థితులకు, భద్రత మరియు శక్తి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. వీరి దృక్పథం మానవ స్వభావం పట్ల వీరికున్న అభిప్రాయాలను ఆధారంగా చేసుకొని రూపుదిద్దుకోవటం జరిగింది. వీరి అభిప్రాయంలో మానవుడు హాబ్స్ ప్రాకృతిక వ్యవస్థలోని మానవుని లాగా అభద్రతా భావనకు లోనై ఉంటాడు. సమాజంలోని ఇతర వ్యక్తులు తనను నాశనం చేయటానికి ప్రయత్నిస్తూ ఉంటారనే భావనతో, తనను రక్షించుకోవటానికి అవసరమైతే ఇతరులను చంపటానికి ప్రతిమానవుడు సిద్ధంగా ఉండాలని వాస్తవిక వాదులు అభిప్రాయపడ్డారు. ఇదే అభిప్రాయాన్ని అంతర్జాతీయ సమాజానికి అన్వయించినప్పుడు, అంతర్జాతీయ రంగంలో ప్రతి రాజ్యం తన జాతీయ ప్రయోజనాన్ని పరిరక్షించు కోవటానికి, పెంపొందించుకోవటానికి సిద్ధంగా ఉండాలని వీరు అభిప్రాయపడ్డారు. ఆవిధంగా అంతర్జాతీయ సమాజంలో శతృత్వం, సంఘర్షణ అనేవి సాధారణ విషయాలుగా వీరు భావించారు. అంతేగాక వీరి అభిప్రాయంలో శక్తినిగురించి పోరాటం (Struggle for Power) అనేది అంతర్జాతీయ సమాజంలో ఒక శాశ్వతమైన, మరియు సర్వవ్యాప్తమైన అంశము.

BRAOU

ఈ కారణంగానే వాస్తవిక వాదులు రాజ్య ప్రయోజనాలకు, వివిధ ప్రక్రియలు తమ రాజ్యప్రగతికి ఏవిధంగా ఉపయోగకరంగా ఉండగలవు అన్న విషయాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఈ సందర్భంలో వీరు నైతిక సూత్రాలపట్ల ఉదాసీన వైఖరి (Indifference)ని వ్యక్తీకరించారు. రాజ్య ప్రయోజనాలను పరిరక్షించలేని నైతిక సూత్రాలకు ఆధిక్యత ఇవ్వటాన్ని వీరు ఖండించారు. రాజ్యం యొక్క పరిస్థితులకు, అవసరాలకు, ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలనేగాని, కేవలం నైతిక ధృక్పథంలోనే ఉండటానికి వీలులేదని వీరి భావన. జార్జ్ ఎఫ్. కెన్నెన్ దృష్టిలో ఏ ఒక్కరు తమనైతిక సిద్ధాంతాలను ఇతరులపై రుద్దే ప్రయత్నం చేయరాదు. హేన్స్ జె. మార్గెంతా రాజ్య అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, విదేశాంగ నీతి అనేది నైతిక సూత్రాలకు కాక రాజ్య అవసరాలకు అనుగుణంగా ఉండాలని వాదించాడు.

3.5 హేన్స్ జె. మార్గాంథో - రాజకీయ వాస్తవిక వాదం

వాస్తవిక వాద సిద్ధాంతాన్ని ఎందరో రచయితలు సమర్థించినప్పటికీ, వాస్తవిక వాదానికి ఒక సిద్ధాంత రూపకల్పనను, ప్రాచుర్యాన్ని కలిగించిన ఘనత అమెరికన్ రాజనీతిజ్ఞుడు హేన్స్ జె మార్గాంతౌకు చెందుతుంది. వాస్తవానికి మార్గాంతౌ సిద్ధాంతాన్ని ఒక ప్రత్యేకమైన భావనా సాంప్రదాయం (School of Thought) గా మలచి, దానికి మాతన జీవాన్ని ప్రసాదించాడు. అందువల్లే, సిద్ధాంతాన్ని కొందరు అతని పేరు మీద, మార్గాంతౌయిజమ్ (Morgenthauism) అని పర్యాయపదంతో కూడా పిలుస్తారు. మార్గాంతౌ అభిప్రాయంలో జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, శక్తిని అధీనం చేయటమే సిద్ధాంతంలోని ప్రధానాంశము. దీనిని, వాస్తవిక వాద సిద్ధాంతం, అనటానికి ప్రధాన కారణం ఇది జాతీయ ప్రయోజనాలతో, ముడిపడి ఉండటమే. వివిధ రాజ్యాల రాజకీయ నాయకులు తమ తమ జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి లేదా సాధించడానికి, శక్తిని ఆధారం చేసుకొని ఏరీతిగా వ్యవహరిస్తారో సిద్ధాంత పరంగా తెలియపరచటమే ఈ సిద్ధాంత ముఖ్య లక్షణము. శక్తికి, ఇందులో కీలకమైన స్థానం ఇవ్వటం వలన సిద్ధాంతాన్ని శక్తి ఆధార సిద్ధాంతమని (Power approach) అని కూడా అంటారు. మార్గాంతౌ ఉద్దేశంలో శక్తి అనగా 'ఇతర మనుష్యుల యొక్క ఆలోచనలు, చర్యలపై ఒక మనిషికలిగి ఉన్న నియంత్రణ.'

మార్గాంతౌ వాస్తవిక వాద సిద్ధాంతాన్ని 'జాతి రాజ్యాల మధ్య రాజకీయాలు' (Politics Among Nations) అన్న తన ప్రసిద్ధ గ్రంథంలో వివరించారు. గ్రంథము మొదట అధ్యాయంలో మార్గాంతౌ తన సిద్ధాంతాన్ని వాస్తివిక వాదం అనడానికి ప్రధాన కారణం : 'మానవ స్వభావాన్ని, చారిత్రక ప్రక్రియలను యథార్థంగా చిత్రీకరించటానికి ప్రయత్నం చేయటమే'నని పేర్కొన్నాడు. అంతేగాక అతడు తన సిద్ధాంతాన్ని అనుభవ పూర్వక (Empirical) మరియు ఆచరణాత్మక (Pragmatic) సిద్ధాంతముగా పేర్కొన్నాడు. మార్గాంతౌ సిద్ధాంతంలోని సారాంశము రాజనీతి వాస్తవిక వాదానికి సంబంధించి అతడు వివరించిన ఆరుమేలికాంశాలె. వాటిని మనం సంక్షిప్తంగా చర్చిద్దాం. అవి :

1) నవ స్వభావంపై ఆధారపడిన వస్తుపరమైన సూత్రాల (Objective laws)చే రాజనీతి శాసించబడుతోంది. సాంఘిక ప్రపంచములో మానవుని స్వభావాన్ని శాసించే నియమాలు శాశ్వతమైనవి. కాబట్టి మానవ స్వభావం ఆధారంగా రూపొందించిన రాజకీయ సిద్ధాంతాలు కూడ శాశ్వతత్వాన్ని కలిగి ఉంటాయి. అందువలన మానవ స్వభావానికి సంబంధించిన వాస్తవాలను జాగ్రత్తగా పరిశీలించి, రాజకీయ సిద్ధాంతాల రూపకల్పనలో వాటిని హేతుబద్ధంగా అన్వయించటమే మనం చేయవలసింది.

2) రాజకీయ వాస్తవిక వాదంలో ముఖ్యమైంది జాతీయ ప్రయోజనం (National Interest). రాజ్యాధి నేతలయొక్క ఆలోచన, చర్యలు జాతీయ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని శక్తిపై ఆధారపడి ఉంటాయి. అంతర్జాతీయ

సంబంధాలలో ఏది వాంఛనీయమో, ఏదీ సాధ్యమో అనేదానికి ప్రాధాన్యత నీయదు. వాస్తవిక వాదం దృష్టిలో ఒక రాజ్యంయొక్క విదేశాంగ విధానం ఆరాజ్యం రాజకీయంగా విజయం సాధించటానికీ ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి. ఇందు పాల్గొను రాజకీయ నాయకుల భావాలకు, సిద్ధాంతాలకు ఇది దూరంగా ఉండాలి.

3) వాస్తవిక వాదం 'ప్రయోజనం' అనే పదానికి నిర్దిష్టమైన అర్థాన్ని ఆపాదించడం. 'ప్రయోజనం' అనేది రాజకీయాలలో శాశ్వతమైన అంశం అయినప్పటికీ, 'ప్రయోజనం' స్వభావాన్ని నిర్ణయించడంలో పరిసరాలు (Environment) చాలా ప్రధాన పాత్ర నిర్వహిస్తాయి. మారిన, మారుతున్న పరిసరాలను బట్టి జాతీయ ప్రయోజనం, స్వభావం కూడ మారుతూ ఉంటుంది. అంతేకాకుండా వాస్తవిక వాదంలో, దృష్టిలో పరిస్థితుల ప్రభావాన్నిబట్టి ఒక రాజ్య జాతీయ ప్రయోజనం, వేరొక రాజ్య జాతీయ ప్రయోజనానికి భిన్నంగా ఉంటుంది.

4) రాజకీయ వాస్తవిక వాదం నైతిక సూత్రాలపట్ల ఉదాసీన వైఖరిని అవలంభించినప్పటికీ, అంతర్జాతీయ సంబంధాలలో విశ్వజనీనమైన నైతిక సూత్రాలను రాజ్యాల ప్రవర్తనకు నిష్కర్షగా అపాదించలేమని భావిస్తుంది. పరిస్థితులను బట్టి, కొన్ని సందర్భాలలో రాజ్యాధిపతులు వ్యవహరించే తీరుకు అనుకూలంగా నైతిక సూత్రాలను మలచుకోవలసి ఉంటుంది. వాస్తవిక వాదం అభిప్రాయంలో 'దూరదృష్టి'తో కూడిన వివేచన (Providence) అనేది రాజకీయాలలో చాల ఉత్కృష్టమైనది.

5) విశ్వాన్నంతటినీ శాసించే నైతిక సూత్రాలకు, ఒక రాజ్యం అనుసరించే నైతిక సూత్రాలకు మధ్య పోలికను ఆపాదించడం అనవసరము. అంతర్జాతీయ సంబంధాలలో ప్రతిరాజ్యం 'శక్తి' ఆధారంగా తన అంతర్జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుంది.

6) ఆర్థిక శాస్త్రం ఏవిధంగా తన ప్రయోజనాన్ని, పరిధిని సంపద ద్వారా సూచిస్తుందో, అదేవిధంగా రాజనీతి శాస్త్రం తన పరిధిని, ప్రయోజనాన్ని 'శక్తి' ద్వారా వ్యక్తపరుస్తుంది.

BRAOU

మార్గాంతౌ తన రాజకీయ వాస్తవికవాద సిద్ధాంతాన్ని మూడు మౌలిక అంశాల (Basic Assumptions) పై ఆధారపడి రూపొందించాడు. అవి :1.రాజనీతిజ్ఞులు తమ జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరిస్తారు. 2. ప్రతి రాజ్యం జాతీయ ప్రయోజనం ఆరాజ్యం ప్రాదేశిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ప్రభావాల వ్యాప్తిని పెంపొందించుకోవటానికి తన శక్తిని ఉపయోగిస్తుంది. దీనిని బట్టి వాస్తవికవాదం దృష్టిలో ఒక రాజ్యం విదేశాంగ విధానం 'శక్తి' లేక 'ప్రభావం' ఆధారంగానే రూపొందించబడుతుంది.

అంతర్జాతీయ సంబంధాలలో మార్గాంతౌ 'శక్తి'ని ఒక సాధనం (Means) గాను, లక్ష్యం (end) గాను కూడ పరిగణించాడు. అతని ఉద్దేశంలో శక్తి ద్వారానే జాతీయ ప్రయోజనం కాపాడబడుతుంది. అదేవిధంగా జాతీయ ప్రయోజనాన్ని పరిరక్షించటానికి శక్తి అవసరమౌతుంది.

మార్గాంతౌ అభిప్రాయంలో జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలకు మూలం శక్తి. అందుచేతనే అతడు అంతర్జాతీయ రాజనీతిని, సాధారణ రాజనీతి సిద్ధాంతంలో ఒక ప్రత్యేక భాగంగా పరిగణించాడు. ఈకారణంగానే సాధారణ రాజకీయాలకు, అంతర్జాతీయ రాజకీయాలకు మధ్య ఎటువంటి భేదం లేదని మార్గాంతౌ అభిప్రాయపడ్డారు. ఈతని భావనలో వివిధ వ్యక్తుల మధ్యగాని, రాజకీయ పక్షాల మధ్యగాని ఏర్పడే పోటీలేక సంఘర్షణ శక్తి కోసమే. ఇదే రాజ్యాల మధ్య జరిగినప్పుడు అది అంతర్జాతీయ సంబంధాల పరిధిలోకి వస్తుంది.

మార్గాంతౌ పదే పదే అంతర్జాతీయ సంబంధాల సారాంశం 'శక్తి'గా చెప్పడం జరిగింది. అయితే 'శక్తి' అనేది జాతీయో ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరిస్తుంది. విదేశాంగ విధానాన్ని అత్యంత ప్రభావితం

చేసేది జాతీయ ప్రయోజనమే. కానీ జాతీయ ప్రయోజనాల దృష్ట్యా, మారుతున్న పరిస్థితులను గుర్తించి వాటికి అనుగుణంగా వ్యవహరించడం విదేశాంగ విధానపు ప్రాథమిక కర్తవ్యమని మార్గాంతౌ నొక్కి చెప్పాడు.

మార్గాంతౌ జాతీయ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చినప్పటికీ నైతిక సూత్రాల విలువను గుర్తించారు. రాజకీయ చర్యల వెనుక నైతిక లక్ష్యం ఉండాలని భావించారు. కానీ అదే సమయంలో నైతికపరమైన సానుభూతికి, జాతీయ ప్రయోజనాలకు మధ్య ఘర్షణ వచ్చినప్పుడు జాతీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని మార్గాంతౌ వాదించాడు.

మార్గాంతౌ అంతర్జాతీయ రంగంలో శాంతిని నెలకొల్పటానికి అనువైన వివిధ మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని మూడు తరగతులుగా వర్గీకరించాడు. అవి : 1.నియంత్రణ ద్వారా శాంతి (Peace Through Limitation) నిరాయుధీకరణ, ఆయుధాల నియంత్రణ, సమిష్టి భద్రత మొ॥వి. 2.పరివర్తన (మార్పు) ద్వారా శాంతి (Peace through transpermation) ప్రపంచ ప్రభుత్వం ఏర్పాటు, ప్రపంచ రాజ్యం లేదా విశ్వసమాజం స్థాపన మొ॥వి.3.సర్దుబాటు ద్వారా శాంతి (Peace through accommodation), దౌత్యనీతి. ఈమూడు మార్గాలలో మార్గాంతౌ సర్దుబాటు ద్వారా రాజకీయ దౌత్యనీతి ద్వారానే అంతర్జాతీయ సమాజంలో శాంతిని సమర్థవంతంగా నెలకొల్పటానికి అవకాశముంటుందని భావించాడు. ఈతని అభిప్రాయంలో దౌత్యనీతి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అంతర్జాతీయ సంఘర్షణలను, వివాదాలను సర్దుబాటు చేయటానికి, తగ్గించటానికి, పరోక్షంగా ప్రపంచ ప్రజల మధ్య సదవగాహనను పెంపొందించి ప్రపంచ రాజ్యం వైపు సముఖులుగా మార్చటానికి దోహదం చేస్తుందని అభిప్రాయ పడినాడు. అదే సమయంలో మార్గాంతౌ ప్రపంచశాంతిని స్థాపించటానికి అనువైన వివిధ మార్గాలను - ప్రాబల్య సమతుల్యము, అంతర్జాతీయ న్యాయం, అంతర్జాతీయ నైతిక సూత్రాలు, ప్రపంచ ప్రజాభిప్రాయం మొ॥వి గురించి కూడ వివరించాడు.

BRAOU

3.6 వాస్తవిక వాదం - ఆదర్శ వాదం : వివాదం

వాస్తవిక వాదం, ఆదర్శవాదాల మధ్య ఉన్న వివాదం రెండు ప్రపంచ యుద్ధాలమధ్య తీవ్రమై బహిరంగం కావటం జరిగింది. ఈకాలంలో ఆదర్శవాద ప్రభావితం అయిన విదేశాంగ నీతి అంతర్జాతీయతా వాదాన్ని ప్రోత్సహించగా, వాస్తవిక వాదంపై ఆధారపడిన విదేశాంగ నీతి జాతీయతా వాదాన్ని బలపరుస్తున్నదని భావించడం జరిగింది. కొందరి దృష్టిలో ఆదర్శవాదం శాంతిని, వాస్తవికవాదం యుద్ధాన్ని సమర్థిస్తాయి. ఆదర్శవాదం ప్లేటో వంటి తత్వవేత్తలు ఆశించిన శ్రేయోరాజ్యాన్ని శాసించగా, వాస్తవిక వాదం మాకియవెల్లి వంటి ప్రబుద్ధులు వివరించిన శక్తివంతమైన (అవసరమైతే క్రూరమైన) రాజ్యాన్ని బలపరుస్తుందని భావించారు. ఆదర్శవాదం అంతర్జాతీయ రాజకీయాలలో తాత్విక విలువలను ప్రోత్సహించగా, వాస్తవిక వాదం శక్తి రాజకీయాలను సమర్థించటం జరిగింది. ఆదర్శవాదం శాంతియుత సహజీవనాన్ని ఆశించగా, వాస్తవిక వాదం పోటీ, పోరాటాల వైపు దారితీస్తుంది. ఆదర్శవాదం నైతిక విలువపై ఆధారపడి సహజీవనం, పరస్పర అవగాహనలను ప్రోత్సహిస్తే, వాస్తవిక వాదం కేవలం శక్తిని సమకూర్చుకొనడమే ధ్యేయంగా పెట్టుకొని అసహనానికీ, ద్వేషానికీ, పోటీలకు, యుద్ధోన్మాద చర్యలకు అవకాశం కల్పించింది. ఆదర్శవాదం అంతర్జాతీయ ప్రయోజనాలను కాపాడటానికి ప్రయత్నిస్తే, వాస్తవిక వాదం జాతీయతను, జాతీయ అవసరాలను పరిరక్షించగల విదేశాంగ నీతిని ప్రోత్సహిస్తుంది. ఈ విధంగా ఒక వైపు ఆదర్శవాదం, మరోవైపు వాస్తవిక రాజకీయ వాదులను రాజనీతిజ్ఞులను తనువైపు ఆకర్షించుకోగలుగుతున్నది.

ఆదర్శవాదం, వాస్తవిక వాదాల మధ్యనున్న భేదాలను దృష్టిలో పెట్టుకొని క్విన్సీరైట్ (Quincy Right) ఆదర్శవాదులను దూరదృష్టిగల వారిగానూ, వాస్తవిక వాదులను హ్రస్వ దృష్టిగల వారిగాను పేర్కొన్నాడు. వాస్తవిక వాదం తక్షణ జాతీయ ప్రయోజనాల దృష్ట్యా నిర్ణయాలు తీసుకొంటుందని ఈతని భావన. ఈతని అభిప్రాయంలో

వాస్తవిక వాదం భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తక్షణ అవసరాలను ఉపేక్షించరాదని చెప్పగా, ఆదర్శవాదం తక్షణ ప్రయోజనాలకై భవిష్యత్‌ను విస్మరించరాదని భావిస్తుంది.

అదే విధంగా రీన్ హోల్డ్ నీబర్ (Rein Hold Niebur) ఆదర్శవాదులను, 'వెలుగులో ఉన్న వ్యక్తులుగా' ను (Children of light), వాస్తవిక వాదులను 'చీకటిలో యున్న వ్యక్తులుగా'ను (Children of darkness) వర్ణించాడు. ఆదర్శవాదులు తమ స్వప్రయోజనాల కంటె ఇతరుల స్వప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యత నిస్తారని తను అభిప్రాయపడ్డాడు. ఈ కారణంగా అంతర్జాతీయ సమాజంలో ఆదర్శవాదుల కంటే వాస్తవిక వాదులే తమ ప్రయోజనాలను బాగా సాధించుకోగలరని నీబర్ అభిప్రాయం పడ్డాడు. ఆదర్శవాదులు మంచి వారైనప్పటికీ అంతర్జాతీయ సమాజంలోని సమస్యలను సరిగా అర్థం చేసికొనజాలరని, వాస్తవిక వాదులు స్వార్థపరులైనప్పటికీ తెలివితేటలతో తమ ప్రయోజనాలను పరిరక్షించుకోగలరని అభిప్రాయపడ్డాడు. నీబర్ వాస్తవిక వాదులు, ఆదర్శవాదులు కూడ పరస్పర అవగాహన చేసికొని ఒకరి నుండి మరొకరు కొంతవరకు అర్థం చేసికొని ప్రపంచశాంతికి దోహదం చేయగలరని ఆశించాడు.

నేటి ప్రపంచ పరిస్థితులను నిష్పక్ష పాతంగా పరిశీలించినపుడు ఏ ఒక్క వాదం పరిపూర్ణమైనదని చెప్పజాలం. కొన్ని పరిస్థితులలో ఆదర్శవాదాన్ని, మరి కొన్ని పరిస్థితులలో వాస్తవిక వాదాన్ని పాటించవలసి వస్తుంది. అందువలననే ప్రసిద్ధ చరిత్రకారుడగు ఇ.హెచ్.కార్ "ఆచరణలో ఏ వాస్తవిక వాదీ నైతిక సూత్రాలను నిర్లక్ష్యం చేయజాలడు. ఏ ఆదర్శవాదీ పూర్తిగా స్వప్రయోజాలను విస్మరించజాలడు" అని అభిప్రాయపడ్డాడు. అదే పంథాలో జాన్. హెచ్. హెర్జ్ (Johan H. Herz) తన రాజకీయ వాస్తవిక వాదం రాజకీయ ఆదర్శవాదం (Political Realism and political Idealism) అన్న గ్రంథంలో వాస్తవిక వాదాన్ని కాని, ఆదర్శవాదాన్ని కాని అతిగా సమర్థించకుండా రెంటిని, తగురీతిలో సమన్వయ పరచాలని భావించారు. ఆ విధంగా సమన్వయ పరచగలిగినప్పుడు అంతర్జాతీయ సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించడానికి గాని, అవగాహన చేసుకోవడానికి అవకాశముంటుంది. అదే విధంగా రాజనీతిజ్ఞులు, విధాన నిర్ణేతలు ఏ ఒక్క దృక్పథానికి కట్టుబడి ఉండక, రెంటిలోని మంచిని గ్రహించి మధ్యే మార్గంగా వ్యవహరించగలిగినప్పుడు రాజ్య ప్రవర్తనకు సంబంధించి సరియైన విధానాలను రూపొందించటానికి, తద్వారా అంతర్జాతీయ సమాజంలో రాజ్యాల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందించి అంతర్జాతీయ శాంతిని నెలకొల్పడానికి వీలవుతుంది.

DRAOU

3.7.0 వ్యవస్థా సిద్ధాంతం

అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి వ్యవస్థా పద్ధతి చాల ముఖ్యమైందిగా పరిగణింపబడుతోంది. ఇది 20వ శతాబ్దంలో సామాజిక శాస్త్రంలో వచ్చిన ప్రవర్తనా వాద విప్లవ ఫలితంగా ఆవిర్భవించిన ప్రధాన సిద్ధాంతాలలో ఒకటి. నిజానికి 'వ్యవస్థాపద్ధతి' కాక 'వ్యవస్థా విశ్లేషణ' అన్నది 'Systems Analysis' అనే ఆంగ్లపదానికి తెలుగు అనువాదంగా పేర్కొనవచ్చు. నిఘంటువు ప్రకారం వ్యవస్థా పద్ధతి అంటే ఒక క్రమపద్ధతి కాక ఒక నిర్దిష్ట విధానం అని అర్థం, కానీ ఈ పదం సామాజిక శాస్త్రాలలో వివిధ రకాలుగా వివిధ రచయితలచే నిర్వచించబడింది.

3.7.1 'వ్యవస్థ' - అర్థవివరణ :

లుడ్విగ్ వాన్ బార్తలాన్ఫీ 'వ్యవస్థ' అంటే పరస్పర సంబంధమున్న అంశాల కూడలి (a set of elements Standing in interaetion) అని నిర్వచించినాడు. వివిధ విషయాల మధ్య వాటి వైఖరుల మధ్య సంబంధాన్ని కలిగిఉన్న అమరికను వ్యవస్థ (a set of object together with relationship between the objects and between their attributes) అని హాక్ మరియు ఫాజన్ భావించినారు. క్రాన్ ఛెర్రి అభిప్రాయంలో "సంపూర్ణతను కలిగిఉండి వివిధ భాగాలు, వాటి వైఖరుల సమ్మేళనా ఫలితంగా ఏర్పడినదే" (a system is a whole which is compounded of many parts an ensemble of attributes) వ్యవస్థ అనేది పరస్పర ఆధార భూతమైన

భాగాలను కలిగియుండి, దానికి బయట పరిసరాలకు మధ్య ఒక నిర్దిష్టమైన సరిహద్దును కలిగి ఉండాలని గాబ్రియల్ ఆల్మండ్ మరియు పావల్ భావించినారు.

ఈ నిర్వచనాలనుబట్టి 'వ్యవస్థ' అనే దానికి ఈకింది లక్షణాలుండాలని చెప్పవచ్చు. అవి :

1. వ్యవస్థ అనేది పరిపూర్ణమైనదిగా (Compreihensive) ఉండాలి.

2. వ్యవస్థలోని వివిధ లంశాల మధ్య ప్రతిస్పందన లేదా పరస్పర సంబంధం (Interaction) అనేది ఉండాలి.

3. వ్యవస్థకు, పరిసరాలకు మధ్య నిర్దిష్టమైన సరిహద్దు ఉండాలి.

3.7.2 'అంతర్జాతీయ సంబంధాల'లో వ్యవస్థాపద్ధతి - ఆవిర్భావం :

వ్యవస్థా సిద్ధాంతానికి అధ్యక్షులుగా జీవశాస్త్రజ్ఞులను (Biologists) పేర్కొనవచ్చు. వాస్తవానికి 'వ్యవస్థ' అనే భావన మొట్టమొదటు సారిగా 1920 దశకంలో లుడ్విగ్ వాన్ బార్తలాన్ఫీ అనే జీవ శాస్త్రజ్ఞుని రచనలలో గోచరిస్తుంది. ఈ తరువాత కాలక్రమేణా రెండవ ప్రపంచ యుద్ధం తరువాత సామాజిక శాస్త్రాలలో ఇది ముఖ్యమైన స్థానాన్ని సంపాదించుకుంది. సామాజిక శాస్త్రాలలో అది మొదటు మానవ శాస్త్రంలోను, ఆతరువాత వరుసగా సమాజ శాస్త్రంలోను, మనోవైజ్ఞానిక శాస్త్రం, రాజనీతి శాస్త్రాలలోను, అన్వయించబడి ఒక ముఖ్య సిద్ధాంతంగా రూపుదిద్దుకుంది. మానవ శాస్త్రంలో ఈసిద్ధాంతాన్ని అభివృద్ధి చేసిన ఘనత ఎమిలిడర్క్‌హీం, ఎ.ఆర్. రాడ్ క్లైఫ్ బ్రౌన్, బ్రానిస్లా మలినోవిస్కీలకు చెందుతుంది. మానవ శాస్త్రం నుండి ఇది రాజనీతి శాస్త్రానికి రాబర్ట్ కె. మెర్టన్ మరియు టాల్కాట్ పార్సన్స్ అనే ఇద్దరు ప్రముఖ సామాజిక శాస్త్రవేత్తల రచనల ద్వారా ప్రవేశించింది. రాజనీతి శాస్త్రంలో దీన్ని డేవిడ్ ఈస్టన్, గాబ్రియల్ ఆల్మండ్ అనే రచయితలు వివరించి ప్రాచుర్యంలోనికి తీసికొని వచ్చారు. రాజనీతి శాస్త్రంలో ఈస్టన్ వివరించిన వ్యవస్థా సిద్ధాంతాన్ని సాధారణ వ్యవస్థల సిద్ధాంతం లేదా 'ఉత్పాదక- ఉత్పాదిత సిద్ధాంతం (Input and output Theory)'గా పేర్కొనగా, ఆల్మండ్ సిద్ధాంతాన్ని నిర్మితులు - విధుల విశ్లేషణ (Structuret Functional Analysis)గా పేర్కొన్నారు. రాజనీతి శాస్త్రం నుండి ఈ సిద్ధాంతం 'అంతర్జాతీయ సంబంధాల' లోకి ప్రవేశించింది. 'అంతర్జాతీయ సంబంధాల'లో దీనిని జెమ్స్ రాసెనౌ (James Rosenau), పిత్రిమ్ సొరొకిన్ (Pitrim Sorokin), ఛార్లెస్ మెక్లిలాండ్ (Charles Mecleland), కెన్నెత్ బౌల్డింగ్ (Kenneth Boulding), మోర్టాన్ ఎ. కాప్లాన్ (Morton A. Kaplan) వంటి రచయితలు వివరించి ప్రాచుర్యంలోకి తీసికొనివచ్చారు.

3.7.3 మోర్టాన్ ఎ. కప్లాన్ - వ్యవస్థా సిద్ధాంతం :

'అంతర్జాతీయ సంబంధాల'లో వ్యవస్థా సిద్ధాంతాన్ని అన్వయించి దానికొక ప్రత్యేక స్థానాన్ని కల్పించిన వ్యక్తి మోర్టాన్ ఎ. కప్లాన్ - ఈతని అభిప్రాయంలో పరస్పర సంబంధాన్ని కలిగిఉన్న అంశాలతోకూడి ఉంది. పరిసరాలనుండి నిర్దిష్టంగా వేరు చేయబడి, పరిసరాల ఆటుపోటు (disturbances)లకు తట్టుకొని మనగలిగే దానిని 'వ్యవస్థ' అని చెప్పవచ్చు.

వ్యవస్థా సిద్ధాంతాన్ని అంతర్జాతీయ సంబంధాలకు అన్వయించినప్పుడు, అంతర్జాతీయ సమాజంలో మనకు గోచరించే వ్యవస్థను 'అంతర్జాతీయ వ్యవస్థ'గా పరిగణించవచ్చు. కప్లాన్ అభిప్రాయంలో అంతర్జాతీయ వ్యవస్థ అంతర్జాతీయ నటులతో కూడుకొని ఉంటుంది. అంతర్జాతీయ నటులను రెండు రకాలుగా విభజింపవచ్చును. అవి 1. జాతీయ నటులు (National Actors), 2. ఆదిక్య జాతీయ నటులు (Super National Actors). ఆదిక్య

EPGOU

జాతీయ నటులను తిరిగి రెండు రకాలుగా విభజింపవచ్చును. అవి 1. వర్గనటులు (Bloc Actors), 2. సార్వత్రిక నటులు (Universal Actors) అమెరికా, ఫ్రాన్సు, బ్రిటన్, ఇటలీ, ఇండియా వంటి రాజ్యాలను జాతీయ నటులుగా పేర్కొనవచ్చు. నాటో (NATO), సీటో (SEATO), ఒపెక్ (OPEC) వంటి రాజ్యాల కూటములను వర్గనటులుగా పేర్కొనవచ్చును. నానా జాతి సమితి, ఐక్యరాజ్యసమితి వంటివి సార్వత్రిక నటుల క్రిందికి వస్తాయి.

కప్లాన్ అభిప్రాయంలో అంతర్జాతీయ నటులను అంతర్జాతీయ వ్యవస్థ యొక్క మూలకాలు (Elements) గా పరిగణించవచ్చును. అందువలననే జాతీయ నటులయొక్క అంతర్గత వ్యవస్థ, స్వభావం, అంతర్జాతీయ వ్యవస్థ యొక్క స్వరూప, స్వభావాలను నిర్దేశించగా, అంతర్జాతీయ వ్యవస్థ యొక్క ప్రవర్తన జాతీయనటుల ప్రవర్తనా సరళిని ప్రభావితం చేస్తూ ఉంటుంది. అంతేకాకుండా, ఈ అంతర్జాతీయ నటుల మధ్యఉన్న వివిధ రకాలైన పరస్పర సంబంధాలను ఆధారం చేసుకొని విభిన్న అంతర్జాతీయ వ్యవస్థలు ఏర్పడుతూ ఉంటాయి. ఈ విధంగా కప్లాన్ ఆరు రకాలైన అంతర్జాతీయ వ్యవస్థలను అంతర్జాతీయ సమాజంలో గుర్తించాడు. వీటిని గురించి వివరంగా తన 'అంతర్జాతీయ రాజకీయాలలో వ్యవస్థ ప్రక్రియ' (Systems and Processin International Politics (1957) అన్న గ్రంథంలో వర్ణించాడు. వీటిలో మొదటి రెండు వాస్తవ రూపం ధరించగా, మిగిలిన నాలుగు అంతర్జాతీయ వ్యవస్థలు భవిష్యత్తులో ఆచరణలోకి వస్తాయని కప్లాన్ భావించాడు. అవి :

A ప్రాబల్య సమతౌల్య వ్యవస్థ (Balance of power systems)

B సరళ ద్వి ధ్రువ వ్యవస్థ (Loose Bi - Polar System)

C దృఢ ద్వి ధ్రువ వ్యవస్థ (Tight Bi - Polar System)

D సార్వత్రిక అంతర్జాతీయ వ్యవస్థ (Universal Actor System or Universal International System)

E క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థ (Hierarchical International System)

F ఏక నిషిద్ధ వ్యవస్థ (Unit veto System)

BRAOU

A ప్రాబల్య సమతౌల్య వ్యవస్థ : 18, 19వ శతాబ్దంలో పాశ్చాత్య ప్రపంచంలో నెలకొని ఉన్న వ్యవస్థను ప్రాబల్య సమతౌల్య వ్యవస్థగా కప్లాన్ పరిగణించారు. ఈ అంతర్జాతీయ వ్యవస్థలో పాల్గొనే అంతర్జాతీయ నటులుగా జాతీయ నటులు మాత్రమే ఉంటారు. మిగిలిన తరగతులకు చెందిన అంతర్జాతీయ నటులకు ఈ వ్యవస్థలో స్థానముండదు. అయితే జాతీయ నటులలో 5 లేదా 6 రాజ్యాలు ప్రధాన జాతీయ నటులు (Essential National Actors) గా పరిగణింప బడతాయి. ఉదా॥నకు మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రియా - హంగేరీ సామ్రాజ్యం, ఇటలీ, అమెరికా వంటి రాజ్యాలు ప్రధాన జాతీయ నటులుగా వ్యవహరించేవి. కప్లాన్ అభిప్రాయం ప్రకారం ప్రాబల్య సమతౌల్య వ్యవస్థ ఆరు ప్రధాన సూత్రాలు ఆధారంగా వ్యవహరిస్తుంది. అవి :

1. ప్రతి ప్రధాన జాతీయ నటుడు అంతర్జాతీయ రంగంలో తన శక్తి సామర్థ్యాలను పెంపొందించు కోవడానికి ప్రయత్నం చేయాలి. ఈ ప్రయత్నాలు సంధి, సంప్రదింపుల ద్వారా జరగాలే కానీ యుద్ధం ద్వారా మాత్రం కాదు.

2. తన ప్రయోజనాలను పరిరక్షించుకోవడం ప్రతి జాతీయ నటుని ప్రధాన బాధ్యత. ఈ బాధ్యతను నిర్వర్తించటానికి ప్రతిరాజ్యానికి శక్తి అవసరము. కాబట్టి ప్రతిరాజ్యం, అవసరం అయితే యుద్ధం ద్వారా కూడ తన శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి ప్రయత్నం చేయాలి.

3. ఏదైనా యుద్ధంలో ప్రధాన జాతీయ నటుడు ఓడిపోయినపుడు, పోరాటాన్ని అంతటితో ఆపాలి. అంతేగాని, ప్రధాన జాతీయ నటున్ని అంతర్జాతీయ సమాజం నుండి తొలగించటానికి ప్రయత్నం చేయకూడదు. ఉ॥కు 1870-71 ఫ్రాంకో - ప్రష్యన్ యుద్ధంలో ఫ్రాన్స్ ఓడిపోయినప్పటికీ, జర్మనీ ఫ్రాన్స్‌ను తన వలస రాజ్యంగా మార్చడానికి కాని, లేదా ఫ్రాన్స్‌ను తన రాజ్యంలో అంతర్భాగంగా చేసుకోవడం ద్వారా ప్రపంచ పటం నుండి దానిని తొలగించటానికి కానీ ప్రయత్నం చేయలేదు.

4. ప్రతి జాతీయ నటుడు అంతర్జాతీయ రంగంలో కొన్ని రాజ్యాలు ఒక కూటమిగా ఏర్పడి మిగిలిన రాజ్యాల పై ఆధిపత్యం చెలాయించే పరిస్థితిని వ్యతిరేకించాలి.

5. ప్రతి జాతీయ నటుడు అంతర్జాతీయ సమాజంలోని ఏఇతర జాతీయ నటుడు ప్రాబల్యాన్ని పెంపొందించుకొని, తద్వారా అధిక్య జాతీయ నటుడుగా (Super National Actor)గా రూపాంతరం చెందటానికి ప్రయత్నించటాన్ని నిరోధించాలి.

6. ఓడిపోయిన లేదా పరాజితుడైన ప్రధాన జాతీయ నటులు తిరిగి అంతర్జాతీయ వ్యవస్థలో ప్రవేశించడానికి అదే విధంగా చురుకైన పాత్రను నిర్వహించటానికి అనుమతించాలి.

ఈ ప్రాబల్య సమతౌల్య వ్యవస్థ 18, 19వ శతాబ్దాలలో అంతర్జాతీయ సమాజంలో ఒక సుస్థిరమైన వ్యవస్థగా నెలకొని ఉన్నప్పటికీ, కొన్ని పరిస్థితుల కారణంగా అది అస్థిరత్వానికి లోనయ్యే అవకాశాలున్నాయి. ప్రధాన జాతీయనటులు ప్రాబల్య సమతౌల్య సిద్ధాంత సూత్రాలకు అనువుగా వ్యవహరించక పోవడం ఒక జాతీయ నటుడు అధిక్య జాతీయ నటుడుగా అభివృద్ధి చెందటానికి ప్రయత్నించడం, కొన్ని జాతీయ నటుల నిర్ణయీకరణ వ్యవస్థలు దెబ్బతినడం మొదలైన పరిస్థితులు కారణంగా ప్రాబల్య సమతౌల్య వ్యవస్థ అస్థిరత్వానికి లోనయ్యే అవకాశముంది. ప్రాబల్య సమతౌల్య వ్యవస్థ ఎప్పుడైనా అస్థిరత్వానికి లోనైప్పుడు అది ఇంకో రకమైన అంతర్జాతీయ వ్యవస్థగా రూపాంతరం చెందుతుంది. ఒక ప్రపంచ యుద్ధం కాని, అంతర్జాతీయ రంగంలో నియంతృత్వ రాజ్యాల ఆవిర్భావం కాని ఇటువంటి మార్పును త్వరితం చేయటానికి దోహద పడతాయి.

కప్లాన్ అభిప్రాయంలో ప్రాబల్య సమతౌల్య వ్యవస్థ అస్థిరత్వానికి లోనై విచ్ఛిన్నమైనప్పుడు, అది యింకొక రకమైన అంతర్జాతీయ వ్యవస్థగా ఆవిర్భవిస్తుంది. సాధారణంగా ప్రాబల్య సమతౌల్య వ్యవస్థ విచ్ఛిన్నమైనప్పుడు అది ద్వి ధ్రువ వ్యవస్థకు దారి తీస్తుందని ఆతను భావించినాడు. ఈ వ్యవస్థలో అంతర్జాతీయ సమాజంలోని వివిధ రాజ్యాలు రెండు ప్రధాన రాజ్యాల ఆధిపత్యంలో రెండు వర్గాలుగా చీలిపోతాయి. దీనినే ద్వి ధ్రువ వ్యవస్థ అని చెప్పవచ్చును. ఈ వ్యవస్థ రెండు రకాలు ఉంటుంది. అవి :

1. సరళ ద్వి ధ్రువ వ్యవస్థ (Loose Bi-polar System)
2. దృఢ ద్వి ధ్రువ వ్యవస్థ (Tight Bi -Polar System)

B సరళ ద్విధ్రువ వ్యవస్థ : నిన్న మొన్నటి వరకు ఉన్న అంతర్జాతీయ సమాజాన్ని సరళ ద్వి ధ్రువ వ్యవస్థగా పరిగణించవచ్చు. ఈ వ్యవస్థలో అంతర్జాతీయ సమాజంలో ఉన్న వివిధ రాజ్యాలు రెండు అగ్ర రాజ్యాల (Super Powers) ఆధిపత్యంలో రెండు కూటములుగా చీలిపోగా, కొన్ని రాజ్యాలు ఏకూటమికి చెందకుండా ఆలీన రాజ్యాలుగా ఉన్నాయి. వాస్తవానికి ఈఆలీన రాజ్యాల అస్థిత్వం వలననే ఈ వ్యవస్థను సరళ ద్వి ధ్రువ వ్యవస్థగా పేర్కొనడం జరిగింది. ఈ సరళ ద్వి ధ్రువ వ్యవస్థ ప్రాబల్య సమతౌల్య వ్యవస్థ నుండి కొన్ని విషయాలలో విభేదిస్తుంది. అవి :

(i) ప్రాబల్య సమతౌల్య వ్యవస్థలో జాతీయనటులు మాత్రమే ఉండగా, సరళ ద్వి ధ్రువ వ్యవస్థలో జాతీయ నటులు, ఆధిక్య జాతీయ నటులు - రెండూ ఉంటాయి.

(ii) ఆధిక్య జాతీయ నటులు తిరిగి నాటో, సామ్యవాద కూటమి వంటి కూటమి నటులుగాను, ఐక్యరాజ్యసమితి వంటి సార్వత్రిక నటులుగాను విభజింపబడి ఉంటాయి.

(iii) ఈ వ్యవస్థలో పాల్గొనే వివిధ అంతర్జాతీయ నటుల లక్ష్యాలు ఒకే విధంగా ఉండవు. కాబట్టి ఈ వ్యవస్థపట్ల వివిధ అంతర్జాతీయ నటుల వైఖరి ఒకే విధముగా ఉండదు. ఉదా॥కు నాటో వర్గం సామ్యవాద రాజ్యాల కూటమి ప్రాబల్యాన్ని తగ్గించటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే, సామ్యవాద రాజ్యాల కూటమి నాటో రాజ్యాల కూటమి యొక్క ప్రాబల్యాన్ని తగ్గించడానికి ప్రయత్నం చేస్తూ యుంటుంది. అదే సమయంలో అలీన రాజ్యాలు ఈ రెండు కూటముల మధ్య వైరుధ్యాలను, విభేదాలను తగ్గించడానికి, తద్వారా అంతర్జాతీయ ఉద్రిక్తలను తగ్గించి, శాంతి భద్రతలను నెలకొల్పడానికి ప్రయత్నం చేస్తూ ఉంటాయి. అదే విధముగా సార్వత్రిక నటుడుగా పేర్కొనబడిన ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ శాంతిని, రాజ్యల మధ్య సుహృద్భావాన్ని పెంపొందించటానికి కృషి చేస్తూ ఉంటుంది. ఆ విధంగా ఈ వ్యవస్థలోఉన్న వివిధ అంతర్జాతీయ నటులు వివిధ రకాలుగా వ్యహరిస్తూ ఉంటాయి. అదే విధంగా ఈ వ్యవస్థకు సంబంధించిన సూత్రాలు కూడా ఈ వ్యవస్థలోనున్న వివిధ రకాలైన అంతర్జాతీయ నటులకు విభిన్నంగా అన్వయింపబడతాయి.

ఈ వ్యవస్థలో ఉన్న వర్గనటుల ప్రాబల్యం వలన, ఐక్యరాజ్యసమితి, అలీనారాజ్యాల అస్థిత్వం వలన, వీటికి తగినంత ప్రాధాన్యత లేకపోవటం వలన సరళ ద్విధ్రువ వ్యవస్థ స్వాభావికంగా కూడా అస్థిరత్వాన్ని కలిగి ఉంటుంది. ఈ అస్థిరత్వం కారణంగా సరళి ద్విధ్రువ వ్యవస్థ మిగిలిన ఏఇతర అంతర్జాతీయ వ్యవస్థగానైనా దృఢ ద్విధ్రువ వ్యవస్థగా గాని లేక సార్వత్రిక అంతర్జాతీయ వ్యవస్థగా గానీ లేక క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థగా గాని లేక ఏక నిష్ఠిద్ధ వ్యవస్థగా గాని మార్పు చెందవచ్చునని కప్లాన్ అభిప్రాయపడ్డారు.

(C) దృఢ ద్విధ్రువ వ్యవస్థ : సరళ ద్విధ్రువ వ్యవస్థ విచ్ఛిన్నమైపుడు సాధారణంగా దృఢ ద్విధ్రువ వ్యవస్థ ఏర్పాటు కావడానికి దోహదం చేస్తుంది. సరళ ద్విధ్రువ వ్యవస్థ దృఢ ద్విధ్రువ వ్యవస్థ కొన్ని సామాన్య లక్షణాలను కలిగి ఉన్నప్పటికీ మరికొన్ని విషయాలలో ఈ రెండు విభిన్నంగా ఉంటాయి. సరళి ద్విధ్రువ వ్యవస్థలో వలె, దృఢ ద్వి ధ్రువ వ్యవస్థలో అంతర్జాతీయ సమాజంలోని వివిధ రాజ్యాలు రెండు అగ్రరాజ్యాల ఆధిపత్యంలో రెండు వర్గాలుగా ఏర్పడినప్పటికీ వ్యవస్థలో అలీన దేశాలకు స్థానం లేక పోవటం పరుష ద్విధ్రువ వ్యవస్థ ముఖ్య లక్షణంగా పేర్కొన వచ్చు. వాస్తవానికి అలీన రాజ్యాలకు ఈ వ్యవస్థలో స్థానం లేక పోవటం వలన దీనిని దృఢ ద్విధ్రువ వ్యవస్థగా పేర్కొనడం జరిగిందని చెప్పవచ్చు. అదే విధంగా ఈ వ్యవస్థలో సార్వత్రిక నటులు సాధారణంగా ఈవ్యవస్థ నుండి అదృశ్యంకావటం జరుగుతుంది. ఒకవేళ అవి ఉన్నప్పటికీ వాటికి పెద్దగా ప్రాముఖ్యత ఉండదు. ఎందుకంటే అలీన రాజ్యాలకు ఈవ్యవస్థలో స్థానం లేక పోవటంతో, సార్వత్రిక నటుల అభిప్రాయాలకు అనుగుణంగా, వాటి లక్ష్యాలకు కట్టుబడి వాటిని బలపరచే ఏవర్గానికి చెందని రాజ్యాలు లేక పోవటంతో అంతర్జాతీయ సమాజంలో వాటి విలువ కూడ చాలవరకు తగ్గిపోతుంది. అందువలననే సార్వత్రిక నటులు ఉన్నప్పటికీ వాటికి ఎటువంటి గుర్తింపు, ప్రాధాన్యత ఉండదు.

దృఢ ద్విధ్రువ వ్యవస్థలో రాజ్యాలు క్రమాను గతంగా వ్యవస్థీకృతం అయినపుడే ఈ వ్యవస్థకు స్థిరత్వం అనేది ఉంటుంది. లేకపోతే అది అస్థిరత్వానికి లోనై, సరళ ద్విధ్రువ వ్యవస్థగా మార్పు చెందటానికి అవకాశం ఉంటుందని కాప్లాన్ అభిప్రాయపడ్డారు.

BRAOU

D. సార్వత్రిక అంతర్జాతీయ వ్యవస్థ : సార్వత్రిక అంతర్జాతీయ వ్యవస్థ అనేది కప్లాన్ అభిప్రాయంలో సరళ ద్వి ధ్రువ వ్యవస్థనుండి అభివృద్ధి చెందడానికి అవకాశముంది. సరళ ద్వి ధ్రువ వ్యవస్థలోని ఐక్యరాజ్యసమితి వంటి సార్వత్రిక నటుడు తన విధులను విస్తృత పరచుకొని, శక్తి సామర్థ్యాలను పెంపొందించుకున్నప్పుడు ఈవ్యవస్థ ఆవిర్భవిస్తుంది. ఈ వ్యవస్థలో సార్వత్రిక నటుడు అతిశక్తివంతంగా ఉండి, అంతర్జాతీయ సమాజంలోని వివిధ రాజ్యాల మధ్య యుద్ధాలను నిరోధించి, వివాదాలను పరిష్కరించగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కానీ అదే సమయంలో వివిధ రాజ్యాలకు స్వతంత్ర రాజ్యాలుగా గుర్తింపు ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే సార్వత్రిక అంతర్జాతీయ వ్యవస్థ అనేది ఒక సమగ్రమైన అంతర్జాతీయ వ్యవస్థగా పేర్కొనవచ్చు. ఈ వ్యవస్థలో వివిధ రాజ్యాలు నిర్వహించవలసిన రాజకీయ, ఆర్థిక, న్యాయ, పరిపాలనా సంబంధమైన విధులను నిర్వహించడానికి అవసరమైన యంత్రాంగాన్ని అంతర్జాతీయ వ్యవస్థ కలిగి ఉంటుంది. ఈ వ్యవస్థ పరిధిలోనే సార్వత్రిక నటుని ఆధ్వర్యంలో జాతీయ నటులు (రాజ్యాలు) తమ లక్ష్యాలను సాధించుకోవలసి ఉంటుంది. అదే విధంగా రాజ్యాలు తమ జాతీయ ప్రయోజనాల కంటే అంతర్జాతీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వవలసి ఉంటుంది. అంతేకాకుండా రాజ్యాల మధ్య వివాదాలు ఉన్నప్పుడు యుద్ధాలకు తలపడకుండా సార్వత్రిక నటుని ఆధ్వర్యంలో శాంతియుతంగా వాటిని పరిష్కరించుకొనవలసి ఉంటుంది.

సార్వత్రిక అంతర్జాతీయ వ్యవస్థ ఎంత ఆదర్శప్రాయంగా ఉన్నప్పటికీ అంతర్జాతీయ సమాజంలో ఉన్న వివిధ రాజ్యాలను లొంగదీసుకొని, వాటిని తన అదుపు, ఆజ్ఞలలో పెట్టుకోగల శక్తి సామర్థ్యాలను కలిగి ఉండటం చాలా కష్టమైన విషయం. అందువల్లే ఈవ్యవస్థలో - అస్థిరత్వానికి అవకాశం ఎక్కువ.

E క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థ : క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థలో, అంతర్జాతీయ రంగంలో ఉన్న ఏదో ఒక జాతీయ నటుడు అంతర్జాతీయ సమాజంలోని మిగిలిన రాజ్యాలను ఆక్రమించుకొని ఒకే రాజ్యంగా ఆవిర్భవిస్తుంది. ఇటువంటి వ్యవస్థ రెండు రకాలుగా ఏర్పడవచ్చు అవి :

BRAOU

1. ప్రత్యక్ష క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థ
   (Directive - hierarchical International System)

2. పరోక్ష క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థ
   (Non-Directive - hierarchical International System)

ప్రత్యక్ష క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థలో నాజీ జర్మనీ వంటి ఒక జాతీయ నటుడు ప్రపంచంలోని మిగిలిన రాజ్యాలను యుద్ధం ద్వారా జయించి, తన ఆధిపత్యంలో ఒకే రాజ్యంగా ఆవిర్భవించడం జరుగుతుంది. కాని పరోక్ష క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థలో అంతర్జాతీయ సమాజంలోని జాతీయ నటులు ఏదో ఒక రాజ్యాన్ని తమను పరిపాలించమని, ప్రజాస్వామ్య బద్ధంగా కోరడం జరుగుతుంది. అనగా అంతర్జాతీయ సమాజంలోని రాజ్యాలు ఏదో ఒక రాజ్యం యొక్క ఆధిపత్యాన్ని తమకి తాముగా అంగీకరించడం జరుగుతుంది.

ప్రత్యక్ష క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థ బలప్రయోగం ఆధారంగా వచ్చినందున, వివిధ జాతుల, సమూహాల మధ్య నున్న విభేదాలు, వైరుధ్యాలు కారణంగా కొంత అస్థిరత్వానికి లోనవుతుంది. అదే క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థలో ఇటువంటి అస్థిరత్వం తక్కువగా వుండే అవకాశం ఉంది.

F. ఏక నిష్ఠ వ్యవస్థ : ఏక నిష్ఠ అంతర్జాతీయ వ్యవస్థలో ఆయుధాల ప్రాముఖ్యత ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యవస్థలో ప్రతి రాజ్యం అంతర్జాతీయ సమాజంలోని ఏ ఇతర రాజ్యమైన తనను నాశనం చేయటానికి ప్రయత్నం

చేసినపుడు, ఆరాజ్యం నాశనం చేయటానికి ముందే ఆశత్రు రాజ్యాన్ని నాశనం చేయగలిగే పరిస్థితిలో ఉంటుంది. ఈ వ్యవస్థ ఒక విధంగా హాబ్స్ వర్ణించిన ప్రాకృతిక వ్యవస్థను పోలియుంటుంది. ప్రతిరాజ్యం వశిబ్స్ వర్ణించిన ప్రాకృతిక వ్యవస్థను పోలియుంటుంది. ప్రతిరాజ్యం ప్రయోజనం అంతర్జాతీయ సమాజంలోని ఇతర రాజ్యాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉంటుందనే భావన ఆధారంగా ఈ వ్యవస్థను ఊహించడం జరిగింది. అంతర్జాతీయ సమాజంలో ఉన్న అన్ని రాజ్యాలు అణ్వాయుధాలను కలిగియున్నప్పుడు ఇటువంటి వ్యవస్థ రూపొందటానికి అవకాశముంటుంది. ఇటువంటి వ్యవస్థలో సార్వత్రిక నటులు కాని, అధిక్య జాతీయ నటులు కాని ఉండే అవకాశం లేదు.

పైన వివరించిన ఆరురకాలైన అంతర్జాతీయ వ్యవస్థలను కాప్లాన్ 1950 దశకంలో అంతవరకు జరిగిన అంతర్జాతీయ సంఘటలను ఆధారంగా రూపొందించారు. కానీ 1760 దశకంలో అంతర్జాతీయ రంగంలో ఎన్నో గుణాత్మకమైన, పరిమాణాత్మకమైన మార్పులు చోటు చేసుకొన్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా కాప్లాన్ నాలుగు క్రొత్త అంతర్జాతీయ వ్యవస్థలను, తన 'అంతర్జాతీయ వ్యవస్థల పరిశోధన - కొన్ని సమస్యలు' (Some problems of International Systems Research (1966)) అన్న వ్యాసంలో రూపొందించాడు. అవి :

1. అత్యంత సరళీకృత ద్వి ధ్రువ వ్యవస్థ
   (The very loose Bi-Polar System)

2. అంతర్జాతీయ సామనస్య వ్యవస్థ
   (The Detente System)

3. అస్థిరత్వ వర్గ వ్యవస్థ
   (Unstable Bloc System)

4. అసంపూర్ణ అణ్వస్త్ర విస్తరణ వ్యవస్థ
   (Incomplete Nuclear Diffusion System)

BRAOU

a అత్యంత సరళీకృత ద్వి ధ్రువ వ్యవస్థ : ఈ వ్యవస్థలో అంతర్జాతీయ రంగంలో ఉన్న రెండు కూటముల మధ్య నిరాయుధీకరణ, ఆయుధాల నియంత్రణకు నిరంతరం చర్చలు కొనసాగుతూ ఉంటాయి. అంతేగాక అంతర్జాతీయ సమాజంలోని రాజ్యాలు రెండు కూటములుగా విడిపోయి ఉన్నప్పటికీ, వర్గ (కూటమి) నిర్మాణం బలహీనంగా ఉండి, వర్గాలు మాత్రం కొనసాగుతూ ఉంటాయి. ఈ వర్గాలు సార్వత్రిక వ్యవస్థ (Universal Organisation) ఆధ్వర్యంలో వ్యవహరిస్తూ అలీన రాజ్యాల మద్దతును పొందటానికి ప్రయత్నం చేస్తూ ఉంటాయి. వర్గాల మధ్య వైషమ్యాలు చాల తక్కువ స్థాయిలో ఉండటం వలన దీనిని అత్యంత సరళీ కృత ద్వి ధ్రువ వ్యవస్థ అని పిలవడం జరిగింది.

(b) అంతర్జాతీయ సామనస్య వ్యవస్థ : ఈ వ్యవస్థలో అంతర్జాతీయ సమాజంలో ఉన్న ఆంగ్లో - అమెరికన్ (పెట్టుబడి దారీ రాజ్యాల) కూటమి, రష్యా ఆధిపత్యంలో ఉన్న సామ్యవాద రాజ్యాల కూటమి, తమ మధ్యనున్న ఉత్రిక్తతలను తగ్గించుకోవడానికి కృషిచేస్తాయి. అంతర్జాతీయ వ్యవహారాలలో ఈ రెండు కూటముల మధ్య పోటీ ఉన్నప్పటికీ, అది ఈ రెండు కూటముల మధ్య తీవ్రమైన సంఘర్షణలకు దారి తీసేదిగా ఉండదు. అంతర్జాతీయ రంగంలో సామరస్య వాతావరణాన్ని పెంపొందించడానికి వీలుగా ఈ రెండు వర్గాలు నిరాయుధీకరణ, ఆయుధాల నియంత్రణ వంటి విషయాలపై ఒక అంగీకారానికి రావడానికి ప్రయత్నం చేస్తూ ఉంటాయి. ఈ ప్రయత్నాలకు అనువుగా ఈ రెండు వర్గాలకు (ఆంగ్లో అమెరికన్ కూటమి, సామ్యవాద రాజ్యాల కూటమి) చెందిన రాజ్యాలు తమ

మధ్య సత్సంబంధాలను నెలకొల్పుకోవడానికి ప్రయత్నాలు చేస్తాయి. అదే సమయంలో ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వ్యవస్థకూడ అంతర్జాతీయంగా ఉద్రిక్తతలను తగ్గించి సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందించడానికి తన వంతు కృషిని కొనసాగిస్తుంది.

(c) అస్థిరత్వ వర్గ వ్యవస్థ : ఇది ఒక విధంగా సామనస్య అంతర్జాతీయ వ్యవస్థకు వ్యతిరేకమైంది. ఈవ్యవస్థలో అగ్రరాజ్యాలైన (Super Power) అమెరికా, రష్యాల మధ్య ఉద్రిక్తతలు పెరిగి, చాలా తీవ్రస్థాయిలో ఉంటాయి. ఈ రెండు వర్గాల మధ్య సామరస్యం కొరవడి అపనమ్మకం పెరిగిపోతుంది. ఈరెండు వర్గాల మధ్య నిరాయుధీకరణ, ఆయుధాల నియంత్రణ వంటి ఒప్పందాలకు అవకాశముండదు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలు మిగిలిన రాజ్యాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటాయి. ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ వ్యవస్థ ఉన్నప్పటికీ దాని పాత్ర చాల పరిమితంగా ఉంటుంది.

(d) అసంపూర్ణ అణ్వాస్త్ర విస్తరణ వ్యవస్థ : ఈ వ్యవస్థలో అమెరికా, రష్యాలతో పాటు సుమారు 15, 20 రాజ్యాలు అణ్వాయుధాలను కలిగి ఉండి, ఇతర రాజ్యాల దురాక్రమణను నిరోధించగలిగే స్థాయిలో ఉంటాయి. అంతర్జాతీయ రంగంలో అగ్రరాజ్యాలు, చిన్న రాజ్యాలు కూడ వివిధ అంశాల మీద ఒప్పందాలను కుదుర్చుకొనే పరిస్థితి ఉంటుంది.

3.7.4 వ్యవస్థా సిద్ధాంతం - సమీక్ష :

'అంతర్జాతీయ సంబంధాల' అధ్యయనంలో వ్యవస్థా సిద్ధాంతం చాలా ప్రాచుర్యాన్ని పొందింది. అంతర్జాతీయ దృగ్విషయాల అధ్యయనంలోను, విశ్లేషణలోను, ఇది ఒక సమగ్ర ధృక్పథాన్ని పెంపొందించటానికి దోహదం చేసింది. అంతర్జాతీయ రంగంలోని సంఘటనలను ఏదో ఒక ప్రత్యేక శాస్త్రానికి సంబంధించిన ధృక్పథంతో కాక వివిధ శాస్త్రాల అంతర్వర్గీయ అధ్యయనాన్ని (Inter disciplinary stuady) ఇది బాగా ప్రోత్సహిస్తోంది. అందువల్ల అంతర్జాతీయ సంఘటనలను సమగ్రంగా అధ్యయనం చేయటానికి వ్యవస్థా సిద్ధాంతం ద్వారా వీలుపడుతుంది.

వ్యవస్థా సిద్ధాంతానికి ఇంతటి ప్రాధాన్యత ఉన్నప్పటికీ ఇది విమర్శలకు అతీతం కాదు. ఈసిద్ధాంతాన్ని విమర్శకులు వివిధ రకాలుగా విమర్శించారు. వాస్తవానికి 'అంతర్జాతీయ వ్యవస్థ' అన్నపదమే కొన్ని సాంకేతిక పరమైన సమస్యలకు అవకాశం కల్పిస్తోది. అదెలాగంటే, ప్రపంచంలోనున్న వివిధ రాజ్యాలు ఒకే అంతర్జాతీయ వ్యవస్థను రూపొందిస్తున్నాయా? లేక అంతర్జాతీయ వ్యవస్థలలో పాలు పంచుకుంటున్నట్లు భావించవచ్చా? ఈ రోజున మనం సామ్యవాద రాజ్యాల వ్యవస్థ, పశ్చిమ, ఐరోపా రాజ్యాల వ్యవస్థ, ఆగ్నేయాసియా రాజ్యాల వ్యవస్థ వంటి పదాలను వింటూ వుంటాము. అయితే వీటిని పరిపూర్ణమైన వ్యవస్థలుగా పరిగణించవచ్చా? లేక వీటిని అంతర్జాతీయ వ్యవస్థలో భాగంగా పరిగణించాలా? కొంతమంది అభిప్రాయంలో అంతర్జాతీయ వ్యవస్థ అనే దానినే మనం వ్యవస్థగా పరిగణించాలి. మిగిలిన వాటిని ఉపవ్యవస్థ (Sub System)లుగా పరిగణించాలే తప్ప, వాటిని వ్యవస్థలుగా భావించకూడదు. ఈ ఉపవ్యవస్థలనే 'స్టాన్లీ హాఫ్ మాన్' 'పాక్షిక అంతర్జాతీయ వ్యవస్థ' (Partial International System)లుగా పేర్కొన్నాడు. ఈ విధంగా అంతర్జాతీయ వ్యవస్థ నిర్మాణానికి సంబంధించి రచయితల మధ్య కొంత సంధిగ్ధత నెలకొంది.

వ్యవస్థా సిద్ధాంతానికి సంబంధించిన ఇంకొక సాంకేతికపరమైన సమస్య ఏమంటే, వ్యవస్థకు సంబంధించిన అంశం (Unit) లేక నటులు (Actors)గా ఎవరిని గుర్తించాలి? అనేది. అంతర్జాతీయ వ్యవస్థ నటులుగా రాజ్యాలను గుర్తించాలా? లేక విప్లవ సంస్థల అధినేతలను కూడ గుర్తించవచ్చా? లేక ప్రభుత్వ నిర్వహణలో పాలు పంచుకొనే వ్యక్తులను పరిగణించాలా? అనేది ఇంకొక సమస్య. సాధారణంగా అంతర్జాతీయ వ్యవస్థలో

BRAOU

నటులుగా గుర్తిస్తున్నప్పటికీ, రాజ్యాలు అనేవి అంతర్జాతీయ రంగంలో ప్రభుత్వాల ద్వారాను, ప్రభుత్వాలు అనేవి చివరకు వ్యక్తుల ద్వారాను, వ్యక్తుల సమూహాల ద్వారాను ప్రాతినిధ్యం వహించబడతాయి. అనగా అంతర్జాతీయ వ్యవస్థ నిర్వహణలో పాలుపంచుకొని, అంతర్జాతీయ వ్యవస్థ ప్రవర్తనను ప్రభావితం ప్రాతినిధ్యం వహించే వ్యక్తులేగాక, పాలస్తీనా విమోచనోద్యమం (PLO) అధినేత అయిన యాసర్ అరాఫత్ వంటి వ్యక్తులు కూడ అంతర్జాతీయ వ్యవస్థ నిర్వహణలో పాల్గొంటూ వ్యవస్థ ప్రవర్తనను ప్రభావితం చేస్తూ ఉంటారు. అందువల్లనే అంతర్జాతీయ వ్యవస్థ నటులుగా ఎవరిని గుర్తించాలి? అనే దానికి సంబంధించిన ఎంతో సంధిగ్ధత నెలకొని ఉంది.

వ్యవస్థా సిద్ధాంతానికి సంబంధించిన ఇంకొక సమస్య అంతర్జాతీయ సమస్యకు, వాని పరిసరాలకు సంబంధించింది. వ్యవస్థ పరిసరాలు అన్నప్పుడు వ్యవస్థకు బయటనున్న ప్రదేశాన్ని పరిసరాలుగా అంతరిక్షాన్ని (Outer Speace) తీసికోవలసి ఉంటుంది. కానీ, సామాజిక శాస్త్ర విద్యార్థులుగా అంతరిక్షాన్ని అంతర్జాతీయ వ్యవస్థ పరిసరాలుగా పరిగణించడం పరికాదు. అందువల్లే దీనికి సంబంధించి రచయితల మధ్య రెండు భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొంతమంది రచయితల అభిప్రాయంలో అంతర్జాతీయ వ్యవస్థ పరిసరాలంటే, అంతర్జాతీయ రంగంలో రాజ్యాల ప్రవర్తనను ప్రభావితం చేపిన సంఘటనలుగా తీసికోవటం జరిగింది. మరికొందరి అభిప్రాయంలో అంతర్జాతీయ రంగంలో సంభవించిన ఏ సంఘటనలను విధాన నిర్ణేతలు గుర్తించటం జరిగిందో వాటినే అంతర్జాతీయ వ్యవస్థ పరిసరాలుగా పరిగణించాలి. ఈ విధంగా అంతర్జాతీయ వ్యవస్థ పరిసరాలకు సంబంధించి రచయితల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ఇక మోర్టాన్ ఎ. కప్లాన్ వ్యవస్థా సిద్ధాంతానికి సంబంధించి కూడ కొన్ని విమర్శలు వ్యక్తమయ్యాయి. కప్లాన్ వివరించిన ఆరు అంతర్జాతీయ వ్యవస్థల సాధ్యా సాధ్యాలకు సంబంధించి విమర్శకులు నిశితంగా విమర్శించారు. కప్లాన్ వ్యక్తీకరించిన మొదటి, రెండు నమూనాలు - ప్రాబల్య సమతౌల్య వ్యవస్థ, సరళ ద్వి ధ్రువ వ్యవస్థ - అంతర్జాతీయ రంగంలో ఆచరణలోనికి వచ్చినప్పటికీ, మిగిలిన నాలుగు వ్యవస్థలు వాస్తవ రూపం ధరించడానికి సంబంధించి విమర్శకులు సందేహాలు వ్యక్తం చేశారు. ఉదాహరణకు కప్లాన్ అభిప్రాయంలో సరళ ద్వి ధ్రువ వ్యవస్థ అనంతరం దృఢ ద్వి ధ్రువ వ్యవస్థ అమలులోకి రావలసి ఉంది. అటువంటి వ్యవస్థ అంతర్జాతీయ సమాజంలో రావాలంటే అంతర్జాతీయ సమాజం నుండి అలీన రాజ్యాలు అదృశ్యం కావలసి ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితులను పరిశీలించినప్పుడు అలీన రాజ్యాల సంఖ్య, వాటి ప్రాధాన్యత రోజు రోజుకు పెరుగుతున్నదే తప్ప తగ్గే సూచనలు కన్పించడంలేదు. ఈ కారణంగా దృఢ ద్వి ధ్రువ వ్యవస్థ ఆచరణలోకి వచ్చే అవకాశాలు దగ్గరలో కన్పించడం లేదని విమర్శకుల అభిప్రాయము.

కప్లాన్ భావించిన అంతర్జాతీయ వ్యవస్థల పురోగమనానికి (Progression)కు సంబంధించి కూడ విమర్శకులు విమర్శించారు. కప్లాన్ మొదటి వివరించిన ఆరు అంతర్జాతీయ వ్యవస్థలలో ఏక నిషిద్ధ వ్యవస్థ తప్పించి, మిగిలిన ఐదు వ్యవస్థలు ఒక దాని నుంచి ఇంకొకటి ఆవిర్భవించవచ్చునని ఊహించారు. ఉదాహరణకు ఆతని అభిప్రాయంలో సార్వత్రిక అంతర్జాతీయ వ్యవస్థనుండి క్రమానుగత అంతర్జాతీ వ్యవస్థ అనేది రూపుదాల్చవలసి ఉంది. క్రమానుగత అంతర్జాతీయ వ్యవస్థ ఆవిర్భవించడమంటే సామ్రాజ్య వాదం, బలవంతపు వాదం అంతర్జాతీయ సమాజంలో చోటు చేసుకోవడమే కానీ, ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి నప్పుడు సామ్రాజ్య వాదానికీ, బలప వాదానికీ వ్యతిరేకంగా వ్యక్తమవుతున్నా ప్రజాభిప్రాయాన్ని పరిగణించినప్పుడు సామ్రాజ్య వాదం, బలప వాదం తిరిగి అంతర్జాతీయ సమాజంలో చోటు చేసుకోవటం కష్టమని చెప్పవచ్చు.

అదే విధంగా కప్లాన్ తన వ్యవస్థ సిద్ధాంతాన్ని ఎంత క్రమబద్ధంగా వివరించినప్పటికీ కొన్ని విషయాలను పూర్తిగా వదలి పెట్టారు. కప్లాన్ తన సిద్ధాంతంలో రాజ్యాల ప్రవర్తన విషయాలను పూర్తిగా వదిలి పెట్టారు. కప్లాన్ తన సిద్ధాంతంలో రాజ్యాల ప్రవర్తనను ప్రభావితం చేసే కారణాలను గురించి కానీ, రాజ్యాలు అంతర్జాతీయ రంగంలో

BRAOU

వర్గాలుగా వ్యవహరించటానికి ప్రయత్నం చేయలేదు. ఆ విధంగా కప్లాన్ అంతర్జాతీయ వ్యవస్థల వర్గీకరణకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. కానీ, రాజ్యాల ప్రవర్తనకు, ఆ ప్రవర్తనను ప్రభావితం చేసిన కారణాల గుర్తింపుకు, వాటి విశ్లేషణకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదు. ఆ కారణంగానే కప్లాన్ సిద్ధాంతం కొంతవరకు అసంపూర్ణమైందని విమర్శకులు విమర్శించటానికి అవకాశం కలిగింది.

3.8.0 నిర్ణయ కల్పనా సిద్ధాంతం (Decision Making Theroy) :

పరిచయం : అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో నిర్ణయ కల్పనా సిద్ధాంతానికి ఒక ప్రత్యేక స్థానముంది. ఈ సిద్ధాంతం ప్రకారం అంతర్జాతీయ రంగంలో రాజ్యాల ప్రవర్తనను, అంతర్జాతీయ సంబంధాల స్వరూప స్వభావాలను, ఆ రాజ్యాలకు సంబంధించిన విధాన నిర్ణేతల ప్రవర్తనను ఆరాజ్యాల నిర్ణయ కల్పనా ప్రక్రియలను అధ్యయనం చేయటం ద్వారా అవగతం చేసుకోవడానికి అవకాశముంటుందని భావించటం జరిగింది. అంటే, అంతర్జాతీయ రంగంలో ఒక రాజ్య చర్యలను, ఆరాజ్య విధాన నిర్ణేతల నిర్ణయ కల్పనా ప్రక్రియల ద్వారా తెలిసి కొనటానికి వీలవుతుంది.

3.8.1 నిర్ణయ కల్పన - విధాన రూపకల్పన Decision Making - Policy Making::

కొన్ని సమయాలలో నిర్ణయ కల్పనను విధాన రూప కల్పనతో సరిపోల్చడం కద్దు, కానీ అది సరికాదు. విధాన నిర్ణయం విషయ పరంగా నిర్ణయ కల్పన కంటె విస్తృతమైనది. ఒక విధంగా చెప్పాలంటే విధాన రూపకల్పన అనేది కొన్ని నిర్ణయాల సమ్మిశ్రమం. అది ప్రభుత్వానికి సంబంధించిన వివిధ నాయకుల నిర్ణయాల ఫలితంగా రూపుదిద్దుకుంటుంది. నిర్ణయ కల్పనలో కంటె విధాన నిర్ణయంలో ఎక్కువ మంది వ్యక్తులు, వ్యవస్థలు పాలు పంచుకుంటాయి. అదే నిర్ణయ కల్పనలో నిర్ణయ నిర్ణేతలు వివిధ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి, పరిస్థితులను, అందుబాటులో ఉన్న వనరుల సభ్యతను దృష్టిలో పెట్టుకొని తమ అవగాహన ఆధారంగా ఒక నిర్ణయాన్ని తీసికొంటారు. కాబట్టి విధాన నిర్ణయంతో పోల్చినపుడు నిర్ణయ కల్పన అనేది సంకుచితమైంది. కాబట్టి రెంటిని ఒకటిగా భావించగూడదు.

3.8.2 నిర్ణయ కల్పనా సిద్ధాంతం - ఆవిర్భావం :

నిర్ణయ కల్పనా సిద్ధాంతం ఆవిర్భావానికి సంబంధించి భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరి అభిప్రాయంలో 18వ శతాబ్దానికి చెందిన డేనియల్ బెర్నాలి (Daniel Bernouli) గణిత ఆర్థిక శాస్త్ర రంగంలో నిర్ణయ కల్పనా దృక్పథాన్ని రూపొందించాడు. ఆర్థిక సిద్ధాంతాల పరంగా డొనేన్స్ (Donens) నిర్ణయ కల్పనా భావనను అధ్యయనం చేశాడు. ఆ తరువాత అనేక మంది మేధావులు ఆర్థిక శాస్త్రంలో నిర్ణయ కల్పనా సిద్ధాంతాన్ని అధ్యయనం చేసి వ్యాప్తిలోకి తీసుకొచ్చారు.

నిర్ణయ కల్పనా దృక్పథం ప్రభుత్వ పాలనా శాస్త్రంలో ఆవిర్భవించిందని కొందరు మేధావులు భావించినారు. ప్రభుత్వ పాలనా శాస్త్రంలో దృక్పథం ఆవిర్భావానికి దోహదం చేసిన వారిగా అమెరికాకు చెందిన అలెగ్జాండర్ హామిల్టన్ (Alexander Hamilton) వుడ్రో విల్సన్, ఫ్రాన్సుకు చెందిన ఛార్లెస్ జీనీ బావినీ (Charles Jean Baunin) జర్మనీకి చెందిన మాక్స్‌వెబర్‌లను పేర్కొనవచ్చు. తరువాత చెష్టర్ బెర్నార్డ్, హెర్బర్ట్ సైమన్‌లు నిర్ణయకల్పనా దృక్పథానికి ఒక శాస్త్రీయమైన వివరణ ఇవ్వటానికి కృషిచేశారు. సైమన్ రచన 'పరిపాలనా ప్రవర్తన' పరిపాలనా వ్యవస్థలో నిర్ణయ నిర్మాణ ప్రక్రియల అధ్యయనం (Administrative Behaviour. A study of the Decision Making Processes in Administrative Organisation (1947)) ప్రభుత్వ పాలనా శాస్త్రంలో నిర్ణయ కల్పనా

ధృక్పథానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథంగా పరిగణింపబడుతోంది. ఈగ్రంథంలో సైమన్ నిర్ణయ కల్పనా సిద్ధాంతాన్ని సరిగా అవగాహన చేసికోవటానికి వ్యవస్థకు సంబంధించిన మనోవైజ్ఞానిక, సామాజిక అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించాడు. ఆ తరువాత కాలంలో ముఖ్యంగా 1950, 1960 దశాబ్దాల నిర్ణయ కల్పనా సిద్ధాంతం సమాజ శాస్త్రం, మనోవైజ్ఞానిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, గణిత శాస్త్రాలలో చాల ప్రముఖమైన సిద్ధాంతంగా గుర్తించబడి బహుళ ప్రాచుర్యం పొందింది.

3.8.3 అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో నిర్ణయ కల్పనా సిద్ధాంతం :

నిర్ణయ కల్పనా సిద్ధాంతాన్ని రాజనీతి శాస్త్రంలో, అందునా ముఖ్యంగా అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి అన్వయించిన ఘనత రిచర్డ్ సి. స్నైడరు (Richard C. Snyder) ఆతని అనుయాయులకు చెందుతుంది. అంతర్జాతీయ సంబంధాలలో విదేశాంగ విధానం అధ్యయనానికి సంబంధించి వీరు నిర్ణయకల్పనా సిద్ధాంతాన్ని రూపొందించారు. 1950 దశకంలో రిచర్డ్ సిస్నైడరీ, హెచీ, డబ్ల్యు బ్రూక్ (H.W. Bruck) బర్టనీ సపనీ (Burton Sapin)లు "అంతర్జాతీయ రాజకీయాల అధ్యయనానికి నిర్ణయ కల్పనా ధృక్పథం" (Docision Making as an approach to the Study of International Politics, 1954) అన్న గ్రంథంలో అంతర్జాతీయ సంబంధాలలో నటుల (రాజ్యాల) ప్రవర్తనకు సంబంధించి సిద్ధాంత వివరణ ఇవ్వడానికి కృషి చేశారు. అంతర్జాతీయ రాజకీయాలలో రాజ్యాల ప్రవర్తనను, చర్యలను ప్రభావితం చేసే కారకాలను వివరించడానికి వీరు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో భాగంగా నిర్ణయ కల్పన ప్రక్రియను అధ్యయనం చేయడం ద్వారా అంతర్జాతీయ రంగంలో రాజ్యాలు ఆవిధంగా ప్రవర్తించడానికి గల కారణాలను శోధించటానికి, వాటిని అర్థం చేసికోడానికి అవకాశముంటుందని వీరు భావించారు.

8.3.4 రిచర్డ్ సి. స్నైడర్ - నిర్ణయ కల్పనా సిద్ధాంతం

BRAOU

స్నైడర్ తన సిద్ధాంతాన్ని, రాజకీయ కార్యకలాపాలను యధార్థంగా వ్యక్తులే నిర్వహిస్తారన్న ప్రతిపాదనతో ప్రారంభిస్తాడు. అంతర్జాతీయ రంగంలో ప్రాతిపదికలు (నటులు)గా రాజ్యాలను పేర్కొన్నప్పటికీ, వాస్తవానికి ఆచరణలో విదేశ వ్యవహారాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకునేది రాజ్యాలు కాదు. రాజ్యాల తరఫున వ్యక్తులే నిర్ణయాలు తీసుకుంటారు. కాబట్టి రాజ్య నిర్ణయం లేదా ప్రభుత్వ నిర్ణయం అంటే వ్యక్తుల నిర్ణయాలుగానే భావించాలి. అదే విధంగా రాజ్య ప్రవర్తన అంటె ఆరాజ్యానికి సంబంధించి కీలక స్థానంలో ఉండి నిర్ణయ కల్పన చేసే వ్యక్తుల ప్రవర్తన గానే అర్థం చెప్పుకోవాలి. స్నైడర్ అభిప్రాయంలో వ్యక్తుల ప్రవర్తనను అవగాహన చేసుకోవడానికి వారు చేసిన నిర్ణయాలు ఉపకరిస్తాయి. ఆ నిర్ణయాల ఆధారంగానే వారి చర్యలు లేక కార్యక్రమాలు ఉంటాయి. కాని నిర్ణయాలను రూపొందిచడంలో వ్యక్తులు ఆనాడున్న పరిసరాల వలనను, ఆపరిసరాల పట్ల తమకున్న అవగాహనతోను ప్రభావితులౌతారు. కాబట్టి వ్యక్తులు ప్రారంభించిన చర్యలు లేక కార్యక్రమాల గతిశీలత (dynamics) ను అర్థం చేసుకోవడానికి అవాడున్న పరిసరాలను మనదృష్టితో కాకుండా ఆనిర్ణయాలు చేసిన వ్యక్తుల దృష్టితో చూడాలని స్నైడర్ భావించాడు. ఆవిధంగా చూడగలిగినపుడే రాజ్యాల లేక వ్యక్తుల ప్రవర్తనను శాస్త్రీయంగా అర్థం చేసికోవడానికి అవకాశముంటుంది.

స్నైడర్ అభిప్రాయంలో విదేశ వ్యవహారాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో నిర్ణయ నిర్ణేతలు మూడు రకాలైన పరిసరాల వల్ల ప్రభావితులౌతారు. అవి : 1. ఆంతరంగిక స్థితి. 2.బాహ్య పరిస్థితి 3.నిర్ణయ కల్పనా ప్రక్రియ. నిర్ణయాలు తీసుకొనే రాజ్యంలోని సమాజ పరిస్థితిని ఆంతరంగిక స్థితి అని చెప్పవచ్చు. దీన్లో ప్రజాభిప్రాయం, ప్రజల విలువలు, సామాజిక వ్యవస్థ లక్షణాలు, ముఖ్యమైన సంస్థల నమూనాలు, మౌలిక సామాజిక ప్రక్రియలు (వయోజన సామాజికీకరణ, అభిప్రాయ రూపకల్పన మొ॥వి) సామాజిక ప్రత్యేకతలు మొ॥వి చేరి ఉన్నాయి. ఇతర రాజ్యాల నిర్ణయ నిర్ణేతల కార్యక్రమాలు, ప్రతి చర్యలు దేశానికి వెలుపల ఉన్న అంతర్జాతీయ

రంగం, భౌతిక ప్రపంచం మొదలైన బాహ్య పరిస్థితి కిందికి వస్తాయి. ఇక నిర్ణయ కల్పనా ప్రక్రియను 1. సామర్థ్యానికి సంబంధించిన పాత్రలు (Roles), నియమాలు (Norms) 2. సమాచార, ప్రసార సాధనాలు. 3. ప్రేరకాలు (వ్యవస్థ లక్ష్యాలు) అనే మూడు ఉపవర్గాలుగా వివరించారు. ఈమూడు రకాలైన పరిసరాలు వ్యక్తుల నిర్ణయ రూపకల్పనలో అత్యంత ప్రభావాన్ని చూపిస్తాయని స్నైడర్ భావించారు. ఈ విధంగా స్నైడర్ నిర్ణయ కల్పన సిద్ధాంత నమూనా పరస్పర ఆధారాలైన సామాజిక, రాజకీయ, మనోవైజ్ఞానిక ప్రక్రియ లన్నింటితోను సంబంధాన్ని కలిగి ఉంటుంది. ఈ సిద్ధాంతం ఆధారంగా స్నైడర్ కొరియా యుద్ధాన్ని విశ్లేషించడానికి ప్రయత్నించారు.

3.8.5 నిర్ణయ కల్పనా సిద్ధాంతం - వివిధ రచయితల అభిప్రాయాలు

నిర్ణయ కల్పనా సిద్ధాంతాన్ని వివరించిన వివిధ రచయితలు, నిర్ణయ కల్పనలో వివిధ అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

1. హెరాల్డ్ స్ట్రాట్, మార్గరెట్ స్ట్రాట్ అనే రచయితలు నిర్ణయ కల్పనలో పరిసరాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. నిర్ణయ కల్పనలో పాలు పంచుకున్న వ్యక్తులు తమ మానసిక సామర్థ్యాన్ని బట్టి అవగాహన చేసుకున్న పరిసరాలతో బాటు, ఆచరణలో వారి దృష్టికి వచ్చిన పరిస్థితులు కూడ నిర్ణయ కల్పనలో ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయని వీరు భావించారు.

2. హెరాల్డ్ లాస్వెల్, అలెగ్జాండర్ మరియు జూలియట్ జార్జ్ (Juliette George)లు నిర్ణయ నిర్మాణ ప్రక్రియలో నిర్ణయ రూపకల్పన చేసే వ్యక్తుల వ్యక్తిత్వానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని భావించారు. లాస్వెల్ తన 'అధికారం, వ్యక్తిత్వం' (Power and Personality) అన్న గ్రంథంలో చారిత్రక, రాజకీయ విషయాల అధ్యయనానికి మనోవైజ్ఞానిక విశ్లేషణను అనువర్తించారు.

3. బెర్నార్డ్ కొహెర్ (Bernard Coher) వంటి రచయితల నిర్ణయ నిర్మాణ ప్రక్రియలో అధికార, అనధికార నటుల పాత్రను సవివరంగా వివరించారు. విధాన ప్రక్రియ రూపకల్పనలో లాంఛన ప్రాయమైన (అధికారయుతమైన) ప్రభుత్వ యంత్రాంగం మాత్రమే కాకుండా ప్రభుత్వ యంత్రాంగానికి బయట ఉన్న లాంఛన ప్రాయం కాని అనేక (అనధికార) వ్యవస్థలు ప్రజాభిప్రాయం, తమ అభిప్రాయాలను వ్యక్తీకరించే పేరులు మరియు సంక్షేమ గణాలు (Interest groups), ప్రచార సాధనాలు, కార్యనిర్వాహక శాఖలోని వివిధ ప్రతినిధులు, శాసనసభలోని వివిధ కమిటీలు మొదలైవి ప్రముఖపాత్ర వహిస్తాయని భావించాడు.

4. కోహెర్ నిర్ణయ కల్పనా ప్రక్రియలో అధికార - అనధికార నటుల పాత్రను వివరించగా రోజర్ హిల్స్‌మాన్ (Rojer Hillsman) విదేశాంగ విధానానికి సంబంధించిన నిర్ణయ కల్పనలో కార్యనిర్వాహక, శాసన నిర్మాణ విభాగాల పాత్రను గురించి విశదీకరించాడు. అమెరికా విదేశాంగ విధాన అధ్యయనానికి సంబంధించి హిల్స్‌మాన్ వర్గసంబంధమైన ధృక్పథాన్ని వర్తింపజేసినాడు. ప్రభుత్వంలో కూడ విధాన నిర్ణయ ప్రక్రియ రాజకీయ పరమైందిగానే ఉంటుందని ఆతడు భావించాడు. ఈవిధానాల నిర్ణయ ప్రక్రియ ప్రభుత్వంలోని వివిధ వర్గాలకు సంబంధించిన విభిన్న విలువలు, లక్ష్యాలు, సాధనాలు ఫలితాలను సమన్వయం చేసేదిగా ఉంటుందని హిల్స్‌మాన్ వివరించాడు.

5. నిర్ణయ నిర్మాణ ప్రక్రియలో గుర్తించదగిన, అధికారయుతమైన నిర్ణయ నిర్ణేతల ప్రభావాన్ని కొందరు రచయితలు విశదీకరించారు. ఈ అభిప్రాయం సైమన్ నిర్ణయ కల్పనా నమూనాకు దగ్గరగా ఉంటుంది. ఈ పద్ధతి అంతర్జాతీయ రాజకీయాలను అవగాహన చేసుకోవడానికి ఉపకరిస్తుంది. ఈ ధృక్పథంలో ఒక రాజ్య చర్య

BRAOU

ఆరాజ్యంలో గుర్తించదగిన, అధికారయుతమైన నిర్ణయ నిర్ణేతల యొక్క పరిసరాల అవగాహన ఆధారంగా రూపొందించబడుతుందని స్నైడర్ అభిప్రాయపడ్డారు. ఈవిధంగా నిర్ణయ కల్పనలో గుర్తించబడిన నిర్ణయ నిర్ణేతల ప్రవర్తన ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు.

ఈ అభిప్రాయాలను పరిశీలించినపుడు 'నిర్ణయ కల్పన' అనేది చాల సంక్లిష్టమైన ప్రక్రియగా మనకు అర్థమవుతుంది. వివిధ వ్యక్తులు, వ్యవస్థలోని వివిధ విభాగాలు విభిన్న సంక్షేమ గణాలు, సమూహాలు, భౌతిక ప్రపంచ పరిసరాలు నిర్ణయ కల్పనా ప్రక్రియలో పాలుపంచుకుంటాయి. నిర్ణయ కల్పనను శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలంటే ఈ వివిధ కారకాల సముచిత పాత్రను సమగ్రంగా అర్థం చేసుకోవలసి ఉంటుంది.

3.8.6 నిర్ణయ కల్పనా ప్రక్రియ - హెరాల్డ్ లాస్వెల్ :

నిర్ణయ కల్పనను ఒక ప్రక్రియగా గుర్తించినపుడు ఆ ప్రక్రియలో ఉన్న వివిధ దశలను గుర్తించవలసి ఉంటుంది. దీనికి సంబంధించి హెరాల్డ్ లాస్వెల్ తన 'నిర్ణయ ప్రక్రియ విధాయక విశ్లేషణకు సంబంధించిన సప్త శ్రేణులు' (The Decision Process : Seven Categorcies of Functional Analysis, 1956) అన్న గ్రంథంలో ఏడు విధాయక దశల (Functional Stages)ను గుర్తించాడు. అవి.

1. విషయ సేకరణ (Information) : సమస్యలను గుర్తించి, సంబంధిత సమాచారాన్ని సేకరించడం.
2. సిఫారసు చేయడం (Recommendation) : వివిధ ప్రత్యామ్నాయాలను రూపొందించడం.
3. నిర్ణయించడం (Prescription) : వివిధ ప్రత్యామ్నాయాల మధ్య సరియైన దానిని ఎంపిక చేయడం.
4. అవగాహన చేయడం (Invocation) : నిర్ణయాలకు సంబంధించి నిధులను కేటాయించడం, పరిపాలనా సంబంధమైన అధికారాన్ని మంజూరు చేయడం.
5. అమలు చేయడం (Application) : నిర్ణయాలను ఆచరణలోనికి తీసికొని రావడం.
6. సమీక్ష (Appraisal) : నిర్ణయాలను పునఃపరిశీలించి, ఫలితాలను మదింపు చేయడం.
7. ఉపసంహారం (Termination) : సమీక్ష ఆధారంగా నిర్ణయాలను పునరుద్ధరించడం లేదా సవీకరణం చేయడం లేదా పరిస్థితిని బట్టి రద్దుచేయడం.

నిర్ణయలకల్పనా ప్రక్రియలో ఏడురకాలైన విధాయక దశలు ఉంటాయని లాస్వెల్ అభిప్రాయ పడ్డారు.

3.8.7 నిర్ణయకల్పనా సిద్ధాంతం - లోపాలు :

రాజకీయ దృగ్విషయాల అధ్యయనానికి సంబంధించి నిర్ణయకల్పనా సిద్ధాంతం పాత్రగురించి అనేక విమర్శలు చోటు చేసుకున్నాయి. వాటిలో ముఖ్యమైనవి.

1. నిర్ణయ కల్పనా దృక్పథం సంబంధిత సమాచారాన్ని సేకరించడానికి అవసరమైన ప్రమాణాలను నెలకొల్పలేక పోయింది. నిర్ణయ ప్రక్రియను సంక్లిష్టం చేయడమే కాకుండా, ఆ ప్రక్రియను అర్థం చేసుకోవడానికి గల అవకాశాలను తగ్గించింది. శాస్త్రీయ దృక్పథం పేరుతో యదార్థ జీవితానికి దూరంగా తీసికొని పోయింది.

2. నిర్ణయ కల్పనా ధృక్పథం యాంత్రికమైందిగాను అనిశ్చితత్వంతోను కూడుకొని ఉంది. నిర్ణయ కల్పనా ప్రక్రియలోని వివిధ అంశాలలో ఏవి ముఖ్యమైనవి? ఏవి ముఖ్యంకానివి? అనే వాటికి సంబంధించి ఈసిద్ధాంతం సరియైన వివరణ ఇవ్వలేక పోయింది. నిర్ణయ కల్పనను ప్రభావితం చేసే కారకాలకు సంబంధించి వివిధ రచయితలు వివిధ అంశాలకు - పరిసరాలు, నిర్ణయ నిర్ణేతల వ్యక్తిత్వం, అధికార అనధికార నటులు మొ॥వి ప్రాధాన్యం ఇచ్చారు. అదే విధంగా స్నైడర్ తన సిద్ధాంతంలో నిర్ణయ కల్పన అనేది మూడు రకాలైన పరిసరాలలో అంతరంగిక స్థితి, బాహ్య పరిస్థితి, నిర్ణయ కల్పనా ప్రక్రియ - ప్రభావితం అవుతుందని చెప్పాడు. కాని వీటిలో నిర్ణయ కల్పనపై ఏది ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుంది? అనే దానికి ఏరచయితా శాస్త్రీయమైన సమాధానాన్ని యివ్వలేక పోయారు.

3. నిర్ణయ కల్పనా సిద్ధాంతంలో 'విలువ'లకు సరియైన స్థానం ఇవ్వలేదు. నిర్ణయాలను రూపొందించడానికి అవసరమయిన ప్రక్రియలను వివరించటం జరిగిందే తప్ప, నిర్ణయాలు మంచివా? చెడ్డవా? మంచి నిర్ణయాలను ఏవిధంగా రూపొందించాలి? అన్న విషయాలకు ఎటువంటి ప్రాతిపదిక కల్పించలేదు.

4. నిర్ణయ కల్పనా సిద్ధాంతం అంతర్జాతీయ సంబంధాలను అవగాహన చేసికోడానికి అసంపూర్ణమైన సిద్ధాంతంగా పరిగణించబడింది. అంతర్జాతీయ రంగంలో నిర్ణయాల రూపకల్పనకు సంబంధించిన ప్రక్రియను వివరించడానికే ఈ సిద్ధాంతం ప్రాధాన్యత ఇచ్చింది తప్ప, అంతర్జాతీయ ప్రవర్తనను ప్రభావితం చేసే మిగిలిన నమూనాల (Patterns)ను గురించి ఇది ప్రస్తావించలేదు. నిర్ణయ కల్పనతో పాటు అంతర్జాతీయ రంగాన్ని, సమతుల్య ప్రాబల్యతా స్థితి, అంతర్జాతీయ న్యాయం, మానవతా విలువల వంటి ఎన్నో విషయాలు రాజనీతిజ్ఞులు మనో భావాలను ప్రభావితం చేయడం ద్వారా, విశేషంగా ప్రభావితం చేస్తూ ఉంటాయి. కానీ నిర్ణయ కల్పనా సిద్ధాంతం ఈ అంశాలను అర్థం చేసుకోవడానికి కానీ, అంతర్జాతీయ రంగంలో శక్తి రాజకీయాలను అవగాహన చేసికోవడానికి కానీ ఉపకరించదు.

BRAOU

5. నిర్ణయ కల్పనా సిద్ధాంతం ప్రక్రియల విశ్లేషణకే ఎక్కువ ప్రాధాన్య మిచ్చింది. కానీ ఇది ఫలితాలను గురించి పట్టించుకోలేదు. అదే విధంగా నిర్ణయ కల్పనా ప్రక్రియలకు ఫలితాలకు మధ్య ఉన్న సంబంధాన్ని కూడా ఇది వివరించలేక పోయింది.

6. నిర్ణయకల్పనా సిద్ధాంతాన్ని కొంతమంది రచయితలు హేతుబద్ధమైన సిద్ధాంతంగా పరిగణిస్తే, మరి కొందరు దీనిని హేతురహితమైన సిద్ధాంతంగా పరిగణించారు.

4.8.8 నిర్ణయ కల్పనా సిద్ధాంతం - ప్రాముఖ్యత :

నిర్ణయ కల్పనా సిద్ధాంతంపై ఎన్ని విమర్శలు వచ్చినప్పటికీ, అంతర్జాతీయ సంబంధాలలో దానికి ఎటువంటి ప్రాముఖ్యత లేదని చెప్పలేం. వివిధ రాజ్యాల విదేశాంగ విధానాలను తులనాత్మకంగా అధ్యయనం చేయటానికి ఈసిద్ధాంతం చాలా ఉపయోగపడుతోంది. అంతర్జాతీయ రంగంలో రాజ్యాల ప్రవర్తనను, వ్యక్తుల ప్రవర్తనకు సంబంధించిన విషయాలుగా అధ్యయనం చేయటానికి ఇది అవకాశం కలిగించింది. అదే విధంగా రాజ్యాల ప్రవర్తనకు సంబంధించి, అవి ఆవిధంగా ప్రవర్తించటానికి గల కారణాలను విశదీకరించటానికి ఇది తోడ్పడుతోంది. నిర్ణయ కల్పన చేసే వ్యక్తుల వ్యక్తిత్వాలను ప్రభావితం చేసే మనోవైజ్ఞానిక, పరిసరాల ప్రభావాలను అధ్యయనం చేయడంలో ఇది చాలా సహాయకారిగా ఉంది. మనోవైజ్ఞానిక, ఆర్థిక సమాజ శాస్త్రాల నుండి భావనలను, నమూనాలను అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో చొప్పించటానికి ఇది వీలు కలిగించింది. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి ఒక పరిపూర్ణమైన సిద్ధాంతాన్ని ఇది అందివ్వ లేక పోయినప్పటికీ, విదేశాంగ విధానాన్ని అర్థం చేసుకోడానికి, విశ్లేషించడానికి ఇది చాలా ఉపయోగకరమైన సాధనంగా పరిగణింపబడుతోంది.

4.9 సారాంశం :

అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో వాస్తవిక వాదం, ఆదర్శవాదం, వ్యవస్థా సిద్ధాంతం, నిర్ణయ కల్పనా సిద్ధాంతాలను ముఖ్యమైన సిద్ధాంతాలుగా పేర్కొనవచ్చు. వాస్తవిక వాదం, ఆదర్శవాదం అంతర్జాతీయ రంగానికి చెందిన వివిధ సంఘటనలను వివిధ రచయితలు ఏ ధృక్పథంతో అవగాహన చేసుకుంటున్నారన్న భావనపై ఆధారపడి ఉంటే, వ్యవస్థా సిద్ధాంతం అంతర్జాతీయ రంగంలో నెలకొన్న, నెలకొంటున్న వివిధ అంతర్జాతీయ వ్యవస్థలను చర్చిస్తుంది. నిర్ణయ కల్పనా సిద్ధాంతం అంతర్జాతీయ రాజకీయాలలో, ముఖ్యంగా విదేశాంగ విధానానికి సంబంధించి రాజ్యాల ప్రవర్తనను అర్థం చేసుకోవడంలో నిర్ణయాల ప్రాధాన్యతను వివరిస్తుంది. ఇందు వాస్తవిక వాదం, ఆదర్శవాదాలను అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి సంబంధించిన సాంప్రదాయక సిద్ధాంతాలుగా పేర్కొనగా, వ్యవస్థా సిద్ధాంతం, నిర్ణయ కల్పనా సిద్ధాంతాలను ప్రవర్తనా వాద విప్లవ ఫలితంగా ఆవిర్భవించిన ఆధునిక సిద్ధాంతాలుగా మనం పరిగణించవచ్చు.

వాస్తవిక వాదం అంతర్జాతీయ రాజకీయాలలో జాతీయ ప్రయోజనం, భద్రత, శక్తి అంశాల ప్రాధాన్యత గుర్తిస్తే, ఆదర్శవాదం నైతిక విలువల ప్రాముఖ్యతను వివరిస్తుంది. వాస్తవిక వాద సిద్ధాంతాన్ని ఎందరో రచయితలు బలపరచినప్పటికీ, దానికి ఒక సిద్ధాంత రూపాన్ని, ప్రాముఖ్యాన్ని కలిగించిన ఘనత అమెరికన్ రాజనీతి శాస్త్రజ్ఞుడు హేన్స్ జె. మార్గాంతౌకు చెందుతుంది. ఆతడు తన 'జాతిరాజ్యాల మధ్య రాజకీయాలు' అన్న ప్రసిద్ధ గ్రంథలో ఈ సిద్ధాంతాన్ని గురించి సమగ్రంగా వివరించారు. వాస్తవిక వాదం, ఆదర్శవాదాల మధ్య ఉన్న విభేధాలు రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో తీవ్రమై, బహిర్గతమైనప్పటికీ ఆచరణలో రాజనీతి శాస్త్రజ్ఞులు ఏ ఒక్క వాదానికీ పరిమితం కాకుండా పరిస్థితులను బట్టి రెంటిలోని మంచి, చెడులను గ్రహించి మధ్యే మార్గంగా వ్యవహరించ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ప్రవర్తనావాద విప్లవ ఫలితంగా సామాజిక శాస్త్రాలలో ఆవిర్భవించిన ఒక ముఖ్య సిద్ధాంతం వ్యవస్థా సిద్ధాంతం. వాస్తవానికి 'వ్యవస్థ' అనే భావన 1920 దశకంలో జీవశాస్త్రంలో ఆవిర్భవించినప్పటికీ, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కాలంలో సామాజిక శాస్త్రాలన్నింటిలోను చాలా ముఖ్యమైన సిద్ధాంతంగా ఇది అభివృద్ధి చెందింది. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో దీనిని అభివృద్ధి చేసి, వ్యాప్తిలోనికి తీసుకొని వచ్చిన రాజనీతి శాస్త్రజ్ఞుడు మోర్టాన్ ఎ. కప్లాన్. ఈతడు 1950 దశకం నాటి అంతర్జాతీయ పరిస్థితులను బట్టి ముందుగా ఆరు రకాలైన అంతర్జాతీయ వ్యవస్థలను గుర్తించారు. ఆ తరువాత 1960 దశకంలో అంతర్జాతీయ రంగంలో వచ్చిన గుణాత్మకమైన, పరిమాణాత్మకమైన మార్పులను దృష్టిలో పెట్టుకొని అదనంగా మరి నాలుగు అంతర్జాతీయ వ్యవస్థలుగాను ఆయన రూపొందించారు. ఈ సిద్ధాంతంపై ఎన్నో విమర్శలు వచ్చినప్పటికీ, ఇది అంతర్వర్గీయ సంఘటనలను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ఇది వీలు కల్పించడంవల్ల అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

ఇక నిర్ణయ కల్పనా సిద్ధాంతం అంతర్జాతీయ సంబంధాల స్వరూప, స్వభావాలను, అంతర్జాతీయ రంగంలో రాజ్యాల ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి నిర్ణయ కల్పన ఏవిధంగా దోహదపడుతుందో వివరిస్తుంది. అంతర్జాతీయ సంబధాల అధ్యయనానికి ఈ సిద్ధాంతాన్ని అన్వయించిన ఘనత రిచర్డ్ సి. స్నైడర్‌కు అతని అనుయాయులకు చెందుతుంది. ఈ సిద్ధాంతాన్ని వివరించడంలో వివిధ రచయితలు, నిర్ణయ కల్పనను ప్రభావితం చేసే వివిధ కారణాలను గుర్తించినారు. ఈసిద్ధాంతం కూడ అనేక విమర్శలకు లోనైప్పటికీ, వివిధ రాజ్యాల విదేశాంగ విధానాలను తులనాత్మకంగా అధ్యయనంగా చేయడానికి, మిగిలిన సామాజిక శాస్త్రాలనుండి భావనలను, నమూనాలను అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో చొప్పించడానికి ఇది అవకాశం కలిగించింది.

ఐ. దోసగిరి రావు

PRAOU

4.10 చదవదగిన పుస్తకాలు

1. Mahendra Kumar : Theoretical Aspects of International Politics, Shiralal Agarwala & Company, Agra, 1988

2. Hans J. Morgenthau : Politics Among Nations, Scientific Book Agency, Calcutta, 1973.

3. Morton A. Kaplan : System and Process in International Politics, New York, John wiley, 1957.

4. J.C. Johari : International Relations and Politics, Theoretcial Perspective, Sterting Publishers Private Ltd, New Delhi, 1985.

5. Anam Jaitly : International Politics, Mojor Contemporary Trends and Issues, Sterling Publishers Pvt. Ltd, New Delhi, 1986.

6. Haroald Sprout and Margaret Sprout : Foundations of International Politics, Princeton, University Press, 1962.

7. David L Sills (ed) : International Encyclo-paedia of the Social Sciences, New York, 1968, Vol. 4.

8. Snyder, R.C. Bruck, H.W. and Sapin, B.M. Decision, Making as an Approach to the Study of International Politics, Princeton, Princeton University Press, 1954.

9. Charles Work, J.C. (Ed) : Contemporary Political Analysis New York, Free.

10. Madan G. Gandhi : Modern Political Analysis, Oxtord & I B H Publishing Co, New Delhi, 1981.

11. S. P. Varma : Modern Political Theory, Vikas Publishing House Pvt. Ltd. New Delhi, 1977

12. Wasby, Stephen L : Political Seience : The Discipline and its Dimensions, Scientific Book Agency, Calcutta, 1970.

13. డాా యం. సత్యనారాయణరావు, డాా యం. రాంచందర్ & డాా ఎఫ్. డి. వకీల్ : రాజనీతి శాస్త్రం : ఆధునిక విశ్లేషణ, శ్రీనివాస పబ్లిషర్స్, ఖమ్మం, 1988.

14. Harold D. Lasswell : Power and Personality, New York, 1948.

15. David Easton : The Political System, Scientific Book Agency, Calcutta, 1953.

BRAOU

16. Harold D. Lass well: The Decision Process, Seven Categories of Functional Analysis, Baltimore, 1956.

4.11 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈకింది వాటికి ఒక్కొక్క దానికి 30 పంక్తులలో జవాబు రాయండి.

1. వాస్తవిక వాదం, ఆదర్శ వాదాలను విమర్శనాత్మకంగా వివరించండి.
2. వాస్తవిక వాదానికి మార్గాంతా చేసిన కృషి ఏమిటి?
3. మోర్టాన్ ఏ. కప్లాన్ వ్యవస్థా సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించండి.
4. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో నిర్ణయ కల్పన సిద్ధాంత ప్రాధాన్యతను వివరించండి.

II. ఈకింది వాటికి ఒక్కొక్క దానికి 10 పంక్తులలో జవాబు రాయండి.

1. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో వాస్తవిక వాదం ప్రాధాన్యతను వర్ణించండి.
2. మార్గాంతా సిద్ధాంతంలోని వాస్తవిక వాదానికి సంబంధించిన మౌలికాంశాలేవి?
3. కప్లాన్ వర్ణించిన ప్రాబల్య సమతాల్య వ్యవస్థను వివరించండి.
4. స్నైడర్ నిర్ణయ కల్పనా సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా వివరించండి.

BRAOU

భాగం-4 సార్వభౌమత్వ జాతుల, రాజ్యవ్యవస్థల స్వభావం

విషయక్రమం

4.1 లక్ష్యాలు

4.2 పరిచయం

4.3 జాతీయభావం అంటే ఏమిటి

4.4 సార్వభౌమత్వ జాతీయ రాజ్యాల ఆవిర్భావానికి కారకాలు

4.5.0 సార్వభౌమత్వ జాతీయ రాజ్యాల ఆవిర్భావం :పరిణామక్రమ పరిశీలన

- 4.5.1 వెస్ట్‌ఫాలియా సంధి సమయానికి రాజ్యవ్యవస్థ
- 4.5.2 వెస్ట్‌ఫాలియా యుట్రెక్ట్ సంధుల మధ్యకాలంలో రాజ్యవ్యవస్థ
- 4.5.3 యుట్రెక్ట్ సంధి-వియన్నా సమావేశాల మధ్యకాలంలో రాజ్యవ్యవస్థ పరిణామం
- 4.5.4 వియన్నా సమావేశంనుండి వర్సైల్స్ శాంతి ఒప్పందం వరకు రాజ్యవ్యవస్థలో వచ్చిన మార్పులు
- 4.5.5 వర్సైల్స్ శాంతి ఒప్పందం తరువాత రాజ్యవ్యవస్థ లో వచ్చిన పరిణామాలు

4.6.0 జాతీయ రాజ్య వ్యవస్థ లక్షణాలు.

- 4.6.1 సార్వభౌమాధికారం
- 4.6.2 జాతీయభావం
- 4.6.3 ఉదారవాద జాతీయభావం
- 4.6.4 దురహంకార జాతీయభావం
- 4.6.5 నియంత్రత్వ లేక అధికారయుత జాతీయభావం
- 4.6.6 సమగ్ర జాతీయ భావం

4.7 జాతీయభావం సాధనాలు సంకేతాలు

4.8 అంతర్జాతీయ న్యాయం

4.9 చదువదగిన పుస్తకాలు

4.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

BRAOU

4.1 లక్ష్యాలు

ఈభాగం అధ్యయనం చేశాక మీరు ఆధునికయుగంలో జాతిరాజ్యాలు ఉద్భవించిన విధానం జాతిరాజ్యాల లక్షణాలు పరిణామాలను సరిగా వివరించగలరు.

4.2 పరిచయం

సమకాలీన అంతర్జాతీయ సమాజంలో అత్యంత ప్రాచుర్యాన్ని పొందిన భావన 'జాతీయ రాజ్యవ్యవస్థ'. ఈభావనకు ప్రాతిపదిక జాతీయ భావం. జాతీయభావం అనేది ఏదీ ఒకరోజున హఠాత్తుగా ఆవిర్భవించిందికాదు. అనేక శతాబ్దాల పరిణామక్రమంలో వివిధ సామూహిక సంఘటనల ఫలితంగా, కాలక్రమేణా అంతర్జాతీయంగా రూపుదిద్దుకున్న

భావమే జాతీయ భావం. ఆధునిక యుగం ఆవిర్భావంతో ఐరోపాలో జాతీయ భావం యొక్క ఛాయలు అంకురించి, 18, 19 శతాబ్దాల నాటికి అది ఐరోపా రాజ్యాలలో ఒక బలీయమైన భావంగా అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు. ఈ కారణంగానే ఐరోపా చరిత్రకు సంబంధించి 19 వ శతాబ్దాన్ని జాతీయవాద యుగం (The age of nationalism) గా చరిత్రకారులు పేర్కొంటున్నారు. కాని 20వ శతాబ్దం ఆవిర్భావంలో అంతర్జాతీయ సంబంధాలలో ఐరోపా రాజ్యాల ప్రాబల్యం తగ్గిపోయి, వాస్తవమైన అంతర్జాతీయ సంబంధాలు చోటు చేసికున్నట్లు, అప్పటి నుండి ప్రపంచ చరిత్ర అంటే ఐరోపా రాజ్యాల చరిత్ర గాక ప్రపంచంలోని అన్ని రాజ్యాల చరిత్ర అని మొదటి అధ్యాయంలో వివరించాము. అదేవంథాలో 20వ శతాబ్దం ఆవిర్భావంలో ప్రపంచ చరిత్ర వలెనే, జాతీయ వాదం కూడ ఐరోపా రాజ్యాలకు విస్తరించింది. సుమారు నాలుగు శతాబ్దాల పాటు దీన్ని యూరప్ రాజ్యాల వలస ప్రదేశాలు గా పరిగణింపబడి, రాజకీయంగా ఎటువంటి గుర్తింపు లేని, బదుగు రాజ్యాలైన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా రాజ్యాలు జాతీయతా భావం వలన కొత్త చైతన్యాన్ని పొంది జాతీయ ఉద్యమాల ద్వారా ఈ 20 శతాబ్దంలోనే రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొంది, జాతీయ రాజ్యాలుగా ఆవిర్భవించాయి. ఆవిధంగా ఒకనాడు తమ రాజు కొరకు, తమ మతం కొరకు పోరాడిన ప్రజలు ఈనాడు ఆదేరకమైన త్యాగభావంతో, భక్తి ప్రపత్తులతో విశ్వాసంతో తమ జాతి కోసం పోరాడుతున్నారు. ఈ జాతీయ పోరాటం అనేది ఏ ఒక ఖండానికీ, రాజ్యానికీ పరిమితం కాక ప్రపంచవ్యాప్తమైంది. అందువలననే 20 శతాబ్దాన్ని అఖిల జాతీయ వాద యుగం [The age of pan - nationalism] గా విజ్ఞులు పేర్కొంటున్నారు.

4.3 జాతీయభావం అంటే ఏమిటి

జాతి, జాతీయత లేక జాతీయ సముదాయం, జాతీయ బావం అనే పదాలు ఒకేరకంగా కనబడినప్పటికీ రాజనీతి శాస్త్రజ్ఞులు వీటిని ఒక అర్థంలో వాడటం లేదు. వీటిని జాగ్రత్తగా పరిశీలించినపుడు వీటిమధ్యఉన్న సున్నితమైన భేదాన్ని గుర్తించవచ్చు. శబ్దోత్పత్తిపరంగా చూస్తే 'జాతి' అనే పదం 'Nation' అనే ఆంగ్ల పదానికి తెలుగు అనువాదం. 'Nation' అనే పదం 'Nation' అనే లాటిన్ పదం నుండి ఆవిర్భవించింది. 'Nation' అనగా 'పుట్టుక' అని అర్థం. ఈ పదం నుండే జాతి, జాతీయత, జాతీయభావం అనే పదాలు ఆవిర్భవించినాయని చెప్పవచ్చు.

జాతి అనే పదానికి స్పష్టమైన అర్థాన్ని ఇవ్వటం కష్టం. కొందరు రచయితల అభిప్రాయంలో జాతి, జాతీయత ఒకే అర్థాన్ని సూచిస్తాయనీ భావించగా , మరి కొందరు 'జాతి' అనే పదాన్ని 'రాజ్యాని'కి సమానార్థంగా భావించినారు. బర్జెస్ (Burgess) అభిప్రాయంలో భౌగోళికంగా ఒక ప్రదేశంలో నివసిస్తున్న ఒకే తెగకు చెందిన ప్రజలను 'జాతి' అని నిర్వచించవచ్చు. లేకాక్ (Leacock) అభిప్రాయంలో ఒకే భాష పుట్టుకలకు చెందిన ప్రజా సముదాయాన్ని 'జాతి' అని పిలువవచ్చు. ఈవిధంగా ఈ రచయితల అభిప్రాయంలో 'జాతి' అనేది ప్రాధమికంగా సామాజిక సాంస్కృతిక పరమైనది. కాని మొదటి ప్రపంచ యుద్ధం తరువాత 'జాతి' అనేది రాజకీయపరమైన అర్థాన్ని పొందటం జరిగింది. ఈ అర్థంలో జాతి అనగా రాజ్యం, జాతీయ సముదాయాల సమ్మిళితము. ఈ కారణంగానే సమకాలీన సమాజంలో రాజ్యాలను' జాతీయ రాజ్యాలు అని పేర్కొనడం జరుగుతున్నది. ఈ అర్థంలో జాతీయ రాజ్యాలన్ని జాతీయరాజ్యాలు కానేరవు. ఉదా:- మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం ఆస్ట్రియా , హంగేరీ, ఒక రాజ్య ముకాని, జాతీయ రాజ్యం కాదు. ఆరోజులలో అది వివిధ జాతీయ సముదాయాలకు చెందినవి, భిన్న సామాజిక సాంస్కృతికపరమైన సమూహాలకు చెందిన ప్రజలతో కూడి ఉండేది. వారిలో జాతీయభావనకు ముఖ్య లక్షణమైన మానసికమైన 'సోదర భావన' అనేది లోపించింది. అందువలననే ఆస్ట్రియా - హంగెరీని మొదటి ప్రపంచయుద్ధానికి ముందు రాజ్యంగా పరిగణించ గలమే కాని జాతీయ రాజ్యంగా గుర్తించలేము. అదే సమయంలో మానసిక పరమైన సోదర భావన ఉన్నంత మాత్రాన ఒక మానవ సముదాయాన్ని 'జాతి' గా గుర్తించలేము. జాతి లేక జాతీయరాజ్యంగా గుర్తింపబడాలంటే సాంస్కృతిక, ఆధ్యాత్మిక పరమైన బాంధవ్యంతో బాటు రాజకీయంగా

BRAOU

కూడా వ్యవస్థీకృతం కావలెను. అందువలననే లార్డ్‌బ్రైస్ జాతి అనగా రాజకీయంగా సంఘటితమై, స్వతంత్రంగా ఉంటున్న లేక ఉండవలెనని ఆశిస్తున్న జాతీయ సముదాయం అని నిర్వచించినాడు. సార్వ భౌమాధికారం కలిగిన జాతీయ సముదాయం, రాజకీయంగా వ్యవస్థీకృతం అయితే దానిని 'జాతి' అని పిలువవచ్చునని ప్రసిద్ధ చరిత్రకారుడు హీసీ భావించినాడు. మార్గాంథో, అభిప్రాయంలో 'జాతికి రాజ్యం అనేది అవసరం'. ఒకే జాతి, ఒకే రాజ్యం' అనేది జాతీయ వాదానికి మౌలిక సూత్రం. జాతీయ రాజ్యం దాని ఆదర్శం. ఆవిధంగా ఆధునికకాలంలో 'జాతి' అనేది రాజ్యం జాతీయ సముదాయాల సమ్మిశ్రమంగా పరిగణింపబడుచున్నది. జాతినిర్మాణంలో రాజకీయ అంశానికి చాల ప్రాముఖ్యత ఉన్నది.

'జాతీయత' లేక 'జాతీయ సముదాయం' అనే పదాన్ని రెండు అర్థాలలో వాడుతూ ఉంటారు. అవి :

(1) ఒక వ్యక్తి పౌరసత్వాన్ని లేక న్యాయపరమైన హోదాను తెలియజేసిన సందర్భంలో కాని లేక ఒక వస్తువు ఏరాజ్యానికి సంబంధించినదనే అర్థంలో కాని వాడుతూ ఉంటారు. ఉదా:- ఒక వ్యక్తి లేక విమానం విదేశాలలో ఉన్నప్పుడు అతడు ఏజాతీయ సముదాయానికి చెందిన వాడు లేక ఏనేషలిజానికి సంబందించని దనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ సందర్భంలో జాతీయత అంటే ఏరాజ్యానికి చెందుతుందనే అర్థం వస్తుంది.

(2) కొన్ని సమయాలలో 'జాతీయత' అనే పదం ఒక ప్రజా సముదాయాన్ని సూచించే అర్థంలో కూడ వాడబడుతుంది ఉదా: స్విట్జర్లాండు రాజ్య ప్రజలు ఫ్రెంచ్, ఇటాలియన్, జర్మనీ అనే మూడు జాతీయ సముదాయాలకు చెందినవారితో కూడుకొని ఉన్నారని చెప్పవచ్చు.

ఇక 'జాతీయ భావం' అనేది ఒక మానసిక ప్రవృత్తి. ప్రసిద్ధ చరిత్రకారుడు ఆర్నాల్డ్ టాయన్బీ Anold Toynbee) అభిప్రాయంలో జాతీయ భావం అనేది " భౌతికపరమైన లేక యాంత్రిక పరమైనది కాదు. అది ప్రజా సముదాయంలో నెలకొన్న" కలిసి జీవించాలనే ప్రగాఢ వాంఛగా దీనిని పేర్కొనవచ్చు. లూయీ స్నైడర్ పేర్కొన్నట్లు "ఒక నిర్ణీత ప్రదేశం లో నివసిస్తున్న, ఒకే భాష, ఒకే సాహిత్యం, ఒకే రకమైన సాంప్రదాయాలు, ఒకే మతం కలిగిన ప్రజల మధ్య నెలకొన్న మానసికపరమైన స్పందన లేక అనుభూతి" నిజాతీయభావంగా పేర్కొనవచ్చు. తామంతా ఒకటే అనే సోదరభావం ఒక ప్రజా సముదాయంలో నెలకొని ఉన్నప్పుడు అట్టి భావాన్ని ' జాతీయ భావం ' అని అంటాము. ఒక ప్రజా సముదాయంలో ఇటువంటి జాతీయ భావం పెంపొందటానికి భౌగోళిక సాన్నిహిత్యం, రక్త సంబంధం, ఒకే రకమైన భాష, సాహిత్యం, మతం, ఉమ్మడి రాజకీయ ఆవకాశాలు, ఉమ్మడి ఆర్థిక ప్రయోజనాలు ఒకేరకమైన చరిత్ర, సంస్కృతిక - సాంప్రదాయాలు మొదలైన వివిధ కారకాలు దోహదం చేస్తాయి. వీటి కారణంగా ప్రజలలో సోదర భావం పెంపొంది జాతీయభావంగా బహిర్గతమౌతుంది. మెకైవర్ అభిప్రాయంలో జాతీయ భావం అనేది ఒక "సామాజిక - సాంస్కృతిక పరమైన భావాల సముదాయం". ఇటువంటి ఒకేరకమైన భావాలు కలిగిన ప్రజా సముదాయాన్ని జాతీయత లేక జాతీయ సముదాయం అని, అటువంటి జాతీయ సముదాయం రాజకీయంగా వ్యవస్థీకృతమై స్వతంత్రంగా వ్యవహరించ గలిగినపుడు దానిని 'జాతి' లేక 'జాతీయ రాజ్యమ'ని పేర్కొనవచ్చు

4.4 సార్వభౌమత్వ జాతీయరాజ్యాల ఆవిర్భావానికి కారకాలు:

ఆధునిక రాజ్యవ్యవస్థ 'జాతీయ రాజ్యం' అన్న భావనపై ఆధారపడిన రాజకీయ వ్యవస్థ. అది ఒక విధంగా ఐరోపా రాజ్యవ్యవస్థ కు కొనసాగింపుగా పేర్కొనవచ్చు. ఆధునికయుగ ఆవిర్భావానికి దోహదం చేసిన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం (The Renaissance Movement)మతసంస్కరణోద్యమాల సమయంలోనే జాతీయ రాజ్య

BRAOU

వ్యవస్థ ఛాయలను గుర్తించగలిగినప్పటికి, అది 18,19 శతాబ్దాలలోనే ఐరోపాలో ఒకనిర్దిష్టమైన రూపాన్ని పొందిందని చెప్పవచ్చు. ఈవిదంగా జాతీయభావం ఐరోపా రాజ్యాలలో రూపొందటానికి వివిధ కారకాలు దోహదం చేసినాయి. వాటిని క్లుప్తంగా పరిశీలిద్దాం.

(1) మధ్య యుగాంతం నాటికి పవిత్ర రోమన్ సామ్రాజ్యం బలహీనం కావటంతో, పవిత్ర రోమన్ చక్రవర్తి అధికారం తగ్గి వివిధ రాజ్యాలలో రాజుల ప్రాబల్యం పెరగటానికి అవకాశం కలిగింది. క్రీ.శ. 1500 సంll ల నాటికి ఈ సామ్రాజ్యం జర్మనీ భాష మాట్లాడే ప్రజలకు, బొహేమియా దేశాలకు మాత్రమే పరిమితమై పోయింది. ఇటలీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్ నామ మాత్రంగా ఈ సామ్రాజ్యాధికారానికి లోబడి ఉన్నప్పటికి, ఫ్రాన్సు, ఇంగ్లండ్, పోర్చుగల్, స్పెయిన్, స్కాండినేవియా రాజ్యాలు స్వతంత్రంగా వ్యవహరించసాగినాయి. జర్మనీ భాష మాట్లాడే ప్రజలకు పరిమితమైన ఈ సామ్రాజ్యం ఆధునికయుగం ప్రారంభం నాటికి వివిధరకాలైన సుమారు 300 జర్మనీ రాజ్యాలు నామమాత్రపు విధేయతను ప్రదర్శిస్తూ, ఈ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉండేవి.

15, 16 శతాబ్దాలలో ఐరోపాలో మోటుచేసుకున్న సాంస్కృతిక పునరుజ్జీవననోద్యమం, మత సంస్కరణోద్యమాలు కూడ పరోక్షంగా పవిత్ర రోమన్ సామ్రాజ్యం బలహీనపడటానికి రాజుల ప్రాబల్యం పెరగటానికి దోహదం చేసాయి. అంతవరకు ఐరోపాలో సార్వత్రికం గా వ్యాపించియున్న రోమన్ కాథలిక్ చర్చి అధిపత్యాన్ని తొలగించి, వివిధ రాజ్యాల ప్రజల మధ్యయున్న మతపరమైన భేదాలను సమర్థించటం ద్వారా ఈ ఉద్యమాలు ప్రజలలో జాతీయ భావం పెంపొందటానికి విశేషంగా దోహదపడినాయి. రాజకీయాల నుండి మతాన్ని వేరు చేయటానికి ప్రయత్నాలు మొదలైనాయి. మతాధిపతులకు వ్యతిరేకంగా రాజుల అధికారాన్ని సమర్థించటానికి కృషి జరిగింది.

(2) సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం, ఫలితంగా జరిగిన భూగోళ పరిశోధనలు ఐరోపాలో వాణిజ్యం, పరిశ్రమలు అభివృద్ధి చెందటానికి దోహదపడినాయి. వాటి కారణంగా ఐరోపాలో ధనవంతులకు పేదవారికి మధ్యస్థంగా మధ్యతరగతి అనే నూతన సామాజిక వర్గం ఏర్పడటానికి వీలు కలిగింది. ఈ నూతన మధ్య తరగతి వర్గం తమ ఉమ్మడి ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని 16, 17, శతాబ్దాలలో భూస్వాములకు, మతాధిపతులకు వ్యతిరేకంగా రాజుల నిరపేక్షాధికారాన్ని సమర్థించినారు. ఆవిధంగా రాజకీయాలలో మతాధిపతుల ఆదిపత్యం తగ్గి, రాజులు అధికారం పెంపొందటానికి, సర్వ సత్తాక నియంతృత్వ రాజ్య వ్యవస్థలు ఏర్పడటానికి వీరు దోహదం చేశారు. ఈవిధంగా సర్వాధికారాలు గల పాలకులు ఆవిర్భావించటంతో, వివిధ రాజ్యాలలోని ప్రజలు ఒకజాతిగా రూపొందక పోయినప్పటకీ, ఒకే ఒకవ్యక్తి (రాజు) కి ఉమ్మడిగా విధేయత చూపడం వలన వారిలో పరస్పరాభిమానం ఐక్యతా భావం ఏర్పడి కాలక్రమంలో జాతీయభావం పెంపొందటానికి దోహదం చేసింది.

అంతే గాక ఈ నూతన మధ్యతరగతి వర్గం ఆ తరువాత కాలంలో బాగా బలపడి రాజుల నిరంకుశ అధికారానికి వ్యతిరేకంగా ప్రజా సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, ప్రజా ప్రాతినిధ్య ప్రభుత్వాల స్థాపనకు నాంది పలికినారు. 1789 లో ఫ్రాన్సులో నిరంకుశ రాజ్యాధికారానికి వ్యతిరేకంగా వచ్చిన ఫ్రెంచి విప్లవం ఈ ప్రజా సార్వభౌమాధికార సిద్ధాంతం యొక్క ప్రభావ ఫలితమేనని చెప్పవచ్చు. ఈ విప్లవం ద్వారా ఫ్రెంచి ప్రజలు నిరంకుశ రాజ్యాధికారాన్ని తొలగించి, ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించటం ద్వారా ప్రజాసార్వభౌమాధికార సిద్ధాంతాన్ని ఐరోపా నలుమూలలకు వ్యాపింపజేసినారు. ఆ తరువాతి కాలంలో ఈ సిద్ధాంతం అమెరికా ఆసియా ఖండాలకు కూడ విస్తరించింది. ఈ సిద్ధాంతం కారణంగా అంతవరకు రాజ్య ప్రయోజనం అనగా రాజుల ప్రయోజనం అన్న భావన తొలగి, ప్రజల ప్రయోజనం లేక జాతీయ ప్రయోజనం అన్నఅర్థాన్ని సంతరించుకున్నది.

(3) సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమంలో ఒక భాగంగా 16 వ శతాబ్దంలో అనేక జాతీయ భాషలు అభివృద్ధి చెందాయి. అంతవరకు ఐరోపాలో లాటిన్, గ్రీకుభాషలకు మాత్రమే గుర్తింపు ఉండేది. జాతీయభాషలకు

BRAOU

ఎటువంటి విలువ లేదు. కాని పవిత్ర రోమన్ సామ్రాజ్యం విచ్ఛిన్నం కావటంతో జాతీయ భాషలకు ప్రోత్సాహం లభించింది. ముఖ్యంగా ఇంగ్లండ్, ఫ్రాన్సు, స్పెయిన్, జర్మనీ, ఇటలీలలో జాతీయ భాషలు అభివృద్ధి చెందటం ప్రారంభమైంది. ఉదా: ఇటలీలో మాకియవెల్లి రచించిన 'ప్రిన్స్' అనే గ్రంథం రాజకీయ సంచలనం కలిగించింది. థామస్‌మోర్ రచించిన యుటోపియా సమకాలీన సమాజంలోని పాలకుల దురలవాట్లను వ్యంగ్యంగా విమర్శించి, ఆదర్శ రాజ్య లక్షణాలను వివరించింది. అదే విధంగా బోడిన్ గ్రోషియస్ హబ్స్ వంటివారి రచనలు ప్రజలలో రాజకీయ చైతన్యం పెంపొందించటానికి దోహదపడినాయి. ఈ సాహిత్య వరవడి ఆంగ్లభాషలో షేక్‌స్పియర్,మిల్టన్, బెంజాన్సన్ వంటి మహాకవులను సృష్టించి, ఇంగ్లీషు భాష ఉన్నతికి దోహదం చేసింది. ఈ రకమైన జాతీయ భాషా వికాసం కూడ ప్రజలలో సామాజిక, రాజకీయ చైతన్యం పెంపొందటానికి, తద్వారా జాతీయభిమానం పెంపొందటానికి ఇతోధికంగా తోడ్పడింది.

జాతీయ భావవ్యాప్తికి, అభివృద్ధికి దోహదం చేసిన కారకంగా పారిశ్రామిక విప్లవాన్ని కూడ పేర్కొనవచ్చు. పారిశ్రామిక విప్లవం ఫలితంగా అభివృద్ధిచెందిన వ్యాపార, రవాణా సాధనాలు జాతీయ భావం ప్రపంచం నలుమూలలకు వ్యాప్తి చెందటానికి దోహదం చేసాయి. ప్రసార సాధనాలలో వచ్చిన విప్లవాత్మక మైన మార్పుల కారణంగానే వార్తా సౌకర్యాలు ఇతోధికంగా అభివృద్ధి చెంది, ప్రపంచంలోని మారు మూల సంఘటనలు కూడ ప్రపంచ వ్యాప్తం కావటానికి అవకాశం కలిగింది. అందువలననే వివిధ రాజ్యాల జాతియోద్యమాలకు సంబంధించిన సమాచారం మిగిలిన రాజ్యాల ప్రజలకు అవగతం కావటానికి, తద్వారా వారిలో రాజకీయ జాగృతి పెంపొందటానికి అవకాశం కలిగింది. అదేవిధంగా ఆధునిక కాలంలో అభివృద్ధిచెందిన రవాణా సౌకర్యాల కారణంగా ప్రపంచంలోని నలుమూలలకు ప్రయాణించటానికి , వ్యక్తులతో బాటు భావాలు ఏ ఒక్క రాజ్యానికీ, ఖండానికీ పరిమితం కాక విశ్వవ్యాప్తంగా అభివృద్ధిచెందటానికి వీలు కలిగింది.

BRAOU

4.5.0 సార్వభౌమత్వ జాతీయ రాజ్యాల ఆవిర్భావం - పరిణామ క్రమపరిశీలన

ఆధునిక జాతీయరాజ్యవ్యవస్థల ఆవిర్భావానికి చారిత్రికంగా, వివిధ దశలలో విభిన్న సంఘటనలు దోహదం చేసినాయి. వాటిని విపులంగా పరిశీలిద్దాం.

4.5.1 వెస్ట్‌ఫేలియా సంధి [1648] సమయానికి రాజ్యవ్యవస్థ :

ఆధునిక జాతీయరాజ్య వ్యవస్థకు నాందిగా వెస్ట్‌ఫేలియా (జర్మనీ) సంధిని పేర్కొనవచ్చు. ఈ సంధికి పూర్వం ప్రాచీన, మధ్యయుగాలలో విశాలమైన సామ్రాజ్యాలు, పరిమిత భూభాగాన్ని కలిగి ఉన్న నగర రాజ్యాలు వంటి రాజ్యాలు, రాజ్య వ్యవస్థలు ఉండి వాటి మధ్య సంబంధాలు నెలకొని ఉన్నప్పటికి అవి విభిన్న ప్రాతిపదికలపై ఆధారపడిఉండేవి. అంతేకాని ఆధునిక కాలంలో వలె జాతీయత, సార్వభౌమాధికారం ప్రాతిపదికలుగా ఉన్న స్వతంత్ర రాజ్యాలు ఆనాడు లేవు.

కాని ఆధునికయుగంలో మత సంస్కరణోద్యమ వాదులకు, కాథలిక్కులకు ప్రతిసంస్కరణోద్యమం [(Counter - Reformation)] పేరుతో మధ్య ఐరోపాలో జరిగిన ముప్పది సంవత్సరాల యుద్ధం ఫలితంగా కుదుర్చుకున్న వెస్ట్‌ఫేలియా సంధి, ఆధునిక రాజ్య వ్యవస్థ ఆవిర్భావానికి దోహదం చేసింది. ఈయుద్ధం ఐరోపాలో జరిగిన చిట్టచివరి దారుణమైన మత సంఘర్షణగా చరిత్రకారులు పేర్కొన్నారు. ఈయుద్ధాన్ని అంతమొందించటానికి కుదుర్చుకున్న వెస్ట్‌ఫేలియా సంధి ఐరోపా రాజ్య వ్యవస్థలో అనేక మార్పులను తీసికొని వచ్చింది అంతవరకు ఉన్న పవిత్ర రోమన్ సామ్రాజ్యం సిద్ధాంత రీత్యా వాస్తవరీత్యా కూడా అంతరించింది. చర్చి అధికారం అడుగంటింది. ఈ సంధి షరతులు పోప్‌కు అంగీకారం కాక పోయినప్పటికీ అమలులోనికి వచ్చాయి.

అంతర్జాతీయ న్యాయాన్ని గురించి ఆలోచనలు ప్రారంభమైనాయి. హ్యూగ్రోషియస్ యుద్ధం శాంతికి సంబంధించిన శిక్షాస్మృతి Law of War and Peace అనే గ్రథంలో అంతర్జాతీయ న్యాయాన్ని విపులీకరించటానికి ప్రయత్నించినాడు. ఈ సంధి ఫలితంగా జర్మనీ రాకుమారులు తమ అభిమతానికి అనుగుణంగా తమకిష్టమైన మతాన్ని - కాల్వినిజం, లూదరిజం లేక రోమన్ కాథలిజం - అనుసరించటానికి తమకు నచ్చిన విధంగా పరిపాలన సాగించటానికి అవకాశం కలిగింది. పోలండ్, స్విట్జర్లాండ్ లను స్వతంత్ర గణతంత్ర రాజ్యాలుగా గుర్తించినారు. బ్రాండన్‌బర్గ్ (జర్మనీ) విస్తరణ ప్రారంభమై, అది క్రమంగా ప్రష్యారాజ్యంగాను ఆ తరువాత కాలంలో జర్మనీ సామ్రాజ్యంగాను ఆవిర్భవించటానికి అవకాశం కలిగింది. ఫ్రాన్సు, స్వీడన్‌లకు అదనపు భూభాగాలు చేరినాయి.

వెస్ట్‌ఫేలియా సంధి ఫలితంగా ఐరోపారాజ్య వ్యవస్థలో వచ్చిన మార్పులను ఈవిధంగా గుర్తించవచ్చు. ఇంగ్లండ్, ఫ్రాన్సు, స్పెయిన్, స్వీడన్‌లు అగ్రరాజ్యాలుగా ఆవిర్భవించాయి. రష్యా, పోలండ్‌లు స్వతంత్ర రాజ్యాలుగా ఆవిర్భవించినప్పటికీ అంతర్జాతీయ రాజకీయాలలో ఇంకా ప్రాధాన్యతను పొందవలసి యున్నది. ఇటలీ చిన్న చిన్న రాజ్యాలతో కూడి ఒక భౌగోళిక వ్యక్తీకరణం Geographical expression గానెలకొని ఉన్నది. భౌగోళికంగా కీలక స్థానంలో ఉన్న ఆటోమన్ సామ్రాజ్యం బలహీనమై క్షీణదశలో ఉన్నది. జర్మనీ అనైక్యతతో కూడి ఉన్నప్పటికి, కొన్ని జర్మనీ రాజ్యాలు - బ్రాండెన్‌బర్గ్, బవేరియా, సాక్సనీ మొ॥వి గణనీయమైన పలుకుబడిని కలిగి ఉన్నాయి. ఆస్ట్రియా, స్పెయిన్, నెదర్లాండ్స్ రాజ్యాలు నామ మాత్రంగా హాప్స్‌బర్గ్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా పరిగణింపబడుతూ ఉన్నాయి. డెన్మార్క్, పోలండ్, పోర్చుగల్, స్విట్జర్లాండ్‌లు స్వతంత్రమైన చిన్న రాజ్యాలుగా నెలకొని ఉన్నాయి.

ఆవిధంగా వేస్ట్‌ఫేలియా సంధి ఫలితంగా ఆవిర్భవించిన రాజ్యవ్యవస్థ ఏవో కొన్ని మార్పులు, చేర్పులకు లోనైనప్పటికి మౌలికంగా అదే విధంగా ఈ నాటికి కొనసాగుచున్నవని చెప్పవచ్చు. ఆ తరువాతికాలంలో అంతర్జాతీయ రంగంలో చోటు చేసి కున్న వివిధ సంఘటనలు, పరిణామాలు - ప్రజా ప్రాతినిధ్య ప్రభుత్వవిధానం, పారిశ్రామిక, సామాజిక విప్లవాలు, పట్టణీకరణ, రాజ్యాల మధ్య నానాటికి పెంపొందిన ఆర్థికపరమైన పరస్పర సంబంధాలు, జనాభా పెరుగుదల, అంతర్జాతీయ న్యాయం అభివృద్ధి, రవాణా ప్రసార రంగాలలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, అంతర్జాతీయ వ్యవస్థల ఏర్పాటు, దౌత్యనీతి విధానంలో వచ్చిన మార్పులు, ప్రాచ్యదేశాలలో వచ్చిన రాజకీయ చైతన్యం మొ॥వి - రాజ్యవ్యవస్థ లో కొన్ని మార్పులకు, చేర్పులకు అవకాశం ఇచ్చినప్పటికి, వాటి ప్రాతిపదిక మాత్రం అదే విధంగా కొనసాగుచున్నదని చెప్పవచ్చును.

BRAOU

4.5.2 వెస్ట్‌ఫేలియాసంధి (1648) - యుట్రెక్ట్ (Utreckt) సంధు (1713) ల మధ్యకాలంలో రాజ్యవ్యవస్థ

1648 నాటి వెస్ట్‌ఫేలియా సంధి - 1713 నాటి యుట్రెక్ట్ సంధుల మధ్యకాలంలో అంతర్జాతీయ రాజకీయాలు మైత్రులు, ప్రాబల్య సమతౌల్య సిద్ధాంతం ప్రాతిపదికగా నిర్వహించబడ్డాయి. ఈ కాలంలో అంతర్జాతీయ సంబంధాలను నిర్దేశించిన ముఖ్యాంశం ఐరోపా ఖండంపై ఫ్రాన్సు ఆధిపత్యాన్ని నెలకొల్పటానికి ఫ్రెంచ్ రాజైన 14వ లూయీ (1643 - 1715) తీవ్రంగా ప్రయత్నించటం. అదే సమయంలో ఐరోపాలోని ముఖ్య రాజ్యాలైన బ్రిటన్, ఫ్రాన్సు, హాలండ్, స్పెయిన్, దేశాల వలసలపై ఆధిపత్యం కొరకు తమలో తాము పోటీపడటం జరిగింది. ఈప్రక్రియతో బ్రిటన్ ఐరోపా ఖండంపై ఏరాజ్యం తన ఆధిపత్యాన్ని నిలబెట్టకుండా ప్రాబల్య సమతుల్యతను కాపాడే దేశంగా వ్యవహరించింది.

ఫ్రెంచిరాజైన 14వ లూయీ ఫ్రాన్సును బలీయమైన సైనిక శక్తిగా రూపొందించి, ఐరోపాలో ఫ్రాన్సు ఆధిపత్యాన్ని విస్తరింపచేయుటలో కొంతవరకు విజయం సాధించాడు, కాని ఇతని సామ్రాజ్య విస్తరణ విధానానికి స్పెయిన్ వారసత్వ యుద్ధం (1701 - 1713) లో బ్రిటన్, ఆస్ట్రియాల నాయకత్వంలో ఐరోపాలోని చిన్నరాజ్యాల సమాఖ్య

అడ్డుకట్ట వేయటం జరిగింది. తత్ఫలితంగా జరిగిందే యుట్రెక్ట్ సంధి. ఈసంధి వలన ఫ్రాన్సు ఎంతగానో నష్టపోయింది. ఈ సంధి ఫలితంగా ఫ్రెంచిరాజ వంశాని (బోర్‌బాన్ వంశం) కి చెందిన 5వ ఫిలిప్‌ను స్పెయిన్ సింహాసనంపై కూర్చుండ బెట్టగలిగినప్పటికి, ప్రాబల్య సమతౌల్యత ను భంగం చేసే విధంగా ఫ్రాన్సు స్పెయిన్‌లు భవిష్యత్తులో ఏకం కారాదనే హామీని ఫ్రాన్సు యివ్వవలసి వచ్చింది. అంతేగాక నావస్కో షియా (Novascotia) ను బ్రిటన్‌కు, నేపుల్స్, సార్డీనియా, మిలాన్‌లను - ఆస్ట్రియాకు ఫ్రాన్సు యివ్వ వలసి వచ్చింది. స్పెయిన్ నుండి జిబ్రాల్టర్, మినార్కాలను, వ్యాపార సంబంధమైన కొన్ని హక్కులను బ్రిటన్ పొందగలిగింది. ఐరోపా రాజకీయాలలో ఆ తరువాత కాలంలో ప్రముఖ పాత్ర వహించిన ప్రష్యా ఏకీకరణకు యుట్రెక్ట్ సంధి మంచి ప్రేరణ నిచ్చింది. తూర్పు ఐరోపా రాజ్యాలైన రష్యా, పోలండ్, స్వీడన్ మొదలగు రాజ్యాలు బ్రిటన్, ఫ్రాన్సు, స్పెయిన్ వంటి పశ్చిమ ఐరోపా రాజ్యాలతో సంబంధం లేకుండా తమసమస్యలను పరిష్కరించు కొన జాలవని ఈ సంధి స్పష్టం చేసింది. వాస్తవానికి యుట్రెక్ట్ సంధి తరువాత ఏ ఐరోపా రాజ్యం కూడ మిగిలిన ఐరోపా రాజ్యాలతో సంబంధం లేకుండా, తనంతతానుగా అంతర్జాతీయ వ్యవహారాలలో వ్యవహరించలేని పరిస్థితి వచ్చిందని చెప్పవచ్చు.

4.5.3 యుట్రెక్ట్‌సంధి (1713), వియన్నా సమావేశా (1815) ల మధ్య కాలంలో రాజ్య వ్యవస్థ పరిణామం :

యుట్రెక్ట్ సంది (1713) తరువాత, 1814, 15లలో జరిగిన కాంగ్రెస్ ఆఫ్ వియన్నా లేక వియన్నా సమావేశం ను జాతీయ రాజ్యవ్యవస్థ పరిణామంలో ఒక ముఖ్య ఘట్టంగా పేర్కొనవచ్చు. ఈ మధ్యకాలంలో అంతర్జాతీయ రాజకీయాలకు సంబందించి కొన్ని ముఖ్యమైన మౌలికాంశాలు - మైత్రులు సమతౌల్య ప్రాబల్యం దౌత్యనీతి వంటివి - స్థిర రూపాన్ని పొందటం జరిగింది. అదే విధంగా రాజ్యాల మధ్య ప్రాట్‌కాల్ నిబంధనలకు కూడ ఈకాలంలోనే పునాది పడింది. ఈ అంశాలన్నీ కొద్ది మార్పులతోను, చేర్పులతోను ఈనాటికి కొనసాగుతున్నాయి.

BRAOU

యుట్రెక్ట్ సంధి ఫలితంగా ఐరోపాలో నెలకొన్న ప్రాబల్య సమతౌల్యం కొన్ని ఒడుదుడుకులకు లోనైనప్పటికి, దాదాపు ఒక వంద సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా కొనసాగింది. ఈ కాలంలో ఐరోపాలోని ఏఒక్క రాజ్యం ఐరోపా ఖండం పై తన ఆధిపత్యాన్ని నెలకొల్పే పరిస్థితిలో లేకుండాపోయింది. 1733 నాటికి ఫ్రాన్సు కొంత తేరుకొని పోలిష్ పారసత్వ యుద్ధం చేసే స్థితికి,తద్వారా లొరైన్ ప్రాంతాన్ని ఆక్రమించే స్థాయికి చేరుకున్నది. ఆ తరువాత ఫ్రాన్సు, ఆస్ట్రియా వారసత్వ యుద్ధం (1740 - 48) లో ఆస్ట్రియాను విభజించే ప్రయత్నం చేసింది. కాని ఆస్ట్రియా రాణి మేరియో థెరిసా ధైర్య సాహసాల వల్లను, శక్తివంతుడైన ప్రష్యారాజు ఫ్రెడరిక్‌ది గ్రేట్ (1740-86) భయం వల్లను ఫ్రాన్సు, ఆస్ట్రియాలు తమ సాంప్రదాయక ధైర్యానికి స్వస్తి పలికి మైత్రి ఒప్పందాన్ని కుదుర్చుకోవలసివచ్చింది.

ఫ్రెడరిక్ అంటే ఉండే భయం కారణంగా రష్యాకూడా ప్రష్యా వ్యతిరేక కూటమిలో చేరింది. కాని ఇట్టి కూటముల వలన ఫ్రాన్సు ప్రాబల్యం ఎక్కువ కావటం గమనించిన బ్రిటన్ ప్రాబల్య సమతౌల్యాన్ని కాపాడే ఉద్దేశంతో ప్రష్యా పక్షాన చేరింది. ఈ పరిస్థితులలో ఫ్రెడరిక్ సాగ్జోనే (Saxony) పై దండయాత్ర చేయటంతో సప్తవర్ష సంగ్రామం (1756 - 63) ప్రారంభమైంది. ఈయుద్ధంలో ప్రష్యాకు విజయం చేకూరింది. ఈయుద్ధంలో భాగంగా ఉత్తర అమెరికా ఖండం లో ప్రష్యాకు పాత రాజ్యమైన బ్రిటన్‌కు ఫ్రాన్సుపై స్పష్టమైన ఆధిక్యం లభించింది. అమెరికానుండి ఫ్రాన్సు వైదొలగవలసి వచ్చింది. ఈ సప్తవర్ష సంగ్రామం లో ఆస్ట్రియా ఫ్రాన్సు స్పెయిన్ లు ఓటమి కారణంగాను ప్రష్యావిజయం సాధించినప్పటికి బాగా అలసిపోవటంతో యూరప్ పై ఏ ఒక్క రాజ్యం పెత్తనం చెలాయించ గలిగే పరిస్థితి లేకుండా పోయింది. ఆవిధంగా ఐరోపాలో ఒకరకమైన ప్రాబల్య సమతౌల్యం పునరుద్ధరించబడిందని చెప్పవచ్చు.

యూరప్ ఖండంలో నెలకొన్న ప్రాబల్య సమతౌల్యానికి ప్రతిఘటన కొంతకాలం తరువాత ఫ్రెంచి విప్లవకారుల రూపంలో వచ్చింది. ఫ్రెంచి విప్లవకారులు, ఫ్రెంచి విప్లవం ద్వారా ఉదారవాద విలువలను " స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం" - మిగతా ఐరోపా రాజ్యాలకు చేరవేసినారు. తత్ఫలితంగా మిగిలిన రాజ్యాలలోని విప్లవకారులు ప్రజా సహకారంతో రాచరిక ప్రభుత్వాలను కూలదోయటానికి ప్రయత్నించటం ద్వారా రాజకీయ అస్థిరత్వానికి దోహదం చేసినారు. ఆ తరువాత ఫ్రెంచి విప్లవానికి వారసునిగా ఆవిర్భవించిన నెపోలియన్ రాకతో యూరప్ రాజకీయాలు ఒక క్రొత్తమలుపు తిరిగినాయి. ఫ్రాన్సు పై పూర్తి ఆధిపత్యాన్ని సంపాదించిన నెపోలియన్ యూరప్ ఖండంపై ఫ్రాన్సు ఆధిపత్యాన్ని నెలకొల్పటానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఒక దశలో నెపోలియన్ బ్రిటన్ తోపాటు మిగతా యూరప్‌ను తన ప్రాబల్యం లోనికి తెచ్చుకో గలిగినాడు. రష్యా ఆయనకు మిత్ర రాజ్యం కాగా బ్రిటన్ ఒంటరిగా పోరాటం సాగించవలసివచ్చింది. అట్టి సమయంలో ఫ్రెంచి విప్లవ ఉదార భావాలు తీవ్ర జాతీయ వాదంగా రూపాంతరం చెందటంతో నెపోలియన్ సైన్యాల ఆక్రమణలో ఉన్న అనేక ప్రాంతాలలో భిన్న స్వరాలు కలిగిన జాతీయ వాద ఉద్యమాలు తలెత్తినాయి. చివరకు బ్రిటన్ , రష్యా, ప్రష్యా, ఆస్ట్రియా, స్వీడన్ రాజ్యాల సంఘటితశక్తి నెపోలియన్ ఓటమికి కారణమైంది. దీనితో యూరప్ మొత్తాన్ని జయించాలనే అతిశక్తివంతమైన ఫ్రాన్సు ప్రయత్నం వీగిపోయింది.

నెపోలియన్ పతనాంతరం ఐరోపా పటాన్ని తిరిగి రాయటానికి సమావేశమైన వియన్నా కాంగ్రెస్ (1815) రాజ్య వ్యవస్థకు సంబంధించి కొన్ని ముఖ్యమైన నిర్ణయాలను తీసుకొన్నది. రాజ్యాలమధ్య ప్రోటోకాల్ నిబంధనలను ఈసమావేశంలో నెలకొల్పటం జరిగింది. శక్తి సామర్థ్యాల ఆధారంగా బ్రిటన్, రష్యా, ఆస్ట్రియా, ప్రష్యా, ఫ్రాన్సు, స్వీడన్, పోర్చుగల్, స్పెయిన్ లు ప్రథమశ్రేణి రాజ్యాలుగా గుర్తించబడినాయి. స్వీడన్, పోర్చుగల్, స్పెయిన్‌లు ప్రథమశ్రేణి రాజ్యాలు కాకపోయినప్పటికీ వాటికున్న చారిత్రక ప్రాధాన్యాన్ని బట్టి ఆ హోదా ఇవ్వబడింది. వాస్తవానికి వియన్నా చర్చల సరళిని నాలుగు అగ్రరాజ్యాలు బ్రిటన్, రష్యా, ఆస్ట్రియా, ప్రష్యాలు నిర్ణయించటం జరిగింది. భవిష్యత్‌లో ఫ్రాన్సు, సామ్రాజ్యవాద ధోరణినుండి యూరప్‌ను రక్షించుటకు తగు చర్యలను నిర్దేశించటం జరిగింది. ప్రాబల్య సమతౌల్యాన్ని పునరుద్ధరించుటకు నష్టపరిహారం (Campensation) మరియు న్యాయబద్ధత (Legitmacy) అను అంశాలను ప్రాతిపదికలుగా వియన్నా సమావేశం గుర్తించింది.

ఆవిధంగా వియన్నా సమావేశంలో జాతీయరాజ్య వ్యవస్థలుగా బ్రిటన్, రష్యా, ఆస్ట్రియా, ప్రష్యా, ఫ్రాన్సు, స్వీడన్, పోర్చుగల్, స్పెయిన్‌లను గుర్తించటం జరిగింది. ప్రష్యా, రష్యా, ఆస్ట్రియాలు పోలండ్‌ను విభజించి పంచుకున్న కారణంగా అది ఒక రాజ్యంగా అంతరించిపోయింది. కాని అదే సమయంలో అమెరికా స్వాతంత్ర యుద్ధం కారణంగా అమెరికా ఒక నూతన స్వతంత్ర రాజ్యంగా అంతర్జాతీయరంగంలో ఆవిర్భవించింది

4.5.4 వియన్నా సమావేశం (1815) నుండి, వర్సైల్స్ శాంతి ఒప్పందం (Treaty of Versailles 1919) వరకు రాజ్య వ్యవస్థలో వచ్చిన మార్పులు :-

1815 వియన్నా కాంగ్రెస్ 1914 మొదటి ప్రపంచ యుద్ధం ల మధ్యకాలంలో ఐరోపాఖండంలోను మిగిలిన ప్రపంచంలోను ఎన్నో కీలకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. దౌత్యనీతి మైత్రులు, సమతౌల్య ప్రాబల్యం, సమిష్టి భద్రత వంటి అంశాలు అంతర్జాతీయ రాజకీయాల ముఖ్య లక్షణాలుగా స్థిరపడినాయి. అంతేగాక అంతవరకు ఐరోపా ఖండానికే పరిమితమైన జాతీయ రాజ్యం అనే భావన అమెరికా, జపాన్‌ల ఆవిర్భావంతో అంతర్జాతీయీకరణం చెంది మిగిలిన ఖండాలకు కూడ వ్యాపించింది. ఐరోపా ఖండం మాత్రం అంతర్జాతీయ రాజకీయాలకు కేంద్రంగా కొనసాగింది.

ఈ కాలంలో 1854-56 సంll లలో కాని స్టాంటి నోపుల్స్ పై రష్యా తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకోటానికి చేసిన ప్రయత్నాలను బ్రిటన్, ఫ్రాన్సులు క్రిమియా యుద్ధం ద్వారా ఎదుర్కొని విఫలం చేసినాయి. ఈ యుద్ధం లో రష్యా ఓడిపోవటంతో, పశ్చిమంగా విస్తరించాలన్న రష్యా కోరిక భగ్నమై సమతౌల్య ప్రాబల్యం నిలబడింది.

ఆ తరువాత ఇదే కాలంలో జరిగిన మరో ముఖ్య సంఘటన ఇటలీ, జర్మనీల ఏకీకరణ. జోసఫ్ మాజినీ నైతిక బలంతో కావూర్ దౌత్యనీతితో, గారిబాల్డీ వీరత్వంతో 1861 నాటికి అనేక రాజ్యాలుగా అనైక్యత తో ఉన్న ఇటలీ ఒక సమైక్యరాజ్యంగా ఆవిర్భవించింది. అదేవిధంగా దండనీతి (Policy of Blood and Iron) కిమరో పేరైన ఆటోవాన్ బిస్మార్క్ అధ్వర్యంలో ఫ్రాంకో - ప్రష్యన్ యుద్ధం (1870 - 71) ద్వారా విచ్ఛిన్న రాజ్యాలుగా ఉన్న జర్మనీ కూడా ఏకీకరణం చెంది బలీయమైన ఒక జాతీయరాజ్యంగా రూపొందింది. జర్మనీ ఏకీకరణతో ఐరోపా రాజకీయాలలో ఫ్రాన్సు, ఆస్ట్రియాల ప్రభావం తగ్గి జర్మనీ ప్రభావం మొదలయింది.

ఇక బాల్కన్ ద్వీపకల్పంలో టర్కీ ప్రాబల్యం తగ్గటంతో 20 వ శతాబ్దం ఆరంభంనాటికి గ్రీసు, మాంటినీగ్రో రుమేనియా, సెర్బియా, బల్గేరియా, అల్బేనియా వంటి స్వతంత్ర జాతీయ రాజ్యాల ఆవిర్భావానికి అవకాశం కలిగింది. ఈ రాజ్యాలు ఐరోపాలో అగ్రరాజ్యాల విస్తరణ కాంక్షలకు కొంతవరకు అడ్డుగా నిలిచినాయి.

సముద్రాంతర ప్రదేశాలలో అమెరికా సంయుక్త రాష్ట్రాలతో బాటు మరికొన్ని ఇతర రాజ్యాలు ప్రాబల్యంలోనికి వచ్చినాయి. 1822 లో బ్రెజిల్, పోర్చుగల్ నుండి స్వంతంత్ర రాజ్యంగా ఆవిర్భవించి, 1889 లో గణతంత్ర రాజ్యంగా మార్పుచెందింది. ఈ కాలంలోనే అమెరికా కూడా శక్తివంతమైన రాజ్యంగా పరిణామం చెందటం మొదలైంది. 19 వశతాబ్దాంతానికి అంతర్యుద్ధం నుండి బయటపడి, స్పానిష్ - అమెరికన్ యుద్ధం (1898) ద్వారా అంతర్జాతీయ గుర్తింపును పొందింది. అదేవిధంగా దూర ప్రాచ్యంలో జపాన్ భూస్వామ్య విధానం నుండి బయటపడి పాశ్చాత్య పద్ధతుల ద్వారా అభివృద్ధిని సాధించి ఒకశక్తివంతమైన జాతీయ రాజ్యంగా మార్పు చెందింది. అంతేకాగ చైనా - జపాన్ యుద్ధం (1804 - 95)లో చైనా మీద, రష్యా - జపనీస్ యుద్ధం (1904-05) లో రష్యామీద విజయం సాధించటంతో అది ఒక అగ్రరాజ్యంగా గుర్తింపు పొందింది.

ఆ తరువాత జరిగిన అతి ముఖ్య సంఘటన మొదటి ప్రపంచ యుద్ధం (1914 - 1918). మహా యుద్ధం (Great - War) గా చరిత్ర పుటలకెక్కిన ఈ యుద్ధం ఆరంభం నాటికి రాజ్యాలు అగ్రరాజ్యాలుగా గుర్తింపును పొందాయి. వీటిలో జపాన్, అమెరికాలను మినహాయించి మిగిలిన రాజ్యాలన్నీ ఐరోపా ఖండానికి చెందినవే. కాని వీటి ప్రయోజనాలు మాత్రం విభిన్నమైనవి. తమ ప్రయోజనాల పరిరక్షణకు ఈ రాజ్యాలు అనేక రహస్య సంధులను కుదుర్చుకున్నాయి. జర్మనీ, ఆస్ట్రియా హంగెరీ ఇటలీలు ఫ్రాన్సుకు వ్యతిరేకంగా 1871 నాటి యథాతద స్థితిని కొనసాగించటానికి అనువుగా త్రిరాజ్య సంధి, (Triple Alliance, 1882) ని కుదుర్చుకొనగా, దానికి ప్రతిగా ఫ్రాన్సు, బ్రిటన్, రష్యాలు కలిసి త్రైపాక్షిక కూటమి (Triple Enente 1907) ని కుదుర్చుకున్నాయి. ఈరెండు కూటముల మధ్య జరిగిన మొదటి ప్రపంచ యుద్ధం ఫలితంగా జర్మనీ కూటమి ఓడిపోగా, జర్మనీ స్థానాన్ని ఫ్రాన్సు తిరిగి ఆక్రమించగలిగింది. అంతే గాక ఈ యుద్ధ ఫలితంగా జర్మనీ, ఆస్ట్రియా, హంగెరీ , టర్కీ, రష్యాలలో సామ్రాజ్యాలు కూలిపోయినాయి. అంతేగాక ఈయుద్ధంలో ఇటలీ త్రిరాజ్యసంధిలో భాగస్వామి అయినప్పటికీ, జర్మనీ పక్షాన గాక, మిత్ర రాజ్యాల పక్షాన 1915 లో యుద్ధంలో ప్రవేశించటంతో అది విజేతగా మిగిలింది.

4.5.5 వర్సైల్స్ శాంతి ఒప్పందం (1919) తరువాత రాజ్య వ్యవస్థ లో వచ్చిన పరిణామాలు :

మొదటి ప్రపంచ యుద్ధానికి ముగింపుగా జరిగిన వర్సైల్స్ శాంతి ఒప్పందం తరువాత అంతర్జాతీయ రంగంలో అమెరికా, బ్రిటన్, జపాన్‌లు, ముఖ్య రాజ్యాలుగా మిగిలినాయి. కాని ఆ తరువాత కాలంలో అమెరికా తిరిగి తన పూర్వ ఏకాంత విధానానికి వెళ్లిపోయింది. బ్రిటన్ తన వలసల సమస్యతోను యుద్ధ ఫలితంగా సంభవించిన ఆర్థిక మాంద్యం తోను సతమతమవుతూ నియంతృత్వ రాజ్యాల పట్ల లాలించే ధోరణి (Policy of appeasement) ని అవలంబించింది. జపాన్ కొద్దికాలం ప్రజాస్వామిక రాజ్యంగా ఉన్నప్పటికి ఆ తరువాత కాలంలో సైనిక

BRAOU

నియంతృత్వానికి లోనై 1931 మాంచూరియా ఆక్రమణతో సామ్రాజ్యవాద దేశంగా మార్పు చెందింది. ఇదే సమయంలో ఇటలీ, జర్మనీలలో ఆనాడున్న రాజకీయ అస్థిరతను ఆర్థిక సంక్షోభాన్ని అవకాశంగా చేసికొని ముస్సోలిని, హిట్లర్‌ల ఆధిపత్యంలో నియంతృత్వ రాజ్యాలైన జర్మనీ, ఇటలీ, జపాన్‌లు అక్షరాజ్య కూటమి (Axis Powers) గా ఒకవైపు రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్‌లు మిత్ర రాజ్యాలుగా మరొకవైపు పాల్గొన్నాయి. 1941 డిసెంబర్‌లో జపాన్ పెరల్ హార్బర్‌పై దండెత్తటంతో అమెరికా కూడ ఈయుద్ధంలో పాల్గొని అక్షరాజ్య కూటమిని ఓడించటం జరిగింది. ప్రజాస్వామ్యరాజ్యాల విజయంగా అభివర్ణింపబడిన ఈ యుద్ధఫలితంగా, ఐరోపా రాజ్యాల ప్రాబల్యం చాలవరకు తగ్గి, అమెరికా, రష్యాలు అగ్రరాజ్యాలు (Super Powers) గా ఆవిర్భవించినాయి.

వర్సైల్స్ శాంతి ఒప్పంద సమయం నుండి జాతీయ రాజ్య వ్యవస్థ మౌలికంగా ఒకే విధంగా ఉన్నప్పటికి రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కొన్ని ముఖ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. వాటిని క్లుప్తంగా పరిశీలిద్దాం అవి

1) ఐరోపా ఖండానికే పరిమితమైన జాతీయ రాజ్యవ్యవస్థ, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ వ్యాప్తమైంది. సామ్రాజ్య వాదానికి, వలస వాదానికి స్వస్తిపలికి, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలో జాతీయ వాద ఉద్యమాల ద్వారా అనేక క్రొత్త రాజ్యాలు ఆవిర్భవించటంతో జాతీయరాజ్య వ్యవస్థ మంచి ప్రాచుర్యాన్ని పొందింది.

2) ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలో సంఖ్యాపరంగా ఎన్నో రాజ్యాలు ఆవిర్భవించటంతో, అంతర్జాతీయ రాజకీయాలలో ఐరోపా ప్రాధాన్యం కొంతవరకు తగ్గిందని చెప్పవచ్చు. నూతనంగా ఆవిర్భవించిన రాజ్యాలు ప్రధానంగా బడుగు రాజ్యాలు. లేదా అభివృద్ధి చెందుతున్న రాజ్యాలు ఈ రాజ్యాలు పూర్వం వలె ఐరోపా రాజ్యాలను అనుసరించుటగాక తమ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని స్వతంత్ర విదేశాంగ విధానాలను రూపొందించుకొని వ్యవహరించసాగాయి. అంతేగాక ఈరాజ్యాలు అంతర్జాతీయరంగంలో తమ ప్రయోజనాల పరిరక్షణకు సమైక్యంగా వ్యవహరిస్తూ అవసరమైతే ఐరోపా రాజ్యాలను రాజకీయంగాను, సిద్ధాంతపరంగాను ఎదిరించగలుగుతున్నాయి. అందువలన పూర్వం వలె ఐరోపా రాజ్యాలు ఈరాజ్యాలను వాటి ప్రయోజనాలను విస్మరించ లేకపోతున్నాయి.

3.) జాతీయ రాజ్య వ్యవస్థ ప్రపంచవ్యాప్తం కావటంతో సమతౌల్య ప్రాబల్యం, సమిష్టి భద్రత వంటి అంశాలు గుణాత్మకమైన మార్పులకు లోనైనాయి. మొదటి ప్రపంచ యుద్ధం వరకు ఐరోపాకే పరిమితమైన సమతౌల్య ప్రాబల్య సిద్ధాంతం జాతీయరాజ్యం ఆవిర్భావంతో అంతర్జాతీయంగా అమలులోనికి వచ్చింది. అదే విధంగా 17, 18, 19, శతాబ్దాలలో సమతుల్య ప్రాబల్యాన్ని నెలకొల్పటంలో బ్రిటన్ కీలకమైన పాత్ర వహించింది. కాని ఈనాడు ఆస్థానాన్ని అమెరికా, రష్యా, చైనా, ఇండియా, ఈజిప్టు, యుగొస్లావియా వంటి రాజ్యాలు, అంతర్జాతీయ స్థాయిలోను, ప్రాంతీయ స్థాయి లోను భర్తీ చేసినాయి. అంతే గాక నానాజాతి సమితి ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థల ఆవిర్భావంతో సమిష్టి భద్రత కు అంతర్జాతీయంగా ప్రాధాన్యత పెరిగింది.

4.) రెండవ ప్రపంచ యుద్ధం తరువాత వివిధ దేశాలలో ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పాటుతో, దాని ప్రభావం అంతర్జాతీయ రాజకీయాలపై కూడ ప్రసరించింది. రవాణా, ప్రసార సాధనాలలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, విద్యావ్యాప్తి, జాతీయ ఉద్యమాలు, వార్తా ప్రసార సాధనాల అభివృద్ధి ప్రజలలో రాజకీయ చైతన్యం పెంపొందటానికి దోహదపడినాయి. తత్ఫలితంగా ఈనాడు జాతీయ సమస్యలపైన, అంతర్జాతీయ రాజకీయాలపైన ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెలిబుచ్చగలుగుతున్నారు. ఆకారణంగానే అంతర్జాతీయ రాజకీయాలకు సంబంధించిన విదేశాంగ విధానం, దౌత్యనీతి, యుద్ధం, నిరాయుధీకరణం, అంతర్జాతీయ న్యాయం, అంతర్జాతీయ సంస్థలు, వ్యవస్థలు వంటి విషయాలు, ప్రజాస్వామ్యీకరణం చెంది ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా వీటిని నిర్వహించవలసిన

BRAOU

బాధ్యత విధాన నిర్ణేతలపై పడింది. ఈనాడు ఏ ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని విస్మరించలేని పరిస్థితి ఏర్పడింది. ఆవిధంగా అంతర్జాతీయ రంగంలో రాజ్యాల సంఖ్య పెరగటమే గాక జాతీయ - అంతర్జాతీయ రాజకీయాలు పూర్వం వలె ఆయా రాజ్యాల కులీన వర్గాలకే పరిమితంగాక, సామాన్య ప్రజానీకం చురుకుగా పాలుపంచుకునే అవకాశం కలిగింది.

4.6.0 జాతీయ రాజ్య వ్యవస్థ లక్షణాలు

జాతీయ రాజ్య వ్యవస్థ తన పరిణామ క్రమంలో కొన్ని ముఖ్యలక్షణాలను సంతరించుకున్నది. అవి

4.6.1 సార్వభౌమాధికారం :

జాతీయ రాజ్య వ్యవస్థ ముఖ్యలక్షణాలలో మొదటిది సార్వభౌమాధికారం. సార్వబౌమాధికారం లేకుండా ఏరాజ్యం, రాజ్యంగా పరిగణింపబడజాలదు. రాజ్యవ్యవస్థ పరిణామక్రమంలో మధ్య యుగాలలోని మతాధిపతుల ప్రాబల్యాన్ని తగ్గించి రాజుల ఆధిపత్యాన్ని పెంపొందించటానికి రూపొందినదే సార్వభౌమత్వ సిద్ధాంతము. దాని ప్రకారం రాజ్యం సర్వ స్వతంత్రమైనది. ఏ ఇతర రాజ్యానికి, శక్తికి లొంగి వ్యవహరించవలసిన అవసరంలేదు ఈభావన ఆధారంగా రాజ్యపాలకునికి, తన పాలితులపై సంపూర్ణ అధికారం కల్పించబడింది. రాజ్యంలో అరాచకత్వం, అశాంతి తలెత్తకుండా సక్రమ పరిపాలనను అందించే బాధ్యతను పాలకునికి ఆపాదిస్తూ అతనికి సార్వ భౌమాధికారాలను అప్పగించినారు. దీనిని ప్రతిపాదించి, వ్యాప్తిచేసిన సిద్ధాంత కర్తలలో ముఖ్యులుగా బోడిన్ హబ్స్, లాక్, రూసో, హెగిల్, ఆస్టిన్, లాస్కీ వంటి వారిని పేర్కొనవచ్చు.

BRAOU

జాతీయ భావం :- ఇంతకు పూర్వం పేర్కొన్న విధంగా ఆధునిక జాతీయ రాజ్యాల మరొక ముఖ్య లక్షణం జాతీయ భావం. ఒక రాజ్యంలో నివసిస్తున్న ప్రజలు చారిత్రకంగా ఒకే భాష సాహిత్యం, సాంప్రదాయాలు, మతం, సంస్కృతులకు చెందినవపుడు వారంతా ఒకే జాతికి చెందిన వారమనే మానసిక అనుభూతికి లోనౌతారు. ఈ అనుభూతి ఆధారంగా ఆ రాజ్యం పట్ల ఒకరకమైన ఆరాధనను, విబద్ధత (Commitment) ను పెపొందించుకోవటాన్నే జాతీయభావం అని పేర్కొనవచ్చు. ఈ భావనకు సంబంధించి వివరంగా ఈ పాఠ్యాంశం ముందు భాగంలో చర్చించటం జరిగింది.

4.6.2 జాతీయ భావం

గత మూడు నాలుగు దశాబ్దాలుగా అభివృద్ధి చెందిన ఆధునిక జాతీయ భావం, సమకాలీన అంతర్జాతీయ పరిస్థితులను బట్టి వివిధ దశలలో వివిధ రచయితలు వివిధ రకాలుగా గుర్తించి విశదీకరించినారు. వాటిలో ప్రధానమైన కొన్నింటిని పరిశీలిద్దాం.

4.6.3 ఉదారవాద జాతీయభావం

19 వ శతాబ్దంలో ముఖ్యంగా 1815 - 1870 ల మధ్యకాలంలో అభివృద్ధి చెందిన జాతీయభావాన్ని ప్రధానంగా ఉదారవాద జాతీయభావం గా పేర్కొనవచ్చు. ఈ జాతీయభావం ఉన్నతమైన ఆశయాలతో కూడి, ప్రజాస్వామిక భావాలతో ప్రభావితమైనది. పారిశ్రామిక, సామాజిక విప్లవాల ఫలితంగా ఆవిర్భవించిన మధ్యతరగతి ఈరకమైన జాతీయభావానికి ఎక్కువ ప్రేరణ ఇచ్చినారు. ఇటువంటి జాతీయభావం ఇచ్చిన ఉత్తేజంతోనే ఇటలీ, జర్మనీల ఏకీకరణ సాధ్యమైంది. గ్రీసు, బెల్జియం రాజ్యాలు జాతీయ రాజ్యాలుగా గుర్తింపును పొందాయి. పోలండ్, ఐర్లాండ్, ఆస్ట్రో - హంగేరియన్ సామ్రాజ్యాలలో జాతీయవాద ఉద్యమాలు ప్రారంభమైనాయి.

4.6.4 దురంహకార జాతీయ భావం

19 వశతాబ్దం ఉత్తరార్థంలోను, 20వ శతాబ్దం తొలిదశలో ను అభివృద్ధి చెందిన జాతీయభావాన్ని దురహంకార జాతీయభావం గా పరిగణించవచ్చు. ఈ జాతీయవాదం వర్తక, వాణిజ్య వలసల పరమైన పోటీల కారణంగా తలెత్తిన వైరుధ్యాలతోను, సైనిక, నావికాపరమైన ఆధిక్యతను నిలబెట్టుకోవటానికి రాజ్యాలు పోటీపడిన కారణంగా తలెత్తిన శతృత్వంతో ను ప్రభావితమైంది. అందువలననే ఈదశలో జాతీయ వాదం దురహంకార పూరితమై తీవ్రవాద మనస్తత్వంతో కూడి ఉండేది. ఒకవిధంగా ఈ జాతీయ వాదం మొదటి ప్రపంచయుద్ధానికి కారణమై దాని ఫలితంగా కొనసాగింది. ఈ యుద్ధం పర్యవసానంగా ఆస్ట్రో - హంగేరియన్ సామ్రాజ్యం, రష్యాలోని జార్ సామ్రాజ్యం, ఆటోమాన్ సామ్రాజ్యాలు కూలిపోయి వాటి అవశేషాలమీద అనేక జాతీయ రాజ్యాలు ఆవిర్భవించినాయి.

4.6.5 నియంతృత్వ లేక అధికారయుత జాతీయభావం

మొదటి ప్రపంచయుద్ధం తరువాత ఇటలీ, జర్మనీ, జపాన్, స్పెయిన్‌లలో తలెత్తిన నియంతృత్వ ప్రభుత్వాలు అధికారయుత జాతీయవాదాన్ని బలపరచినాయి. ఈజాతీయవాదం రాజ్యాధికారాన్ని అత్యున్నతమైనదిగా చిత్రీకరించి వ్యక్తి హక్కులను రాజ్యాధీనం చేసినది. రాజ్యదేశాలను పాటించటమే పౌరుని విధిగా ఈ నియంతృత్వ ప్రభుత్వాలు పేర్కొన్నాయి. ఈరకమైన జాతీయవాదం రాజ్యవిస్తరణకు, జాతి ఔన్నత్యాన్ని పెపొందించటానికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వటం ద్వారా, ప్రమాదభరితమైనదిగా పరిగణింపబడింది. సామ్యవాద ప్రభుత్వాలు ఏర్పాటైన రష్యా, చైనాలు కూడ ఈ జాతీయవాదాన్ని బలపరిచే రాజ్యాలుగా గుర్తింపబడినాయి. ఈరకమైన జాతీయవాదమే రెండవ ప్రపంచ యుద్ధానికి కారణమైంది.

4.6.6 సమగ్ర జాతీయ భావం

BRAOU

20 వ శతాబ్దంలో ప్రాధాన్యత పొందిన అంతర్జాతీయ వాదంతో ప్రభావితమై అభివృద్ధి చెందిన జాతీయ వాదమే సమగ్ర జాతీయ భావం. ఇది సమకాలీన అంతర్జాతీయ సమాజంలో సర్వత్రా వ్యాపించింది. దీనినే మార్గాంతా జాతీయ సార్వత్రిక వాదం (Nationalistic Universalism) గా పేర్కొన్నాడు. ఈ జాతీయవాదం ప్రకారం ఏదైతే రాజ్యానికి ఉపయోగకరంగాడుంటుందో, అదే ప్రపంచానికి కూడ ఉపయోగకరంగా ఉంటుంది. ఆవిధంగా జాతీయ రాజ్యం ఆధారంగా ప్రపంచ అభివృద్ధికి ప్రామాణిక విలువలను రూపొందించటానికి ఈ జాతీయ వాదం ప్రాదాన్యత యిస్తుంది.

4.7 జాతీయభావం - సాధనాలు, సంకేతాలు

జాతీయభావం అనేది వివిధ రాజ్యాలలో విభిన్న సాధనాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. విద్యాలయాలు, వార్తాపత్రికలు, రేడియో, టెలివిజన్ మొదలైన సమాచార ప్రసార సాధనాలు జాతీయభావం పెంపొందటానికి ఎక్కువగా దోహదపడతాయి. అంతేగాక జాతీయభావాన్ని ప్రతిబింబించే సంకేతాలు, జాతీయ గీతాలు, దేశభక్తి పూరితమైన నినాదాలు, జాతీయ జెండాలు, దేవాలయాలు, జాతీయ స్మారక భవనాలు, స్మృపాలు, జాతీయ ఉత్సవాలు మొదలుగునవి కూడ ప్రజలలో జాతీయభావాన్ని పెంపొందించటానికి ఇతోధికంగా ఉపయోగపడతాయి. వీటిని ఆధారంగా చేసికొనే నియంతృత్వ ప్రభుత్వాలు ప్రజలలో జాతీయ భావాలను, అతివాద ధోరణిని రేకెత్తించి అంతర్జాతీయశాంతికి భంగం కలిగించగలుగుతున్నాయి.

4.8 అంతర్జాతీయ న్యాయం

సార్వభౌమత్వ జాతీయ రాజ్యాల మరిఒక ముఖ్యలక్షణం అంతర్జాతీయ న్యాయాన్ని గౌరవించటం. జాతీయ రాజ్యాల ఆవిర్భావంతో రాజ్యాల మధ్య సంబంధాలను నిర్దేశించే ఉపకరణంగా అంతర్జాతీయ న్యాయం రూపుదిద్దుకొంది. రాజ్యాల మధ్య కుదుర్చుకొన్న వివిధ ఒప్పందాలు, సంధులు, న్యాయ సాధనాలతో అంతర్జాతీయ న్యాయం కూడి ఉంటుంది. అంతర్జాతీయ రంగంలో రాజ్యాల ప్రవర్తనకు, రాజ్యాల మధ్య వివాదాలు పరిష్కారానికి సంబంధించి ఏర్పాటైన ఆచారాలు, వ్యవహారాలు కూడ అంతర్జాతీయ న్యాయంగా పరిగణింపబడతాయి. రాజ్యాల హక్కులు, విధులు శాంతికి సంబంధించిన సూత్రాలు యుద్ధనీతి సూత్రాలు, స్వతంత్ర రాజ్యాలకు గుర్తింపు, తటస్థ రాజ్యాల గుర్తింపు, సరిహద్దు జలాల సమస్య, విదేశీయులను ఆదరించే పద్ధతులు, దౌత్య సంబంధాలు, దౌత్య పరిరక్షణలకు న్యాయం వివరిస్తుంది. గ్రోషియన్స్ బెంథాం, ఫ్రాన్సిస్ వెబర్ వంటి సిద్ధాంతకారులు అంతర్జాతీయ న్యాయం అభివృద్ధికి కృషిచేసినారు. వీటిని ఆధారంగా చేసి కొని రాజ్యాలు అంతర్జాతీయంగా వ్యవహరించవలసి ఉంటుంది.

4.9 సారాంశం

ఈ విధంగా జాతీయభావం, సార్వభౌమత్వ జాతీయ రాజ్యాలు హఠాత్తుగా ఏదో ఒక సమయంలో ఆవిర్భవించినవి కావు. గత మూడు నాలుగు పరిణామాలను ఆధారంగా చేసికొని వివిధ దశలలో అవి అభివృద్ధి చెందినాయి. అంతర్జాతీయ రాజకీయాలను, రాజ్యాల ప్రవర్తనను ప్రభావితం చేయటంలో అవి ప్రముఖ పాత్ర వహించినాయి. డి. డబ్ల్యు. బ్రోగన్ పేర్కొన్నట్లు చారిత్రకంగా జాతీయవాదం అటు విధ్వంసక శక్తి గాను, ఇటు నిర్మాణాత్మక శక్తి గాను కూడ ఉపయోగపడింది. ఉదా:- రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం జాతీయవాద ఉద్యమాల కారణంగా అంతర్ధానం కావటానికి అతివాద లేక దురహంకార జాతీయవాదం తో రాజ్యాల మధ్య యుద్ధాలను ప్రేరేపించటం ద్వారా ఇది విధ్వంసక శక్తిగా ఉపయోగపడింది. అదే సమయంలో ఇటలీ, జర్మనీల వంటి జాతీయ రాజ్యాలు ఆవిర్భవించటానికి, రాజ్యం పట్ల ప్రజల విశ్వాసాన్ని పెపొందించి సమైక్యంగా వ్యవహరించటానికి జాతీయవాదం బలీయమైన నిర్మాణాత్మక శక్తిగా కూడ సహాయపడింది.

ఇంతటి ప్రాధాన్యతను పొందిన జాతీయవాదం జాతీయ రాజ్యాల భవిష్యత్తు ఈనాడు కొంతవరకు నిరాశా పూరితంగా యున్నదని చెప్పవచ్చు. 20వ శతాబ్దంలో థియోడార్ని కొలంబస్ , మరియు జేమ్స్ వెంచీ, వుల్ఫ్ (Theodore A. Coulourvis and James H.Wolfe) లు పేర్కొన్నట్లు జాతీయరాజ్య , వ్యవస్థ భవిష్యత్తు మూడు కారకాలు కారణంగా అగమ్యగోచరంగా తయారైంది. అవి 1) సాంకేతిక విప్లవం మరియు అణు విధ్వంసక ఆయుధాల తయారీ 2, అధిక్య జాతీయ (Supranational) వ్యవస్థల ఏర్పాటు 3.జాతీయాంతర (Transnational) సైద్ధాంతిక, మత రాజకీయ ఉద్యమాలు, రవాణా ప్రసార సాధనాలలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పుల కారణంగా ఈనాడు ప్రపంచంలోని సుమారు ఏమూలప్రాంతాన్నైనా కొన్ని గంటల సమయంలో సందర్శించటానికి ప్రపంచం నలుమూలలా కొన్ని నిమిషాలలో ప్రసార సంబంధాలను నెలకొల్పటానికి అవకాశం కలిగింది. తద్వారా రాజ్యాల మధ్య భౌతికంగా దూరం తగ్గి, ప్రపంచ సంస్కృతి అభివృద్ధి చెందటానికి, ప్రపంచ ప్రజలలో తామంతా ఒకే ప్రపంచానికి చెందిన వారమనే విశాల దృక్పథం పెరిగిపోవటానికి వీలుకలిగింది. అంతేగాక రెండవ ప్రపంచయుద్ధం తరువాత అణ్వాయుధాల తయారీతో జాతీయ రాజ్యవ్యవస్థ మనుగడే అనుమానాస్పదంగా తయారైంది. ఈనాడు ప్రపంచంలోని ఏమారు మూలప్రాంతం నుండైనా మిగిలిన ప్రపంచం మొత్తాన్ని భస్మీపటలం చేయగల అణ్వాయుధాలను ఎన్నో రాజ్యాలు కలిగి ఉన్నాయి. తత్ఫలితంగా ఎంతటి శక్తివంతమైన రాజ్యమైనప్పటికి అణ్వాయుధాల దుష్పలితాల నుండి తన ప్రజలని తప్పించజాలని పరిస్థితి ఏర్పడింది. కారణంగానే జాన్ హెర్జ్ (John & Herz) భవిష్యత్తులో

Dr. BRAOU LIBRARY Acc. No: CM-0139 Class No: 320

'రాజ్యం అంతర్ధానాన్ని (demise of the state) ఊహించినాడు. అదే విధంగా జాతీయ రాజ్యవ్యవస్థ రాజ్యాల సార్వభౌమాధికారాలకి ప్రాధాన్యత ఇస్తుండగా, ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యం, విద్యాభివృద్ధి, భద్రత వంటి సాముదాయక లక్ష్యాలను సాధించటానికి ఈనాడు అంతర్జాతీయ రంగంలో ఆవిర్భవిస్తున్న ఆధిక్య జాతీయ వ్యవస్థలు నాటో, ఒపెక్, సార్క్, మొదలగునవి - ఈ సార్వభౌమాధికారానికి కొన్ని పరిమితులను విధించి, ప్రాంతీయ, సార్వత్రిక వ్యవస్థల ఏర్పాటుకు అవకాశం ఇస్తున్నాయి. సమకాలీన అంతర్జాతీయ సమాజంలో ఏరాజ్యం తనకు తానుగా తన ఆర్థిక సామాజిక అవసరాలను తీర్చుకోనజాలని పరిస్థితి ఏర్పడింది. తత్ఫలితంగా రాజ్యాలన్నీ జాతీయ వాదం కంటె ఈ సాముదాయక లక్ష్యాలను సాధించటానికి అనువుగా ఆధిక్య జాతీయ వ్యవస్థల ఏర్పాటు పట్ల మొగ్గు చూపుతున్నాయి. అంతేగాక జాతీయాంతర సైద్ధాంతిక, మత, రాజకీయ ఉద్యమాలు కూడ జాతీయ రాజ్యాల మనుగడను ప్రశ్నిస్తున్నాయి. ఉ॥కు సామ్య వాదం, ఫాసిజం, నాజీయిజం వంటి రాజకీయ సిద్ధాంతాలు క్రైస్తవ మతం, ఇస్లాం వంటి మత ఛాందస భావాలు జాతీయాంతర విధేయతలను ప్రేరేపిస్తూ జాతీయవాదాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. ఈ కారణాల వలన జాతీయ రాజ్యాల మనుగడే ప్రశ్నార్థకమైంది. ఈ విధంగా సమకాలీన అంతర్జాతీయ సమాజంలో చోటు చేసుకున్న పారిశ్రామిక, సాంకేతిక విప్లవాలు అణ్వాయుధాల తయారి, రాజ్యాల మధ్య పరస్పర ఆధారభూతమైన ఆర్థిక అవసరాలు జాతీయ వాదాల కంటె అంతర్జాతీయ వాదానికి, విశ్వమానవ దృక్పథానికి ఎక్కువ ప్రాధాన్యతను కల్పిస్తున్నాయి. భవిష్యత్తులో ప్రపంచరాజ్యం ఆవశ్యకతను అవసరాన్ని ఈపరిణామాలు సూచిస్తున్నాయి. అయినప్పటికి ఈనాడు జాతీయ రాజ్యం అనేది వెంటనే అంతర్ధాన మౌతుందని ప్రపంచరాజ్యం ఆవిర్భవిస్తుందని చెప్పడం క్లాసేనార్ (Klauss Knorr) పేర్కొన్నట్లు అపరిపక్వ (Premature) ఆలోచనే అవుతుంది. సమకాలీన అంతర్జాతీయ సమాజంలో ఒకవైపు అంతర్జాతీయ, విశ్వమానవ దృక్పథాలు అభివృద్ధి చెందుతున్న ధోరణి లోనే, మరి యొక వైపు తమతమ జాతీయ రాజ్యాల పట్ల ప్రజల అనురాగం కూడా కొనసాగుతున్నది. కాని సమీప భవిష్యత్తులో మారుతున్న విలువలు, సాంకేతిక పరిణామాలు అనివార్యంగా ప్రపంచ ప్రజలు ప్రపంచరాజ్యం ఏర్పాటు పట్ల మొగ్గు చూపటానికి అవకాశం ఉన్నదని ఆశించవచ్చు.

BRAOU

సమకాలీన అంతర్జాతీయ సమాజంలో విస్తృత ప్రాచుర్యాన్ని పొందిన భావన, సార్వభౌమత్వ జాతీయ రాజ్య వ్యవస్థ భావనకు ప్రాతిపదిక అయిన జాతీయ భావం 18,19 శతాబ్దాలలో ఐరోపాఖండంలో అభివృద్ధిచెంది 20వ శతాబ్దం నాటికి ప్రపంచ వ్యాప్తమైంది. తత్ఫలితంగా 20వ శతాబ్దంలో, ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అంతర్జాతీయ సమాజంలో ఎన్నో జాతీయ రాజ్యాలు ఆవిర్భవించినాయి. ఈరాజ్యాల ఆవిర్భావానికి దోహదం చేసిన కారకాలుగా సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం, మతసంస్కరణోద్యమాలు పారిశ్రామిక, సాంకేతిక విప్లవాలు, మధ్యతరగతి ఆవిర్భావం, ఫ్రెంచి విప్లవం, వివిన్న సిద్ధాంతకారుల రచనలు మొ॥నవాటిని పేర్కొనవచ్చు.

చారిత్రకంగా ఆధునిక జాతీయ రాజ్యవ్యవస్థ ఆవిర్భావానికి, ముప్పది సంవత్సరాల యుద్ధ ఫలితంగా కుదుర్చుకున్న వెస్ట్‌ఫేలియా సంధి (1648) నాంది పలికింది. ఆ సంధి ఫలితంగా ఏర్పడిన రాజ్య వ్యవస్థ ఆ తరువాత కాలంలో కుదుర్చుకున్న వివిధ సంధులు, సంఘటనల ఫలితంగా యుట్రెక్ట్ సంధి (1713) వియన్నా సమావేశం (1815) వర్సైల్స్ శాంతి ఒప్పందం (1919) రెండవ ప్రపంచయుద్ధం మొ॥వి, కొన్ని మార్పులు చేర్పులకు లోనై ఇరవయ్యో శతాబ్దం నాటికి పరిపూర్ణమైన జాతీయ రాజ్యాలుగా ఆవిర్భవించినాయి. ఈజాతీయ రాజ్యాలు తమ పరిణామక్రమంలో కొన్ని ముఖ్యలక్షణాలను సంతరించుకున్నాయి. వాటిని 1. సార్వభౌమాధికారం 2. జాతీయభావం 3. అంతర్జాతీయ న్యాయాలుగా పేర్కొనవచ్చు. జాతీయభావం అనేది సమకాలీన అంతర్జాతీయ పరిస్థితులను బట్టి ఉదారవాద జాతీయభావం, దురంహకార జాతీయ భావం, నియంతృత్వ జాతీయభావం సమగ్ర జాతీయభావాలుగా రూపాంతరం చెందింది. ప్రతిరాజ్యం ఆరాజ్య పరిస్థితులను బట్టి ఏదో ఒకరకమైన జాతీయభావాన్ని ప్రేరేపించ గలిగింది.

ఇక జాతీయ రాజ్యాల భవిష్యత్తుకు సంబంధించి కొంత నిరాశాపూరితంగా ఉన్నదని చెప్పవచ్చు. 20 శతాబ్దంలో చోటుచేసికున్న సాంకేతిక విప్లవం, అణు విధ్వంసక ఆయుధాలు సైద్ధాంతికత, వంటి రాజకీయ ఉద్యమాలకు అంతర్జాతీయంగా వస్తున్న తోడ్పాటు, రాజ్యాల మధ్య పరస్పర ఆధారభూతమైన ఆర్థిక సాంకేతిక అవసరాలు, ప్రపంచ ప్రజలలో నానాటికి అభివృద్ధి చెందుతున్న అంతర్జాతీయవాదం, విశ్వమానవ దృక్పథాలను దృష్టిలో పెట్టుకొని చూస్తే భవిష్యత్తులో జాతీయరాజ్యాలకు స్థానం ఉందేమో నని అనిపిస్తున్నది. కాని అదే సమయంలో జాతీయ రాజ్యాల పట్ల ప్రజలకున్న అభిమానం, అనురాగం చూసినప్పుడు ఈ రాజ్యాల అంతర్ధానం అనేది అంత త్వరితగతిన జరిగే విషయం కాదని అవగతం అవుతుంది. ఏమైనప్పటికీ సమకాలీన అంతర్జాతీయ రంగంలో మారుతున్న విలువలు, సాంకేతికపరమైన మార్పులను గమనించినపుడు సమీప భవిష్యత్తులో ప్రపంచ ప్రజలు, ప్రపంచ రాజ్యం పట్ల మొగ్గు చూపటానికి అవకాశం ఉన్నదని అనిపిస్తుంది.

– ఐ. దోసగిరిరావు

4.9 చదువదగిన పుస్తకాలు

1. Norman D. Palmer and Howard C. Perkins. International Relations the World Community in Transition, Scientific Book Agency Calcutta, 1970.

2. R.T. Jangam : An Outline of International Politics, Allied Publishers Pvt.,Ltd. New Delhi, 1981.

3. Devid L.Sills (Ed)! International Encyclopedia of the social Sciences, Vol.11. The Macmillan Company and the Free Press, London, 1972.

4. Theodore A Couloumbus & James N. Wolfe, Introduction to International Relations Power and Justice Prentice- Hall of India Pvt.,Ltd., New Delhi, 1986.

5. Joseph Frankel! International Relations in a Couragious World, Oxford University, Bombay, 1990.

6. Frederick N. Hartmanq, The Relations of Nations. The Macmillan Company, New York, 1967.

7. Charles C. Lercue, Jr.& Abdul A. Said, Concepts, of International Politics, Prentice, Hall of India Pvt.,Ltd., New Delhi, 1972.

8. A.C. Roy! International Relations since 1919. The World Press Pvt.,Ltd., Calcutta, 1976.

9. Hans J. Morgentuau ! Politics Among Nations, Scientific Book Agency, Calcutta, 1973.

BRAOU

4.10 నమూనా పరీక్షాప్రశ్నలు

I. ఈ కింది వాటికి ఒక్కొక్క దానికి 30 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. జాతీయ రాజ్యం ను నిర్వచించి, సార్వభౌమత్వ జాతీయ రాజ్యాల ఆవిర్భావానికి దోహదం చేసిన కారకాలను వివరించుము.
2. సార్వ భౌమత్వ జాతీయ రాజ్యాల పరిణామాన్ని విశదీకరించుము.
3. సార్వభౌమత్వ జాతీయరాజ్యాల ముఖ్య లక్షణాలను విపులీకరించుము.

II. ఈకింది వాటికి ఒక్కొక్క దానికి 10 పంక్తులలో జవాబు వ్రాయుము.

1. వర్సైల్స్ శాంతి ఒప్పందం తరువాత జాతీయ రాజ్య వ్యవస్థలో వచ్చిన పరిణామాలను వివరింము.
2. ఆధునిక జాతీయ భావం వివిధ రూపాలను వివరించుము
3. జాతీయ రాజ్యవ్యవస్థ భవిష్యత్తును గూర్చి మీ అభిప్రాయమును వ్రాయుము.

BRAOU

ఖండం - 2 భావాలు

అంతర్జాతీయ సంబంధాల అధ్యయన ప్రగతిలో వివిధ రచయితలు, రాజనీతిజ్ఞులు చాలా భావాలను ప్రవేశపెట్టారు. ఈ భావాలు అధ్యయనాన్నే కాక ఆచరణను కూడా ప్రభావపరచాయి. ఈభావాలను అవగాహన చేసుకోకుండా అంతర్జాతీయ సంబంధాలను అర్థం చేసుకోలేం. వివిధ భావాలను ఈ ఖండంలో చర్చించటం జరిగింది.

BRAOU

BRAOU

భాగం - 5 శక్తిభావన

విషయక్రమం

5.1 లక్ష్యాలు

5.2 పరిచయం

5.3 రాజనీతిశాస్త్రం - శక్తిభావన

5.4 అంతర్జాతీయ సంబంధాలు - శక్తిభావన

5.5.0 శక్తి మూలాలు / కారణాలు

- 5.5.1 బొగోళిక
- 5.5.2 వాతావరణం
- 5.5.4 భూమి
- 5.5.5 జనాభా
- 5.5.6 ఆర్థికం
- 5.5.7 శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం
- 5.5.8 రాజకీయాలు
- 5.5.9 మిలటరీ

5.6 ముగింపు

5.7 చదవ దగిన పుస్తకాలు

5.8 నమూనా పరీక్షాప్రశ్నలు

BRAOU

5.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

* అంతర్జాతీయ సంబంధాల అధ్యయనంలో శక్తిభావన అర్థం
* దాని స్వరూప స్వభావాలు
* మూలకాలు

గురించి వివరించగలుగుతారు.

5.2 పరిచయం

అంతర్జాతీయ సంబంధాలలో శక్తి భావనకు చాలా ప్రాముఖ్యత ఉంది. కొంతమంది "శక్తి" పదాన్ని వ్యతిరేకార్థమిచ్చే పదంగా చూశారు. మరికొంతమంది శక్తిపదానికి నిర్దిష్టమైన అర్థం చెప్పటం కష్టమంటూ, అదికొన్ని అర్థాల సముదాయం, లేదా అది ఒక భావన అని అన్నారు. ఇంకా కొందరు మారుతున్న పరిస్థితుల దృష్ట్యా శక్తి పదానికి కొన్ని ప్రత్యామ్నాయ పదాలను వాడుకలోకి తెచ్చారు. ఎన్ని మార్పు చేర్పులు జరిగినప్పటికీ "శక్తి" పదం వాడుక తగ్గలేదు. ఇటీవలి కాలం వరకు అంతర్జాతీయ సంబంధాలు, రాజనీతిశాస్త్రంలో అతి ముఖ్యమైన ప్రధాన

పాఠ్యాంశంగా ఉంటూ వచ్చింది. ఆ విధంగా అంతర్జాతీయ సంబంధాల్లో "శక్తి" భావన, రాజనీతిశాస్త్రం నుండి గ్రహించటం జరిగింది.

ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ సంబంధాలు ఒక ప్రత్యేక అధ్యయనాంశంగా రూపొందించుకుంటున్నాయి. అయినప్పటికీ రాజనీతి శాస్త్రము తో ఉన్న సన్నిహిత సబంధం వల్ల గాని, అంతర్జాతీయ సంబంధాలలో ఒక ప్రత్యేక ప్రాముఖ్యతతో రాయబడుతున్నందు వల్ల గాని, శక్తి భావనకు ప్రాముఖ్యత పెరుగుతున్నదే కాని తగ్గడం లేదు.

శక్తి పదం సాంఘిక శాస్త్రాలలో కన్న ముందుగా విజ్ఞాన శాస్త్రాలలో నే వాడబడుతూ వచ్చింది. అయితే విజ్ఞానశాస్త్రాలలో శక్తి పదానికి సాంకేతిక పరమైన (Technical) నిర్దిష్టమైన అర్థాలున్నాయి. ఉదాహరణకు , భౌతిక శాస్త్రం (Physics) లో "శక్తి" (Energy) ఒక రూపం నుండి మరో రూపానికి మార్పు చెందే వేగథ శక్తి (Power) అని నిర్వచించారు. (Power is the nafe of wind energy is converfe from on form in to another) బీజగణితం (Algebra) రెండు సమాన సంఖ్యల లబ్ధమును శక్తిగా నిర్వచించారు Power is the prosucd of two egrned numbers ఒక రకంగా చెప్పాలంటే విజ్ఞాన శాస్త్రాల్లో శక్తి పదమును కారణ కార్య ఫలితా (cause - affect) అను తెల్పు సందర్భంలో వాడతారని చెప్పవచ్చు.

అయితే సాంఘిక శాస్త్రాలు నుండే వచ్చిందని చెప్పలేదు, నిత్య జీవితంలో, మామూలు వాడుక భాషలో గూడ శక్తి పదాన్ని తరచుగా వాడుతుంటాం. 'దైవశక్తి' 'మానవాతీత శక్తి' 'పలాని వాడే శక్తిమంతుడు' మొదలైన మాటలు సర్వ సాధారణమైనవే. ఈ సందర్భాల్లో శక్తి పదానికి 'బలం' సామర్థ్యం, అన్న అర్థాలు స్పష్టంగా తెలుస్తాయి. ప్రకృతి సంబంధమైన వాటిలోగాని, మనుషుల సంబంధాల గూర్చిగాని ఒకదానితో మరొకటిని గూర్చిగాని చెప్పే శక్తి పదాన్ని అర్థాలలో వాడతారు. ఈ అర్థాల వెనుక అంతరంగ భావం కూడా ఉందని అంధరికి తెలిసిందే అదేమిటంటే, ఒకరు/ ఒకటి మరొకరిని/ మరొకటిని అదుపులో నుంచగల్గటం, అయితే ఆ అదుపులో నుంచటం భౌతికమైంది లేదా మానసిక మైనవి కావచ్చు. సందర్భానుచితముగా అర్థం చేసికొనవలసి ఉంటుంది.

5.3 రాజనీతి శాస్త్రం - శక్తిభావన

శక్తి పదానికి విద్యాత్మకము (academic) గ ప్రాముఖ్యత, ప్రచారం రాజనీతి శాస్త్రము లోను అందున ఆధునికయుగములోనే ఎక్కువయిందని చెప్పవచ్చు. ప్రాచీన గ్రీకు రాజనీతి శాస్త్రంలో శక్తి పదాన్ని 'బలం' 'సామర్థ్యం' అన్న అర్థాలలోనే ఉపయోగించారు. ఒక్కొక్కచోట శక్తి పదానికి రాజకీయాధికారము అనే అర్థము కూడా స్ఫురిస్తుంది. అంటే ప్రాచీన గ్రీకు రాజనీతి తత్వవేత్తలు ఒక ప్రత్యేకతతో కన్న, సాధారణమైన రీతిలో రాజనీతి అంటే ఏమిటి, రాజ్యం యొక్క ఆవశ్యకత ఏమిటి ? రాజ్యాల్లో వ్యక్తుల లేదా ప్రజలు ఎలా ఉండాలి. మొదలైన విషయాలను చర్చిస్తూ శక్తి పదాన్ని వాడారు. ఉదాహరణకు ప్లేటో మాటలు చూద్దాం ! ఎప్పుడైతే మనిషిలోని సర్వాధికారమే / సామర్థ్యము అతిగొప్ప ప్రజ్ఞ, నిగ్రహాలతో ఏకీభవిస్తుందో. అప్పుడు అత్యుత్తమ చట్టాలు, అత్యుత్తమ రాజ్యాంగం అమలులోకి వస్తాయి. మరే విధంగా కాదు "(when the supreme power or man coincides with the Greatest wisdom and temperance, then the best bows and the best constitutions come in to being but in no other way (plato)

ఆధునిక కాలంలో, ముఖ్యంగా 19వ శతాబ్దం నుండి, శక్తి పదం ఒక భావనలా చూడబడింది. ఉదాహరణకు కొందరు రాజనీతి శాస్త్రజ్ఞుల రాజనీతి నిర్వచనాలను పరిశీలిద్దాం.

BRAOU

"సంఘము కొరకు బద్దయోగ్య మైన నిర్ణయాలను చేయడానికి దాదాపు ప్రత్యక్షంగా సంబంధించిన చర్యలన్నీ రాజనీతి యే" డేవిడ్ ఈస్టన్ Politics is " all those activities more or less directly related to the making of binding decisions for a society" —— David Easton.)

ప్రజా/పబ్లిక్ సమస్యలపై వ్యతిరేక కోరికలను / అభిప్రాయాలను అనుగమిస్తున్న పాత్రల మధ్యనున్న పోరాటమే రాజనీతి (Politics is a struggle among actors pursuing conflicting desires on public issue.- Vandyke " వాన్‌డైక్

రాజకీయ శక్తి శక్తిని తయారు చేయటం, పంపిణీ చేయటం, నిర్వహించటం -------- " లాస్వెల్, కాప్లాన్ (– The Political power is the shaping distribution and exercise of power.

"కొందరి ప్రయోజనాలను యితరుల వ్యతిరేకత ముందు ఉంచటం కోసం గ్రూపులను ప్రభావితం చేయగల, మారచగల లేదా అదుపులో నుంచగల కళే" రాజనీతి - క్విన్సీరైటు

Politics is the art of influencing, manipulating, or controlling (Groups) so as to advance the purposes of some against the opposition of others.— Quincy wright.

"ఒక సమస్యను పెంచేది లేక తీర్చేది అయిన చర్య (సంధాన, వాదక, చర్చ, బలప్రయోగం, అనుగమన మొదలైనవి) " రాజనీతి,మేయర్సన్, బాన్ ఫీల్డ్.

Politics is the activity (Negotiation, arguments, discussion, application of force, persuation etc.) By which an issue is agitated settled." Meyerson & Banfield.

పై నిర్వచనాలను పరిశీలిస్తే, రాజనీతి/రాజకీయానికి ఒక ప్రయోజనం ఆ ప్రయోజనం తీర్చుకునేందుకు కొన్ని రకాల సంబంధాలను ప్రజలు వ్యక్తులుగా (గుంపులుగా) అవలంబించడం జరుగుతుందని తెలుస్తుంది. ఆ సబంధాలు అధికారం, ఆజ్ఞ (Command) అనుగమనం, ప్రభావము, వత్తిడి, బలప్రయోగం, మొదలైన లక్షణాలతో కూడి వుంటాయి. ఆసంబంధాలనే జాతీయ ప్రయోజనం తీర్చుకునేందుకు సాధనాలుగ చూడబడతాయి. అంతర్జాతీయ సంబంధాల వెనుక ఉన్న అంతరార్థమిదే. జాతీయ ప్రయోజనం దృష్ట్యా, మిగిలిన పరిస్థితుల దృష్ట్యా, ఆ సంబంధాలలో ఒక్కొక్కటిగ కాని, కొన్నింటి సమ్మేళనముగ కాని దేశాలు వాడుకుంటుంటాయి. వాటి నన్నింటిని శక్తి సంబంధాలు గానే పరిగణించవచ్చు. (యీ అంశం గురించి ముందు మరోచోట చర్చించబడింది) కాకపోతే మొదట్లో శక్తి పదాన్ని వ్యతిరేకార్థములలోనే వాడేవారు. అందువలన అంటే రాజకీయాధికారాన్ని వ్యక్తుల నెలా అదుపులో నుంచుతుందనే దృష్టిలోనే చూసేవాళ్ళు. అదే కాక అంతర్జాతీయ సంబంధాలలో అదుపు ఆజ్ఞలు, వత్తిడి, బలప్రయోగం మొదలైనవే ఎక్కువగా వుండటం కూడా మరొక కారణమయివుండవచ్చు. కాని దేశకాల పరిస్థితులు మారుతున్న కొద్ది రాజనీతి శాస్త్రాధ్యయనం పెరుగుతున్న కొద్ది రాజకీయధికారానికి అనుకూల (Postive) విధులు కూడా వున్నవనే భావన బలపడిన కొద్ది, శక్తి భావనలోని అనుకూలార్థాలు కూడా పరిగణింపబడ్డాయి. ఇప్పటికి రాజనీతి శాస్త్ర దృష్ట్యా శక్తి పదానికున్న నిర్దిష్టమైన అర్థంకోసం ఆ అర్థాలలోని అనుకూలమైన ప్రాముఖ్యత గూర్చి ఇంకా అధ్యయనం జరుగుతోంది. ఇటువంటి స్వభావమున్న శక్తి పదమును (భావనను) రాజనీతి శాస్త్రము నుండి అంతర్జాతీయ సంబంధాలలోకి గ్రహించబడ్డది.

5.4 అంతర్జాతీయ సంబంధాలు - శక్తి భావన

రాజనీతి/రాజకీయం ఒక దేశానికే పరిమితం కాదు. రాజ్యమేర్పడటంలో "ఇతర రాజ్యాల నుండి రక్షణ, శ్రేయస్సు లేక సహకారాలు పొందడం" కూడా ఒక అంతరార్థం. ఏదేశమూ ఒంటరిగా ఉండలేదు. దేశాలమధ్య

BRAOU

ఏదోరకమైన సంబంధాలు తప్పవు. మైత్రి, స్పర్ధ, స్నేహం, యుద్ధం, సంధి, వగైరాలు ప్రస్ఫుటంగా కన్పించే పరిస్థితులు. ఆ పరిస్థితులే సంబంధాలు - అనుగమనము, ప్రభావం, ఆజ్ఞ, ఒత్తిడి, బలప్రయోగం మొదలైనవి. కాబట్టి అంతర్జాతీయ సంబంధాల వెనుకనున్న అసలు సంబంధాలివే అని చెప్పవచ్చు. అయితే ఈ పరిస్థితులు కాని సంబంధాలు ఎందుకుండాలి. వీటివల్ల దేశాలు సాధించేదేమిటి అన్నప్పుడు, అసలు అంతర్జాతీయత స్థాయి వెనుక నున్న భావమేమిటి అన్నది తెలుసుకోవలసి వస్తుంది. దేశంలో వ్యక్తులు, గుంపులు పాత్రలైతే, అంతర్జాతీయ స్థాయిలో దేశాలు, ప్రభుత్వాలు పాత్రలు. పాత్రలు వేరైనా పాత్రల సంబంధాలు దాదాపు ఒకటిగానే ఉంటాయి.

దేశం ఏరకమైన రాజ్యాంగ/ రాజకీయ వ్యవస్థకు చెందినదైనా, సార్వభౌమాధికారాన్ని ప్రజలకు రక్షణ, శ్రేయస్సు ఇవ్వాలి. అనగా ప్రతి దేశానికి అతి ముఖ్య ప్రయోజనం ఉంది. అదే 'భూజనరక్షణ, శ్రేయస్సు' ఈప్రయోజనం ప్రతిదేశం, దేశీయాంగ విధానం (Internal policy) విదేశాంగ విధానం (External Policy) ద్వారా సాధించవలసి ఉంటుంది. అనగా దేశంలో ప్రభుత్వం ప్రజలలో ఒకరకమైన పద్ధతిలో సంబంధాలు పెట్టుకుంటూ జాతీయ ప్రయోజనాన్ని సాధించడం దేశ విధానానికి ఒకవైపు అయితే ఇతర దేశాల (ప్రభుత్వాల) తో సంబంధాలు పెంచుకొని జాతీయ ప్రభుత్వం సాధించడం దేశవిధానానికి రెండవవైపు. ఈ రెండవవైపు విధానాన్నే జాతీయ ప్రయోజనం (National interest) అంటారు. దేశీయాంగ విధానం కూడా అలాంటి లేదా అదే జాతీయ ప్రయోజనం సాధించడం కోసమే, కాకపోతే అంతర్జాతీయ సంబంధాల సందర్భం లోనే, అంటే విదేశాంగ విధానం ద్వారా జాతీయ అవసరాలను సాధించుకునే సందర్భంలోనే ఈ జాతీయ ప్రయోజనం గూర్చి ప్రత్యేక ప్రాముఖ్యతతో చెబుతారు.

ఈ విధంగా దేశానికి జాతీయ ప్రయోజనం ఎంత తప్పనిసరో ఇతర దేశాలతో సంబంధాలు అంతే తప్పనిసరి. ఆ సంబంధాలు జాతీయ ప్రయోజనాన్ని సాధించడం కోసమై ఉపయోగిస్తారు. కాబట్టి వాటిని సాధనాలుగా పరిగణిస్తారు. అయితే ఇక్కడ ఒక విషయముంది. అటు జాతీయ ప్రయోజనం ఇటు సంబంధాలు ఎప్పుడూ ఒకే మాదిరిగా ఉండవు. జాతీయ ప్రయోజనాన్ని బట్టి సంబంధాలు, సంబంధాన్ని బట్టి జాతీయ ప్రయోజనాన్ని సరిచేసుకుంటూ ఉండవలసి వస్తూ ఉంటుంది. రక్షణ జాతీయ ప్రయోజనమైతే ఒత్తిడి, బలప్రయోగం లాంటి ప్రతికూల సంబంధాలు అమలులో ఉంటాయి. ఆర్థిక లేదా ఇతరాలైన విషయాలలో మద్దతు జాతీయ ప్రయోజనమైతే, అనుగమనం, ప్రభావం, (Influence) లాంటి అనుకూల సంబంధాలు అమలులో ఉంటాయి. పరిస్థితులను బట్టి ఒక్కో దేశంతో ఒక్కో రకంగా ఇవన్నీ మారుతుండవచ్చు.

దీన్ని బట్టి గ్రహించదగిందేమిటంటే, అంతర్జాతీయ సంబంధాలు ఎంత తప్పనిసరియైనవో, అవి ఎల్లప్పుడూ ఒకే మాదిరిగా ఉంటాయనే నమ్మకం లేదు. అయితే రాజనీతి శాస్త్రంలో లాగా అంతర్జాతీయ సంబంధాలలో కూడా శక్తి సంబంధాలను ఎక్కువగా ప్రతికూల సంబంధాల కిందే పరిగణించారు. దానికి కారణం, అటు రాజ్యం, దేశం యొక్క ఆవశ్యకతనే ప్రతికూల మైందిగా చూడటం వల్ల కావచ్చు లేదా వాస్తవికతలో ప్రతికూల సంబంధాల ద్వారానే జాతీయ ప్రయోజనాన్ని సాధించుకునే పద్ధతి విరివిగా ఉండటం వల్ల కావచ్చు. కానీ కాలక్రమేణా, అటు రాజనీతి శాస్త్ర దృష్ట్యా ఇటు అంతర్జాతీయ సంబంధాల దృష్ట్యా, శాస్త్రీయమైన విశ్లేషణతో కూడిన, అధ్యయనాలు ఎక్కువ అవుతుండటం వల్ల, శక్తి పదం వాడుకలోను, శక్తి భావాన్ని విశ్లేషించడంలోను చాలా మార్పులు వచ్చాయి. శక్తి పదాన్ని కేవలం ఒక పదంగా కాకుండా కొన్ని అర్థాల సముదాయంగా, అంటే ఒక భావనలా చూడసాగారు. శక్తి భావనలోని అర్థాలను వర్గీకరించడం (Classification) మొదలెట్టారు. ఆవిధంగా శక్తిభావనలోని అనుగమన ప్రభావం (Influence) సంధానం మొదలైన అనుకూల (Positive) సంబంధాలను, కట్టసాధింపు, ఒత్తిడి, బలప్రయోగం లాంటి ప్రతికూల సంబంధాల్ని వెలుగులోకి తెచ్చి, ఆ అనుకూల, ప్రతికూల అర్థానిచ్చే పదాల్ని, శక్తి పదానికి ప్రత్యామ్నాయ పదాలుగా వాడుకలోకి తెచ్చారు. ఈ ప్రత్యామ్నాయ పదాలన్నింటినీ,

BRAOU

రాబర్ట్ ధాల్ చెప్పినట్లు, ప్రభావ పదాలు కింద పరిగణించవచ్చు, లేదా ష్వార్జెన్ బెర్గర్ చెప్పినట్లు, శక్తిని, ప్రభావం, బలప్రయోగాల మధ్య సరాసరి అని నిర్వచించవచ్చు .(Power is the mean between influence and force)

ఇప్పటివరకు అర్థంచేసుకున్న దాన్ని బట్టి, శక్తి అనేది ఒక భావన, అని ఆ భావన అనుకూల, ప్రతికూల సంబంధాల సమ్మేళనమని, వాటిని జాతీయ ప్రయోజనం సాధించడానికై సాధనాలుగా ఉపయోగించుకుంటారని తెలుస్తోంది. ఒకరకంగా చూస్తే, శక్తి భావన విలువ బిందీకృతంకాని భావనగా అన్పిస్తుంది. అయినప్పటికి శక్తి అనేటప్పటికి ఒక రకమైన ప్రతికూల భావన వస్తుంది. కాబట్టి, శక్తికి బదులుగా 'సామర్థ్యం' (Capability) అనే పదం వాడటం మంచిదని జోసఫ్ ఫ్రాంకెల్ (Joseph Frankel) అభిప్రాయం. శక్తి ఆర్థాలలో సంబంధాలను గూర్చితెలుస్తుందని, తెలుసుకున్నప్పుడు వాటివెనుక దాగి ఉన్న భావమేమి? అనే ప్రశ్న గూడ ఉదయించక పోదు. మరో మాటల్లో చెప్పాలంటే జాతీయ ప్రయోజనం సాధించటంలో జరిగే ప్రక్రియ ఏమిటంటే 'ఒకరు మరొకరిని తనకు నచ్చిన విధంగా ఉండేలా (నడుచుకునేలా) చూడడం '. అలా చేయడం అనుకూల సంబంధాల వల్లగాని లేక ప్రతికూల సంబంధాల వల్లగాని జరగవచ్చు. అయితే యిక్కడ మరొక విషయమేమిటంటే, సంబంధిత పార్టీల అంగీకారంతోగాని, ఉమ్మడి ప్రయోజనం దృష్ట్యా గానీ ఉన్న సంబంధాలు శక్తి సంబంధాల కిందకు వస్తాయా లేక అవతల వాని కిష్టము లేక పోయినా, తప్పనిసరి పరిస్థితిని తీసికొనిరావటమే శక్తి సంబంధాల కిందకి వస్తాయా? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఈ క్లిష్టతను తొలగించడం కోసం కొంతమంది అంతర్జాతీయ సంబంధాల నిపుణులు, విశ్లేషణ కారులు చాలా రకాల అభిప్రాయాలను వెలిబుచ్చారు. వాటి గూర్చి కొంచెం ముందు ప్రస్తావించడం మంచిది. ప్రస్తుతం శక్తి మూలాల గూర్చి తెలిసికొందాం.

5.5.0 శక్తి మూలాలు / కారకాలు

BRAOU

ప్రతిదేశం తన జాతీయ ప్రయోజనం సాధించడం కోసం అంతర్జాతీయ సంబంధాలను పెంచుకుంటుందని తెలుసుకున్నాం. అనగా ఒకరకంగా చెప్పాలంటే, జాతీయ ప్రయోజనాన్ని సాధించుకోవడం అంటే శక్తిని సంపాదించడం. అయితే కావలసినవి లేదా తోడ్పడేవి ఏమిటో ప్రస్తుతం తెలుసుకొనుట ముఖ్యం. శక్తి కొన్ని మూలాలు/ కారకాలపై ఆధారపడి ఉంటుంది. వాటిని స్థూలంగా ఏడు రకాలుగా విభజించవచ్చు. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క మూలానికి కొన్ని ఉపమూలాలు (Sub - elements) కూడా ఉంటాయి.

5.5.1 భౌగోళికం

ఏదేశానికైనా సహజమైన శక్తి భౌగోళిక పరిస్థితి. ఈ మూలంలో నాలుగు ఉపమూలాలను చేర్కొనవచ్చు.

సహజసంపద (Natural resources) : అడవులు, పర్వతాలు, నదులు సారవంతమైన సాగుబడి చేయదగిన భూమి, ఖనిజనిధులు, లోహ నిధులు వగైరాలన్నీ సహజ సంపద. సహజ సంపద ఎక్కువగా ఉన్న దేశం, శక్తిని కల్గి ఉండటంలో అతిశయోక్తిలేదు. ఒక్కొక్క దేశం ఒక్కొక్క దానివల్ల కూడా శక్తిని సంపాదించుకుంటుంది. శ్రీలంక రబ్బరు వలన, అరబ్ దేశాలు చమురు (Oil) వల్ల శక్తిని సంపాదించుకుంటున్న విషయం తెలిసిందే. సహజసంపద వల్ల దేశం పారిశ్రామికంగా ఆర్థికంగా స్వయం సమృద్ధి చెందడానికి చాలా అవకాశముంది.

5.5.2 వాతావరణం

దేశంలోని వాతావరణ పరిస్థితి దేశాభ్యున్నతికి, శక్తికి చాలవరకు దోహదపడుతుంది. అతి తీవ్రతరమైన వాతావరణమున్న దేశాల కన్న సమశీతోష్ణ మండలం లోని దేశాలు పురోగమించటానికి వీలు కల్గుతుంది. అంటార్కిటిక్, సహారా ప్రదేశం లోగల దేశాలు అభివృద్ధిచెందడం చాలా కష్టం. అందువల్లే "చరిత్ర $25^{\circ}, 60^{\circ}$ ఉత్తర అక్షాంశాల (Narth —) మధ్య సృష్టింపబడిందన్న అభిప్రాయం వ్యక్తం చేయబడింది.

5.5.3 భూమి

దేశములోని భూమి పరిస్థితి గూడా దేశ శక్తికి తోడ్పడుతుంది. సహజమైన అడవులు, పర్వతాలున్న ప్రదేశం శత్రువులకు ప్రతికూలమై దేశ రక్షణకు తోడ్పడుతుంది. సాదా ప్రదేశం ఒక్కొక్కప్పుడు సాంప్రదాయ యుద్ధాలకు (Conventional Wars) అనుకూలంగా ఉండి దేశరక్షణకు భంగం కలుగజేస్తుంది. అమెరికా ధాటికి వియత్నాం తట్టుకోగల్గిందంటే ప్రదేశానుకూలతే. పరిమాణం, స్థావరం, పెద్ద విస్తీర్ణం గల దేశం, ఎక్కువ సహజ సంపద తద్వారా మిగిలిన రంగాలలో అభివృద్ధి చెంది శక్తిని సంపాదించు కొనటానికి వీలు కలుగుతుంది. యుద్ధ సమయాలలో శత్రువుల నెదుర్కొనటానికి తగినన సమయం, అవకాశం పొందటానికి వీలు కల్గుతుంది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో రష్యా, చైనాలకు యీ విధమైన శక్తి లాభదాయకమైంది. అలాగని ఎక్కువ విస్తీర్ణం గల దేశాలన్నీ శక్తివంతమైనవని చెప్పలేం. బ్రెజిల్ అడవులు వల్ల, ఆస్ట్రేలియా ఎడారుల వలన, కెనడా భాగీ ప్రదేశం వలన, శక్తిని ఒనగొర్చు కోలేక పోయాయి. అయితే ఒక విశేషమేమిటంటే, అణ్వస్త్రాల యుద్ధంలో దేశవిస్తీర్ణం వల్ల ఉపయోగముండదు. కాకపోతే సాధారణంగా పెద్ద పరిమాణం వల్ల మిగిలిన పరిస్థితులను మెరుగుపరచుకొని శక్తిని సంపాదించుకోవచ్చు.

5.5.4 జనాభా

ఏదేశానికైనా జనాభా పట్టుకొమ్మవంటిది. మానవశక్తి (Man Power) కేవలం జనాభా ఎంత ఉందన్న విషయం కంటే మానవ శక్తి ఎలా ఉందన్నది ముఖ్యమైంది. ఒక మనిషి సగటున కొంతపనిని ఎంత కాలంలో ఎంత శ్రమ చెయ్యగలడు అని పరిశీలిస్తే మానవశక్తిని అంచనా వెయ్యవచ్చు. దానివల్ల పని చెయ్యగల్గిన, చురుకుదనం, పట్టుదల, శరీర దారుఢ్యం మొదలైన విషయాలు తెలుస్తాయి. అసలు వాటిని బట్టే మానవశక్తి చేకూరుతుంది. కొన్ని దేశాలలోని జనాభా యొక్క మానవశక్తి ఎలా ఉందని తెలుసుకోవాల్సినపుడు, సమతౌల్యంగా పరిశీలించి చెప్పవచ్చు. అభివృద్ధి చెందిన దేశాలలో మానవశక్తి ఎక్కువగా ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. కారణం వాతావరణం, ఆహారపు అలవాట్లు,శరీర దారుఢ్యం, పట్టుదల, చురుకుదనం, ఆరోగ్యం మొదలైన వాటితో బాటు విద్య, శిక్షణ, నైపుణ్యం, ప్రేరణ (Motivation) మొదలైనవి కూడ తోడ్పడతాయి. వెనుకబడిన దేశాలలో పైన పేర్కొన్న పరిస్థితులు మెరుగుపడక పోవడంతో అక్కడ మానవశక్తి తక్కువగా ఉంటుంది.

5.5.5 ఆర్థికం

దేశభక్తికి ఆర్థిక పరిస్థితులు పునాది లాంటివి. ఇక్కడ రెండు ఉపమూలాలను పేర్కొనవచ్చు. ఉత్పాదకత (Productivity) : ఉత్పత్తిని, ఉత్పత్తి కారకాలతో కానీ, వనరులు మొదలైన వాటితోకాని పోల్చి, కొలిచి చెప్పడం, ఉత్పాదకతను తెలియజేస్తుంది. కొంతమంది కొంతపనిని ఎంతవేగంగా లేక నైపుణ్యంగా చెయ్యగల్గుతారు మొదలైన విషయాలు ఆ వస్తువుల ఉత్పాదకతను తెలియజేస్తాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ఉత్పాదకతను తెల్సుకోవడం ఎంతైనా అవసరం. అవి పెంచుకునే పరిస్థితులను మెరుగుపరచుకోవచ్చు. ఉత్పత్తి (Production) : దేశ జనాభకు కావాల్సిన వివిధ సరకులను ఉత్పత్తి చేసుకుని స్వయం సమృద్ధిని సంపాదించుకోగల్గితే విదేశాలమీద ఆధారపడనవసరం లేదు. ఆవిధంగా ఆర్థిక సంబంధమైన శక్తి చేకూరుతుంది. ఉన్న వనరులను ఉపయోగించుకొని ఉత్పత్తిని అభిలషణీయమైన స్థాయి (Optimum level) కితీసికొని వెళ్ళగలిగితే పంబంధిత వస్తువుల విషయంలో ఇబ్బందులుండవు. ప్రకృతి వైపరీత్యాలలో, యుద్ధ సమయాలలో ఉత్పత్తి వలన ఎంత అవసరమో తెలుస్తుంది.

5.5.6 శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం దేశభక్తిని ఎలా పెపొందిస్తుందో వేరే చెప్పనవసరం లేదు. అన్ని రంగాలలోను అభివృద్ధికి కారణం శాస్త్ర, సాంకేతిక రంగాలు వాటి అభివృద్ధి,అసలు విజ్ఞాన, సాంకేతిక శాస్త్రంపై నమ్మకం కల్గడమే చాలా అవసరం. అంతర్జాతీయ సంబంధాల నిపుణులొకరు అభిప్రాయపడినట్లు సైన్సుమీద నమ్మకం

BRAOU

లేకపోతే రెండవ ప్రపంచ యుద్ధంలో యుద్ధ కాముక దేశాల (నాజీ ఫాసిస్టుల) ధాటికి తట్టుకునే (మిలటరీ) శక్తి, మిత్ర రాజ్యాలకుండేది కాదు. మొన్న మొన్నటివరకు అమెరికా, రష్యాలు - అగ్రరాజ్యాలు (super powers) అవగల్గటానికి కారణం విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాభివృద్ధే అని వేరే చెప్పనవసరం లేదు. ఒక్క మిలటరీ రంగమే కాదు, అన్ని రంగాలలోనూ వాటి అవసరం చాలా ఉంది. ఆధునీకరణ, అభివృద్ధి, సైన్సు అభివృద్ధి పై ఆధారపడి ఉంటాయి.

5.5.7 రాజకీయాలు

దేశభక్తికి రాజకీయ యంత్రాంగం, పరిపాలన చాలావరకు తోడ్పడతాయి. దీనిలో రెండు ఉపమూలాలు చెప్పుకోదగ్గవి. (i) ప్రభుత్వం (Government) సుస్థిర ప్రభుత్వం దేశ పాలనకు, మనుగడకు పునాది లాంటిది. పెద్ద దేశాలలోను సమాఖ్య (Federal) దేశాలలోను సుస్థిరమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాలను నిల్పుకోగల్గటం గొప్ప విషయం. ప్రజాభీష్టాన్ని తీర్చడం కోసం, అంతర్జాతీయ స్థాయిలో నిలదొక్కుకొని పేరు ప్రతిష్టలు తెచ్చుకోగల్గటానికి ప్రభుత్వనిలకడ, పటిష్టత, ప్రవర్తన మీద ఆధారపడి ఉంటుంది. (ii) నాయకత్వం (Leadership) దేశ రాజకీయ వ్యవస్థకు ఆయువు పట్టు నాయకత్వం. ప్రభుత్వ సుస్థిరతకు, మంచి పాలనకు, ప్రజల మన్ననలను పొందుటకు సరియైన నాయకత్వమవసరం. అందరూ నాయకులవలేరు. ప్రత్యేకమైన ప్రస్ఫుటమైన నాయకత్వపు లక్షణాలు కల్గినవారే నాయకులు కాగలరు. అలాంటి వారు సంక్షోభ (crisis) సమయాలలో కూడా దేశాన్ని, దేశ ప్రజలను ముందుకు నడిపించగలుగుతారు. అలాంటి నాయకులున్న దేశం శక్తిని కల్గి ఉంటుందనటం అతిశయోక్తి కాదు.

5.5.8 మిలటరీ

BRAOU

దేశరక్షణే దేశభక్తి. రక్షణ దళాలు/సైన్యం లేని దేశముండదు. బహుశా అతి తక్కువ సైన్యం ఉన్న దేశాలు చాలా తక్కువేమో. ఇక్కడ గూడా రెండు ఉప మూలాలను గూర్చి చెప్పుకోవచ్చు. (i) రక్షణ దళాలు (defence forces) దేశ పరిస్థితులను బట్టి రక్షణ దళాలను పెంచుకొనుట, దేశరక్షణకు భంగం కలుగకుండ చేసుకోవాలి. పైన చెప్పబడిన మూలాల (పరిస్థితుల) దృష్ట్యా సైన్యబలాన్ని పెంచుకోవాల్సిన అవసరం కూడా కల్గవచ్చు. యుద్ధ సమయాలలోనే కాదు అంతర్యుద్ధ సమయాలలో కూడా సైన్యం అవసరం ఉంటుంది. (ii) ఆధునిక యుద్ధ పరికరాలు(moderm wepons) రక్షణ దళాలు ఉపయోగించే ఆయుధ సామగ్రి, పరికరాలు ఎంత ఆధునికమైనవైతే అంత మిలటరీ శక్తి పొందడానికి అవకాశమున్నది. ఆయుధాలను ఆధునీకరించడమంటే మారణాయుధాలను పెంచుకోటమే అవుతుందనవచ్చు. కానీ వాస్తవంలో అత్యాధునిక యుద్ధ సామగ్రి ఉన్న దేశం మిలటరీ శక్తి కల్గి పెద్ద దేశంగా పరిగణింపబడటం మామూలే.

5.5.9 భావ సంబంధమైన

భావ లేక సిద్ధాంతపరమైన ఆలోచనలు సూత్రాలు కూడా దేశభక్తికి తోడ్పడతాయి. దేశచరిత్ర, నాగరికతను బట్టి దేశ నైతిక శక్తి పెరుగుతూ ఉంటుంది. అందువల్లనే ప్రాచీన నాగరికత కల్గిన దేశాలలో అనేక తాత్విక చింతనలు సిద్ధాంతాలు ప్రచారంలో ఉండి, ఇతర దేశాలపై కూడా ప్రభావం చూపుతూ, తమ నైతిక శక్తిని చాటి చెప్పుకొంటాయి. ఈ భావ సంబంధిత ఆలోచనల బట్టి ఆదేశ సాంఘిక, ఆర్థిక, రాజకీయ భావనలు, పరిస్థితులు మలచుకొనవలసి ఉంటుంది. ఆ విధంగా గాంధీ, నెహ్రూల భావాలు, ఆశయాలు భారత దేశానికి నైతిక శక్తి నిచ్చాయనడంలో అతిశయోక్తిలేదు. ముఖ్యంగా అంతర్జాతీయ సంబంధాల విషయంలో విదేశాంగ విధానంలో గాంధీ, 'అహింస' నెహ్రూ 'పంచశీల' మార్గదర్శక మైనవని అందరికీ తెలుసు.

పైన చెప్పబడిన వాటిని శక్తి మూలాలు లేదా కారకాలుగా పేర్కొంటారు. ఇవి దేశశక్తికి తోడ్పడతాయి. ఒక్కొక్కటిగా కానీ కొన్నింటి సమ్మేళనంగా గానీ దేశభక్తిని పెంచడంలో లేదా తగ్గించటంలో తోడ్పడతాయి. అయితే వీటివలన శక్తి పెరగటం, తగ్గటం జరుగుతుందనే అభిప్రాయానికి వచ్చేముందు కొన్ని విషయాల గూర్చి తెలుసుకోవాలి.

(1) జాతీయ ప్రయోజనాన్ని బట్టే పై మూలాలు ఎంతవరకు ఉపయోగపడతాయో తెలుస్తుంది. అలా ఉపయోగపడుతున్నా మూలాల వల్ల దేశభక్తి పెరగడమో లేక ఆ మూలం తక్కువవటం వల్ల దేశభక్తి తగ్గడమో జరుగుతుంది. కొన్ని దేశాల దృష్ట్యా సహజసంపద, కొన్నింటికి ఆర్థిక సంబంధమైనవి, మరికొన్నింటికి మిలటరీ సంబంధమైనవి ఇలా ఒక్కొక్క దేశానికి ఒక్కొక్క రకమైన జాతీయ ప్రయోజనముంటుంది. హిట్లర్, ముస్సోలినీలకు స్వజాతి విస్తరణ (అనగా పరరాజ్యం ఆక్రమణలు) జాతీయ ప్రయోజనంగా కన్పించినందువల్ల మిలటరీ ప్రధాన శక్తి మూలమైంది. అలాగని జాతీయ ప్రయోజనాలు ప్రతిదేశానికీ ఒక్కొక్కటిగా ఉంటాయని కాదు. కొన్ని ప్రయోజనాలు చాలా దేశాలకు ఒకటిగానే ఉంటాయి. కాకపోతే కొన్ని దేశాల జాతీయ ప్రయోజనాలు చాల ప్రమ్ఖటంగా ఉంటాయి.

(2) ఒకప్పుడు శక్తికి తోడ్పడే మూలం ఎల్లప్పుడు అలాగే ఉంటాయని చెప్పలేం. అలాగే ఒకప్పుడు శక్తి మూలంగా చూడనిది ప్రస్తుతం శక్తి మూలంగా ఉండవచ్చు. 1949 కి ముందు చైనాకు తన జనసంఖ్య ఒక శక్తిమూలంగా కన్పించలేదు. మిలిటరీ శక్తి కోసం పాట్లుపడుతూ మూడవ ప్రపంచదేశాలు ప్రస్తుతం ఆర్థిక శక్తి ఆవశ్యకతను బాగా గుర్తించాయి. కాబట్టి ఏమూలమూ శాశ్వతంగా శక్తి మూలంగా ఉండలేదు.

(3) అసలు శక్తిని అంచనా వేయడంలోనే పొరపాటు లేక భ్రమవల్ల తప్పదు అంచనా కావచ్చు. ఏమూలం ఆచరణలో ఫలితానిచ్చి జాతీయ ప్రయోజనాన్ని తీర్చుట కుపయోగపడుతుందో, అదే సరియైన శక్తిమూలం దాని వలననే శక్తి పెరగడం, తరగడం జరుగుతుంది. బిస్‌మార్క్ వల్ల ప్రష్యన్ సామ్రాజ్య శక్తి, నెపోలియన్ వల్ల ఫ్రాన్స్ దేశభక్తిని మిగిలిన దేశస్థులు సరిగా అంచనావేయలేక పోయారు. హిట్లర్, ముస్సోలినీలు తమ శక్తిని భ్రమతో మరీ ఎక్కువగా ఉహించుకున్నారు. కాబట్టి శక్తిమూలాలు ఉండగానే సరిపోదు. ఆచరణలో ఫలితాల నివ్వగల్గాలి, ఆ అంచనాలలో పొరబాట్లు లేకుండా ఉండాలి. అంతటి ఖచ్చితమైన అవగాహన ఉండడం కోసం శక్తి భావన అధ్యయనం దృష్ట్యా పలువురు అంతర్జాతీయ సంబంధాల విశ్లేషణలు, శక్తిని (మూలములను) వర్గీకరించి చూపించారు. కొంతమంది శక్తిని, సామర్థ్యం లేదా శక్యశక్తి అనీ శక్తి లేక కార్యసాధక శక్తి (power of effective power) అనీ విభజించారు. వీటినే సమగ్రశక్తి (Gross power) నికరశక్తి (Net power) అని పేర్కొన్నారు. మొదటి రకమైన శక్తి గూఢమైంది, రెండవ రకమైంది వాస్తవికతలో అమలులోకి వచ్చు ఫలితాల నిచ్చేది లేదా కార్యసాధక మైంది. దీన్ని బట్టి అవ్యక్త లేదా గూఢమైన శక్తి కంటే కార్యసాధక మైందే సరియైన శక్తి అని తెలుస్తోంది. అయితే ఇక్కడొక చిక్కుంది. ఒక దేశం తన గూఢమైన శక్తి మూలాలను కార్య సాధకాలైన వాటిగా మార్చుకొనడానికి తగిన సమయం, ప్రణాళికా నైపుణ్యం ఉండాలి. వీటిని సమకూర్చుకొనేటప్పటికి, జాతీయ ప్రయోజనం మారడం వల్ల, ఆ శక్తిమూలం విలువను కోల్పోయే ప్రమాదం కూడా లేకపోలేదు. ఈ సమస్యల దృష్ట్యా తెలిసేదేమిటంటే ,ఒకటి, శక్తి భావన సాపేక్షమైందని, రెండవది, శక్తిని తెలిసికొని అంచనావేసి నిలుపుకొనడం కూడా అంత తేలికైన పని కాదనీ.

4) శక్తి గూఢమైనదా లేక నికరమైనదా అన్నది కార్య ఫలితాలను బట్టి, అనగా ఒక కార్యం జరిగిన తర్వాతనే తెలుసుకొనడం వీలుపడుతుంది. అలా కార్య ఫలితాలను బట్టి ఒకదాని విలువ చెప్పడం విద్యాత్మకం (academic) గా ఉండదు. మరి అలాంటప్పుడు, శక్తి భావనపై అధ్యయనం ఎంతవరకు శాస్త్రీయమైంది. ఆధునికమైంది, సంఘటితమైంది? ఇలాంటి సమస్య లెదురౌతాయి.

BRAOU

అందువల్లనే శక్తి భావన లోని అర్థ, భావ, అంచనాల క్లిష్టతలు దృష్టిలో పెట్టుకుని కొంతమంది ప్రవర్తనావాద పరిశీలకులు ఒకపద్ధతిని సూచించారు. సాంప్రదాయ శాస్త్ర వేత్తలు, తత్త్వవేత్తల దృష్టికన్నా, ఒక కార్యకర నిర్వచనం శక్తిభావనను అధ్యయనం చెయ్యడం సబబైన పద్ధతి అని వీరి అభిప్రాయం. డేవిడ్ సింగర్, రాబర్ట్ ధాల్ శక్తి (Power) ని ప్రభావం (Influence) లో భాగంగా లేదా ఒకస్థాయిగా చూస్తారు. ధాల్ ప్రకారం A, B చేత ఒక పనిని లేదా ప్రవర్తనలో మామూలుగా అలా చెయ్యనిది చేయించగల్గినంత మేరకు A కు B మీద ప్రభావం ఉంటుంది. అయితే అలా చేయించడం అనేక రకాల సంబంధాల వల్ల కావచ్చు. వాటిలో ప్రతికూల సబంధాల వల్ల A, B చేత B చేయించినప్పుడు A కు B మీద శక్తి (Power) ఉంది అని డాట్ అభిప్రాయం. అందువల్లే డాట్ శక్తిని Power గా నిర్వచించారు.

"ఒకరి యిష్టానుసారం నడుచుకోక పోవడంలో తీవ్ర నష్టాలతో గూడిన ప్రభావం, శక్తి (Power on the other hand is often defined as a special case of influences indoluing severe losses for non - compliances).

ఇలాంటి శక్తి ఒక కార్యం, పని అయిన తర్వాతనే తెలుస్తుంది. ఒకరు మరొకరిపై ఒక రకమైన ఒత్తిడిని తీసుకొని రావటం కన్పిస్తుంది. అంతే కాకుండా, ప్రస్తుత ఉదాహరణను బట్టి, ఉన్న వ్యక్తుల (గ్రూపుల) సంబంధాలను బట్టి, బాహ్య, అంతర్గతమైన అభిప్రాయాల దృష్ట్యా , మిగిలిన పరిస్థితుల దృష్ట్యా, అధ్యయనం చేయవలసి ఉంటుంది. 'A' ని 'B' దృష్ట్యా , లేక B ని A దృష్ట్యా నే చూడలేము. ఇద్దరి దృష్ట్యా, ఒకరినొకరు ఎందువల్ల, ఎలా చూసుకుంటున్నారనే పరిశీలనతో అధ్యయనం చేయవలసి ఉంటుంది. అంటే A, B ల గూర్చి తెల్సుకున్న దాన్ని బట్టి, ఒక సాధారణమైన అభిప్రాయానికి రాలేము. అక్కడ అభిప్రాయాల పరిధి, ప్రాముఖ్యతలు గూడ గమనించాల్సి వస్తుంది. కాకపోతే, ఒక క్రమ పద్ధతిలో అధ్యయనం చేయడానికి విషయాన్ని గ్రహించడంలో గల క్లిష్టత నుంచి బయటపడడానికి ప్రవర్తనా వాదుల పద్ధతి (ఒక కార్యకార నిర్వచనంతో అధ్యయనం చేయడం) చాలా వరకు అనుకూలమైందిగా, విషయాన్ని తేలికగా తెలిసేదిగా ఉపయోగపడుతుంది. ఆవిధంగా ప్రవర్తనా వాదులు ఒకరకమైన ధృక్పథాన్ని (approach) ని ఇచ్చారని చెప్పవచ్చు. ఇక్కడ మరొక విషయమేమిటంటే మెక్‌లేలాండ్ (Mecleland) భావించినట్లు, ధాల్ నిర్వచనాల్లాంటివి, కొందరి వ్యక్తుల (దేశాల) ప్రభుత్వాల మధ్య స్పర్ధ, సంఘర్షణ ఉన్నదన్న ఊహ (expectation) లతో మొదలైనవి. కాని అలా కేవలం ప్రతికూల సంబంధాలతోనే అంతర్జాతీయ సంబంధాలను తీసుకోలేము. మైత్రి, సహకారాలపై నున్న సంబంధాలద్వారా కూడా కార్య సాధకం జరగవచ్చు. అలాంటప్పుడు ధాల్ నిర్వచనం లాంటి అభిప్రాయానికి గల పరిధి ప్రాముఖ్యత ఏమిటి? ఇలాంటి సమస్యలెదురౌతాయి.

5.6 ముగింపు

శక్తి భావనలోని క్లిష్టతను, సందిగ్ధత ను దృష్టిలో పెట్టుకొని విలియమ్ రైకర్ లాంటివారు అసలు శక్తి అనే పదాన్నే వాడకపోవటం మంచిదన్న అభిప్రాయానికొచ్చారు. కానీ ఈ అభిప్రాయానికి ఆదరణ అతి తక్కువయింది. కారణం శక్తి భావన ప్రాముఖ్యతను కాదనలేకపోవడం. రాజనీతిశాస్త్ర భావన ప్రాముఖ్యతను కాదనలేకపోవడం. రాజనీతి శాస్త్రంలో ఇలాంటి సందర్భమే ఒకటొచ్చింది. బహుతా వాదులు సార్వభౌమాధికార మనే భావనను వాడరాదన్నారు. వారి ఉద్దేశ్యం లో సార్వభౌమాధికారమనే భావన మిథ్యలాంటిది. అలాగని బహుతావాదముల ప్రాముఖ్యత ఎంత గొప్పదైనా, ఈ సందర్భంగా సార్వభౌమాధికార భావనను వాడుకలో నుంచి తీసివేయలేక పోయింది. అలాగే అంతర్జాతీయ సంబంధాల విషయంలో శక్తి భావనను వాడుకల్లో రాకుండా తప్పించటం చాలా కష్టం. లేకపోతే ప్రవర్తనా వాదులు లాగా ఒక పద్ధతిని సూచించవచ్చు. లేదా శక్తి భావన లోని అర్థాల వర్గీకరణ

BRAOU

చేయవచ్చు. లేదా శక్తి పదానికి ప్రత్యామ్నాయ పదాలను వాడుకలోకి తీసుకొచ్చి, శక్తి భావన లోని క్లిష్టతను తగ్గించవచ్చు. అంతేగాని శక్తి భావనే వాడుకలోంచి తీసివేయగల్గడం సాధ్యపడదు.

బి.యస్.ఆర్. ఆంజనేయులు

5.7 చదవ దగిన పుస్తకాలు

(1) Van Dyke : International Relations

(2) H.J. Morgenthau : Politics among Nations

(3) Mahendra kumar : Theoriotical aspects of International Politics

(4) Joseph Frankel : International Relations in a changing world.

5.8 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కిందివాటికి ఒక్కొక్క దానికి 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. శక్తి భావనను విశ్లేషింపుము.
2. శక్తి మూలాంశను సవివరంగా చర్చింపుము.
3. అంతర్జాతీయ సంబంధాలలో శక్తి భావనను విశ్లేషింపుము.

II. కింది వాటికి ఒక్కొక్క దానికి 10 పంక్తులలో జవాబులు రాయండి.

1. శక్తి మూలకంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం.
2. అంతర్జాతీయ సంబంధాలలో భౌగోళిక మూలకం.

BRAOU

భాగం - 6 సామ్రాజ్యవాద సిద్ధాంతాలు

విషయక్రమం

6.1 లక్ష్యాలు

6.2 పరిచయం

6.3 సామ్రాజ్యవాదం - అర్థం, స్వరూపం

6.4.0 సామ్రాజ్యవాదం - సిద్ధాంతాలు, విమర్శ

- 6.4.1 మార్క్స్‌నిస్టు వాద సిద్ధాంతం
- 6.4.2 ఉదారవాద సిద్ధాంతం
- 6.4.3 లెనిన్ సిద్ధాంతం
- 6.4.4 వలస దేశాల సిద్ధాంతం
- 6.4.5 విమర్శ

6.5.0 సామ్రాజ్యవాదం ఉద్భవించే పరిస్థితులు - సామ్రాజ్యవాద రకాలు

- 6.5.1 ఆక్రమణ సామ్రాజ్యవాదం
- 6.5.2 ఆర్థిక సామ్రాజ్యవాదం
- 6.5.3 సాంస్కృతిక సామ్రాజ్యవాదం

6.6 సామ్రాజ్యవాదం - దాని నివారణ విధానాలు

6.7 సారాంశం

6.8 చదువదగిన పుస్తకాలు

6.9 నమూనా పరీక్షా ప్రశ్నలు.

BRAOU

6.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు సామ్రాజ్యవాదంలోని రకాలు అది ఎలా ఆవిర్భవిస్తుందో బాగా వివరించగలరు .

6.2 పరిచయం

అంతర్జాతీయ సంబంధాల్లో ప్రాముఖ్యత ఉన్న భావాలలో సామ్రాజ్యవాదం ఒకటి. సామ్రాజ్యవాదం అనే పదం ఆధునిక కాలంలో వ్యతిరేక (negative) అర్థంలో వాడబడుతుంది. ఈ మధ్యకాలం వరకు, అనగా అమెరికా రష్యాల మధ్య నున్న ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిందనే వాదం వెలువడేవరకు, సామ్రాజ్యవాదం భావన చాలా ప్రాముఖ్యత వహించింది. ప్రతిదేశం, ఏగ్రూపుకు చెందిందైనా, విదేశాంగ విధానమవలంబించే సందర్భంలో ఈ పదాన్ని వాడటం అతి సాధారణమైనది. అందరూ ఒకే అర్థంతో వాడక పోయినప్పటికీ ఆ పదం వాడుక మాత్రం ఎక్కువయింది. అయితే ప్రస్తుత కాలంలో అమెరికా రష్యాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిందనే భావన ప్రబల మవ్వడం, ఆ తరవాత సోవియట్ రష్యాలో కమ్యూనిజం తొలికిపాటు, మరిన్ని స్వతంత్రదేశాలు వెలువడడంతో, సామ్రాజ్యవాద భావనకు ప్రాముఖ్యత తగ్గి పోయింది అనే అభిప్రాయం కూడా ప్రచారం లోకి వచ్చింది. కానీ, అంతర్జాతీయ రాజకీయాలు ఎల్లప్పుడు ఒకే మాదిరిగా ఉండవు. సామ్రాజ్యవాదం కూడా తన రూపాలు మార్చుకుంటూ తరమ ప్రత్యక్షమవుతూనే ఉంటుంది అనే అభిప్రాయం కూడా బలపడుతొంది. వీటన్నిటికంటే, అధ్యయనం దృష్ట్యా సామ్రాజ్యవాదం భావన ప్రాముఖ్యత ఇంకా ఉందనే చెప్పాలి. అనుకూల (Positive) అర్థాంతో ఉన్న

భావనల కన్న వ్యతిరేక (negative) అర్థాలతో ఉన్న భావనల అధ్యయనం మరింత అవసరం. వ్యతిరేకార్థమున్న సామ్రాజ్యవాదం గతకాలానికి సంబంధించిందని అనుకున్నప్పటికీ భవిష్యత్తులో, గతంలో ఎదురైన పరిస్థితులు లాంటివి ఎదుర్కొనవలసినపుడు ఇలాంటి అధ్యయనం ఎంతైనా అవసరం.

సామ్రాజ్యవాదమనే పదాన్ని 1830 కాలంలో నెపోలియన్ [NAPOLEON] సామ్రాజ్యస్థాపన సందర్భంలో వాడడం జరిగింది. జూలియస్ సీజర్ అడుగు జాడల్లో నడుస్తున్న లూయీ నెపోలియన్ విధానాలను, సామ్రాజ్యవాద విధానాలనటం జరిగింది. ఒక సందర్భంలో బ్రిటిష్‌వారు ఫ్రెంచ్ పాలనా విధానాన్ని సామ్రాజ్యవాద విధానమన్నారు. ఈ విధంగా ఒక దేశ, ఆంతరంగిక లేదా విదేశాంగ విధానాలను వ్యతిరేకిస్తున్న వారు ఆ విధానాలను సామ్రాజ్యవాద విధానాలనడంతో ఆ పదానికి వ్యతిరేకార్థాం స్థిరపడ్డిది. కానీ మరొక సందర్భంలో బ్రిటిష్ సామ్రాజ్యవాద విధానాన్ని సానుకూలంగా [Positive] చూడటం జరిగింది. వలస దేశాలతో ఉన్న సంబంధాలను బ్రిటన్‌కు అనుకూలంగా ఉండేలా చూడటం బ్రిటిష్ పాలన ఆదేశాలలో పటిష్ట పరచడం లాంటి విదేశాంగ విధానాలను సామ్రాజ్యవాద విధానాలని బ్రిటన్ సమర్థించుకుంది. ఆ భావనతోనే, అలాంటి సానుకూల [Positive] అర్థంతోనే మరికొన్ని నినాదాలను [Slogans] 'సామ్రాజ్య సమాజ్య రాజ్యము' [Imperial Fedaration] తెల్లవారి బాధ్యత [whiteman's Burden] లాంటి వాటిని, బ్రిటన్ ప్రతిపాదించింది. కానీ బ్రిటిష్ సామ్రాజ్యవాద విధానం, ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా ఖండాలలో, క్రమేపీ పెరిగి పెద్దదవటం, ఆ దేశాలలో పటిష్టత కన్న ఆందోళనలు, అలజడులు పెరిగిపోవటంతో, బ్రిటన్ వలస విధానాన్ని, వ్యతిరేకార్థాంతో, సామ్రాజ్యవాద విధాన మన్నారు. బ్రిటన్ ఒక్కటే కాకుండా మరికొన్ని యూరప్ దేశాలు ఇలాంటి వలస విధానాన్నే అనలంభించటంతో, యూరోపియన్ వలస విధానం సామ్రాజ్యవాద విధానంగా పరిగణించబడింది. ఆ విధంగా సామ్రాజ్యవాద భావనకు వ్యతిరేకార్థ ముండటమేకాక, సామ్రాజ్యవాదం, వలస విధానం రెండూ ఒకటిగా చూడబడ్డాయి.

వ్యతిరేకార్థమున్న సామ్రాజ్యవాద పదవాడుకలో మరో మలుపు వచ్చింది. మార్క్సిస్టువాదం ప్రకారం, పెట్టుబడిదారి ఆర్థిక విధానానికి పర్యవసానం విదేశ మార్కెట్‌లలో తను దేశ వస్తువులకు గిరాకీ కల్పించటం, విదేశాలలో పెట్టుబడులు పెరిగేలా చూడటం. ఈ విధమైన ఆర్థిక విధానం ద్వారా లాభార్జనలే కాకుండా ఆదేశాలలో తమ ఆధిపత్యం లేదా ప్రభావం పటిష్ట పరచుకోవటం. ఈ లక్షణాలన్ని సామ్రాజ్యవాద విధానాలని మార్క్సిజం పేర్కొంటుంది. అనగా పెట్టుబడిదారి విధానపు దేశం మరోదేశంపై ఆధిపత్యం చూపే దశ అనివార్యమని అర్థం. ఆ పర్యవసాన దశ లేదా విధానాన్నే సామ్రాజ్యవాదం లేదా సామ్రాజ్యవాద విధానమని మార్క్సిస్టులవాదన. అలా సామ్రాజ్యవాదం పదం పెట్టుబడిదారి విధానాన్ని అవలంభిస్తున్న ఉదారవాద దేశాలకు పరిమితం కాబడ్డది. కానీ త్వరలోనే ఈ వాడుక మారింది. ధనిక దేశాలు, ఉదారవాద పెట్టుబడిదారి విధానపు దేశాలైనా, సోషలిస్టు దేశాలైనా, బీదదేశాలపై అనేక రకాల ఆధిపత్యం లేక అజమాయిషీ లేదా ప్రభావం చూపే విధానాలు, సామ్రాజ్యవాద విధానాలుగా పేర్కొనబడ్డాయి. ఇటువంటి అభిప్రాయం ముఖ్యంగా మూడవ ప్రపంచ లేదా వెనుకబడిన దేశాలనుండి వెలువడింది. ఈ విధంగా వివిధ రకాల అర్థాలతో, దృక్పథాలతో చూడబడుతున్న సామ్రాజ్యవాదం భావన అధ్యయనం ఎంతో ఉపయోగకరమైంది.

6.3 సామ్రాజ్య వాదం - అర్థం, స్వరూపం

సామ్రాజ్య వాదం భావనకు విదేశాంగ విధానం సందర్భంలో వాడుతున్నారని తెలుసుకున్నాం. అంటే అంతర్జాతీయ స్థాయిలో, ప్రతి దేశం మిగిలిన దేశాలతో గల సంబంధాల విషయంలో ఈ భావన గూర్చి ప్రస్తావన వస్తోంది. అన్నిటికన్నా ముందుగా తెలిసి కోవలసిన దేమిటంటే, సామ్రాజ్యవాదం అనేక పదాన్ని ఒకే అర్థంతో వాడటం లేదు. ఒకవేళ ఒక అర్థంతో ఆ పదాన్ని వాడితే అది భాషా శాస్త్రం [Linguistics] ప్రకారం 'సామ్రాజ్యస్థాపన'

BRAOU

ధ్యేయంగా గల విధానం సామ్రాజ్య వాద మవుతుందని గ్రహించాలి. అలాగైతే 'సామ్రాజ్య స్థాపన' అంటే ఏమిటి అన్న ప్రశ్న ఉదయిస్తుంది. సామ్రాజ్య స్థాపన రాజ్య స్థాపనకన్నా భిన్నమైనదిగా ఉంటుందని తేలికగా తెలుస్తోంది. అంటే దేశ ఎల్లలను [boundaries] విస్తరింప చేయటం సామ్రాజ్య స్థాపన అవుతుంది. అలా దేశ ఎల్లలను విస్తరింపచేయటం కేవలం భౌగోళికమైనదే అవసరం కాదు. ఒక దేశం మరొక దేశపు ఆర్థిక, రాజకీయ, పరిపాలన, సాంస్కృతికమైన ప్రభావం కూడ దేశ ఎల్లల విస్తరణ క్రిందికే వస్తుంది. అలాంటప్పుడే విస్తరణ విధానాలను సామ్రాజ్యవాద విధానాలనటంలో ఆశ్చర్యమేమీ లేదు. ఇక్కడ మరో విషయ మేమిటంటే. పై విధంగా అర్థం చేసుకొంటే సామ్రాజ్యవాద విధానం ఒకే పరిస్థితిని కాక వివిధ రకాలైన పరిస్థితులను సూచిస్తుంది. భౌగోళిక, ఆర్థిక, రాజకీయ మొదలైనవి. కాబట్టి సామ్రాజ్యవాదం అనే పదం ఒకే అర్థంతో ఉన్న పదంగా కన్నా ఒక భావనగా గోచరిస్తోంది. ఏ అర్థంతో ఆ భావనను వాడుతుంటే దానిబట్టి ఆ భావనకు అనుకూల [Positive] లేక వ్యతిరేక [Negative] విలువ వస్తుంది.

రెండు దేశాల విదేశాంగ విధానాలు పరస్పర జాతీయ ప్రయోజనాలను తీరుస్తూ, పరస్పరం ఆమోదకరమైన విధానాలయినపుడు, ఆ విధానాలు అంతర్జాతీయ సంబంధాలను పెంపొందిస్తాయి. అలాంటి సత్సంబంధాలు అంర్జాతీయ స్థాయిలో అన్ని దేశాల మధ్య ఉండడం చాలా అరుదైన పరిస్థితి.ఏ రెండు దేశాల సంబంధాలూ పూర్తి వ్యతిరేకమైనవిగా ఉండటం కూడ దాదాపు అరుదైన పరిస్థితే. దాదాపు అన్ని దేశాలు ఇచ్చి పుచ్చుకునే సామరస్య పూర్వకమైన సంబంధాలనే కలిగి ఉంటాయి. కాకపోతే కొన్ని దేశాల మధ్య, ఒక్కొక్క పరిస్థితిలో, ఒక్కొక్క పద్ధతిలో సంబంధాలు కొన్ని దేశాలకు అనుకూలములైనవిగా మరికొన్ని దేశాలకు నష్టం కలుగచేసేదిగా [వ్యతిరేకమైనవిగా] ఉంటాయి. అలాంటప్పుడు ఆ సంబంధాలు ఆయా దేశాల మధ్యనున్న సంబంధాల యథాతథపరిస్థితిని పూర్తిగా మార్చేవిగా ఉండటం లేదా ఒక దేశం తన స్వతంత్ర విధానానికి అవకాశం లేదనే అసంతృప్తి కలగటం జరుగుతుంది. ఈ పరిస్థితికి దారితీసిన విధానాలు సామ్రాజ్యవాద విధానాలవుతాయి.

BPAOU

ఈ విధంగా చూసినపుడు సామ్రాజ్యవాద విధానంలో ఒక దేశం మరొక దేశం ఆధిపత్యం లేదా అజమాయిషీ లేదా ప్రభావం చూపే, అందునా అవతలి దేశానికి ప్రతి కూలమైందిగానో, నష్టపరిచేదిగానో, ఉండే విధానం సామ్రాజ్యవాద విధాన మౌతుంది. ఈ పరిస్థితినే మార్గాంథో మరో విధంగా నిర్వచించారు. 'యథాతథస్థితిని మార్చివేసే విధానం' సామ్రాజ్యవాద విధానం అన్నారు. రెండు దేశాలు తమ సంబంధాలను మార్చివేసి క్రొత్త రకపు సంబంధాలను ఏర్పరచుకోవటం సామ్రాజ్యవాద విధానమవదు. ఒక దేశం అవతలిదేశం దృష్ట్యాకాకుండా, పై పెచ్చు ఆవతలి దేశానికి వ్యతిరేకమైనవి అయి యథాతథ స్థితిని పూర్తిగా మార్చివేసే విధానం మాత్రమే సామ్రాజ్యవాద విధానమవుతుంది.

మార్గాంథో నిర్వచనం సామ్రాజ్యవాద పరిస్థితిని అతి తేలికగా తెలుసుకోగల్గేటట్లు చేస్తుందని అనుకోకూడదు. ఎందుకంటే మార్గాంథోయే చెప్పినట్లు, రెండు దేశాలు తమ సంబంధాలను తమ కిష్టమొచ్చినట్లు మార్చివేయటం (పరస్పర అవగాహనతో) సామ్రాజ్యవాద విధానమవదు లేదా ఒక సామ్రాజ్యం బలప దేశాలతో తన పరిపాలన లేదా అజమాయిషీ లేదా ప్రభావం పటిష్ట పరచుకోవడం కూడా సామ్రాజ్యవాద విధానం కిందకు రాదు. ఇవన్నీ యథాతథస్థితిలోని పలురకాల పరిస్థితులే. వీటినే ఇచ్చిపుచ్చుకునే అవగాహనపై కుదురుతాయని మార్గాంథో అభిప్రాయం. అలాకాకుండా సామ్రాజ్య దేశం బలప దేశాలకు వ్యతిరేకమైన, యథాతథ స్థితిని పూర్తిగా మార్చి వేసేది అయిన విధానం మాత్రం సామ్రాజ్యవాద విధానమవుతుందని వక్కాణించాడు మార్గాంథో. అంటే దీనిలోని సూక్ష్మార్థమేమిటంటే, యథాతథ స్థితిని మార్చడంలో ఒక దేశానికి లాభం మరొక దేశానికి నష్టం కల్గుతోందని తెలుస్తోంది.

పై విధంగా చూసినపుడు, సామ్రాజ్యవాద విధానం స్థూలంగా చెప్పాలంటే యథాతథా స్థితిని పూర్తిగా మార్చివేసే విధానం. సూక్ష్మంగా చెప్పాలంటే అవతలి దేశాన్ని (దేశాలను) స్వతంత్ర విధానాలతో ఉండనివ్వకపోవటం; పై పెచ్చు కష్టమో, నష్టమో, కలగజేసే విధానం. ఇలాంటి పరిస్థితిని అంతర్జాతీయ సంబంధాలలో తెలుసుకోవడం అంతతేలికైన పనికాదు. ఈ విషయం గూర్చి ముందు ముందు తెలుసుకొంటాం.

6.4.0 సామ్రాజ్యవాదం - సిద్ధాంతాలు, విమర్శ

సామ్రాజ్య వాదం గూర్చి కొన్ని సిద్ధాంతాలు ప్రచారంలోకి వచ్చాయి. కేవలం దేశ విస్తరణ (ఏరంగంలోనైనా) ను సామ్రాజ్యవాద మనడం కాకుండా ఒక సిద్ధాంతపరంగా సామ్రాజ్యవాదమెలా ఉద్భవించి పెరిగి పెద్దదవుతుంతో విపులీకరించడం జరిగింది. అలాంటి ప్రయత్నం ముఖ్యంగా నాలుగు విధాలుగా జరపబడింది.

6.4.1 మార్క్సిస్టు వాద సిద్ధాంతం

ఈ వాదం ప్రకారం సామ్రాజ్యవాద మనేది పెట్టుబడి దారి ఆర్థిక విధాన పర్యవసానం. ఒక దేశంలో పెట్టుబడిదారి విధానం పూర్తిగా అమలులోకి వచ్చినపుడు, ఆదేశపు ఉత్పత్తికి ఆదేశపు మార్కెట్ చాంక ఇతర దేశాలలోని మార్కెటులో తమ దేశ సరకులకు గిరాకీ వచ్చేటట్లు చెయ్యడం, విదేశీ పరిశ్రమల్లో పెట్టుబడులను పెంచడం, ఇలాంటి విధానాల ద్వారా కృత్రిమంగా అవతలి దేశపు రాజకీయ, ఆర్థిక, పరిపాలన వగైరా రంగాలలో ఆధిపత్యమో, లజమాయిషీయో, ప్రభావమో మాపే విధానాలు సామ్రాజ్యవాద విధానాలుగా మార్క్సిజం పేర్కొంటుంది. అనగా ఒకదేశ ఆర్థిక విధానం మరో దేశపు ఆర్థిక మొదలైన విధానాలను నిర్ణయించగలుగుతుంది. అందుకు ఎటువంటి అడ్డంకులు వచ్చినా వాటిని ఏవిధమైన, అవసరమైతే ఒత్తిడి (Force) ఉపయోగించి, అడ్డంకులను అధిగమించి అవతలి దేశపు విధానాలకు స్వతంత్ర ప్రతిపత్తి లేకుండా చేయడం సామ్రాజ్యవాద విధానంలోని ప్రక్రియ. ఆవిధంగా పెట్టుబడిదారీ ఆర్థిక విధానపు పర్యవసానం సామ్రాజ్యవాదమని విపులీకరించిన మార్క్సిస్టులలో లెనిన్ (Lenin) ప్రముఖుడు. ఇలాంటి ఒకవిధంగా తప్పనిసరైన సామ్రాజ్యవాద విధానాలకు ప్రతిచర్య లేక విరోధచర్య శ్రామిక వర్గ విప్లవం. పెట్టుబడిదారి విధానాన్నే మార్చి వేసే శక్తి శ్రామిక వర్గానికి ఉందని మార్క్సిస్టు వాదం.

అయితే కొందరు మార్క్సిస్టులు సామ్రాజ్యవాదాన్ని పెట్టుబడిదారి విధానపు తప్పనిసరి పర్యవసానంగా చూడలేదు. కాటిస్కీ (Kautsky) హిల్ ఫెర్డింగ్ (Hilferding) లాంటి మార్క్సిస్టులు ఈ సందర్భంలో లెనిన్ తో విభేదిస్తూ, సామ్రాజ్యవాద పరిస్థితి తప్పనిసరి పరిస్థితికాదు. ముందుగా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఆ పరిస్థితిని తప్పించవచ్చని భావించారు. ఇలా చూడడంతో సామ్రాజ్యవాద నిరోధక చర్య విప్లవం కాక సంస్కరణలు మాత్రమే సరిపోతాయి.

6.4.2 ఉదారవాద సిద్ధాంతం

ఒకరకంగా చెప్పాలంటే మార్క్సిస్టువాద సిద్ధాంతం కన్న ముందుగనే ఉదారవాద, సోషలిస్టు వాద సిద్ధాంతం ప్రచారంలోకి వచ్చింది. అంటే సిద్ధాంత కర్త బ్రిటిష్ ఆర్థికవేత్త జె.ఎ. హోబ్సన్ (J.A. Hobson). ఉదార, సోషలిస్టు భావాలు కల్గిన హోబ్సన్ 20 శతాబ్ది ఆరంభంలో 'సామ్రాజ్యవాదం' అనే పరిశోధనా గ్రంథాన్ని ప్రచురించాడు. ఆగ్రంథంలో ఆర్థిక, రాజకీయ బంధమైన సామ్రాజ్యవాద మెలా ఉంటుందో, దాని దుష్ఫలితాలను విపులీకరించాడు. నిజానికి హోబ్సన్ సిద్ధాంతాన్ని లెనిన్ కూడా ఆమోదించి ప్రశంసించాడు. హోబ్సన్ ప్రకారం సామ్రాజ్యవాదం పెట్టుబడిదారి విధానంలోని కొన్ని లోపాల వల్ల ఉద్భవిస్తుంది. పెట్టుబడి దారి విధానం సక్రమమైన పంథాలో నడవక, ఒక దశలో విదేశ మార్కెట్‌ను, విదేశాలలో పెట్టుబడి అవకాశాలను విదేశ ఉత్పత్తి కారకాలపై

BRAOU

ఆధిపత్యం లాంటి చర్యలకు దిగుతుంది. అలా మొదలుపెట్టిన ఆర్థిక సామ్రాజ్యవాదం, క్రమేపి రాజకీయ, పరిపాలన, సాంస్కృతిక సామ్రాజ్యవాదంగా మారుతుంది. చివరకు వలసదేశాల నేర్పరచడమో లేదా వాటిని దోపిడీ విధానానికి గురిచెయ్యడం జరుగుతుంది. అలాకాక పెట్టుబడిదారి విధానాన్ని లోపరహితంగా తయారుచేసి నట్లయితే సామ్రాజ్యవాద విధానం తప్పించవచ్చు. దానికి తగిన కార్యక్రమాలు - దేశంలోనే కొనుగోలు శక్తిని పెపొందించడం, దేశంలోనే మార్కెట్‌ను సక్రమపరచి విస్తరింపజేయడం, మితిమీరిన ఆదా లను తగ్గించడం మొదలైనవి. వీటివల్ల అధిక పెట్టుబడులు, అధికోత్పత్తి తగ్గి విదేశ మార్కెట్టులను వెదుక్కునే అవకాశం ఉండదు. అలా పెట్టుబడిదారి విధానం చక్కబడుతుందేకాని సామ్రాజ్యవాద విధానానికి దారితీయదని హోబ్సన్ విపులీకరించారు. ఆర్థిక పరమైన సామ్రాజ్యవాదాన్ని అమలులో ఉంచినపుడు లేదా అరికట్టినపుడు మిగిలిన రకాలు, రాజకీయ వగైరాలు వాటంతటవే తగ్గుతాయి. హోబ్సన్ మరొక హెచ్చరికను గూడా చేశారు. సామ్రాజ్యవాద విధానాలు అవలంభిస్తున్న దేశం మరొక దేశాన్ని, ముఖ్యంగా వలస దేశాన్ని పీడనకు (Exploitation) గురి చెయ్యడమే కాకుండా తద్వారా వచ్చిన అధిక లాభార్జనల వల్ల స్వదేశ ఆర్థిక, రాజకీయ, విధానాలు పట్టుతప్పి రాజ్యవ్యవస్థ దెబ్బతింటుందని నొక్కి చెప్పారు.

హోబ్సన్ సిద్ధాంతం ఒక వైపు స్వేచ్ఛా వ్యాపారానికి మరొకవైపు మార్క్సిస్టు విప్లవ చర్యకు మధ్యేమార్గంగా నిలిచిందని చెప్పవచ్చు. హోబ్సన్ వల్ల ప్రభావితమైన మార్క్సిస్టులు 'రివిజనిస్టులు' (Revisionists) గా పేరు పడ్డారు. కారణం విప్లవం బదులు సంస్కరణలలో విశ్వాసం రావడమే.

6.4.3 డెవిల్ సిద్ధాంతం

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో కొందరు అమెరికన్ గుత్త పెట్టుబడి వ్యాపారస్థులు, యుద్ధ పరికరాలు, ఆయుధాల ఉత్పత్తి వ్యాపారం ద్వారా విశేష లాభార్జనలు పొందారు. ఆయుధీకరణ పోటీ ఉన్నంత కాలం అటువంటి వ్యాపారానికి గిరాకీ ఉంటుంది. అటువంటి వ్యాపారం నిరాఘాటంగా సాగటానికి గాను, పలుదేశాలు తమ వ్యాపారం పై ఆధారపడేలా చెయ్యడం ఆ గుత్త పెట్టుబడి దారుల (Finance Capilatists) ముఖ్య లక్షణం, లక్ష్యాలు కూడా అని లెనిన్ సిద్ధాంతం చెబుతుంది. అనగా ఒక విధంగా యుద్ధ వాతావరణాన్ని కల్పించడం, ఎప్పుడూ ఎక్కడో ఒకచోట ఆ వాతావరణం గాని, యుద్ధం గాని నెలకొనేటట్లు పెట్టుబడిదారులు కుట్రలు పన్నటానికి కూడా వెనుకాడరని, ఆవిధంగా సామ్రాజ్యవాదం ప్రబలుతుందని ఈసిద్ధాంతం చెబుతుంది.

6.4.4 వలసదేశాల సిద్ధాంతం

ఈ నాలగవ రకపు సిద్ధాంతాన్ని ప్రస్తుతం మూడవ ప్రపంచ దేశాలు ప్రచారంలోకి తీసుకొచ్చాయి. ఈ దేశాలు దాదాపు ఏదో ఒక దశలో వలస దేశాలు, బీద దేశాలు అవటం వల్ల కేవలం ఆదృష్టితోనే ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాయనుకో గూడదు. వలసదేశాలు కాకపోయినా, ఉదారవాద విధానాన్ని అవలంభిస్తున్న లేదా సోషలిస్టు విధానాన్ని అవలంభిస్తున్న బీదదేశం కూడా ఈ సిద్ధాంతాన్ని ఆమోదించి తమ మద్దతును ప్రకటించడంతో ఈ సిద్ధాంతానికి ప్రచారం మరింత పెరిగిందని చెప్పవచ్చు.

19 వ శతాబ్దం వరకు సాగిన యూరోపియన్ వలస విధానం ఆర్థిక విషయాలకు సంబంధించినదే అయినా క్రమేపి రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యానికి కూడా దారి తీసి చివరకు వలసదేశాలు స్వతంత్ర ప్రతిపత్తి కోసం స్వాతంత్ర్యపోరాటాలు జరుపవలసి వచ్చింది. మరొక పక్క మార్క్సిజం అలాంటి స్వాతంత్ర పోరాటాలకు కొత్త బలాన్ని చేకూర్చింది. 20వ శతాబ్దం లో వలదేశాలుగా మిగిలినవి చాలా తక్కువ. అనగా వలసదేశాలు చాలావరకు విముక్తి పొంది స్వతంత్ర దేశాలయ్యాయి. కానీ మరొక చిక్కులో పడ్డాయి. విముక్తి కాబడ్డ వలసదేశాలు, మిగిలిన బీద దేశాలు ఇటు ధనిక ఉదార దేశాలపైగానీ, అటు ధనిక సోషలిస్టు దేశాలపైగానీ ఆధారపడవలసి

BRAOU

వచ్చింది. ఆ పరిస్థితులలో ధనిక దేశాలు బీదదేశాలను ఒక రకమైన దోపిడీకి (Exploitation) గాని, అధీనతకు గానీ గురిచేస్తున్నట్లు కొన్ని బీద దేశాలు తెలుసుకోసాగాయి. ఈవిధానాన్నే కొత్త వలస విధానం అని (New - Clonialism) ఎన్ క్రూమా (N Krumah) పేర్కొనడం జరిగింది. ఈ సిద్ధాంతాన్నే ఉత్తర - దక్షిణ తేడా (North - South difference) అని కూడా పేర్కొంటున్నారు. దీని అర్థం ప్రపంచంలో ఉత్తర దిశగా నున్న దేశాలు ధనిక లేదా అభివృద్ధి చెందిన దేశాలు దక్షిణ దిశగా నున్న దేశాలు బీద లేదా వెనుక బడిన దేశాలు అని ఆవిధంగా సామ్రాజ్యవాద విధానంలో వచ్చిన మార్పును గుర్తించి మరో పేరుతో, మరో లక్షణం తో ఉన్న సామ్రాజ్యవాద విధానాన్ని మూడవ ప్రపంచ దేశాలు వెలుగులోకి తెచ్చాయి.

6.4.5 విమర్శ

పైన ఉదహరించిన సామ్రాజ్యవాద సిద్ధాంతాలన్నీ దాదాపు ఆర్థిక సంబంధాలపైనే, ముఖ్యంగా మార్క్సిస్టు వాద సిద్ధాంతం కేవలం ఆర్థిక విషయమునే ప్రాతిపదికగా తీసుకుంది. అయితే కొందరు రాజనీతి శాస్త్రజ్ఞులు అంతర్జాతీయ సంబంధాల అధ్యయన నిపుణులు సామ్రాజ్యవాద విధానాలకు ఆర్థిక విషయాలే మూలవాది కానవసరం లేదు అని అభిప్రాయపడ్డారు. వారిలో మార్గాంథో ఒకరు. అస్ట్రో - ప్రష్యన్ యుద్ధం (1870, స్పానిష్ (1866), ఫ్రాంకో - జర్మన్ యుద్ధం (1870 - స్పానిష్ - అమెరికన్ యుద్ధం (1898) రష్యా - జపనీస్ యుద్ధం (1904-05) మొదలైనవి రాజకీయంగాను, సామ్రాజ్యవాద విధానాలుగా ఉన్నవేకానీ, ఆర్థిక విషయాలకై జరిగిన యుద్ధాలు కావని మార్గాంథో వక్కాణించారు. కాకాపోతే, ఆ యుద్ధం వల్ల విజయం పొందిన దేశాలు ఆర్థికంగా లబ్ధిపొంది ఉండవచ్చునే గాని కేవలం ఆర్థిక లాభం కోసం యుద్ధాలు జరగలేదని మార్గాంథో విపులీకరించారు.

ఒకవేళ ఆర్థిక విధానమే ముఖ్యంగా పెట్టుబడి దారి విధానమే, సామ్రాజ్యవాద విధానానికి కారణమని చెప్పకుంటే, పెట్టుబడిదారి విధానం అమలులో లేని పురాతన కాలంలో, ఈజిప్టు, అస్సీరియన్, పర్షియన్ సామ్రాజ్యవాదులు అవలంభించిన విధానాలు సామ్రాజ్యవాద విధానాలేనని ఒక విమర్శ కూడా ఉంది. ఆధునిక కాలంలో కూడా పెట్టుబడి దారి విధానం అమలులోకి రాక పూర్వం, లూయీ XIV పీటర్ ది గ్రేట్, నెపోలియన్ I లు అవలంభించినవి సామ్రాజ్యవాద విధానాలే అనికూడా విమర్శ ఉంది.

ఇక పెట్టుబడి దారీ విధానమే కొంతవరకైనా కారణమని అనుకున్నప్పుడు, దానికి సామ్రాజ్యవాదం తప్పనిసరి పర్యవసానం కానక్కరలేదని కొందరు, ఉదార వాదులు, సోషలిస్టులు చెబుతున్నారు. కొన్ని అంతర్గత లోపాల వల్ల పెట్టుబడి దారి విధానం అలా సామ్రాజ్యవాదంగా మారుతుందే కానీ, ఆ లోపాలను సరిదిద్దు కుంటే సామ్రాజ్యవాదంగా మారాల్సిన అవసరంలేదు అని చెప్పిన వాళ్లు ఉన్నారు. మరోవైపు పెట్టుబడి దారీ విధానం వల్ల సామ్రాజ్యాలు చీలి చిన్న చిన్న స్వతంత్ర దేశాలు వెలిశాయి అన్న అనుకూల విమర్శ కూడా ఉంది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం అస్ట్రో - హంగేరియన్, ఓటోమాన్, హాప్స్‌బర్గ్, జారిస్టు సామ్రాజ్యాలు బద్దలై చిన్న చిన్న దేశాలు అనేకం ఉద్భవించాయి. అయితే ఇలా జరగడం వల్ల కొన్ని దేశాలలో, సామ్రాజ్యాలలో ఆర్థికంగా లాభం పొంది ఉండవచ్చును.

మరొక విమర్శ కూడా ఉంది. కొందరు పాలకులు (ప్రభుత్వాలు) కొందరు పెట్టుబడిదారుల మద్దతు కొరకు సామ్రాజ్యవాద విధానాలు అవలంభిస్తారే కాని పెట్టుబడి దారులందరు ఒకే క్లాసు లేదా గ్రూపు గానో వ్యవహరిస్తూ సామ్రాజ్యవాద విధానాలు అవలంభిస్తారని చెప్పలేమన్నది విమర్శ. ఒకవేళ ప్రభుత్వాన్ని ఆవిధంగా ఉపయోగించుకోవాలన్నా అలా ఒకటి, రెండు దేశాలలో వీలు పడుతుందేమోకానీ చాలా దేశాలలో అలా వీలుపడదని కూడ అభిప్రాయపడింది. అనగా సామ్రాజ్యవాద విధానాలు సమిష్టి కృషి ఫలితం కాదు.

BRAOU

6.5.0 సామ్రాజ్యవాదం ఉద్భవించే పరిస్థితులు - సామ్రాజ్యవాద రకాలు

సామ్రాజ్యవాదం ఎట్టి పరిస్థితుల్లో ఉద్భవిస్తుందో కొంతవరకు సామ్రాజ్యవాద సిద్ధాంతాలలోనే తెలుస్తోంది. ముఖ్యంగా ఆర్థికపరంగానో లేదా రాజకీయ పరంగానో లేదా కొందరు పాలకుల తీవ్రమైన కోరికల వలననో సామ్రాజ్యవాదం వెలువడుతుందని గ్రహించవచ్చు. అంతేకాకుండా రెండు ప్రపంచ యుద్ధాల అనుభవం దృష్ట్యా మరికొన్ని పరిస్థితులను కూడా పేర్కొనవచ్చు. (1) యుద్ధం లో విజయం సాధించిన లేదా సాధించకున్న దేశం ఓడిపోయిన లేదా ఓడిపోతున్న దేశాలతో మామూలు సంబంధాలు నెలకొల్పుకోక ఆపరిస్థితిని (యుద్ధ పరిస్థితిని) పూర్తిగా మార్చివేసేదిగా ఉంటుంది. ఓడిపోయిన దేశాన్ని తన అధీనతలలో (Subordination) తనకిక ఎటువంటి పరిస్థితులలోను ఎదురుతిరుగ లేదన్న పరిస్థితిలో ఉంచే విధానాలు గెలిచిన దేశం అవలంభిస్తుంది. ఆవిధానం వల్ల అవతలి దేశం విదేశాంగ విధానాలలో స్వతంత్రంగా వ్యవహరించే వీలులేకపోవడం విశేషం. ఇలాంటి పరిస్థితే మొదటి ప్రపంచ యుద్ధానంతరం - ఫ్రాన్సు, జర్మనీ ఎట్టి పరిస్థితిలోను ఎదుర్కొనలేని విధంగా వర్సైల్సు (Versailles Treaty) మరియు దాని అనుబంధ సంధులను (Treaties) ఏర్పాటుచేసింది. ఈ విధంగా యుద్ధంలో గెలిచిన దేశం ఓడిపోయిన దేశంతో సామ్రాజ్యవాద విధానాలు అవలంభిస్తుంది అని తెలుస్తోంది.

మరొక పరిస్థితిలో ఓడిపోయిన దేశం గెలిచిన దేశం పై సామ్రాజ్యవాద విధానాన్ని అవలంభించే ప్రయత్నం కూడా ఉంది. ఓడిపోయి, పరువు ప్రతిష్టలు దెబ్బతినడం వల్ల, అన్ని రకాల నష్టాల వల్ల, తిరిగి కక్ష సాధించాలన్న ధృడ సంకల్పంతో యుద్ధానంతరమున్న పరిస్థితిని పూర్తిగా మార్చి, యుద్ధానికి పూర్వపు పరిస్థితిలో లేదా గెలిచిన దేశం పూర్తిగా ఓడిపోయే వరకో సామ్రాజ్యవాద విధానాలను అవలంభిస్తుంది ఓడిపోయిన దేశం. దీనికి ఉదాహరణ నాజీ జర్మనీ.

మరికొన్ని సందర్భాలలో శక్తి కారకాలు కొరతగా ఉన్నా లేదా రాజకీయంగా శూన్యత ఏర్పడ్డ దేశాలపై లేదా బీద దేశాలపై ధనిక లేదా అభివృద్ధి చెందిన దేశాలు సామ్రాజ్యవాద విధానాలను చూప యత్నించ వచ్చు. ఒక్కొక్కప్పుడు జాతీయ వాద (Nationalism) మనే పేరుతో జాతినిగాని, భాషనుగాని, మతాన్ని గానీ పునరుద్ధరించే యత్నాలు సామ్రాజ్యవాద విధానాలుగా వెలువడతాయి. ఒక్కొక్కప్పుడు భావజాలం పేరుతో ఒక దేశం మరొక దేశం కన్నా శక్తివంతమైంది గా తయారవజూడడం సామ్రాజ్యవాద విధానం కిందకే వస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికా రష్యాలు ఒకరినొకరు భావజాల సంబంధమైన యుద్ధాన్ని (Warfare) ప్రకటించుకొంటూ తమతమ ఆధిక్యతలను నిరూపించుకోదలచడం ఇక్కడ పేర్కొనవచ్చు.

పైన పేర్కొనబడిన పరిస్థితులు కేవలం అవగాహనకోసం పేర్కొనబడ్డవే గాని, వాస్తవంలో అంత తేలిగ్గా తెలిసే పరిస్థితులుండకపోవచ్చు. దానికి కారణం అంతర్జాతీయ స్థాయిలో రాజనీతి లేదా రాజకీయాల స్వరూపం లోనే మార్పులొస్తుండటమే.

ఇన్ని రకాల పరిస్థితులలో ఉద్భవించిన సామ్రాజ్యవాదానికి కొన్ని లక్ష్యాలుంటాయి. అవి స్థూలంగా మూడురకాలు. మొదటిది ప్రపంచ సామ్రాజ్య స్థాపన, రోమన్ సామ్రాజ్యం, నెపోలియన్, హిట్లర్‌ల దేశ విస్తరణ విధానాలు ప్రపంచ సామ్రాజ్య స్థాపనను లక్ష్యంగా పెట్టుకున్నాయి. మొదట్లో కొన్ని దేశాల ఆర్థిక, రాజకీయ, భౌగోళిక విషయాలలో మార్పులు తెచ్చినా క్రమేపి ప్రపంచ దేశాలన్నింటినీ శాసించే స్థితికి రావాలన్న కాంక్ష తీవ్రంగా ఉంటుంది. అలా వ్యక్తమౌతుంది.

మరొక పరిస్థితిలో భూఖండ సామ్రాజ్య (Continental Imperialism) స్థాపన. లూయీ XIV, నెపోలియన్ III, విలియం II లు అవలంభించిన విధానాలు కేవలం యూరప్‌ఖండానికే పరిమితమై యూరపు దేశాలలో తమ ఆధిపత్యం లేదా అజమాయిషీ, లేదా ప్రభావం చూపే విధానాలు అవలంభించారు. కొంతవరకు లాటిన్ అమెరికన్

BRAOU

దేశాలపై అమెరికన్ ప్రభావం కూడ ఈ రకం కిందికే వస్తుందనవచ్చు. కానీ లేదా ఉంది. కెనడా, మెక్సికోలపై ఆమెరికన్ ప్రభావం లేదన్న విషయం సువిదితమే. కాబట్టి ఈ విధమైన అమెరికన్ ప్రభావం, అమెరికన్ మన్రో సిద్ధాంతం భూఖండ సామ్రాజ్య వాదంలో కొంత భాగంగా మాత్రమే ఉంటుంది.

కొన్ని సందర్భాలలో కేవలం స్థానికంగా (Local) తమ ఆధిపత్యమో లేక ప్రభావమో చూపే విధానం స్థానిక సామ్రాజ్యవాద విధానంగా పేర్కొన్నారు అంతర్జాతీయ సంబంధాల అధ్యయన నిపుణులు. లూయిXV పీటర్ ది గ్రేట్, కాథరిన్ II యూరప్‌లో తమ తమ స్థానిక ప్రాంతాలలో మాత్రమే ఆధిపత్యాన్ని చూపే విధానాలు అవలంభించారు. బిస్‌మార్క్ గూడా తన విధానాలను మధ్య యూరప్‌కే పరిమితం చేసుకున్నాడు. అలాగే బాల్కన్ దేశాలు; ఫిన్‌లాండ్‌పై, తూర్పు యూరప్‌పై, రష్యా, ఇరాన్ ఇలాంటి విధానాన్నే అవలంభించాయి.

6.5.1 ఆక్రమణ సామ్రాజ్య వాదం

ఇలాంటి లక్ష్యాలతో ఉన్న సామ్రాజ్యవాదం ఎన్ని రకాలుగా లేదా పద్ధతులలో వెలువడుతుందో కూడా తెలిపికోవడం చాలా అవసరం. అనాదిగా వస్తున్న పద్ధతి మిలటరీ శక్తినుపయోగించి దేశాన్ని లేదా దేశభాగాన్ని ఆక్రమించుకోవటం. బలంగల దేశం బలహీన దేశంపై విపరీత ఆశతో, హిట్లర్ లాంటి నియంత ధోరణులతో ఏదో ఒక మిషపై మిలటరీ శక్తినుపయోగించి తమదేశ భౌగోళిక ఎల్లలను విస్తరించి చూడటం మిలటరీ సామ్రాజ్యవాద స్థాపన కిందకి వస్తుంది. ఒక్కొక్కప్పుడు శక్తిని ఉపయోగింపకపోయినను ఒత్తిడిని తీసికొని వచ్చి అవతలి దేశం తనంతట తానే భౌగోళిక సంబంధితమైన వాటిని సమర్పింపజేసే విధానాలు గూడా యీ తరగతి లోకే వస్తాయి. ఆక్రమణ పద్ధతి ఒకచోట ఆగక, యుద్ధానికి దారి తీసి మళ్లీ ఆక్రమణ పద్ధతికే దారి తీస్తుంది. కాకపోతే ఆక్రమణ పద్ధతి ప్రస్తుత కాలంలో అరుదుగా కన్పిస్తుంది. ఈమధ్య జరిగిన ఇరాక్ కువాయిట్ ఆక్రమణ లాంటి మిలటరీ సామ్రాజ్యవాద విధానం చాలా అరుదుగా జరుగుతుంది. ఒకవేళ అలా జరిగినా అంతర్జాతీయ స్థాయిలో ప్రజాభిప్రాయం చాలా త్వరగా స్పందిస్తుంది. మిలటరీ శక్తితో భూభాగ ఆక్రమణలు లాంటివి దాదాపు రెండవ ప్రపంచ యుద్ధంతోనే అంతరించిపోయినవని చెప్పవచ్చు.

6.5.2 ఆర్థిక సామ్రాజ్యవాదం

ఆర్థిక సామ్రాజ్యవాద విధానం ఈ శతాబ్దం మధ్యనుంచి ఎక్కువ ప్రాముఖ్యత వహించిందని చెప్పవచ్చు. కాని దాని అసలు స్వరూపం దాదాపు 18 వశతాబ్దం నుంచి అనగా బ్రిటన్ పోర్చ్‌గల్‌పై అవలంభించిన విధానాలలో చూడవచ్చు. 20 వ శతాబ్దంలో ముఖ్యమైనవి - అరబ్ దేశాల 'చమురు దౌత్యం' (Oil diplomacy), రెండవ ప్రపంచ యుద్ధకాలం లో ఫ్రాన్స్, రుమేనియాపై చూపిన ప్రభావం, మధ్య అమెరికన్ దేశాలు అమెరికన్ ఎగుమతుల, దిగుమతులపై ఆధారపడటం వగైరాలు. ఆర్థిక సామ్రాజ్యవాద విధానానికి గురియైన దేశం ఆర్థిక విషయాలపై ఇతర దేశము (ల) పై ఆధారపడి , తన స్వతంత్ర విధానాలను అవలంభింప లేకపోవడం - ఇదీ ముఖ్య సమస్య. ఒక్కొక్కప్పుడు ఒకే దేశంపై రెండు, మూడు దేశాలు ఆర్థిక సామ్రాజ్యవాద విధానాలు చూడటం కద్దు. ఉదాహరణకు రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో రష్యా, బ్రిటన్‌లు ఇరాన్‌పై చూపిన ఆర్థిక సామ్రాజ్యవాద విధానాలు యీ కోవకు చెందినవే.

6.5.3 సాంస్కృతిక సామ్రాజ్యవాదం

దేశ మనుగడకు భౌతిక విషయాలు ఎంత అవసరమో, మానసిక విషయాలు ఆలోచనా పద్ధతులు, మనోభావాలు, తాత్విక చింతనలు, భావజాలం (Ideolgy) వగైరాలు గూడ చాలా అవసరమైనవి. వీటి పెదుగుదల, ప్రచారాలకు

BRAOU

నాయకులు, నిద్యావేత్తలు, శాస్త్రవేత్తలు సమాచార సాధనాలు (Media) మున్నగునవి తోడ్పడతాయి. ఒక దేశం లోని ఈ మానసిక పరిస్థితులను మరో దేశం తనకు వచ్చేవిగా లేదా ఉపయోగపడేలా మార్చే ప్రయత్నం సాంస్కృతిక సామ్రాజ్యవాద విధానం కిందికి వస్తుంది. ఇలాంటి ప్రయత్నాలలో ఎక్కువగా సమాచార సాధనాలను ఉపయోగించడం దాదాపు మొదటి ప్రపంచ యుద్ధ కాలం నుండి ఎక్కువయిందని చెప్పవచ్చు. కాకపోతే అంతకుముందు నుంచి కూడా ఉంది. జారిస్టు రష్యాలో జార్ రాజ్యము, చర్చిలపై ఆధిపత్యముందని ప్రచారం చేయటం, నాజీలు తూర్పు జర్మనీపై జరిపినవి యిలాంటివే. విచిత్రమేమిటంటే రోమన్ సామ్రాజ్యం ఎంత సామ్రాజ్యవాద విధానం అవలంభించినా తన అధీనం లోనికి వచ్చిన ప్రజల చిత్త ప్రవృత్తులపై ఆధిపత్యం చూప యత్నింపలేదు. అందువల్లనే అంతకాలం నిలువ గల్గిందనే అభిప్రాయం చాలామంది విమర్శకులలో ఉంది. నెపోలియన్ హిట్లర్ లాంటి వారి పరాజయానికి పునాది సాంస్కృతిక సామ్రాజ్యవాద విధానాలు. భౌతికంగా బందీ అయిన వారికన్న మానసికంగా బందీ అయిన వారు త్వరగా ఎదురుతిరుగుతారు. అదే విధంగా ఏదేశమైనా ఎలాంటి సామ్యవాద విధానాన్ని అయినా కొంతవరకు భరిస్తుందేమోకాని సాంస్కృతిక లేదా మానసికమైన సామ్రాజ్యనాద విధానాలను మాత్రము భరించలేదు. నెపోలియన్‌కి వ్యతిరేకంగా సంకీర్ణ మండలులు, 19 వ శతాబ్ది రష్యాకు వ్యతిరేకంగా పోలిష్ ప్రజలు, బ్రిటిష్‌కు వ్యతిరేకంగా ఐర్లాండు, ఇండియా లు జరిపిన పోరాటాలు సాంస్కృతిక సామ్రాజ్యవాద విధానాలను ఎదుర్కొనే ప్రయత్నాలు. ఒక రకంగా భావజాల యుద్ధం కూడా ఈ కోవకు చెందిందనవచ్చు.

6.6 సామ్రాజ్యవాదం - దాని నివారణ విధానాలు

ఒక విధంగా సామ్రాజ్యవాదం కనుగొనడం, అంటే పరిస్థితి ఎలా ఉంటుంది అని తెలుసుకోకుండా, కష్టమైతే మరో విధంగా దానికి తగిన నివారణ లేదా, నిరోధక విధానాలు తెల్సుకోవడం కూడ కష్టమే. ఈరెండు విధాలైన కష్టమునుండ బట్టే రెండు ప్రపంచ యుద్ధాలు ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం ముందుకొచ్చింది అనే అభిప్రాయం చాలామందిలో ఉంది. సరియైన సమయంలో దాన్ని కనిపెట్టి తగిన నిరోధక చర్య తీసుకోకపోతే అంతర్జాతీయ సంబంధాలలో అనుకోని అదుపు తప్పిన పరిస్థితులు నెలకొనే పరిస్థితులు రావచ్చు.

మొదటగా తెలుసుకోవలసినది అసలు సామ్రాజ్యవాద విధానమును కనుగొనడం ఎలా? ఇక్కడ మరో నిర్వచనం 'యథాస్థితిని ' పూర్తిగా మార్చివేసే విధానం సామ్రాజ్యవాద విధానంగా చాలా వరకు ఉపయోగపడుతుంది. అలాగని పరిస్థితిని తెలుసుకోవడం కూడ అంత తేలికేమీకాదు. ఉదారవాద పద్ధతిలో ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలో యథాస్థితిని మార్చే విధానాలు, అందుకు సంబంధించిన దేశం అవగాహనతో జరిగిన, అవి సామ్రాజ్యవాద విధానాలు అనుకోవక్కర్లేదు. అలాకాకుండా ఆ మారిన విధానం లేదా పరిస్థితి ఏదో ఒక సంబంధిత దేశానికి కష్ట, నష్టాలకు గురి చేసేదిగానో, లేక యిష్టములేనిదిగానో ఉంటే అవిధానం సామ్రాజ్య విధానం గానే గుర్తించవలసి ఉంటుంది. ఇక అవతలిదేశం అయిష్టత వ్యక్తంచేసి, ప్రతిఘటన చూపిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో ప్రజాభిప్రాయం కోసం తనగోడును చెప్పుకొన్నప్పుడు అందుకు కారణమైన విధానం సామ్రాజ్యవాద విధానమని గ్రహించటంలో జాప్యం చేయగూడదు. పైపెచ్చు యిలాంటి పరిస్థితి నెలకొన్నప్పుడు, తృప్తి పరచే విధానం సామ్రాజ్యవాద విధానాలను మరింత పెపొందించుకొవడానికి అవకాశం కల్పించినట్లవుతుంది. ఇలా జరిగినదే రెండవ ప్రపంచ యుద్ధం ముందు సమయం. జర్మనీ సామ్రాజ్యవాదం గుర్తించలేక, బ్రిటన్, జర్మనీని తృప్తిపరచే విధానం అవలంభించి చివరకు ప్రపంచ యుద్ధంతోగాని సామ్రాజ్యవాదానికి సమాధానం ఇవ్వలేక పోయాయి ప్రపంచదేశాలు. జర్మనీని తృప్తిపరచే విధానం వల్ల ఒక్క జర్మనీయేగాక, ఇటలీ, జపాన్ దేశాలు కూడా సామ్రాజ్య వాద విధానాలను అతి బాహాటంగా అవలంభించాయి. మరో విషయం ఇక్కడ గుర్తించాల్సిందేమిటంటే, సామ్రాజ్యవాదం ఒక్కసారిగా ముందుకొచ్చినట్లు రాదు. చాలా పద్ధతి ప్రకారం, సంబంధిత దేశాల స్పందన, అంతర్జాతీయ ప్రజాభిప్రాయ స్పందన

BRAOU

మున్నగువాటిని జాగ్రత్తగా గమనిస్తూ, అవసరమైతే మరికొన్ని దేశాలను సామ్రాజ్యవాద విధానాలకు మద్దతును చూపిస్తూ వెలుగుతుంది సామ్రాజ్యవాదం . కనుక , ఏదో ఒక స్థాయిలో గుర్తించి తగిన చర్య తీసికోవచ్చు. ఉదాహరణకు రెండవ ప్రపంచయుద్ధానికి ముందు జర్మనీ విధానాలు తీసుకొనవచ్చు. 1935 లో నిరాయుధీకరణకు సంబంధించిన కొన్ని నియమాలను తిరస్కరించింది (కారణం ఫ్రాన్సు, రష్యాలు ఆయుధీకరణకు పూనుకొన్నాయని చెప్పి) తర్వాత బ్రిటన్ - జర్మనీ నావల్ ఒప్పందం జరిగింది. 1936 లో రైన్‌లాండ్ ఆక్రమణ జరిగింది. 1938 లో ఆస్ట్రియా ఆక్రమణ. మ్యూనిక్ ఒప్పందం తో చెక్‌స్లోవేకియా లో కొంత భూభాగం, తర్వాత పూర్తిగా ఆక్రమించుకోబడ్డది. ఆతర్వాత పోలెండ్ ఆక్రమణకు పూనుకోవడంతో జర్మన్ సామ్రాజ్య వాదానికి ప్రతిఘటన మొదలైంది. ప్రపంచ యుద్ధంలో గాని పూర్తి సమాధానం ఇవ్వబడలేదు.

నాజీ జర్మనీ సామ్రాజ్యవాదానికి రెండు కారణాలను ముఖ్యంగా పేర్కొనవచ్చు. మొదటగా, శాంతి ఒప్పందంలోనే జర్మనీని మానసికంగా అంత కృంగదీయటం లోనే ఒక రకంగా జర్మనీకి తిరుగుబాటు తనాన్ని నేర్పించినట్లయినదనే అభిప్రాయం చాలామంది అంతర్జాతీయ సంబంధాల అధ్యయనకారులు వ్యక్తం చేశారు. రెండవది, జర్మనీ సామ్రాజ్యవాద విధానాలకు ప్రతిఘటన అనే చర్యకు బదులు తృప్తిపరచే విధానాన్ని ప్రతి చర్య అనుకోవడం మరో పొరపాటు. ప్రతిఘటన, నిరోధక చర్యలు లాంటివి చూపించక పోవడం వల్ల సామ్రాజ్యవాదం బలపడుతుందేగాని తగ్గదు. కనీసం 1945 లో రష్యన్ కమ్యూనిజాన్ని నిరోధించాలనే అమెరికన్ విధానం లేదా మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం అమెరికా యూరప్‌నుద్దేశించి ఏకాంత విధానమును మన్రో సిద్ధాంతం రూపంలో వెలిబుచ్చిన విధంగానైనా జర్మనీ విధానాలకు అడ్డుతగిలిన, సామ్రాజ్యవాద విధానాలకు కొంతవరకైనా అడ్డుగోడలు నిలిపేవనే అవగాహనకు రాక తప్పదు. అయితే ఇక్కడ మరొక చిక్కు ఉంది. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత సామ్రాజ్యవాద విధానాల స్వరూపం మారింది. అంతకు మునుపులా సామ్రాజ్యవాదం, భౌగోళికమైందో, సాంస్కృతికమైందో కాకుండా ఆర్థిక సంబంధమైందిగానో లేదా భావజాల సంబంధమైనదో గమనించవచ్చు. అదీగాక రెండవప్రపంచ యుద్ధానంతరం అంతర్జాతీయంగా రాజకీయ వాతావరణం లోనే మార్పులు రావడంతో సామ్రాజ్యవాద విధానాలలో గూడ మార్పులు రావటం సహజం. ఆ విధంగా వచ్చినవే ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలైన సామ్రాజ్యవాద విధానాలు కాకపోతే యివిగూడ కొన్ని పద్ధతుల /రకముల రూపంలోనే ఉండే అవకాశం ఉంది.

BRAOU

సామ్రాజ్యవాద విధానం, ఆర్థిక పరమైనదైనా లేదా భావజాల సంబంధమైనదైనా, ప్రపంచ సామ్రాజ్య స్థాపన ధ్యేయంగా నున్న విధానాలు వెలువడడం చాల అరుదు. అంతర్జాతీయంగా రాజకీయాలు ద్విధ్రువ రూపంనుండి బహుధ్రువ రూపం దాల్చడంతో సామ్రాజ్యవాదం భూభాగ (Continental) సంబంధమైనదిగా గూడ కొనసాగడం కష్టం. ఇకపోతే స్థానిక సామ్రాజ్యవాదం మాత్రం కొనసాగే అవకాశం ఉందని చెప్పవచ్చు.

సోవియట్ యూనియన్ ఉన్నంతకాలం కమ్యూనిజం సిద్ధాంతానికి తగిన ఆకర్షణ, మద్దతు ఉండటంతో సామ్రాజ్యవాద విధానాలకు ఒక రకమైన ప్రతిఘటన వాదం లేక సిద్ధాంతం వాడుకలో ఉండేది. అమెరికా, సోవియట్ యూనియన్లు భావజాల యుద్ధాన్ని సల్పుతూ ఒకరినొకరు సామ్రాజ్యవాదులనుకున్నప్పటికి, ప్రతిఘటన దృష్ట్యా సామ్రాజ్యవాదంలోని లోపాలు, విలక్షణాలు వెలుగులోకి తీసికొని రాబడ్డాయి. ఇప్పుడు కమ్యూనిస్టు సోవియట్ యూనియన్ పతనమయి, తూర్పుదేశాలు కమ్యూనిజాన్ని వ్యతిరేకించి వదిలివేయటంతో ఇక సామ్రాజ్యవాద విధానాలకు మార్క్సిస్టు దృక్పథంతో చూసే పరిస్థితి ఉండదా అనిపిస్తుంది. దీనిలో కొంత నిజమయినదనిపించినా, నిరాశ పడనక్కరలేదు. కారణం కమ్యూనిజమే పూర్తిగా నశించిందను కోవడం పొరపాటు. పెట్టుబడి దారి విధానాలను తగువిధంగా లోపరహితంగా తయారు చెయ్యాల్సిన అవసరం ఎంతైనా ఉందనే ఒత్తిడి ఉదారవాదులనుండి, కొందరు పెట్టుబడి దారి విధాన మద్దతుదారుల నుండి వస్తోంది.

చివరగా ఒక్కమాటలో చెప్పాలంటే, సామ్రాజ్యవాదం పూర్తిగా పోలేదని, దాని స్వభావం అప్పుడున్న అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులను బట్టి ఉంటుందని, వీటన్నిటికన్నా, ముఖ్యంగా సామ్రాజ్యవాదం భావన గూర్చి అధ్యయనం పలు దృక్పథాల నుంచి జరగటం ఎంతైనా అవసరం అని గ్రహించడం మేలు.

6.7 సారాంశం

సామ్రాజ్యవాదం భావన అంతర్జాతీయ సంబంధాలలో ఎంతో ప్రాముఖ్యత వహించింది. ఈ భావనకు మొదటినుంచి, ముఖ్యంగా ఆధునిక యుగంలో ఎక్కువగా వ్యతిరేకార్థమే ఉందని చెప్పవచ్చు. కాకపోతే ఒకరిని లేక ఒక దేశాన్ని సామ్రాజ్యవాదం అవలంబిస్తున్నట్లు ఆరోపించడం ఆత్మాశ్రయమైన తీర్పు అయినప్పటికీ, పరస్పర ఆత్మాశ్రయ తీర్పులనుండి ఒకరకమైన విషయ నిష్ఠమైన తీర్పు వెలుగులోకి రావటానికి అవకాశం ఉంది. కానీ అలా జరగటానికి కొంతకాల వ్యవధి తప్పదనిపిస్తుంది.

సామ్రాజ్యవాదం అతి పురాతనమైందని తెలుసుకున్నాం. సామ్రాజ్యవాదం గురించి పలురకాల సిద్ధాంతాలు ఆధునికయుగంలో ఎన్ని వచ్చినా, ఆ పరిస్థితి అనాదినుండి వస్తున్నది. ఏ రూపంలో వెలునడినా సామ్రాజ్యవాదం ముఖ్యలక్షణం ఒక్కటే - ఒకరు (ఒకదేశం) మరొకరి (మరొక దేశం)పై ఆధిపత్యమో, అజమాయిషీయో, ప్రభావమో చూప ప్రయత్నించడమే. కాకపోతే భౌగోళికముగా జరిగినట్లు కన్పిస్తుంది. మిగిలిన రూపాలు కన్పించవు. యుద్ధాలు ఇంతకు మునుపు ఉన్నంత తరచుగా రావడం యిప్పుడు కష్టం. కానీ దేశాలమధ్య స్పర్ధలు, ఘర్షణలు మాత్రం పెరగడం లేదు అని చెప్పలేంగాని తగ్గలేదని మాత్రం చెప్పగలం. మరి స్పర్ధ ఉన్నచోట, ఒకరినొకరు లొంగదీసుకోవాలనుకోవడం సామ్రాజ్యవాదం కాదా? ఆ విధంగా సామ్రాజ్యవాదం నశించిందనిగాని, ఇక ముందు నశిస్తుందని ఆశించడం గాని ఎంతవరకు వాస్తవిక దృక్పథం? అలాగని నిరుత్సాహపడి నిరాశావాదం వెనుక దాగలేము.

అందువల్లనే అంతర్జాతీయ సంబంధాల విషయంలో దేశాలు ఎంత స్పర్ధతో ఉన్నాయా అని చూడటంతోబాటు, దేశాలు ఎంతవరకు సహకారాన్ని, సహాయాన్ని అందించుకుంటున్నాయా అని చూడటంతో ఒకరకమైన వాతావరణ మార్పు (రాజకీయంగా) వస్తుంది. తద్వారా సామ్రాజ్యవాద రూపాలు, దాని నివారణోపాయాలు, నిరోధ విధానాలు ప్రచారంలోకి వస్తాయి. ఈ సందర్భంగా అర్థంచేసుకోవాల్సింది ఒకటుందేమో అన్పిస్తుంది. దేశాలకు కావల్సింది శక్తి లేక బలంకన్న ఒకరకమైన నిర్బంధం/నియమం. కానీ అంతర్జాతీయస్థాయిలో అది సాధ్యమా?

ఇలా చూసినపుడు సామ్రాజ్యవాదం తగ్గుదల ఘర్షణలవల్లనే తగ్గుతుందనే అభిప్రాయం బలపడుతుంది. భూభాగ సామ్రాజ్యవాదం ప్రతిఘటనవల్ల ప్రపంచ సామ్రాజ్యవాదం తగ్గుతుంది. స్థానిక సామ్రాజ్యవాద ప్రతిఘటనవల్ల భూభాగ సామ్రాజ్యవాదం తగ్గుతుంది. దేశ స్వతంత్ర ప్రతిపత్తి ప్రతిఘటనలవల్ల స్థానిక సామ్రాజ్యవాదం తగ్గుతుంది. ఈ ప్రక్రియలో ఆనగా యీ ఘర్షణ లేక ప్రతిఘటన ప్రక్రియలో ఒక అనుకూల (Positive) భావం ఉంది. ఒక స్థాయిలో సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనటానికి క్రిందిస్థాయిలో సహాయ సహకారాలు సంఘటితమవటాన్ని బట్టి ఉంటుంది. ఇటువంటి సామ్రాజ్యవాదం భావనగురించి అధ్యయనం అవసరం వేరే చెప్పనవసరం లేదు.

- బి.యస్.ఆర్: ఆంజనేయులు.

BRAOU

6.8 చదువదగిన పుస్తకాలు

1. H.J. Morgenthau	:	Politics Among Nations
2. G. Swarzenberger	:	Power Politics
3. F.H. Hartman	:	The Relations of Nations
4. J.A. Hobson	:	Imperialism
5. V.I. Lenin	:	Imperialism, The Higher Stages of Capitalism

6.9 నమూనా పరీక్షాప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30/40 పంక్తులలో జవాబులివ్వండి.

1. సామ్రాజ్యవాదం భావన ప్రాముఖ్యత ఏమిటో ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ పరిస్థితి దృష్ట్యా వివరించండి.
2. 'సామ్రాజ్యవాదం, రెండవ ప్రపంచయుద్ధానంతరం ఒక అర్థరహితమైన భావం' వ్యాఖ్యానించండి.
3. సామ్రాజ్యవాదం గూర్చి చర్చించిన ప్రముఖ సిద్ధాంతాలేవి? వాటికి ప్రస్తుతం ఎంతవరకు ప్రాముఖ్యత ఉంది?
4. బహుధ్రువ (Multi Polar) రాజకీయ పరిస్థితులలో సామ్రాజ్యవాదం బలపడుటకు అవకాశముంది. వ్యాఖ్యానించండి.
5. సామ్రాజ్యవాదాన్ని కనుక్కోవడం ఎలా? దాని నివారణకు ఎలాంటి చర్యలు తగినవో చర్చించండి.

BRAOU

భాగం-7 శక్తి సమతౌల్యం - భద్రతా ఒప్పందాలు

విషయక్రమం

7.1 లక్ష్యాలు
7.2 పరిచయం
7.3 సమతౌల్య శక్తి అనగా ఏమి?
7.4 సమతౌల్య శక్తి భావన - ఊహలు
7.5 సమతౌల్య శక్తి - ఆచరించే విధాలు
7.6 సమతౌల్య శక్తి భావన ఆవశ్యకత
7.7 ముగింపు
7.8 చదువదగిన పుస్తకాలు
7.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

7.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

* అంతర్జాతీయ సంబంధాల్లో సమతౌల్యశక్తి
* దానికి సంబంధించిన వివిధ ఊహలు
* ఆచరించే విధాలు
* ఆవశ్యకతల గురించి బాగా వివరించగలరు

BRAOU

7.2 పరిచయం

అంతర్జాతీయ సంబంధాలలో ప్రాముఖ్యత వహించిన భావాలలో మరొకటి సమతౌల్యశక్తి, భద్రతా కూటమి. సమతౌల్యశక్తి, భద్రతాకూటమి, ఈ రెండు ఒకదానికొకటి లవినాభావ సంబంధమున్న భావనలు. ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. కాబట్టి ఈ రెంటిలో ఒక భావన ఉందన్నా లేదా ఒకదాని గూర్చి చర్చించినా, రెండవది కూడా తప్పనిసరిగా ఉందని లేదా చర్చలోకి వస్తుందని భావించాలి. ఈ మధ్య కాలం వరకు సమతౌల్యశక్తి భావన చాలా ప్రసిద్ధిగాంచింది. ప్రాముఖ్యత వహించింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఈ భావనకు ప్రాముఖ్యత తగ్గిందనే అభిప్రాయం వెలువడింది. ఆ భావన రూపం మారిందే కాని దాని ప్రాముఖ్యత తగ్గలేదనే అభిప్రాయం కూడా బలపడింది.ఈ భావన ప్రాముఖ్యత గ్రహించినవారు, మార్గాంథో (Morganthan) పామర్, పెర్‌కిన్స్ (Pamer and Perkins), మార్టిన్ వైట్ (Martin Wight) మొదలైనవారు. ఈ భావనను 'అంతర్జాతీయ సంబంధాలకు' పునాదివంటిదని, ప్రాథమిక రాజనీతి సూత్రమని, సాధారణమైన సాంఘిక సూత్రమని భావించారు. ఈ కోవకు చెందిన వాళ్ళను వాస్తవిక వాదులు (Realists) అంటారు. వీరు రాజనీతి/రాజకీయ శక్తి అనే భావనపై ఆధారపడిందని, దేశ, అంతర్జాతీయ స్థాయిలలో రాజనీతి, శక్తికోసం 'జరిపే పోరాటములే' అని భావిస్తారు. ఆదర్శవాదులు (idealists) మరోలా భావిస్తారు. వీరు శక్తి భావనకు ప్రాముఖ్యత ఇవ్వరు. ఆదర్శ రాజ్యం లేక ఆదర్శ పరిస్థితిని నెలకొల్పటమే రాజనీతి/రాజకీయ లక్ష్యమని భావిస్తారు. అసలు మానవుని సంఘజీవనానికి దేశంలోను, అంతర్జాతీయంగానూ, రాజనీతికన్న ఆర్థిక విషయాలే ముఖ్య కారణాలనీ, వాటికోసం సహాయ సహకారాలు నెలకొనే

ప్రయత్నాలు, సమతౌల్య శక్తిలాంటి భావనలకు ప్రాముఖ్యత లేనివిగా చేస్తాయనే భావన 20వ శతాబ్దం మధ్యనుండి బలపడుతున్నదనటంలో సందేహంలేదు. అయితే ఇలాంటి సహాయ సహకారాలను కూటములుగా ఏర్పడటం తప్పనిసరియైనా, సమతౌల్యశక్తి దృష్ట్యా ఏర్పడ్డ కూటములకు వీటికీ తేడా ఉంటుందని కూడా గ్రహించాలి. కాకపోతే సమతౌల్యశక్తి భావనకు ప్రాముఖ్యత పూర్తిగా పోగల పరిస్థితి వస్తుందా అన్న సంశయం కూడా ఉంది. అందువల్లే సమతౌల్యశక్తి భావన, సమతౌల్యశక్తి భావన రూపం మారి మరోలా ప్రత్యక్షమవుతుందేకాని అసలు ప్రాముఖ్యత లేనిదిగా తయారవ్వటం కష్టం అని భావిస్తున్నాడు.

7.3 సమతౌల్య శక్తి అనగా ఏమి?

సమతౌల్యమనే పదం 'సమానం' (equal/equilibrium/balance) అనే అర్థం ఇస్తుంది. కాబట్టి సమతౌల్యశక్తి అనగా సమానమైన శక్తి అనే అర్థం వస్తుంది. అంటే సంబంధిత దేశాలకు, సమానశక్తి ఉన్నట్లు లేక దేశాలు సమతౌల్య శక్తి కల్గిన దేశాలు అని సాధారణ అర్థం. అయితే ఇది కేవలం అక్షరాలా (literal) ఉన్న అర్థం. వాస్తవంలో ఈ పదం వాడుక చాలా అర్థాలతో కూడి ఉన్నది. (1) పైన చూపినట్లు సంబంధిత దేశాలు సమశక్తిని కల్గి ఉండటం లేదా ఉండుటకు ప్రయత్నించడం, (2) అంతర్జాతీయ సమాజం పలుదేశాల సమూహం కాబట్టి ఓ రెండు దేశాల శక్తి దృష్ట్యానే చూడము కాబట్టి ఒక సమతౌల్య శక్తి సందర్భం మరో సమతౌల్యశక్తి సందర్భాన్ని తెలుపుతుంది. ఆ విధంగా దేశాల సమతౌల్యశక్తి సందర్భాన్ని తెస్తుంది. ఆ విధంగా రెండు దేశాల సమతౌల్యశక్తి మరో రెండు లేక ఎక్కువ దేశాల శక్తితో పోల్చి చెప్పడంలో ఒక రకమైన అంగీకారం (agreement) ఉన్నదీ, లేనిదీ తెల్పుతుంది. (3) ప్రపంచ దేశాలు పూర్తిగా విడివిడిగను, అంటే వ్యక్తిగతంగా, ఉండలేవు పూర్తిగా రెండు కూటములుగానూ ఉండలేవు. అంటే అనేక కూటముల సముదాయం అంతర్జాతీయ వాతావరణం. కాబట్టి సమతౌల్యశక్తి కూటములకు గూడ వర్తిస్తుంది. ఆ విధంగా కూటముల సమతౌల్య శక్తిని బహుముఖ (multiple) సమతౌల్య శక్తి అంటారు. (4) కొన్ని ప్రత్యక్ష, అరుదైన పరిస్థితులలో ప్రపంచ దేశాలు రెండు కూటములుగా ఉండే అవకాశం ఉంది. అలాంటప్పుడు, ఆ రెండు కూటముల శక్తి సమానమైన దాన్ని సామాన్య (simple) సమతౌల్య శక్తి అంటారు. (5) దేశాల, కూటముల మధ్య సమాన శక్తి ఉందని చెప్పడం కష్టం. శక్తిని కొలిచే సాధనాలు స్థిరమైన వేవీ లేవు. శక్తి కేవలం గణనీయమైంది అని చెప్పలేము. ఇలాటి పరిస్థితిలో సమానత ఉన్నదనుకోవడంలోను, లేదనుకోవడంలోను ఒకరకమైన మానసికావస్థే అన్పిస్తుంది. ఆ విధంగా సమతౌల్యశక్తి భావన ఒకరకమైన ఊహాజనిత భావన అవుతుంది. (6) ఒక దేశం సమతౌల్య శక్తి కొరకు చర్యలు తీసుకుంటున్నదంటే, అక్కడ శక్తి అసమానత ఉందని గూడార్థం. కాబట్టి సమతౌల్య శక్తి భావన, శక్తి అసమానత లేక శక్తి వ్యత్యాసంపై ఆధారపడ్డదని తెలుస్తుంది. (7) సమాన శక్తిని సంపాదించే దేశం లేదా కూటమి కేవలం, అంటే అక్షరాల సమానశక్తిని పెంపొందించుకోవడం అనూహ్యం. అవతలి దేశం లేదా కూటమి కన్న ఎక్కువ శక్తినే సంపాదించుకోజూస్తుంది. అలా ఉంటేగాని తనకు రక్షణ లేదు అని గ్రహిస్తుంది. ఆ విధంగా సమతౌల్య శక్తికొరకు పాటుపడటమంటే ఎక్కువ లేక అధికశక్తి (More Power) కొరకు పాటుపడటం అనగా సమతౌల్య శక్తి అంటే అధికశక్తి అనే విడ్డూరమైన అర్థం వస్తుంది. (8) ప్రపంచ దేశాలు, సామాన్యంగా తమకు సంబంధించిన దేశాల దృష్ట్యా సమతౌల్యశక్తి (సమానమైన శక్తి) కొరకు చర్యలు తీసుకొంటాయి అనే అభిప్రాయంతో ఉన్నప్పుడు, సమతౌల్యశక్తి ఒక విధానం (Policy)గా స్ఫురిస్తుంది. (9) ఈ అర్థాన్నే మరింత బలపడిందిగా అనుకుని, అంతర్జాతీయ సంబంధాలలో సమతౌల్యశక్తి ఒక వ్యవస్థ (system)గా భావించేవారు ఉన్నారు. (10) సమతౌల్య శక్తి భావన వాస్తవిక పరిస్థితికి ఒక ప్రత్యేక లేదా అర్థం లాంటిది. అంటే అంతర్జాతీయ వ్యవస్థ ఏ దశలో లేక పరిస్థితిలో ఉందో తెల్పే చిహ్నం లాంటిది అనే అర్థం కూడా గ్రహించవచ్చు. ఇలా పలురకాల అర్థాలతో వాడుతున్న సమతౌల్య శక్తి భావన ఒక పదంకన్నా ఒక భావనగా విన్పించడంలో అతిశయోక్తి లేదు. అయితే పైన చెప్పుకున్న అర్థాలన్ని ముఖ్యంగా రెండు పరిస్థితులను సూచిస్తుంది. ఒకటి, ఈ భావన శక్తి విశ్లేషణ (Power Analysis) గురించి తెల్పుతుంది. రెండవది, ఆ శక్తి విభజన అసమానతలతో ఉండడంచే,

DDE BRAOU

నిజానికి దేశాలు అధిక శక్తి కోసం పాటు పడుతున్నాయని, ఈ పరిస్థితిలో పైన చెప్పిన వాటిలో ముఖ్యంగా మూడు అర్థాలు ప్రచారంలోకి వచ్చాయి. (1) రెండు దేశాలు సమతౌల్యశక్తి కల్గి ఉన్నాయి అనేప్పుడు రెండు దేశాలు (దాదాపు) సమాన శక్తిని కలిగి ఉన్నాయని అర్థం. (2) ఫలానా దేశానికి సమతౌల్య శక్తి ఉన్నదన్నప్పుడు, ఆ దేశానికి, మరొక సంబంధిత దేశంకన్న, అధిక శక్తి ఉందని అర్థం. అంటే ఆ దేశం ఏ దేశంతో చేరుతుంది అపుడు అక్కడున్న ప్రత్యర్థి దేశశక్తికి సమానమవుతుందని అర్థం. (మరోలా చెప్పాలంటే రెండు దేశాలలో బలహీన శక్తిగల దేశానికి తన శక్తిని జోడించి ఆ బలహీన పరిస్థితిని మారుస్తుంది.) ఈ అర్థం విడివిడి దేశాలకన్న కూటముల శక్తి దృష్ట్యా వాడతారు. (3) ఇక థామ్సన్ మరియు మార్గాంథో (Thamson and Morgenthau) లాంటి వారు సమతౌల్యశక్తి భావనను ఒక విధానం (Policy)గా చూస్తారు. (4) మరికొందరు మార్టిన్‌వైట్ (Martin Wight), ఎ.జె.పి. టేలర్ (A J P Taylor) లాంటివారు సమతౌల్యశక్తి భావనను ఒక వ్యవస్థ (system)గా చూస్తారు. (5) ఉడ్రోవిల్సన్ (Wooddrow Wilson) లాంటి ఆదర్శవాదులు సమతౌల్యశక్తి భావనకు ప్రాముఖ్యతే లేదన్నారు. వీరి ఉద్దేశ్యంలో సంస్థాపరమైన (Institutional), లేదా న్యాయ/రాజ్యాంగపరమైన (Constitutional or Legal) చర్యలు సమతౌల్యశక్తి భావన స్థానమునాక్రమిస్తాయని దృఢవిశ్వాసం. ఆదర్శవాదానికి విమర్శగా వాస్తవికవాదులు తమ వాస్తవిక వాదాన్ని చూపిస్తూ, అంతర్జాతీయ సంబంధాలలో శక్తిభావాన్ని సమతౌల్యశక్తి భావాన్ని గుర్తించుకోవడం వల్ల వచ్చే అనర్థాల గూర్చి విపులీకరించారు. ఉన్న పరిస్థితిని మెరుగుపర్చుకోవడం వేరు. ఆ పరిస్థితిని గుర్తించకపోవడం వేరు. ఉడ్రోవిల్సన్ దృష్టి వాస్తవికతకు దూరంగా ఉన్నందువల్ల నానాజాతి సమితి ఆశించినంత సఫలీకృతంగా వ్యవహరించ లేకపోయినదన్నారు. ఇన్ని అర్థాలున్న సమతౌల్యశక్తి భావనను ఒక 'సంధిగా', భావనగా కూడా చూపినవారు లేకపోలేదు. కాకపోతే ఆచరణలో భావన ప్రాముఖ్యత తగ్గలేదని అందరూ దాదాపు ఏకీభవిస్తారు.

BRAOU

7.4 సమతౌల్య శక్తి భావన ఊహలు (Assumptions)

క్విన్సీరైట్ (Quincy Wright) ప్రకారం ముఖ్యంగా ఐదు ఊహలున్నాయి. (1) ప్రతి దేశానికీ కొన్ని తప్పనిసరి లేదా ప్రధాన ప్రయోజనాలు (Vital Interests) ఉంటాయి– భౌగోళిక సరిహద్దుల రక్షణ, దేశరక్షణ, దేశ ఆర్థిక, రాజకీయ వ్యవస్థ పరిరక్షణ మొదలైనవి. అన్ని దేశాల ప్రయోజనాలు ఒకేవిధంగా ఉంటాయని భావించలేం. కాని దాదాపు అన్ని దేశాలకూ కొన్ని ప్రయోజనాలు అతి ప్రాధాన్యత వహించేవని వీటిని ఎలాగైనా అవసరమైతే యుద్ధం ద్వారానైనా పరిరక్షించుకోవాలనుకునే ప్రయత్నం, చర్య స్వాభావికమైంది, ఒక రకంగా తప్పని సరియైంది అనే భావన. (2) దేశ ప్రయోజనాలకు ముప్పు వాటిల్లిందా లేదా అన్న భావనను బట్టి సమతౌల్యశక్తి సాధనకు తగిన చర్యలకు పూనుకోవడం జరుగుతుంది. అనగా మొదటి ఊహను బట్టి, ఒకవేళ ఆపద వచ్చిందనో లేదా రావచ్చుననో భావించినపుడు సమతౌల్యాశక్తి సాధించడానికి చర్యలు త్వరితగతిన చేబట్టడం జరుగుతుంది. అలాకాక ప్రమాదమేమీ లేదని గ్రహించినపుడు అలాటి చర్యలు అంతగా చేపట్టకపోవచ్చు. (3) దేశ ప్రయోజనాలను, అవసరమైతే శక్తినుపయోగించి (ఆక్రమణ పద్ధతిలోనైనా) లేక శత్రువును ఓడించి అయినా పరిరక్షించుకోటానికి వెనుకాడబోము అనే హెచ్చరికలు లాంటివి ఇవ్వడం కూడ జరుగుతుంది. (4) వివిధ సంబంధిత, దేశాల శక్తిని అంచనావేసుకొని తనశక్తికి ఒక విధంగా అనుకూలత కల్గేటట్లు చూడటం కూడా సమతౌల్యశక్తి భావనను ఆచరించటానికి దారితీస్తుంది. (5) విదేశాంగ విధానాన్ని రూపొందించేందుకు శక్తి అంచనాలు ఉపయోగపడతాయని భావించటం. ఈ ఊహలు ఎంతవరకు వాస్తవం లేదా అంతర్జాతీయ సంబంధాలకు ఎంతవరకు మెరుగుపరుస్తాయి ; అని ప్రశ్నించుకుంటే సమాధానాలు పలురకాలుగా ఉంటాయి. వీటన్నిటికి ప్రధానమైనది ఒకటే- ఈ ఊహలకు ప్రతి దేశం ఇచ్చే ప్రాధాన్యత ఇంతవరకు అంతర్జాతీయంగా ప్రజాభిప్రాయం మద్ధతు లభిస్తుంది అని. అలాకాకుండా ప్రతి దేశం తన ఇష్టమొచ్చినట్లు ఇలాంటి ఊహలకు కల్పించుకునో, ఊహించుకునో (అతి భయం వల్లనైతేనేమి, అత్యాశవల్లనైతేనేమి,)

తగిన చర్యలు తీసుకుంటే అంతర్జాతీయ సంబంధాలు మెరుగుపడతాయనుకోవడం కష్టం. అలాగే సమతౌల్యశక్తి భావనమే అత్మాశ్రయ (Subjective) వ్యాఖ్యానం ఇచ్చుకుంటున్నారు అని (అనగా మిగిలిన దేశాలు వ్యాఖ్యానం కన్నా భిన్నంగా ఉందని) గ్రహించినపుడు, అంతర్జాతీయ దృష్టికి తీసుకొని రావలసిన అవసరం మిగిలిన దేశాలపై ఉంటుంది. ఇలా రెండు వైపులా జరిగినపుడు, రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో నాజీ జర్మనీ, ఇటలీ, జపాన్‌లలాగా సామ్రాజ్యవాదం, ఆక్రమణవాదం ఉద్భవించి, పెరిగి పెద్దదై, ప్రపంచ యుద్ధానికే దారితీస్తుంది. అంతేకాదు మరో విషయం కూడా గుర్తుంచుకోవాలి. అంతర్జాతీయ సంబంధాలు లేక విదేశాంగ విధానం కేవలం సమతౌల్యశక్తి ద్వారానే రూపొందించుకోవడం సాధ్యంకాదు. న్యాయం, చట్టం, నీతి, ప్రజాభిప్రాయం లేదా అంతర్జాతీయ మద్దతులాంటి విషయాలు కూడా చాలా ప్రాముఖ్యత వహించినవే. వీటికి బద్ధమైయున్న సమతౌల్యశక్తి లాంటి భావనకు కొంతైనా విలువ ఉంటుందేమో కాని కేవలం ఆ భావనను దానికొరకే చూడటం వల్ల లాభం కొంచమే. ఒక్క పరిస్థితిలో విదేశాంగ విధానపు సమతౌల్యశక్తి విధానానికి దేశీయ పరిస్థితికి అనుకూలత కుదరాలి. అలా లేకపోతే అనర్థాలు రావచ్చు. బహుశా ఆ విధంగా గ్రహించే బ్రిటన్, నాజీ జర్మనీ విధానాలకు ఎదురుచెప్పలేదని సమర్థించే వారు ఉన్నారు. లేదా ఎప్పటికప్పుడు ప్రమాద పరిస్థితి రాలేదుకదా అని భావించి తమ రక్షణ దృష్ట్యానే, అంటే ఆత్మాశ్రయ వ్యాఖ్యానంతో సమతౌల్యశక్తి భావనను చూసి మిగిలిన విపరీత పరిస్థితులను పట్టించుకోని ప్రమాదం రావచ్చు. ఇలా ఆలోచించినపుడు, సమతౌల్యశక్తి భావన ఒకరకంగా ఊహాజనితమేమో అన్పిస్తుంది, అదికూడా అతి భయం వల్లనో, లేక అత్యాశవల్లనో కల్గినదిగా. అందువల్లనే సమతౌల్యశక్తి భావనను ఒకటి లేక రెండు దేశాలు ఎలా అర్థం చేసుకున్నవో అనికాక అంతర్జాతీయంగా ఎలా చూడబడుతుంతో అనే అవగాహన చాలా అవసరం.

7.5 సమతౌల్యశక్తి - ఆచరించే విధాలు

BRAOU

ఆచరణలో సమతౌల్యశక్తి భావనను ముఖ్యంగా ఆరు రకాలుగా/పద్ధతులలో చూపడం తెలుస్తుంది.

1. ఆయుధీకరణ : ఎదుటి శక్తిని మించినది, అన్ని స్పర్థలు, ద్వేషాలు, శత్రుత్వం చివరకు యుద్ధానికి దారితీస్తాయి. కాబట్టి యుద్ధంలో విజయసాధనమే ఉపయోగపడేది. యుద్ధ సామాగ్రి ఆయుధాలు వీటి సేకరణ దేశశక్తిని పెంపొందించి స్థిరపరుస్తుంది. కాబట్టి ఈ పద్ధతి మిగిలిన పద్ధతుల కన్నా ప్రాముఖ్యత వహించింది. చాలావరకు అన్ని దేశాలు చేపట్టేది కూడా ఈ పద్ధతే. అలాగని ఈ పద్ధతికి సార్వత్రికత (Universality) ఉందని చెప్పలేం. కొన్ని పరిస్థితులలో ఒక దేశం నిరాయుధీకరణ విధానం, కొత్తగాగాని, ఎప్పటినుంచో అంటిపెట్టుకుని ఉండటంచే గాని, ఆచరించడంవల్ల కూడా దేశశక్తి పెంపొందే అవకాశం లేకపోలేదు. అలాటి పరిస్థితికి చెందింది అలీన విధానం (Non-alignment policy). అలాగే శాంతియుతమైన సహజీవన విధానం, అహింస, సత్యాగ్రహ విధానం మొదలైనవి ఈ కోవకు చెందినవే. కాకపోతే వీటిని ఆచరించే దేశాలు బహుకొద్ది, ఆదీ ఎలో నైతిక శక్తి ఉంటేగాని ఆచరించలేవు. ఎక్కువ దేశాలు యుద్ధాలకు ఉపయోగపడే సాధనాలను పెంపొందించే విధానాలే అవలంబిస్తాయి. (2) ఇంతకుమునుపు శతాబ్దాలలో ఎక్కువగా ఉన్న ఆక్రమణ, దురాక్రమణ విజయ యాత్రలు (conquests) మొదలైన వాటిద్వారా, సమతౌల్యశక్తిని సంపాదించుకో జూడటం ఇలా చేయటంలో ఒక్కొక్కప్పుడు ఆక్రమణ ఫలితాన్ని ఇంకొకరితో పంచుకోవాల్సిన పరిస్థితి రావచ్చు. మొదటి ప్రపంచ యుద్ధానికి మునుపే పోలెండు (Poland) నుండి, రష్యా (Russia), ప్రష్యా (Pressia), ఆస్ట్రియా (Austria) మూడు ముక్కల భూభాగాన్ని ఆక్రమించుకున్నాయి. (3) ఒక్కొక్క పరిస్థితిలో ఒక బలహీన దేశాన్ని తటస్థమండలంగా తయారుచేసికొనటం ఈ దేశం సామాన్యంగా రెండు ప్రత్యర్థుల/శత్రుత్వ దేశాల మధ్య నుండటం సంభవిస్తుంది. ఇలా బఫర్ దేశాలుండటంతో ప్రత్యర్థుల మధ్య శత్రుత్వం ప్రబలి యుద్ధానికి దారితీయటం తగ్గుతుంది. మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం పోలెండ్ రష్యా జర్మనీలకు మధ్య; బెల్జియం, హాలెండ్‌లు - ఫ్రాన్సు - జర్మనీల మధ్య; స్విట్జర్లాండు జర్మనీ, ఫ్రాన్స్,

ఇటలీ, ఆస్ట్రియాల మధ్య అలాటి బఫర్ రాజ్యాలుగా చేసుకోబడ్డాయి. కానీ ఒక్కొక్కప్పుడు ఈ బఫర్ దేశాలను ప్రత్యర్థులు పంచుకునే దుర్దశగూడ కలగవచ్చు. జర్మనీ, కొరియా, ఇండోచైనాల విభజనలు అలాంటివే. (4) కూటమిగా చెప్పడం సమతౌల్యశక్తిని సాధించుటకు మరొక పద్ధతి. 18వ శతాబ్దంలో పెద్ద దేశాలు లేదా సామ్రాజ్యాలు ఎక్కువ సంఖ్యలో ఉండేవి. ఆ విధంగా దేశాలు తమకు నచ్చిన కూటమిలో చేరుతూ దేశ ప్రయోజనాలను తీర్చుకొంటుండేవి. పెద్ద సామ్రాజ్యాల మధ్య స్పర్థలుండవచ్చునేగాని, యుద్ధాలు ఎక్కువగా జరుగవు. ఆ విధంగా శాంతియుత పరిస్థితులు నెలకొనే అవకాశం అలాంటప్పుడే ఎక్కువ ఉండేదని చాలామంది అభిప్రాయం. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచం ద్విముఖ (bipolar) కూటములుగా మాత్రమే విభజింపబడటంతో, దేశాలకు కూటములునెన్నుకునే స్వేచ్ఛ తగ్గటంవల్ల, కూటముల స్పర్థలు, కూటమి సభ్యులకు కూడా ప్రాకుతాయి. మరల బహుముఖ (multi polar) కూటములు వెలియటంతో పరిస్థితి కొంత మెరుగుపడిందని చెప్పొచ్చు. (5) సమతౌల్య శక్తిని సంపాదించుటకు మరో పద్ధతి 'జోక్యం' కలుగజేసుకోవటం. దేశప్రయోజనాల దృష్ట్యా ప్రత్యర్థులుగా ఉన్న దేశాలమధ్య సంఘర్షణలలో జోక్యం చేసుకొని, అటు తన కూటమితోనున్న దేశశక్తి ఇటు తన శక్తి పెరిగే విధంగా చూసుకోవటం వల్ల సమతౌల్యశక్తి ప్రత్యర్థి దేశభక్తి కన్న ఎక్కువగా ఉంటుంది లేదా కనీసం సమానం అవుతుంది. ఒక్కొక్కప్పుడు ఒక దేశం శత్రువుల/ప్రత్యర్థుల కూటమిలోకి పోకుండా చూడడంవల్ల కూడా సమతౌల్యశక్తి చేకూరుతుంది. గ్రీస్, కమ్యూనిస్టుల కూటమిలో పడకుండా బ్రిటన్ ప్రయత్నం తూర్పుయూరప్ దేశాలలో రష్యా ప్రభావం, లాటిన్ అమెరికాలో అమెరికా ప్రభావం, మధ్య ప్రాచ్య దేశాలలో యూరపు దేశాల ప్రభావం ఈ రకమైన జోక్యపు పద్ధతికి తార్కాణాలు. (6) శత్రు లేక ప్రత్యర్థి కూటమినుండి వాటి మిత్రులను విడదీసే పద్ధతి మరొకటి. దీనివల్ల కూడా సమతౌల్యశక్తి లభిస్తుంది. తన వలస దేశాలను ప్రత్యర్థి కూటమినుండి విడిపోయే చర్యలు రష్యా, తూర్పు యూరపుదేశాలు రష్యా కూటమినుండి విడిపోయేలా చర్యలు అమెరికా తీసికోవటం ఈ రకమైన పద్ధతికి ఉదాహరణలు. ప్రత్యర్థి కూటమిలోని సభ్యులు తమ వైపుకు రావడంవల్లగాని, అవతలి కూటమినుండి విడిపోయి తటస్థదేశంగా ఉండటం వల్లగాని ఒకదేశానికి సమతౌల్యశక్తి లభిస్తుంది. ఈ విధమైన పద్ధతులలో అనుకూలమైన సమతౌల్య శక్తిని సంపాదించే ప్రయత్నాలు వాస్తవంలో కన్పడతాయి. అయితే ఈ పద్ధతులు అందరికీ ఒకే విధంగా ఉపయోగపడ్డాయని చెప్పలేము. కానీ ఆచరించే ప్రయత్నాలు జరిగినట్లు మాత్రం చెప్పగలం. అందువల్ల ఒక దేశం సమతౌల్యశక్తిని కల్గి ఉండడంలో (అనగా కలయికతో ఇంకొకరి శక్తి మరొక ప్రత్యర్థితో సమానంగాని, ఎక్కువగాని అవటం) లోనే ఆ దేశానికి కీలక పాత్ర ఉన్నట్లు తెలుస్తుంది. ఇటువంటి పరిస్థితిలో ఉన్న, అంటే ఇలాటి సమతౌల్యశక్తి కల్గిన దేశాన్ని 'నవ్వుతున్న మూడవ వ్యక్తి (The laughing third party)'గా పేర్కొనడం జరిగింది. ఇలాటి సమతౌల్యశక్తి కల్గిఉన్న దేశపు కీలకపాత్ర దాదాపు అన్నివేళలా కన్పిస్తుంది. కారణం ఏమిటంటే, సమతౌల్య శక్తిద్వారా అధికశక్తిని పొందాలనే ఆకాంక్ష చాలా దేశాలలో ఉండటంతో, ఏ ఒక్కటీ అనుకున్నంత అధికశక్తిని పొందించలేదు. అంటే అన్ని దేశాలు, అన్ని కూటములు దాదాపు అటు ఇటుగ ఉంటాయి. అందువల్ల ఏ మాత్రం అధికశక్తి ఉన్న దేశమైన కొన్ని దేశాల దృష్ట్యా సమతౌల్యశక్తిని కల్గిఉంటాయి. పై పెచ్చు యిలాంటి దేశాలు సామాన్యంగా ప్రత్యర్థి దేశాలలో ఒకటిగా కన్నా ఆ పరిధికి వెలుపల ఉండే పరిస్థితిలో ఉంటాయి. ఇలా సమతౌల్య శక్తిగల లేదా సమానం చేయగల balance శక్తి సమతౌల్యశక్తి సిద్ధాంతానికి మూలమైంది, కీలకమైంది. కాని - కొన్ని దేశములు గూడ ఆ పాత్రను పోషించలేవు. అమెరికా రష్యాల మధ్య, ముఖ్యంగా ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఏ దేశం సమతౌల్యం చేయ(balance) కుండా ఉండలేకపోయింది. కొన్ని దేశాల మధ్య ఉండుట కొంతవరకు సాధ్యం. ఏ దేశమైనా శక్తి కారకముల దృష్ట్యా పటిష్టత కల్గి, భౌగోళికంగా ఒక వ్యాసనంలోనో లేక మరేవిధంగానైన శత్రు బేధ్యం కాని స్థానంలో నుండి సామాన్యంగా తగాదాలలో ఇరుక్కోని దేశంనకు సమతౌల్యశక్తి కల్గి ఉండే అవకాశముంటుంది. ఆలా ఉండబట్టే చాలాకాలం బ్రిటన్ ఒక సమతౌల్యశక్తి గల్గిన లేక బాలెన్సరుగా ఉండగలిగింది. కొంతవరకు, పరిమిత పరిధిలో మార్షల్ టిటో (Marshall Tito) డీగాల్ లాంటి వారు గూడ ఆ శక్తినే కలిగి ఉన్నారు.

BRASU

7.6 సమతౌల్యశక్తి భావన ఆవశ్యకత

ఇన్ని రకాలుగా ఆచరణలోనున్న సమతౌల్యశక్తి భావన ఆదర్శ పరిస్థితియైన శక్తి విభజనను సూచిస్తుందా లేదా వాస్తవ పరిస్థితియైన శక్తి విభజనను సూచిస్తుందా అన్న ప్రశ్న ఉదయిస్తూనే ఉంటుంది. ఇక్కడ ఆదర్శ పరిస్థితి అంటే ఊహాజనితమైన సమతౌల్యశక్తి కల్గి అన్ని దేశాలులేవు. కూటములు సంఘర్షణలు లేకుండా ఉండగల్గాలి. ఒకవేళ సంఘర్షణలు ఉన్నా సమతౌల్య శక్తి కలిగి ఉండడం చేత ఒకరినొకరు అధీనతలో ఉంచగల్గుతారు. కాని అలాటి పరిస్థితి వాస్తవంలో ఉండడం కష్టం. ఒకటి, రెండు శక్తికారకాలు దృష్ట్యా శక్తి విభజన సమానంగా ఉండవచ్చు. కాని అన్ని కారకాల దృష్ట్యా, అన్ని దేశాలకు శక్తి విభజన సాధ్యంకాదు అన్పిస్తుంది. అనగా ఆశించిన సమతౌల్య శక్తి విభజన కేవలం ఆచరణ సాధ్యంకాని ఆదర్శ పరిస్థితిని మాత్రమే సూచిస్తుంది అన్పిస్తుంది. మరోలా ఆలోచిస్తే వాస్తవిక శక్తి విభజన పరిస్థితిని సూచిస్తుందనిపిస్తుంది. ప్రత్యర్థుల దృష్ట్యా సమతౌల్యశక్తి కల్గి ఉండాలనే ప్రయత్నం తగిన చర్యలవల్లే, దేశాలు/కూటములు ఒకరకమైన హద్దులలో అనగా ఒకరినొకరు నియంత్రణ (Control) లో ఉంచగల్గుతున్నారని చెప్పవచ్చు. అంటే శక్తి విభజన వాస్తవంలో ఉన్నదంటే సమతౌల్యశక్తి దేశాలకు అందుబాటులో ఉన్నదన్నమాట.

సమతౌల్యశక్తి ఉండే శక్తి విభజన అటు ఆదర్శ పరిస్థితినిగాని ఇటు వాస్తవిక పరిస్థితిని గాక కేవలం ఒకరకమైన స్వయంచాలకమైనదిగాని లేక దానంతట అదే సమతౌల్యశక్తి నెలకొనుటయే ఈ అభిప్రాయం భావం. ప్రపంచ దేశాలు బహుముఖ కూటములుగా ఉండటంచే కూటముల మధ్య, దేశాల మధ్య పోటీలుండటంచే, అనగా సమతౌల్యశక్తి కొరకు పోటీ సార్వత్రికంగా ఉండటంచే దేశాలు ఎక్కువగా ఆలోచించి ప్రవర్తిస్తున్నట్లు అన్పించదు. యాంత్రికంగానే అనుకోకుండా సమతౌల్యశక్తికోసం పాటుపడతాయి. ఇదంతా ఏదో ఒక అదృశ్యశక్తి నడిపిస్తున్నట్లు అన్పిస్తుంది. (ఆడమ్‌స్మిత్, 'అదృశ్యహస్తం' invisible hand) మార్కెట్‌లో విధానాన్ని క్రమమైన పద్ధతిలో నడిపిస్తున్నట్లున్నది అని రాసినట్లు ఆర్‌నాల్డ్ టాయ్‌న్‌బీ (Arnold Toynbee), మార్టాన్ కప్లాన్ (Marton Kaplan)లు ఈ అభిప్రాయాన్నే వెలిబుచ్చారు. హెర్‌బర్ట్ బటర్ ఫీల్డ్ (Herbert Butter field) దీన్ని 'యాంత్రికంగా స్వయం సర్దుబాటు చేసుకోగల విధానం అన్నాడు. అయితే ఈ అభిప్రాయాన్ని కొందరు తోసిపుచ్చి, కొన్ని దేశాలు ఒక రకంగా బహుకొన్ని దేశాలే సమతౌల్య శక్తిని కల్గిఉండగలవు; లేక బాలన్సుగా ఉండగలవు ;అని వాదించారు. వారి ఉద్దేశ్యంలో బ్రిటన్‌లాగా సమతౌల్యశక్తి కలిగి ఉండటానికి తగిన స్వయం నిర్ణయాధికారం హరణం ఉండబట్టే అనే నమ్మిక. మిగిలిన దేశాలు స్వయంచాలనంపై నమ్మకముంచవచ్చనేమోగాని కొన్ని దేశాలు మాత్రం స్వయంవరణంపై ఆధారపడతాయని వక్కాణించాయి. చరిత్రలో నెపోలియన్‌లాంటివారు ఎలా సామ్రాజ్యాన్ని స్థాపించగలిగారు? అనే ప్రశ్న వేసుకొన్నప్పుడు స్వయం నిర్ణయం కృషి ఎంత అవసరమో, చరిత్ర వెనుక అదృశ్యశక్తిలా అది ఎలా దాగి ఉంటుందో తెలుస్తుంది.

సమతౌల్యశక్తి సూత్రం అమలు జరగడం పూర్తిగా అదృశ్యశక్తి వలన అనడంగాని, పూర్తి స్వయం నిర్ణయం-వల్లనవటంగాని అనుకోవడం సబబుకాదు. మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం పెద్ద సామ్రాజ్యాలు దేశాల రాజకీయాలను నిర్దేశించాయి, శాసించాయి. అలాగని చిన్న దేశాలకు స్వయం నిర్ణయాధికారాలు లేవని కాదు. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత సామ్రాజ్యాలు పతనమై వాటి స్థానే అనేక స్వతంత్ర దేశాలు వెలిశాయి. ఒకవైపు అంతర్జాతీయ వ్యవస్థ (organisation) ఉన్నా, సామ్రాజ్యవాదం బలపడి రెండవ ప్రపంచ యుద్ధానికి దారితీసింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచ రాజకీయాలు ద్విముఖ (Bi-Polar) రాజకీయంగా మారటం, ఆ తర్వాత బహుముఖ (Multi-Polar) రాజకీయాలుగా మారటం, సోవియట్ యూనియన్ పతనం తర్వాత రాజకీయాలు పూర్తిగా మరో మలుపు తిరగటం - ఇవన్నీ పూర్తిగా అదృశ్యశక్తివలన జరిగాయనుకోగలమా? లేక పూర్తి స్వయం

BRAOU

నిర్ణయం వలనే జరిగాయనుకోగలమా? ఒకటి స్థూలంగా మరొకటి సూక్ష్మంగా పనిచేస్తాయని తెలుసుకోవటం మంచిది అన్పిస్తుంది.

అణ్వాస్త్రాలనుపయోగించే ఈ ప్రస్తుత పరిస్థితులలో సమతౌల్యశక్తి భావనకు విలువగాని ప్రాముఖ్యతగాని లేదనే అభిప్రాయం కూడా చాలా బలపడసాగింది. ఎర్నెస్ హాస్ (Earnass Haas), అప్పాదొరై (Appadorai) లాంటి వారు ఈ అభిప్రాయాన్ని బలపరచారు. ఈ వాదం కొంతవరకు సరియైందే. అణ్వస్త్ర శక్తి ఉన్న దేశంతో మరో దేశం అణ్వస్త్ర శక్తితోనే పోటీ పడగలదుగాని మామూలు సమతౌల్యశక్తి సూత్రంతో కాదు. కానీ ఒకవేళ అణ్వస్త్ర శక్తిలో సమానత ఉన్నా, మిగిలిన రంగాలలో - ఆర్థిక, రాజకీయ, భావజాల, సాంస్కృతిక మొదలైన - పోటీ అణ్వాస్త్రాల వల్లకాదు. అప్పుడైనా సమతౌల్యశక్తి భావన అవసరం వస్తుందని భావించాల్సి ఉంటుంది. అంతేకాక అణ్వస్త్ర పోటీ ఎప్పటికీ ఒకేలా ఉంటుందనుకోవటానికి వీలులేదు. నిరాయుధీకరణ, లేదా ఆర్థిక పటిష్టత మొదలైన విధానాలు ప్రాముఖ్యత వహించినపుడు సమతౌల్యశక్తి ఉపయోగపడినంతగా మరో భావన, ముఖ్యంగా అణ్వస్త్ర నిరోధక భావన ఉపయోగపడదు. కాకపోతే అణుశక్తిని ఆర్థిక తదితర రంగాలను పటిష్టపరచేందుకు వినియోగిస్తే తప్పితే, యుద్ధరీత్యా మాస్తే సమతౌల్యశక్తి సూత్రమునకు లేదని భావించలేం. కూటములు ఏర్పరచడం, మిత్రులను కూడగట్టుకొనడం, శత్రు కూటమినుండి మిత్రులనేర్పరచుకోవడం లాంటి చర్యలు అతి తాత్కాలికమైన వనుకోవడం పొరపాటు అవుతుంది. అనగా సమతౌల్యశక్తి సంపాదించుటకు కూటములలో చేరడం, విడిపోవడం వగైరా చర్యలు తమకిష్టమొచ్చినట్లు దేశాలు చేయలేవు అన్పిస్తుంది. మిత్రుత్వం, శత్రుత్వం, కూటమిని చేరడం, విడిపోవడం జరగటానికి తగిన సమయం, కారణం, పరిస్థితుల ప్రోత్సాహంలాంటివి అవసరం. అవి లేకుండా వెనువెంటనే కూటములలో కూడా చర్యలు సాధ్యపడవు. నమ్మిక, అపనమ్మికలు తాత్కాలికములుగ ఉపయోగించుకోచూచినా అది ఒక విధంగా తన్నుతాను గాని మరొకరిని గాని మోసము చేయటంలాంటిదే. జర్మనీ, రష్యాలు మైత్రి కుదుర్చుకున్న వెంటనే యుద్ధం వచ్చింది. ఆ విషయం రెండు దేశాలకు తెలుసునని గూడ మిగిలిన దేశాలు తెల్సుకున్నాయి. ఆర్గెనిస్కీ (Orgenski) భావించినట్లు, అంతర్జాతీయ రాజకీయాలు కేవలం చెస్ (Chess) ఆటలాంటిది కాదు. ఆర్థిక, మానసిక సంబంధాల బంధాలుంటాయి.

కూటమి కట్టడం చాలావరకు అవసరం. లాభంపై ఆధారపడ్డా, కొంతవరకు ఒక విధానం (Policy)గా చూడవలసి వస్తుంది. ఇష్టమొచ్చినట్లు కూటమిని మార్చుటం కొన్ని తెగలకే తగును. (సమతౌల్యశక్తి కల్గి ఉన్న దేశాలకు) బ్రిటన్, అమెరికాలు సమతౌల్యశక్తిని కల్గి ఉండుటచే, వాటి అవసరం మిగిలిన దేశాలకు ఎక్కువ ఉండుటచే, కూటముల స్వరూపాన్ని గూడ నిర్దేశించగల్గాయి. రెండవ ప్రపంచయుద్ధం వరకు, ప్రస్తుత పరిస్థితుల్లోని ఉదాహరణ, ఇంతకుమునుపు అమెరికా పాకిస్తాన్‌ల సంబంధాలు, ఇండియా సోవియట్ యూనియన్‌ల సంబంధాలకు సరితూగినట్లుండేవి. ఇప్పుడు అమెరికాకు పాకిస్తాన్‌కన్న ఇండియా దగ్గర అయిందని చెప్పడం అతిశయోక్తి కాదు.

అసలు కూటమి (alliance)ని కట్టడం చాలా రకాలుగా జరగవచ్చు. సమతౌల్యశక్తిని సంపాదించడానికి ఆయుధీకరణలాంటి పద్ధతులలో శక్తిని సంపాదించి మిగిలిన దేశాలతో కూటమి కట్టవచ్చు. పెద్ద దేశాల కూటమిలో చేరి సమతౌల్యశక్తి సంపాదించవచ్చు. శత్రు కూటములనుండి తన శత్రువులను లేక మిత్ర కూటములనుండి తన శత్రువులను విడదీసి ఒక దేశం సమతౌల్య శక్తి సంపాదించవచ్చు. ఇలాటి పద్ధతులు దీర్ఘకాలమునకు సంబంధించినవే కాని త్వరితగతిలో మారేవికాదు. ఏదైనా ఒక పెద్ద మార్పు అంతర్జాతీయ స్థాయిలో వస్తే, ఉదాహరణకు, సోవియట్ యూనియన్ పతనం, కూటమి, స్వరూపాలు త్వరితగతిలో మారవచ్చు. కానీ అలాటి పెద్ద మార్పులు గూడ వెంట వెంటనే రావు. అలాగని కూటమి కట్టడం మిత్ర రాజ్యాలనేర్పరచుకోవడం ఎల్లప్పుడు ఒకే విధంగా స్థిరంగా ఉంటుందని కాదు. కూటమి అన్నది సమతౌల్యశక్తి భావనలు ఒక భాగం, ఒక పద్ధతి. ఒకవేళ కూటమి అన్నది సమతౌల్యశక్తి దృష్ట్యా కాకుండా చూచే పద్ధతి కదా? అని అడగవచ్చు. ప్రస్తుత పరిస్థితులలో

SRAOU

ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల దృష్ట్యా ఇదే వాదన వస్తున్నది. ఆర్థిక విధానమే దేశ పురోగతికి పునాది అని నమ్మి, ఆర్థిక విషయాలలో సహాయ సహకారాలకు వీలు కల్పించే సంబంధాలు కూటమి కిందకి వచ్చినా, కూటమి అర్థం తేలికపడుతుంది. ఈ విషయం మరల ఈ భాగం చివరిలో చూస్తాం.

ఇప్పటివరకు సమతౌల్యశక్తి ప్రాముఖ్యత గూర్చి అనుకూల ప్రతికూల అభిప్రాయాలను చర్చిస్తూ, భావన ప్రాముఖ్యత పోలేదని గ్రహించాం. ఇపుడు సమతౌల్య శక్తి సూత్రమును ఆచరించడంలో లాభ నష్టముల గూర్చి తెల్సుకుందాం. సమతౌల్య శక్తి సూత్రములను ఆచరించటంలో చిన్న దేశాలకు స్వతంత్రతను, బాగా పరిరక్షించుకోవచ్చు. అలాకాక పూర్తిగా ఒక పెద్దదేశంపై ఆధారపడిన, తన స్వయం నిర్ణయం, వరణములు తగ్గే అవకాశముంది. ఇక సమతౌల్య శక్తిని సంపాదించాలనే దేశముల మధ్య పోటీ ఉంటుంది కానీ యుద్ధాలు జరిగే అవకాశం తక్కువ ఉంటుంది అని చెప్పవచ్చు. అయితే ఈ రెండు విధాలైన లాభాలకోసం కూటమిలో సభ్యదేశమైనను లాభం పొందే అవకాశముంది. ఎందువలన అంటే ఒక్కొక్కప్పుడు ఒక పెద్దదైన, సమతౌల్యశక్తి కల్గిన దేశం అండ, అభయంలో స్వయంకృషికన్నా అత్యవసరం అనచ్చు.

సమతౌల్య శక్తి యుద్ధాలను తగ్గిస్తుంది అన్న విషయంపై అనుకూల, ప్రతికూల వాదనలున్నాయి. జాన్ హెర్జ్ (John Herz) మరియు ఎర్నెస్ హాస్ (Earness Haas)లాంటివారు సమతౌల్యశక్తి లేని 18వ శతాబ్దంలో శాంతి ఎక్కువగా ఉన్నదంటే, హెన్రీ కిసింజర్ (Henry Kissinger) లాంటివారు, 19వ శతాబ్దంలో సమతౌల్యశక్తి సమర్థవంతంగా పనిచేసిందన్నారు. సమతౌల్య శక్తివల్ల శాంతియుతమైన కాలం నెపోలియన్ యుద్ధాల అనంతరంనుండి మొదటి ప్రపంచ యుద్ధం మొదలువరకు (అనగా 1815 నుండి 1914 వరకు). ప్రసిద్ధి చెందిన చరిత్రకారుడు ఇ.హెచ్. కార్ (E.H. Carr) గూడ 19వ శతాబ్దంలో సమతౌల్యశక్తి వల్ల శాంతి నెలకొంది అని వక్కాణించారు. కాని ఈ వాదనను ఒప్పుకొనని వారున్నారు. నెపోలియన్ కాలంలో బ్రిటన్, ఫ్రాన్సులు సమానమైన శక్తిని కల్గి ఉండటంచేత, నెపోలియన్ తర్వాత ఫ్రాన్సు శక్తికి సమానంగా బ్రిటన్, ప్రష్యా, రష్యా ఆస్ట్రియాలు కలిసి నిలిచాయి. 1815 నుండి 1914 వరకు బ్రిటన్ యూరప్‌లోను, ప్రపంచ దేశాలలోను శక్తివంతమైన దేశంగా నిలిచింది. 19వ శతాబ్దం మధ్యకాలంలో జర్మనీ ఫ్రాన్సుకు సమానంగా, ఎదురుగా నిలిచింది. ఆ తర్వాత ఫ్రాన్సు, రష్యాల శక్తికి జర్మనీ, ఇటలీ, ఆస్ట్రియాల శక్తి సమానమైంది. ఆ విధంగా సమతౌల్యశక్తి సిద్ధాంతం అమలులోనుండుటచే శాంతియుత వాతావరణం నెలకొనుటకు వీలు కల్గిందని సమతౌల్యశక్తి భావనను సమర్థించే వారి అభిప్రాయం. మరికొందరు 1815-1914 వరకు బ్రిటన్ సమతౌల్య శక్తి కల్గిన దేశంగా ఉండక ప్రపంచ దేశాలను తన ఆధ్వర్యంలోకి తెచ్చుకునే స్థితిలో లేదు. అనగా సమతౌల్య శక్తిని సంపాదించాలనే చర్యలు తీసుకుంటున్న దేశాలతో సమతౌల్యశక్తి కల్గిన దేశంగా వ్యవహరించక తప్పలేదు. అనగా 1815-1914 కాలంలో బ్రిటన్‌కు అధికశక్తి ఉండుటచే అనుకునే కన్నా సమతౌల్యశక్తి కల్గి ఉండుటయే శాంతియుత వాతావరణానికి కారణం అని భావం. కాని ఒక విధంగా, బ్రిటన్ అధికశక్తి మిగిలిన దేశాల సమతౌల్యశక్తిని అధికశక్తిని కాకుండా చూసింది. ఆ విధంగా బ్రిటన్ మిగిలిన దేశాలమధ్య ఆ శక్తి అసమానత నెలకొంది అన్పిస్తుంది. ఇలా చూస్తే 1815-1914 మధ్య కాలంలో శక్తి అసమానత వలనే శాంతి నెలకొంది అనిపిస్తుంది. ఈ అభిప్రాయం రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలోని శాంతికి గూడ సరిపోతుంది. మిత్రరాజ్యాల (Allies) అధిక శక్తి వలనే రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో శాంతి నెలకొంది. ఈ విధంగా ఆలోచించి ఆర్గాన్‌స్కీ 'సమతౌల్యశక్తి ఉన్న కాలం యుద్ధాలలో, అధికశక్తి ఉన్న కాలం శాంతితోను ఉన్నదని పేర్కొన్నాడు'. లయితే ఈ అధిక శక్తి దేశాల కన్న ఒక సంస్థకుంటే మంచిదని నానాజాతి సమితిని స్థాపించడం జరిగింది. అక్కడ కొన్ని దేశాలే అధికశక్తిని నిరూపించుకున్నాయేకాని, సంస్థాపరంగా చూపించే పరిస్థితి రాలేదు.

సమతౌల్యశక్తి గతకాలం దృష్ట్యా కానీ భవిష్యత్కాలం దృష్ట్యా కానీ ఎంతవరకు ఉపయోగకరంగా ఉంటుందన్న ప్రశ్న తరచు వస్తూనే ఉంటుంది. కొందరు ఏకాలంలోనైనా సమతౌల్యశక్తి ఉపయోగకరంగా ఉంటుందంటారు.

BRAOU

మరికొందరు గత కాలంలో ఉపయోగపడి ఉండవచ్చునుగాని రాబోయే కాలానికి ఉపయోగం లేదు అని భావిస్తారు. రెండవ అభిప్రాయం దృష్ట్యా మొదటి అభిప్రాయాన్ని పరిశీలించవచ్చు. రాబోయే కాలానికి సమతౌల్యశక్తి ఉపయోగం లేదు అనడానికి కారణాలు ముఖ్యంగా - (1) 1914కు మునుపులాగా, బ్రిటన్‌లాగా సమతౌల్య శక్తి గల్గిన దేశం ఉండడం కష్టం. (2) బహుధ్రువ వ్యవస్థ కూడా 1914నకు పూర్వమున్నది లాంటిది అందుబాటులో ఉండడం కష్టం. (3) అంతర్జాతీయ సమాజంలో కులీన సమాజాలన్నీ దేశాలుగాఉండటంతో కష్టం మొదలైనవి. అనగా అంతర్జాతీయ రాజకీయ వాతావరణం పూర్తిగా మారింది అనే అభిప్రాయానికి రావటంవల్ల సమతౌల్యశక్తి ఉపయోగకరం కాదు అనే వాదన వెలువడింది. ఈ వాదనలో సమర్థనీయ అంశాలు లేకపోలేదు. ప్రజాస్వామ్య స్థాపనే ముఖ్యమని భావించే ఈ ప్రస్తుతకాల పరిస్థితులలో పాలకులు (ప్రభుత్వాలు) ప్రజాభిప్రాయానికి తల ఒగ్గాల్సిందేగాని సిద్ధాంతరీత్యా కొన్ని సూత్రముల నాచరించడం కష్టసాధ్యమవుతున్నది అన్నది వీరి నమ్మిక.

7.7 ముగింపు

సమతౌల్యశక్తి కూటమి లేదా భద్రతా కూటమి ఈ రెండు ఒకదానికొకటి పరస్పర సంబంధమున్న భావనలు. ఈ రెండింటినీ ఒక భావన కిందే చూడవచ్చు. అనగా సమతౌల్యశక్తి భావనద్వారా కూటమిని గూర్చి, కూటమిని ఏర్పరచటమనే భావనద్వారా సమతౌల్యశక్తిని గూర్చి తెలుసుకొనవచ్చు. సమతౌల్యశక్తి అన్న భావన స్థూలంగా ఒక అర్థాన్నిస్తున్నట్లు కన్పించినా దానిలో పలు అర్థాలు, కొన్ని అనుకూలమైనవి కొన్ని ప్రతికూలమైనవి ఉన్నట్లు మూశాం. సమతౌల్యశక్తి భావనను, ఒక సూత్రంగా లేదా విధానంగా కొన్ని రకాల, పద్ధతులలో ఆచరణలో చూపించవచ్చునో కూడా తెలుసుకున్నాం. ఇకపోతే సమతౌల్య శక్తి ఆవశ్యకత గూర్చి తెలుసుకొనటంలో మాత్రం ఒక సాధారణ అభిప్రాయం లాంటిది ఉన్నట్లు కన్పించదు. అక్కడ ఉన్న భిన్న, విభిన్న అభిప్రాయాలు వెలువడ్డాయి. వాటిని బట్టి తెల్సిందేమిటంటే, సమతౌల్యశక్తి భావన పూర్తిగా ఉపయోగపడుతుందనిగాని, పూర్తిగా ఉపయోగపడదని గాని చెప్పటం కష్టం. సమతౌల్య శక్తిని అధిక లేక అత్యధిక శక్తిగా తీసుకొంటే అలాంటి పరిస్థితి ఇప్పుడు మారింది. ద్వి ధ్రువ రాజకీయ పరిస్థితి గూడ మారి బహుధ్రువ రాజకీయాలు వచ్చాయి. కాని, అలాగని ఏ కొన్ని దేశాలకైన అధికశక్తి (సాపేక్షమైనదే) లేదు అని చెప్పలేం. అనగా రిచర్డ్ రోజ్‌క్రేన్స్ (Richard Rosecrance) చెప్పినట్లు 'ద్వి-బహుధ్రువ' రాజకీయ పరిస్థితిలో సమతౌల్యశక్తి అర్థాలను మార్చుకుంటూ ఉపయోగపడుతూ ఉంటుంది. 'ద్వి-బహు ధ్రువ రాజకీయాలు కలిసే పనిచేస్తుంటాయి.' అనగా సమతౌల్యశక్తి కూడా తగువిధంగానే ఉపయోగపడుతూ ఉంటుంది. బహుధ్రువ సంబంధమైన సమతౌల్యశక్తి (సమానమైందిగా) ద్విధ్రువ సంబంధమైన సమతౌల్యశక్తి అధికమైందిగా రెండు ఆచరణలో కన్పించతగినవే. దీన్నిబట్టి కూటమి ఖచ్చితమైనది, స్థిరమైనదిగా ఒకప్పుడు కన్పించితే కేవలం తాత్కాలికమైందని గూడా అన్పిస్తుంది. ఆర్థిక విషయాలలో సహాయ సహకారాల దృష్ట్యా చూసినప్పుడు కూటమి తాత్కాలికమైంది. భావజాల సంబంధమైనదిగానో లేక సైనిక రక్షణ సంబంధమైనదిగానో దీర్ఘకాలికమైంది. కాబట్టి విదేశ సంబంధాలు అన్నీ ఒకే స్థాయిలలో ఒకే రంగానికి సంబంధించినవి కాదు కాబట్టి, రెండు రకాల కూటమిని అవలంబించవచ్చు. అలాగని రహస్య ఒడంబడికలతోనో, వంచనలతోను ఉండాలనికాదు. ఉదాహరణకు, భావజాలంలో ఒకేదేశ ప్రభావంలో ఉన్న, ఆర్థికంగానో లేక మరో రంగానికి సంబంధించిన మరో దేశంతో సంబంధాలు పెంపొందించుకునే పరిస్థితి ఉన్నప్పుడు కూటమి అర్థంలో సౌఖ్యత, సరళత ఉంటాయి. కూటమి కేవలం రక్షణ లేక భద్రత దృష్ట్యానేకాక, అంతర్జాతీయ సహాయ, సహకారం దృష్ట్యా చూడబడుతుంది. ఇలా చూసినప్పుడు, సమతౌల్యశక్తి, కూటమి భావనలు ప్రాముఖ్యత కాదా, అవశ్యకత ఉందా లేదా అనే ప్రశ్నలను ఏ అర్థంలో, ఏ లక్ష్యంతో ఉపయోగించవచ్చునన్న ప్రశ్న రావటం ఎక్కువ ఉపయోగకరమైనదేమో అని అనిపిస్తుంది. అధ్యయనం, ఆచరణల దృష్ట్యా ఈ భావనలోని సూక్ష్మార్థాలను అవగాహన చేసుకోవటం చాలా అవసరం.

- బి.ఎస్.ఆర్. ఆంజనేయులు

BEGOU

7.8 చదువదగిన పుస్తకాలు

1. Hans J. Morganthau : Politics Among Nations
2. Mahendra Kumar : Theoritical Aspects of International Politics

7.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

ఈ క్రిందివానికి 30 పంక్తులలో వ్యాస సమాధానాన్ని రాయండి.

1. సమతౌల్యశక్తి అనగానేమి? దాని ఆవశ్యకతను వివరించండి?
2. సమతౌల్యశక్తిని ఎన్నిరకాలుగా ఆచరించవచ్చు. కూటమి ఏర్పరచటంలో సమతౌల్యశక్తి ఏ విధంగా ఉంటుంది?
3. సోవియట్ యూనియన్ పతనానంతరం సమతౌల్యశక్తిని ఏ విధంగా అర్థం చేసుకోవాలో చెప్పండి?
4. "అణ్వస్త్ర యుగంలో సమతౌల్యశక్తి మరో రూపంలో ప్రత్యక్షమైంది". చర్చించండి?
5. 'సమతౌల్యశక్తి 1815-1914 మధ్య కాలానికి సంబంధించిందే కాని ప్రస్తుత కాలానికి సంబంధించింది కాదు' చర్చించండి.

BRAOU

భాగం - 8 సమిష్టి భద్రత

విషయక్రమం

8.1 లక్ష్యాలు
8.2 పరిచయం
8.3 సమిష్టి భద్రత అంటే ఏమిటి
8.4 సమిష్టి భద్రత భావన
8.5 సమిష్టి భద్రత - సంస్థాపరమైన చర్యలు
8.6 సమిష్టి భద్రతకు కావాల్సిన ఊహనములు
8.7 సమిష్టి భద్రత - ప్రాముఖ్యత
8.8 ముగింపు
8.9 చదువ దగిన పుస్తకాలు
8.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

8.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు సమిష్టి భద్రత అంటే ఏమిటి, సమిష్టి భద్రత భావన, సంస్థాగతమైన చర్యల ప్రాముఖ్యతను బాగా వివరించగలుగుతారు

BRAOU

8.2 పరిచయం

సమిష్టి భద్రత భావన అంతర్జాతీయ సంబంధాలలో చాలా ప్రాముఖ్యత వహించింది. సామ్రాజ్యవాదం, బలప విధానం, కొంతవరకు సమతౌల్యశక్తి భావనలు ఎంత ప్రాముఖ్యత వహించినవైనా వాటి స్వరూపాలు, అర్థాలు చాలావరకు మారిపోయాయి. సమిష్టి భద్రతా భావన ప్రస్తుత కాలంలో ఇంకా ప్రాముఖ్యత ఉన్న భావనలలో ఒకటి. అయితే ఈ భావనకూడా అర్థంలోనో, స్వరూపాలలోనో మార్పు వచ్చిందని ఇంకా మార్పు వస్తుందనే అభిప్రాయంకూడా నెలకొంది.

దేశానికి భద్రత లక్ష్యం. ఆ లక్ష్యసాధనకు సాధనాలు శక్తి లేక ఒత్తిడి ఉపయోగపడతాయి. కానీ ఇవి కేవలం ఆంతరంగికంగా, అనగా దేశంలోనే ఉపయోగపడతాయి. విదేశాంగ విధానంలో, అనగా ఏ దేశాలమండైనా భద్రతకు దేశశక్తి ఒక్కటే అన్ని వేళలా సరిపోదు. ఆ విధంగా ఇతర దేశాల దురాక్రమణ మొదలైన విపత్తులనుండి భద్రత, రక్షణ కల్గాలంటే ఆపద తెచ్చిన శక్తికన్నా ఎక్కువ శక్తితో ఎదుర్కోవలసి ఉంటుంది. అంటే ఆపద తెచ్చే దేశశక్తి కన్న ఎక్కువ శక్తితో ఆ దేశాన్ని ఎదుర్కొని, ఆశించిన సత్ఫలితంకన్న నష్టమెక్కువ కల్గించగలగాలి. అప్పుడే ఒకదేశం మరొక దేశంపై దండెత్తడానికి జంకుతుంది. అలా అంతర్జాతీయ స్థాయిలో శక్తితో భద్రత కల్పించుకోవాలంటే అవసరమైంది సమిష్టి శక్తి. ఒక దేశంలో శక్తినుపయోగించటానికి సైన్యం పోలీస్‌లాటి శక్తి ఉంది. అంతర్జాతీయంగా మరొక దేశాన్ని ఎదుర్కొనటానికి దేశ సైన్యం చాలుతుందని నమ్మకంలేదు. నమ్మకముండినా ఎంతో కష్ట నష్టాలతో కూడినది. అదే కొన్ని దేశాలు కలిసి ఎదుర్కొంటే భద్రత సులభంగా కలుగుతుంది. ఆ విధంగా సమిష్టి శక్తితో భద్రతను సంపాదించడం సమిష్టి భద్రతగా పేర్కొంటారు. సమిష్టి భద్రత అంతర్జాతీయంగా న్యాయం, క్రమం, స్థిరత్వాన్ని (Law, Order and Stability) స్థాపించడానికి గల మార్గం. ఒక్కమాటలో చెప్పాలంటే అంతర్జాతీయంగా దేశభద్రత లక్ష్యాన్ని సాధించటానికి సాధనం ఈ సమిష్టి భద్రత అనే భావన.

అయితే సమిష్టి భద్రత ఒక్కటే సాధనంకాదు. నిరాయుధీకరణ, శాంతియుత పరిష్కారమార్గాలు కూడా సాధనాలే. అయితే సాధనాలే ఒక పెద్ద లక్ష్యాన్ని సాధించగల్గేవయితే (వాటి ద్వారానే సాధించగలమనుకున్నప్పుడు) వాటిని దృక్పథం (approaches)గా పేర్కొంటాము. ఆ విధంగా సమిష్టి భద్రత కేవలం ఒక సాధన మాత్రమే కాదు. ఒక దృక్పథం గూడ. మార్గంథో మాటల్లో చెప్పాలంటే సమిష్టి భద్రత భావన ఒకరికోసం అందరు, అందరికోసం ఒక్కరు (One for all All for one) అనే సూత్రంలాంటిది.

8.3 సమిష్టి భద్రత అంటే ఏమిటి

సమిష్టి భద్రత కేవలం అంతర్జాతీయంగానే ఆవశ్యకత ఉన్నది అనుకోకూడదు. దేశభద్రతకు కూడా న్యాయం, క్రమం, స్థిరత్వం (Law, Order and Stability)కి దోహదపడుతుంది. ఆ విధంగా సమిష్టి భద్రత భావన ఎంతో కీలకమైంది. కాబట్టే చాలా ప్రాముఖ్యత వహించిన భావనగా నిలిచింది. ఒక విధంగా చూస్తే మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం అమలులో ఉన్న సమతౌల్యశక్తి స్థానంలో యుద్ధానంతరం సమిష్టి భద్రత అమలులోకి వచ్చింది. సమతౌల్యశక్తి ఆచరణ బాధ్యత వ్యక్తిగత దేశాలదయితే, సమిష్టి భద్రత ఆచరించే బాధ్యత కొన్ని దేశాల సమిష్టి కృషి. ఈ సమిష్టి కృషి గూడ వ్యవస్థాపక (**Organisational**) రూపంలో మొదలైంది. సమిష్టి భద్రత భావన ప్రాకృతిక రూపం మొదటి ప్రపంచ యుద్ధానికి ముందే మొదలైంది. సాధారణంగా సమిష్టి భద్రత భావన 1902లో థియొడోర్ రూజ్‌వెల్ట్ మాటలలోనే వెలువడిందని చెబుతారు. "ప్రపంచ రక్షణ బాధ్యత నాగరిక దేశాలపై ఉన్నది. తర్వాత ముఖ్య ఘట్టం, యుద్ధ సమయంలోనే హేగ్ వద్ద స్థాపించబడ్డ 'అంతర్జాతీయ అస్సోసియేషన్'. అమెరికా మొదలైన పెద్ద దేశాలలో శాంతి స్థాపనకోసం కొన్ని సమిష్టి భద్రత భావనను ప్రభావితం చేయడానికి తగిన చర్యలు తీసికొనుటకు స్థాపించబడ్డాయి. ఇలాంటి చర్యలన్నింటిలోకి ఉడ్రోవిల్సన్- 14 సూత్రాల పథకం, దానిలో ఆఖరి సూత్రం ప్రకారం అంతర్జాతీయ వ్యవస్థనొకదానిని స్థాపించి (నానాజాతి సమితి - League of Nations) దాని ద్వారా సమిష్టి భద్రతను ఏర్పరచుకునే చర్యలు ముఖ్యమైనవి. 1919 పారిస్ శాంతి పరిష్కార ఒప్పందాలన్నింటిలోను సభ్యదేశాలన్నీ మొదటి ప్రపంచ యుద్ధానికి కారకాలైన దేశాలు తప్పనిసరిగా ఈ అంతర్జాతీయ సంస్థ, నానాజాతి సమితి ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రపంచంలో ఎక్కడ దురాక్రమణ జరిగినా, మిగిలిన సభ్యదేశాలన్ని సమిష్టిగా దురాక్రమణకు గురియైన దేశానికి భద్రత కల్పించాలని, అందుకు అంగీకరిస్తున్న నిబంధనలు పొందుపరచబడ్డాయి. నానాజాతి సమితి తర్వాత, ఆనగా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, ఐక్యరాజ్య సమితి స్థాపనలోని ముఖ్యోద్దేశం కూడా ఈ సమిష్టి భద్రత సాధించాలనే.

8.4 సమిష్టి భద్రత భావన

సమిష్టి భద్రత అనే భావన కొన్ని ఊహనములపై ఆధారపడ్డది. (1) యుద్ధాలు తప్పనిసరిగా జరుగుతాయి, కాబట్టి వాటిని ఎదుర్కొనవలసి ఉంది. (2) యుద్ధాలను ఆపడం అనేది అధికశక్తిని కూడదీసుకోవడంతో కూడిన పని. అంటే సమిష్టి భద్రత భావనలో, యుద్ధం తప్పనిసరి కాబట్టి, దాన్ని ఎదుర్కొనడానికి అధికశక్తి అవసరం అనే అర్థం వస్తుంది. మరోలా చెప్పాలంటే అంతర్జాతీయ సంబంధాలలో, వాస్తవిక వాదం ప్రకారం, యుద్ధాలను తప్పించడం అసాధ్యం కాబట్టి శక్తిద్వారా వాటిని నియంత్రణ (Control)లో నుంచడం అనే అభిప్రాయాన్ని సమిష్టి భద్రత భావన బలపరచినట్లు అవుతుంది. అయితే శక్తిని నియంత్రణలో ఉంచడానికి సమతౌల్యశక్తి, ప్రపంచ ప్రభుత్వా (World Government)లు కూడా ఉపయోగపడతాయి. అంటే శక్తిని నియంత్రణలో ఉంచడానికి సమతౌల్యశక్తి, సమిష్టి భద్రత, ప్రపంచ ప్రభుత్వం మూడు సాధనాలు లేదా మార్గాలు. సమతౌల్యశక్తి భద్రత బాధ్యతను వ్యక్తిగత దేశాలపైఉంటే, ప్రపంచ ప్రభుత్వం తానే పూర్తి బాధ్యత వహిస్తుంది. ఈ రెంటికీ మధ్యస్థంగా సమిష్టి భద్రత - కొన్ని దేశాలు దురాక్రమణ దేశశక్తిని నియంత్రణలో ఉంచడం. ప్రపంచ ప్రభుత్వం ఇంకా ఒక విధంగా కేవలం

BRAOU

ఊహాజనిత భావనే కానీ వ్యవస్థాపకస్థాయికి చేరలేదు. దానికి కారణం, ముఖ్యంగా, ఏ దేశం తన సార్వభౌమాధికారం వదులుకోలేకపోవటమే. ఇక సమతౌల్యశక్తి కొన్ని శతాబ్దాల క్రితం బాగా ఉపయోగపడింది కానీ ప్రస్తుత కాలంలో పూర్తిగా ఉపయోగపడుతుందన్న నమ్మకం లేదు. అందువల్ల సమిష్టి భద్రతకు ప్రాముఖ్యత పెరిగింది.

సమిష్టి భద్రత రెండు రకాలుగా సాధించవచ్చు. ఒకటి, వ్యవస్థాపరంగా, రెండవది, కొన్ని దేశాల సమిష్టి కృషి ఫలితంగా. వ్యవస్థాపరంగా అంటే అంతర్జాతీయ సంస్థల (నానాజాతి సమితి, ఐక్యరాజ్య సమితి ముఖ్యంగా)ద్వారా. అలాకాక కొన్ని దేశాలు, తమకు సంబంధించిన సమస్య లేదా ఆపద దృష్ట్యా, ఒక సమిష్టి కృషిని సల్పడం, దీన్నే సమిష్టి రక్షణ (Collective Defence) అంటారు.

అంతర్జాతీయ సంస్థద్వారా సమిష్టి భద్రత ఎక్కువ సానుకూలంగా ఉంటుంది. అంతర్జాతీయ సంస్థలో సభ్యదేశాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అందువల్ల సమిష్టి కృషికి తగిన బలం, ఫలితం ఉంటుంది. ఆ విధంగా నానాజాతి సమితికన్న ఐక్యరాజ్యసమితి సమిష్టి భద్రత ఎక్కువగా సమకూర్చగలదనే నమ్మకం కల్గింది. సంస్థాపరమైన సమిష్టి భద్రత ఏకాంత విధానంనకు వ్యతిరేకమైంది. సమతౌల్యశక్తి దృష్ట్యా అధికశక్తి ఉన్న దేశాలకే ఏకాంత విధానం కొంతవరకు ఉపయోగపడుతుందేమో కాని ఎక్కువ దేశాలకు సాధ్యపడదు. కొన్ని దేశాలు కలిసి సమిష్టి కృషిద్వారా సమిష్టి భద్రత సాధింప యత్నింపవచ్చు. దీనినే సహాయకారి విధానం (Collaboration Policy) అంటారు. దీని ప్రకారం కొన్ని దేశాలు పరస్పర కృషిని గూర్చి ఒకరకమైన ఒప్పందం చేయడం. ఇలాటి ప్రయత్నాలను పరస్పర సహాయం (Mutual Assistance) అని కూడా అంటారు. సహాయకారి లేదా పరస్పర సహాయత రెండు సమిష్టి రక్షణ కిందకి వస్తాయి.

సమిష్టి భద్రత, సమిష్టి రక్షణ రెంటినీ ఒకటిగానే చూడటం కూడా జరిగింది. కారణం, రెండు పద్ధతులు ఒకటి, సైన్యం ఉపయోగించి దురాక్రమణ దేశాన్ని ఎదుర్కొనుటచే; రెండవది, సమిష్టి రక్షణను ఐక్యరాజ్య సమితి ఛార్టర్, నిబంధన 51 కింద చట్టబద్ధమైన చర్యగా పరిగణించటంవల్ల. కాకపోతే రెంటికీ వ్యత్యాసం ఉంది. సమిష్టి రక్షణలో శత్రువు తెలుస్తుంది. సమిష్టి భద్రతలో శత్రువు దురాక్రమణ జరిపిందాకా తెలియదు. శత్రువులెవరైనా, ఎక్కడున్నా ఎదుర్కొనటానికి సిద్ధమవ్వాలి. నాటో (**North Atlantic Treaty Organisation**), సియాటో (**South East Asia Treaty Organisation**), వార్సాసంధి (**Warsaw Pact**) లాంటి వివిధ సైనిక ఒప్పందాలు ఒక శత్రువును దృష్టిలో పెట్టుకొని చేసుకున్నదే. అందువల్లనే వీటిని సమిష్టి రక్షణ కోసం చేసికొన్న సాధనాలు. సమిష్టి భద్రతా చర్యలు శత్రువులు ఎవరైనా (ఒకప్పుడు మిత్రరాజ్యాలే) అవ్వచ్చు అనుకొని ఏర్పాటైనవి.

సమిష్టి భద్రత చర్యలు సమిష్టి రక్షణ చర్యలు వీటిలో వేటివల్ల ఎక్కువ అంతర్జాతీయ శాంతి కల్గుతుంది; అన్న ప్రశ్నకు సమాధానం చెప్పటం కష్టమే. ఒక విధంగా సమిష్టి భద్రత వల్ల అంతర్జాతీయంగా దేశాలమధ్య సహాయ సహకారాలు పెంపొందుటకు అవకాశం ఎక్కువ కాబట్టి సమిష్టి చర్యలనే ప్రోత్సహించాలి. అంటే అంతర్జాతీయ సంస్థను పటిష్టపరచాలి. కానీ ఇది వాస్తవిక పరిస్థితుల్లో ఇది కష్టమైందిగా తోస్తోంది. అలాగని సమిష్టి రక్షణ చర్యలు కొన్ని దేశాలే ఏదో ఒక శత్రువును దృష్టిలోనుంచుకొని చేసినవి, ఆ దేశాలకే పరిమితం కాబట్టి శాంతి స్థాపనకూడా కొన్ని దేశాలకే పరిమితమవుతుంది. పైపెచ్చు అంతర్జాతీయ సంస్థ జోక్యం లేకపోవడంతో వ్యక్తిగతంగా కొన్ని దేశాలే శక్తి నియంత్రణ పద్ధతులను చేస్తాయి. ఇలాచూస్తే సమిష్టి రక్షణలో సమతౌల్యశక్తి, సమిష్టి భద్రతలో అంతర్జాతీయ సహాయ సహకారాలు అందుతూ ఉంటాయనిపిస్తోంది. కాకపోతే రెండవది ఆశించినంత మేరకు ఆచరణలో లేదు.

మరోలా చూస్తే, రెండూ, సమిష్టి భద్రత, సమిష్టి రక్షణ, అమలులోనుండవచ్చు. ఒకటి ఉన్నంత మాత్రాన రెండవది తగ్గాలని లేదు. కాకపోతే సంసిద్ధత (ఆపద ఎదుర్కొనేందుకు) దృష్ట్యా రెండు వేర్వేరు పోకడలు

చర్యలతోఉంటాయి కాబట్టి, రెండు ఒకే అంతర్జాతీయ సంస్థద్వారా నడపబడవు. కాబట్టి తరచు ఈ రెంటికి 'సంఘర్షణ' వచ్చే ప్రమాదం లేకపోలేదు. అలాంటి పరిస్థితిలో, రెంటిని తగువిధంగా ఉపయోగించుకోలేనపుడు, వాస్తవిక దృష్ట్యా లేక ఆదర్శవాద దృష్ట్యా దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలో తేల్చుకొనవల్సింది ప్రపంచ దేశాలే.

8.5 సమిష్టి భద్రత - సంస్థాపరమైన చర్యలు

సమిష్టి భద్రత అంతర్జాతీయ సంస్థలైన, నానాజాతి సమితి తర్వాత ఐక్యరాజ్యసమితి ద్వారా ఎంతవరకు పరిరక్షింపబడిందో చూస్తే, ఆ భావనను ఆచరణలోకి తీసుకొని రావటానికి ఎలాంటి వాతావరణం, ప్రయత్నాలు ఉండాలో తెలుస్తుంది. 1923లో గ్రీక్ ద్వీపమైన కోర్ఫ్యూ (Corfu)పై ఇటలీ దాడిచేసి ఆక్రమించినపుడు, గ్రీస్ నానాజాతి సమితికి, నానాజాతి సమితి ఒడంబడిక 16వ ప్రకరణం (Article) కింద ఫిర్యాదు చేయగా, ఇటలీ తాను యుద్ధం చేసే ప్రయత్నంలో లేనట్లు సమాధానం చెప్పింది. గ్రీకు దేశస్తులు బందిపోట్లు కొందరు, ఇటలీ సైన్యాధికారిని చంపటంతో అలాచేసినట్లు తగిన చర్య గ్రీస్ తన దేశ నేరస్థులపై తీసికొనిన దాడి చెయ్యనని పేర్కొన్నది. చివరకు రాయబారుల సమావేశంలో (Conference of Ambossadors) గ్రీస్ కొంత నష్టపరిహారం చెల్లించేటట్లు ఇటలీ ఆక్రమిత భాగాన్ని వదలుకునేటట్లు అంగీకారం కుదిరింది. పరిష్కార మార్గం ఇటలీకి ఎక్కువ అనుకూలంగా ఉన్నట్లు అంతర్జాతీయ ప్రజాభిప్రాయం. ఇక్కడ సమిష్టి భద్రత దృష్ట్యా చూస్తే, గ్రీస్‌నుండి ఇటలీకి జరిగినదాని కన్న ఇటలీనుండి గ్రీస్‌కి జరిగినదే దురాక్రమణ కిందకి వస్తుంది. మరి సమిష్టి భద్రత దృష్ట్యా ఇటలీని ముందు ఆక్రమిత భాగాన్ని ఖాళీ చేయించి, ఆ తర్వాత నష్టపరిహారం గూర్చి పరిష్కారం అవ్వాలి. లేదా అసలు ఇటలీయే ముందుగ నానాజాతి సమితికి గ్రీస్‌పై ఫిర్యాదు రావాలి. ఆ విధంగా ఈ సమస్య సమిష్టి భద్రత దృష్ట్యా, అంతర్జాతీయ సంస్థ ద్వారా కన్న, సంస్థ వెలుపలే పరిష్కార మార్గం కనుగొనబడింది. 1931లో జపాన్ చైనాలోని మంచూరియాని ఆక్రమించుకోగా, చైనా నానాజాతి సమితికి ఫిర్యాదు (ప్రకరణములు 10,11, 15మరియు 16 కింద) చేసింది. జపాన్‌పై ఎటువంటి చర్య తీసుకోడానికి బ్రిటన్ ఒప్పుకోలేదు. జపాన్ తన ఆక్రమణను ఉపసంహరించుకోవాలని సమితి ఆదేశమిచ్చింది కాని జపాన్ వినలేదు. తర్వాత అమెరికాకూడా శీతాకం కలగజేసుకొని, వెంటనే జపాన్ ఉపసంహరణకు ఆదేశాలు మరల ఇచ్చారు. అయినా జపాన్ ఖాతరు చెయ్యలేదు. తర్వాత జపాన్ షాంఘై ప్రాంతాన్ని కూడా ఆక్రమించింది. సమితి ఒత్తిడి తీసుకొని వచ్చినందువల్లనో లేక మరేదైనా బలీయమైన కారణాలవల్లగాని, జపాన్ షాంఘైని మాత్రం వదిలివేసి మంచూరియాను, మంచుకో (Manchukuo) పేరిట తన అధీనంలోనున్న ప్రాంతంగా మార్చింది. మంచుకో గుర్తించకపోవటం తప్ప సమితి మరే ప్రయత్నంగాని, చర్యగాని జపాన్‌పై తీసుకొనలేదు. ఇక్కడగూడ సమిష్టి భద్రత అన్న భావనగాని, సూత్రంగానీ, విధంగాని కన్పించదు. ఇలాంటి సమస్యలు జర్మనీ, ఇటలీతో కూడా వచ్చాయి. నాజీ, జర్మనీ 1933 నుండి 1939 వరకు ఎలా సామ్రాజ్యవాద విధానాలను, దురాక్రమణను సాగించిందో ఇంతకుముందు భాగాలలో చూశాం. దీనికి తోడు బ్రిటన్ చూపించిన తృప్తిపరిచే వాదం ఇక సమితి ఏమీ చెయ్యలేక సంస్థ వెలుపలి పరిష్కార మార్గాలకు వదిలివేసింది. ఇక 1935లో ఇటలీ అబిసీనియా (ఇథియోపియా)ను ఆక్రమించుకోవడంతో దురాక్రమణ దేశాలు ఎక్కువ అయినాయి. సమితి ఆదేశాలను ఇటలీ తోసిపుచ్చింది. ఒకదాని తర్వాత మరొకటి కమిటీలను వేసి, వాటి రిపోర్ట్‌లనుబట్టి ఇటలీపై ఆంక్షలు తీసికోడానికి కూడా సమితి సభ్యులు అందరూ ముందుకురాలేదు. ఆర్థిక ఆంక్షలు కూడా సరిగా విధించలేకపోయారు. మిలటరీ ఆంక్షలు కూడా సరిగా విధించలేకపోయారు. మిలటరీ ఆంక్షలు అసలు విధించలేకపోయారు. ఈ సమస్యలో సమిష్టి భద్రత కృషి, ఏ మాత్రం అమలులో లేదని తెలుస్తుంది. ఒక వైపు అమెరికా, జర్మనీ, జపాన్‌లు అంతర్జాతీయ సంస్థలోని సభ్యదేశాలు కావు. జర్మనీ, జపాన్ దేశాలు 1919 శాంతి ఒప్పందాల పరిస్థితిని మార్చివేయదలచాయి. అమెరికా సమితిని బలపర్చడానికి దేశాలలోని ప్రజాభిప్రాయం భిన్నంగా ఉండింది. సమితిలో బలమైన దేశాలు బ్రిటన్, ఫ్రాన్సు. ఈ రెంటికీ యూరప్‌లో ఆధిక్యతకోసం పోటీ. పైపెచ్చు ఫ్రాన్సు, జర్మనీని బలహీనపరచాలని ఉంటే, బ్రిటన్ ఫ్రాన్సును బలహీనపర్చమని, పైపెచ్చు ఎవరు జర్మనీ, జపాన్,

DRAGO

రష్యాల ఆగ్రహానికి గురికాకూడదు; అనే మరో విధమైన విభిన్న ధోరణులతో ఉన్నాయి. ఒక విధంగా చెప్పాలంటే రెండు యుద్ధాల మధ్యకాలంలో సమిష్టి భద్రతకన్న సమిష్టి రక్షణ కన్నా కూడ, సమతౌల్యశక్తి అందున అధికశక్తి భావన మాత్రమే అమలులో ఉందని చెప్పవలసి ఉంది.

ఐక్యరాజ్యసమితి అమలులోకి వచ్చిన తర్వాత 1950లో ఉత్తర కొరియా - దక్షిణ కొరియాపై దాడిచేసింది. సమితి చర్య తీసికొనటానికి సిద్ధమయ్యే సమయానికి, దక్షిణ కొరియాకు మిలటరీ సహాయాన్ని అమెరికా ప్రకటించింది. సమితి గూడ అమెరికా ప్రతిపాదనను బలపరిచి సైన్యాన్ని పంపింది. దాంతో సంస్థాపరమైన చర్యగాకన్న అమెరికాయే కాకపోతే సమితి పేరుపై అమెరికాయే చర్యజరిపించింది. అమెరికా దృష్ట్యా కమ్యూనిజం దక్షిణ కొరియాలో ప్రబలకుండా ఉండాలి, అంటే ఇది సమిష్టి రక్షణకు సంబంధించిన సమస్య. సమితి దృష్ట్యా సమిష్టి భద్రతకు సంబంధించిన సమస్య. అమెరికన్ జోక్యం చైనాను పురికొల్పి ఉత్తరకొరియా మద్దతుదారు అయింది. రష్యా గూడ ఉత్తర కొరియాకు మద్దతు యిచ్చింది. ఇలా సమిష్టి భద్రతకు సంబంధించిన సమస్యను సమిష్టి రక్షణకు సంబంధించినదిగా మార్చటంతో అసలు సమిష్టి భద్రత భావనే మరుగున పడ్డది.

ఈ సందర్భంగానే శాంతికోసం ఐక్యత లేదా ఏకత్వ తీర్మానం (Unity for Peace Resolution) చేయబడింది. దీని ప్రకారం ఐక్యరాజ్యసమితిలోని భద్రత కౌన్సిల్ (Security Council)లో ఏకగ్రీవ అభిప్రాయం రావటం కష్టంగా ఉండుటచే (అలాటి పరిస్థితిలో), సాధారణ సభలో 2/3వ వంతు మెజారిటీతో తీర్మానంచేసి, తగిన చర్యలను తీసుకొనవచ్చు. ఆ విధంగా ఐక్యరాజ్యసమితి సమిష్టి భద్రతకు తగిన చర్యలు తీసికొనగల్గుతుందని, అప్పటి ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ (Secretary General) ట్రిగ్వీలీ భావించారు. అప్పటి అమెరికన్ అధ్యక్షుడు ట్రూమన్ కూడా అలాగే భావించారు. కానీ సాంకేతికంగా (Techincal) ముఖ్య సమస్య ఏమిటంటే, సమిష్టి భద్రతా చర్య ఏకగ్రీవ అభిప్రాయం కాకుండా మెజారిటీ అభిప్రాయంతో సరిపోతుందా? కొరియాలాంటి సమస్యలో ప్రత్యర్థియైన పెద్దదైన రష్యా సమ్మతించనలలో పాల్గొనకపోవటంతో, మెజారిటీ అభిప్రాయం ఏ ఒక్కటీ రెండూ పెద్దదేశాల అభిప్రాయంగా మారలేకపోతుంది. అలాంటిది సమిష్టి రక్షణకు సరిపోతుందిగాని సమిష్టి భద్రతకు అందని అంతర్జాతీయ సంస్థ తరపున సరిపోదు.

1956లో ఇజ్రాయిల్, ఫ్రాన్స్, బ్రిటన్ కలిసి సూయెజ్ కాలువ సమస్యపై ఈజిప్టుపై దాడి జరిపాయి. సమితి ఆదేశాలమేరకు తమ సైన్యాన్ని ఈజిప్టు నుండి ఉపహరించుకున్నాయి. కాని కేవలం సమితి సమిష్టి భద్రత చర్యకు భయపడికాదు అని అందరికీ తెలిసిందే. ఒకవైపు బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల్లో ప్రజాభిప్రాయం అనుకూలంగా లేదు. అమెరికా కూడా వ్యతిరేకత చూపింది. ఉపహరించుకుంటే ఇజ్రాయిల్‌కు తన సహాయం ఉంటుందని అమెరికా హామీ ఇచ్చింది. రష్యా జోక్యం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మార్చుతుందేమోనన్న భయంకూడా ఉంది. ఆ సందర్భంగానే సమస్య పరిష్కారమయ్యేంతవరకు ఆక్రమిత భూభాగం సమితి సైన్యం అధీనంలో ఉంచటంద్వారా యుద్ధ ప్రయత్నాలను, దురాక్రమణలను నిలిపివేసేటందుకు. ఐక్యరాజ్యసమితి అత్యవసరశక్తి (సైన్యం) స్థాపించబడ్డది. 1958లో సిరియా తన భూభాగంలోకి చొచ్చుకొని వస్తోందని లెబనాన్ ఐక్యరాజ్యసమితికి నివేదించుకుంది. లెబనాన్‌లో పశ్చిమదేశాలకు అనుకూల ప్రభుత్వముండడంతో, ఆ ప్రభుత్వం అమెరికాకు కూడా ఈ సమస్యను నివేదించుకొన్నందువల్ల, అమెరికా సైన్యాన్ని లెబనాన్‌కి పంపింది. తర్వాత ప్రక్క దేశమైన జోర్డాన్ రాజు హుస్సేన్ అభ్యర్థనపై బ్రిటన్‌కూడా తన సైన్యాన్ని జోర్డాన్‌కు పంపింది. ఈ చర్యలపై సమితిలో సోవియట్ యూనియన్ అమెరికాల మధ్య సంఘర్షణ మొదలైంది. చివరకు సమితి సెక్రటరీ జనరల్ చొరవ, జోక్యంతో ఆ సమస్యకొక పరిష్కారమార్గం (విదేశ సైన్యాన్ని ఉపసంహరించుకోవటం) దొరికిందేకాని సమితి ఒక సంస్థగాగాని సమిష్టి భద్రత దృష్ట్యా తీసికొన్న చర్యలవల్లగానీ మాత్రంకాదు అని అనిపించింది.

BRAOU

8.6 సమిష్టి భద్రతకు కావలసిన ఊహనములు

అంతర్జాతీయ సంస్థలు, నానాజాతి సమితి, ఐక్యరాజ్యసమితిల దృష్ట్యా చూసినపుడు సమిష్టి భద్రత సరిగా అమలుపరచబడలేదని తెలుస్తుంది. అలాగని సంస్థాపరమైన ప్రయత్నాలు, చర్యలు, ప్రాముఖ్యత కోల్పోయాయని భావిస్తే క్రమేపి అంతర్జాతీయ సంస్థ మనుగడే దెబ్బతింటుంది. కాబట్టి ఎలాటి పరిస్థితిలో సంస్థాపరమైన సమిష్టి భద్రతను పరిరక్షించుకోగలం అనుకున్నప్పుడు కొన్ని ఊహనములు లేదా ముందుగా నెలకొల్పవలసిన పరిస్థితులు కొన్ని ఉంటాయి. మొదటగా, అన్ని దేశాలు సంస్థాపరమైన సమిష్టి భద్రత వల్లనే సరియైన శాంతి నెలకొల్పుటం కుదురుతుందని గ్రహించాలి. అన్ని దేశాలకు సమిష్టి భద్రత అనే భావన స్పష్టంగా ఒకేవిధంగా ఉండాలి. తర్వాత సమిష్టి రక్షణద్వారా ఒక్కొక్కప్పుడు శాంతి నెలకొన్నను లేక దురాక్రమణను అడ్డుకొన్నను సమిష్టి భద్రతను క్షీణపర్చేదిగా ఉండకూడదు. అనగా దేశాలకు సమిష్టి రక్షణే సఫలీకృతంగా ఉందనే భావన వస్తున్న కొలదీ సమిష్టి భద్రత క్షీణిస్తుంది. అయితే ఈ పరిస్థితులను నెలకొల్పటానికి కూడా మరల మరొక ఊహనం అవసరం. అన్ని దేశాలూ దురాక్రమణకు పూర్వమున్న యథాతథ స్థితిని నెలకొల్పాలన్నది ఖచ్చితంగా తెలుసుకోవాలి, అందుకు తగిన చర్యలు తీసుకొనగల్గాలి. కానీ వాస్తవికంగా ఇలా ఉండటం లేదు. దాని అర్థం - అన్ని దేశాల ప్రయోజనాలు, సమిష్టి భద్రత విషయంలో, ఒకటిగా లేవని, విదేశాంగ విధానాలు ఆ విధంగా రూపొందించబడుటలేదని తెలుస్తోంది. నాజీ జర్మనీ నిరాయుధీకరణ విధానాన్ని తిరస్కరించటానికి కారణం మిగిలిన దేశాలు నిరాయుధీకరణ తనలా చూడటం లేదని చెప్పింది. మిగిలిన దేశాలు నిరాయుధీకరణను అమలుపర్చకుండా, జర్మనీ ఆయుధీకరణకే ఒప్పుకున్నట్లు అయ్యింది. ఈ విధంగా ఆయుధీకరణ పెరిగి యుద్ధ వాతావరణం పెరిగింది. నానాజాతి సమితి ఒప్పందంలోని ప్రకరణం ప్రకారం దేశాలు సమిష్టి భద్రతకు కావలసినంత ఆయుధశక్తిని కల్గి ఉండాలనే ప్రయత్నం కూడ చేసినట్లు కన్పించదు. దురాక్రమణను ఎదుర్కొనే సంస్థాపరమైన చర్యలకు పెద్ద దేశాలు (సమితి సభ్యులైన, కాకపోయినా) అనుకూలత చూపించలేకపోవడం కూడ ఒక ముఖ్యలోపం - ఉదాహరణకు ఇటలీపై చర్యకు అమెరికా, బ్రిటన్‌ల ప్రతికూలత. మరొక లోపం దురాక్రమణ దేశం ఒకవైపు మిగిలిన కొన్ని మరొకవైపు ఉంటాయనుకోలేము. ప్రపంచ దేశాలు, కూటాలు లేదా వర్గాలుగానుండటం దురాక్రమణ జరిపిన దేశం ఒకటయితే మరొక దేశం దృష్ట్యా శత్రువు ఇంకోదేశం అవవచ్చు. ఇలాంటి చిక్కు పరిస్థితిని చక్కదిద్దడం కష్టం.

మరొక చిక్కు సమస్య ఎక్కడ వస్తుందంటే, సమిష్టి భద్రత దృష్ట్యా దురాక్రమణ దేశం ఫలానా అని తెలియదు. కానీ విదేశాంగ విధానం దృష్ట్యా శత్రుత్వం ఉన్న దేశం ఫలానా అని తెలియటం, దానికి తగినట్లు విదేశాంగ విధానం రూపొందించుకోవటం జరుగుతుంది. ఆ విధంగా సమిష్టి భద్రతకు, విదేశాంగ విధానానికీ పొంతన కుదరదు. ఈ పరిస్థితి దృష్ట్యానే మార్గంథో ఒక అనుమానాన్ని వెలిబుచ్చారు - ఉత్తర కొరియా దాడిని ఎదుర్కొనేందుకు దక్షిణ కొరియాకు అమెరికా తన సహాయాన్ని పంపించి, ఒకవేళ దక్షిణ కొరియా దాడిచేసి ఉంటే, అమెరికా ఉత్తర కొరియాకు పంపేదేనా? దక్షిణ కొరియాపై కమ్యూనిస్టు ప్రభావం పడకుండా ఉండేటందుకే అమెరికా అండగా నిల్చిందంటే, అమెరికా దృష్టిలో కమ్యూనిస్టు ఆదరిస్తున్న ఉత్తర కొరియా, చైనా, సోవియట్ యూనియన్ మొదలైన దేశాలన్నీ శత్రుదేశాల కిందికే వస్తాయి. మరో ముఖ్య విషయమేమిటంటే శాంతి అవిభాజ్యం అనే ఊహనం వాస్తవ పరిస్థితికి దూరం. అందరికీ సమానంగా శత్రువుకాదు. కాబట్టి ఆ విధంగా సమిష్టి భద్రత తప్పుడు (తప్పుగా ఊహించుకొనిన) ఊహనంపై ఆధారపడి ఉంది.

వీటి దృష్ట్యా చూస్తే సమిష్టి భద్రత వాస్తవిక పరిస్థితులదృష్ట్యా గూడ మరో మార్గం చెప్పాలంటే, పైకి వినటానికి బాగుండకపోయినా, యుద్ధం అవిభాజ్యమని భావించి, ప్రపంచంలో ప్రతియుద్ధం, ప్రపంచ యుద్ధంగా (అన్ని దేశాలు ఏదో వైపున ఉండేలా) తయారుచేసినను కొంతవరకు స్థానిక యుద్ధాలు తగ్గుతాయి. లేదంటే అసలు సంస్థాపరమైన ప్రక్రియనే మార్చాల్సి వస్తుంది. ఉదాహరణకు శత్రువును ఉద్దేశించి ఎలా ఊహించుకొని

BRAOU

ఎలాటి చర్యలు తీసుకోవాలి అనే విషయం గూర్చి సమితి కౌన్సిల్‌లోని ఏకగ్రీవ అభిప్రాయంకన్న మరోమార్గం ఉందా అన్న విషయం గూర్చి మొదలైనది.

8.7 సమిష్టి భద్రత - ప్రాముఖ్యత

సమిష్టి భద్రత అన్నది అక్కడ ఉన్న అంతర్జాతీయ వాతావరణంపై ఆధారపడి ఉంటుంది. సమిష్టి భద్రత మొదటి ప్రపంచ యుద్ధ కాలంనాటి రాజకీయ పరిస్థితినిబట్టి రూపొందింపబడింది. అప్పటి యుద్ధాలు సాంప్రదాయ ఆయుధాలతో సాగిన సాంప్రదాయ యుద్ధాలు. ప్రస్తుతకాలం అణుశక్తితో యుద్ధాలు అణ్వాస్త్రాలు, సాంకేతికంగా మిలటరీ పటిష్టత పొందుట మొదలైన విషయాలు అభివృద్ధి దృష్ట్యా యుద్ధ పద్ధతి, రూపు ఆధునికం చేయబడ్డాయి. రాజకీయంగా ప్రపంచదేశాలు సోవియట్ యూనియన్ ఉన్నంతవరకు ద్విధ్రువ స్వరూప రాజకీయాలుండేవి. తర్వాత బహుధ్రువ రాజకీయం అమలుకావటం, ఆ తర్వాత, సోవియట్ యూనియన్ పతనానంతరం, ఏకధ్రువ రాజకీయ వాతావరణం నెలకొనే పరిస్థితి వచ్చింది. కానీ యూరపు అంతా మరల ఒకే త్రాటిపై నడిచే యత్నాలు ఫలిస్తే మరల ద్విధ్రువ వాతావరణం రావచ్చు. ఏది ఏమైనా సమిష్టి భద్రత ఆచరణకి రాజకీయ వాతావరణం సరిపోయిందిగా లేదు. ఇక దురాక్రమణ అనే భావన ముందుకాలంలో అంత స్పష్టంగా లేదు. ఇక దురాక్రమణ అనే భావన ముందుకాలంలో ఎంత స్పష్టంగ ఉంటే అంత మంచిది. కేవలం ఒక దృక్పథం (approach) గానో లేదా ఊహా ప్రక్రియగానో కంటే ఒక విధానంగా కొన్ని ప్రత్యక్షమైనవి కొన్ని పరోక్షమైనవి అనేక పద్ధతులలో జరుగుతున్నాయి. ప్రస్తుతకాలంలో స్పష్టంగా లేని దురాక్రమణకు తగినట్లుగా ఉండాలి ప్రతిచర్య. కాబట్టి సమిష్టి భద్రత దానికనుగుణంగానే మారాలి. స్థానిక యుద్ధాలను ప్రపంచయుద్ధాలుగా పరిగణించటంవల్ల యుద్ధ వాతావరణం పెరుగుతుందే కాని తగ్గదని మార్గంథో అభిప్రాయం. కానీ అలా యుద్ధ వాతావరణం మారటానికి మిలటరీ శక్తి కూడటంవల్లనేమో కాని సమిష్టి భద్రత వల్లకాదని, దౌత్యం సరిగా పటిష్టమైంది కాకపోవటం కూడ యుద్ధ వాతావరణం కల్పిస్తున్నదని విమర్శకులు పేర్కొన్నారు.

BRAOU

ఒక్కమాటలో చెప్పాలంటే, సమిష్టి భద్రతను రెండు ప్రపంచ యుద్ధాల కాలంలోనే సరిగా ఉపయోగించుకోలేక పోయాయి, ప్రపంచ దేశాలు.ఇక రెండవ ప్రపంచ యుద్ధానంతరం మారిన రాజకీయ వాతావరణంలో, సమిష్టి భద్రత ఉపయోగపడుతుందనుకోవడం పొరపాటవుతుందేమో అన్పిస్తుంది. అలాగని సమిష్టి భద్రతను వదులుకోవడం, పనికిరాదనటం అంతర్జాతీయ వాతావరణాన్ని సంస్థాపరంగా నియంత్రణలోనుంచాలని లేకపోవటమౌతుంది. మథోలా చెప్పాలంటే సమిష్టి భద్రత అంటే అంతర్జాతీయంగా సహాయ సహకారాలను ఇచ్చి పుచ్చుకోవటమని తెలియనపుడు సమిష్టి భద్రత పురాతనమైనదో, ప్రాముఖ్యం లేనిదిగనో కన్పిస్తుంది.

సమిష్టి భద్రత మూడవ ప్రపంచ దేశాల దృష్ట్యా, ముఖ్యంగా భారతదేశం దృష్ట్యా చూస్తే దాని ప్రాముఖ్యత ఎలా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం, అంతర్జాతీయ రాజకీయాలు ద్విధ్రువ రాజకీయాలుగా మారినపుడే చిన్న దేశాలు, బీద దేశాలు ఇరకాటంలో పడ్డాయి. రాజకీయంగా కానీ, మిలటరీ పరంగాకానీ, ఆర్థికపరంగా కానీ ఈ దేశాలు అటు అమెరికా లేక మరొక ఉదార, పెట్టుబడిదారీ విధానపు పెద్ద దేశముపైగానీ, ఇటు సోవియట్ లేక చైనాలాంటి సోషలిస్టు/సామ్యవాద, పెద్ద దేశాలపై గానీ ఆధారపడక తప్పలేదు. ఆర్థిక, రక్షణ (మిలటరీ), రాజకీయ విషయాలలో ఒక విషయంపై ఆధారపడటం మిగిలిన వాటిపై ప్రభావం చూపేవి. ఆ విధంగా కూటమిలో చేరటం, ఇలా చేరటం ఒక్కొక్కప్పుడు సమిష్టి భద్రతా చర్యలలో పాల్గొనటానికి, మౌలికంగా తన అభిప్రాయం వెలిబుచ్చటానికి కూడా ఈ బీద దేశాలు వెనుకంజవేయవలసి వచ్చేది. ఒక విధంగా చెప్పాలంటే సమతౌల్య శక్తితో కూడిన కూటమి, రెండవ ప్రపంచ యుద్ధానంతరం సమిష్టి భద్రతకు (కూటమి) సరిపోలేదు.

ఈ మార్పు దృష్ట్యా కాకపోయినా, మొదటినుంచి కొన్ని దేశాలు (ఉదాహరణకు స్విట్జర్లాండు) అంతర్జాతీయ వ్యవస్థలో ఉన్నప్పటికి అంతర్జాతీయ రాజకీయాలకు దూరంగా ఉండదల్చుకునే తమ ప్రత్యేక విధానమైన తటస్థ విధానాన్ని ప్రకటించి, ఆచరించాయి. స్విట్జర్లాండ్ మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొనలేదు. రెండవ ప్రపంచ యుద్ధంలోనూ పాల్గొనలేదు. స్విస్ ఉద్దేశంలో ఒకప్పుడు సామ్రాజ్య స్థాపనకు వ్యతిరేకంగా స్వతంత్ర ప్రతిపత్తి గల్గిన దేశాలు ఆవిర్భవించుటకు ఉపయోగపడిన సూత్రాలు విధానం అయిన సమతౌల్యశక్తి కూడా యుద్ధానికి కారణమైందని, అందువల్ల తటస్థతద్వారానే స్వతంత్రత నిలుపుకో సాధ్యమని భావించి, అదే విధానాన్ని ఆచరించటం మంచిదనిపించింది. కాని తర్వాత సమిష్టి భద్రత ముందు తటస్థత ఒకరకమైన ఏకాంత విధానం (Policy of Isolation)లో కన్పించింది. అందువల్లనే తటస్థత సమిష్టి భద్రతకు అడ్డుగా ఉందనికూడా భావించారు.

అది అలాగున్నప్పుడు భారతదేశం, మరికొన్ని దేశాలతో రూపొందించుకున్న అలీన విధానం (Policy of Non-alignment) ఏ విధంగా సమిష్టి భద్రతకు తోడ్పడగలదనే ప్రశ్న రాకపోదు. పశ్చిమ దేశాల దృష్టిలో భారతదేశ అలీనతగూడ ఒకరకమైన ఏకాంతతనే సూచిస్తుంది. అలా తటస్థత స్విస్ దృష్ట్యా అయినా, భారతదేశ దృష్ట్యా అయినా ఒకటే. కానీ స్విస్ తటస్థతకు ఇండియా అలీనతకు చాలా వ్యత్యాసముందనే భావన వెలుగులోకి వచ్చింది. తటస్థత ఒక ప్రతికూల సూత్రమనీ, దేశ స్వతంత్రతను మాత్రమే బలపరచటానికని ఆ విధంగా దేశీయ విధానమని, అలీనత ఒక అనుకూల సూత్రమని, దేశ స్వతంత్రతంతోబాటు అంతర్జాతీయ కుటుంబ వ్యవస్థను ప్రాతిపదికగా తీసుకుంటుందని, అంతర్జాతీయంగా భద్రతనే అంతిమ లక్ష్యంగా పరిగణిస్తుందని చెప్పడం జరిగింది. అటు తటస్థత ఇటు అలీనత - పాల్గొనకపోవటం ముఖ్యంగా యుద్ధాల్లో కానీ, యుద్ధాలకు దారితీసే చర్యల్లోగాని, అనే అర్థం తీసికొంటే రెండు ఒకటిగానే కన్పడతాయి. సమిష్టి భద్రత దృష్ట్యా రెండు ప్రతికూలమైనవే.

కానీ శాంతి స్థాపన చర్యలలో 'పాల్గొనబోము' అని అనటంగా తీసికోవటం మరీ విడ్డూరంగా ఉంటుంది. కాబట్టి కేవలం యుద్ధం దురాక్రమణ, దాడి ఇలాటి విషయాలలో ఎలా ఉండాలి అనే భావన, విధానాలకు సంబంధించినది సమిష్టి భద్రత అనుకుంటే అపుడుగూడ తటస్థత, అలీనత రెండూ ప్రతికూలమైనవిగానే కన్పిస్తాయి. అయితే వీటి దృష్ట్యా సమిష్టి భద్రత ఎలా సాధించవచ్చు అనే ప్రశ్న వస్తుంది.

BRAOU

8.8 ముగింపు

అలీనత అనే భావనలో కేవలం యుద్ధంలాంటి ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా అనికాక, అనుకూల పరిస్థితుల దృష్ట్యా అంతర్జాతీయ భద్రత కేవలం పాటుబడాలనే భావన ఇమిడి ఉంది. అంతర్జాతీయ వ్యవస్థను కాపాడగల్గేటట్లు, అంతర్జాతీయ సంస్థలు, విదేశాంగ విధానాలు, జాతీ (దేశ) ప్రయోజనాలు, దేశీయ విధానాలు అన్నీ ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయి. ఒకదానిపై ఇంకొకటి ఆధారపడిఉంది. ఒకవేళ అంతర్జాతీయంగా లేక ఒక దేశం దృష్ట్యా ఆపద వచ్చిన, సమిష్టి కృషి శాంతిస్థాపన చర్యలలో కన్పించాలి. అంతేగాని కేవలం కూటమి కట్టడం యుద్ధంలో పాల్గొనడం లాంటి చర్యలలో సమిష్టి కృషి కాదు చూపించాల్సింది అని అలీనత భావనలోని గూఢార్థం. అయితే దాడి, దురాక్రమణ, అంతర్జాతీయ శాంతికి ఆపద ఇవన్నీ ఒకటి లేదా కొన్ని దేశాలు 'శక్తి' (ఎటువంటిదైనా, ముఖ్యంగా మిలటరీ శక్తి) నుపయోగించినపుడు కల్గుతాయి. అలాటి శక్తిని ఎదుర్కొనటం ఎలా? కేవలం శాంతియుత చర్యలు సరిపోతాయా? ఇక్కడ సరియైన సమిష్టి కృష్టిలో అవసరం. అంతర్జాతీయంగా ప్రజాభిప్రాయాన్ని చైతన్యవంతంగాను, నైతికశక్తిని కల్గి ఉన్నదిగానున్నప్పుడు, అది సరియైన సమిష్టి కృషి అని అలీనత భావనలోని అసలు సందేశం. ఈ విధంగా చూస్తే అలీనత అంటే సమిష్టి భద్రత కొరకు సమిష్టి కృషి పాల్గొనడం ఉంటాయి. కాని ఒక విధంగా - శాంతియుతమైన, ప్రజాస్వామ్య పద్ధతులలో ఇదే అర్థాన్ని తటస్థత అనే భావనను తీసుకొంటే, ఈ రెండు సమిష్టి భద్రతకు ప్రతికూలమైనవి కావు.

ఆలీనత భావం అంతర్జాతీయ వ్యవస్థను పరిగణించి అన్ని విధాల న్యాయం, క్రమం స్థిరత్వం కోసం సమిష్టి కృషి చెయ్యాలనే చెప్తుంది. అంతర్జాతీయ సంస్థల పటిష్టతకోసం ఆ విధంగా సమిష్టి భద్రతకు తోడ్పడాలనే చెప్తుంది. ఆ విధంగా ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన శాంతి పాధనాలు- శాంతియుత మార్పు, శాంతియుత పరిష్కారం, సమిష్టి భద్రత- అలీనతా భావనలో గూడ ఉన్నాయనడంలో అతిశయోక్తిలేదు.

- బి.ఎస్.ఆర్. ఆంజనేయులు

8.9 చదవదగిన పుస్తకాలు

1. Hans J.Morganthau	:	Politics Among Nations
2. Mahendra Kumar	:	Theoritical Aspects of
	:	International Politics

8.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. సమిష్టి భద్రత అనగానేమి? దీని పరిరక్షణకు కావలసిన ఊహనములేవి?

2. సమిష్టి భద్రత ఆవశ్యకతను గూర్చి రాస్తూ, ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయాలలో దాని ప్రాముఖ్యతను గూర్చి రాయండి?

3. సమిష్టి భద్రత, అంతర్జాతీయ సంస్థద్వారా కన్న కొన్ని దేశాల ద్వారానే బాగా చేకూరుతుంది? వ్యాఖ్యానించండి?

4. సమిష్టి భద్రత, అలీనోద్యమం ద్వారా సిద్ధిస్తుందా?

BRAOU

భాగం - 9 ప్రచ్ఛన్న యుద్ధం

విషయక్రమం

9.1 లక్ష్యాలు

9.2 పరిచయం

9.3 ప్రచ్ఛన్నయుద్ధం - భావన

9.4 ప్రచ్ఛన్నయుద్ధం అర్థం

9.5 ప్రచ్ఛన్నయుద్ధం కారణాలు

9.6 ప్రచ్ఛన్నయుద్ధం ప్రాతిపదికలు

9.7 ట్రూమన్ సిద్ధాంతం

9.8 మార్షల్ ప్రణాళిక

9.9 బెర్లిన్ దిగ్బంధం

9.10 కొరియాయుద్ధం

9.11 ఇతర అంశాలు

9.12.0 ప్రచ్ఛన్నయుద్ధం - వివిధ దశలు

- 9.12.1 మొదటిదశ 1946-49
- 9.12.2 రెండవదశ 1949-53
- 9.12.3 మూడోదశ 1953-57
- 9.12.4 నాల్గోదశ 1957-62
- 9.12.5 అయిదోదశ 1962-69
- 9.12.6 ఆరవదశ 1969-79

9.13 రెండవ ప్రచ్ఛన్నయుద్ధం

9.14 ప్రచ్ఛన్నయుద్ధ ప్రభావాలు

9.15 ముగింపు

9.16 చదువదగిన పుస్తకాలు

9.17 నమూనా పరీక్షాప్రశ్నలు

BRAOU

9.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు

- ★ ప్రచ్ఛన్నయుద్ధం భావన
- ★ ప్రచ్ఛన్నయుద్ధం అంటే ఏమిటి?
- ★ ప్రచ్ఛన్నయుద్ధ కారణాలు ప్రాతిపదికలు
- ★ వివిధ దశలు ప్రభావాలను

బాగా వివరించగలుగుతారు

9.2 పరిచయం

అంతర్జాతీయ రాజకీయ రంగంలో రెండవ ప్రపంచయుద్ధం తెచ్చిన మార్పులలో యూరోపుఖండం కేంద్రంగా కేంద్రీకృతమైన సమతౌల్య అధికారం తెరమరగు కావటాన్ని ప్రధానమైన విషయంగా పేర్కొనవచ్చు. రెండవ ప్రపంచయుద్ధం పరిసమాప్తి తరువాత యూరోపు ఖండ రాజకీయ చరిత్ర పూర్తిగా మారిపోయింది. బ్రిటన్, ఫ్రాన్సులు యుద్ధంలో గెలిచినప్పటికీ జనాభా సంపదల దృష్ట్యా బాగా నష్టపోయినవి. యుద్ధంలో ఓడిపోయిన జర్మనీ తన భౌగోళిక స్వరూపాన్నే కోల్పోయింది. యుద్ధానికి ముందు అగ్రరాజ్యాలుగా ఉన్న రాజ్యాలు యుద్ధంతరువాత బలహీన రాజ్యాలు అయ్యాయి. పర్యవసానంలో ఏర్పడిన శూన్యతను భర్తీచేయటానికి అమెరికా, రష్యాలు పోటీపడ్డాయి. అవి రెండు కూడా యుద్ధంలో నష్టపోయినప్పటికీ తక్కిన రాజ్యాలతో పోల్చినప్పుడు అవి తమ ప్రత్యేకతను ప్రకటించుకొన్నాయి. యుద్ధం జరుగుతున్నప్పుడు, ఆ తరువాత కాలంలోను జరిగిన పరిణామాలను గమనించిన అమెరికా రష్యాలు ప్రపంచ రాజకీయాలను తమ గుప్పిట్లో ఉంచుకోవటానికి అన్ని విధాలా ప్రయత్నించాయి. రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమయ్యేనాటికే అమెరికా రష్యాల మధ్య సత్సంబంధాలులేవు. ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ విధానాలకు అమెరికా నిలువగా, కమ్యూనిస్టు సిద్ధాంతానికి సోవియట్ రష్యా కట్టుబడి ఉంది. సైద్ధాంతిక విభేదాల వల్ల ప్రపంచ రాజకీయాలపై ప్రాబల్యం సంపాదించుకోవటానికి ప్రయత్నిస్తుండటం వల్ల ఆ రెండు దేశాలమధ్య అనుమానాలు అపనమ్మకాలు చోటుచేసుకొన్నాయి. కాని యుద్ధంలో విజయం సంపాదించాలన్న కోరికవల్ల 1941లో రెండు దేశాలు దగ్గరయ్యాయి. యుద్ధం తరువాత కూడా ఈ రాజ్యాలమధ్య సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నప్పటికీ, తమ మధ్య సఖ్యత సత్సంబంధాలు నెలకొంటాయన్న నమ్మకాన్ని వాటి ప్రవర్తనలు వమ్ముచేశాయి. యుద్ధానంతర అంతర్జాతీయ రాజకీయ వాతావరణం ప్రాబల్య రాజకీయాలకు దారితీసి, యుద్ధం లేకుండానే యుద్ధభీతిని కలిగించే వాతావరణాన్ని సృష్టించింది.

BRAOU

ద్వితీయ ప్రపంచయుద్ధానంతరం అమెరికా సంయుక్త రాష్ట్రాలు, సోవియట్ రష్యాలు అగ్రరాజ్యాలుగా అవతరించాయి. వీటిమధ్య ప్రాబల్యపోటీ పర్యవసానంగా రెండవ ప్రపంచయుద్ధం తరువాత అంతర్జాతీయ రాజకీయాలు ఒక కొత్త మలుపు తిరిగాయి. 1945నుండి 1955వరకు గల మధ్యకాలంలో ప్రపంచం రెండు కూటాలుగా రూపొందింది. పరస్పర విరుద్ధమైన రెండు సిద్ధాంతాల ప్రాతిపదికగా ఈ కూటాలు ఏర్పడ్డాయి. సోవియట్ రష్యా నాయకత్వంలో తూర్పు యూరోపు రాజ్యాలు కమ్యూనిస్టు కూటమిగానూ, అమెరికా నాయకత్వంలో పశ్చిమ యూరోపు దేశాలు పాశ్చాత్య రాజ్యాల కూటమిగానూ రూపం సంతరించుకొన్నాయి. సైద్ధాంతిక ప్రాతిపదికగా ఏర్పడిన ఈ కూటాలు ప్రపంచ రాజ్యాలపై ప్రాబల్యం కొరకు పాకులాడుతూ, సైనిక కూటములుగా ఏర్పడ్డాయి. అగ్రరాజ్యాలు రెండు ధృవాలుగా మారటం, ప్రపంచ దేశాలు ఏదో ఒక ధృవంవైపుకు ఆకర్షించబడటంతో అంతర్జాతీయ రాజకీయాలను ద్విధ్రువ రాజకీయాలుగా రచయితలు పేర్కొనసాగారు. 1945 తరువాత అంతర్జాతీయ సంబంధాలను వర్ణించటానికి రచయితలు "ప్రచ్ఛన్నయుద్ధం" పదాన్ని వాడసాగారు. ప్రచ్ఛన్నయుద్ధం ఏ విధంగా ఏర్పడి ప్రపంచ రాజకీయాలను ప్రభావపరచిందో మనం తెలుసుకొందాం.

9.3 ప్రచ్ఛన్నయుద్ధం - భావన

రెండవ ప్రపంచ యుద్ధానంతరం జర్మనీ భవితవ్యంపై ఏర్పడిన భేదాభిప్రాయాలు, యుద్ధానంతర ప్రాబల్య సమతౌల్యతా సమస్యలు, తూర్పు యూరోపు దేశాలు సోవియట్ రష్యా ప్రాబల్యంలోకి వెళ్ళటం, అమెరికా కమ్యూనిజం వ్యతిరేక ప్రచారాన్ని ప్రారంభించటం, యుద్ధానంతరం రూపొందిన కూటాలు, ప్రతికూటాలు, యుద్ధకాలంనాటి దేశాలమధ్య మిత్రత్వం శాంతికాలంలో శత్రుత్వంగా మారటం మొదలైన అంశాలు ప్రచ్ఛన్నయుద్ధ ఆవిర్భావానికి దారితీశాయని చెప్పవచ్చు. రెండవ ప్రపంచయుద్ధం తరువాత ఓడిపోయిన, విడిపోయిన రాజ్యాల సమస్యలు,

శక్తి అధికార శూన్యత, సిద్ధాంతపరమైన విభేదాలు, యుద్ధానంతర బృహత్తర పునర్నిర్మాణ కార్యక్రమాలు, అణ్వాయుధాలపోటీ, అగ్రరాజ్యాల మధ్య తలెత్తిన ప్రాబల్య పోటీల నేపథ్యంలో ప్రచ్ఛన్నయుద్ధం అనివార్యమైందని చెప్పవచ్చు. ఆరంభంలో అగ్రరాజ్యాలు రెండింటిమధ్య తలెత్తిన వైరుధ్యాలు ప్రచ్ఛన్నయుద్ధాన్ని దాదాపు పదిహేను సంవత్సరాలపాటు కొనసాగింపగల్గాయి. తరువాత కాలంలో ప్రచ్ఛన్నయుద్ధం తీవ్రస్థాయినుండి కొంత సరళత్వంలోకి మారింది. సోవియట్ రష్యా తన చుట్టూ గల "ఇనుప తెర"ను కొంతవరకు తొలగించటం ఇందుకు ప్రధాన కారణం. తూర్పు యూరోపురాజ్యాలలో జాతీయతా భావం బలపడటంతో, వాటిపై సోవియట్ రష్యా ప్రభావం తగ్గటం మొదలైంది. అంతేగాక కమ్యూనిస్టు కూటమిలోని సోవియట్ రష్యా, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాల మధ్య సైద్ధాంతిక విబేధాలు తీవ్రస్థాయికి చేరుకొన్నాయి. ఈ విషయాలవల్ల ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణంలోని తీవ్రత కొంతతగ్గి, రెండు అగ్రరాజ్యాల మధ్య సయోధ్య (Detente) ఏర్పడుటకు దోహదం ఏర్పడింది. దీనికి తోడు అమెరికా ప్రభావం మిత్రరాజ్యాలమీద తగ్గుముఖం కూడా పట్టడంకూడా కారణమైంది. అమెరికా మిత్రరాజ్యాల మధ్య అవగాహన సరిగా లేకపోవడంకూడా మరొక కారణం. ప్రపంచ వ్యవహారాలలో అమెరికాకు తలనొప్పి కలిగించిన ఆసియా సమస్యలు ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణాన్ని కొంత తగ్గించగల్గాయి. ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణంలో మార్పులు సంభవిస్తున్న సమయంలో సోవియట్ రష్యా ఆఫ్ఘనిస్తాన్‌పై చర్యలు చేపట్టడం ప్రచ్ఛన్నయుద్ధానికి తిరిగి ప్రాణం పోసినట్లయింది. 1980దశకం చివరలో సోవియట్ రష్యాలో గోర్బచేవ్ నాయకత్వంలో అమలు జరిగిన రాజకీయ ఆర్థిక సంస్కరణలు అమెరికా, రష్యాలమధ్య సుహృద్భావం నెలకొనడానికి దారితీశాయి. ఈ సంస్కరణలవల్ల చివరకు సోవియట్ రష్యా విచ్ఛిన్నానికి గురై తన అగ్రరాజ్యపు స్థానాన్ని పోగొట్టుకోవలసి వచ్చింది. సోవియట్ రష్యా ప్రాబల్యం పతనం చెందటంతో సోవియట్ రష్యా, అమెరికాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం అంతరించిందనవచ్చును. ఇదేవిధంగా పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో అమలు జరిగిన రాజకీయ, ఆర్థిక సంస్కరణలు పశ్చిమదేశాలు కమ్యూనిస్టు దేశాలమధ్య గల సైద్ధాంతిక విభేదాలను తగ్గిస్తూ వస్తున్నాయి. ప్రస్తుతం ప్రచ్ఛన్నయుద్ధ భయం చాలావరకు తగ్గిందనవచ్చును.

9.4 ప్రచ్ఛన్నయుద్ధం అర్థం

BRAOU

సిద్ధాంతపరమైన వైరుధ్యాలతో సైన్యరహిత సంఘర్షణను ప్రచ్ఛన్నయుద్ధంగా పేర్కొనవచ్చు. హెర్బర్ట్ బేయార్డ్ స్వోప్ (HERBERT BEYARD SWOPE) మొదటిసారిగా 'ప్రచ్ఛన్నయుద్ధం' పదాన్ని వాడారు. ఈయన బెర్నార్డ్ బరూచ్ (BERNARD BARUCH) అనే రాజనీతిజ్ఞుని కొరకు అప్పుడప్పుడు ఉపన్యాసాలు రాసేవారు. బెర్నార్డ్ బరూచ్ అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని సౌత్ కరోలినా రాష్ట్రంలో చేసిన ఒక ఉపన్యాసంలో అమెరికా సోవియట్ రష్యా సంబంధాలను వర్ణించటంలో ప్రచ్ఛన్నయుద్ధం పదాన్ని వాడారు. ఆ తరువాత వాల్టర్ లిప్‌మాన్ (WALTER LIPMANN) అనే పాత్రికేయుడు బాగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. ప్రచ్ఛన్నయుద్ధం భావన రెండవ ప్రపంచయుద్ధం తరువాతనే వాడుకలోకి వచ్చింది. ఆ రోజుల్లో రెండు అగ్ర రాజ్యాలమధ్య తీవ్రస్థాయిలో ఉన్న సంఘర్షణల వాతావరణాన్ని వర్ణించటానికి ప్రచ్ఛన్నయుద్ధం పదాన్ని బాగా వాడారు. ఆయుధాలపోటీ, దౌత్య సంబంధమైన ఘర్షణలు, పోటీలు, మొదలుగాగల యుద్ధంకన్నా తక్కువస్థాయిలోగల వాతావరణాన్ని ప్రచ్ఛన్నయుద్ధంగా పేర్కొనవచ్చు. ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం పశ్చిమదేశాలు, కమ్యూనిస్టు దేశాల మధ్య తీవ్రస్థాయిలో నెలకొన్న ఉద్రిక్తతలు, సంఘర్షణ వాతావరణమే ప్రచ్ఛన్నయుద్ధం. రాజకీయ ఎత్తుగడలు, దౌత్యపరమైన కుటిల రాజనీతి, మానసికంగా బలహీనపరచే ప్రసారాలు, సైద్ధాంతిక వైరుధ్యాలు, ఆర్థికరంగంలో పోటీలు, యుద్ధ సామాగ్రి కొనుగోలులో పోటీలు, దూరప్రాంతాలలో చిన్న చిన్న యుద్ధాలు (MINOR WARSAT DISTANT PLACES) ప్రాబల్యం కొరకు పోటీలు, యుద్ధంకన్నా తక్కువ స్థాయిలో జరిపే వాటన్నింటిని ప్రచ్ఛన్నయుద్ధం లక్షణాలుగా పేర్కొనవచ్చు. సోవియట్ రష్యా, అమెరికా దేశాల మధ్య రెండవ ప్రపంచ యుద్ధానంతరం నెలకొన్న సంబంధాలను వర్ణించటానికి ప్రచ్ఛన్నయుద్ధం పదాన్ని వాడారు. "యుద్ధం కన్నా తక్కువ స్థాయిలో కమ్యూనిస్టులు, కమ్యూనిస్టేతరుల మధ్య జరిగే సంఘర్షణలే ప్రచ్ఛన్నయుద్ధమ"ని గార్ థాఫ్ (GAR THOFF R.K.)

నిర్వచించారు. ప్రచ్ఛన్నయుద్ధం సాయుధ యుద్ధంకాదు. ప్రచ్ఛన్నయుద్ధ సమయంలో దేశాలమధ్య శాంతికాలం నాటి దౌత్య సంబంధాలు ఉంటూ, ప్రత్యర్థి దేశాలమధ్య సంఘర్షణ వాతావరణం కొనసాగుతుంది. ఈ పరిస్థితులలో ప్రత్యర్థులను బలహీనపరచుటకు యుద్ధం మినహా అన్ని పద్ధతులను రాజ్యాలు ఉపయోగించాయి. యధార్థానికి ప్రచ్ఛన్నయుద్ధంలో రాజకీయ, మానసిక, ఆర్థిక, విద్రోహ చర్యలేగాకుండా మిగిలిన పద్ధతులన్నింటిని వినియోగిస్తాయి. పరోక్షంగా సైనిక చర్యలను చేపడ్తూ ప్రత్యర్థి దేశాల ప్రాబల్యం తగ్గించ ప్రయత్నాలు చేస్తాయి. ప్రచ్ఛన్నయుద్ధం సిద్ధాంతపరమైంది కావచ్చు లేదా దౌత్యపరమైనదైనా కావచ్చు. ప్రచారస్థాయిలో ప్రచ్ఛన్నయుద్ధం కొనసాగవచ్చు. వాస్తవమైన యుద్ధంకాకుండా యుద్ధానికి ఉండవలసిన లక్షణాలన్నీ ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణంలో ఉన్నాయి.

భిన్న ప్రవృత్తులుగల రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలమధ్య ప్రపంచ రాజకీయాలలో నాయకత్వం కొరకు జరిగే పోరాట ఫలితమే ప్రచ్ఛన్నయుద్ధం. భౌగోళికంగా ప్రచ్ఛన్నయుద్ధం ప్రపంచవ్యాప్తంగా ప్రజ్వరిల్లింది. అంతర్జాతీయ రాజకీయరంగంలో ఏ సమస్య అయిన ప్రచ్ఛన్నయుద్ధ ప్రభావంనుండి తప్పించుకోలేకపోయింది. ప్రాబల్య విస్తరణయే ప్రచ్ఛన్నయుద్ధ రాజకీయాల లక్ష్యం అయింది. ఈ లక్ష్యసాధనకొరకు యుద్ధంకన్నా తక్కువ స్థాయిలో అన్ని ప్రయత్నాలను ప్రత్యర్థి వర్గాలు చేపట్టాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలం శాంతియుత కాలంకాదు. అలాగని ఖచ్చితంగా శాంతికాలమని చెప్పవీలులేదు. ఈ పరిస్థితిని బార్నెట్ (R. BARNET) వేడిశాంతి (HOT PEACE) అని వర్ణించగా రాబర్టు కెన్నెడీ (ROBERT F. KENNEDY) కఠినమైన చేదు శాంతిగా (HARD AND BITTER PEACE) పేర్కొన్నారు.

రెండవ ప్రపంచయుద్ధం కాలంనాటి సోవియట్ రష్యా, పశ్చిమదేశాల సఖ్యత సహకారం కొత్త సఖ్యతకు (STRANGE ALLIANCE)కు దారితీసింది. యుద్ధం జరుగుతున్నప్పుడు వాటిమధ్య సఖ్యత విజయవంతంగా కొనసాగింది. ఈ పరస్పర సహకారం 1945యాల్టా సమావేశందాకా సక్రమంగానే కొనసాగింది. తరువాత కాలంలో తలెత్తిన పరస్పర అనుమానాలు, అపనమ్మకాలు సఖ్యతవిచ్ఛిన్నమగుటకు దోహదం చేశాయి. 1946 ఫిబ్రవరిలో మాస్కోలోని అమెరికా సంయుక్త రాష్ట్రాల రాయబారి జార్జి ఎఫ్. కెన్నెన్ సోవియట్ రష్యాతో అమెరికా ఖచ్చితంగా వ్యవహరించాలని పంపిన రహస్య సందేశంతో రెండు రాజ్యాలమధ్య ప్రచ్ఛన్నయుద్ధం మొదలైందనవచ్చు. ప్రచ్ఛన్నయుద్ధ భావన అమెరికాలోనే ఆవిర్భవించినప్పటికీ తత్సంబంధమైన ప్రకటన బ్రిటిష్ ప్రధాని చర్చిల్ ద్వారా జరిగింది. 1946మార్చి 6వ తేదీన ఫుల్టన్‌లోని వెస్ట్ మినిస్టర్ కళాశాలలో ప్రసంగిస్తూ బ్రిటిష్ ప్రధాని చర్చిల్ సోవియట్ రష్యా "ఇనుప తెర" (IRON CURTAIN)ను గూర్చి ప్రస్తావించాడు. సోవియట్ రష్యాకు బలం తప్ప ఇతర భాషలేవీ తెలియవని నిర్ధారిస్తూ ఆంగ్లో-అమెరికన్ సఖ్యత ఆవశ్యకతను నొక్కి వక్కాణించాడు. యుద్ధం తరువాత సోవియట్ రష్యా ప్రాబల్య వ్యాప్తిని నిరోధించటం తప్పనిసరి అవుతుందన్న చర్చిల్ ఊహలు వాస్తవాలయ్యాయి.

ప్రచ్ఛన్నయుద్ధం ఆరంభం విషయంలో రెండు రకాలైన వాదాలున్నాయి. సోవియట్ నాయకుల సడలింపులు లేని వైఖరి వల్లనే గత్యంతరం లేక అమెరికా ప్రచ్ఛన్నయుద్ధం ప్రారంభించిందని కొందరి అభిప్రాయం. ప్రచ్ఛన్నయుద్ధం ఆవశ్యకత లేకపోయినప్పటికీ రెండవ ప్రపంచయుద్ధానంతరం అమెరికా తన ప్రాబల్య విస్తరణకు దాన్ని ఉపయోగించుకొందని మరికొందరి అభిప్రాయం. ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణానికి దారితీసిన పరిస్థితులు కొంతవరకు రెండు అగ్రరాజ్యాల మధ్య ఏర్పాటైన యుద్ధకాలపు సమాచేశాలనుండి గుర్తించవచ్చు. 1945లో జపానుపై అమెరికా ప్రయోగించిన ఆటంబాంబు దౌత్య వ్యవహారాల్లో నూతన ధృక్పథాన్ని ప్రవేశపెట్టింది. అది అమెరికా సోవియట్ రష్యాలు రెండింటికి సమానమైన భయభ్రాంతులు కలుగజేసింది. పరస్పర అనుమానాలు, అంగీకారానికి సంసిద్ధం కాకపోవటం, సమస్యలను సరియైన దృక్పథంలో అవగాహన చేసుకోవడానికి సామర్థ్యత లోపించటం, సాధారణ స్పర్థలు, అగ్రరాజ్యాల మధ్య ఉద్రిక్తతలు పెరగటానికి దోహదంచేశాయి.

BRAOU

ప్రచ్ఛన్నయుద్ధం ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతర పరిణామమైనప్పటికీ అంతర్జాతీయ రాజకీయాలలో అది కొత్త ప్రక్రియకాదు. సోవియట్ రష్యా అమెరికాల మధ్య విభేదాలు చారిత్రాత్మకమైనవి. వాస్తవానికి 1917 బోల్షివిక్ విప్లవంతోనే ప్రచ్ఛన్నయుద్ధానికి అంకురార్పణ జరిగింది. పశ్చిమ రాజ్యాలు రష్యాలో ఏర్పడిన బోల్షివిక్ ప్రభుత్వాన్ని గుర్తించకపోవటంతోనే పశ్చిమ రాజ్యాలకు రష్యాకు మధ్య విభేదాలు పొడసూపాయి. 1933దాకా సోవియట్ రష్యాను అమెరికా గుర్తించలేదు. 1934లో మాత్రమే సోవియట్ రష్యా నానాజాతి సమితిలో సభ్యత్వం పొందగల్గింది. రెండవ ప్రపంచయుద్ధానికి ముందు సోవియట్ రష్యా తన ఉమ్మడి భద్రత, నిరాయుధీకరణ కార్యక్రమాలకు పశ్చిమ రాజ్యాల మద్యతును పొందలేకపోయింది. జర్మనీతో బ్రిటన్ ఫ్రాన్సుల బుజ్జగింపు వైఖరిపై సోవియట్ రష్యా తన నిరసనను ప్రకటించినప్పటికీ, జర్మనీని సోవియట్ రష్యాకు ప్రత్యర్థిగా రూపొందించే కార్యక్రమాలను బ్రిటన్ ఫ్రాన్సులు వదిలిపెట్టలేదు. కాని అవి తాము తీసుకొన్న గోతిలో తామే పడ్డట్లు 1939లో జర్మనీపై యుద్ధం ప్రకటించాయి. రెండు సంవత్సరాల తరువాత 1941లో రష్యా పై జర్మనీ దురాక్రమణకు దిగాక అది యుద్ధంలో చేరింది. ఈ విధంగా తన ఉనికిని కాపాడుకొనేటందుకు సోవియట్ రష్యా తన ప్రత్యర్థులతో పొత్తు కుదుర్చుకొన్నది. ఈ పొత్తు యుద్ధకాలంలో సవ్యంగా ఉన్నప్పటికీ యుద్ధం తరువాత అది నిలువలేదు. యుద్ధకాలంలోనే పశ్చిమ రాజ్యాలు జర్మనీపై రెండో ఫ్రంట్ ప్రారంభించకపోవడంతో సోవియట్ రష్యాకు పశ్చిమ రాజ్యాలపై అనుమానం అపనమ్మకం ప్రారంభం అయ్యాయి. యుద్ధ పరిసమాప్తి తరువాత అవి మరింత బలపడ్డాయి.

9.6 ప్రచ్ఛన్నయుద్ధం : కారణాలు

ప్రచ్ఛన్నయుద్ధం ప్రజ్వలించటానికి ఎన్నో కారణాలు తోడ్పడ్డాయి. (1) తూర్పు యూరోపులో సోవియట్ రష్యా ప్రాబల్యం : తూర్పు, మధ్య యూరోపులో సోవియట్ రష్యా ప్రాబల్య విస్తీర్ణత వల్ల పశ్చిమ రాజ్యాలకు రష్యాకు మధ్య విభేదాలు పెరగటానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. యాల్టా ఒప్పందంలోని కొన్ని అంశాలను సోవియట్ రష్యా గౌరవించలేదు. 1945 యాల్టా సమావేశంలో తూర్పు, మధ్య యూరోపు రాజ్యాలలో రష్యా ప్రాబల్యాన్ని గుర్తించటంతో పాటు జర్మనీనుండి విమోచనం పొందిన యూరోపియన్ రాజ్యాలలో స్వేచ్ఛాపూరిత ఎన్నికల తరువాత ప్రజాస్వామ్య వ్యవస్థలను ఏర్పరచుటకు అన్ని రాజ్యాలు అంగీకరించాయి. కాని సోవియట్ రష్యా దీనిని ఖాతరు చేయకుండా పోలెండ్‌లో కమ్యూనిస్టుపార్టీ అధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పరచింది. ఇదే విధంగా బాల్కన్ ఒప్పందం బల్గేరియా, రుమేనియాలపై రష్యా ప్రాబల్యాన్ని, గ్రీసుపై బ్రిటన్ ప్రాబల్యాన్ని అంగీకరించింది. హంగరీ, యుగోస్లావియాలపై ఉమ్మడి ప్రాబల్యం కొరకు చర్చిల్ స్టాలిన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. కాని యుద్ధం తరువాత బాల్కన్ ప్రాంతమందంతటా రష్యా చొరవతో కమ్యూనిస్టుల సహాయంతో ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 1947 నాటికి యుగోస్లావియా మినహా తూర్పు యూరోపులో అన్ని దేశాలలోను రష్యా సహాయంతో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 1948లో యుగోస్లావియాలో కూడా సోవియట్ పద్ధతిలో ప్రభుత్వం ఏర్పడింది. గ్రీసులోకూడా కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పాటుకు సోవియట్ రష్యా కమ్యూనిస్టు గొరిల్లాదళాల్ని పంపింది. కాని అప్పటికే సోవియట్ రష్యా ఎత్తుగడలను పసిగట్టిన పశ్చిమ రాజ్యాలు సోవియట్ రష్యా ప్రాబల్య విస్తరణను అరికట్టే బాధ్యతను చేపట్టాయి.

(2) ఇరాన్‌నుండి రష్యా సేవల ఉపసంహరణకు విముఖత : రెండవ ప్రపంచయుద్ధం ముగిస్తుండగా మిత్ర దేశాల సేవలు ఇరాన్‌ను ఆక్రమించాయి. ఉత్తర ఇరాన్ ప్రాంతాన్ని సోవియట్ రష్యా సేనలు ఆక్రమించాయి. 1942నాటి ఒప్పందం ప్రకారం యుద్ధంలో జర్మనీ లొంగిపోయిన ఆరు మాసాలకు మిత్ర దేశాలు తమ సేనలను ఇరాన్‌నుండి వెనుకకు పిలిపించుకోవాలి. కాని సోవియట్ రష్యా ప్రోత్సాహంతో ఉత్తర ఇరాన్‌లో విప్లవం రావడంతో, ఇరాన్ రష్యాతో ఆయిల్ సరఫరాల నిమిత్తం ఒప్పందం కుదుర్చుకోవటం తప్పనిసరి అయింది. సోవియట్ రష్యా బ్రిటన్ అమెరికాలవలె ఇరాన్‌నుండి తన సేనలను ఉపసంహరించుకోలేదు. ఆ తరువాత ఐక్యరాజ్యసమితి చొరవతో ఇరాన్‌నుండి రష్యా తన సేనలను ఉపసంహరించుకొంది.

BRAOU

(3) గ్రీసు, టర్కీలపై సోవియట్ రష్యా ఒత్తిడి : బ్రిటిష్ సేనలు 1944లోనే గ్రీసును నాజీ పాలననుండి విముక్తి కలిగించింది. గ్రీసునుండి జర్మనీ సైన్యం వైదొలగాక బ్రిటిష్ సేనలు బయటకు వెళ్ళిపోయాయి. గ్రీసుపై బ్రిటిష్ ప్రాబల్యాన్ని సోవియట్ రష్యా అంగీకరించింది. 1945లో గ్రీసులో జరిగిన ఎన్నికలలో రాజును సమర్థించే మద్దతుదారులు గెలిచారు. కమ్యూనిస్టులు గ్రీసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రారంభించిన గొరిల్లాయుద్ధం చివరకు అంతర్యుద్ధంగా మారింది. కమ్యూనిస్టు గొరిల్లా దళాలకు వెంటనే బల్గేరియా, ఆల్బేనియా, యుగోస్లావియాల మద్దతు లభించింది. గ్రీసులోని కమ్యూనిస్టు గొరిల్లా దళాలకు సోవియట్ రష్యా మద్దతును ఇస్తున్నదని పశ్చిమ రాజ్యాలు భావించాయి. విప్లవాన్ని అణచటంలో బ్రిటన్ విఫలం కావటంతో అమెరికా సహాయాన్ని కోరింది. గ్రీసు ప్రభుత్వం కూడా అమెరికా సహాయాన్ని అర్థించింది. అమెరికా చొరవ సమస్యకు పరిష్కారాన్ని సూచించింది. 1936లో మాంట్రెక్స్ కన్వెన్షన్‌లోని అంశాలలో మార్పులు చేయటానికి సోవియట్ రష్యా టర్కీపై ఒత్తిడి తేవటమేగాక కొంత భూభాగాన్ని వదులుకొమ్మని బలవంతం చేసింది. పర్యవసానంలో టర్కీ అమెరికాను సహాయమడిగింది.

అమెరికా టర్కీ సమస్యను పరిష్కరించటంతోబాటు గ్రీసు, టర్కీలపై జరిగిన దండయాత్రలనుండి రక్షించే బాధ్యతను అమెరికా స్వీకరిస్తున్నదని 1947మార్చి 12న అధ్యక్షుడు ట్రూమన్ ప్రకటించారు.

(4) యుద్ధ నష్టపరిహారాలు, జర్మనీకి సంబంధించిన సమస్యలు : రెండవ ప్రపంచయుద్ధంలో జర్మనీచేత బాగా నష్టపోయిన సోవియట్ రష్యా యాల్టా సమావేశంలో అతి పెద్ద నష్ట పరిహారాన్ని కోరింది. యుద్ధానంతరం సోవియట్ రష్యా జర్మనీ పారిశ్రామిక వ్యవస్థను బాగా నష్టపరిచింది. విలువైన పారిశ్రామిక యంత్ర సామాగ్రిని రష్యా జర్మనీనుండి తరలించుకొని తీసుకుపోయింది. పర్యవసానంలో చితికిన జర్మనీ ఆర్థికవ్యవస్థ మరింత బలహీనపడింది. 1945పోట్స్‌డాం సమావేశాలలో జర్మన్ ప్రజల ప్రాథమిక రాజకీయ స్వేచ్ఛలను హరించరాదని తీర్మానించినప్పటికీ రష్యా తన ఆక్రమిత జర్మన్ ప్రాంతంలో ప్రజలను నిర్బంధాలకు గురిచేయటమేగాక వారి హక్కులను కూడా హరించింది. రష్యా ఆక్రమణలోని జర్మను ప్రాంతాల ప్రజలు పశ్చిమ రాజ్యాల ఆక్రమణలోని జర్మను ప్రాంతపు ప్రజలతో కలువకుండా చేసింది. యాల్టా, పోట్స్‌డాం సమావేశాలలో జర్మనీ - పోలెండుల మధ్యగల సరిహద్దు వివాదం పరిష్కరింపబడలేదు. సోవియట్ రష్యా ఒప్పందాలన్నింటిని కాలదన్ని ఏకపక్షంగా ఓడర్-నిసీ (ODER - NEISSE) రేఖను పోలెండు జర్మనీల మధ్య సరిహద్దుగా ప్రకటించింది.

(5) శాంతి ఒప్పందాలపై విభేదాలు : యుద్ధానంతర శాంతి ఒప్పందాలపై ఏర్పడిన అభిప్రాయ బేధాలవల్ల శాంతిని స్థాపించటంలో చిక్కులు ఎదురయ్యాయి. ఇటలీ ఒప్పందాన్ని పరిశీలించేటప్పుడు, పూర్వపు ఇటలీ వలసలు, సరిహద్దులు యుద్ధ నష్టపరిహారాలు వివాదాంశాలుగా మారాయి.

(6) యుద్ధకాలంలో సోవియట్ రష్యాకు పశ్చిమ రాజ్యాల సహాయం అందకపోవటం : యుద్ధకాలంలో పశ్చిమ దేశాలనుండి తగిన సహాయం అందలేదని సోవియట్ రష్యా కినుక వహించింది. దీనిని రష్యా తను జర్మనీ చేతిలో ఓడిపోవటానికి పశ్చిమరాజ్యాల ఎత్తుగడగా భావించింది. యుద్ధకాలంలో జర్మనీ రష్యా భూభాగంలోకి చొచ్చుకొని వచ్చినప్పుడు స్టాలిన్ జర్మనీ పశ్చిమభాగాన ఒక యుద్ధశ్రేణి (WAR FRONT)ని ఏర్పరచమని పశ్చిమరాజ్యాలను కోరారు. అందువల్ల రష్యాపై జర్మనీ ఒత్తిడిలో కొంత సడలింపు జరగగలదని భావించాడు. కాని జర్మనీ పశ్చిమ భాగంలో యుద్ధశ్రేణిని ప్రారంభించటంలో జరిగిన ఆలస్యంవల్ల రష్యాకు పశ్చిమ రాజ్యాలపై అనుమానం ఎక్కువైంది. జర్మనీ రష్యాలు పరస్పరం పోట్లాడుకొని నాశనం కావాలని పశ్చిమ రాజ్యాలు కుట్రపన్నాయని రష్యా భావించింది.

(7) అటంబాంబు పరిజ్ఞానపు రహస్యం : యుద్ధం జరుగుతున్నప్పుడు అమెరికా రష్యాలు భాగస్వాములే అయినప్పటికీ అమెరికా అటంబాంబు విషయంలో తనకు గల శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని చాలా రహస్యంగా ఉంచుకొంది. రష్యా దీనిని నమ్మకద్రోహంగానే కాక, తన ఉనికికే ప్రమాదమని భావించింది.

BRAOU

(8) లెండ్ లీజ్ (LEND LEASE) **సహాయాన్ని అర్ధాంతరంగా నిలిపివేయటం :** యుద్ధకాలంలో రష్యా అమెరికానుండి Lend Lease ఒప్పందంద్వారా సహాయం పొందుతుండేది. కాని యూరోపు ఖండంలో జర్మనీ లొంగిపోయినాక ఆ సహాయాన్ని అమెరికా నిలిపివేయటమే గాక రష్యా కోరిన ఆరు బిలియన్ల డాలర్ల సహాయాన్ని కూడా నిరాకరించింది.

(9) అమెరికాలో కమ్యూనిస్టుల కార్యక్రమాల వ్యాప్తి : అమెరికాలో సోవియట్ రష్యా అనుకూల కమ్యూనిస్టు కార్యక్రమాలకు రష్యా ప్రోత్సాహం ఇవ్వటమేగాక క్రియాశీలక సహాయం చేసింది. అమెరికా రక్షణ రహస్యాలు, అణు సాంకేతిక పరిజ్ఞానం రష్యాకు రహస్యంగా తరలింపబడుతున్నదన్న భావనవల్ల అమెరికా రష్యాపట్ల కఠిన వైఖరిని అవలంబించింది. తూర్పు యూరోపులో సోవియట్ రష్యా తన ప్రాబల్యాన్ని సుస్థిరం చేసుకొంటూ, ఇతర ప్రాంతాలకు ప్రాబల్యాన్ని విస్తరించుటకు ప్రయత్నించింది. దీనిని అడ్డుకోవటానికి పశ్చిమ రాజ్యాలు ప్రయత్నించటంతో ప్రచ్ఛన్నయుద్ధం ఆవిర్భవించిందని చెప్పవచ్చు. రష్యా పశ్చిమదేశాల విధానాలను అడ్డుకోవటంలోను, అమెరికా తన స్వేచ్ఛా ప్రపంచాన్ని రక్షించుకోవటానికి చేసిన ప్రయత్నాల పర్యవసానమే ప్రచ్ఛన్నయుద్ధం ఈ విధంగా చర్య ప్రతిచర్యల ఫలితంగా ప్రపంచ శాంతి వాతావరణం కలుషితమైంది.

9.6 ప్రచ్ఛన్న యుద్ధం ప్రాతిపదికలు

ప్రచ్ఛన్నయుద్ధ ప్రాతిపదికలను విజ్ఞులు రకరకాలుగా అన్వయించారు. పరస్పర వ్యతిరేకతలే (ANTAGONISMS) ప్రచ్ఛన్నయుద్ధానికి మూలమని కొందరిభావం. అపనమ్మకం తద్వారా కలిగిన భయాందోళనలే ప్రచ్ఛన్నయుద్ధానికి కారణమని వారు భావించారు. పరస్పర భయాందోళనలే రెండు కూటాలు లేక వర్గాలమధ్య వ్యతిరేక చర్యలకు ప్రోత్సాహాన్నివ్వడమే కాని వైరివర్గాలు వారి ఉద్రిక్తతల తగ్గించుటకు ముందుకు రాలేదు. శాంతియుత సహజీవన భావన, అలీన రాజ్యాల ఆవిర్భావం ప్రచ్ఛన్నయుద్ధపు ఉద్రిక్తతలను కొంతవరకు సడలించగల్గాయి. కాని పెట్టుబడిదారీ దేశాల నిజాయితీలను కమ్యూనిస్టులు నమ్మలేదు. కమ్యూనిస్టుల మంచితనాన్ని పెట్టుబడిదారీ దేశాలు విశ్వసించలేదు. అందువల్లనే ప్రచ్ఛన్నయుద్ధ పరిస్థితులు కొనసాగుతూ వచ్చాయి.

సైద్ధాంతిక ప్రాతిపదికలే ప్రచ్ఛన్నయుద్ధానికి మూలకారణమని మరికొందరి అభిప్రాయం. సోవియట్ రష్యా అమెరికాల మధ్య సైద్ధాంతిక విభేదాలు తీవ్రంగా ఉన్నాయని అవి దీర్ఘకాలిక సహకారానికి అడ్డంకులయ్యాయని అమెరికా విదేశాంగ శాఖ కార్యదర్శి జేమ్స్ బైరన్స్ (JAMES F. BYROINS) అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజంను వ్యాప్తిచెందించాలన్న సోవియట్ రష్యా విధానం పశ్చిమరాజ్యాలనుకు భీతిని కల్గింపచేసింది. కమ్యూనిజంలో నిరంకుశత్వం, ప్రజాస్వామ్య వ్యతిరేకతలున్నవని భావించిన పశ్చిమ రాజ్యాలు కమ్యూనిజం వ్యాప్తిని చూసి భయపడ్డాయి. ప్రపంచమంతటా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు కమ్యూనిస్టులు ప్రమాదకారులు కాగలరని పశ్చిమ రాజ్యాలు భావించాయి. అందువల్ల కమ్యూనిజాన్ని వ్యతిరేకించ అవిశ్రాంత నిశ్చయమై ఉన్నాయి. ఏ విధమైన సహకారం లేక రాజీ లేని సైద్ధాంతికపరమైన విభేదాలు పరిష్కారంకాలేని దశకు చేరుకున్నాయి. స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, ప్రజాస్వామ్యం భావాలకు కట్టుబడిన పశ్చిమరాజ్యాలు, నిరంకుశత్వం, అణచివేతకు కమ్యూనిస్టులను ప్రతీకలుగా భావించాయి. పరస్పర అవగాహనా లోపమే ప్రచ్ఛన్నయుద్ధానికి ప్రధానమైన కారణమని కొందరు భావించారు. తమ సిద్ధాంతాలే అమూల్యమని, ఎదుటివారి సిద్ధాంతాలు కలుషితమైనవని ఇరువర్గాలు భావించటమే ప్రచ్ఛన్నయుద్ధానికి నాంది అయిందని వీరి భావన. ఈ భావమే ఇరువర్గాలమధ్య అపనమ్మకాలకు దారితీసింది.

సోవియట్ రష్యా, పశ్చిమరాజ్యాలమధ్య ఉత్పన్నమైన ప్రచ్ఛన్నయుద్ధం ప్రధానంగా యూరోపులోని జర్మనీనుండి ప్రారంభమైందని చెప్పవచ్చు. యుద్ధానంతరం జర్మనీ లొంగుబాటు సోవియట్ రష్యా పశ్చిమరాజ్యాల మధ్య అతి

BRAOU

సున్నితమైన వివాదాన్ని సృష్టించింది. జర్మనీ సమస్య ప్రధానంగా రెండు అంశాలతో ముడిపడి ఉంది. మొదటిది జర్మనీ ఏకీకరణం రెండవది బెర్లిన్ నగర భవితవ్యం.

యుద్ధకాలంలో మిత్రరాజ్యాల మధ్య జరిగిన సమావేశాలలో జర్మనీని నాలుగు అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యా, ఫ్రాన్సు, బ్రిటన్‌ల సంయుక్త నియంత్రణలో ఉంచటానికి అంగీకారం కుదిరింది. కాని సోవియట్ రష్యా 1939లో జర్మనీతో చేసుకొన్న ఒడంబడిక జర్మనీ సమస్యను పరిష్కరించటంలో అడ్డుగా నిలిచింది. రెండు కూటములు జర్మనీని తమ ప్రాబల్య పరిధిలో ఉంచుకోటానికి ప్రయత్నించాయి. సంయుక్తంగా జర్మనీని నియంత్రించటానికి అంగీకరించినందువల్ల నాజీల ప్రాబల్యం తొలగి ప్రజాస్వామ్య పునరుద్ధరణకు అవకాశం ఏర్పడిందని భావించారు. యుద్ధకాలపు సమావేశాల నిర్ణయాలకు భిన్నంగా సోవియట్ రష్యా పోలెండ్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయటం ప్రచ్ఛన్నయుద్ధంలో ప్రథమఘట్టం. తూర్పు యూరోపులో కమ్యూనిస్టు ప్రభుత్వాలను ఏర్పాటు చేయటంలో సోవియట్ రష్యా అనుసరించిన పద్ధతులను పశ్చిమదేశాలు విమర్శించటమేగాక, రష్యా మైత్రి, శాంతి పద్ధతులకు స్వస్తిచెప్పి, కమ్యూనిజం వ్యాప్తికి దోహదపడుతున్నదన్న నిశ్చయాభిప్రాయానికి వచ్చాయి. కమ్యూనిజం వ్యాప్తిని నిరోధించుటకు పశ్చిమదేశాలు కంకణం కట్టుకొన్నాయి. ఇందుకొరకు అవి అమెరికా నాయకత్వంలో కొన్ని ఆర్థిక సైనిక చర్యలను చేపట్టాయి. యుద్ధానంతరం తనపై కక్షసాధింపు చర్యలకు పశ్చిమ దేశాలు పూనుకొన్నాయని సోవియట్ రష్యా ఆరోపించింది.

9.7 ట్రూమన్ సిద్ధాంతం

BRAOU

ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం కమ్యూనిస్టు వ్యాప్తి లేక విద్రోహ చర్యలను అరికట్టుటకు సహాయం అర్థించే రాజ్యాలకు అమెరికా సహాయమందిస్తుందన్న అమెరికా అధ్యక్షుని ప్రకటనయే ట్రూమన్ సిద్ధాంతం. 1947మార్చి 12న అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడు ట్రూమన్ అమెరికా కాంగ్రెసు ఉభయసభలనుద్దేశిస్తూ చేసిన ప్రసంగంలో అల్ప సంఖ్యాకులు లేదా ఒత్తిడి వర్గాలు బలప్రయోగంద్వారా చేబడుతున్న అణచివేత చర్యలను ప్రతిఘటించే స్వేచ్ఛాప్రియులైన ప్రజలకు సహాయం అందించటం అమెరికా విధానంగా ప్రకటించారు. అధ్యక్షుని కోరికపై అమెరికా కాంగ్రెసు, కమ్యూనిస్టు గెరిల్లాల దాడులను ఒత్తిడులను ఎదుర్కొంటున్న గ్రీసు, టర్కీలకు 400మిలియన్ల డాలర్ల సహాయాన్ని అంగీకరించింది. గతంలో శాంతి సమయంలోని అమెరికా విధానాలకు భిన్నంగా ట్రూమన్ బహిరంగంగా అమెరికా ఆర్థిక, సైనిక సహాయం ఇవ్వజూపటంలో దాని కమ్యూనిస్టు వ్యతిరేక విధానం వ్యక్తమవుతున్నది. ఆర్థిక సైనిక సహాయం అందించే విధానం తరువాత కాలంలో అమెరికా శాశ్వత విధానంగా రూపొందినా ట్రూమన్ సిద్ధాంతపు ప్రకటనను మొట్టమొదటిచర్యగా భావించవచ్చును.

9.8 మార్షల్ ప్రణాళిక

రెండవ ప్రపంచయుద్ధం తరువాత యూరోపు దేశాల చితికిపోయిన ఆర్థికవ్యవస్థల పునర్నిర్మాణానికై ఆనాటి విదేశాంగ కార్యదర్శి మార్షల్ 1947లో ప్రతిపాదించిన ఆర్థిక సహాయ కార్యక్రమమే మార్షల్ ప్రణాళిక. 1948లో అమెరికా కాంగ్రెసు ఈ ప్రణాళికను ఆమోదించింది. తద్వారా యూరోపు ఆర్థిక పునర్నిర్మాణ ప్రణాళిక (EUROPEAN RECOVERY PROGRAMME ERP) ప్రారంభించి అందులో చేరిన సభ్యదేశాలకు గ్రాంట్లు రుణాలు ఇవ్వటం మొదలుపెట్టింది. అమెరికా కోరికపై పదహారు రాజ్యాలు ఈ కార్యక్రమంలో చేరి (ORGANISATION FOR EUROPEAN ECONOMIC CO-OPERATION OEEC) అను ప్రాంతీయ సంస్థను వ్యవస్థీకరించాయి. ఈ వ్యవస్థ సభ్యరాజ్యాల మధ్య సహకారాన్ని ప్రోత్సహిస్తూ తమకు ఉమ్మడిగా కావలసిన వనరులను, అవసరాలను బేరీజు వేసుకొనటంలో సహకారాలను అందిస్తుంది. సోవియట్ రష్యా, ఇతర తూర్పు యూరోపురాజ్యాలను ఈ వ్యవస్థలో

చేరమని ఆహ్వానించినా ఆవి తిరస్కరించాయి. అస్థిరత్వం, అభివృద్ధి చెందే రాజ్యాలలో కమ్యూనిస్టుల లక్ష్యాలను ఎదుర్కోవడంలో విదేశీ ద్రవ్యసహాయం ఒక ఆయుధంగా ఉపయోగపడగలదని అమెరికా విధానకర్తలకు, అమెరికా కాంగ్రెసుకు మార్షల్ ప్రణాళిక నిర్దుందంగా సూచించింది. 1952నాటికి సహాయం స్వీకరించిన సభ్యదేశాలలో యుద్ధం ముందు కాలంనాటి కన్నా ఉత్పత్తులు పెరిగాయి. ఈ ప్రణాళిక ఐక్య యూరోపు కామన్ మార్కెట్‌ను స్థాపించే అమెరికా ఆశలకు మార్గాన్ని సుగమం చేసింది. అమెరికా ఆర్థిక సహాయంవల్ల పశ్చిమ యూరోపులో ఐక్యతాభావం బాగా వృద్ధి చెందింది.

9.9 బెర్లిన్ దిగ్బంధనం

సంయుక్త నియంత్రణ కింద జర్మనీని పాలించుటకంగీకరించినప్పటికీ దానిని నాల్గు విభాగాలుగా భాగించారు. తమ జర్మన్ అధీన ప్రాంతాలను పాలించుటకు పశ్చిమరాజ్యాలు ఒక ఎలైడ్ కంట్రోలు కౌన్సిల్‌ను ఏర్పాటుచేశాయి. ఈ ప్రాంతాలే తరువాత కాలంలో పశ్చిమ జర్మనీగా రూపొందాయి. పశ్చిమజర్మనీ నాటో కూటమిలో చేరడమే కాకుండా మార్షల్ పథకం కింద సహాయంపొంది పునర్నిర్మాణ కార్యక్రమాలను చేపట్టింది. సోవియట్ రష్యా అధీనంలోని జర్మనీ ప్రాంతం తూర్పు జర్మనీగా రూపందాల్చింది. సోవియట్ రష్యా పశ్చిమరాజ్యాల మధ్య ఏర్పడిన పరస్పర అనుమానాలు విద్వేష్వాలే జర్మనీ ఐక్యతకు అడ్డుగోడగా నిల్చాయి. సోవియట్ రష్యా పతనానంతరమే ఈ రెండు జర్మనీలు సమైక్యం కాగల్గాయి.

1948లో ఆర్థిక రంగంలో పునర్నిర్మాణ కార్యక్రమపు మార్పులు కొన్నింటిని మార్షల్ పథకంద్వారా పశ్చిమ జర్మనీలో ప్రవేశపెట్టారు. దీనికి ప్రతిచర్యగా 1948ఫిబ్రవరిలో బెర్లిన్ నగరాన్ని తూర్పు జర్మనీలో భాగంగా ప్రకటించటమే గాకుండా రష్యా పశ్చిమ రాజ్యాలు పశ్చిమ జర్మనీలో తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపించింది. తన ఆధీనంలో గల జర్మనీలో రష్యా తన కరెన్సీని ప్రవేశపెట్టింది. తూర్పు జర్మనీలో విలీనమయ్యేటందుకు బెర్లిన్‌పై రష్యా ఒత్తిడి తేవటంతో పాటు బెర్లిన్ నగరాన్ని దిగ్బంధం చేసింది. బెర్లిన్ నగరానికి బయటినుండి గల మార్గాలన్నింటిని మూసివేసింది. ఇందుకు ప్రతిగా అమెరికా విమానాలద్వారా బెర్లిన్ నగరానికి అత్యవసర వస్తువులను సరఫరా చేసింది. బెర్లిన్ నగర దిగ్బంధనాన్ని అమెరికా ఛేదించదలచుకొంటే యుద్ధం అనివార్యమయ్యేది. కాని దిగ్బంధం జయప్రదం కాకుండా అమెరికా చర్యలు చేపట్టింది. ఈ విధంగా బెర్లిన్ నగర దిగ్బంధం ఒక సమస్యగా రూపొంది ప్రచ్ఛన్నయుద్ధానికి ప్రబల కారణమైంది.

9.10 కొరియా యుద్ధం

జర్మనీ సమస్య తరువాత అగ్రరాజ్యాలమధ్య ప్రచ్ఛన్నయుద్ధ ప్రజ్వలనకు 1950లో ప్రారంభమైన కొరియా యుద్ధం దోహదంచేసింది. కమ్యూనిస్టుల ప్రాబల్యంలో ఉన్న ఉత్తరకొరియా, పశ్చిమరాజ్యాల ప్రాబల్యంలో ఉన్న దక్షిణకొరియాల మధ్య ఏర్పడిన సాయుధ సంఘర్షణలో కమ్యూనిస్టుల ప్రాబల్య విస్తరణను అరికట్టుటకు అమెరికా దక్షిణ కొరియాకు సహాయమందించింది. అమెరికా కొరియాలో తన ప్రయోజనాలను ఐక్యరాజ్యసమితి తీర్మానంద్వారా నెరవేర్చుకొనుటకు ప్రయత్నించింది. భద్రతా సంఘ సమావేశాలకు సోవియట్ రష్యా హాజరుకాకుండా బహిష్కరిస్తుండటంవల్ల కొరియా యుద్ధంలో ఐక్యరాజ్యసమితి జోక్యం సాధ్యమైంది. సోవియట్ రష్యా వీటోను అధిగమించుటకు సమస్యను సమితి సాధారణ సభకు నివేదించటం జరిగింది. కొరియా యుద్ధం అగ్రరాజ్యాల మధ్య విభేదాలను బహిరంగపరచింది. రెండు అగ్రరాజ్యాలు తమ తమ బలాబలాలను పరీక్షించుకోవటానికి కొరియా యుద్ధం మొట్టమొదటిసారిగా అవకాశాన్ని కల్పించింది.

9.10 సూయజ్ కాలువ సంక్షోభం

1956లో సూయజ్ కాలువ సంక్షోభం సందర్భంగా అగ్రరాజ్యాల కూటమిలో అంతర్గతంగా ఉన్న వివాదాలు బహిర్గతమయ్యాయి. ఆశ్వాన్ డాం నిర్మాణానికి కావలసిన ఆర్థిక సహాయమందించడానికి అమెరికా నిరాకరించిన కారణంగా 1956లో ఈజిప్టు అధ్యక్షుడు నాసర్ సూయజ్‌కాలువ నిర్వహణను జాతీయం చేశారు. ఈ నిర్ణయాన్ని

మార్చడానికి విఫల ప్రయత్నాలుచేసిన బ్రిటన్, ఫ్రాన్సులు ఇజ్రాయల్‌తో కలిపి సూయజ్ కాలువ ప్రాంతంలో సైనిక చర్యలు జరిపాయి. ఈ సందర్భంలో పోరాట విరమణను ప్రతిపాదించిన అమెరికా తీర్మానాన్ని బ్రిటన్, ఫ్రాన్సులు వీటో చేశాయి. ఈ చర్య పశ్చిమరాజ్యాల మధ్య ఏర్పడిన అభిప్రాయ భేదాలను బహిర్గతం చేయటమేగాక నాటో కూటమిలోని వైరుధ్యాలను స్పష్టం చేసింది. సూయజ్‌కాలువ జాతీయం విషయంలో అమెరికా, సోవియట్ రష్యాలు అమెరికా స్నేహ రాజ్యాలైన బ్రిటన్, ఫ్రాన్సులకు వ్యతిరేకంగా ఓటుచేశాయి. సూయజ్ వివాదంలో స్వప్రయోజనాలను కాపాడుకోవటానికి బ్రిటన్, ఫ్రాన్సులు అమెరికాను ధిక్కరించటం గమనార్హమైన విషయం. అవసరమైతే అమెరికా పశ్చిమేతర రాజ్యాలపైకు మొగ్గుతుందన్న అంశాన్ని సూయజ్ సంక్షోభం స్పష్టం చేసింది.

9.11 ఇతర అంశాలు

1960దశకంలో ప్రచ్ఛన్నయుద్ధ గతిలో కొన్ని మార్పులు సంభవించాయి. 1961లో బెర్లిన్ గోడ సమస్య, 1962లో క్యూబా క్షిపణుల సంక్షోభం ఏర్పడినా అగ్రరాజ్యాలు జాగ్రత్తగా వ్యవహరించి ప్రత్యక్షయుద్ధం రాకుండా నివారించాయి. ఆరంభంలో భావించినట్లుగా బెర్లిన్ నగరం రెండు అగ్రరాజ్యాలకు సమానంగా అందుబాటులో ఉంటూ వచ్చింది. ఈ లోపల రెండు జర్మనీలకు చెందిన ప్రజలను బెర్లిన్ నగరంలో నిరాటంకంగా తిరగనివ్వాలన్న ఉద్యమం తీవ్రతరం కావటంతో, తూర్పు జర్మనీనుంచి అధికసంఖ్యలో కాందీశీకులు పశ్చిమ జర్మనీకి చేరుకోవటం ప్రారంభించారు. 1961లో ఈ కాందీశీకుల సంఖ్య అధికం కావటమే కాకుండా విస్తృత ప్రచారం పొందింది. దీన్ని అరికట్టడానికి బెర్లిన్ నగరంలోని సోవియట్ రష్యా ప్రాబల్య ప్రాంతంలో ఒక గోడను నిర్మించటం జరిగింది. గోడకు ఇరువైపులా ఆయాప్రాంతాలకు చెందిన సాయుధదళాలు కావలా కాయడం మొదలుపెట్టినాయి. ఇరుపక్షాలు సాయుధ సంఘర్షణకు దిగితే పెద్ద యుద్ధం సంభవించేది. కాని సైనిక ఉపసంహరణలద్వారా ఉద్రిక్తతలు సడలి సంక్షోభ పరిష్కారం కుదిరింది. సోవియట్ రష్యాలో కమ్యూనిస్టు ప్రభుత్వ పతనం తరుణంలో బెర్లిన్ గోడను ప్రజలే కూల్చివేసి తూర్పు పశ్చిమ బెర్లిన్‌లను సమైక్యపరచారు.

1962లో క్యూబా వ్యవహారంలో ప్రచ్ఛన్నయుద్ధం తారాస్థాయికి చేరుకొంది. అమెరికాకు అతి దగ్గరలోగల క్యూబాలో సోవియట్ రష్యా అండదండలతో కాస్ట్రో అధికారంలోకి రావడమేగాక ఆర్థికంగా, సైనికంగా, సాంకేతికంగా రష్యానుండి సహాయం స్వీకరించాడు. రష్యా రహస్యంగా క్యూబాలోకి అణు ఆయుధాలను తరలించటం ప్రారంభించింది. ఇది తెలుసుకొన్న అమెరికా క్యూబానుంచి అణ్వస్త్రాలను తొలగించే వరకు క్యూబా చుట్టూ నౌకా దిగ్బంధనాన్ని విధించింది. క్యూబాకు అణ్వాయుధాలతో ప్రవేశిస్తున్న సోవియట్ నౌకలు అమెరికా విధించిన నౌకా దిగ్బంధంపల్ల వెనుకకు మరలక తప్పలేదు. అమెరికా రష్యాలు క్యూబా వ్యవహారంలో బయటికి చూపించిన పట్టుదల ప్రచ్ఛన్నయుద్ధాన్ని కొనసాగించటానికే అయినప్పటికీ, వాస్తవంలో తమ వైరుధ్యాలు యుద్ధానికి తద్వారా ప్రపంచం సర్వనాశనం కావడానికి దారితీస్తాయని గ్రహించి సమస్యను పరిష్కరించుకోవటంలో ఉభయం అగ్రరాజ్యాలు ఆతురతను, ఆసక్తిని చూపించాయి.

పైన పేర్కొన్న సంక్షోభాలలో రష్యా అమెరికాలు రెండూ తమ ప్రాబల్యాలను నిరూపించుకోవడానికి ఉద్రిక్తతలను ఎంతవరకు సృష్టించి పోషిస్తాయి; వాటిని ఏ స్థాయినవరకు లాక్కెళ్ళుతాయన్న విషయాలు మనకు తెలిశాయి.

9.12.0 ప్రచ్ఛన్నయుద్ధం - వివిధ దశలు

ప్రచ్ఛన్నయుద్ధ పరిణామ క్రమాన్ని వివిధ దశలుగా పరిశీలించవచ్చు.

9.12.1 మొదటిదశ 1946-49

పరస్పర అనుమానాలు, అపనమ్మక వాతావరణంలో సోవియట్ రష్యాపై విపరీతమైన రీతిలో ఒత్తిడితెస్తే అది కూలిపోతుందని అమెరికా, దాని స్నేహరాజ్యాలు భావించాయి. అమెరికా తనవద్ద అణ్వాయుధం ఉన్నదన్న ధీమాయే ఈ భావనకు మూలకారణం. అమెరికా రష్యా కన్నా సైనికంగా బలమైన దేశమైనప్పటికీ దాని మిత్రరాజ్యాలకు

దానికున్నంత పటిష్టత లేని కారణంగా సోవియట్ రష్యాను నిందించే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుజరిపాయి. ఈ దశలో ప్రచ్ఛన్నయుద్ధం తీవ్రస్థాయికి చేరుకొంది. యుద్ధానంతర సమావేశాలు ప్రచ్ఛన్నయుద్ధం తీవ్రంకావడానికి దోహదపడ్డాయి. ట్రూమన్ సిద్ధాంతం, మార్షల్ ప్రణాళిక, కమ్యూనిస్టు దేశాల ప్రచారసంస్థ (COMINFORM) బ్రస్సెల్స్ పంధి, బెర్లిన్ దిగ్బంధనం, రెండు జర్మనీల ఆవిర్భావం, నాటో కూటమి ఏర్పాటు మొదలైనవన్నీ ప్రచ్ఛన్నయుద్ధపు అంతర్భాగాలే. దాదాపు ఈ దశలోనే సోవియట్ రష్యా అణుబాంబు ప్రయోగాన్ని నిర్వహించటం, చైనాలో కమ్యూనిస్టులు అధికారానికి రావటం జరిగింది. చైనాలో ఏర్పడ్డ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని అమెరికా గుర్తించ నిరాకరించి, ఫార్మోజాకు తరలివెళ్ళిన ఛాంగ్‌కైషేక్ జాతీయ చైనా ప్రభుత్వానికి మద్దతునివ్వటం ప్రచ్ఛన్నయుద్ధాన్ని మరింత తీవ్రస్థాయికి చేర్చింది.

9.12.2 రెండవదశ 1949-53

రెండవదశలో కూడా అమెరికా విధానంలో ఎలాంటి మార్పులుచేర్పులు లేవు. సోవియట్ రష్యా ప్రయోజనాలను అడ్డుకొనేందుకు వీలుగా అమెరికా సైనిక ఆర్థిక సహాయాలను అందించసాగింది. అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు కలసి ఒక భద్రతా ఒప్పందాన్ని (ANZUS) కుదుర్చుకొన్నాయి. 1951లో జపానుతో అమెరికా శాంతి ఒప్పందం కుదుర్చుకొంది. ఈ దశలోనే కొరియాయుద్ధం ప్రారంభమైంది. అమెరికా కమ్యూనిజం వ్యాప్తి నిరోధానికొరకు ప్రచారం నిమిత్తం మిలియన్ల డాలర్లను వెచ్చించింది. ఈ దశలోనే రెండు ప్రత్యర్థి కూటాలు ఒకరిపై ఒకరు విద్రోహ చర్యలకు పూనుకొన్నాయి. సోవియట్ రష్యా అణుబాంబు ప్రయోగం నిర్వహించి అమెరికాలో అణ్వస్త్రాల పోటీలోకి ప్రవేశించింది. ఒకరిపై మరొకరు పైచేయిగా ఉండటానికి ఉభయ కూటాలు ప్రయత్నించాయి. ఇదే దశలో అమెరికా విదేశాంగ శాఖ కార్యదర్శి డల్లెస్ పోషించిన పాత్ర చాలా గణనీయమైంది. కమ్యూనిజం వ్యాప్తిని నిరోధించటానికి చేసిన ప్రయత్నాలద్వారా ప్రచ్ఛన్నయుద్ధం తీవ్రతరం కావటానికి ఆయన కారకుడయ్యాడు. సోవియట్ రష్యా చుట్టూగల రాజ్యాలతో అమెరికా పరస్పర భద్రతా ఒప్పందాలను కుదుర్చుకొంది.

BRAOU

9.12.3 మూడోదశ 1953-57

ఈ దశలో కూడా అమెరికా విదేశాంగ విధానంలో మార్పులులేవు. కమ్యూనిజం వ్యాప్తిని నిరోధించుటకు అవసరమైన చర్యలన్నింటిని చేపడుతూనే ఉంది. ఆగ్నేయాసియా, మధ్యధరాసముద్ర ప్రాంత భద్రతా ఒప్పందాలను కూడా కుదుర్చుకొంది. ట్రూమన్ సిద్ధాంతాన్ని మధ్య ఆసియా రాజ్యాలకు విస్తరించి తన ప్రాబల్య విస్తరణకు ప్రయత్నించింది. సోవియట్ రష్యా భూభాగం చుట్టూ కల రాజ్యాలతో ఒప్పందాలు కుదుర్చుకొని రక్షణస్థావరాలను ఏర్పరచుకొనటంలో అమెరికా కృతకృత్యురాలైంది. తూర్పు యూరోపు రాజ్యాలతో సోవియట్ రష్యా వార్సా ఒప్పందాన్ని కుదుర్చుకొంది. ఇది నాటో ఒప్పందపు ప్రయోజనాలకు ప్రతిగా నిలిచింది. ఇదేకాలంలో సోవియట్ రష్యా పన్నెండు రాజ్యాలతో ఒప్పందాలు చేసుకొంది. అమెరికా పరోక్ష సహాయంతో హంగెరీలో ప్రజ్వరిల్లిన విప్లవాన్ని రష్యా ఆణచివేసింది. జర్మనీ రెండు జర్మనీలుగా విడిపోయింది. ఈ దశలో 1955లో జెనీవా శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఆ సమావేశంలో అగ్రరాజ్యాల నాయకులు పాల్గొని ప్రపంచ సమస్యలను చర్చించారు. అంతర్జాతీయ రంగంలో శాంతియుత సమావేశాలలో ప్రచ్ఛన్నయుద్ధం ప్రారంభమైనాక జరిగిన మొదటి సమావేశం ఇదే. ఈ దశలోనే సోవియట్ రష్యా అంతరిక్షంలోకి తన మొదటి స్పుత్నిక్‌ను ప్రయోగించి తన పాటవాన్ని నిరూపించుకొంది.

9.12.4 నాలుగవదశ 1957-62

ఈ దశలో మనం రెండు పరస్పర విరుద్ధమైన ధోరణులను గమనింపవచ్చు. ఒకవైపు శాంతియుత సహజీవన ప్రస్తావన తీసుకొని వస్తూ, మరొకవైపు ప్రపంచాన్ని క్యూబా క్షిపణుల సంక్షోభంలోకి అగ్రరాజ్యాలు నెట్టాయి.

మొదట అగ్రరాజ్యాలు రెండు శాంతియుత సహజీవనం గురించి మాట్లాడాయి. సాంస్కృతిక, రాజకీయ ప్రతినిధి వర్గాలు రెండు అగ్రరాజ్యాలమధ్య మార్పుకోవడం జరిగింది. ఈ కాలంలో రెండు రాజ్యాల అధిపతులు ఒకరిదేశాన్ని మరొకరు సందర్శించారు. పారిస్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనాలన్న భావన ప్రచ్ఛన్నయుద్ధ సడలింపుకు దోహదం చేయగా, యుటూ (U2) సంఘటన స్నేహపూరిత వాతావరణాన్ని కలుషితం చేసింది. యుటూ సంఘటనద్వారా కలిగిన నష్టం 1960లో జరిగిన శిఖరాగ్ర సమావేశంలోను, 1962లో కృశ్చేవ్, కెన్నెడీల మధ్య జరిగిన సమావేశాలలో పూరింపబడింది. బెర్లిన్ గోడ వివాదం, క్యూబా క్షిపణుల సంక్షోభం అగ్రరాజ్యాలను యుద్ధోన్ముఖుల చేశాయి. కాని అమెరికా రష్యాల మధ్య కుదిరిన సదవగాహన ప్రపంచాన్ని మరో యుద్ధంనుండి కాపాడిందని చెప్పవచ్చు. పశ్చిమ రాజ్యాల కూటమిలో ఫ్రాన్సు అమెరికా వ్యతిరేక భావాలను ప్రదర్శించగా, సోవియట్ రష్యా కూటమిలో కమ్యూనిస్టు చైనా స్వతంత్ర పోకడలను ప్రదర్శించింది.

9.12.5 ఐదవదశ 1962-69

ఈ కాలంలో అణ్వస్త్రాల ఉపయోగం గురించి సర్వత్ర నిరసన భావాలు వ్యక్తమయ్యాయి. అణ్వాయుధాలపై నిషేధం విధించాలన్న కోరిక ప్రకటితమైంది. పర్యవసానంలో 1963లో పాక్షిక అణ్వస్త్ర పోటీ నిషేధం ఒప్పందం కుదిరింది. జెనీవాలో 1963లో కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రమాదవశాత్తు జరగగల అణ్వాయుధ ప్రయోగాల నివారించుటకు అమెరికా రష్యా రాజ్యాధినేతల మధ్య ప్రత్యక్ష తంత్రీ సౌకర్యం (HOT LINE) ఏర్పడటంతో అవి మరింత సన్నిహితం కాగల్గాయి. 1968లో కుదిరిన NPT అగ్రరాజ్యాల చలువయేనని చెప్పవచ్చు. నిరాయుధీకరణను సమర్థించుటకు అగ్రరాజ్యాలు రెండూ అంగీకరించాయి. 1960నుండి పెట్టుబడిదారీ రాజ్యాలకు సోషలిస్టు రాజ్యాలకు మధ్య వర్తక వాణిజ్యాలు బాగా వృద్ధిచెందాయి. ఆ రాజ్యాల మధ్య సాంస్కృతిక సంబంధాలు కూడా మెరుగయ్యాయి. క్రైంచి ప్రధాని డీగాల్ రష్యా పర్యటన, పశ్చిమ జర్మనీ విల్లీబ్రాంట్ తూర్పు యూరోపు రాజ్యాలతో సత్సంబంధాలు నెలకొల్పుకొనే ప్రయత్నాలు ప్రచ్ఛన్నయుద్ధ ఉద్రిక్తతలను తగ్గించివేశాయి.

BRAOU

9.12.6 ఆరవదశ 1969-78

1969తరువాత సోవియట్ రష్యా పశ్చిమదేశాల మధ్య ఉద్రిక్తతలు సడలి సయోధ్యకు అనుకూలమైన వాతావరణం ఏర్పడింది. ఈ కాలంలో రెండు కూటాలమధ్య ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విద్యారంగాలలో తగినంత అవగాహన కుదిరింది. దేశాలమధ్య ఉద్రిక్తతలకు బదులు స్నేహపూరిత వాతావరణం నెలకొంది. ఆత్మహత్యా సదృశమైన యుద్ధాన్ని వదిలి శాంతియుత మార్గాలద్వారా సమస్యలను పరిష్కరించుకోవటంలో మంచికలదన్న గ్రహించే సయోధ్యకు దారితీసింది. 1970లో సోవియట్ రష్యా పశ్చిమ జర్మనీతో దానికి వ్యతిరకంగా బలప్రయోగం చేయనన్న ఒప్పందం చేసింది. యూరోపుఖండంలో ఉద్రిక్తతల సడలింపుకు ఇది చాలా సహాయకారి అయింది. బెర్లిన్ సమస్యపై అమెరికా, రష్యా, ఫ్రాన్సు, బ్రిటన్‌లు ఒక ఒప్పందానికి రావడంకూడా ఉద్రిక్తతల సడలింపుకు దారితీసింది. 1972లో తూర్పు, పశ్చిమ జర్మనీలు ఒకరినొకరి ఉనికిని గుర్తిస్తూ పరస్పర సహాయ సహకారాలకు ఒప్పందం చేసుకొన్నాయి. ఉత్తర, దక్షిణ కొరియాలమధ్య చాలా విషయాలలో ఒప్పందాలు జరిగాయి. 1973లో రష్యా నేత బ్రెజ్నేవ్ అమెరికా సందర్శించారు. రెండు దేశాల నాయకులు ప్రపంచ శాంతికి కృషి చేయ నిర్ణయించి ప్రకటించారు. అణ్వాయుధాలపోటీని తగ్గించాలన్నారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో నాలుగు ప్రధానమైన ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. యూరోపుఖండంలో భద్రత, సహకారాలగురించి 1975లో హెల్సింకీతో జరిగిన శిఖరాగ్ర సమావేశం ఒక మైలురాయివంటిది. ఈ సమావేశం రెండు అగ్రరాజ్యాలమధ్య సంపూర్ణమైన సయోధ్యకు సరియైన వాతావరణం కల్పించింది. 1975లోనే అమెరికా రష్యాలు అంతరిక్షరంగంలో సహాయ సహకారాలందించుకొన అంగీకరించారు. ఈ దశలోనే రష్యా చైనాల మధ్య, అమెరికా చైనాలమధ్య విభేదాలు ప్రచ్ఛన్నయుద్ధానికి ఒక నూతన దృక్కోణాన్ని కల్పించాయి. కాని తరువాతకాలంలో చైనా, అమెరికాల

మధ్య సయోధ్య ఏర్పడింది. 1979లో అమెరికా చైనాల మధ్య మొదటిసారిగా దౌత్య సంబంధాలు ఏర్పడి, రాయబారుల నియామకం జరిగినందున వాటిమధ్య ఉద్రిక్తతలు సడలినాయని చెప్పవచ్చును. అమెరికా సోవియట్ రష్యాలమధ్య సయోధ్య ఏర్పడటంతో ప్రచ్ఛన్నయుద్ధ ఉద్రిక్తతలలో పూర్తిగా సడలింపులు జరగలేదు. అమెరికా మధ్యఆసియాలో తన ప్రాబల్యాన్ని నిలుపుకోవటానికి ఇరాన్‌కు ఆయుధ సహాయం అందించటం మానలేదు. సోవియట్ రష్యా ప్రాబల్యం తగ్గించటానికే అమెరికా ఈ ఎత్తుగడలను కొనసాగించింది. హిందూమహాసముద్ర ప్రాంతంలో సోవియట్ రష్యా ప్రభావం లేకుండా చేయటానికే అమెరికా డిగో గార్షియాను సైనికస్థావరంగా మార్చటానికి ప్రయత్నించింది. చైనా ప్రాబల్య విస్తరణ నిరోధించటానికి సోవియట్ రష్యా ఆసియా ఉమ్మడి భద్రత ప్రస్తావన చేసింది. బంగ్లాదేశ అవతరణ సందర్భంలో, ఈజిప్టు-ఇజ్రాయల్ యుద్ధంలో అగ్రదేశాలు తమ తమ మద్దతుదారులకు సహాయాలనందించాయి.

9.12.7 ఏడవదశ (1979తరువాతనుండి) :

1972లో సోవియట్ రష్యా, అమెరికాల మధ్య జరిగిన సాల్ట్ ఒప్పందం (STRATEGIC ARMS LIMITATION TREATY) గడువు 1977లో పూర్తిఅయింది. ఇరుపక్షాలు ఒప్పందపు షరతులను పాటించాలనుకొన్నారు. పర్యవసానంలో 1985లో రెండవ సాల్ట్ ఒప్పందం కుదిరింది. కాని సోవియట్ రష్యా అఫ్ఘనిస్తాన్‌పై జరిపిన సైనికచర్య ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణాన్ని పునరుజ్జీవింపచేసింది.

9.13 రెండవ ప్రచ్ఛన్నయుద్ధం

BRAOU

1979లో పోలెండులో వాలెసా నాయకత్వంలో కార్మికోద్యమం వృద్ధిచెందింది. సోవియట్ రష్యా ఒత్తిడిపై పోలిష్ ప్రభుత్వం దేశంలో సైనిక పాలనను విధించింది. ఉద్యమాన్ని అణచివేయ ప్రయత్నించింది. హెల్సింకీ ధోరణికి వ్యతిరేకంగా పోలెండులో రష్యా జోక్యం కలిగించుకోవడాన్ని పశ్చిమ దేశాలు నిరసించాయి. 1979లో తన అనుకూల ప్రభుత్వాన్ని సమర్థించే ఉద్దేశ్యంతో సోవియట్ రష్యా అఫ్ఘనిస్తాన్‌లోకి తన సేనలను పంపించింది. సోవియట్ రష్యా చర్యను ఐక్యరాజ్యసమితిలోని చాలా రాజ్యాలు గర్హించాయి. పోలెండ్, అఫ్ఘనిస్తాన్ సమస్యలకు బాధ్యత సోవియట్ రష్యాదిగా అమెరికా భావించింది. ఈ విధంగా తిరిగి అగ్రరాజ్యాల సంబంధాలలో ఉద్రిక్తతలు వృద్ధిచెందాయి. సోవియట్ రష్యా చర్యలకు పశ్చిమదేశాలు అభ్యంతరం తెలుపుతూ 1980 మాస్కో ఒలంపిక్ క్రీడలను పశ్చిమదేశాలు బహిష్కరించాయి. యూరోపులో మిస్సైల్స్ వివాదం, రీగన్ స్టార్ వార్ ప్రతిపాదన ప్రచ్ఛన్నయుద్ధం రెండవసారి ప్రారంభం కావడానికి దోహదంచేశాయి. సయోధ్యకు భంగం వాటిల్లడానికి సోవియట్ రష్యా విధానాలే కారణమని అమెరికా వాదన. అలీన రాజ్యాలు ప్రచ్ఛన్నయుద్ధ తీవ్రతలను తగ్గించమని అగ్రరాజ్యాలను ఒత్తిడిచేయసాగాయి. అమెరికా సోవియట్ రష్యాతో నిరాయుధీకరణ ఆయుధాల నియంత్రణ వంటి విషయాలలో ఒప్పందం కుదుర్చుకోవాలని పశ్చిమ దేశాలు ఒత్తిడిచేశాయి. గోర్బచేవ్ రష్యాలో అధికారంలోకి రాగానే కీలక అణ్వాయుధాలు, మిస్సైల్స్ సమస్యలపట్ల రాజీమార్గాలను సూచించటం ప్రారంభించారు. ఆఫ్ఘనిస్తాన్ సమస్యకు పరిష్కారం కుదిరి సోవియట్ రష్యా తన సేనలను ఉపసంహరించుకొంది. గోర్బచేవ్ సోవియట్ రష్యాలో ప్రవేశపెట్టిన సంస్కరణలు ప్రపంచ రాజకీయాల స్వరూపాన్నే మార్చివేశాయి. సోవియట్ రష్యాలో కమ్యూనిస్టుల ప్రభావం అంతరించి ఎల్సిన్ నాయకత్వంలో సోవియట్ రష్యా సమాఖ్య విచ్ఛిన్నం అయింది. తూర్పు యూరోపు రాజ్యాలకు కమ్యూనిజంనుండి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించాయి. జర్మనీ ఏకీకరణతో యూరోపుఖండంలో కమ్యూనిస్టుల ప్రభావం తుడిచిపెట్టుకొని పోయింది. ద్విధ్రువ అంతర్జాతీయ రాజకీయాలు ఏకధ్రువ రాజకీయాలుగా రూపొందాయి.

9.14 ప్రచ్ఛన్నయుద్ధ ప్రభావాలు

అంతర్జాతీయ రాజకీయాలను ప్రచ్ఛన్నయుద్ధం అమితంగా ప్రభావపరచింది. ప్రపంచ రాజ్యాల ప్రజలలో భయాందోళనలను రేకెత్తించింది. రాజ్యాల మధ్య ఆయుధాల సేకరణ పోటీలు అధికమయ్యాయి. రెండు కూటాల రాజ్యాలు కీలకమైన ఆయుధాల తయారీలో పోటీపడి ఆ పోటీని నిరంతరం కొనసాగించాయి. అది రాజ్యాల మధ్య అనేకమైన ఒప్పందాలకు కారణభూతమైంది. ఉభయ కూటాల రాజ్యాలు ఒప్పందాలు, ప్రతి ఒప్పందాలను కుదుర్చుకొన్నాయి. ఇవి ప్రధానంగా సైనిక ఒప్పందాలు. ఫలితంగా రాజ్యాలమధ్య ఉద్రిక్తతలు వృద్ధిచెందాయి. రెండవ ప్రపంచయుద్ధానంతరం వలస విమోచనం చెంది స్వతంత్రమైన రాజ్యాలు కొన్ని ఏ కూటమిలోను చేరకుండా స్వతంత్ర విధానాలను అవలంబించటం పర్యవసానంగా అలీనోద్యమం వృద్ధిచెందింది. ప్రచ్ఛన్నయుద్ధం ప్రపంచ రాజ్యాలు సమైక్యత సాధించకుండా అడ్డునిలిచింది. ఆయుధాల పోటీలవల్ల ప్రపంచరాజ్యాలు చాలా పెద్దమొత్తాన్ని ఆయుధాల కొనుగోలుకు వినియోగించాయి. ఫలితంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టటంలో వెనుకంజవేయాల్సి వచ్చింది. ప్రచ్ఛన్నయుద్ధం ఐక్యరాజ్యసమితిని నిర్వీర్యం చేసింది. కూటాలు పరస్పరం వ్యతిరేకించుకోవటంతో సమితి తన విధులను సక్రమంగా నిర్వహించలేకపోయింది. ప్రచ్ఛన్నయుద్ధం కొనసాగుతుండటం వల్ల కలిగే నష్టాలను అగ్రరాజ్యాలు గుర్తించి సయోధ్యవైపు ప్రయాణించ తలపెట్టాయి. 1980 కన్నా ముందున్న ప్రచ్ఛన్నయుద్ధం ఆ తరువాత కొనసాగలేకపోయింది. 1980తరువాత కాలంలో సంఘర్షణలు ఉద్రిక్తతలు అగ్రరాజ్యాలకే పరిమితమయ్యాయి. ఆయా కూటాలలోని సభ్యరాజ్యాలు తక్కువ స్థాయిలో పాల్గొన్నాయి. 1980కి ముందు అణ్వాయుధాల నియంత్రణకై పెద్దఎత్తున చర్చలు జరుగలేదు. కాని ఆ తరువాత చర్యలు కీలకస్థాయిని సంతరించుకొన్నాయి. రెండవసారి ప్రజ్వరిల్లిన ప్రచ్ఛన్నయుద్ధం మొదటిదానికన్నా భయంకరమైంది. అణ్వాయుధాలను ఉపయోగిస్తారన్న భయం వెంటాడింది. ప్రచ్ఛన్నయుద్ధపు ఆరంభంలో ప్రపంచ నాయకత్వానికి అగ్రరాజ్యాలు పోటీగా నిలిచాయి. రెండవసారి ప్రచ్ఛన్నయుద్ధ ప్రజ్వలనలో అగ్రరాజ్యాల మధ్య ఎవరు ఎక్కువ అన్న విషయం ప్రాధాన్యమైంది. మొదటి ప్రచ్ఛన్నయుద్ధానికి సైద్ధాంతికత ప్రాతిపదికకాగా రెండవసారి ప్రచ్ఛన్నయుద్ధం ఆయుధసామాగ్రికై జరిగింది. రెండవసారి ప్రచ్ఛన్నయుద్ధం మూలాన అభివృద్ధి చెందుతున్న దేశాలపై కమ్యూనిస్టుల ప్రభావం ఎక్కువగా పడింది. కొత్త ప్రచ్ఛన్నయుద్ధం పర్యవసానంగా అలీనోద్యమానికి కొత్త ఊపిరి లభించి ఉద్యమం తీవ్రస్థాయికి చేరుకొంది. కొత్త ప్రచ్ఛన్నయుద్ధంలో పరోక్షయుద్ధాలకు (PROXY WARS)కు స్థానం లేకపోయింది. ఇందువల్ల అగ్రరాజ్యాల ఆర్థికవ్యవస్థలు దెబ్బతినటంతో వాటి ప్రభావం వల్ల అభివృద్ధి చెందే దేశాలు, అభివృద్ధి చెందిన దేశాలు కూడా కష్టాలు ఎదుర్కోవలసి వచ్చింది. అభివృద్ధిచెందిన దేశాలు ఆర్థికంగా దెబ్బతింటే, అభివృద్ధిచెందుతూ ఉన్న దేశాల ఉనికికే ప్రమాదం వాటిల్లింది.

1980 దశకం ప్రారంభంలో రెండు అగ్రరాజ్యాలమధ్య ప్రచ్ఛన్నయుద్ధం తిరిగి పుంజుకొన్నది. సోవియట్ రష్యా పై ఒత్తిడి తీసుకొనిరావటానికి అమెరికా అధ్యక్షుడు రీగన్ ఆయుధాలపరంగా విదేశాలకు ద్రవ్య సహాయాన్ని ఎక్కువచేశారు. ఈ విధంగా సోవియట్ రష్యా ఆర్థికవ్యవస్థ పరోక్షపు ఒత్తిడి తెచ్చారు. పర్యవసానంలో సోవియట్ రష్యా రాజకీయ ఆర్థిక ఉపద్రవాలకు గురై, ఉదారవాద సంస్కరణలవైపుకు మొగ్గింది. గోర్బచేవ్ పెరిస్త్రోయికా, గ్లాస్‌నోస్త్ సంస్కరణలను ప్రవేశపెట్టారు. 1981లో ఆఫ్ఘనిస్తాన్, కాంబోడియా, నికారుగువా, దక్షిణాఫ్రికా, మధ్య ప్రాచ్యాలలో అమెరికా, రష్యాలు జోక్యం కలుగచేసుకొన్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో రష్యా సైనికచర్యలు సర్వత్రా విమర్శలకు గురయ్యాయి. రెండవసారి ప్రచ్ఛన్నయుద్ధం ఎక్కువకాలం కొనసాగకపోవడానికి కారణం అగ్రరాజ్యాల ఆంతరంగిక పరిస్థితులే కారణాలయ్యాయి. 1980వరకు వివిధ దేశాలకు రుణాలందించిన అమెరికా

BRAOU

1990 నాటి రుణగ్రహీతగా మారింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు తన ప్రాబల్య విస్తీర్ణతకు సోవియట్ రష్యా అడ్డుగా నిలువటంవల్ల అమెరికా అప్పులపాలైంది. సోవియట్ రష్యాకూడా ఆంతరంగిక ఆర్థిక సంక్షోభానికి గురై, క్రమంగా తన మిత్రదేశాలకందించే రుణ సహాయాన్ని చాలావరకు తగ్గించాల్సి వచ్చింది. గోర్బచేవ్, జార్జిబుష్‌ల మధ్య 1989లో యాల్టాతీరంలో జరిగిన శిఖరాగ్ర సమావేశం ఉభయరాజ్యాలమధ్య అవగాహన ఏర్పడి ఉమ్మడి సంబంధాలలో ఒక నూతన అధ్యయనాన్ని ప్రారంభించేసింది. రెండు అగ్రరాజ్యాలు రాజకీయరంగంలో పరస్పరం సహకరించుకోవడానికి అంగీకరించటంతో సంఘర్షణలు, ఉద్రిక్తతలు కూడా తగ్గించటానికి ఒడంబడ్డారు. 1990లో వాషింగ్టన్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశాలలో తమ అణ్వాయుధాల నిల్వలలో 30 శాతం తగ్గించుకోవటానికి అమెరికా రష్యాలు అంగీకరించాయి. ఆయుధాలపై పెట్టే వ్యయం తగ్గించుకొన్నట్లయితే వాటి ఆర్థికవ్యవస్థలపై భారం తగ్గుతుందన్న అగ్రరాజ్యాల భావనయే ఈ ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రధానకారణమైంది.

1990 తరువాత తూర్పు యూరోపియన్ దేశాలలోనూ, సోవియట్ యూనియన్‌లోనూ అనూహ్యమైన రాజకీయ మార్పులు సంభవించాయి. గోర్బచేవ్ సోవియట్ రష్యాలో ప్రవేశపెట్టిన ఉదార సంస్కరణల ప్రభావం మొదట తూర్పు యూరోపు దేశాలపై పడింది. పోలెండు, హంగరీ, చెకోస్లోవేకియా, బల్గేరియా, రుమేనియా, తూర్పు జర్మనీలలో కమ్యూనిస్టు ప్రభుత్వాలు కూలిపోయి ప్రజాస్వామ్య వ్యవస్థలు, స్వేచ్ఛా వ్యాపార ఆర్థికవ్యవస్థలు ఏర్పడ్డాయి. 1991లో సోవియట్ రష్యాలో గోర్బచేవ్‌ను పదవీచ్యుతున్ని చేయడానికి జరిగిన కుట్రలో విఫలమై తిరిగి గోర్బచేవ్ అధికారానికి వచ్చారు. కాని అతి త్వరలోనే సోవియట్ యూనియన్‌లోని కమ్యూనిస్టు పార్టీ, రహస్య గూఢచారి శాఖ, క్రెమ్లిన్ ఆధిపత్యం పతనమయ్యాయి. మొదట బాల్టిక్ రిపబ్లిక్కులు, అనంతరం యుక్రేన్, ఖజగిస్తాన్ ముస్లిం సోవియట్ రష్యా రిపబ్లిక్కులు స్వాతంత్ర్యం ప్రకటించుకోవటంతో సోవియట్ యూనియన్ లాంఛనంగా విచ్ఛిన్నం అయింది. మరొకపక్క జర్మనీ ఏకీకరణ, బెర్లిన్ గోడ విధ్వంసం యూరోపు ఖండంలోని దేశాలు అగ్రరాజ్యాల ఆపక్తులను ప్రక్కకునెట్టి తమ తమ జాతీయ ఆర్థిక ప్రయోజనాలను రక్షించుకొనటానికి ఉద్యమించాయి. అంతేగాక లాంఛనప్రాయంగా వార్సా ఒప్పందం రద్దయిందన్న ప్రకటనతో తూర్పు యూరోపుదేశాలు బాల్టిక్ దేశాలు యుక్రేన్ యూరోపు సభ్యసమాజంలో చేరిపోయాయి. 1994లో రష్యా నాటో ఒప్పందంలో చేరడంతో యూరోపులో ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిందనవచ్చును. అలాగే ఆసియా ఖండం ప్రాంతంలో కూడా చైనా దృక్పథంలో మార్పురావడం, చైనాలో అమెరికా పెట్టుబడులు పెరగటంతో చైనా అమెరికాల మధ్య సహకార సంబంధాలు పెరిగి మంచి వాతావరణం ఏర్పడింది. సంఘర్షణల ఉద్రిక్తతల వాతావరణం తొలగిపోతున్నది.

9.15 ముగింపు

సైద్ధాంతిక వైరుధ్యాలతో, పరస్పర అనుమానాలు అవిశ్వాసాలతో, ప్రాబల్య విస్తీర్ణతకు అగ్రరాజ్యాలు పోటీపడటంతో ప్రచ్ఛన్నయుద్ధం ఆరంభమైంది. 1990దశకం ఆరంభంలో కమ్యూనిజం ప్రాబల్యం అంతరించటం ప్రారంభం కావటంతో దాన్ని ప్రాతిపదికగా చేసుకొన్న రాజ్యాలలో రాజకీయ ఆర్థికవ్యవస్థలు మారాయి. అణు పరిజ్ఞానం అగ్రరాజ్యాల పరిధి దాటిపోయింది. అమెరికా రష్యాల నాయకత్వాన్ని వాటి మిత్రరాజ్యాలు ప్రశ్నించసాగాయి. బలీన విధానం బలపడటం కూడా ప్రచ్ఛన్నయుద్ధ తీవ్రతలలో సడలింపులు వచ్చాయి. ఏకీకృతమైన జర్మనీ, జపానుదేశాలు సాంకేతిక పరిజ్ఞానపు రంగంలో అమెరికాకు సవాలుగా నిలిచాయి. పర్యవసానంలో ప్రపంచ రాజకీయాల స్వరూప స్వభావాలలో మార్పులు వచ్చాయి. పర్యవసానంగా ప్రస్తుతానికి ప్రచ్ఛన్నయుద్ధం సమసిపోయిందని చెప్పవచ్చు.

– డా॥ఎం. రాంచందర్

BRAOU

9.16 చదువదగిన పుస్తకాలు

John Spanier	-	Games Nations Play
Herbert L. Peacock	-	Europe and Beyond
Russett - Starr	-	World Politics
Charles O herclue Jr.	-	The Cold War and after
Peter J. Fliess	-	International Relations in
	-	Bipolar World

9.17 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. ప్రచ్ఛన్నయుద్ధం అనగా ఏమి? అది ప్రారంభమగుటకు దారితీసిన పరిస్థితులేవి?

2. "1945 నుండి 1962 వరకు ప్రచ్ఛన్నయుద్ధం తీవ్రస్థాయిలోనున్నది" చర్చింపుము.

3. 1980 దశకంలో ప్రచ్ఛన్నయుద్ధం ఏ స్థాయిలోనున్నదో వివరింపుము.

II. క్రింది ప్రశ్నలకు సంక్షిప్తంగా సమాధానాలు రాయండి.

1. ప్రచ్ఛన్నయుద్ధ లక్షణాలను వివరింపుము.

2. రెండవ లేక నూతన ప్రచ్ఛన్నయుద్ధంను వర్ణింపుము.

3. ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణంలో అలీన విధాన పాత్ర.

BRAOU

భాగం - 10 సయోధ్య

విషయక్రమం

10.1 లక్ష్యాలు
10.2 పరిచయం
10.3 సయోధ్య అంటే ఏమిటి
10.4 సయోధ్య కారణాలు
10.5 సయోధ్య కారకాలు
10.6 సయోధ్య దశలు
10.7 ముగింపు
10.8 చదువదగిన పుస్తకాలు
10.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

10.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు
*సయోధ్య అంటే ఏమిటి
*సయోధ్య కారకాలు, దశలు
*పర్యవసానాన్ని బాగా వివరిస్తారు.

BRAOU

10.2 పరిచయం

1960 దశకంలో అగ్రరాజ్యాల మధ్య సంబంధాలలో అనేక మార్పులు సంభవించాయి. ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం స్థానంలో అగ్రరాజ్యాలమధ్య ప్రత్యక్ష సంభాషణలు, అవగాహనలకు అవకాశాలు ఏర్పడి, సంఘర్షణ ఉద్రిక్తతలకు బదులు సహకారం, పరస్పర ప్రయోజనాల సాధనకు అనుకూలంగా ఉంటాయని అగ్రరాజ్యాలు భావించాయి. పర్యవసానంలో సయోధ్య వాతావరణం ఏర్పడింది.

10.3 సయోధ్య అంటే ఏమిటి

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అగ్రరాజ్యాలుగా ఆవిర్భవించిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు, సోవియట్ రష్యా ప్రపంచ నాయకత్వంకొరకు పోటీపడ్డాయి. ఈ పోటీ తీవ్ర పరిస్థితికి దారితీసి ప్రపంచ సుస్థిర శాంతికి భంగకరంగా పరిణమించింది. రెండవ ప్రపంచ యుద్ధ కాలమందు గల పరస్పర అవగాహన తరువాత కాలంలో స్పర్ధగా మారింది. యూరోపుఖండపు ఆర్థిక పునర్నిర్మాణంలో రష్యా సహాయ సహకారాలను అమెరికా అధ్యక్షుడు రూజ్వెల్ట్ ఆర్థించారు. ప్రజాస్వామ్య సంరక్షణకై తోడ్పడతామని అమెరికా రష్యాలు చాలా సమావేశాలలో ఒప్పందాలలో వెల్లడించారు. ఈ దృష్టితో యూరోపు పునర్నిర్మాణంలో రష్యాకు ఉపయోగపడే కొన్ని ప్రతిపాదనలకు రూజ్వెల్ట్ అంగీకరించారు. యుద్ధకాలపు హామీలను, ఒప్పందాలను విస్మరించి అమెరికా రష్యాలు రెండూ పరస్పర విరుద్ధ కూటాలుగా ఏర్పడ్డాయి. అవి ఇతర దేశాల కలహాలలో జోక్యం చేసుకొని పరోక్షంగా పోటీపడ్డాయి. అమెరికా ఒక దేశాన్ని సమర్థిస్తే, దాని శత్రుదేశాన్ని రష్యా సమర్థించసాగింది. అంతర్జాతీయ రాజకీయరంగంలో తీవ్రమైన

ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటానికి అమెరికా రష్యాలమధ్య చెలరేగిన ప్రచ్ఛన్నయుద్ధం దోహదంచేసింది. మొదట యూరోపుఖండానికే పరిమితమైన ప్రచ్ఛన్నయుద్ధం యూవత్ ప్రపంచానికి విస్తరించింది. పశ్చిమ దేశాలు అమెరికా నాయకత్వాన, తూర్పుయూరోపు దేశాలు రష్యా నాయకత్వాన 1946 నుండి 1960 వరకు పరస్పరం తలపడుతూ వివిధ సైనిక ఒప్పందాలను ఏర్పరచుకొన్నాయి. 1960 తరువాత పరిస్థితుల ప్రాబల్యంతో ఉద్రిక్తతల తీవ్రతలలో సడలింపులు వచ్చాయి. రెండు లేక అంతకంటె ఎక్కువ రాజ్యాలమధ్య ఉద్రిక్తతలు తగ్గిన సంబంధాలను సూచించుటకు దౌత్యనీతిపరంగా పేర్కొనే పదమే "సయోధ్య". ఈ సయోధ్య లాంఛనపరమైన ఒప్పందం ఫలితంగా కావచ్చు లేదా మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులవల్లనైనా కావచ్చు. సయోధ్య వాతావరణంలో రాజ్యాల మధ్యగల ప్రాథమిక అభిప్రాయ భేదాలు తగ్గి స్నేహపూరిత, సంఘర్షణ రహిత వాతావరణంలో జీవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. 1925లో రాజ్యాలమధ్య కుదిరిన "లొకార్నో ఒప్పందాలు" ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. అణుయుద్ధంలో పరస్పర వినాశనం తప్పదన్న భావన మిత్రరాజ్యాలలో పెరుగుతున్న జాతీయతాభావం అమెరికా రష్యాలమధ్య సయోధ్యను ఏర్పరచాయేకాని ఒప్పందాల ఫలితంగా కాదు. సయోధ్య పదాన్ని రెండు రాజ్యాలమధ్య చెడిన సంబంధాలు మెరుగుపడటం దృష్టిలోపెట్టుకొని వాడుతున్నారు. దేశాలమధ్య చెడిపోయిన సంబంధాలు తిరిగి సత్సంబంధాలుగా పెంపొందే తొలిదశను సయోధ్యగా వర్ణిస్తున్నారు. అంతర్జాతీయ సంబంధాలలో రెండు ప్రత్యర్థి వర్గ కూటాలైన అమెరికా సోవియట్ రష్యాలమధ్య ప్రజ్వరిల్లిన ప్రచ్ఛన్నయుద్ధం సడలటాన్ని సయోధ్యగా వ్యవహరిస్తున్నారు. ఇదేవిధంగా అమెరికా చైనాలు, రష్యా చైనాల మధ్య మెరుగుపడుతున్న సంబంధాలను దృష్టిలో పెట్టుకొని కూడా సయోధ్య పదాన్ని వాడుతున్నారు. రాజ్యాలమధ్య సంఘర్షణల వాతావరణం తొలగటమే సయోధ్య. అంతర్జాతీయ సంబంధాలలో అనుమానం ముభావపరిస్థితులను తొలగించి నూతన వాస్తవాలను ప్రయోజనాలను గుర్తించటమే సయోధ్య అని కొందరి భావన. రాజ్యాలమధ్య సంబంధాలు సద్భావనతో ఉండటమే సయోధ్య. రష్యా అభిప్రాయంలో సయోధ్య అనగా శాంతియుత సహజీవన వాతావరణం ఏర్పడటమే. కేవలం ఘర్షణలను నివారించటమే కాక సాధారణ ప్రయోజనాలకై పర్గ ప్రయోజనాలను విడనాడి పరస్పర ప్రయోజనాలకు ప్రయత్నించడాన్ని సయోధ్య ప్రధాన లక్షణంగా రష్యా భావిస్తున్నది. హెల్సింకీ సమావేశం తరువాత ప్రపంచంలో సయోధ్య విషయంగా భిన్నాభిప్రాయాలు వినిపించాయి. పాశ్చాత్య రాజ్యాలలో శాంతియుత సహజీవనానికి కట్టుబడి ఉంటానని, ఇతరచోట్ల పాశ్చాత్య రాజ్యాల ప్రయోజనాలకు హాని కలిగించనని సోవియట్ రష్యా చెప్పింది. పరిస్థితులలో తీవ్రతలు తగ్గించటమే సయోధ్య కాదని పాశ్చాత్య రాజ్యాలు భావించాయి. శాంతియుత సహజీవనంలో కూడా శాంతియుత పోటీ లేకుండాపోదని సోవియట్ రష్యా భావించింది.

10.4 సయోధ్య కారణాలు

అమెరికా సోవియట్ రష్యాలమధ్య సయోధ్య ఏర్పడటానికి కొన్ని కారణాలు దోహదపడ్డాయి. అవి:(1) అణుయుద్ధం జరిగేటట్లయితే ఏర్పడే వినాశనకర పరిస్థితిని గురించిన భయం; (2) అగ్రరాజ్యాలు తమ ఆధిపత్యం, ఆధిక్యతను నిలబెట్టుకోవాలన్న పట్టుదల; (3) అణుసంబంధమైన సాంకేతిక పరిజ్ఞానం ఇతర రాజ్యాలు సాధించుకోవటం.

సయోధ్య కేవలం వ్యతిరేకాత్మక పరిణామంకాదు. అగ్రరాజ్యాలు తమ మధ్యగల విభేదాలను తొలగించుకోవటమేగాక పరస్పరం సహకరించుకొనే రంగాల విస్తరింపచేసుకోవడానికి నిర్ణయించుకోవటం ఒక ఆశాజనక పరిణామం. పెట్టుబడిదారీ, కమ్యూనిజం విలువలపట్ల సమానాభిప్రాయాలు ఏర్పడటంవల్ల సయోధ్య ఏర్పడలేదు. సైద్ధాంతికంగా రెండు రాజ్యాలమధ్య విభేదాలు సమసిపోలేదు. అమెరికా సోవియట్ రష్యాలమధ్య వాటి వాటి ప్రయోజనాలమధ్య ఏకాభిప్రాయంలేదు. సైద్ధాంతికమైన, ప్రయోజనకరమైన విభేదాలు అగ్రరాజ్యాలమధ్య సహకారానికి అడ్డుగోడలు కావటంలేదు. రెండు అగ్రరాజ్యాలమధ్య పోటీలు కొనసాగుతూనే, సైనిక కూటాలు రద్దుకాకుండానే సయోధ్య ఏర్పడింది. 1990 దశకపు ఆరంభ సంవత్సరాలలో సోవియట్ రష్యా ప్రవేశపెట్టుకొన్న ఉదార సంస్కరణల

BRAOU

ఫలితంగా కమ్యూనిస్టు సిద్ధాంతం తెరమరుగై, దరిమిలా ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం తొలగిపోయింది. సోవియట్ రష్యా చిన్నాభిన్నం అయినాక అమెరికాకు ధీటుగా నిలువగల మరో రాజ్యం అంతర్జాతీయ రాజకీయ రంగంలో లేదు. అమెరికా సహాయసహకారాలపై రష్యా ఆధారపడే స్థితి ఏర్పడినందున వాటిమధ్య సంఘర్షణలకు తావు లేకుండాపోయింది. రెండవ ప్రపంచయుద్ధం తరువాత అగ్రరాజ్యాలమధ్య ఏర్పడిన సంఘర్షణ, పరస్పర విరుద్ధ ప్రయోజనాలు 1950, 1960 దశకాలలో ఏ విధంగా ఉందో సోవియట్ రష్యా విచ్ఛిన్నం వరకు దాదాపు అలాగే ఉన్నాయి.

అయితే ఈ మధ్యకాలంలో అణుశక్తి కలిగిన రాజ్యాల సంఖ్య పెరగటమే కాకుండా అణ్వాయుధాల ఉత్పత్తికూడా గణనీయంగా పెరగటంవల్ల సోవియట్ రష్యా అమెరికాలు కొంత ఆత్మ సమీక్ష చేసుకోవటానికి అవకాశాలు కలిగాయి. పరస్పర విధ్వంసంకన్నా పరస్పరం పాక్షికంగా ప్రయోజనాలు సాధించటం ఉచితమని ఈ రాజ్యాలు భావించటంవల్ల అంతర్జాతీయ రాజకీయాలలో సయోధ్య భావానికి ప్రాముఖ్యత లభించింది. సిద్ధాంతాలస్థాయిలో సంఘర్షణ, పోటీలు సయోధ్య భావనలో సహకారంగా మారాయి. అయితే వాస్తవంలో పోటీలు, ఘర్షణలు, ఉద్రిక్తతలు ప్రమాదకరమైన యుద్ధ పరిస్థితిని సూచిస్తాయి. అందువల్ల సాంప్రదాయక ప్రచ్ఛన్నయుద్ధం తగ్గించటానికి సయోధ్య ప్రయత్నంచేసింది. సయోధ్య అంటే రెండు దేశాలలో ఒక ప్రత్యర్థి తన రక్షణ వ్యవస్థను నిర్లక్ష్యం చేయటంకాదు. పరస్పర అంగీకారాలద్వారా ఇద్దరు ప్రత్యర్థులు తమ తమ ఆయుధ నిల్వలను తగ్గించుకొని, తమ ప్రాబల్య సమతౌల్యాన్ని స్థిరీకరించటానికి అంగీకరించటమే సయోధ్య. పరస్పరం బలాబలాలను అంగీకరించి గౌరవించటంద్వారా శాంతి ఏర్పడుతుంది. సయోధ్య అనగా ఇరుపక్షాలమధ్య ఉద్రిక్త వాతావరణాన్ని తొలగించి దానికనుగుణంగా ఆయుధ సంపత్తిని ప్రధానంగా అణ్వాయుధాలను తగ్గించుకోవటంగా భావించవచ్చును. ఇరుపక్షాల మధ్య పరస్పర విశ్వాసం, స్నేహం, సహకారం, పరస్పరం ప్రయోజనాలను సాధించుకొనుటకు వీలైన సందర్భాలలో కలసి పనిచేసే విధానమే సయోధ్య భావాన్ని సూచిస్తుంది.

BRAOU

10.5 సయోధ్య కారకాలు

సయోధ్య కింద పేర్కొన్న కారకాలపై ఆధారపడి ఉంటుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే అగ్రరాజ్యాల మధ్య సయోధ్య సాధ్యపడుతుంది.

(1) రెండు అగ్రరాజ్యాలమధ్య అణ్వాయుధాలు ఎక్కువ సంఖ్యలో ఉన్నంతమాత్రాన అవి శాంతిస్థాపనకు యుద్ధ నివారణకు ఎలాంటి హామీలను ఇవ్వలేవు. అణ్వాయుధాలు కలిగి ఉండటంచే ఏ క్షణంలోనైనా ఒక పక్షం హేతురహితంగా త్వరపడి నిర్ణయం తీసుకొని యుద్ధానికి దిగినట్లయితే, ఆ యుద్ధం పరస్పర వినాశనానికి దారితీయగలదనే భయం అగ్రరాజ్యాలకు ఉన్నప్పుడే వాటిమధ్య సయోధ్య సాధ్యమవుతుంది.

(2) తమ మధ్యగల అభిప్రాయ భేదాలను, పరస్పర అనుమానాలను, ఉద్రిక్తతలను ఇతరదేశాలు ప్రధానంగా ఫ్రాన్సు, చైనాలు తమ స్వీయ ప్రయోజనాలకు వినియోగించుకొంటున్నాయనే భావన అగ్రరాజ్యాలలో ఏర్పడింది. ఏ ఒక్క కూటమిలో కూడా సంపూర్ణ సమైక్యతాభావం వర్ధిల్లలేదు. ఫ్రాన్సు ప్రవర్తన అమెరికాను చికాకుపరచగా, సోవియట్ రష్యా నాయకత్వాన్ని చైనా సవాలుచేసింది. రష్యా విధానానికి వ్యతిరేకంగా చైనా అమెరికాతో చేతులు కలిపి దాని అగ్రరాజ్య స్థితిని నిరంతరం పరీక్షకు గురిచేసింది. దీనితోపాటు తూర్పు యూరోపుదేశాలలో కమ్యూనిస్టు పార్టీ గుత్తాధిపత్యంపై సర్వత్రా నిరసన, వ్యతిరేకతలు వ్యక్తమయ్యాయి. క్రమంగా ఈ రాజ్యాలలో పశ్చిమదేశాల ప్రజాస్వామ్య గాలులువీయడం మొదలయ్యాయి. సోవియట్ రష్యాలో ప్రవేశపెట్టిన సంస్కరణలు అగ్రరాజ్యాలమధ్య సయోధ్య వృద్ధిచెందటాన్ని మరింతగా ప్రభావపరచింది.

(3) తమవైపు ఆకట్టుకొన్న మిత్రరాజ్యాలను, తమ కూటమిలోని సభ్యరాజ్యాలను స్నేహ పూర్వకస్థితిలో ఉంచటానికి తాము వెచ్చించే ధనం చాలా ఎక్కువని అగ్రరాజ్యాలు గ్రహించాయి. దానివల్ల ఆశించిన ప్రయోజనం తాము పొందకపోగా కూటములు తమ తమ ఆర్థికవ్యవస్థలపై మోయలేని భారాన్నివేసి ఆంతరంగిక సమస్యలను సృష్టిస్తున్నాయన్న విషయాన్ని అగ్రరాజ్యాలు గుర్తించాయి.

(4) అలీనోద్యమం బలపడటం సయోధ్య ఏర్పడటానికి బలీయమైన కారణాలలో ఒకటి. సైనిక కూటాలకు దూరంగా, అగ్రరాజ్యాలమధ్య కొనసాగుతున్న ప్రచ్ఛన్నయుద్ధానికి కూడా దూరంగా రెండు అగ్రరాజ్యాలను సమదృష్టితో చూడటం, తమ తమ జాతీయ ప్రయోజనాలను పెంపొందించుకొనే కోరికతో, తపనతో ప్రారంభమైన అలీన ఉద్యమం ఒక బలీయమైన శక్తిగా రూపం సంతరించుకొని అగ్రరాజ్యాల సంబంధాల విషయం పునరాలోచించేస్థితికి వృద్ధిచెందింది.

(5) అన్నిటికన్నా ప్రధానంగా ప్రచ్ఛన్నయుద్ధ స్థితిని తొలగించి ప్రపంచంలో శాంతియుత సహజీవన మార్గంలో, పరస్పర సహకారంతో అభివృద్ధి చెందాలన్న కాంక్ష సర్వత్రా వ్యక్తం కావచ్చింది. ఈ భావనయే అగ్రరాజ్యాలమధ్య సయోధ్య ఏర్పడటానికి దోహదంచేసింది.

అంతర్జాతీయ రాజకీయాలలో అగ్రరాజ్యాలమధ్య సదవగాహన ఏర్పడటానికి సమకాలీన పరిస్థితుల ప్రభావం చాలావరకు తోడ్పడింది. యూరోపులోనేకాక ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో నూతనంగా స్వాతంత్ర్యం పొందిన అనేక రాజ్యాలు ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధి సాధించటానికి అలీనోద్యమంలో చేరటం మంచిదని భావించాయి. అంతేగాక ప్రాంతీయస్థాయిలో ఒప్పందాలను కుదుర్చుకొని పరస్పరం సహకరించుకోవటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆసియా ఉపఖండంలో అగ్రరాజ్యాల జోక్యం పరిమితం చేయాలని వాటిమధ్య కొనసాగుతున్న ప్రాబల్య రాజకీయాలలో పావులుగా మారకూడదన్న నిశ్చయానికి ఈ దేశాలు వచ్చినట్లు కన్పిస్తున్నది. పరస్పర స్పర్ధలను తగ్గించుకొని, సహకారాన్ని పెంచుకొని నూతన వలస వాదాన్ని వ్యతిరేకించటానికి పూర్వపు వలస ఆధిపత్యంనుండి విమోచనం పొందిన రాజ్యాలు ప్రయత్నిస్తున్నాయి. సహజంగానే ఈ పరిణామాల ప్రభావం అగ్రరాజ్యాలపైబడి, పరస్పరం సహకరించుకోవాలనెడి భావనను పెంచింది.

10.6 సయోధ్య దశలు

అగ్రరాజ్యాలమధ్య వృద్ధిచెందిన సయోధ్యలో వివిధ దశలున్నాయి. అవి 1955 నుండి 1963 వరకు ఒక దశగాను, 1965 నుండి 1979 వరకు రెండవదశగాను విశదీకరించవచ్చు. 1990 తరువాత ప్రచ్ఛన్నయుద్ధం అంతరించినందున సయోధ్య ప్రసక్తి లేనేలేదు.

సోవియట్ రష్యా కమ్యూనిస్టు నాయకుడు స్టాలిన్ మరణానంతరం సోవియట్ రష్యా నాయకత్వ ధోరణిలో మార్పులు వచ్చాయి. వీటివల్ల అంతర్జాతీయరంగంలో ఉద్రిక్తతలు సడలటానికి అవకాశాలు ఏర్పడ్డాయి. స్టాలిన్ తరువాత అధికారానికి వచ్చిన కృశ్చేవ్ రెండు అధికార కూటములమధ్య శాంతియుత సహజీవనం సాధ్యమన్నారు. యుద్ధం తప్పనిపరియని, కమ్యూనిస్టులు పెట్టుబడిదారులు కలసి జీవించలేరనటం పరియైనది కాదని రష్యన్ నాయకులు అభిప్రాయపడ్డారు. అణు యుద్ధంవల్ల ప్రపంచం సర్వనాశనమవుతుంది కనుక సహజీవనం తప్పనిసరిఅని కృశ్చేవ్ భావించారు. 1953లో ప్రచ్ఛన్నయుద్ధానికి పరాకాష్ఠగా భావించిన కొరియాయుద్ధం ముగిసి ఒప్పందం కుదిరింది. 1954లో వియత్నాంపై జెనీవాలో జరిగిన ఒప్పందం సయోధ్య ఏర్పడటానికి చక్కని వాతావరణాన్ని ఏర్పరచింది. 1955లో జెనీవాలో సోవియట్ రష్యా, అమెరికా రాజ్యాల అధినేతల ప్రథమ శిఖరాగ్ర సమావేశం

జరిగింది. ప్రచ్ఛన్నయుద్ధ ఉద్రిక్తతల సడలింపులకు ఇది తోడ్పడగా, ఉభయ కూటాల మధ్య సాంస్కృతిక మార్పిడి సంబంధమైన ఒప్పందాలు కుదిరాయి. సంప్రదింపులద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని అగ్రరాజ్యాలు అంగీకరించాయి. 1956అక్టోబరులో సూయజ్ సంక్షోభం తలఎత్తింది. ఈజిప్టును సోవియట్ రష్యా సమర్థించగా, బ్రిటన్, ఫ్రాన్సుల ధోరణిని అమెరికా నిరసించింది. హంగెరీలో తలఎత్తిన ప్రజా తిరుగుబాటును అణచివేయటంలో దానికి సోవియట్ రష్యా క్రియాశీలక మద్దతును ప్రకటించింది. ఈ చర్యను అమెరికా ఖండించింది. 1958లో లెబనాన్‌లో అమెరికా జోక్యం చేసుకోగా, 1960లో సోవియట్ రష్యా గగనతలంపై విహరించిన అమెరికా గూఢచారి విమానాన్ని రష్యా కూల్చివేసింది. అందువల్ల సమావేశం జరగాల్సిన పారిస్ శిఖరాగ్ర సమావేశం జరగక వాయిదాపడింది. 1962లో అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికైన కెన్నెడీ లోగడ అమెరికా అనుసరించిన విధానాంశాన్ని విమర్శిస్తూ సోవియట్ రష్యాతో సుహృద్భావాన్ని, భారతదేశంలాంటి అలీన దేశాలతో స్నేహాన్ని కాంక్షించారు. కెన్నెడీ, కృశ్చేవ్‌ల వ్యక్తిత్వాలకారణంగా అగ్రరాజ్యాల మధ్య ఉద్రిక్తతల తీవ్రతలు కొంతవరకు తగ్గాయి. పర్యవసానంలో 1961లో ఆస్ట్రియాను తటస్థదేశంగా గుర్తించుటకు అగ్రరాజ్యాలు అంగీకరించాయి. 1963 వరకు అణ్వాయుధాల పరీక్షల నిషేధంపై ఉభయ కూటములమధ్య ఎలాంటి ఒప్పందాలు కుదరలేదు. అదే సంవత్సరంలో పాక్షికంగా అణ్వాయుధ పరీక్షల నిషేధం ఒడంబడికను అగ్రరాజ్యాలు కుదుర్చుకొన్నాయి. ఇదే సమయంలో క్యూబా క్షిపణుల సంక్షోభం వచ్చి యుద్ధం తప్పదన్న ప్రమాద పరిస్థితి ఏర్పడింది. సోవియట్ రష్యా క్యూబానుండి క్షిపణుల తొలగింపచ నిశ్చయించటంతో సంక్షోభం సమసిపోయింది. 1964 నుండి అమెరికా వియత్నాంలో జోక్యం కలుగచేసుకోవడం ప్రారంభించింది. వియత్నాంలో అమెరికా కమ్యూనిస్టులను రెచ్చగొడుతున్నదని రష్యా, చైనాలు తులనాడాయి. కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా పోరాడటానికి అమెరికా వియత్నాంకు అపార సైనికబలగాన్ని తరలించింది. అమెరికా ధోరణిపట్ల అమెరికాలోనూ, వెలపలా సర్వత్రా, వ్యతిరేకత వ్యక్తం కావటం దృష్ట్యా అమెరికా ప్రజాభిప్రాయాన్ని తలవంచింది. 1980 దశకంలో వియత్నాం సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.

కమ్యూనిస్టు రాజ్యాలు, అమెరికా కూటమిరాజ్యాలు పరస్పరం స్నేహసంబంధాలు పెంపొందించుకోవాలన్న అభిప్రాయానికి రావడంతో విస్తృతచర్చలు, రాయబారాలు, జరిగి కొన్ని ప్రధానమైన ఒప్పందాలకు దారితీసాయి. 1971లో సముద్ర గర్భంలో అణ్వాయుధాలు ఉంచరాదని అమెరికా రష్యాలు ఒడంబడినాయి. ఉభయ దేశాలమధ్య రాజ్యాధినేతలు సరాసరి మాట్లాడుకోవడానికి క్రెమ్లిన్, వాషింగ్టన్‌ల మధ్య ప్రసార మార్గాలను (HOT LINES) ఏర్పరచుకొన్నాయి. అణు యుద్ధ ప్రమాదం తగ్గించుకోవటానికి అవలంబించాల్సిన పద్ధతులపట్ల కూడా ఉభయరాజ్యాలమధ్య ఒప్పందాలు జరిగాయి. 1972లో కేవలం రెండు స్థావరాలకే ANTI BALLISTIC MISSILESను పరిమితం చేయ అమెరికా రష్యాలు ఒప్పందం కుదుర్చుకొన్నాయి. 1977లో దీన్ని ఒక్క స్థావరానికి మాత్రమే పరిమితం చేశారు. 1977లో ICBM ఖండాంతర క్షిపణుల సంఖ్యను పరిమితం చేయ అమెరికా రష్యాలు ఒప్పందం ఏర్పరచుకొన్నాయి. 1979లో SALT ఒప్పందం కుదుర్చుకొన్నాయి. 1979లో హెల్సింకీలో భద్రత సహకార సమావేశాలు జరిగాయి. యూరోపు ఖండదేశాలు, అమెరికా చైనాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. ప్రచ్ఛన్నయుద్ధాన్ని అంతమొందించుటకు జరిగిన ప్రయత్నంగా దీనిని పేర్కొనవచ్చును. యూరోపులో భౌగోళిక సరిహద్దులను గౌరవించి, సమానత్వాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడాలని ఈ సమావేశంలో అంగీకరించటాన్ని ఒక విశేషంగా భావించవచ్చును. ఈ ఒప్పందంపై సోవియట్ రష్యాకూడా సంతకం చేసింది. సోషలిస్టు దేశాలలో సోవియట్ రష్యా జోక్యం చేసుకోవచ్చునన్న 1968 బ్రెజ్నేవ్ సిద్ధాంతం హెల్సింకీ సమావేశపు ఒప్పందంతో అంతరించిపోయింది. యూరోపుదేశాలపై అగ్రరాజ్యాల ఆధిపత్యం తగ్గించివేయటంలో హెల్సింకీ సమావేశం ప్రముఖమైన పాత్రను నిర్వహించింది. కాని అగ్రరాజ్యాల వైఖరివల్ల ఈ సమావేశ ఫలితాలు అనుభవంలోకి రాలేదు. తమ తమ ప్రాబల్య సమతౌల్యం కొరకు ప్రపంచ శాంతిని పణంగా పెట్టడానికి అగ్రరాజ్యాలు వెనుకాడలేదు. 1979లో పోలెండు సంఘటన, పశ్చిమరాజ్యాలపట్ల అమెరికా వైఖరులను ఇందుకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చును.

BRAOU

సయోధ్య వాతావరణ వృద్ధితో ప్రపంచంలో శాంతి సుహృద్భావాలు పెంపొందుతున్నాయన్న తరుణంలో 1979లో ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ అనుకూల ప్రభుత్వాన్ని నిలబెట్టుటకు రష్యా సేవలను పంపించింది. 1979 నుండి ఆఫ్ఘనిస్తాన్ వ్యవహారాలలో జోక్యం చేసుకొంటూ సైన్యాన్ని నిలపటంతో ప్రపంచమంతా విస్తుపోయింది. ఈ జోక్యం సయోధ్యకు వ్యతిరేకమని అమెరికా భావించింది. సోవియట్ రష్యా చర్యను ఐక్యరాజ్యసమితి సభ్యులలో అధిక సంఖ్యాకులు విమర్శించారు. అంతేగాక ఆఫ్ఘనిస్తాన్‌నుండి రష్యా తన సేనలను ఉపసంహరించుకోవాలంటూ తీర్మానించారు. యూరోపులో క్షిపణుల వివాదం, అమెరికా అంతరిక్షయుద్ధం (STAR WAR) ప్రతి పాదన ప్రచ్ఛన్నయుద్ధాన్ని పునఃప్రారంభించినట్లయింది. అయితే ఇలా రేకెత్తిన ప్రచ్ఛన్నయుద్ధం ప్రభావం సోవియట్ రష్యా విచ్ఛిన్నంతో అంతమైంది. తూర్పు యూరోపురాజ్యాలు కమ్యూనిజం ప్రభావంనుండి స్వేచ్ఛను ప్రకటించుకొన్నాయి. వార్సా కూటమి రద్దుకావటమేగాక 1994లో రష్యా నాటో కూటమిలో చేరిపోయింది. పర్యవసానంలో యూరోపు ఖండంలో శాంతి వాతావరణం నెలకొంది. ఆసియాఖండం ప్రాంతంలోగూడా చెదురుమొదురు సంఘటనలు మినహా ప్రపంచశాంతికి భంగకరమైన సంఘటనలేవీ సంభవించలేదు. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా విదేశీ పెట్టుబడులకు తన దేశపు ద్వారాలను తెరచిపెట్టి ఆహ్వానిస్తున్నది. ఈ విధంగా ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం అంతమొంది శాంతి సుహృద్భావ వాతావరణం అంతర్జాతీయ రాజకీయ రంగంలో వెల్లివిరుస్తున్నది.

10.7 ముగింపు

1950, 60, 70 దశకాలలో అమెరికా సంయుక్తరాష్ట్రాలు, సోవియట్ రష్యాలమధ్య కొనసాగిన ప్రచ్ఛన్నయుద్ధం ఈనాడు అంతర్జాతీయ సంబంధాల చరిత్రలో ఒక అధ్యాయంగా మిగిలిపోయింది. ఈ రెండు రాజ్యాల మధ్య అవగాహన, శాంతియుత సహజీవనం, పరస్పర సహాయ సహకారాలేర్పడటంతో ప్రపంచ శాంతికి గట్టి హామీ లభించింది. ఈనాడు యుద్ధాలు ప్రపంచస్థాయిలో కాక ప్రాంతీయస్థాయిలో జరుగుతున్నాయి. భిన్నరాజ్యాలమధ్య జరుగుతున్న వివాదాలలో అగ్రరాజ్యాల జోక్యం లేదనడానికి వీలులేదు. కాని అలాంటి జోక్యాలు ఒక పరిమితస్థాయినుండి వివాదాలను విస్తృతం చేయడానికి వీలుగా లేవు. శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞాన రంగాలలో సంభవిస్తున్న విప్లవాత్మక మార్పుల ప్రభావం అగ్రరాజ్యాలపై ఉంది. అందువల్లనే నేడు రష్యా, చైనా, తూర్పు యూరోపురాజ్యాలు తమ దేశాలలో ప్రజాస్వామ్య సంస్కరణలను అమలుపరచి ఆర్థికాభివృద్ధికి కావలసిన సహాయాన్ని పశ్చిమదేశాలనుండి పొందుతున్నాయి. ఇదే విధంగా పశ్చిమ యూరోపు దేశాలు భవిష్యత్తులో తమ ఖండంలో యుద్ధాలు జరగగూడదని హెల్సింకీ సమావేశంలో నిర్ణయించాయి. ఆర్థిక, వ్యాపార, వాణిజ్యరంగాలలో తమ వనరులను సమీకరించుకొని పరస్పర అభివృద్ధిని సాధించుకోవాలన్న కాంక్షతో యూరోపియన్ ఎకనామిక్ కమ్యూనిటీని ఏర్పరచుకొన్నవి.

అలీన దేశాలు, అఖండ ఇస్లామిక్ దేశాలు (PAN ISLAMIC COUNTRIES) అంతర్జాతీయ రాజకీయ రంగంలో ప్రవేశించినందున, ప్రచ్ఛన్నయుద్ధ ప్రభావం తగ్గిపోవటంతో అగ్రరాజ్యాలమధ్య సయోధ్య కుదిరింది. ప్రపంచంలో నేడు ప్రచ్ఛన్నయుద్ధ పరిస్థితులు లేవు. రష్యా, అమెరికాల మధ్య, అమెరికా, చైనాలమధ్య సైద్ధాంతిక విభేదాలు గతకాలపు తీవ్రతలను కోల్పోయాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తరువాత కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న రాజ్యాలు యూరోపులో కూడా అంతరించిపోయాయి. అంటే కమ్యూనిజం పూర్తిగా అంతరించిపోయిందని చెప్పవీలులేదు. అమెరికా సహాయాన్ని రష్యా అర్థించటం, తూర్పు యూరోపులో అమెరికా పెట్టుబడులు వృద్ధిచెందటం, రెండు జర్మనీల విలీనం, బెర్లిన్ గోడ కూలగొట్టడం లాంటి సంఘటనలు ప్రపంచంలో అమెరికాను ధీటైన ప్రబల సైనికశక్తిగా నిలబెట్టాయి. చైనా తాను అనుసరిస్తున్న శాస్త్రీయ కమ్యూనిజాన్ని వదలి సడలింపులు చేయటంతో చైనాలో అమెరికా పెట్టుబడులు ప్రవేశించటమేగాకుండా వృద్ధికూడా చెందాయి. పశ్చిమదేశాల సంస్కృతి, నాగరికత పూర్వపు కమ్యూనిస్టు దేశాలలో ప్రవేశించి వెల్లివిరుస్తున్నది. రాజ్యాలమధ్య సైద్ధాంతిక బేధాలు చెప్పకోదగ్గవి కాలేవు.

BRAOU

అణ్వాయుధాల ఉత్పత్తి, ఆయుధపోటీలు అగ్రరాజ్యాలమధ్య గతంలో ఉన్నట్లుగా ఇప్పుడు లేవు. ఒంటరైపోయిన రష్యా చితికిపోయిన తన ఆర్థికవ్యవస్థను పరిదిద్దుకోవటంలోను, రాజకీయ స్థిరత్వం సంపాదించుకోవటంలో తలమునకలై ఉంది. ప్రత్యర్థులు లేరు కనుక అమెరికా ఆయుధ పోటీలో పాల్గొనాల్సిన అవసరం లేకుండాపోయింది. సైనికంగా అమెరికాను ఎదుర్కొనగల దేశం ఏదీ ప్రస్తుతం లేదు. అణ్వాయుధాలు ఉన్న దేశాల సంఖ్య పెరిగినప్పటికీ, వాటిని ఉపయోగించగల ధైర్యం ఏ దేశానికి లేదు.

రెండవ ప్రపంచయుద్ధం తరువాత స్వాతంత్ర్యం పొందిన దేశాలు అలీనోద్యమంతో సంఘటితమై అగ్రరాజ్యాల ప్రాబల్య పరిధినుండి క్రమంగా తొలగిపోయి తమకొక ప్రత్యేక స్థానాన్ని సంతరించుకొన్నాయి. వనరుల వినియోగంలోనూ, ముడిపదార్థాల సేకరణలోనూ అగ్రరాజ్యాల ప్రత్యేకతలను ధైర్యంగా అవి ప్రశ్నిస్తున్నాయి. ఈ రాజ్యాలన్ని ఒక నూతన అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థ కొరకు కృషిచేస్తున్నాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమయ్యాక అంతకుముందుగల ద్విధ్రువ రాజకీయాలు, అమెరికా నేతృత్వంలో ఏకధ్రువ రాజకీయాలుగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి ప్రచ్ఛన్నయుద్ధానికి తావులేదు. ఇప్పుడు నెలకొన్న అంతర్జాతీయ రాజకీయ వాతావరణంలో ప్రచ్ఛన్నయుద్ధ రాజకీయాలున్నాయని చెప్పలేం. సయోధ్య వాతావరణం దాటి ప్రపంచ రాజకీయాలు సహకార రాజకీయ వాతావరణంలోకి అడుగు పెడుతున్నాయి.

– డా॥ ఎం. రాంచందర్

10.8 చదువదగిన పుస్తకాలు

John Spanier	:	Games Nations Play
Herbert L. Peacock	:	Europe and Beyond
Russett - Starr	:	World Politics
Charles	:	The Cold War and After
Peter J. Fliess	:	International Relations in Bipolar World
Richerd J. Barnet	:	The Giants

BRAOU

10.9 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. సయోధ్య అనగా ఏమి? విశ్లేషించండి.
2. సయోధ్య వాతావరణం ఏర్పడిన కారకాలను వివరించండి.
3. సయోధ్య దశలను వర్ణించండి.

II. కింది ప్రశ్నలకు సంక్షిప్తంగా సమాధానాలు రాయండి.

1. అంతరిక్ష యుద్ధాలు
2. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం
3. జర్మనీ ఏకీకరణం

భాగం - 11 అలీన విధానం

విషయక్రమం

11.1 లక్ష్యాలు
11.2 పరిచయం
11.3 అలీనవిధానం - అర్థం
11.4 అలీనవిధానం - విదేశాంగ విధానం
11.5 అలీనవిధాన ప్రధాన లక్షణాలు
11.6 అలీనవిధాన నిర్వచనాలు
11.7 అలీనవిధానం అవలంబించడానికి కారణాలు
11.8 అలీనోద్యమం
11.9 అలీనోద్యమ సభ్యత్వ అర్హతలు
11.10 అలీనోద్యమం శిఖరాగ్ర సమావేశాలు
11.11 ముగింపు
11.12 చదువదగిన పుస్తకాలు
11.13 నమూనా పరీక్షాప్రశ్నలు

BRAOU

11.1 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదివాక మీరు
*అలీనవిధానం అంటే ఏమిటి
*దాని నిర్వచనాలు, లక్షణాలు,
*అలీనోద్యమం బాగా వివరించగలుగుతారు.

11.2 పరిచయం

సార్వభౌమాధికారం గల జాతి రాజ్యాల ఆవిర్భావం (Peace of Westphalia) వెస్ట్ ఫాలియా శాంతి సంధి 1848 ద్వారా గుర్తింపు పొందినప్పటినుండి, అంతర్జాతీయ సంబంధాలు సార్వభౌమాధికారం, స్వాతంత్ర్యం, సమానత్వాల ప్రాతిపదికపై రాష్ట్రాలమధ్య నిర్వహింపబడుతున్నాయని భావించడం జరుగుతోంది. కానీ ఇది కేవలం సాధారణ చట్టబద్ధమైన ప్రాతిపదిక మాత్రమే. నిజానికి ఈ ప్రాతిపదికను గత 350 సంవత్సరాలుగా అతిక్రమించడం జరుగుతోంది. ఒక రాజ్యానికున్న భౌగోళిక, భౌతిక కారకాలు పైన చెప్పబడిన ప్రాతిపదికలను ప్రభావితం చేయునని రాజనీతిజ్ఞులు విశ్వసిస్తున్నారు. గత మూడువందల సంవత్సరాల అంతర్జాతీయ సంబంధాలను పరిశీలించినట్లయితే సార్వభౌమాధికారం, స్వాతంత్ర్యం, సమానత్వాలను వెనుకకునెట్టే ఒక అంశం స్పష్టంగా గోచరిస్తుంది. అది ఏమిటంటే బలవంతమైన రాజ్యాలు బలహీనమైన రాజ్యాలపై ఆధిక్యతను సంపాదించుకునే ప్రయత్నం. ఈ ప్రాతిపదికపైనే రాజ్యాలమధ్య సంబంధాలు కొనసాగుతున్నాయని స్పష్టమవుతుంది. నానాజాతి సమితి, ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సంబంధాల నిర్వహణను క్రమబద్ధం చేయడానికి ప్రయత్నించినప్పటికీ రాజ్యాలమధ్య సంబంధాలు ఇప్పటికీ చాలావరకు బల ప్రాతిపదికపైనే నిర్వహింపబడుతున్నాయి.

ఐక్యరాజ్యసమితి ఆవిర్భవించిన తరువాత అమెరికా, రష్యాలు ఇతర దేశాలను తమ తమ ఆధిపత్యం కిందికి పరస్పరం పోటీపడే రెండు వర్గాలుగా తీసుకువచ్చే ప్రయత్నాలు ప్రారంభించాయి. 1950 నాటికి ఆ ప్రయత్నాలు ప్రచ్ఛన్నయుద్ధ వర్గాలుగా గుర్తింపబడినాయి. అవి అమెరికా నాయకత్వాన గల పశ్చిమ రాజ్యకూటమి, రష్యా నాయకత్వానగల తూర్పు రాజ్యాల కూటమి. నూతనంగా స్వాతంత్ర్యం సంపాదించిన రాజ్యాలు, పాతరాజ్యాలు ఏ కూటమిలో చేరినప్పటికీ తమ ప్రయోజనాలు సిద్ధించవని భావించి కూటములకు వెలుపల ఉండటానికే ప్రాధాన్యత ఇచ్చాయి. భారతదేశం స్వాతంత్ర్యం రాకపూర్వమే ఈ అభిప్రాయంతో ఉంది. సెప్టెంబర్ 7, 1946లో జవహర్‌లాల్ నెహ్రూ ఒక రేడియో ప్రసారంలో భారతదేశం సాధ్యమైనంతవరకు ఒకదానితో మరొకటి ప్రాబల్యంకొరకు పోటీపడే కూటములకు దూరంగా ఉంటుందని చెప్పారు. 1940 మరియు 1950వ దశకంలో ఈ విధానాన్ని రాజనీతిజ్ఞులు, రచయితలు వివిధ పేర్లతో పిలిచినప్పటికీ 1960వ దశకంలో ఈ విధానానికి అలీన విధానం అనే పేరు స్థిరపడిపోయింది.

11.3 అలీనవిధానం - అర్థం

విదేశాంగ విధానంగానూ అంతర్జాతీయ ఉద్యమంగానూ అలీన విధానం రెండవ ప్రపంచయుద్ధం తరువాత అంతర్జాతీయ సంబంధాలలో ఒక విస్మృతమైన ప్రక్రియగా పేర్కొనవచ్చు. 1950వ దశకంలో ప్రారంభమైన ఈ ప్రక్రియ నూతన రాజ్యాలకు ఊపిరినివ్వడమేకాక, వాటికి అభివృద్ధిచెందుతున్న ప్రపంచంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపునిచ్చింది. ప్రచ్ఛన్నయుద్ధ రాజకీయాలను తిరస్కరిస్తూ, యుద్ధనీతి ప్రపంచ శాంతికి ఒక నూతన మార్గాన్ని సూచిస్తూ అలీన దేశాలు ఇంతవరకు ప్రాబల్య దేశాలు తమకే సొంతమని భావించే అంతర్జాతీయ సంబంధాల నిర్వహణను ప్రభావితం చేస్తూ వస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. అంతర్జాతీయ రాజకీయాలలో అలీన విధానం నేడు ఒక గణనీయమైన ప్రక్రియగా పేర్కొనబడుతోంది. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల రాజ్యాల కలయికగా దీన్ని గుర్తించవచ్చు. భిన్న రాజకీయ దృక్పథాలు, భిన్న సామాజిక దృక్పథాలు, విభిన్న అభివృద్ధిగతులు గల రాజ్యాలు మానవాళిని ఒక నూతన పంథాలో నడిపించే ప్రయత్నమే అలీనవిధానం.

మూడు దశాబ్దాలుగా తన ఉనికిని తెలియపరుస్తూ తరువాత రెండు దశాబ్దాలుగా తన ఉనికిని స్థిరపరుచుకున్న ఈ అలీన విధానం భిన్నరూపాలతో కనిపిస్తోంది. ఒక స్థాయిలో ఈ విధానాన్ని ఒక రాజ్య విదేశాంగ విధానానికి ఆలంబనంగా, వేరొకస్థాయిలో కూటమి రాజకీయాలకు భిన్నంగా చేపట్టబడిన సామూహిక ఉద్యమంగా దీనిని చెప్పవచ్చు. అలీన విధానంలోని 'అ' అనే వర్ణం సైనిక కూటములకు, ఆయుధీకరణకు, ప్రపంచాన్ని రెండుగా చేసే ప్రయత్నాలకు వ్యతిరేకతను సూచిస్తోంది. ప్రపంచంలో శాంతికి భంగం కలిగించే ఏ విధానాన్నైనా ఇది వ్యతిరేకిస్తుంది.

ఆర్థిక అసమానతలు, సాంఘిక, రాజకీయ అన్యాయాలు, జాతి, మత విభేదాలను ఆధారంగా చేసుకొని పెద్ద పారిశ్రామిక సామ్రాజ్యవాద శక్తులు అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా నూతనంగా స్వాతంత్ర్యం సంపాదించుకున్న రాజ్యాలు తమ గమ్యానికి ఒక నూతన మార్గాన్ని నిర్దేశించుకొన్నాయి. నవీన వలసవాదానికి ప్రాబల్య రాజకీయాలకు నిరసనగా ఈ మార్గం ప్రాతినిధ్యం వహిస్తుంది. ఐక్యరాజ్యసమితి, ఉత్తర-దక్షిణ రాజ్యాల చర్చలలోను అలీన దేశాలను పేద రాజ్యాల భౌగోళిక ట్రేడ్ - యూనియన్‌గా గుర్తించవచ్చు. ఒక రాజ్యంపై మరొక రాజ్యం ఆధారపడి ఉన్న ప్రపంచ రాజ్య వ్యవస్థలో సమానత్వం, స్వాతంత్ర్యాన్ని కాంక్షిస్తున్న నూతన రాజ్యాల సామూహిక ఉద్యమమే అలీనవిధానం. రెండవ ప్రపంచయుద్ధంతో పశ్చిమ యూరపు రాజ్యాల సామ్రాజ్య వ్యవస్థ కూలిపోయిన తరువాత ప్రపంచంలో నెలకొని ఉన్న రాజకీయ వాతావరణ నేపథ్యంలో అలీనవిధాన ఆవిర్భావం అభివృద్ధిని అర్థం చేసుకొనే ప్రయత్నం చేయాలి.

BRAOU

1946లో మొదలయిన వలస సామ్రాజ్యవాద ఆధిపత్యం 1990వ దశకంలో దాదాపు అన్ని ఆఫ్రికా, ఆసియా, లాటిన్, అమెరికా వలసల విముక్తితో అంతమయింది. స్వాతంత్ర్యం సంపాదించుకొన్న ఈ రాజ్యాలు స్వాతంత్ర్యంతో నూతన బాధ్యతలను చేపడ్తూ నూతన సవాళ్ళను ఎదుర్కొవలసి వచ్చింది. ఈ బాధ్యతలకు సవాళ్ళను ఎదుర్కొనే శక్తి ఈ రాజ్యాలకు లేదనవచ్చును. వలస వాదమంటే కేవలం వస్తుపరమైన దోపిడీ మాత్రమే కాదు. అది ప్రజలలో ఉన్న ఐక్యతను, శక్తిని విలువలను కూడా దోపిడీ చేస్తూ జాతీయ విలువలను క్షీణింపచేస్తూ ప్రజలను హీన నైతికస్థాయికి దిగజార్చింది. ఈ విధంగా దిగజార్చబడిన ప్రజాశక్తిని స్వేచ్ఛ, సమానత్వాలనే ఊపిరితో పునర్నిర్మాణం చేసే బాధ్యతను తక్కువ అంచనావేయడానికి వీలులేదు. 1950మధ్యకాలం నాటికి సాంకేతిక, వైజ్ఞానిక, అణుశక్తి ప్రసార, రవాణా రంగాలలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు ప్రపంచంలో అన్ని రాజ్యాలూ ఒకదానిపై మరొకటి ఆధారపడేలా చేశాయి. ఇంకొకరి ప్రమేయం లేకుండా తమ అభివృద్ధిని తామే సాధించుకొనే రోజులు చరిత్ర పుటల్లో కలిసిపోయాయి. వైజ్ఞానిక వాణిజ్య రంగాలలో వస్తున్న మార్పులు ప్రపంచాన్ని ఒకటిగా చేసే తరుణంలో ఇదివరకటి వలసలు తమ పేదరికంతో ఇదివరకటి వలసాధిపతులయిన సంపన్న రాజ్యాల సరసన సమానంగా కూర్చోగలుగుతున్నాయి. రాజకీయ స్వేచ్ఛా సముపార్జన వలసల విముక్తి ఉద్యమంలో మొదటి దశ మాత్రమే. ఎన్నో ప్రయాసలకోర్చి సాధించుకొన్న రాజకీయ స్వేచ్ఛను సుస్థిరంచేసుకొంటూ దానికి సరియైన అర్థం కలిగించాలంటే సమగ్రమైన జాతీయ విధానం అవసరం. ఈ విధానంలో జాతి సుస్థిరత, అభివృద్ధిని సాధించే అన్ని అంశాలు పొందుపరచబడి ఉండాలి. అంటే రాజకీయ సుస్థిరత, ప్రాంతీయ సమగ్రత, జాతిఐక్యత, సామాజిక మార్పు, ఆర్థికాభివృద్ధి, శాంతి, సహకారం ప్రత్యేకంగా ఇరుగుపొరుగు రాజ్యాలతోనూ సాధారణంగా అన్ని రాజ్యాలతోనూ అటువంటి అంశాలపై నిర్దిష్టమైన విధానాలతో సమగ్రమైన జాతీయ విధానం రూపొందించుకోవాలి. ఈ సమస్యలను ఒకదాని తరువాత మరొకటి పరిష్కరించుకోడానికి తగిన సమయంలేదు. ఒకదానిలో ఒకటి ముడిపడి ఉన్న ఈ సమస్యల పరిష్కారానికి తక్షణ విధానాలు ఎంతో అవసరం. జాతీయ సమస్యలతో ముడిపడి ఉన్న అంతర్జాతీయ సమస్యల శాంతి, యుద్ధం, వాణిజ్యం, ఆర్థికసహాయం, రక్షణ, భద్రత, సిద్ధాంతపరమైన విభేదాలు, తదితర సమస్యల పరిష్కార విధానాలకు కావలసినంత సమర్థత, ముందుచూపు నూతనంగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్న చాలా రాజ్యాలకు తగినంతగా లేదనవచ్చు. ఈ పరిస్థితులలో ప్రాబల్యంగల రాజ్యాల మధ్యగల విభేదాలలో చిక్కుకోకుండా జాతీయాభివృద్ధిని సాధించుకొనే కోరికగల ఇండియావంటి రాజ్యాలకు అలీన విధానం ఒక్కటే తమ విదేశాంగ విధానం రూపొందించుకొనడానికి తగిన మార్గం.

BRAOU

11.4 అలీన విధానం - విదేశాంగ విధానం

ఒక దేశ విదేశాంగ విధానం ఎల్లప్పుడూ ఆదేశం జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల అవగాహనపై ఆధారపడి ఉంటుంది. 1945 తరువాత అనగా రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన తరువాత అంతర్జాతీయ రాజకీయాలలో గణనీయమైన మార్పులు వచ్చాయి. 1945 తరువాత పశ్చిమరాజ్యాలు సోవియట్ యూనియన్ మధ్యగల యుద్ధకాలంనాటి మైత్రి ఒప్పందాలు ఉపసంహరించుకోవడంతోపాటు ప్రపంచంలో రెండు పరస్పరం సిద్ధాంతపరంగా వ్యతిరేక భావాలుగల కూటముల ఏర్పాటుకు కూడా దారితీస్తూ ఆయుధ సముపార్జనను ప్రోత్సహిస్తూ ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణానికి దారితీసింది. తరువాత అంతర్జాతీయ రంగంలో ద్విధ్రువ రాజకీయాలు చోటుచేసుకొంటూ భయానక సమతౌల్యాన్ని (Balance of Terror) సృష్టించాయి. ఈ కాలంలోనే 1955 బాండుంగ్ సమావేశంలో భారతదేశం సహజీవన ప్రాతిపదికపై పంచశీల సూత్రాలను ప్రతిపాదించింది. ఈ సూత్రాలే అలీన విధానానికి మూలస్తంభాలుగా ఏర్పడ్డాయి. జాతీయ స్వాతంత్ర్యం, స్వేచ్ఛా భావనలతో ప్రారంభమైన అలీన విధానం ఒక దేశ విదేశాంగ విధాన రూపకల్పనకు ప్రాతిపదిక కావడమే కాకుండా నూతనంగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్న రాజ్యాల ఐక్యతకు పునాదిగా మారింది. 1950వ దశకంలో అంకురార్పణ జరిగిన అలీన విధానం దానికి తగిన రూపురేఖలను సంతరించుకొంటూ అంతర్జాతీయ వ్యవహారాలలో తనకంటూ ఒక దృక్పథాన్ని ఏర్పరచుకొంది. ఈ

కాలంలోనే అలీన విధానాన్ని తప్పుగా అర్థం చేసుకోవడమే కాకుండా ఈ విధానానికి అమెరికా, రష్యాలు తమ విముఖతను ప్రదర్శించాయి. అయినప్పటికీ 1960వ దశకంలో అలీన విధానానికి ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా రాజ్యాలనుండి గట్టి మద్దతు లభించడమే కాకుండా ఈ దేశాలు తమ విదేశాంగ విధానాలను అలీన విధానాన్ని ఆధారంగా చేసుకొని రూపొందించుకొన్నాయి. జాతి విముక్తి పోరాటాలకు, జాతి పునర్నిర్మాణానికి, అభివృద్ధికి అలీన విధానమే సరైనదని ఈ రాజ్యాలు భావించాయి. 1970వ దశకం నాటికి అలీన విధానం అంతర్జాతీయ వ్యవహారాలలో ఒక తిరుగులేని శక్తిగా రూపొందింది. నూతన అంతర్జాతీయ ఆర్థిక విధాన రూపకల్పనలో పేదదేశాల తరపున అలీన ఉద్యమం ఒక ప్రభావ వర్గంగా పనిచేసింది. తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ రాజ్యాలమధ్య సమన్వయం, సయోధ్యకోసం అలీన రాజ్యాల కృషి శ్లాఘనీయం. 1980వ దశకంలో అలీనోద్యమ ఉనికి, ఐక్యత ప్రభావానికి భంగం వాటిల్లే పరిస్థితులనెదుర్కొని అంతర్జాతీయ వ్యవహారాలలో తన స్థానాన్ని అవి భద్రపరచుకొన్నాయి.

ప్రాబల్య రాజ్యాల కూటములలో భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ మొదట అలీనవిధానం ఏర్పడినప్పటికీ ఆ విధానం మొదటినుండి కూడా సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికలుగా ఒక నూతన ప్రపంచ విధానం ఏర్పరచడంలో ఆసియా, ఆఫ్రికా రాజ్యాల జాతీయ నాయకత్వానికి స్వతంత్ర అంతర్జాతీయ పాత్రను గుర్తించి ప్రోత్సహించి దానికి ప్రాతినిధ్యం వహించింది. అందుకే అలీన విధాన ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులలో రెండు ముఖ్యమైన విషయాలను గుర్తించవచ్చు. నూతనంగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్న రాజ్యాలు జాతీయ, అంతర్జాతీయ రంగాలలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో వ్యవహరించాలనే తపన మొదటిది కాగా రెండవది అమెరికా, రష్యాలమధ్య పరస్పర వైరుధ్యం గల సిద్ధాంతాలనాధారం చేసుకొని ఏర్పడిన ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం, అమెరికా, రష్యాల ప్రాబల్య పరిధినుండి స్వతంత్రంగా ఉండాలని యూరపు రాష్ట్రాలు భావించినప్పటికీ నూతనంగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్న ఆసియా, ఆఫ్రికా రాజ్యంలోనే అలీన విధానం స్పష్టంగా గోచరిస్తుంది. అలీన విధానానికి ప్రాముఖ్యం కలిగించిన వ్యక్తి నెహ్రూ. స్వతంత్ర భారతదేశం ఐక్యరాజ్యసమితి వ్యవహారాలలో చురుకుగా పాల్గొంటూ, కామన్‌వెల్త్ దేశాలలో గణతంత్ర రాజ్యంగా సభ్యత్వం స్వీకరిస్తూ, అంతర్జాతీయ వ్యవహారాలలో శ్రేయోశీలంగా పాల్గొంటూ యుద్ధ రాజకీయాల్లోకి లాగే ఏ కూటమి లేక మైత్రీ ఒప్పందంలో చేరదని నెహ్రూ ఉద్ఘాటించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అలీన విధానం చాలా ప్రాచుర్యంలోకి రావడమేకాకుండా అనేక నూతనరాజ్యాలు ఈ విధానంవైపు మొగ్గుచూపాయి. వీటిలో ముఖ్యంగా సాంప్రదాయక రాజరికాన్ని విప్లవంతో గద్దెదించిన ఈజిప్టు, రష్యాతో తెగతెంపులు చేసుకొని స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్న యుగోస్లేవియాలను పేర్కొనవచ్చు.

11.5 అలీనవిధాన ప్రధాన లక్షణాలు

అలీన విధానంలో కనపడే ముఖ్యాంశాలు (1) ద్విధ్రువ రాజకీయ వాతావరణంలో ఒక రాజ్యం సాధ్యమైనంత ఎక్కువ భద్రత, రక్షణను కల్పించుకోవడం. (2) ఒక రాజ్య రాజకీయ సాంస్కృతిక, మానసిక అవసరాలకు అనుగుణంగా విదేశాంగ విధాన రూపకల్పన. (3) ఒక రాజ్య ప్రాంతీయ ప్రయోజనాలను సాధించుకొనడం. అనగా అగ్రరాజ్యాల ప్రాబల్య రాజకీయాలలో లీనం కాకుండా తమ స్వతంత్ర ఉనికిని కాపాడుకొంటూ తమ జాతీయ ప్రయోజనాలను సాధించుకొనడానికి ఎన్నుకున్న విధానమే అలీన విధానం. 1940 మరియు 1950 దశకంలో ఈ నూతన విధానానికి తగిన పేరు సూచించడానికి రాజనీతిజ్ఞులు ప్రయత్నించారు. ఈ విధానాన్ని Non-Commitment, Non-Involvement, Neutrality, Neutralism, Positive neutrality, independent and active Policy, Peaceful active Co-existence మొదలుగాగల పేర్లతో పిలిచారు. ఈ నూతన విధానాన్ని 1950లో నెహ్రూ అలీన విధానం అనే పేరుతో పిలిచారు. అయినప్పటికి 1961లో Belgradeలో జరిగిన అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో తమ విధానాన్ని అలీన విధానంగా పేర్కొనలేదు. ప్రస్తుతం ఈ విధానాన్ని సాధారణంగా

అలీనవిధానంగా పేర్కొంటునప్పటికీ అలీనోద్యమం అధికారికంగా అలీన విధానాన్ని నిర్వచించలేదు. వ్యవహారికంగా అలీన విధానంగా పిలువబడుతున్న ఈ నూతన విధానానికి 1960వ దశకంలో ఈ వ్యవహారిక న్యాయమే స్థిరపడింది. అలీన విధానాన్ని ఎవరూ నిర్వచించనప్పటికి ఈ విధానాన్ని బలపరిచేవారు, విమర్శించేవారు దాని ప్రత్యేకతలను, గుణాలను గుర్తించారు. కానీ ఈ విధానాన్ని సమర్థించే వారిలోకూడా విధానాల ముఖ్య లక్ష్యాలను పేర్కొనడంలో భిన్నాభిప్రాయాలున్నాయి. అణ్వాయుధాల పోటీ, ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణంలో అలీన విధానాన్ని సక్రమంగా అర్థంచేసుకోవచ్చునని ఎన్‌క్రూమా ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణానికి ప్రాముఖ్యతనివ్వగా మార్షల్ టిటో సిద్ధాంతపరంగా పరస్పర విమర్శ భావాలుగల రెండు కూటములుగా చీలిన ప్రపంచ పరిస్థితులకు ప్రాధాన్యతనివ్వక నూతన రాజ్యాల స్వాతంత్ర్య పరిరక్షణ కాంక్ష, ప్రపంచ రాజ్యాలమధ్య సమానహోదా, గౌరవాలను సాధించుకొనాలనే కోరిక అలీన విధానానికి ప్రాణంవంటిదని చెప్పారు. శాంతి కాంక్ష అలీన విధానానికి మూలమని నెహ్రూ పేర్కొంటూ లక్ష్యం, మార్గం రెండూ శాంతే అని చెప్పారు. అలీన విధానానికి శాంతి సమానత్వాలు మూలాధారాలని అన్ని అలీన దేశాలు అంగీకరించాయి.

11.6 అలీన విధాన విశ్లేషణలు

అలీన విధానాన్ని నిర్వచించడంలో కొన్ని చిక్కులున్నాయి. వివిధ అలీన దేశాలు ఈ విధానాన్ని భిన్న దృక్పథంనుండి చూడడమే అందుకు కారణం. అలీన విధాన స్వరూప స్వభావాలు కాలక్రమేణా కొన్ని మార్పులకు లోనయ్యాయి. బెల్‌గ్రేడ్ సమావేశాలకు హాజరయిన భారత పరిశీలకుడొకరు ఈ విధానాన్ని ఏనుగుతో పోల్చారు. అలీన విధానాన్ని వర్ణించవచ్చు. కానీ నిర్వచింపలేమని చెప్పారు. అలీన విధానాన్ని Neutralismగా పొరపడటం జరిగింది. అగ్రరాజ్యాలు ఆమోదించకపోయినా, గుర్తించకపోయినా చాలా రాజ్యాలు అలీన విధానాన్ని చేపట్టడం జరిగింది. మొదట అగ్రరాజ్యాలు ఈ విధానాన్ని వ్యతిరేకించినప్పటికీ తరువాత ఈ రాజ్యాలే అలీన దేశాల మద్దతుకోసం ఒకదానితో మరొకటి పోటీపడ్డాయి.

మద్దతుకై అగ్రరాజ్యాల పోటీయే అలీనవిధానం బలపడడానికి దారితీసింది. దేనిలోను లీనం కాకపోవడమే అలీనవిధానం. అనగా ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణంలో లీనం కాకపోవడం యుద్ధ వాతావరణాన్ని ప్రోత్సహించే సంధులు, కూటములు, సైనిక (మిలటరీ) స్థావరాలకు దూరంగా ఉండడం. ఈ విధానం నిరాసక్తత విధానంగా కనపడవచ్చు. కానీ ఇది నిరాసక్తతకాదు. అలీనవిధానం క్రియాశీల, నిర్మాణాత్మక అనుకూల విధానం ఎందుకంటే ఈ విధానం ఉమ్మడి శాంతిపై ఉమ్మడి భద్రత ఆధారపడి ఉండడం గోచరిస్తుంది. అందుకే ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణానికి దోహదంచేసే ఒప్పందాలకు, కూటములకు, మైత్రులకు ఈ దేశాలు దూరంగా ఉంటాయి. అయినప్పటికీ తను స్వాతంత్ర్య పరిరక్షణకు భద్రతకు, భంగం కలుగకుండా ఈ దేశాలు ఇతర దేశాంతో సైనిక ఒప్పందాలు చేసుకోవచ్చు. ఈ ఒప్పందాలు ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణాన్ని ప్రోత్సహించేలాగా ఉండకూడదు. అలీన విధానం బలబలను వ్యతిరేకిస్తూ, వర్ణ వివక్షణను గర్హిస్తూ సమాన ఆర్థిక హక్కులకై పోరాడుతోంది. కూటముల ప్రాబల్య రాజకీయాలకు దూరంగా ఉంటూ ప్రపంచ వ్యవహారాలలో చురుకుగా పాల్గొనడమంటే ప్రపంచ వ్యవహారాలలో స్వతంత్రమైన నిర్ణయాలు తీసుకోవడమే. ప్రపంచ సమస్యలపై స్వతంత్ర అభిప్రాయం ఉండడమే అలీనవిధాన లక్షణం. అలీన దేశాల స్వతంత్ర అభిప్రాయాలు ఏదేని అగ్రరాజ్య అభిప్రాయంతో ఏకీభవించవచ్చు లేదా వ్యతిరేకించవచ్చు. అనగా సమస్యలను బట్టి అలీన రాజ్యాం విధానాయింటాయేకాని ఏ దేశపు సమస్య అనే అంశంపై అలీన రాజ్యాల విధానాలుండవు. అలీన విధానమంటే నిష్పాక్షిక విధానం అని నెహ్రూ మొదటి బెల్‌గ్రేడ్ సమావేశంలో అన్నాడు. కూటములకు దూరంగా ఉంటూ సమస్యల తీరునుబట్టి స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడమే అలీన విధానం. యుద్ధానికి దారితీసే పరిస్థితులేర్పడినప్పుడు అలీనదేశాలు ఉదాసీనంగా ఉండకుండా యుద్ధనివారణకు, శాంతిరక్షణకు కృషిచేస్తాయి. వ్యక్తి స్వేచ్ఛా ఉనికికి భంగం వాటిల్లే పరిస్థితులలో అలీన దేశాలు

BRAOU

చూస్తూ ఊర్కోవు. ఎందుకంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యాల రక్షణకే అలీన విధానం కట్టుబడి ఉంది. అలీన విధానం వలసలకు, సామ్రాజ్యాలకు వ్యతిరేకం, వర్ణవివక్షణకు వ్యతిరేకం. అభివృద్ధి చెందుతున్న దేశాలమధ్య ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. శాంతియుత మార్గాలద్వారా సమస్యలను పరిష్కరించుకొనడం అలీన విధానానికి మూలస్తంభం. అలీన విధాన ముఖ్య లక్షణాలను పరిశీలిస్తే ఈ విధానానికొక ప్రత్యేక తత్వముందని తెలుస్తుంది. ఈ విధానానికున్న లక్షణాలు దీనికొక అనుకూల విధానంగా తీర్చిదిద్దాయి. అలీన విధానానికి ఎక్కడా అధికారికంగా నిర్వచనం ఇవ్వలేదు. అలీన దేశాల సమావేశాలలోను, ఇతరత్రా అలీన విధానంగూర్చి వివరణలు చాలా వెలువడ్డాయి. అవి ఏవీకూడా అధికార నిర్వచనానికి ప్రత్యామ్నాయాలు కావు. అలీనదేశాల శిఖరాగ్ర సమావేశాలలోగానీ, మంత్రివర్గస్థాయి సమావేశాలలోగానీ అలీన విధానాన్ని ఎప్పుడూ నిర్వచింప తలపెట్టలేదు. ఈ సమావేశాలు విడుదలచేసిన అధికార ప్రకటనలలో అలీన విధాన లక్షణాలను మాత్రమే పేర్కొన్నారు. 1961బెల్‌గ్రేడ్ శిఖరాగ్ర సమావేశం సమావేశమైన దేశాలకు మూడవ కూటమి ఏర్పాటుచేసే భావన అసలులేదని అలీనదేశాలు ఒక కూటముగాదని పేర్కొంది. ప్రపంచాన్ని కూటములుగా విభజించడానికీ, ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణాన్ని ప్రోత్సహించే విధానాలకు అలీనదేశాల వ్యతిరేకతను ఈ సమావేశం చాటిచెప్పింది. ప్రాబల్య రాజకీయములను కూటమి రాజకీయాలను దృష్టిలోఉంచుకొని ప్రపంచ వ్యవహారాలలో స్వతంత్ర విధానాన్ని ఆవలంబించే ప్రధాన లక్షణంకూడా ఈ సమావేశంలో ప్రత్యక్ష ప్రస్తావనకు నోచుకోనప్పటికీ తరువాత ప్రకటనలలో ఈ లక్షణం ప్రాముఖ్యతను సంతరించుకొంది. 1964 కైరో శిఖరాగ్ర సమావేశంలో మరి రెండు గుణాలు ప్రస్తావించారు. అవి శాంతియుత సహజీవనం, ప్రచ్ఛన్నయుద్ధాన్ని ప్రోత్సహించే సంధులు మైత్రి ఒప్పందాలకు దూరంగా ఉండడమే కాకుండా ప్రచ్ఛన్న యుద్ధంలో పాల్గొంటున్న కూటములకుగానీ దేశాలకుగానీ సైనిక స్థావరాలను, ఆ స్థావరాలు ఏర్పాటుకావించబడు దేశాల ఇష్టానికి వ్యతిరేకంగా ఏర్పరచుకొనడానికి వ్యతిరేకత. 1973 అల్జీర్స్ శిఖరాగ్ర సమావేశంలో అలీన విధానానికి మరొక అంశం చేర్చారు. అంతర్జాతీయ సంబంధాలను ప్రజాస్వామ్యీకరించుటయే ఈ నూతన అంశం. 1979 హవానా శిఖరాగ్ర సమావేశం అలీన విధానం అన్నివిధాలైన ఆధిపత్యాలకు వ్యతిరేకమని పేర్కొంటూ నూతన అంతర్జాతీయ ఆర్థిక విధానం ఏర్పాటు, సమానత్వ ప్రాతిపదికపై అంతర్జాతీయ సహకారం, రాజ్యాల స్వయం నిర్ణయాధికారం, మానవహక్కులు ప్రాథమిక స్వేచ్ఛలపై గౌరవం సహజవనరులపై సార్వభౌమత్వం, చట్టబద్ధంగా గుర్తింపుపొందిన అంతర్జాతీయ సరిహద్దులు, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలనే అంశాలను పునరుద్ఘాటించింది. 1981 అలీన దేశాల విదేశాంగ మంత్రుల ఢిల్లీ ప్రకటన సామ్రాజ్యవాద, వలసవాద నయావలసవాద విధానాలకు, జాతి విచక్షణకు, విదేశీ దురాక్రమణలకు, ఆధిపత్యానికి, విదేశీ జోక్యానికీ, ప్రాబల్య రాజకీయాలకు కూటములకు వ్యతిరేకమని స్పష్టంచేసింది. అలీనోద్యమంలో సభ్యత్వం స్వీకరించడానికి ఏర్పరచిన ప్రమాణాలను పరిశీలిస్తే అలీన విధానానికి అర్థం స్పష్టమవుతుంది. ప్రపంచ వ్యవహారాలలో, రాజ్యాల విధాన రూపకల్పన ఆచరణలో రాజ్యాలకు తగినంత స్వేచ్ఛను కోరడమే అలీనవిధాన ప్రధానోద్దేశం. సామ్యవాద, పెట్టుబడిదారీ దేశాల కూటముల రాజకీయాలలో ఈ స్వేచ్ఛ మరింత అవసరమని అలీన విధానాన్ని ఆచరించే దేశాలు భావిస్తాయి. ఒక రాజ్యంపై మరొక రాజ్యం పరస్పరం ఆధారపడి ఉన్న ఈ కాలంలో రాజ్యాలకు అంతర్జాతీయ రంగంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ఆవశ్యకతను అలీనవిధానం ప్రస్ఫుటం చేస్తుంది. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో రూపొందించిన విధానాలు, నిర్ణయాలు మాత్రమే అంతర్జాతీయ సమస్యలను వాటి బాగోగులను అవి ఉద్భవించిన పరిస్థితులను పరిగణనలోనికి తీసుకుంటాయి. విభిన్న సామాజిక వ్యవస్థలు, సిద్ధాంతాలమధ్య శాంతియుత సహజీవనాన్ని అలీనవిధానం సమర్థిస్తుంది. ఇతర రాజ్యాల సార్వభౌమత్వాన్ని, సమానత్వాన్ని గుర్తించిన రాజ్యాలే శాంతియుత సహజీవనాన్ని సమర్థిస్తాయి. అలా కానట్లయితే రాజ్యాలు ఒకదానితో మరొకటి ఎప్పుడూ ఘర్షణ పడుతుంటాయి. అలీన విధానంలో శాంతియుత సహజీవనానికి ప్రత్యేక అర్థముంది. అంతర్జాతీయ సహకారానికి అడ్డునిలిచే అన్నిరకాల వివక్షణలను అడ్డంకులను తొలగించి సహకారానికి, మార్గం సుగమం చేసేందుకు దీక్షబూనడం, కృషిచేయడం శాంతియుత సహజీవనానికి అర్థం. అలీన దేశాలు, ఇతరదేశాల మధ్య శాంతియుత అంతర్జాతీయ సహకారాన్ని అలీనవిధానం సమర్థిస్తుంది.

BRAOU

ప్రాబల్య రాజకీయాలకు దూరంగా ఉంటూ కూటమి రాజ్యాలతో రాజకీయ సైనిక ఒప్పందాలను నిరసిస్తూ, తమ దేశాలలో కూటముల సైనికదళాలను అనుమతించకుండా ప్రపంచ వ్యవహారాలలో స్వతంత్ర వైఖరినవలంబించడమే అలీనవిధానం. ప్రపంచ వ్యవహారాలపై ఒక ప్రత్యేకమైన నూతన దృక్పథమే అలీనవిధానం. ఇది ప్రపంచ వ్యవహారాలను స్వతంత్ర, విశాల, ప్రజాస్వామ్య దృక్పథంతో పరిశీలిస్తుంది.

యుద్ధకాలంలో యుద్ధంలో పాల్గొనకుండా ఉండే తటస్థ విధానం (Neutrality) గానీ, శాంతి సమయాల్లో స్విస్ మరియు ఆస్ట్రియా దేశాలు పాటించే Neutrality గాని ఖచ్చితంగా అలీనవిధానం కాదు. కొన్ని అలీనదేశాల అనధికార వర్గాలలో వినవచ్చే (Neutralism) తటస్థ విధాన వాదంగానీ కూటములలో చేరని స్వీడన్ మరియు Irelandలు పాటించే Neutralismగాని అలీనవిధానం కానేకాదు. గతంలో అమెరికా పాటించిన ఏకాంత విధానం కూడ అలీన విధానంకాదు. అలీన విధానం నిరాసక్తతను సూచించదు. అంతర్జాతీయ బాధ్యతలనుండి తప్పించుకొనడం అలీనవిధానం కాదు. అంతర్జాతీయ వ్యవహారాలలో చురుకుగా పాల్గొనడాన్ని, జాతులమధ్య సహకారాన్ని అలీన విధానం ప్రతిబింబిస్తుంది. ప్రపంచ సమస్యలను అలీనవిధానం గోడమీది పిల్లిలాగ చూడదు. సమకాలీన ప్రపంచ సమస్యలను అది పట్టనట్టుచూస్తూ కూర్చోదు. అలీన విధానం అవకాశవాదం కాదు. బాధ్యతలను వదిలి తూర్పు, పశ్చిమ రాజ్యాలనుండి సాధ్యమైనంత ఎక్కువగా లాభపడడం కూడ అలీన విధాన లక్షణంకాదు. ప్రపంచ రాజకీయాలను కేవలం చూస్తూ కూర్చోదు. వాటిలో చురుకుగా పాల్గొనడమే అలీన విధాన లక్షణం. అలీన విధానం తూర్పు, పశ్చిమరాజ్యాల నుండి స్నేహ, సహకారాలను కాంక్షిస్తుంది. అంతర్జాతీయ రాజకీయాలలో అలీన దేశాలు చురుకుగా పాల్గొంటాయి. కాబట్టి అవి ఆ రాజకీయాలలో మధ్యవర్తి (UMPIRE)గా వ్యవహరించడానికి ప్రయత్నించవు. అట్లని అవి కూటమి రాజకీయాలలో చేరిపోయే ప్రయత్నం చేయవు. కాగా ప్రతిసమస్యమీదా దాని బాగోగులను బట్టి నిర్ణయాలు తీసుకొంటాయి. అలీన రాజ్యాల విధాన నిర్ణయాలు ఏదో ఒక కూటము నిర్ణయాలతో ఏకీభవించవచ్చు లేదా ఏకీభవించకపోవచ్చు. ఒకవేళ ఏకీభవించినా అలీన రాజ్యాలు ఆ కూటమిలో చేరినాయని భావించడానికి వీలులేదు. కొన్నిదేశాలు విమర్శిస్తున్నట్లుగా అలీనదేశాలు తామే నైతికంగా బలమైన దేశాలుగా చెప్పుకోవడంలేదు. ఇతర దేశాలు నైతికంగా ఎంత బలమైనవో అలీనదేశాలు కూడా అంతే బలమైనవి. అలీనదేశాలు మంచినే చేస్తాయని చెప్పడానికి వీలులేదు. అన్ని రాజ్యాలు మాదిరిగానే అలీనదేశాలు తమ తమ జాతీయ ప్రయోజనాలను సాధించుకోడానికి ప్రయత్నం చేస్తాయి. ఆ ప్రయత్నాలలో ఆ దేశాలు ఇతరుల ప్రయోజనాలను కూడా కాంక్షింపవచ్చును. అంతర్జాతీయ స్థితిగతులపై, సమస్యలపై ప్రచ్ఛన్నయుద్ధ రాజ్యాల దృక్పథం ఎల్లప్పుడూ కానీ, అప్పుడప్పుడూగానీ, పూర్తిగాకానీ, లేదా కొంతవరకైనాగానీ, తప్పు అని కానీ, లేదా ఒప్పు అని కానీ అలీన దేశాలు చెప్పవు. అందుకే అలీన దేశాల నిర్ణయాలు కూటమిరాజ్యాల నిర్ణయాలపై ఆధారపడవు. అవి సమస్యల Merits మంచి చెడ్డలు ఆధారంగా తీసికొని స్వతంత్ర విధానాలనవలంబిస్తాయి.

అణుయుగంలో అలీన విధానాన్ని వాస్తవిక విధానంగా పేర్కొనవచ్చు. కూటమిరాజ్యాల విధానంలాకాక అలీనవిధానం ఏ ఇతర రాజ్యంతోనైనా స్నేహాన్ని, ప్రాంతీయ లేదా భౌగోళిక వ్యవస్థలలో సభ్యత్వాన్ని సమర్థిస్తుంది. కానీ ఈ సభ్యత్వం సైనిక కూటములలయి ఉండకూడదు. ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణాన్ని ప్రోత్సహించకూడదు. అలీన విధానం ఏ రాజకీయ సిద్ధాంతానికీ వ్యతిరేకంకాదు. శాంతిని పెంపొందిస్తూ అన్ని దేశాలతో స్నేహాన్ని ప్రోత్సహిస్తుంది. రాజకీయ, సైద్ధాంతిక, సామాజిక వైవిధ్యాలు ఈ స్నేహానికి అడ్డురావు. అలీనోద్యమంలోని రాజ్యాల్లో భిన్న రాజకీయ, సామాజిక, ఆర్థికవ్యవస్థలున్నాయి. కూటములు లేకుండా ఐక్య ప్రపంచ వ్యవస్థకు పాటుపడే అలీనవిధానాన్ని మూడవశక్తిగా పరిగణించడానికి వీలులేదు. నెహ్రూ అన్నట్లుగా ఇది మూడవ సైనిక శక్తికాదు. కానీ నైతికశక్తి. అంతర్జాతీయ పరిస్థితులను సమస్యలను అవగాహన చేసుకొని పరిష్కార మార్గాలను సూచించడంలో అలీనవిధానం ఒక నూతన దృక్పథంగా పేర్కొనవచ్చు. కూటమి రాజ్యవిధానంకంటే అలీన విధానం సమస్యలనర్థం చేసుకొనడంలో ఎక్కువ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనిస్తుంది. విధాన నిర్ణయంలో ఈ స్వేచ్ఛలేని

BRAOU

విధానం అలీనవిధానం కాలేదు. అందుకే అలీనత్వం ఒక విధానం, ప్రపంచ వ్యవహారాలపై ఒక దృక్పథం ఒక సరళి, విధాన లక్ష్యాన్ని సాధించే ఒక మార్గంగా వర్ణింపవచ్చును.

ప్రతి రాజ్యానికీ సార్వభౌమాధికారం, స్వేచ్ఛ, సమానత్వాలున్నప్పటికీ నిజానికి ఖచ్చితంగా చెప్పాలన్నట్లయితే ఈ గుణాలు సాపేక్ష (relative) గుణాలు. ముఖ్యంగా నూతనంగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్న కొన్ని రాజ్యాలు నిజానికి అవి ఏ మేరకు పై గుణాలను కలిగి ఉన్నాయో తమకు తామే నిర్ణయించుకోవాలి. అలీన విధానాన్ని ఎన్నుకొన్న రాజ్యాలు కొన్ని విధులను తమకు తామే నిర్ణయించుకొని పాటించవలసి ఉంటుంది. అలీన విధానాన్ని ఎంపిక చేసుకోవడంతోనే సరిపోదు. తమ ప్రకటనలద్వారా, చేతలద్వారా అలీన విధానాన్ని అనుసరిస్తూ కనపడాలి. యాంత్రికంగా అగ్రరాజ్యాలు అవలంబిస్తున్న విధానాలను విమర్శిస్తూనో లేక సమర్థిస్తూనో ఉండకూడదు. ఆర్థికంగా బలంగల రాజ్యాలపై ఆధారపడి ఉండడం తగ్గించుకోవాలి. రాజకీయ, ఆర్థిక, సామాజిక, వైవిధ్యంగల రాజ్యాలతో శాంతియుత సహజీవనం గడపడం, శాంతియుత మార్గాలద్వారా సమస్యలను పరిష్కరించుకొనటం తమ భూభాగాలపై విదేశీ సైనిక దళాలను అనుమతించకపోవడం లాంటివెన్నో అలీన దేశాలు పాటించాలి.

అలీన విధానంద్వారా ఒక రాజ్యం తన అంతరంగిక విధాన లక్ష్యాలను సాధించుకొనవచ్చు. ఆర్థిక ప్రగతికి ఒక రాజ్యం తన అవసరాలకు పరిపోయే ఏ ఆర్థిక విధాన్నైనా అనుసరించవచ్చు. అది కమ్యూనిజం కావచ్చు, పెట్టుబడిదారీ విధానం కావచ్చు లేదా మిశ్రమ ఆర్థిక విధానం కావచ్చు. అది ప్రచ్ఛన్నయుద్ధ రాజ్యాలనుండి సహాయం పొందవచ్చు లేదా అసలు సహాయం అర్థించకపోవచ్చు. విదేశీ వర్తక వాణిజ్యాలను తనకనుగుణంగా మలచుకొనే స్వేచ్ఛా స్వాతంత్ర్యం అలీనదేశాలు కలిగి ఉండాలి. అలీన విధానం విదేశాంగ విధానంగా ఒక రాజ్యాన్ని భావజాల సంబంధాలనుండి విముక్తి కలిగించి ముందుకు నడిపే విధానంగా పేర్కొనవచ్చు. దాదాపు350 సంఖ్యలనుండి సార్వభౌమాధికారంగల రాజ్యవ్యవస్థ ఉన్నప్పటికీ అలీన విధానం ఒక విదేశాంగ విధానంగా దాదాపు 2/3 వంతుల స్వతంత్రరాజ్యాలే కలిగి ఉండడాన్ని సమర్థించుకోవడం నిజంగా శోచనీయం. ఎందుకంటే స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, సార్వభౌమాధికారం, సమానత్వం ఈ వ్యవస్థ ముఖ్య లక్షణాలు. ఈ లక్షణాలే పట్టుకొమ్మలుగా గల అలీనవిధానం వీటిని పరిరక్షిస్తూ వీటి ఉన్నతికి దోహదం చేస్తుంది. గత మూడు నాలుగు దశాబ్దాల సంవత్సరకాలంలో పెద్దరాజ్యాలు చిన్న రాజ్యాలను తమ ప్రాబల్య పరిధిలో ఉంచుకోవడం లేక ఉంచుకోవడానికి ప్రయత్నించడం మనం గమనింపవచ్చు. అంతర్జాతీయ రాజకీయాలలో ఈ విషయం పరిపాటి అయింది. తద్వారా స్వేచ్ఛ, సార్వభౌమాధికారం, సమానత్వంగల రాజ్యాలు వాటిని చట్టపరంగా కలిగి ఉంటూ అంతర్జాతీయ రాజకీయ రంగంలో పాల్గొంటున్నప్పుడు వాటిని పూర్తిగ మరుగున పెట్టడం జరిగింది. ఈ విధంగా పెద్దరాజ్యాల పెత్తనం, చిన్నరాజ్యాలు వాటిని వెంబడించడం అంతర్జాతీయ ప్రవర్తనా విధంగా మారిపోయింది. పరిస్థితులకు తలవంచి, వివిధ రాజకీయ ఒత్తిడులకు లొంగి రాజ్యాలు మరచిపోయిన సార్వభౌమాధికారం, స్వేచ్ఛ సమానత్వాలకు అలీనవిధానం తిరిగి ప్రాణంపోసి ఒక నిర్దిష్టమైన విధాన ప్రత్యామ్నాయాన్ని సిద్ధాంతాలను ప్రపంచ రాజకీయాలలోకి తీసుకువచ్చింది. సార్వభౌమాధికారంగల రాజ్యవ్యవస్థ ముఖ్య అంశాలను పాటించమని అలీనవిధానం కోరుకొంటుంది. నిజానికి ప్రతి రాజ్యం సార్వభౌమాధికారం, స్వేచ్ఛ, సమానత్వాలను కోరుకొంటుంది. కానీ చాలారాజ్యాలు వాటి వాటి జాతీయ ప్రయోజనాల నాశించి ప్రాబల్య రాజ్యాల ఒత్తిడి ఫలితంగా తమ స్వేచ్ఛ సమానత్వాలను అనుభవించలేకపోయాయి. అలీనవిధానం రాజ్యాలకు ఈ స్వేచ్ఛా సమానత్వాలను గుర్తుచేసింది. అయినప్పటికీ రాజ్యాలు లీనం కావడం అలీనం కావడం ఆయారాజ్యాల జాతీయ ప్రయోజనాల దృష్ట్యా జరుగుతుంది. రాజ్యాలు తమ జాతీయ ప్రయోజనాలను తమ తమ దృక్పథంద్వారా నిర్ణయించుకొంటాయి.

అలీన విధానాన్ని అవలంబించే రాజ్యాలు ఆ విధానాన్ని తమ తమ దృక్పథంనుండి దేశ, కాల పరిస్థితులను బట్టి సమర్థించుకొన్నాయి. మారుతున్న జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులకనుగుణంగా విధాన సమర్థనలో మార్పు

BRAOU

గోచరిస్తుంది. 1950వ దశకంలో ప్రచ్ఛన్నయుద్ధం, మూడవ ప్రపంచయుద్ధ భయం, అణుయుద్ధ భయం కారణాలు కాగా 1960 తరువాత నిరాయుధీకరణ నూతన అంతర్జాతీయ ఆర్థిక విధానాలకు ప్రాముఖ్యం లభించింది. 1950 60వ దశకాల్లో అలీన రాజ్యాల అంతరంగిక సమస్యలు 1980లలో లేవు. అయినప్పటికీ ఆయారాజ్యాలు అలీన విధానానికే కట్టుబడి ఉన్నాయి. అలీన విధానం అవలంబించడానికి గల కారణాలు మారి ఉండవచ్చు. కానీ అలీన విధానం పాటించే నిర్ణయాల్లో మార్పురాలేదు.

దాదాపు 100 రాజ్యాలకు పైబడి అలీన విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఒక్కొక్క రాజ్యం ఈ విధానం అవలంబించడానికి ఒక్కో కారణం ఉండి ఉండవచ్చు. అవి ఆయారాజ్యాల భౌగోళిక రాజకీయ పరిస్థితులు కావచ్చు. లేదా జాతీయ ప్రయోజనాలు లేదా విదేశాంగ విధాన లక్ష్యాలు కావచ్చు. ఒక్కోసారి లీనమయ్యే విధానం కాని అలీనవిధానం కాని ఒక రాజ్యం తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది. భౌగోళిక, రాజకీయ స్థితిగతులు ఈ విధాన ఎంపికను ప్రభావితం చేస్తాయి. అయినప్పటికీ దాదాపు మూడింట రెండువంతుల స్వతంత్ర రాజ్యాలు అలీన విధానాన్నెన్నుకొన్నాయి. ఈ ఎంపికకు సాధారణ కారణాలేమైనా ఉన్నాయా?

స్వతంత్ర విధాన నిర్ణయం, చర్య అలీన విధాన ముఖ్య సూత్రం కాబట్టి రాజ్యాలు ఈ విధానాన్నెంపిక చేయడానికి ప్రత్యేక కారణం వెతుక్కోవలసిన అవసరం లేదు. రాజ్యాలు స్వతంత్రంగా ఉండాలనుకునే కోరిక ఉన్నంతమాత్రాన సరిపోదు. దానికి కావలసిన పరిస్థితులు కూడా ఉండాలి. ఈ పరిస్థితుల కారణంగా స్వాతంత్ర్యాభిలాష ఉన్నప్పటికీ రాజ్యాలు నిజంగా స్వతంత్రంగా ఉండకపోవచ్చు. స్వతంత్ర విదేశాంగ విధానం అవలంబించలేకపోవచ్చు. రాజ్యాలు తామున్న భౌగోళిక, రాజకీయ, సామాజిక, ఆర్థిక, సిద్ధాంతపరమైన పరిస్థితులకనుకూలంగా తమ విధానాలను ఏర్పరచుకొంటాయి. అవి లీనానికి లేక అలీనానికి దారితీయవచ్చు.

11.7 అలీన విధానం అవలంబించడానికి కారణాలు

(1) చాలా రాజ్యాలు అలీన విధానం అవలంబించడానికి రెండవ ప్రపంచయుద్ధం తరువాతకాలంలో సిద్ధాంతపరంగా నెలకొని ఉన్న ద్విధ్రువ రాజకీయ వాతావరణమే కారణం. ప్రపంచం ఈ విధంగా రెండు భాగాలుగా చీలి ప్రచ్ఛన్నయుద్ధానికి దారితీసిన పరిస్థితి, తద్వారా నెలకొని ఉన్న ప్రపంచ పరిస్థితి తమ తమ జాతీయ ప్రయోజనాలకు గానీ ప్రపంచశాంతికి గాని దోహదం చేయదని మూతనంగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్న ఆఫ్రికా, ఆసియా రాజ్యాలు తరువాత లాటిన్ అమెరికా రాజ్యాలు భావించడం జరిగింది. ద్విధ్రువ రాజకీయాలు శాంతి క్షీణతకు గానీ, శాంతిని పెంపొందించటానికి గానీ, దోహదం చేయకపోగా ఆ వాతావరణంలో తాము తమ ఒలయ ప్రయోజనాలను సాధించుకోలేమని తమ స్వతంత్ర ఉనికిని కాపాడుకోలేమని తాము ఆశించే ఆర్థికాభివృద్ధిని సాధించలేమని నూతనంగా స్వాతంత్ర్యం పొందిన రాజ్యాలు భావించాయి. సైనిక కూటములలో చేరడం శాంతియుత వాతావరణ లక్షణం కాదు. తాము సైనిక కూటములలో చేరకపోవడం అణుయుద్ధం ద్వారా జరిగే విధ్వంసాన్ని వాయిదా వేయడమేనని లేకుంటే ద్విధ్రువ రాజకీయాలు ప్రపంచాన్ని ధ్వంసం చేస్తాయని ఈ రాజ్యాలు భావించాయి. ఏ కూటమిలోనూ కలువకపోతే రెండు కూటములమధ్య వారధిలాగా పనిచేయవచ్చని అలీన దేశాలు భావించాయి. ప్రపంచ విధ్వంసాన్ని అరికట్టే ఆర్థిక, సైనిక బలం ఈ దేశాలకు లేకపోవచ్చు. కానీ ఈ విధ్వంసంనాపే నైతికశక్తి అలీన దేశాలకుందని నెహ్రూ, Belgrade సమావేశంలో అన్నారు.

(2) అలీనవిధానం అవలంబించుటకు రెండవకారణం మానసికమైంది. ఒకరాజ్యం సాధారణమైన అర్థంలో స్వేచ్ఛననుభవించడమే కాక అది అన్ని రీతులలో కూడా ప్రాబల్య రాజ్యాల ప్రాబల్య పరిధినుండి స్వేచ్ఛను అనుభవిస్తున్నట్లు కనపడాలన్న మానసిక ఉద్వేగం అలీన విధానానికి దారితీసిందనవచ్చు. అలీన విధానంలోనే రాజ్యాలు స్వతంత్రంగా తన అభిప్రాయాలను ప్రపంచ సమస్యలపై స్వేచ్ఛగా వ్యక్తీకరించవచ్చు. అలీన విధానం

BRAOU

రాజ్యాలకు వ్యక్తిగతంగా సామూహికంగా కూడా ప్రాబల్య రాజ్యాలతో సమాన గౌరవ ప్రతిష్టలను కలిగించింది. రెండవ ప్రపంచయుద్ధానికి ముందు ఈ పరిస్థితి లేదు. శాంతికి భంగం కలిగించే ఏ సమస్యనైనా నిర్భయంగా చర్చించే అవకాశం అలీన విధానం కల్పించిందని టిటో పేర్కొన్నాడు.

సిద్ధాంతపరమైన విభేదాలలో చిక్కుకోకుండా తమకై ఒక ప్రత్యేక స్థానం కల్పించుకొని తమ ఉనికికి ముప్పు వాటిల్లకుండా తమ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే పరిస్థితి అలీన విధానం కల్పించింది. అలీన విధానంతో రాజ్యాలు తమ రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక ప్రత్యేకతలను కాపాడుకోవచ్చు. మనం యూరపు, అమెరికా, రష్యాల ప్రతిబింబాలుగా మారకూడదు మనం ఆసియా, ఆఫ్రికావాసులం. అమెరికా, రష్యాలను అనుసరించడం మన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు గౌరవం కాదని "నెహ్రూ" అన్నాడు. మన మాటలు వేరొకరి మాటలకు ప్రతిధ్వని కాకూడదు. మన మాటలు మన అభిప్రాయాలను ప్రతిధ్వనించాలని లాల్ బహదూర్‌శాస్త్రి అలీన విధానం గూర్చి అన్నాడు. పశ్చిమ లేదా కమ్యూనిస్టు సిద్ధాంతాలను నమ్మినప్పటికీ నూతనంగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్న రాజ్యాలు వాటికి ప్రతీకలుగా మారదలచుకోకుండా తమ తమ పరిస్థితులకనుగుణంగా అవసరమైన మేరకు వాటినుపయోగించుకొని తమకంటూ ఒక ప్రత్యేకతను ఏర్పరచుకోవాలని అలీన విధానం అవలంబించే రాజ్యాల కోరిక. అవలంబించి తప్పులు దిద్దుకొనే పద్ధతిలో నూతన రాజ్యాలు తమ చారిత్రక, మత, సిద్ధాంతపరమైన విలువలనాధారంగా తమ తమ రాజ్యాలను అభివృద్ధి పథంలో నడిపించే అభివృద్ధి పథకాన్ని స్వతంత్రంగా తయారుచేసుకోవాలన్న కాంక్ష అలీన విధానానికి దారితీసింది. సహనం, సహకారం, సమానత్వం, స్వేచ్ఛలనుండి అలీన విధానం ఆవిర్భవించింది. ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణంలో వీటికి స్థానం లేదు. కానీ నూతన రాజ్యాలు ప్రపంచాన్ని తాము నమ్మిన సూత్రాలు అనగా సహనం, సహకారం, స్వేచ్ఛ, సమానత్వాల ధృక్పథంతో చూడాలన్న మానసిక తపన, ఉద్వేగం అలీన విధానానికి దారితీశాయి. తమ తమ లక్ష్యాలను అలీన విధానంతో మాత్రమే సాధించుకోగలమనే నమ్మిక నూతన రాజ్యాలకుంది. పెట్టుబడిదారీ, కమ్యూనిస్టు విధానాలలో అది సాధ్యపడదని కూడా ఈ దేశాలు భావించాయి. వలస విధానంలో వివిధ విచక్షణాలకు గురి అయి స్వాతంత్ర్యం సంపాదించుకొన్న నూతన రాజ్యాలు తిరిగే వలసాధిపతుల కూటములతో చేరడం అసంబద్ధమైనదే కాకుండా అసహజంకూడా. అందుకే నూతన రాజ్యాలకు అలీన విధానం సహజమైన విధాన ప్రత్యామ్నాయం. స్వాతంత్ర్యం సాధించినప్పటికీ ఆర్థికంగా ఇంకా వలసాధిపతులపై ఆధారపడవలసి ఉండడంద్వారా నూతన రాజ్యాలు వలసాధిపతులకు వ్యతిరేక విధానం కూడా అవలంబించదు. కాబట్టి అలీన విధానమే సరియైన విధానం.

వలసాధిపతులతో గతంలోనున్న సిద్ధాంతపరమైన సంబంధాలు నూతన రాజ్యాలను కమ్యూనిజం వైపు మొగ్గనీయలేదు. కమ్యూనిస్టులు కూడా కొన్ని నూతన రాజ్యాల స్వాతంత్ర్యాన్ని గుర్తించకపోవడం కూడా ఆయా రాజ్యాలు కమ్యూనిజంపై మొగ్గుచూపలేదు. అయినప్పటికీ కమ్యూనిస్టు కూటమిని నిర్లక్ష్యం చేయలేదు. అందువల్లనే అలీన విధానం. అలీన విధానం ద్వారా రెండు సిద్ధాంతపరంగా వ్యవస్థీకరించబడిన కూటములకు దగ్గరగా వచ్చును. దేనిలోను విలీనం కాకుండా ఉండవచ్చును.

రెంటితో కూడా స్నేహ, సహకార సంబంధాలు కలిగి ఉంటూ దేనిలోను విలీనం కాక ప్రత్యేక ఉనికిని సంతరించుకోవడం అలీన విధాన ప్రత్యేకత. నూతనంగా సంపాదించుకొన్న స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారాన్ని పణంగా పెట్టి, సమానత్వాన్ని వదలుకొని ప్రాబల్య రాష్ట్రాలకు దాసోహమనడానికి బదులు కూటమి రాజకీయాలకు దూరంగా ఉంటూ స్వేచ్ఛా సమానత్వాలను కాపాడుకోడానికి ఉపకరించే అలీన విధానమని నూతన రాజ్యాలు భావించాయి. గత అనుభవాలను మరచి నూతనంగా అంతర్జాతీయ సంబంధాలను ప్రారంభించాలనే కాంక్ష నూతన రాజ్యాలలో కలగడమే అలీన విధానాన్ని అవలంబించడానికి కారణం. అలీన విధానం, పెట్టుబడిదారీ విధానం, కమ్యూనిస్టు విధానాలకు వ్యతిరేకం కాదు. రెండింటిని సమానంగా గుర్తిస్తుంది, గౌరవిస్తుంది. ఏదో

BRAOU

ఒక కూటమిలో చేరాలనే భావన అప్రజాస్వామికం. ఒకే ఒక సిద్ధాంతంలో ప్రపంచ సమస్యలను తీర్చివేయవచ్చు అనే భావన హాస్యాస్పదమే కాకుండా సమకాలీన పరిస్థితులను విస్మరించడమే. అందుకే నూతన రాజ్యాలు అలీన విధానంవైపు మొగ్గుచూపాయి.

అలీన విధానమవలంబించడంలో ఆర్థిక కారణాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. గాదాపు అన్ని అలీన దేశాలలో జీవన ప్రమాణం తక్కువగా ఉండటమే కాకుండా దేశాలన్నీ స్వతంత్రం పొందినప్పుడు, ఇప్పుడు కూడా ఆర్థికంగా తక్కువ అభివృద్ధి చెందిన దేశాలుగానే ఉన్నాయని చెప్పవచ్చు.

సహజంగా ఈ పరిస్థితులలో దేశము మరియు విదేశాంగ విధానం త్వరిత ఆర్థికాభివృద్ధిని సాధించేటట్లుగా రూపొందించబడుతాయి. ఈ అభివృద్ధిని సాధించే సాంకేతిక పరిజ్ఞానం గాని ఆర్థికవనరులు గానీ నూతన రాష్ట్రాల వద్ద లేవు. కాబట్టి ఈ దేశాలు ఎటువంటి ఆంక్షలు లేకుండా ఎక్కడినుండైనా ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞానం పొందడంకోసం తమ విదేశీ ఆర్థిక విధానం రూపొందించుకొన్నాయి. ఈ విషయంలో కూడ నూతన రాజ్యాలు ఏ కూటములో కూడా చేరకూడదనుకున్నవి. కూటములలో చేరడంద్వారా రెండవ కూటమునుండి వచ్చే సహాయం కోల్పోవడమే కాకుండా తమ ఆర్థిక విధానాన్ని తమ పరిస్థితులకనుకూలంగా ఏర్పరచుకొనే స్వాతంత్ర్యం కోల్పోయే ప్రమాదంకూడా ఉంది. కూటములలో చేరకుండా అలీన విధానం అవలంబించడం ద్వారా అన్ని రకాలయిన సహాయ, సహకారాలను పొందడంతోపాటు ప్రాబల్య రాజ్యాల black mail నుండి తప్పించుకోవచ్చు. అలీన విధానం అవలంబించడంద్వారా వర్తక, వ్యాపారాలు మనం అన్ని రాజ్యాలతో మన ఇష్టాయిష్టాల ప్రకారం చేసుకోవచ్చు. రాజకీయరంగంలో ఎంతో స్వేచ్ఛా స్వాతంత్రులుండాలో ఆర్థిక రంగంలో కూడా అంతే స్వేచ్ఛా స్వాతంత్ర్యం అవసరమనే భావన అలీన విధానానికి దారితీసింది. నిజానికి ఆర్థిక స్వేచ్ఛలేని రాజకీయ స్వేచ్ఛ అర్థరహితం. ఆర్థికంగా ఆధారపడి ఉండడం తరువాతికాలంలో రాజకీయంగా ఆధారపడి ఉండడానికి దారితీస్తుంది. రాజకీయ స్వేచ్ఛను కాపాడుకోవటానికే ఆర్థికంగా అన్ని దేశాలనుండి సహాయ సహకారాలను లిఖించడం జరిగింది.

BRAOU

కీలక మరియు భద్రత అంశాలుకూడా అలీన విధానం అవలంబించడానికి దోహదంచేశాయి. లీనత్వంద్వారా పొందే భద్రత కన్న అలీన విధానంలోనే ఎక్కువ భద్రత పొందవచ్చుననే భావన నూతన రాజ్యాల్లో కలిగింది. దూరంగా ఉన్న బలమైన రాజ్యంతో రక్షణ, సైనిక ఒప్పందం చేసుకొంటే పొరుగుననున్న బలమైన రాజ్యాన్ని రెచ్చగొట్టినట్లు అవుతుంది. తద్వారా ఆ రాజ్య రక్షణకు భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదమేర్పడవచ్చు. అట్లని పొరుగున ఉన్న బలమైన రాజ్యంతో సైనిక, రక్షణ ఒప్పందం చేసుకొంటే ఆ రాజ్యానికి దాసోహమనడమేగాని స్వేచ్ఛగా ఉండలేము. కాబట్టి లీనత్వంలో కన్న అలీనత్వంలోనే ఎక్కువ భద్రత అగుపిస్తుంది. సైనికపరంగా పెద్ద బలమయిన రాజ్యాలతో లీనమవడంద్వారా ప్రపంచశాంతికి, భద్రతకు దోహదం కాకపోవడమే కాకుండా అది పెద్దరాజ్యం భద్రతను కూడా పటిష్టం చేయదు. కూటములలో చేరడంద్వారా చిన్న బలహీనమైన రాజ్యాలు తమకు సంబంధించని విషయాలలో జోక్యం కలిగించుకోవలసి ఉంటుంది. పెద్దరాజ్యాలతో చేరడంద్వారా చిన్న రాజ్యాలకు రక్షణ, భద్రత కలుగుతాయన్నది ఒక అపోహ మాత్రమే. అలీన విధానమవలంబించిన నూతనరాజ్యాయి తమకున్న వనరులను సైనిక కూటములలో చేరడంద్వారా సంక్రమించే బాధ్యతలను నిర్వర్తించడంలో కాకుండా తమ తమ ఆర్థికాభివృద్ధికోసం ఉపయోగించుకొనవచ్చు. అలీన విధానమవలంబించినట్లయితే ఇంకొకరిని రెచ్చగొట్టడం జరుగదు. అందుకే లీనత్వం కన్న అలీనత్వం మిన్న. జాతీయ ప్రయోజనాలనాశించి అలీన విధాన రూపకల్పన జరిగింది. ప్రత్యేకించి ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం నుండి ప్రపంచాన్ని రక్షించడానికి, ప్రపంచ శాంతిభద్రతలను ఎల్లప్పుడూ కాపాడడానికి, కలుషితమైన ప్రపంచ స్థితిగతులను ఇంకా దిగజార్చకుండడానికి అలీన విధానమవలంబించినప్పటికి జాతీయ ప్రయోజనాలను సాధించుటలో కూడా ఈ విధానమెంతో తోడ్పడుతుందని నూతన రాజ్యాలు ఈ విధానం వైపు మొగ్గాయి. అలీన దేశాలకు అన్ని దేశాలు మిత్రులే. అలీన దేశాలు వాటి వాటి ప్రయోజనాలను సాధించుకొనడానికి రష్యాను, అమెరికా

ఆశ్రయించవచ్చు. రష్యా, అమెరికాలు కూడా వాటి వాటి ప్రయోజనాలకోసం ఈ దేశాలకు సహాయ సహకారాలు అందించవచ్చు. నూతన రాజ్యాలు ఎటువైపు మొగ్గకుండా ఉండేందుకు కూడా అగ్రరాజ్యాలు ఈ రాజ్యాలకు తగు సహాయాలను అందిస్తున్నాయి. సహాయాన్ని అందించడంలో అగ్రరాజ్యాలు పోటీపడుతున్నాయనడంలో అతిశయోక్తిలేదు. అలీన రాజ్యాలు అమెరికావైపు కాదు రష్యావైపు కాదు అవి కేవలం తమ ప్రయోజనాలవైపు మాత్రమే. అలీన దేశాలు అన్ని విషయాలలో స్వతంత్రంగా ఉంటాయి. కానీ అలీనత్వానికి వ్యతిరేకంగా పరిణమించే విషయాలలో తటస్థంగా ఉండవు. అవి అలీనత్వాన్ని రక్షించుకొంటాయి.

దేశీయ రాజకీయ అవసరాలు, ఒత్తిడులు చాలా దేశాలను అలీన విధానమవలంబింప జేశాయి. తాము దేశీయంగా ఎదుర్కొనే సమస్యలే కాకుండా, కూటములోల్లో చేరి అంతర్జాతీయంగా నూతన సమస్యలనెదుర్కోదలచలేదు. అందుకే చాలా నూతన రాజ్యాలు అలీన విధానంవైపు ఆకర్షింపబడ్డాయి. స్వాతంత్ర్యం సంపాదించుకొన్న నూతన రాజ్యాలు మొదట ఎదుర్కొన్న సమస్య రాజకీయ సుస్థిరతను సాధించుకొనడం. ఈ జటిలమైన సమస్యనెదుర్కొనే సమయంలో ఈ రాజ్యాలు కూటములలో చేరి అంతర్జాతీయ సమస్యలలో చిక్కుకోదలచుకోలేదు. కనుకనే అలీన విధానాన్ని కోరుకున్నది.

నూతన రాజ్యాలలో భిన్న రాజకీయ సిద్ధాంతాలు, ధోరణులు ఆవరించుట కూడా అంతర్జాతీయంగా అలీన విధానాన్ని చేపట్టడానికి దారితీసింది. జాతి పునర్నిర్మాణంలో అన్నివర్గాల ప్రజల సహకారం అవసరం కాబట్టి అలీన విధానం అన్ని వర్గాలను తృప్తిపరచడమే కాకుండా ఈ గురుతరమైన బాధ్యతలో అన్నివర్గాలనుండి జాతీయంగా, అంతర్జాతీయంగా తగిన సహాయం లభించే అవకాశమేర్పడుతుంది.

BRAOU

లీనత్వ విధానం ఆవలంబించడంద్వారా కూటమిరాజ్యాల రాజకీయ, ఆర్థిక విధానాల ప్రచారం దేశీయ రాజకీయ, ఆర్థిక, సాంఘిక విధానాలపై ప్రభావం చూపే అవకాశముంది కాబట్టి అలీన విధానమాచరించడంద్వారా ఈ ప్రమాదం తగ్గే అవకాశముంది. దేశీయ విధానాలను దేశీయ పరిస్థితులను అవసరాలను బట్టి రూపొందించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఈ విధంగా జాతీయ, అంతర్జాతీయ కారణాలు రాజ్యాలను అలీన విధానంవైపు మొగ్గుజూపడానికి దోహదంచేశాయి. అలీన దేశాలు తమకిష్టమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక సిద్ధాంతాలకనుగుణంగా తమ విధానాలకు రూపకల్పన చేసుకోవచ్చు. మారుతున్న దేశీయ, అంతర్జాతీయ పరిస్థితులు అలీన విధానం అవలంబించుటకు గల కారణాలలో మార్పులను తీసుకురావచ్చు. ఎంతవరకైతే అలీన విధానం జాతీయ ప్రయోజనాలను స్థాపించడానికి తోడ్పడుతుందో అంతవరకు రాజ్యాలు అలీన విధానమవలంబిస్తూనే ఉంటాయి. అలీనోద్యమం రెండవ ప్రపంచయుద్ధం తరువాత అంతర్జాతీయ రాజకీయాలలో ఒక నూతన అధ్యాయంను సృష్టించింది.

11.8 అలీనోద్యమం

1950వ దశకం చివరిలో అలీన విధానం ప్రాణం పోసుకొని 1960వ దశకం నాటికి అది ఒక ఉద్యమంగా వ్యవస్థీకృత రూపం దాల్చింది. అలీన విధానాన్ని బలంగా బలపరిచేవారు. ఈ విధానం మూడవ కూటము ఆవతరణకు దారితీయదని అలీన విధానం మూడవశక్తి కాదని అన్నప్పటికి 1960 నాటికి అది ఒక ఉద్యమంగా ప్రాణం పోసుకొంది. బెల్‌గ్రేడ్‌లో జరిగిన మొదటి అలీన దేశాల శిఖరాగ్ర సమావేశం నాటివరకు కూడా ఈ దేశాలు ఒక దగ్గర సమావేశమగుటకు వెనుకాడాయి. అలాంటి సమావేశమును మూడవ కూటముగా అభివర్ణిస్తారన్న భయమే అందుకు కారణం కావచ్చు. 1961 నాటి వరకు కూడా అలీన విధానాన్ని ఒక సాంప్రదాయ బద్ధంకాని ధృవీకరించుకోలేని అంతర్జాతీయ విధానంగా పేర్కొన్నారు. 1961లో జరిగిన మొదటి అలీనోద్యమ సమావేశం ఆ భావనను ఎదగనీయకుండా తుంచివేసింది. 1951 చివరి పాదం నాటికి స్వతంత్ర విధానాలననుసరించాలని

నిశ్చయించుకొన్న దేశాలు తమ సమిష్టి కార్యాచరణకు కావలసినంత ప్రాతిపదిక గలదని భావించాయి. 1960 నాటికి అతి తక్కువ సంఖ్యలో, ఆర్థికంగా, సైనిక, బలహీనమైన, భిన్న మధ్యతరహా రాజ్యాలు తాము అవలంభించు అలీన విధానంద్వారా వ్యక్తిగతంగా ఐక్యరాజ్యసమితిలో ప్రపంచ రాజకీయాలపై ఏ మాత్రం ప్రభావం చూపలేదన్న భావనయే సమిష్టి కృషికి దోహదంచేసి అలీనోద్యమునకు దారితీసిందని చెప్పవచ్చు. పెద్ద బలమైన రాజ్యాల ప్రమేయం లేకుండా స్వతంత్రంగా తమ రాజకీయ విధానాలను రూపొందించుకొనడానికి ఐక్యరాజ్యసమితికి వెలుపల ఒక స్వతంత్ర ప్రతిపత్తిగల రాజ్యాల గ్రూపుయొక్క ఆవశ్యకతను అలీన దేశాలు గుర్తించాయి. అలీన దేశాలు నమ్మిన సిద్ధాంతాలద్వారా ప్రపంచ సమస్యలకు నూతన పరిష్కార మార్గాలనన్వేషించి ప్రపంచ సంస్థలద్వారా వాటికి ప్రాచుర్యం కలిగించి అనుసరింపచేయడం కేవలం సమిష్టి కృషిద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. కాని వ్యక్తిగతంగా ఏ రాజ్యానికీ సాధ్యంకాదు. ఈ పద్ధతిద్వారా అంతర్జాతీయ సమస్యల పరిష్కార మార్గాలనన్వేషించడంలో ఇతరులతో సమానమైన పాత్ర వహించడానికి అంతగా ప్రాబల్యంలేని అలీన దేశాలకు వీలు కలుగుతుంది.

పై భావనయే టిటో, నాసర్, నెహ్రూల బ్రియొనీ (Brioni 1956) సమావేశానికి దారితీసింది. ఈ సమావేశంలో అలీన దేశాల సమావేశం యేర్పాటు చేయుటలో గల సాధక బాధకాలను చర్చించారు. అయినప్పటికీ 1961 నాటి వరకు కూడా సమావేశ యేర్పాటు విషయమై ఖచ్చితమైన నిర్ణయమేది జరుగలేదు. 1961 ఏప్రియల్ నెలలో నాసర్, టిటో సమావేశమయినప్పుడు 1961 సెప్టెంబర్ ఐక్యరాజ్యసమితి సమావేశాలకన్నా ముందుగా అలీన దేశాలు సమావేశం కావాలన్న తమ ఆలోచనను ఇతర అలీన దేశాలతో చర్చించడానికి నిర్ణయించుకొన్నారు. అలీనదేశాలు ఒకచోట సమావేశమై ప్రపంచ పరిస్థితిని చర్చించుకోవడం ప్రపంచశాంతికి, దేశాల స్వతంత్ర ప్రతిపత్తికి ఎంతో అవసరమని నాసర్, టిటోలు భావించారు. దేశాలమధ్య చర్చలు, ఆర్థిక, సాంస్కృతిక సాంకేతిక రంగాలలో సహకారాన్ని ప్రోత్సహిస్తూ ప్రపంచ మానవాళికి మేలు చేకూర్చడానికి దోహదం చేసేటట్లు ఉండాలి.

ఈ నేపథ్యంలో నాసర్, టిటో అలీన దేశాల సమావేశాన్ని ప్రతిపాదిస్తూ ఒక ఉమ్మడి విజ్ఞాపనను అన్ని అలీన దేశాలకు పంపారు. ఈ సమయంలో ఒక అలీనోద్యమం స్థాపించాలన్న భావన ఎవరికీ లేదు. ఐక్యరాజ్యసమితి సమావేశాలను తమ సిద్ధాంతాలద్వారా ప్రభావితం చేయాలనే కోరికతో అలీనదేశాల సమావేశం ప్రతిపాదించడం జరిగింది. ఈ ప్రతిపాదనను కొన్ని సమర్థించాయి. మరికొన్ని ఇష్టపడలేదు. ఇష్టపడని దేశాలలో భారతదేశంకూడా ఒకటి. ఈ ప్రతిపాదించిన సమావేశం మూడవ కూటమిగా వర్ణించబడుతుందన్న భయమే అయిష్టానికి కారణం. అయినప్పటికీ ఈ దేశాలు సమావేశంలో కేవలం అంతర్జాతీయ సమస్యలే చర్చించాలనే కాంక్షను బయటపెట్టి సమావేశాల నిర్వహణకు తమ అంగీకారం తెలిపాయి.

ఈ విధంగా 1961లో 25 దేశాల సభ్యత్వంతో మొదలయిన ఉద్యమం 1989 నాటికి రెండవ సారి బెల్‌గ్రేడ్ సమావేశం నాటికి 9 సమావేశాలను నిర్వహించి 102 సభ్యరాజ్యాలలో లక్ష్యసాధనకు ముందుకు పరిగెత్తుతున్న. గత ముప్పది సంవత్సరాల కాలంలో అలీనోద్యమం తన ప్రత్యేక గుణాలను కాపాడుకోగలిగింది. ఆఫ్రికా - ఆసియాతత్వం, మూడవ ప్రపంచం, అలీన విధానాలను ఒకటిగా చూసే అలవాటు తరుచుగా కనపడుతుంది. కానీ వీటిలో కొన్ని సామ్యాలున్నప్పటికీ ఈ మూడు ఒకటి కావు.

ఆఫ్రికా - ఆసియాతత్వంలో భౌగోళిక ప్రాతిపదికలు ప్రధాన నిర్ణయసూచికలుగా గాక ప్రచ్ఛన్నయుద్ధంవైపు ఒక రాజ్యానికున్న వైఖరి రెండవ సూచికగా గ్రహించబడింది. కానీ అలీనోద్యమంలో చేరాలంటే ప్రచ్ఛన్నయుద్ధంవైపు ఒక రాజ్యానికిగల వైఖరే ప్రధాన సూచిక. మిగతావన్నీ అసంబద్ధత సూచికలే. ఇదే విధంగా మూడవ ప్రపంచ దేశాలతో ఆర్థిక సమస్యలపై ఏకాభిప్రాయమున్నప్పటికీ అలీనోద్యమానికి ప్రత్యేకమైన రాజకీయ గుర్తింపు ఉంది. మూడవ ప్రపంచ దేశాలను ఆర్థిక ప్రాతిపదికపై ఏర్పడిన ఒక గ్రూపుగా పేర్కొనవచ్చు.

BRAOU

అలీన విధానానికి అధికారికమైన నిర్వచనం లేనప్పటికీ అలీనోద్యమం ఆశయాలను, సిద్ధాంతం, సూత్రాలు అలీన దేశాలను గుర్తించే సూచికలుగా మారాయి. ప్రాబల్య రాజకీయాలకు దూరంగా ఉండాలనే విధానంతో ప్రారంభమైన అలీన విధానం ఒక రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక శక్తిగా అంతర్జాతీయ వ్యవహారాలతో అవతరించింది.

1961 జూన్ నెలలో కైరోలో ఏర్పాటుచేసిన సహాయ సమాయుత్తం చేసే సమావేశం (Preparatory Conference) ఆహ్వానితులను నిర్ధారించే నిర్ణయ సూత్రాలను స్థూలంగా రూపొందించింది. ఈ సూత్రాలే ఇప్పటికీ అమలులో ఉన్నాయి.

(1) అలీనత్వంలో విశ్వాసం, భిన్న, రాజకీయ, సాంఘిక వ్యవస్థల సహజీవనం గడపగలవనే విశ్వాసం ప్రాతిపదికలుగా స్వతంత్ర విధానాలను రూపొందించుకొనే దేశాలు.

(2) జాతి స్వాతంత్ర్య ఉద్యమాలను నిరంతరం ప్రోత్సహించే దేశాలు.

(3) ప్రాబల్య రాజ్యాల సంఘర్షణల సందర్భంగా ఏర్పరచుకొనే బహుళపక్ష సైనిక ఒప్పందాలతో సంబంధం లేని దేశాలు.

(4) ఏదేని ఒక ప్రాబల్య దేశంతో ద్వైపాక్షిక సైనిక ఒప్పందం కలిగి ఉన్నప్పటికీ లేదా ఒక ప్రాంతీయ సైనిక ఒప్పందంలో సభ్యత్వం ఉన్నప్పటికీ, ఆయా ఒప్పందాలు ప్రాబల్య రాజ్యాల సంఘర్షణలను దృష్టిలో ఉంచుకొని చేసుకొన్నవి. కాకపోయినట్లయితే అట్టి దేశాలు.

(5) ప్రాబల్య రాజ్యాల సంఘర్షణను ద్విగుణీకృతం చేయకుండా ఉండేటట్లుగా ఇతర దేశాల సైనిక స్థావరాలకు అనుమతించిన దేశాలు.

BRAOU

11.9 అలీనోద్యమ సభ్యత్వ అర్హతలు

బెల్‌గ్రేడ్ సమావేశంలోనే అలీనదేశాలు తాము మూడవ కూటమి కామని, కాజాలమని ఖచ్చితంగా పేర్కొన్నవి. 1970 నాటివరకు ఈ సమావేశాలను అలీనదేశాల సమావేశాలుగానే పేర్కొన్నారు. కాని తరువాతికాలంలో దానిని అలీనోద్యమంగా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ వ్యవహారాల, సమస్యల, సంఘర్షణల, వివాదాలను అలీన దృక్పథంతో పరిశీలించడమేకాక ఒక నూతన ప్రపంచ నడవడిని ప్రోత్సహించడానికి అలీన ఉద్యమమేర్పడింది.

ఐక్యరాజ్యసమితిలాగానే దాదాపు అన్ని అంతర్జాతీయ వ్యవహారాలను అలీనోద్యమం తన విషయ పరిధిలోనికి గ్రహిస్తుంది. ప్రాబల్యం హింసా రాజకీయ ప్రచారంనుండి అంతర్జాతీయ సంబంధాలను తప్పించుట అలీన విధాన ముఖ్యోద్దేశం కావడంచేత ప్రపంచ సమస్యలన్నీ అలీనోద్యమ సమస్యలుగానే చెప్పవచ్చు. కూటమి, ప్రాబల్య రాజకీయాలకు వ్యతిరేకంగా మొదలయిన ఉద్యమం నేడు ఒక నూతన అంతర్జాతీయ వ్యవస్థ స్థాపనకు కృషిచేస్తోంది. అలీనోద్యమ శిఖరాగ్ర సమావేశాలకు పరిశీలకులుగా అతిథులుగా ఆహ్వానింపబడిన దేశాలలో కూటములను సమర్థించేవారు, కూటములలో చేరువారు, తటస్థ విధానమవలంబించేవారు ఉన్నారు. అలీన ఉద్యమంపై వీరికున్న స్నేహభావం, కూటమి రాజకీయాలపైన, ప్రచ్ఛన్నయుద్ధంపైన లీనత్వ విధానాలపైన వీరికిగల అయిష్టతను పరోక్షంగా వెల్లడిస్తోంది. కొలంబో శిఖరాగ్ర సమావేశం సమన్వయ కమిటీ నిర్మాణం దాని అధికారాలను స్థిరపరిచింది. మొదట 25 సభ్యులతో ఏర్పాటు గావించబడిన ఈ కమిటీలో ప్రస్తుతం అన్ని సభ్యదేశాలు చేరడానికి అవకాశం కల్పించబడింది. అలీనోద్యమ దేశాల అధ్యక్షుడు కమిటీని సమావేశపరుస్తాడు. శిఖరాగ్ర సమావేశాల, ఇతర స్థాయి సమావేశాల నిర్ణయాలను అమలుపరచడంలో సభ్యదేశాల కార్యకలాపాలను ఈ కమిటీ సమన్వయం చేస్తుంది. అప్పుడప్పుడు కాకుండా ఈ కమిటీ శాశ్వత ప్రాతిపదికమీద పనిచేస్తుంది. ఐక్యరాజ్యసమితిలో అలీన దేశాలకు గల శాశ్వత ప్రతినిధులస్థాయిలో

ఈ కమిటీ మాసానికి ఒకసారి తప్పక సమావేశం అవుతుంది. ప్రపంచ శాంతికి, భంగం కలిగించే అన్ని అంశాలను, అలీనోద్యమ పరిధిలోకి వచ్చే అన్ని అంశాలనూ ఈ కమిటీ చర్చించి అలీన దేశాలకు తగిన సూచనలిస్తుంది. గడచిన 30 సంll లో ఏర్పాటుగావించబడిన 9 అలీనదేశాల శిఖరాగ్ర సమావేశాలు వివిధ సమస్యలను చర్చించేందుకు గాను ఏర్పాటు కావించబడిన దాదాపు 45 మంత్రుల, అధికారులస్థాయి సమావేశాలు అలీనోద్యమంలో చేరిన దేశాలసంఖ్య అలీనోద్యమ అభివృద్ధిని సూచిస్తాయి. అలీన విధాన ప్రభావాన్ని నిరంతరం కొనసాగించడంకోసం దాని ప్రణాళికలను సమన్వయపర్చడం కోసం దాని విధానాలకు బలం చేకూర్చడంకోసం అలీనోద్యమ సమావేశాలను నిర్వహించుటకు గల కాల వ్యవధిని క్రమబద్ధం చేయడానికి ఉద్యమ ఉద్దేశాలను నిర్వహణ సూత్రాలను స్థిరపరచేందుకుగాను 1973 అల్జీర్స్ శిఖరాగ్ర సమావేశంలో ఒక సమన్వయ కమిటీని (Coordinating Bureau) ఏర్పాటుచేశారు. ఈ కమిటీ అలీనోద్యమ దేశాలకు కార్యనిర్వాహక శాఖలాంటిదనవచ్చును. ఈ కమిటి ఏర్పాటు అలీనోద్యమానికి ఒక మైలురాయిలాంటిది. 1976లో నిర్వహింపబడిన ఐక్యరాజ్యసమితియొక్క పరిధికి లోనగు అలీన దేశాల ఉమ్మడి కార్యక్రమాలను ఈ కమిటీ సమన్వయం చేస్తుంది. అలీన దేశాలందించే సూచనలను ఆదేశాలను అలీనోద్యమ సిద్ధాంతాలను దృష్టిలోనుంచుకొని ఈ కమిటి అమలుచేయ ప్రయత్నిస్తుంది. ఈ కమిటీ ప్రెస్ సమావేశాలనేర్పాటు చేయవచ్చు. ప్రెస్ ప్రకటనలు ఇవ్వవచ్చు. సమన్వయ కమిటీ అధ్యక్షుడు కమిటీకి కావలసిన అన్ని సచివాలయ సౌకర్యాలను కల్పిస్తాడు. ఈ విషయంలో అతడు ఇతర సభ్యదేశాల సహాయం స్వీకరింపవచ్చు. సమన్వయ కమిటీ అలీనదేశాల కార్యనిర్వహణయే కాకుండా సచివాలయంలా కూడా పనిచేస్తుంది. అలీనోద్యమం ఆవిర్భావం, సమన్వయ కమిటీ ఏర్పాటు అలీన విధానాలకు విస్తృత ప్రచారం కల్పించడమే కాకుండా అంతర్జాతీయ సమస్యలను అలీన దృక్పథంనుండి అవగాహన చేసికొనడానికి అవకాశం కల్పిస్తున్నాయి. అలీనోద్యమం, దాని సమన్వయ కమిటీ అలీన విధానాలకు దృక్పథానికి భౌతికమైన ఉనికిని కల్పిస్తున్నాయి.

అలీనోద్యమ దేశాలు ఐక్యరాజ్యసమితిలాగే ఉద్యమ ప్రత్యేక లక్ష్యాలను సాధించడంకోసం వివిధ సంస్థలను ఏర్పాటుచేశాయి. వీటిలో ముఖ్యంగా International Coordinating Committee in the field of Information, Inter-Governmental Group on Raw Materials, Solidarity Fund for Economic and Social Development, Centre for Science & Technology, Solidarity Fund for Southern Africa Apartheid Fund లను పేర్కొనవచ్చును. అలీనోద్యమ సమావేశాలలో నిర్ణయాలు సామాన్యంగా అందరికి ఆమోదయోగ్యంగా ఉండేటట్లుగా తీసుకోబడుతాయి.

NAM శిఖరాగ్ర సమావేశాలలోనే కాకుండ ఇతర NAM సమావేశాలలో కూడా NAM లక్ష్యాలను గురించి పేర్కొనడం జరిగింది. 1979 హవానా శిఖరాగ్ర సమావేశంలో NAM లక్ష్యాలను పూర్తిగా విపులీకరించారు. వాటిలో ఈ క్రిందివాటిని ముఖ్యమైన లక్ష్యాలుగా పేర్కొన్నారు.

1. అలీన దేశాల జాతీయ స్వాతంత్ర్య, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, మరియు భద్రతల పరిరక్షణ.

2. ఒక దేశపు దేశీయ విదేశీయ వ్యవహారాలలో ఇతరుల ప్రమేయం మరియు జోక్యాన్ని వ్యతిరేకించడంతోపాటు సమస్యల పరిష్కారానికి, బలప్రయోగాన్ని, బెదిరింపులను వ్యతిరేకించడం, విడనాడడం.

3. స్వతంత్ర విధానంగా, కూటమి రాజకీయాలకు అతీతంగా అలీన విధానానికి బలం చేకూర్చుతూ దాని వ్యాప్తికై కృషిచేయడం.

4. సామ్రాజ్యవాదం, వలసవాదం, నవీన వలసవాదం, జాతివిచక్షణ, అన్నిరకాలైన ప్రాదేశిక విస్తరణ, విదేశీ ఆక్రమణ ఆధిపత్యం మొదలైన వాటిని పూర్తిగా వ్యతిరేకించి వాటిని అంతమొందించడానికి కృషిచేయడం.

BRAOU

5. జాతి విమోచన ఉద్యమాలను సమర్థించడం.

6. అంతర్జాతీయ శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ఉద్రిక్తతల సడలింపునకు కృషిచేయడం; దేశాలమధ్య ఐక్యత, సహకారం, సఖ్యతలను పెంపొందించడం.

7. ఆయుధాల నియంత్రణ కోసం నిరాయుధీకరణకోసం కృషిచేయడం.

8. నూతన ప్రపంచ నడవడికి, నూతన ఆర్థికవిధానంపై కృషిచేయడం.

9. ప్రపంచ రాజకీయాలను ప్రజాస్వామ్యీకరించడం కోసం కృషిచేయడం, సార్వభౌమత్వం, సమానత్వం, మానవ-హక్కుల పరిరక్షణ.

10. ఐక్యరాజ్యసమితిని బలపరచడం.

11. ప్రపంచరాజ్యాలమధ్య ముఖ్యంగా అలీన దేశాలు, అభివృద్ధిచెందుతున్న దేశాలమధ్య ఆర్థిక సహకారం, స్వావలంబనకై కృషి.

12. ప్రపంచ రాజ్యాలమధ్య ముఖ్యంగా అలీనదేశాలమధ్య సాంఘిక, సాంస్కృతిక, సాంకేతిక రంగాలలో సహకారానికి కృషిచేస్తూ ప్రపంచ ప్రజలమధ్య స్నేహభావాన్ని, సామర్థ్యాన్ని పెంచుటకు కృషిచేయడం.

ఇంత విశాలమైన లక్ష్యాలతో అలీనోద్యమం ముందుకు సాగుతుంది. శాంతికి భంగం కలిగించే అన్ని విషయాలకు, దేశాల స్వాతంత్ర్యాన్ని హరించే అన్ని ప్రయత్నాలకు ఆర్థిక అసమానత్వాలను పెంచే అన్ని ప్రయత్నాలకు అలీనోద్యమం వ్యతిరేకమని, వాటిని ప్రతిఘటించే కర్తవ్యం అలీన దేశాలకున్నదని 1985లో అప్పటి భారత ప్రధాని రాజీవ్ గాంధి అన్నారు.

BRAOU

11.10 అలీనోద్యమ శిఖరాగ్ర సమావేశాలు

అలీనోద్యమానికి స్పష్టంగా చెప్పబడిన లక్ష్యాలున్నవి. లక్ష్యసాధనకు కావలసిన వ్యవస్థను అది రూపొందించుకొంది. అలీన దేశాల కృషిని సమన్వయం చేయడానికి శాశ్వత ప్రాతిపదికపై యంత్రాంగముంది. అలీనదేశాల కృషిని సమీక్షించేందుకు, అలీన విధానానికి తమ బద్ధతు తెలుపుతూ లక్ష్యసాధనలో లోపాలు సరిదిద్దే నిమిత్తం అలీన దేశాలు ప్రతి మూడు సంవత్సరములకొకసారి శిఖరాగ్ర సమావేశాలను నిర్వహించుకొంటున్నాయి. ఈ వాదంగా ఒక ఉద్యమానికి కావలసిన అన్ని హంగులు అలీనోద్యమానికున్నాయి.

అలీనోద్యమం మొదట జాతి స్వాతంత్రోద్యమాలను సమర్థిస్తూ వలసవాద సామ్రాజ్యవాద జాతి విచ్ఛిత్తి విధానాలకు వ్యతిరేకంగా పోరాటం జరిపింది. తరువాత నూతన అంతర్జాతీయ విధానానికి ముఖ్యంగా నూతన అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థ స్థాపనకు 1970 తరువాత కృషిచేయడం ప్రారంభించింది. 1980 తరువాత తన దృష్టిని నిరాయుధీకరణవైపు మళ్ళించినప్పటికి నూతన ఆర్థికవిధాన సాధనకు చేస్తున్న నిరంతర కృషిని మానలేదు.

ఇప్పటివరకు అలీనోద్యమ దేశాలు తొమ్మిది శిఖరాగ్ర-సమావేశాలను నిర్వహించాయి.

I 1961లో యుగోస్లోవియా రాజధాని బెల్‌గ్రేడ్‌లో

II 1964లో ఈజిప్టు రాజధాని కైరోలో

III 1970లో జాంబియా రాజధాని లుసాకాలో

IV 1973లో అల్జీరియా రాజధాని అల్జీర్స్‌లో

V 1976లో శ్రీలంక రాజధాని కొలంబోలో

VI 1979లో క్యూబా రాజధాని హవానాలో

VII 1983లో ఇండియా రాజధాని న్యూఢిల్లీలో

VIII 1986లో జింబాబ్వే రాజధాని హరారేలో

IX 1989లో తిరిగి యుగోస్లోవియా రాజధాని బెల్‌గ్రేడ్‌లో జరిగాయి.

1961లో జరిగిన బెల్‌గ్రేడ్ సమావేశం జాతి స్వాతంత్ర్యాన్ని ప్రోత్సహిస్తూ వలసవాదాన్ని సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ వాటిని అంతమొందించడం ముఖ్యధ్యేయంగా కలిగి ఉంది. కైరోలో జరిగిన రెండవ సమావేశం శాంతియుత సహజీవన సూత్రాలను ఉటంకించింది. మూడవ శిఖరాగ్ర సమావేశం అగ్రరాజ్యాల పోటీకి సంబంధించిన సైనిక ఒప్పందాలలో సభ్యత్వాన్ని, సైనిక స్థావరాలను ఏర్పరచుకొనే విధానాన్ని ఖండిస్తూ అలీనరాజ్యాల మధ్య ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహించింది. అల్జీరియాలో జరిగిన నాలుగవ సమావేశం ప్రపంచంలో ఉద్రిక్తతలను సడలించి శాంతియుత వాతావరణ స్థాపనకు తోడ్పడే అంగాలకు ప్రాధాన్యత ఇచ్చింది. కొలంబో సమావేశం నూతన అంతర్జాతీయ ఆర్థిక విధానానికి ప్రాముఖ్యమిస్తూ ఆర్థిక స్వాతంత్ర్య అవశ్యకత పై సుదీర్ఘంగా చర్చించింది. హవానా సమావేశం పెత్తందారి రాజకీయాలను ఖండిస్తూ ధనిక, పేద దేశాలమధ్య తారతమ్యాల నిర్మూలనకై చర్యలు తీసుకోవాలనీ హిందూమహాసముద్రాన్ని శాంతిమండలంగా ఉంచాలనీ ప్రకటించింది. న్యూఢిల్లీ సమావేశం అగ్రరాజ్యాల స్వప్రయోజనాలపట్ల వివేకవంతమైన దృక్పథంతో కూడిన విదేశాంగ విధానాన్ని అనగా అలీన విధానాన్ని అనుసరించడమే ఉత్తమ మార్గమని అది ప్రపంచశాంతికి శ్రేయోదాయకమని పేర్కొంది. ఉత్తర, దక్షిణ దేశాలమధ్య ఆర్థిక సహకార విషయంలో ఫలవంతమైన చర్చలు జరగకపోవడంపై విచారం వెలిబుచ్చింది. హరారేలో జరిగిన సమావేశంలో నిరాయుధీకరణకై అగ్రరాజ్యాలకు విజ్ఞప్తిచేశారు. 1989లో బెల్‌గ్రేడ్‌లో జరిగిన సమావేశం ధనిక పేదదేశాల మధ్య పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలను తగ్గించి ఒక నూతన అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థ పట్ల తన దృష్టిని కేంద్రీకరించిందని చెప్పవచ్చు.

అలీన విధాన వ్యాప్తికి, ప్రపంచ రాజకీయాలను అలీన దృక్పథంతో పరిశీలించడం అలీన విధాన లక్ష్యాలను సాధించడంలో అలీనోద్యమం ఎంతవరకు సఫలీకృతమైంది మారిన, మారుతున్న ప్రపంచ రాజకీయాలలో అలీన విధాన ఆవశ్యకత ఎంతవరకు సమంజసం అన్న అంశాలు పరిశీలింపవలసిన ఆవసరం ఎంతో ఉంది.

ప్రపంచ రాజకీయాలను ప్రజాస్వామ్యీకరించడం అలీన విధాన లక్ష్యం. స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం, సమానత్వం సాధించడం కూడా అలీన విధాన లక్ష్యం. ఎంతవరకైతే ప్రపంచంలో దేశాలకు ఇవి లభ్యంకావో లేదా వాటిననుభవించే పరిస్థితులు కలుగవో అప్పటివరకు అలీన విధాన ఆవశ్యకత ఉంటుంది. అలీన విధానం విదేశీ విధానానికి స్వతంత్ర దృక్పథం కల్పించింది. అలీన విధానంలో ఒక దేశ స్వతంత్ర దృక్పథం, సార్వభౌమాధికారం

SPAOU

ప్రస్ఫుటమవుతాయి. ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం అలీన ఉద్యమ ఆవిర్భావాన్ని దోహదంచేసి ఉండవచ్చు. కానీ ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం రూపుమాసిపోయి ప్రపంచ రాజకీయాలు కూటమి రాజకీయాలనుండి విముక్తి పొందినప్పటికీ దేశాల స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం, సమానత్వాల దృక్పథం వెదజల్లే అలీన విధానం ఎప్పటికి సజీవంగానే ఉంటుంది.

11.11 ముగింపు

అలీన దేశాల శిఖరాగ్ర సమావేశాలలో వెలువడే ప్రకటన అలీనోద్యమం సాధించిన విజయాలను ఎదుర్కొన్న అపజయాలను పేర్కొన్నది. 25 దేశాల సభ్యత్వంతో మొదలయి 102 దేశాలను తనలో సభ్యులుగా చేర్చుకొన్న అంశమే అలీనోద్యమ ప్రాబల్యానికి తార్కాణం. అలీన విధానం ద్వారా తమ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను, సమానత్వాన్ని రక్షించుకొంటూ ప్రపంచ వ్యవహారాలలో తమకంటూ ఒక స్వతంత్ర విధానమేర్పరచుకొనడం అలీన విధానంలోని సాధ్యమనే భావన నూతనంగా స్వతంత్రాన్ని సంపాదించుకొన్న రాజ్యాలలో ఉండడమే సభ్యుల సంఖ్య పెరుగుటకు కారణమయి ఉండవచ్చు. అలీన విధానం, ఉద్యమంయొక్క ఫలితమే త్వరితగతిని, వలసరాజ్యాలకు విముక్తి కలగడానికి కారణమయి ఉండవచ్చు. 1980 నాటికి దాదాపు అన్ని దేశాలకు స్వాతంత్ర్యం లభించి వలస, సామ్రాజ్య విధానాలు అంతమొందినవిగా చెప్పవచ్చు. ప్రపంచ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకొని న్యాయం, సమానత్వ ప్రాతిపదికలుగా నూతన ఆర్థిక, సామాజిక విధానాలను ఏర్పాటుచేయడంలో అలీనోద్యను కృషి ఎంతో శ్లాఘనీయం.

న్యాయం, స్వాతంత్ర్యం, సమానత్వమనే ప్రాతిపదికలపై నూతన అంతర్జాతీయ వ్యవస్థను సాధించడంకోసం ప్రపంచ ప్రజలకు, దేశాలకు అలీనోద్యమం ఇచ్చిన స్ఫూర్తి అలీనోద్యమాన్ని విజయవంతమైన, స్వతంత్ర అంతర్జాతీయ factorగా పేర్కొనవచ్చు. ఉత్తమమైన, ఉన్నతమైన న్యాయబద్ధమైన అంతర్జాతీయ సంబంధాలను నెలకొల్పడంలో అలీనోద్యమం చేసిన కృషి రెండవ ప్రపంచయుద్ధం తరువాత మరే ఇతర శక్తి చేయలేదు. ప్రపంచ రాజకీయాలలో అలీనోద్యమం స్వతంత్ర ప్రతిపత్తిగల ఐక్యత గల ఒక గొప్పశక్తిగా చెప్పవచ్చు. అలీనోద్యమ కృషిద్వారా ప్రచ్ఛన్నయుద్ధంలోని వేడి తొలిగి, ఉద్రిక్తతలు సడలి, అణుయుద్ధానికి దారితీసే ప్రమాదాలు తొలిగి, వలస వివాదాలు నశించి సమానత్వ ప్రాతిపదికమీద ఒక నూతన ప్రపంచ విధానానికి దారితీసిందని చెప్పవచ్చు.

అలీనోద్యమం ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని నిలదొక్కుకొని ప్రపంచ రాజకీయాలలో ఒక గణనీయమైన శక్తిగా రూపొందడమే దాని విశిష్టతను చాటి చెప్పతోంది. అంతర్జాతీయ రాజకీయ సంబంధాల చరిత్రలో అలీన విధానానికి ఉద్యమానికి సరిపోయే విధానంకాని ఉద్యమంకాని లేదు. ప్రపంచాన్ని రెండు ముక్కలుగా చీల్చే ప్రమాదంనుండి అలీన విధానం కాపాడింది. ఇతర లక్ష్యాలను సాధించినా సాధించకపోయినా ఈ విజయం మాత్రం ప్రపంచశాంతికి అలీన విధానం చేసిన గణనీయమైన సేవగా చెప్పవచ్చు. మానవాళి భవిష్యత్తుకై వేసిన ఉత్తమమైన మార్గంగా అలీన విధానాన్ని పేర్కొనవచ్చు. విలక్షణమైన, విశిష్టమైన సృజనాత్మక రాజనీతిజ్ఞతకు అలీన విధానం ఒక మచ్చుతునక.

– డా ॥ ఎం. రాంచందర్

BRAOU

11.12 చదువదగిన పుస్తకాలు

Rasheeduddin Khan	:	Perspectives on Non - Alignment
Pran Chopra	:	Non - Alignment in the seventiee .hanging
	:	contents and new challenges
Misra, K.P.,	:	Non - Alignment is contempora y
	:	international relations
Rehman, M.M.,	:	The politics of Non - Alignment

11.13 నమూనా పరీక్షాప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు వ్యాసరూపంలో సమాధానాలు రాయండి.

1. అలీన విధానం అంటే ఏమిటి? దాని లక్షణాలను వివరింపుము.

2. అలీన విధానం రూపొందుటకు గల కారణాలను విశ్లేషించండి.

3. అలీనోద్యమ శిఖరాగ్ర సభల గురించి రాయండి.

II. ఈ కింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి.

1. బాండుంగ్ సమావేశం.

2. ప్రచ్ఛన్నయుద్ధం : అలీన విధానం.

3. అలీనోద్యమ లక్ష్యాలు.

BRAOU

ఖండం - 4 సమస్యలు

భాగం - 13 ఆయుధాల పోటీ - నిరాయుధీకరణ

భాగం - 14 అణ్వాయుధాల ప్రభావం

భాగం - 15 ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ

భాగం - 16 విమోచనోద్యమాలు

భాగం - 17 అంతర్జాతీయ సంబంధాల్లో ప్రాంతీయ వాదం

ఖండం - 5 వ్యవస్థీకరణం

భాగం - 18 అంతర్జాతీయ వ్యవస్థ

భాగం - 19 దౌత్యనీతి, స్వరూపం

భాగం - 20 భారత విదేశాంగ విధానం ; దృక్పథాలు, సమస్యలు

ఖండం - 6 శాంతి సంబంధ అధ్యయనాలు

భాగం - 21 శాంతి సంబంధ అధ్యయనాలు

BRAOU

డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
సామాజిక శాస్త్రాల విభాగం

రాజనీతి శాస్త్రంలో స్నాతకోత్తర అధ్యయనం

రెండవ సంవత్సరం

సమూనా ప్రశ్నాపత్రం

పాఠ్యాంశం II అంతర్జాతీయ సంబంధాలు

కాలము : 3 గంటలు] [మొత్తం మార్కులు 100

భాగం - A

4 X 15 = 60

క్రింది ప్రశ్నలకు జవాబులు రాయుము.

1. " అంతర్జాతీయ సంబంధాలు " అంటే ఏమిటి ? దాని స్వరూప స్వభావాలను విమర్శనాత్మకంగా చర్చించండి?

లేదా

" అంతర్జాతీయ సంబంధాలు " అధ్యయనం ప్రాధాన్యతకు దోహదం చేసిన కారకాలను వివరించండి ?

2. అంతర్జాతీయ సంబంధాల అధ్యయనానికి దోహదపడే వివిధ దృక్పథాలకు తులనాత్మకంగా వివరించండి ?

లేదా

వాస్తవిక వాదానికి మార్గాంథో చేసిన కృషిని చర్చించండి ?

3. సార్వభౌమత్వ రాజ్యాల పరిణామాన్ని విశదీకరించుము ?

లేదా

అంతర్జాతీయ సంబంధాలలో శక్తిభావనను విశ్లేషింపుము ?

4. " రెండవ ప్రపంచ యుద్ధం తరువాత సామ్రాజ్యవాదం ఒక అర్థ రహితమైన భావం " వ్యాఖ్యానించండి ?

లేదా

అలీన విధానం రూపొందుటకు కారణాలను విశ్లేషించండి ?

BRAOU

భాగం - B

5 X 8 = 40

క్రింది ప్రశ్నలకు జవాబులు రాయుము

5. సమోద్య అనగానేమి ? విశ్లేషించండి ?

లేదా

ప్రచ్ఛన్న యుద్ధ లక్షణాలను వివరింపుము ?

6. జర్మనీ ఏకీకరణం ?

లేదా

అంతరిక్ష యుద్ధాలు ?

7. సమిష్టి భద్రత ?

లేదా

రెండవ ప్రచ్ఛన్న యుద్ధం ?

8. నిర్ణయ కల్పన సిద్ధాంతం ?

లేదా

వాస్తవిక వాదం ?

9. మార్క్సిస్టు దృక్పథంలో అంతర్జాతీయ సంబంధాలు ?

లేదా

అంతర్జాతీయ సంబంధాలలో ప్రజాస్వామ్యీకరణ ?

BRAOU